వి. కెల్లె, యం. కొవల్జోన్

చారిత్రక భౌతికవాదం

మార్క్సిస్టు సామాజిక సిద్ధాంతపు స్థూల చరిత్ర

వి. కెల్లె, యం. కొవల్జోన్

చారిత్రక భౌతికవాదం

మార్క్సిస్టు సామాజిక సిద్ధాంతపు స్థూల చరిత్ర

వి. కెల్లె, యం. కొవల్జోన్

చారిత్రక భౌతికవాదం

మార్క్సిస్టు సామాజిక సిద్ధాంతపు స్థూల చరిత్ర

"ప్రగతి" ప్రచురణాలయం

మాస్కో 1979

అనువాదం: రాచమల్లు రామచంద్రారెడ్డి

© తెలుగు అనువాదం "ప్రగతి" ప్రచురణాలయం 1979

సోవియట్ యూనియన్‌లో ముద్రింపబడింది

K $\frac{10503-057}{016(01)-79}$ 809—79 0302020200

విషయసూచిక

ప్రకరణం ఒకటి. సామాజిక ప్రజ్ఞానపు విశిష్ట లక్షణాలూ, ఇబ్బందులూ 5

ప్రకరణం రెండు. సామాజిక పరిశోధనకు తాత్విక పూర్వావసరాలు 28

ప్రకరణం మూడు. సామాజిక వ్యవస్థలు 43

- సామాజిక వ్యవస్థగా సామాజికార్థిక నిర్మాణరూపం 43
- సామాజిక నిర్మాణరూపంయొక్క పాదార్థిక, ఆర్థిక ప్రాతిపదిక అయిన ఉత్పత్తి విధానం 49
- ప్రాతిపదికా, ఉపరినిర్మాణమూ 61
- సమాజపు యితర నిర్మాణ అంశాలు 70

ప్రకరణం నాలుగు. ప్రపంచ చరిత్రయొక్క వస్తుగత తర్కం 79

- సమాజమూ, ప్రకృతీ 80
- ఉత్పత్తి సంబంధాలు ఉత్పాదక శక్తుల స్వభావానికీ, వాటి అభివృద్ధి స్థాయికీ అనుగుణంగా వుంటాయన్న నియమం 90
- అనుగుణతా నియమం: సామాజిక పర్యవసానాలు 103

ప్రకరణం అయిదు. సమాజమూ, సంస్కృతీ 129

- సంస్కృతి అంటే యేమిటి? 129

సామాజిక అభివృద్ధి, సంస్కృతియొక్క వైవిధ్యమూ 138
సంస్కృతి, వ్యక్తి 144

ప్రకరణం ఆరు. చారిత్రక క్రమానికి కర్తలు (జనాలూ, వర్గాలూ, పార్టీలూ, అగ్రగణ్య వ్యక్తులూ) 151
సామాజిక విభేదకరణ సారాంశమూ, కారణాలూ. వర్గాలుగా సమాజ విభజన 154
వర్గ పరిశీలన పద్ధతి. సమాజపు వర్గ నిర్మాణం. 162
వర్గ పోరాటమూ, చరిత్రలో దాని పాత్ర. కార్మికవర్గపు వర్గ పోరాటం యొక్క విశిష్ట లక్షణాలు 169
సోషలిస్టు సమాజపు సామాజిక నిర్మాణమూ, దాని చలన నియమాలూ . 179

ప్రకరణం యేడు. సమాజపు రాజకీయ వ్యవస్థీకరణ: నిర్మాణమూ, చలన నియమాలూ 186
రాజకీయ రంగం. రాజ్యమూ, న్యాయశాస్త్రమూ. 186
సామాజిక విప్లవ సిద్ధాంతం. 198
సోషలిస్టు విప్లవ సిద్ధాంతం 203
కార్మికవర్గ నియంతృత్వం. సోషలిస్టు రాజ్య అభివృద్ధి 215

ప్రకరణం యెనిమిది. చారిత్రక క్రమంయొక్క ఆత్మిక పార్శ్వం 225
సామాజిక చైతన్యపు నిర్మాణాన్ని పరిశీలించడానికి సూత్రాలు . . . 227
ప్రజ్ఞానమూ, భావజాలమూ 234
సామాజిక మనస్తత్వమూ, భావజాలమూ 242
సామాజిక చైతన్యపు రూపాలు 245
సామాజిక చైతన్యమూ, వ్యక్తి చైతన్యమూ 274
సామాజిక చైతన్యంయొక్క సామాజిక క్రియలు 277

ప్రకరణం తొమ్మిది. సమాజమూ, వ్యక్తి 284
వ్యక్తిత్వ అభివృద్ధి 285
వ్యక్తిత్వపు చారిత్రక అభివృద్ధి 290
జనాలూ, వ్యక్తి. చరిత్రలో వాళ్ల పాత్ర 304

ప్రకరణం పది. సామాజిక ప్రగతి 312

ప్రకరణం ఒకటి

సామాజిక ప్రజ్ఞానపు విశిష్ట లక్షణాలూ, ఇబ్బందులూ

మనుషులు సమాజంలో జీవిస్తూ, వ్యవహరిస్తూ వుండడమే కాక, పరిసర ప్రకృతిని గురించి తెలుసుకున్నట్లే, సమాజాన్ని గురించి కూడా తెలుసుకుంటారు. సమాజాన్ని గురించిన ప్రజ్ఞానం అంటే, కేవలం మనుషులు తమ సమీప పరిసరాలను అర్థం చేసుకోవడం కాదు; అది మొత్తం సామాజిక జీవితాన్ని పరిశోధించడం. మానవ సమాజం సంకీర్ణమైన వ్యవస్థ — మానవులకూ, ప్రకృతికీ మధ్య గల చర్యా ప్రతి చర్యలనుండీ, మానవుల మధ్య గల పరస్పర చర్యా ప్రతిచర్యలనుండీ యేర్పడేటట్టిది. మానవులూ, వాళ్ల కార్యకలాపాలూ, వాళ్ల పరస్పర సంబంధాలూ అనే సామాజిక వాస్తవికత సామాజిక ప్రజ్ఞానాన్ని తెలియజేస్తుంది.

సమాజం స్థలంలో వ్యాపించివుంది; యెందుకంటే, చారిత్రక పూర్వ కాలంలో కూడా మానవులు భూమండలంమీద వ్యాపించి గణాలలాగా, తెగలలాగా, దాదాపు యేకాకి, స్థానిక బృందాలుగా యేర్పడివారు; తరువాత అవి జాతులుగా అభివృద్ధి చెంది, రాజ్యాల రూపం ధరించినాయి. సమాజం కాలంలో కూడా ఉండి, నిశ్చితమైన చరిత్రను కలిగివుంది. వ్యష్టి మానవ బృందాల చరిత్రనుండీ, వాటి మధ్య గల సంబంధంనుండీ రూపుదాలుస్తుంది మానవజాతి చరిత్ర, లేదా సమాజ చరిత్ర. సామాజిక ప్రజ్ఞానం అనేది సకల వైవిధ్యాలతో కూడిన మానవ చరిత్రను గురించిన ప్రజ్ఞానం.

మొత్తం సమాజంయొక్కా, దాని చరిత్రయొక్కా ప్రమాణంలో మానవుల కార్య కలాపాలయొక్కా, వాళ్ల పరస్పర సంబంధాలయొక్కా సారాంశాన్ని శాస్త్రవిజ్ఞానం మాత్రమే తెలుసుకోగలదు. సమస్త ప్రజ్ఞానంలాగే, సమాజాన్ని గురించిన శాస్త్రీయమైన ప్రజ్ఞానం కూడా యధార్థాలయొక్కా, ఘటనలయొక్కా వర్ణనతో ప్రారంభమౌతుంది. కానీ, యధార్థాలు శాస్త్రవిజ్ఞానంయొక్క విషయం మాత్రమే, అసలు శాస్త్రవిజ్ఞానం కాదు. యెక్కడైతే నియమాలు ఆవిష్కరింపబడి, యధార్థాల విశ్వసనీయమైన కారణాలను వివరిస్తూ సిద్ధాంతం ప్రత్యక్షమౌతుందో అక్కడ సాధారణీకరణలతో శాస్త్రవిజ్ఞానం ప్రారంభమౌతుంది. సామాజిక ప్రజ్ఞానానికి అన్వయించినప్పుడు దీని అర్థం యేమిటంటే, మానవుల కార్యకలాపాలనూ, వాళ్ల పరస్పర సంబంధాలనూ వివరించే ప్రయత్నంలో, — మానవులు తాము యెలా చరిత్రను సృష్టిస్తున్నారో అలాగే యెందుకు సృష్టించేదీ, మరొక విధంగా యెందుకు సృష్టించనిదీ సిద్ధాంతం చూపాలి. కానీ, అది అసలు సాధ్యమా? యెంతైనా, మరొక విధంగా నడచుకొనే స్వేచ్ఛ మానవులకు వుంది గదా? తాను ఆవిధంగా యెందుకు వ్యవహరించిందీ, మరొక విధంగా యెందుకు వ్యవహరించనిదీ మనిషి ఒకోసారి వివరించలేడు. మానవుల చర్యలను, ముఖ్యంగా కోట్లమంది చర్యలను, యెలా వివరించడం? చరిత్రలో మానవుల చర్యలకు శాస్త్రీయంగా కారణాలు చెప్పడం మహా జటిలమైన సిద్ధాంత కర్తవ్యమే. యీ పని చేయడం అసలు సాధ్యమా? నయా కాంటియన్లు* లాంటి కొందరు తాత్వికులు యిది సాధ్యం కాదంటారు. శాస్త్రవిజ్ఞానం ప్రకృతిలో మాత్రమే వున్న విషయాలకూ, క్రమాలకూ కారణాలను చెప్పే సామర్థ్యాన్ని నిరూపించుకుంది, కానీ చారిత్రక క్రమం, సమాజంలో మానవుల కార్యకలాపాలు శాస్త్రీయ వివరణకు అతీతం, అని వాళ్ల నమ్మకం. నయా కాంటియన్ అయిన రికెర్ట్ యిలా రాసినాడు: "...ప్రకృతి శాస్త్రమూ, చారిత్రక శాస్త్రమూ రూపొందించిన భావాలు యెల్లప్పుడూ పరస్పరం సూత్రరీత్యా తార్కిక వైరుధ్యం గలవిగా వుండ

---

* నయా కాంటియనిజం — ఒక బూర్జువా తాత్విక ధోరణి. ప్రముఖ జర్మన్ ఆలోచనాశీలి అయిన ఇమ్మాన్యుయెల్ కాంట్ (1724–1804) భావాలను పెట్టుబడిదారీ సమాజపు నూతన సామాజిక, భావజాలాత్మక అవసరాలకు అన్వయించి, అభివృద్ధి చేయడానికీ, సంస్కరించడానికీ చేసిన ప్రయత్నంగా యిది 19వ శతాబ్ది ఉత్తరార్ధంలో పుట్టింది. నయా కాంటియనిజంలో పలు ధోరణులు — చరిత్ర పరిశీలనా పద్ధతులమీద కేంద్రీకరించిన బాడెన్ ధోరణి (19వ శతాబ్ది అంతమూ, 20వ శతాబ్ది ప్రారంభమూ) లాంటివి — వున్నాయి.

వలసిందే."* యిదేదో యథాలాపపు మాట కాదు, నిశ్చితమైన వైఖరి. రికెర్ట్, విండెల్ బాండ్, యింకా కొందరు బాడెన్ ధోరణి ప్రతినిధులు ప్రకృతి శాస్త్రానికీ, సామాజిక శాస్త్రానికీ మధ్య భేదం వుందంటారు. సమాజంలో ఘటనలన్నీ ఒంటరిగా, అద్వితీయంగా వుంటాయనీ, ప్రకృతిలో అలా కాదనీ, అందువలన ప్రకృతి శాస్త్రాలు సాధారణీకరణ పద్ధతిని ఉపయోగించుకోడానికి వీలుండగా, చారిత్రక శాస్త్రాలు వ్యష్టి వర్ణన పద్ధతిని మాత్రమే ఉపయోగించుకోగలవనీ వాళ్ల వాదం. ప్రకృతి శాస్త్రాలు ప్రకృతిలో అంతర్నిహితమైన నియమాలనూ, కార్యకారణ సంబంధాలనూ ఆవిష్కరించి (అందువల్లనే వాటిని నియమ కారక శాస్త్రాలంటాం), ప్రకృతిలోని క్రమాలను వివరిస్తాయి, జోస్యం చెపుతాయి; కానీ, సామాజిక శాస్త్రాలు నిర్దిష్ట చరిత్రలోని వ్యష్టి, అద్వితీయ ఘటనల వర్ణనకు పరిమితం కావాలి. నయా కాంటియన్లు సామాజిక శాస్త్రాలను వర్ణనాత్మక శాస్త్రాలన్నారు; యీ అభిప్రాయానికి చారిత్రక శాస్త్రంమీద యీనాటికీ ప్రభావం వుంది. అనేకమంది సామాజిక ప్రజ్ఞానంయొక్క శక్తిసామర్థ్యాలను గురించి యింకా సందేహం వెలిబుచ్చుతున్నారు. వీళ్లకు భిన్నంగా, మరికొందరు సామాజిక శాస్త్రంయొక్క ప్రజ్ఞాన సామర్థ్యాల పట్లా, తీక్ష్ణ పరిశీలన శక్తిపట్లా విశ్వాసం లేనందుకు ఆశ్చర్యాన్నీ, నిరసననూ కూడా వెల్లడించినారు. కానీ, రాగద్వేషాలు మొత్తంమీద అప్రస్తుతమైనవి; కావలసింది యేమిటంటే, విషయంయొక్క సారాంశాన్ని పరీక్షించడం. నయా కాంటియన్లు సమాజానికీ, ప్రకృతికీ మధ్యా, సామాజిక ప్రజ్ఞానానికీ, ప్రకృతి శాస్త్రాలకూ మధ్యా చూపే భేదాన్ని మనం ఒప్పుకోవలసిందేనా? సమాజం ప్రకృతికంటె భిన్నమైనదే గనుక, వాళ్ల అభిప్రాయానికి కూడా కొంత విలువ వున్నట్లు కనపడుతుంది. ముఖ్యంగా, ప్రకృతి ఘటనలనూ, సామాజిక ఘటనలనూ ఒకటిగా చూసే సహజవాదంపట్ల కలిగే ప్రతిస్పందనను యిది ప్రతిబింబిస్తుంది గనుక. కానీ, మనసులో పెట్టుకోవలసింది యేమిటంటే, శాస్త్రవిజ్ఞానంలో ప్రత్యక్ష యింద్రియ దర్శనానికి గల విలువ — ప్రస్తుత విషయంలో సమాజానికీ, ప్రకృతికీ మధ్య కండ్లకు కనపడే భేదంయొక్క విలువ — యే మాత్రమూ తగినంతది కాదు. యెంతైనా, భూమి గుండ్రంగా వుందని యిప్పుడు సిద్ధసత్యంగా వున్న అభిప్రాయం ఒకప్పుడు ఆక్షేపణలను యెదుర్కొన్నది; యెందుకంటే, అది ప్రత్యక్ష దర్శనానికి వ్యతిరేకంగా వుండింది గనుక.

---

* Heinrich Rickert, *Die Grenzen der naturwissenschaftlichen Begriffsbildung. Eine logische Einleitung in die historischen Wissenschaften* ("భావాల ప్రకృతి శాస్త్రగత జననానికి గల పరిమితులు. చారిత్రక శాస్త్రానికి తర్కబద్ధమైన ప్రవేశిక"), Tübingen, 1921, పుట 145.

అందువలన, సమాజానికీ, ప్రకృతికీ మధ్య తేటతెల్లంగా వున్న భేదం కూడా నయా కాంటి యన్ అభిప్రాయానికి అనుకూలమైన, నమ్మకం కలిగించే వాదంగా అంగీకరింపబడజాలదు. అందుకనే మనం సామాజిక ప్రజ్ఞానంయొక్క విశిష్ట లక్షణాలనూ, అది యెదుర్కొన్న ఇబ్బందులనూ కనుక్కోవడంతో ప్రారంభించాలి. యీ ఇబ్బందులను సామాజిక శాస్త్రం ఎలా అధిగమిస్తుందో తరువాత చూస్తాం.

ప్రకృతికి భిన్నంగా సామాజిక జీవితపు విశిష్ట లక్షణాలనూ, తత్ఫలితంగా సామాజిక ప్రజ్ఞానంలో యేర్పడే ఇబ్బందులనూ యీకింది విధంగా సాధారణీకరించవచ్చు:

ఒకటి, ప్రకృతిలో జరిగే ప్రతిదానికీ సహజ కారణాలు వున్నాయి. ప్రకృతిలో ఒకదాని మీద ఒకటి పని చేసేవి గుడ్డి, సద్యోజనిత శక్తులు. చెట్టుమీద పిడుగు పడుతుంది, మంట లను గాలి యెగదోస్తుంది, దవానలం చెట్లను బూడిద చేస్తుంది, బూడిద నేలను సారవంతం చేస్తుంది — యిలా కారణాల, ఫలితాల అనంతమైన అనుక్రమం వుంటుంది; యివి యెందుకు జరిగేదీ చెప్పవచ్చు, వీటిని శాస్త్రీయంగా విశ్లేషించవచ్చు, వివరించవచ్చు. వీటిలో యేదీ ముందుగా నిర్ణయించబడిన లక్ష్యం ప్రకారం గానీ, చైతన్యపూరితమైన ఉద్దేశం ప్రకారం గానీ జరగదు.

మానవ సమాజం భిన్నమైనది. దానిలో జరిగే ప్రతిదీ మానవుల కార్యకలాపాలయొక్క, వాళ్ల చర్యా ప్రతిచర్యలయొక్క ఫలితంగా జరుగుతుంది. కానీ, మానవులు చైతన్యంగల ప్రాణులు; ప్రతి మానవుడూ చేసేపని మొదట యేదో ఒక రూపంలో అతని మనసుగుండా నడుస్తుంది. మానవులు ఆవేశంచేత, లేదా పర్యాలోచనచేత, లేదా మహా నికృష్టమైతే, చాపల్యంచేత ప్రభావితులై పనిచేస్తారు. ఇలా వుండగా సహజంగా కలిగే అభిప్రాయం యేమి టంటే, ప్రకృతి లాగ సమాజాన్ని శాస్త్రీయంగా విశ్లేషించడం అసాధ్యమని. నిజమే, మను షులను ఆచరణకు పురికొల్పి, తద్వారా నిశ్చితమైన సామాజిక పర్యవసానాలను కలిగించే సకల అభిప్రాయాలనూ, సిద్ధాంతాలనూ, కోర్కెలనూ, ఆశయాలనూ, ఉద్రేకాలనూ, చాప ల్యాలనూ లెక్కలోకి తీసుకోవడం అసాధ్యమే. ప్రసిద్ధ ఫ్రెంచి తత్త్వవేత్త గోల్బాహ్ యిలా రాసినాడు: “రాజకీయ సమాజాలను అప్పుడప్పుడు ప్రచండమైన కల్లోలాలు ఊటాడిస్తాయి, తరుచుగా సామ్రాజ్యాలను కూలదోస్తాయి. విధ్వంసకులుగా గానీ, బాధితులుగా గానీ విప్లవంలో పాల్గొనే వాళ్ళు యీ నైతిక సుడిగుండంలో తాము ఆక్రమించే స్థానాన్నిబట్టి కలిగించక తప్పని ఫలితాలకు దుర్వారమైన కారణాలుగా పనిచేయని చర్య గానీ, మాట గానీ, ఆలోచన గానీ, చాపల్యం గానీ, ఉద్రేకం గానీ, యీ కర్తలకు చెందినది ఒక్కగా నొక్కటి కూడా లేదు. యీ విప్లవానికి తోడ్పడేవాళ్ల మనస్సులలోనూ, శరీరాలలోనూ జరిగే సమస్త చర్యలనూ,

ప్రతిచర్యలనూ అర్థంచేసుకొనే సామర్థ్యం గల మెదడుకు యిది తేటతెల్లంగా వుంటుంది"* గోల్బాహ్ చెప్పేది నిస్సందేహంగా తప్పే. పాదార్థిక కణాల చర్యా ప్రతిచర్యల విషయంలో కూడా, సకల ఫలితాలనూ పరమ కచ్చితంగా జోస్యం చెప్పడానికి భౌతిక శాస్త్రజ్ఞులు నిరాకరిస్తారు; యెందుకంటే, వాటి చర్యా ప్రతిచర్యలలో అవశ్యకతతోపాటు యాదృచ్ఛికత కూడా వుంది. సమాజంతో వ్యవహరించేటప్పుడు యీ కర్తవ్యం ఆచరణ రీత్యానూ, సిద్ధాంత రీత్యానూ అసాధ్యం; యెందుకంటే, ప్రకృతిలో లాగ సమాజంలో కూడా యాదృచ్ఛికత పనిచేయడం మాత్రమే కాక, యే సామాజిక క్రమంలోనైనా విస్తారమైన వైవిధ్యం గల లంకెలూ, సంబంధాలూ, చర్యా ప్రతిచర్యలూ, అంశాలూ వుండడమూ, పనిచేయడమూ, పెనవేసు కోవడమూ మాత్రమే కాక, చైతన్యమూ, సంకల్పమూ, ఆవేశాలూ, వగైరాల ఫలితం కూడా వుంటుంది గనుక. యిదంతా సామాజిక ప్రజ్ఞానంమీద ప్రత్యేక బరువులను మోపుతుంది. సామాజిక విషయాల ప్రజ్ఞానంలో గుర్తు పెట్టుకోవలసింది యేమిటంటే, వాస్తవంలోనూ, మనసులోనూ కర్త ముందుగానే వుంటుంది.** అదే సామాజిక ప్రజ్ఞానంయొక్క విశిష్ట లక్షణమూ, కష్టమూ; కర్మకూ (వస్తుగతమైనదానికీ), కర్తకూ (ఆత్మగతమైనదానికీ) మధ్య గల సంబంధానికి చెందిన సమస్యను పరిష్కరించడంద్వారా మాత్రమే యీ కష్టాన్ని అధిగమించవచ్చు.

రెండు, ప్రకృతిలో ప్రతిచోటా పునరావృత్తి వుంది. ప్రతిరోజూ సూర్యుడు తూర్పున ఉదయిస్తాడు, ప్రతి వసంతంలో చెట్లు పుష్పిస్తాయి; భౌతిక వస్తువులు వేడికి వ్యాకోచిస్తాయి; ప్రతిప్రాణీ పుట్టి, జీవించి మరణిస్తుంది. ప్రకృతిలో కూడా పునరావృత్తిలో పరమమైన సామ్యం లేనప్పటికీ, కాస్త భిన్నంగా వుండే క్రమాలలోనూ, విషయాలలోనూ పునరావర్తించే అంశాలను గమనించడం సాపేక్షంగా సులభం. ప్రకృతి విషయాలలో పునరావర్తించే అంశాలను ప్రకృతిలో గానీ, పరిశోధనశాలలో గానీ పరిశీలించడంద్వారా ప్రకృతిని పాలించే నియమాలను యిన్నాళ్లకో, అన్నాళ్లకో ఆవిష్కరించవచ్చు. యెంతైనా, నియమం అనేది విషయాలలో సాధారణమైనదీ, అవశ్యమైనదీ, సారభూతమైనదీ, స్థిరమైనదీ, పునరావర్తించేదీ తప్ప మరేమీ కాదు గదా.

---

* Paul d'Holbach, *Système de la nature on de lois du monde physique et du monde moral* ("ప్రకృతి వ్యవస్థ లేక భౌతిక, నైతిక ప్రపంచంయొక్క నియమాలు"), London, 1774, పుట 56.

** చూ: Karl Marx, *A Contribution to the Critique of Political Economy* ("అర్థశాస్త్ర విమర్శకు చేర్పు"), Moscow, 1970, పుట 212.

మానవ సమాజంలో విషయాలు మరొక విధంగా వుంటాయి. అక్కడ నిర్దిష్ట క్రమాలూ, చారిత్రక ఘటనలూ నిజంగా ప్రగాఢంగా విశిష్టమైనవి, యెక్కడా యెప్పుడూ పునరావృత్తి చెందవు. యే చారిత్రక ఘటన అయినా, గ్రీకులు పర్షియన్ల మధ్య జరిగిన యుద్ధాలైనా, అలెక్సాండ్ర్ ది గ్రేట్ దండయాత్రలైనా, ఫ్రాన్సులోని బూర్జువా మహావిప్లవమైనా, రష్యాలోని అక్టోబర్ సోషలిస్టు మహావిప్లవమైనా, రెండవ ప్రపంచ యుద్ధమైనా, సామ్రాజ్యవాదపు వలస వ్యవస్థ విచ్ఛిత్తి అయినా – యివన్నీ నిజంగా అద్వితీయమైనవి, తమ నిర్దిష్ట రూపంలో యెప్పుడూ పునరావర్తించనివి. దీన్నిబట్టి, సమాజానికి నియమాలు లేవనీ, పునరావృత్తి అనే సాధారణ శాస్త్రీయమైన గీటురాయి సమాజానికి వర్తించదనీ, సామాజిక శాస్త్రం అనేది వుండజాలదనీ అనిపించవచ్చు. కానీ, యీ అద్వితీయతను పరమమైనదిగా చూడకూడదు. యేంతైనా, సామాజిక జీవితంలో కూడా పునరావర్తిస్తూనే వుండేది చాలా వుంది. మనుషులు పుట్టుతారు, వివిధ విషయాలు నేర్చుకుంటారు, పనిచేస్తారు, కుటుంబాలు యేర్పరచుకుంటారు, మిత్రులను కలుసుకుంటారు, వివిధ లక్ష్యాలు పెట్టుకుంటారు, వగైరా, వగైరా. అనగా వేరువేరు జిల్లాలలో, ప్రాంతాలలో, దేశాలలో, జాతులలో, రాజ్యాలలో జీవన పరిస్థితులలోనూ, నిత్య కృత్యాలలోనూ, నిర్దిష్ట చరిత్రయొక్క విశిష్ట లక్షణాలలోనూ యెంత అపారమైన వైవిధ్యం వున్నప్పటికీ, సమాజ జీవితాన్ని మరింత సన్నిహితంగా చూస్తే, సాధారణమైనదీ, పునరావర్తించేదీ మొదటి చూపుకు కనిపించేదానికంటె యెంతో యెక్కువ వున్నట్లూ, అందువలన సామాజిక శాస్త్రానికి గల అవకాశాలు అంత అధ్వాన్నంగా, అంత దిక్కుమాలినవిగా లేవనీ వెల్లడౌతుంది. యిక్కడ అసలు విషయం యేమిటంటే, చరిత్రకు సంబంధించి సాధారణ విషయానికీ, వ్యష్టి విషయానికీ గల సంబంధం.

మూడు, నక్షత్ర వ్యవస్థల పరిణామమూ, సూక్ష్మ ప్రపంచంలో చలనమూ, భూగర్భంలోని ప్రక్రియలూ, వృక్ష, జంతు జాతుల పరిణామమూ, అనగా, ప్రకృతిలోని చలనానికీ, అభివృద్ధికీ చెందిన రూపాలన్నీ సాపేక్షంగా స్థిరమైన స్థితులు కలిగివున్నాయి; యీ స్థితులు వింగడింపుకూ, పోలికకూ, కొలతకూ అవకాశ మిస్తాయి.

సమాజం యిందుకు భిన్నం. దాని విశ్లేషణ మనం యెలా ప్రారంభించడం? మానవ సమాజ చరిత్ర నిరంతర ప్రవాహ స్థితిలో వుందని కొందరంటారు. లక్షలు, కోట్లమంది స్త్రీ పురుషులు పుట్టుతారు, ఆచరిస్తారు, కుటుంబాలు యేర్పరచుకుంటారు, పిల్లలను సాకుతారు, నగరాలు నిర్మిస్తారు, కొత్త భూములు అభివృద్ధి చేస్తారు, అధ్యయనం చేస్తారు, క్రీడలలో దిగుతారు, మిత్రులను చేసుకుంటారు, కొట్లాడుతారు, లేదా పోరాడుతారు – యివి మహా భిన్నమైన అంశాలు, మొత్తం మానవ చరిత్రను యేర్పరచేటట్టివి. మానవ మహాసముద్రం జనన మరణాలచేత నిత్యం కొత్తదౌతూ వుంది, యిక్కడ నిత్యం ప్రతిదీ

మారుతున్నది, ప్రవాహాన్ని ఆపి, విషయాలను పరిశీలించే అవకాశం లేనట్లు కనపడుతుంది. దీనికి భిన్నంగా, చరిత్రలో నిరంతర పరిణామ మనేది బొత్తిగా లేదని కొంద రంటారు. ప్రతి వ్యక్తీ ఒక నిర్దిష్టమైన సంస్కృతితో ముడిపడివుంటాడు; అది అతని మనఃప్రవృత్తినీ, కార్యకలాపాలనూ రూపుదిద్దుతుంది, అది శతాబ్దాల తరబడి, సహస్రాబ్దాల తరబడి కూడా సాపేక్షంగా మార్పు లేకుండా వుంటుంది. మరి, ప్రతి సంస్కృతీ యెంత విలక్షణంగా వుందంటే, అన్నిటికీ సామాన్యమైన పరిణామ రేఖను గీసే వుద్దేశంతో వాటిని ఒకదానితో ఒకటి పోల్చడం అర్థం లేని పని. ''సాంస్కృతిక మానుషశాస్త్రం'' అనే ధోరణికి చెందిన కొందరు మానవజాతి శాస్త్రజ్ఞులకు యిలాంటి అభిప్రాయాలున్నాయి; వీళ్లు ఆదిమ ప్రజానీకాల దినదిన జీవితాన్నీ, సంస్కృతినీ అధ్యయనం చేస్తారు; యివి నిజంగా చాలా స్థిరంగా వుండి, మార్పుకు చాలా స్వల్పంగా లోనౌతాయి.

యిదంతా తెలియజేసే దేమంటే, మానవ సమాజంలో నిరంతర ప్రవాహమూ, స్థిర స్థితీ రెండూ కనపడుతున్నాయనీ, చారిత్రక క్రమంయొక్క ఈ రెండు పార్శ్వాలూ వివిధ దృక్పథాలలో యేకపక్షంగా ప్రతిబింబించబడినాయనీ. దీనివలన శాస్త్రవిజ్ఞానాని కొక సమస్య యెదురౌతుంది; యేమిటంటే, చరిత్రను వికృతపరచకుండా దానిని విశ్లేషించడానికి వీలు కలిగించే సామాజిక నిర్మాణ రూపాలను వెలికి తీయడమూ, చారిత్రక ఘటనల ప్రవాహంలో స్థిరమైనవీ పునరావర్తించేవీ అయిన అంశాలను కనుక్కోవడమూ.

చివరిది, ప్రకృతిని గురించిన నిర్దిష్ట శాస్త్రీయ జ్ఞానంయొక్క సారం మామూలుగా సామాజిక వర్గాల భిన్న ప్రయోజనాలను ప్రతిబింబించదు. అందువల్లనే ప్రకృతి శాస్త్రాలకూ, గణితశాస్త్రానికీ వర్గ స్వభావం లేదు. మత న్యాయస్థానం గలీలియోను న్యాయ విచారణ చేయడమూ, జోర్దనో బ్రూనోను సజీవ దహనం కూడా చేయడమూ లాంటి విపరీతపు ఘటనలు చరిత్రలో అప్పుడప్పుడు తటస్థించే మాట నిజమే. కానీ, అసలు విషయం యేమిటంటే, వాళ్ల ఆవిష్కరణల ఆచరణాత్మక ప్రాముఖ్యం ఆ కాలపు మనుషులకు యే మాత్రమూ తెలియకుండా వుండి, అవి తేటతెల్లంగా ఆనాటి మత విశ్వాసాలకు భిన్నంగా వుండినాయి. ప్రకృతి శాస్త్రాలు సమకూర్చే విషయాల తాత్విక వ్యాఖ్యానంమీదా, తాత్విక దృక్పథంతో శాస్త్రీయ ఆవిష్కరణలనుండి లాగే నిర్ధారణలమీదా వర్గప్రయోజనాల ప్రభావం వుంటుందని యీ చారిత్రక ఉదాహరణలు తెలుపుతాయి.

యీనాడు మతం యెంతో వెనుక ముందులు చూసుకుంటున్నది. శాస్త్రవిజ్ఞానం భగవంతునికి చెందినదాన్ని భగవంతునికి చెల్లించాలి, అనగా అది మత అభిప్రాయాలను విమర్శించకూడదు అనడంకంటె యెక్కువగా మతగురువులు యేమీ అనడం లేదు.

భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, గణితశాస్త్రం, సైబెర్నెటిక్స్, జీవశాస్త్రం, వైద్య

శాస్త్రం, వీటిలో జరిగిన గొప్ప పురోగతి మూలంగా యే ఆధునిక సమాజానికైనా ప్రకృతి శాస్త్రాలు అభిమాన శాస్త్రాలుగా మారినాయి – అవి ప్రతిచోటా ఒకే ఫలితంతో గానీ, ఒకే సామాజిక ప్రయోజనాల కొరకు గానీ ఉపయోగించబడక పోయినప్పటికీ.

సమాజ ప్రజ్ఞానం సంగతి భిన్నమైనది. అంతర్వైరుధ్యపూరితమైన సమాజంలోని మనుషులు వ్యవస్థను గురించీ, దాని మార్పును గురించీ, సంరక్షణను గురించీ భిన్న అభిప్రాయాలను, పరస్పర విరుద్ధ అభిప్రాయాలను కూడా ఆదరించడానికి అభిముఖంగా వుంటారు; యెందుకంటే, ఆస్తిపరులూ, నిరాస్తిపరులూ, దోపిడీదారులూ, దోపిడీ చేయబడేవాళ్ళూ, పీడకులూ, పీడితులూ, యజమానులూ, సేవకులూ వుంటారు గనుక. కొంతమందికి యీ వ్యవస్థ అనుకూలంగా వుంటుంది, దీన్ని నిలుపుకోవడంలోనూ, దృఢపరచుకోవడంలోనూ వాళ్లకు ప్రాణప్రదమైన ప్రయోజనం వుంటుంది; మరికొందరు దీనిని ద్వేషిస్తారు, దీనిని తొలగించుకో గోరుతారు. మొదటివాళ్లకు యిది వరప్రసాదం, రెండవవాళ్లకు కీడు. సామాజిక విషయాల గురించి మనుషులకు గల అంచనామీదా, వాటి పరిశీలననుండి వాళ్లు లాగే నిర్ధారణలమీదా వాళ్ల ప్రయోజనాలకు బలమైన ప్రభావం వుంటుంది. మరి, సామాజిక విషయాలమీద నిష్పాక్షికత అనేది లేకపోతే, వాటి పరిశీలనలో వస్తుగత దృష్టి కూడా వుండజాలదని అనిపిస్తుంది. అప్పుడీ ప్రశ్న ఉత్పన్నమౌతుంది: సామాజిక శాస్త్రానికి వస్తుగత సత్యంగా, విజ్ఞానశాస్త్రంగా, వుండే యోగ్యత వుండగలదా, లేక మంచిదో చెడ్డదో అయిన యేదో ఒక ఆదర్శం దృష్ట్యా గానీ, న్యాయం దృష్ట్యా గానీ, సామరస్యం దృష్ట్యా గానీ చారిత్రక వాస్తవాలను వర్గీకరించడానికీ, అంచనా వేయడానికీ మాత్రమే అది మనకు వీలు కలిగిస్తుందా? యిప్పటివరకు మనకు కనపడే దేమిటంటే, అన్ని దేశాలలోనూ, భిన్న సామాజిక వ్యవస్థలు గల దేశాలలో కూడా, భౌతికశాస్త్రం, గణితశాస్త్రం లాంటి ప్రకృతి శాస్త్రాలు (భిన్న పద్ధతులలోనూ, భిన్న ప్రయోజనాల కొరకూ అయినప్పటికీ కూడా) సాధారణంగా గుర్తింపబడి, ప్రయోగించబడుతుండగా, తత్వశాస్త్రం, సామాజిక శాస్త్రం, చరిత్ర, అర్థశాస్త్రం లాంటి మానుష విద్యలు (humanities) అలా కాదు. దీని మూలంగా సామాజిక శాస్త్రాలలో <u>వర్గతత్వానికీ, వస్తుగత దృష్టికీ మధ్య, పార్టీతత్వానికీ, సత్యానికీ మధ్య గల సంబంధం</u> యేమిటనే సమస్య ఉత్పన్నమౌతుంది. యీ సమస్యను కింద వివరంగా పరిశీలిస్తాం.

కనుక, ప్రజ్ఞాన వస్తువుగా సమాజం ప్రకృతితో చాలా గణనీయంగా విభేదిస్తుందనీ, సమాజం విషయంలో సిద్ధాంత అవగాహనకు బలమైన ఇబ్బందులు యెదురౌతాయనీ తేటతెల్లంగా వుంది.

యీ ఇబ్బందులను మానవులు యెల్లప్పుడూ గుర్తించక పోయినప్పటికీ, యివి గుర్తింపులోకి రావడమే శాస్త్రం సాధించిన విజయం అయినప్పటికీ, ప్రధానంగా అందువల్లనే సామా

జిక శాస్త్రాలు ఆవిర్భవించడానికీ, అభివృద్ధి కావడానికీ యింత కాలమూ, యింత జటిల మైన కృషీ అవసరమైనాయి.

వేల సంవత్సరాల లిఖిత చరిత్రలో సామాజిక ప్రజ్ఞానం అభివృద్ధి చెంది, యే మార్గాలలో సామాజిక జ్ఞానం ప్రోగుపడిందో, యేవి సామాజిక జ్ఞానపు మౌలిక ప్రదేశాలు విశిష్టమైనవిగా యేర్పడడానికి ప్రాతిపదికను సమకూర్చినాయో ఆ మార్గాలలో క్రమక్రమంగా శాఖలుగా చీలిపోయింది.

మానవుల స్మృతిలో భద్రపరచుకోదగిన వాస్తవాల సంచయనమూ, యెన్నికా, వర్ణనా శాస్త్రంలో మొదటి మెట్టుగా వుండినాయి. యిది చారిత్రక శాస్త్రాన్ని ఉత్పన్నం చేసింది. యీ శాస్త్రం క్రమక్రమంగా శాఖలుగా చీలి, యిప్పుడు చారిత్రక జ్ఞానంలో మొత్తం ఒక శాఖగా వుంది.

ప్రభుత్వమూ, న్యాయ నిర్వహణా, దౌత్య, సైనిక కార్యకలాపాలూ, విద్యా, కళలూ, రచన అభివృద్ధీ, ఆర్థిక వ్యవస్థయొక్క పెరుగుతున్న క్లిష్టతా, వీటి కొరకు రాజకీయ, న్యాయ, అధ్యాపన, కళా, భాషా, ఆర్థిక, తదితర జ్ఞానంయొక్క అవసరం ఉత్పన్నమైంది. మొత్తంగా సమాజాన్ని కాక, దానిలోని భిన్న అంశాలనూ, దానిలోని నిర్దిష్ట విషయాలనూ, సామాజిక జీవితంలోని క్రమాలనూ మాత్రమే అధ్యయనం చేసే శాస్త్రాల బృందాన్ని యిది ఉత్పన్నం చేసింది. సమాజంలోని యేవో కొన్ని నిర్దిష్ట "భాగా"లను, లేదా పార్శ్వాలను అధ్యయనం చేసే యీ శాస్త్రాలను మామూలుగా ప్రత్యేక లేక నిర్దిష్ట సామాజిక శాస్త్ర అంటారు.

చివరి విషయంగా, చారిత్రక జ్ఞానాభివృద్ధీ, సామాజిక జీవితపు వ్యష్టి అంశాల అధ్యయనమూ జరగడంతో పాటు సమాజం గురించీ, దాని చరిత్ర గురించీ యేకఖండపు దృక్పథాన్ని వ్యక్తంచేసే భావాలు కూడా క్రమక్రమంగా యేర్పడినాయి. యే నిర్దిష్ట సామాజిక శాస్త్రమూ మొత్తం సమాజాన్ని ఆవరించదు గనుక, సామాజిక ప్రజ్ఞానంలో యిదొక అవసరమైన అంశం. మానవ చరిత్రను గురించిన యిలాంటి భావం నిర్దిష్ట శాస్త్రాల కన్నిటికీ అవసరం; యెందుకంటే, అది వాటికి ప్రారంభ స్థానాన్నీ, సాధారణ సిద్ధాంత ప్రాతిపదికనూ యిస్తుంది. కనుక, గతంలో చాలామంది ప్రముఖ చరిత్రకారులూ, తాత్వికులూ, సామాజిక శాస్త్రజ్ఞులూ సామాజిక జీవితాన్ని మొత్తంగా అర్థం చేసుకోడానికీ, చారిత్రక జ్ఞానపు స్వభావం గురించీ, చరిత్రయొక్క అర్థం గురించీ, జీవితంలో మానవుని ప్రయోజనం గురించీ, సమాజంయొక్క భవితవ్యం గురించి గల ప్రశ్నలకు జవాబులు తెలుసుకోడానికీ పాటుపడడానికి తగిన కారణం వుంది. యీ వైఖరే తాత్వికమైనది; యెందుకంటే, యిది ప్రపంచం గురించీ, దానిలో మానవుని స్థానం గురించి వుండే సంపూర్ణ దృక్పథంలో భాగం గనుక.

తత్వశాస్త్రం అత్యంత సాధారణమైన ధాతువుల రీత్యానూ, అత్యంత సాధారణ నియమాల రీత్యానూ ప్రపంచాన్నీ, దానిపట్ల మానవుని వైఖరినీ అవగాహన చేసుకుంటుంది గనుక, అది సకల యితర నిర్దిష్ట ప్రకృతి శాస్త్రాలకంటె, సామాజిక శాస్త్రాలకంటె భిన్నమైన విశిష్ట శాస్త్రం. మనుషులం కూడా ఒక భాగంగా వున్న యీ ప్రపంచం యేమిటి? అపారమైన వైవిధ్యం గల యీ వస్తువులూ, విషయాలూ యెలా పుట్టినాయి? ప్రపంచం యేదో ఒక దైవిక శక్తిచేత సృష్టింపబడిందా? లేక, అది యెల్లప్పుడూ వుండి, యెవరిచేతా సృష్టింపబడని తన సొంత నియమాల ప్రకారం అభివృద్ధి చెందుతున్నదా? యివన్నీ ఒకే మౌలిక ప్రశ్న యొక్క రూపాలు; యీ ప్రశ్నకు జవాబు లేకుండా ప్రపంచం గురించి సమంజసమైన దృక్పథాన్ని రూపొందించడం అసాధ్యం. తత్వశాస్త్రపు మౌలిక ప్రశ్న యేమిటంటే: మొదట వచ్చేది యేది, పదార్థమా, ఆత్మా? తాత్విక సిద్ధాంతాలకూ, ధోరణులకూ చెందిన గొప్ప వైవిధ్యాన్ని రెండు ప్రధాన ధోరణులుగా, లేక పక్షాలుగా విభజించవచ్చు: పదార్థానికి ప్రాధమ్యం యిచ్చే భౌతికవాద ధోరణీ, ఆత్మకు, లేక భావానికి, ప్రాధమ్యం యిచ్చే భావవాద ధోరణీ. తదనుగుణంగా, ప్రతి ధోరణీ ప్రపంచ ప్రజ్ఞానం గురించి తన సిద్ధాంతాన్ని రూపొందించింది. వేటిద్వారా ప్రజ్ఞానం యేర్పడుతుందో ఆ మానవ స్పందనలూ, భావాలూ పదార్థంయొక్క ప్రతిబింబాలని భౌతికవాదులు అనగా, ప్రజ్ఞానం ప్రపంచంయొక్క భావాత్మక (దైవిక) సారపు వ్యక్తీకరణ అని, లేదా మానవుడు స్వయంగా నిర్మించుకొన్న జ్ఞానం అని భావవాదులు అంటారు. భౌతికవాద దృక్పథం ప్రపంచాన్ని ఉన్నదున్నట్లు చూసే ధోరణి వైపు శాస్త్రజ్ఞులను మళ్లించి, నిర్దిష్ట శాస్త్రాలమీద ఆధారపడిన ప్రపంచ దృక్పథాన్ని రూపొందించడానికి ప్రయత్నిస్తుంది. భావవాద దృక్పథం ప్రపంచాన్ని గురించి మౌలికంగా వికృత దృష్టిని కలిగించి, విజ్ఞానశాస్త్రాలమీద తన సొంత పథకాలను రుద్దుతుంది; యిది వాటి అభివృద్ధిని అరికట్టి, నిజమైన ప్రజ్ఞాన పురోగతిని మందగింపజేస్తుంది. అంటే, భావవాద తాత్వికులు ప్రజ్ఞాన పురోగతికి యేమీ తోడ్పడలేదని కాదు. అది నిజంగా అదిమమైన, అపభ్రంశపు అభిప్రాయం అవుతుంది. యీ సమస్యకు చారిత్రక వైఖరి అవసరం. తాత్విక జ్ఞానం భౌతికవాద ప్రాతిపదికమీదా, ప్రపంచం గురించి భావవాద దృక్పథపు చట్రం లోపలా, భావాల ఘర్షణలో, రెండు పద్ధతుల మధ్య జరిగే పోటీలో అభివృద్ధి చెందినట్లు తెలుస్తున్నది. గుర్తుపెట్టుకోవలసిన మరొక విషయం యేమిటంటే, సారభూతమైన ఒక విషయంలో భౌతికవాదమే గతంలో చాలా బలహీనంగా వుండింది: అది జడవాదాత్మకంగా (metaphysical) వుండింది. అది అభివృద్ధిలో, మార్పులో ప్రపంచాన్ని అర్థంచేసుకోడానికీ, దాన్ని గురించిన ప్రజ్ఞానాన్ని పొందడానికి అసమర్థమైన భౌతికవాదంగా వుండింది. అది భౌతిక ప్రకృతిని గురించీ, మానవ భావాలలోని భౌతిక సారాన్ని గురించీ సరైన అభిప్రాయాన్ని యిచ్చింది

గానీ, వీటిని నిశ్చితమైనవిగానూ, చలనమూ, మార్పూ లేనివిగానూ పరిగణించింది. జడవాదాత్మక భౌతికవాదులు మానవుని చైతన్యాన్ని పదార్థంయొక్క జడ ప్రతిబింబంగా పరిగణించినారు, దాని క్రియాత్మక పాత్రను చూడలేకపోయినారు. యీ మధ్యలో, పరిసర ప్రపంచంలోని వైవిధ్యాన్ని ఆత్మయొక్క, చైతన్యంయొక్క, సృజనాత్మక పాత్రవల్ల కలిగినదిగా గ్రహించిన భావవాదులు వాస్తవంలో చైతన్యంయొక్క క్రియాత్మక పార్శ్వాన్ని విస్తృతపరచడంలో నిమగ్నులైనారు. ఆలోచనా సిద్ధాంతాన్ని, భావాలకు సార్వత్రికంగా పట్టు విడుపులూ, చలనమూ వున్నాయనే సిద్ధాంతాన్ని, అనగా భావాల పరస్పరవాదాన్ని (dialectics), పూర్తిగా రూపొందించినవాడు హేగెల్. అతను పరస్పరవాదాన్ని ఆత్మయొక్క అభివృద్ధిని పాలించే నియమాల సిద్ధాంతంగా ఉద్దేశపూర్వకంగా విస్తృతపరచినాడు; అలా చేయడంలో అతను ప్రత్యక్ష భౌతిక ప్రపంచపు పరస్పరవాదాత్మకతను ఉజ్వలంగా అవగతం చేసుకొన్నాడు. హేగెల్ సిద్ధాంతంలోని లోపాలను విమర్శించి, అధిగమించి భౌతికవాద పరస్పరవాదాన్ని రూపొందించినవాళ్లు మార్క్సు, ఎంగెల్సు. యిది భౌతికవాదాన్ని గుణాత్మకంగా కొత్తదైన స్థాయికి యెత్తి, దానిని పరస్పరవాదాత్మకం చేసింది. యీ రూపంలో భౌతికవాదం శాస్త్ర పరిశోధనకు అచ్చమైన తాత్విక, సిద్ధాంత ప్రాతిపదికనూ, భావవాదంతో చేసే పోరాటంలో మంచి ఆయుధాన్నీ సమకూర్చింది.

ఆచరణలో ప్రపంచాన్ని మార్చే క్రియాత్మక సామాజిక జీవిగా మానవున్ని తత్వశాస్త్రంలో చేర్చడంతో కూడా పరస్పరవాదాత్మక భౌతికవాదపు ఆవిష్కరణ ముడివడివుంది. ఆచరణయొక్క పరిశీలన, అన్నిటినీ మించి పాదార్థిక ఉత్పత్తియొక్క పరిశీలన, మానవ ఆలోచనయొక్క క్రియాత్మక పార్శ్వంతో వాస్తవికత అనేది వస్తుగతంగా వుందనే దృక్పథాన్ని యేకం చేయడానికి తోడ్పడింది. మానవ ఆచరణను గురించిన సరైన అవగాహన శాస్త్రీయమైన ప్రజ్ఞాన సిద్ధాంతానికీ, మొత్తం ప్రజ్ఞాన చరిత్రకూ రెండిటికీ ఓనమాలు.

మేము ముందు యివ్వబోయే వివరణ మరింత బాగా విశదం కావడానికి మౌలిక తాత్విక భావాలను గురించిన యీ చిన్న ప్రస్తావన చేయబడింది; యెందుకంటే, యిక్కడనుండి మేము యీ భావాలను తరుచుగా ఉపయోగిస్తాము. యీ విషయం యెలాంటిదంటే, తాత్విక పారిభాషిక పదాలు లేకుండా పని జరగదు. యెంతైనా, తత్వశాస్త్రంలో మొత్తం సమాజాన్ని గురించి ఆలోచించే సాధారణ సామాజిక సిద్ధాంతాలన్నీ వున్నాయి; వాటి కర్తల ప్రారంభక తాత్విక సూత్రాలకు ఆ సిద్ధాంతాల సారంమీద, అనేక సమస్యలు యే దిశలో పరిష్కరింపబడతాయో ఆ దిశమీద ప్రభావం వుంది. సామాజిక అభివృద్ధిని గురించిన మార్క్సిస్టు సిద్ధాంతానికి — చారిత్రక భౌతికవాదానికి (చరిత్రను గురించిన భౌతికవాద దృక్పథానికి) — కూడా తాత్విక స్వభావం వుంది.

కనుక, సామాజిక ప్రజ్ఞాన చరిత్రలో వున్నవి యేమిటంటే, ఒకటి, చారిత్రక శాస్త్రాల అభివృద్ధి, రెండు, నిర్దిష్ట సామాజిక శాస్త్రాల అభివృద్ధి, మూడు, మొత్తంగా చారిత్రక క్రమాన్ని గురించి సమన్విత దృక్పథాన్ని యిచ్చే సాధారణ అవగాహనలను సృష్టించడానికి పదే పదే జరిగిన ప్రయత్నాలూ. అన్నిటినీ మించి సామాజిక శాస్త్రపు మూడవ మౌలిక అంశం యిక్కడ మనకు ప్రస్తుతాంశం.

తాత్విక చారిత్రక సిద్ధాంతాలు బోలెడు వున్నప్పటికీ, వస్తుగత సత్యం ఒక్కటే. అందువలన సహజంగా యీ ప్రశ్న ఉత్పన్నమౌతుంది: వాస్తవికతకు అనుగుణంగా వుండే సాధారణ సిద్ధాంతాన్ని సృష్టించడం అసలు సాధ్యమా? ప్రతి సాధారణ సిద్ధాంతాన్నీ దాని కర్తయొక్క ఆత్మగత తాత్విక వైఖరిగా మాత్రమే, లేదా నిశ్చితమైన ఒక చిత్తవృత్తియొక్క వ్యక్తీకరణగా మాత్రమే పరిగణించడం బహుశా మరింత సరళంగా వుండదా? మానవజాతి తన సామాజిక అస్తిత్వపు గూఢార్థాన్ని గ్రహించేటంతగా పరిణతి చెందిందా?

యీ ప్రశ్నలకు టూకీగా జవాబులు చెప్పడానికి ప్రయత్నిస్తాము. నిజమే, ఒక సామాజిక సిద్ధాంతం, ఒక ఆలోచనాశీలియొక్క తాత్విక అభిప్రాయాలను సమాజానికి అన్వయించే ప్రయత్నం అయివుంటే, అది చారిత్రక వాస్తవికతకు అనుగుణంగా లేదనీ, తద్వ్యతిరేకంగా బహుశా చారిత్రక వాస్తవికతే ఒక నిర్దిష్ట పథకంలో బిగించబడిందనీ మనం ముందుగానే అనుకోవడం న్యాయమే. శాస్త్రీయమైన సామాజిక సిద్ధాంతాన్ని సృష్టించడానికి సమాజపు నిర్దిష్ట లక్షణాలనూ, దాని సొంత స్వభావాన్నీ సమగ్రంగా పరిగణించాలి. మరో విధంగా చెప్పాలంటే, సాధారణ సామాజిక సిద్ధాంతం తాత్వికంగా మాత్రమే కాక తాత్విక సామాజికంగా వుండాలి; అనగా అది తత్వశాస్త్ర పరిధిలో చేరడం మాత్రమే కాదు, తాత్విక ప్రజ్ఞానానికి మాత్రమే కాక, సామాజిక ప్రజ్ఞానానికి కూడా చెందిన వ్యవస్థయొక్క పరిధిలో చేరుతుంది. సామాజిక శాస్త్రంలోని పైన చెప్పిన మూడవ అంశం యీ సామాజిక జ్ఞాన రంగమే. సమాజం గురించిన శుద్ధ తాత్విక భావాలనుండి తాత్విక సామాజిక భావాలకు జరిగిన యీ పరివర్తన, 19వ శతాబ్దిలోనే జరుగుతూ వుండినట్టిది, సామాజిక జ్ఞానాభివృద్ధిలో ప్రముఖ పురోగతి. మానవ ఆలోచన చారిత్రక క్రమాన్ని గురించి మరింత ఉచితమైన అవగాహనను, సమాజపు విశిష్ట లక్షణాల పరిగణనమీదా, సామాజిక వాస్తవాలమీదా ఆధారపడిన అవగాహనను, సమీపించడాన్ని యీ పరివర్తన సంకేతించింది.

సామాజిక వాస్తవికతను అంతటినీ ఆవరించే అంత విశాలమైన సామాజిక సిద్ధాంతం, విస్తారమైన సంఖ్యలో వున్న వాస్తవాలను ఆవరించాలి గనుకనూ, సాధారణ సిద్ధాంతాన్ని సృష్టించడానికి తగినంతగా సమాజంయొక్క వివరాలన్నీ అధ్యయనం చేయబడలేదు గనుకనూ, కేవలం యీ కారణాల వల్లనే అలాంటి సిద్ధాంతం అసాధ్యమని విమర్శకుడు అనవచ్చు.

కొందరు బూర్జువా సామాజిక శాస్త్రజ్ఞులు యీనాడు కూడా ఇదే అంటున్నారు. యీ సమస్య ప్రత్యేకించి పరిశీలించదగినది.

వాస్తవాలను ఉపేక్షించే సిద్ధాంతం నిష్ఫలమైనదనే మాట నిజమే. కానీ, చారిత్రక, తదితర సామాజిక శాస్త్రాలలో జరిగిన గొప్ప పురోగతి సాధారణ సిద్ధాంతానికి సరిపడేటంత సమాచారాన్ని యింకా సమకూర్చలేదనడం నిజమేనా? మరి యీ విమర్శ యెందుకు? దీనిని అర్థం చేసుకోడానికి సమస్యయొక్క మూలం వద్దకు పోదాం.

19వ శతాబ్ది మధ్యలో ఓగూస్ట్ కోంట్ ఊహాగానపు తాత్విక చారిత్రక నిర్మాణాలు నిరర్థకమని నిర్ధరించినాడు. సామాజిక శాస్త్రాన్ని తత్వశాస్త్రంతో యేమీ సంబంధం లేకుండా, ప్రకృతి శాస్త్రంలాగే ప్రత్యక్ష వాస్తవాలమీద ఆధారపడే సమాజపు శాస్త్రంగా నెలకొల్పాలని అతను సూచించినాడు. కానీ, కోంట్ స్వయంగా అలాంటి శాస్త్రాన్ని సృష్టించలేదు. సామాజిక శాస్త్రంనుండి తత్వశాస్త్రాన్ని వెళ్లగొట్టే సాకుతో అతను కేవలం తన సొంత పాజిటివిస్టు తత్వశాస్త్రాన్ని దానిమీద మోపినాడు. దాని తదనంతర అభివృద్ధిని ప్రభావితం చేసిన ప్రముఖ బూర్జువా సామాజిక శాస్త్రజ్ఞులలో హెర్బర్ట్ స్పెన్సర్, ఎమిల్ డర్క్‌హైమ్, మాక్స్ వెబర్, విల్‌ఫ్రెడో పారెటో వున్నారు.

కోంట్, స్పెన్సర్, తదితరులచేత సృష్టింపబడి, పాజిటివిస్టు తత్వశాస్త్రపు సన్నిహిత సంపర్కంతో అభివృద్ధి చేయబడి, మార్క్సిస్టు సిద్ధాంతానికి వ్యతిరేకమైన యీ సామాజిక శాస్త్రానికి "సాంప్రదాయిక" సామాజిక శాస్త్రమని మామూలుగా పేరు పెట్టబడింది. కానీ, కోంట్ విమర్శించిన భావవాద చారిత్రక సిద్ధాంతం మాత్రమే కాక, అతని సొంత సైద్ధాంతిక సామాజిక శాస్త్రం కూడా ఊహాగానపు అన్వేషణయొక్క ఫలితమనీ, ఆచరణలో ప్రాముఖ్యం లేనిదనీ తదనంతరం స్పష్టమైంది. సామాజిక శాస్త్రాన్ని ఆచరణాత్మక ప్రాముఖ్యంగల శాస్త్రంగా నెలకొల్పాలనే ఉద్దేశంతో, బలమైన ప్రయోజనవాద (pragmatic) వైఖరులుగల అమెరికా సంయుక్త రాష్ట్రాల సామాజిక శాస్త్రజ్ఞులు ప్రత్యక్ష ప్రమాణవాదపు (empirical) సామాజిక శాస్త్రాన్ని రూపొందించినారు. దాదాపు 20వ శతాబ్ది ప్రథమార్ధ మంతటా యిది విస్తృతంగా అంగీకరింపబడింది. యిది సిద్ధాంతాన్ని ఉపేక్షిస్తున్నట్లు ప్రకటించింది; యిది నిర్దిష్ట సామాజిక పరిశోధనకు సంబంధించిన పద్ధతులమీదా, సంవిధానాలమీదా సాంద్రీకరించి, "సామాజిక చర్య," "సామాజిక మార్పు," "బృందం," "సంసర్గం," "ఘర్షణ," "మలచుకోవడం," "లీనం చేసుకోవడం," "సమష్టి ప్రవర్తన" లాంటి ప్రత్యేక సామాజిక శాస్త్ర భావాల వరుసను తయారు చేసుకోవడంమీద సాంద్రీకరించింది. ప్రత్యక్ష ప్రమాణపు పరిశోధనలు వేగంగా పెరిగినాయి. పరిశోధన కేంద్రాలూ, సంస్థలూ ఆవిర్భవించినాయి, కళాశాలలలోనూ, విశ్వవిద్యాలయాలలోనూ

సామాజిక శాస్త్ర శాఖలు నెలకొల్పబడినాయి. సామాజిక శాస్త్రం మనుషుల "సామాజిక ప్రవర్తన"ను అధ్యయనం చేసే ప్రత్యక్ష ప్రమాణవాద శాస్త్రంగా ప్రకటింపబడింది.

కానీ, విస్తారమైన ప్రమాణంలో జరిగిన ప్రత్యక్ష ప్రమాణపు పరిశోధనలద్వారా కొన్ని పరిమిత ఆచరణాత్మక విజయాలు కలిగినప్పటికీ, డబ్ల్యు. ఐ. థామస్, యఫ్. జ్నానేట్స్కి రచించిన "యూరప్‌లోనూ, అమెరికాలోనూ పోలిష్ రైతు," ఆర్. ఇ. పార్క్, ఇ. డబ్ల్యు. బర్జెస్ రచించిన "సామాజిక శాస్త్ర పరిచయం," రాబర్ట్ లిండ్, హెలెన్ లిండ్ రచించిన "మిడిల్‌టౌన్," ఎల్టన్ మేయో జరిపిన ప్రసిద్ధ హాథార్న్ ప్రయోగాలూ, స్టౌఫర్ బృందం జరిపిన సంయుక్త రాష్ట్రాల సైన్యపు పరిశోధనలూ విజయం పొందినప్పటికీ, 1940 దశకం నాటికి కొందరు సామాజిక శాస్త్రజ్ఞులు, మార్క్సిస్టులు కానివాళ్లు కూడా, ప్రత్యక్ష ప్రమాణవాదపు సామాజిక శాస్త్రంలోని లోపాలను చూపించడమూ, విమర్శించడమూ ప్రారంభించినారు. ప్రత్యక్ష ప్రమాణపు పరిశోధనయొక్క స్వల్ప ఆచరణాత్మక ఫలితాలూ, దాని సైద్ధాంతిక నిర్వీర్యతా దీనికి కారణాలు. సామాజిక శాస్త్రంలో జరిగిన అభివృద్ధియొక్క తర్కమే ఒక విషయాన్ని మనసుకు నాటేటట్లు చేసింది; అదేమిటంటే, సజీవ ప్రపంచానికి చెందిన వాస్తవాలనుండి వేరుపడిన ఊహాగానపు నిర్మాణాలూ, సమాజం గురించిన సాధారణ సిద్ధాంతానికి వ్యతిరేకమైన ప్రత్యక్ష ప్రమాణవాదమూ యీ రెండూ యే శాస్త్రీయమైన సామాజిక శాస్త్రాన్నీ సృష్టించలేకపోయినాయి.

పర్యవసానంగా, "సామాజిక పరిశోధనా," "సామాజిక శాస్త్రమూ" యేకీకరింపబడాలనే స్పష్టమైన అవసరం బూర్జువా సామాజిక శాస్త్రంలో రూపుదాలుస్తూ వుండింది. ప్రత్యక్ష ప్రమాణపు పరిశోధనమూ, ఆ సామాజిక శాస్త్రాన్నీ శాస్త్రంగా యెంచడానికి యే ఆధారమూ లేదనడానికి యిది పరోక్ష సాక్ష్యం.

ప్రస్తుతం బూర్జువా సామాజిక శాస్త్రంలో పరస్పరం పోటీపడే పలు భావాలు వున్నాయి; అవన్నీ సామాజిక సిద్ధాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు చెప్పుకుంటాయి. శుద్ధ ఊహాగానపు పథకాలకు తిరిగిపోవడం తమకు యిష్టం లేదని పాశ్చాత్య సామాజిక శాస్త్రజ్ఞులు ప్రకటిస్తారు. సామాజిక శాస్త్ర అభివృద్ధిలో కలిగిన అనుభవం యెంతైనా కేవలం నిరుపయోగం కాలేదు. సామాజిక సిద్ధాంతానికి ప్రత్యక్ష ప్రమాణపు వాస్తవాల అండదండలు వుండాలని యీనాడు వాళ్లలో చాలామంది పట్టుబట్టుతున్నారు. యిక్కడ ఒక మౌలికమైన అంతర్వైరుధ్యం ఉత్పన్నమౌతుంది. శాస్త్రవిజ్ఞానపు అంతర్గత అవసరాలద్వారా సాధారణ సామాజిక సిద్ధాంతాన్ని రూపొందించే సమస్య యేర్పడుతుంది; కానీ, సామాజిక శాస్త్రాన్ని కేవలం నిర్దిష్ట సమస్యల (ప్రజాభిప్రాయ సేకరణ, చిన్న బృందం లోపలి సంబంధాలు, మొదలైన సమస్యల) పరిష్కారానికి ప్రయోగించే పరిమిత ఆచరణ దీనికి బొత్తిగా ప్రోత్సాహం యివ్వడం

లేదు. యీ అంతర్వైరుధ్యాన్ని కప్పిపెట్టడానికే, సాధారణ సామాజిక సిద్ధాంతాన్ని నెలకొల్ప డానికి యింకా తగినంత సమాచారం లేదనీ, అందువలన ప్రస్తుతానికి మరింత నిర్దిష్టమైన సాధారణీకరణలకు పరిమితం కావడమూ, "మధ్యంతర సిద్ధాంతా"న్ని నెలకొల్పడమూ, అవసరమైన సమాచారం తగినంత ప్రోగుపడి, మరింత విశాలమైన సాధారణీకరణల స్థాయికి మనం యెదిగిందాకా సాధారణ సామాజిక సిద్ధాంత స్థాపనను వాయిదా వేయడమూ అవస రమని అంటున్నారు. యీ సమస్య పరిష్కారానికి టాల్కట్ పార్సన్స్‌యొక్క నిర్మాణ క్రియా ధోరణిమీద గొప్ప ఆశలు పెట్టుకోబడినాయి. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత పశ్చిమ దేశాలలో క్రియావాదం దరహంమీద "సామాజిక శాస్త్రపు యోచనకు ప్రాతిపదిక"గా విస్తృ తంగా యెంచబడింది.

కానీ, సామాజిక శాస్త్రంలోని నిర్మాణ క్రియా ధోరణి, సామాజిక ఘటనలను సమన్విత సామాజిక వ్యవస్థయొక్క నిర్మాణంలో వాటి స్థానం దృష్ట్యానూ, ఆ వ్యవస్థయొక్క స్థిరత్వాన్ని నిలపడంలో వాటి క్రియ దృష్ట్యానూ పరిగణించేటట్టిది, సమాజంలోని నిర్మా ణాంశాలను ఒకటిగా పట్టివుంచే కారణాలను గానీ, వాటి అభివృద్ధికి సంబంధించిన నియమా లనూ, శక్తులనూ గానీ తెలియజేయడం లేదు. అందుకనే, నిర్మాణ క్రియా వైఖరిని మహా అయితే సాధారణ సిద్ధాంతంలో ఒక అంశంగా చేర్చవచ్చునే గానీ, అదే యిది అనజాలం.

ఈవిధంగా, బూర్జువా సామాజిక శాస్త్ర సృష్టికర్తగా సాంప్రదాయికంగా పరిగణింప బడే కోంట్ గానీ, అతని తర్వాత వచ్చినవాళ్లు గానీ సామాజిక జీవితం గురించిన శాస్త్రీయ దృక్పథానికి తీసుకపోయే సాధారణ సామాజిక సిద్ధాంతాన్ని సృష్టించలేదు. 19వ శతాబ్ది మధ్యలో శాస్త్రీయమైన సామాజిక శాస్త్రంయొక్క అసలైన ప్రారంభాలను ప్రతిష్ఠించిన వాళ్లు మార్క్స్, ఎంగెల్సు.

చారిత్రక భౌతికవాదం అనబడే తాత్విక సామాజిక సిద్ధాంతాన్ని సృష్టించినవాడు మార్క్స్. అది మొత్తంగా చారిత్రక క్రమంయొక్క సారాంశాన్ని శాస్త్రీయంగా అర్థం చేసుకోడానికి ప్రాతిపదికను యేర్పరచింది, మొత్తం సామాజిక శాస్త్రానికి చాలా కాలంగా అన్వేషింపబడిన సిద్ధాంత ప్రాతిపదికగా రుజువైంది. యీ సిద్ధాంతాన్ని స్థాపించడంలో కలి గిన అనుభవం తెలియజేసే దేమిటంటే, సామాజిక ప్రజ్ఞానం చారిత్రకంగా అప్పటికే సాధా రణ సామాజిక సిద్ధాంతాన్ని రూపొందించడానికి తగినంత సమాచారాన్ని ప్రోగుచేసిందని. అంటే సంపూర్ణంగా అని కాదు, సిద్ధాంతం దరహంమీద ఆ స్థితిని అందుకోవడం సాధ్యం కాదు; సాధారణ సూత్రాల రూపంలో అని; తత్ఫలితంగా మానవ జాతి స్వీయ ప్రజ్ఞానానికి పక్వంగా వుందని దీని అర్థం. యీ సిద్ధాంతాన్ని రూపొందించడంలో కలిగిన అనుభవం యీ కింది విషయాన్ని తెలియజేస్తుంది: బూర్జువా సిద్ధాంతకారులు శాస్త్రీయమైన తాత్విక

సామాజిక సిద్ధాంతాన్ని సృష్టించజాలకపోవడానికి కారణం వాళ్లకు వాస్తవాలయొక్క, ప్రత్యక్ష ప్రమాణపు సమాచారంయొక్క కొరత వుండడం కాదు, వాళ్ళ తమ వర్గ దృక్ప థంచేతా, తమ సంకుచిత సామాజిక అవసరాలచేతా పరిమితపరచబడి వుండడమే.

నిర్దిష్ట సామాజిక పరిస్థితులు ఉత్పన్నం చేసిన అవకాశాలూ, అతి ముఖ్యమైన సామాజిక అవసరమూ వున్నప్పుడు మాత్రమే యే శాస్త్రమైనా, సామాజిక శాస్త్రంతో సహా, ఉత్పన్నమై, అభివృద్ధి చెందుతుంది.

ప్రకృతిని గురించి మాత్రమే కాక, సమాజాన్ని గురించి కూడా జ్ఞానం సంపాదించడానికి ప్రతి చారిత్రక యుగమూ నిశ్చితమైన అవకాశాలను సృష్టించింది. ఉదాహరణకు, పెట్టు బడిదారీ వ్యవస్థకు ముందు, దాని తొలి దశలలో కూడా, మనుషులు ప్రకృతిని గురించీ, తమ సొంత సామాజిక సంబంధాలను గురించీ శాస్త్రీయమైన జ్ఞానాన్ని సంపాయించుకొనే అవకాశం చాలా పరిమితంగా వుండింది. కానీ, తదనంతరం పెట్టుబడిదారీ వ్యవస్థ అభి వృద్ధి చెందేకొద్దీ, సామాజిక జీవితపు భౌతిక పరిస్థితులు ఒక మేరకు పరిణతి చెందినప్పుడు, మొత్తంగా చారిత్రక క్రమాన్ని శాస్త్రీయంగా గ్రహించడం ఆచరణాత్మకంగా సాధ్యమైంది. యీ కొత్త అవకాశాలు యేమిటి?

పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెందే కొద్దీ, ఆయా దేశాల, ప్రజానీకాల యేకాకి తనం అదృశ్యమౌతూ వస్తుంది; ఆధునిక జాతులు ఉత్పన్నమై, రకరకాల సంబంధాలు నెల కొల్పుకునే సమష్టి ప్రక్రియలోకి యివన్నీ లాగబడతాయి. దీనిద్వారా స్పష్టంగా వెల్లడయ్యే దేమిటంటే, మానవజాతి చరిత్ర సుసంబద్ధమైనదనీ, ప్రతి ప్రజానీకమూ తన చారిత్రక పురోగతిలో పలు నియమబద్ధమైన దశల గుండా గడుస్తుందనీ. వివిధ జాతుల చరిత్రలను సరిపోల్చడానికీ, వివిధ దేశాల ఆర్థిక, రాజకీయ వ్యవస్థలలోని సాధారణాంశాలను వెలికి తీయ డానికీ, సామాజిక సంబంధాలలోని నియమబద్ధమైన పునశ్చరణను ఆవిష్కరించడానికీ విశాలమైన అవకాశాలు ఉత్పన్నమైనాయి. ఆధునిక భౌతికవాదం, చరిత్రను "మానవజాతియొక్క పరిణామ క్రమం"గా చూస్తుందనీ, "దాని చలనానికి చెందిన నియమాలను ఆవిష్కరిం చడం ఆ భౌతికవాదంయొక్క కర్తవ్య"మనీ* ఎంగెల్స్ తన "ఆంటీ డ్యూరింగ్"లో అన్నాడు.

పెట్టుబడిదారీ వ్యవస్థకు జరిగిన పరివర్తన, జీవితపు ప్రతి రంగంలోనూ తెచ్చిన ప్రచండమైన విప్లవాత్మక మార్పులతో పాటు, చారిత్రక రంగంలోకి బలీయమైన సామాజిక

---

* F. Engels, *Anti-Dühring* ("ఆంటీ డ్యూరింగ్"), Moscow, 1969, పుట 35.

శక్తులను తీసుకవచ్చింది. వాటి పరస్పర ఘర్షణా, పోరాటమూ పరిపక్వ సామాజిక సమస్యలను పరిష్కరించినాయి. యీ పోరాటానికి ఒక అతి ముఖ్యమైన విశిష్ట గుణం వుండింది. మధ్య యుగాలలో యీ పోరాటం మతం పేరుమీద జరిగింది (మత యుద్ధాలూ, పాషండాలూ, రెఫర్మేషన్ ఉద్యమం, మొదలైనవి); అందువలన దీని నిజమైన కారణాలు మరుగుపడినాయి. కానీ, తదనంతరం బూర్జువా విప్లవాలలో భూమి కొరకు రైతుల పోరాటమూ, పెట్టుబడిదారీ వ్యవస్థలో కలవాళ్లకూ లేనివాళ్లకూ మధ్య, ధనికులకూ బీదలకూ మధ్య, ఘర్షణా సామాజిక ఘర్షణల ఆర్థిక ప్రాతిపదికను వెలికి తెచ్చినాయి; సహజంగా యిది చారిత్రక పరిణామాల కారణాలను సమాజ ఆర్థిక వ్యవస్థలో అన్వేషించడానికి మనుషులను ప్రేరేపించింది.

దాని నిర్దిష్ట రూపాలతో నిమిత్తం లేకుండా పాదార్థిక ఉత్పత్తియొక్క అభివృద్ధిని పరిశీలించడానికి కావలసిన పూర్వావసరాలను విస్తారమైన సామాజిక శ్రమ విభజనా, వివిధ ఉత్పత్తి శాఖల (పరిశ్రమలూ, వ్యవసాయమూ, వగైరాల) మధ్య స్థిరమైన సంబంధాల స్థాపనా సృష్టించినాయి.

తత్పర్యవసానంగా, పెట్టుబడిదారీ వ్యవస్థ మనుషుల జీవన పరిస్థితులలో విప్లవాన్ని ప్రేరేపించడంద్వారా చారిత్రక క్రమంయొక్క సారాన్ని పరిశోధించడానికీ, దాని పునాదులను గురించిన జ్ఞానాన్ని సంపాయించడానికీ కావలసిన వస్తుగత పూర్వావసరాలను సృష్టించింది.

పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి సామాజిక ప్రజ్ఞానానికి కొత్త అవకాశాలను కలిగించడం మాత్రమే కాక, సామాజిక శాస్త్రం కొరకు సామాజిక అవసరాన్ని కూడా సృష్టించింది.

పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెందేకొద్దీ, దాని అంతర్వైరుధ్యాలు అంతకంతకూ ప్రస్ఫుటమూ, తీవ్రమూ అవుతున్నాయి. ఉత్పత్తిలోని పోటీ, అరాజకత్వమూ, పదేపదే కలిగే సంక్షోభాలూ, సామాజిక, జాతీయ పీడనా, పెట్టుబడిదారీ వ్యవస్థలో అంతర్నిహితమైన యితర శత్రు వైరుధ్యాలూ యీ వైరుధ్యాలను పరిష్కరించే మార్గాలనూ, సాధనాలనూ కనుక్కొనే జరూరు కర్తవ్యాన్ని సమాజం యెదుట బెట్టినాయి. పెట్టుబడిదారీ ఉత్పత్తి యే స్థాయికి చేరిందంటే, మొత్తం సమాజపు ప్రమాణంలో ఉత్పత్తిమీద బుద్ధిపూర్వకమైన అదుపుకూ, మేనేజిమెంటుకూ అవసరం యేర్పడింది. యీ సమస్య మునుపటి యే సమాజానికీ ఎదురుకాలేదు. కానీ, పెట్టుబడిదారీ వ్యవస్థలో, ఉత్పత్తి సాధనాలమీద వున్న సొంత ఆస్తియొక్క పెత్తనంలో, అలాంటి అదుపును స్థిరంగా అమలుపరచడం అసాధ్యం. దానికి, ఒకటి, సామాజిక ఆస్తిమీద ఆధారపడిన కొత్త వ్యవస్థా, రెండు, శాస్త్రవిజ్ఞానమూ అవసరం. ప్రచండమైన ప్రకృతి శక్తులను వినియోగించుకోడానికి ప్రకృతిశాస్త్రం మానవులకు తోడ్పడినట్లే, సామాజిక అభివృద్ధియొక్క రాక్షస శక్తులను అణచడానికి సామాజిక శాస్త్రం వాళ్లకు తోడ్పడగలదు, తోడ్పడి

తీరాలి. సామాజిక అంతర్వైరుధ్యాలను అధిగమించవలసిన జరూరు అవసరం సమాజంలో ఉత్పన్నమౌతుంది గనుక, యీ అంతర్వైరుధ్యాలను గురించిన జ్ఞానాన్నీ, వీటిని అధిగమించే మార్గాలనూ సమకూర్చే శాస్త్రానికి కూడా అవసరం ఉత్పన్నమౌతుంది. సామాజిక శాస్త్రంమీద ఆధారపడకుండా నూతన సామాజిక వ్యవస్థ అనేది దురూహ్యం; యీ సామాజిక శాస్త్రం సామాజిక ప్రక్రియల నన్నిటినీ పాలించేటందుకూ, మానవుని అభివృద్ధి కొరకూ, స్వేచ్ఛ కొరకూ వాటిని సమాజంయొక్క సమంజసమైన, బుద్ధిపూర్వకమైన అదుపుకు లోబరచేటందుకూ సిద్ధాంత ప్రాతిపదికగా వుండాలి. వేటి ప్రాతిపదికమీద చారిత్రక భౌతికవాదం ఉత్పన్నమై, అభివృద్ధి చెందుతుందో ఆ సామాజిక అవసరాలు యివే.

ఈవిధంగా, పెట్టుబడిదారీ సమాజంయొక్క అభివృద్ధీ, దాని అంతర్వైరుధ్యాల తీవ్రతా చరిత్రను గురించిన శాస్త్రీయ దృక్పథానికి అవకాశాన్నీ, అవసరాన్నీ సృష్టించినాయి. మార్క్సు, ఎంగెల్సుల ఉజ్వలమైన విజయం యేమిటంటే, వాళ్లు పాత సాంప్రదాయిక భావవాద అభిప్రాయాలను విసర్జించి, సమాజ అభివృద్ధిని పాలించే నియమాలను, ఆత్మగత వాదులు వేటి ఉనికిని నిరాకరించినారో వాటిని, ఆవిష్కరించినారు. మార్క్సూ, ఎంగెల్సూ చరిత్రను గురించిన శాస్త్రీయ భౌతికవాద దృక్పథాన్ని రూపొందించి, యీ యుగం ముందుకు తెచ్చిన సమస్యను పరిష్కరించినారు.

మనం టూకీగా పరిశీలించిన సామాజిక జ్ఞాన అభివృద్ధీ, చరిత్రను గురించిన భౌతికవాద వ్యాఖ్యానం దృష్ట్యా దాని సాధారణీకరణా నయా కాంటియన్ల లాగ సామాజిక జ్ఞానాన్ని ప్రకృతి శాస్త్రానికి ప్రతిగా పెట్టడం న్యాయమేనా అనే ప్రశ్నకు జవాబు చెప్పడానికీ మనకు వీలు కలిగిస్తాయి.

సమాజం నిజంగా ప్రకృతికంటె భిన్నమైనది. కానీ, అదే సమయంలో, అది ప్రకృతిలో భాగం. ప్రకృతికీ, సమాజానికీ మధ్య భేదాలూ వున్నాయి, పోలికలూ వున్నాయి. అందువలన ఇక్కడ రెండు రకాల తప్పులు జరిగే అవకాశం వుంది: హెర్బర్ట్ స్పెన్సర్, సోషల్ డార్వినిస్టులూ, యితర ప్రకృతి శాస్త్రజ్ఞులూ చేసినట్లు ప్రకృతినీ, సమాజాన్నీ ఒకటిగా చూడడమూ, నయా కాంటియన్లు చేసినట్లు వాటిని ఒకదాని కొకటి సంబంధం లేకుండా విడదీయడమూ – తదనురూపంగా, ప్రకృతి శాస్త్రానికీ, సామాజిక శాస్త్రానికీ మధ్య గల భేదాన్ని చెరిపివేయడమూ ("సామాజిక భౌతికశాస్త్రం," "సోషల్ డార్వినిజం," శక్తివాదం, వగైరా) ఒక రకం తప్పు; ఈ శాస్త్రాలను ఒకదాని కొకటి ప్రతిగా పెట్టడం మరొక రకం తప్పు. ఈ రెండు దృక్పథాలూ తేటతెల్లంగా యేకపక్షమైనవి. ప్రకృతీ, సమాజమూ యీ రెండిటియొక్క క్రియా నిర్వహణా, అభివృద్ధీ వస్తుగత నియమాలకు లోబడి వున్నాయనీ, సామాజిక శాస్త్రం యీ నియమాలను తెలుసుకున్నది గనుక, అది చారిత్రక క్రమాన్ని వర్ణించడం మాత్రమే

కాక, దాని వెనుక వున్న కారణాలను కూడా వివరించగలదనీ చూపించడానికి సామాజిక జీవితాన్ని పరస్పరవాద భౌతికవాద దృష్టితో చూసే వైఖరి వీలు కలిగిస్తుంది. కనుక, అన్ని శాస్త్రాలనూ, అన్నిటినీ మించి, యే అభివృద్ధికి చెందిన సాధారణ నియమాలనైనా అధ్యయనం చేసే తత్వశాస్త్రాన్నీ, యే భౌతిక నిర్మాణాలవైనా (గణితం, సైబెర్నెటిక్స్, వగైరాల) సాధారణ లక్షణాలనూ, నియమాలనూ అధ్యయనం చేసే శాస్త్రాలనూ సామాజిక ఘటనలను తెలుసుకోడానికి ఉపయోగించుకోవచ్చు.

అదే సమయంలో, సమాజం ప్రకృతికంటె భిన్నమైనది గనుక, ప్రకృతి క్రమాల విశిష్ట లక్షణాలను ప్రతిబింబించే నియమాలనూ, నిర్ధారణలనూ సామాజిక జీవితానికి అన్వయించకూడదు. సమాజానికి దాని సొంత విశిష్ట నియమాలు వున్నాయి; వాటిని తెలుసుకోవడం సామాజిక శాస్త్రాల ప్రాథమిక కర్తవ్యం.

మునుపటి సామాజిక శాస్త్రంమీద పెత్తనం చేసిన భావవాదాన్ని అధిగమించడంలో జరిగిన గొప్ప విమర్శనాత్మక కృషి లేకుండా చారిత్రక భౌతికవాదం ఉద్భవించి వుండజాలదు. అలాగే, తత్వశాస్త్రంయొక్కా, చరిత్రయొక్కా, అర్థశాస్త్రంయొక్కా, మొత్తంగా సామాజిక ఆలోచనయొక్కా అభివృద్ధిలో కనపడే విలువైన అంశాలను నిలువుకోవడమూ, సవిమర్శకంగా ఉపయోగించుకోవడమూ లేకుండా కూడా అది ఉద్భవించి వుండజాలదు. అదే సమయంలో, చారిత్రక భౌతికవాదం సత్యానికీ, స్వప్రయోజనానికీ మధ్య గల విరోధాన్ని పరిష్కరించింది.

ఒక వస్తువును మార్చాలంటే మనకు దానిని గురించిన జ్ఞానం వుండాలి. మానవుడు తన కార్యాచరణలో, తన కార్యాచరణకు గురి అయ్యే వస్తువులను మార్చడమే కాక, తన లక్ష్యాలనూ, ఆశయాలనూ, ప్రయోజనాలనూ సాధించుకుంటాడు. కనుక మానవుని కార్యాచరణ వస్తుగత జ్ఞానాన్నీ, అవసరాలనూ, ప్రయోజనాలనూ మేళవిస్తుంది. కానీ, యివి మేళవించబడే పద్ధతి మారవచ్చు; యెందుకంటే, మనుషుల ప్రయోజనాలు పరస్పరం భిన్నంగా వుంటాయి, వ్యతిరేకంగా కూడా వుంటాయి. సామాజిక జీవితపు ప్రజ్ఞానంలో మనుషుల ప్రయోజనాలలోని, ముఖ్యంగా వర్గ ప్రయోజనాలలోని, భిన్నత్వం ఫలితంగా యెలాంటి సన్నివేశం యేర్పడుతుందంటే, ప్రతి దృక్పథానికీ తద్వ్యతిరేకమైన దృక్పథాలు వుంటూ, ఒకే వాస్తవాల సముదాయానికి భిన్న వ్యాఖ్యానం యిస్తాయి. కనుక యీ ప్రశ్న ఉత్పన్నమౌతుంది: మనం అసలైన జ్ఞానాన్ని పొందడం యెలా? బహుశా సమాజానికీ, వర్గాలకూ అతీతంగా వుండి మానవుల పోరాటాన్నీ, వాళ్ల ప్రయోజనాల ఘర్షణనూ, వాళ్ల ఉద్రేకాల కోలాహలాన్నీ విహంగమ దృష్టితో చూడడంద్వారానా? కానీ, యిది ఉపయోగం లేదనీ, విహంగమ దృష్టి భ్రమ మాత్రమే అనీ అనుభవం తెలుపుతుంది. నిజానికి సిద్ధాంత పరిగణనలు కూడా సూచించే దేమిటంటే, నిర్దిష్ట సామాజిక, లేక వర్గ

ప్రయోజనాలయొక్క, విలువ గీటురాళ్లయొక్క* దర్శకత్వంకింద జరగని సామాజిక పరిశోధన అసాధ్యమూ, అసంబద్ధమూ అని. చివరకు, అన్నిటినీ మించి మానవ కార్యకలాపాలకు సామాజిక జ్ఞానమే అవసరం. అందువల్లనే సామాజిక జ్ఞానం అసలైనదా, కాదా అనే సమస్య మరొక ప్రాతిపదికమీద పరిష్కరింపబడుతుంది. సమాజంలోనే ఒక సామాజిక వర్గాన్ని, ఒక సామాజిక శక్తిని, కనుక్కోవలసిన అవసరం వుంది, యెలాంటిదానినంటే, సామాజిక వాస్తవికతను గురించిన వస్తుగత జ్ఞానం లేకుండా వ్యవహరించనట్టిదానిని, విజయవంతంగా వ్యవహరించజాలనట్టిదానిని, అనగా అలాంటి జ్ఞానంలో ప్రయోజనం గల శక్తిని. అలాంటి సందర్భాలలో జ్ఞానమూ, ప్రయోజనమూ ఒకదాని కొకటి అనుగుణంగా వుంటాయి; అందువలన, అచ్చమైన జ్ఞానం కొరకు పాటుపడడంలో ప్రయోజనం వ్యక్తమౌతుంది. కానీ, యివి పరస్పరం వ్యతిరేకించినప్పుడు శాస్త్రవిజ్ఞానం పోయి, పుక్కిటి పురాణాలూ, భ్రమలూ, వికృత భావాలూ వస్తాయి. ప్రయోజనం అనేది ప్రచండమైన శక్తి; అందువలన రేఖా గణితపు సిద్ధ సత్యాలు గానీ, ప్రమేయాలు (theorems) గానీ యెవరి ప్రయోజనాలనైనా వ్యతిరేకిస్తే, వాటిని పూర్వపక్షం చేసే మనుషులు తప్పకుండా వుంటారు.

సామాజిక సిద్ధాంతం యేదో ఒక సామాజిక బృందంయొక్క, లేదా వర్గంయొక్క ప్రయోజనాలతో ముడిపడి వుందనే వాస్తవాన్ని గుర్తించడమే పార్టీ సూత్రం. మార్క్సిస్టు సామాజిక శాస్త్రం కార్మికవర్గ ప్రయోజనాలకు అనుకూలంగా, శ్రామిక ప్రజలను దోపిడీ నుండి విముక్తి చేయడానికీ, సమాజాన్ని సోషలిజంవైపూ, కమ్యూనిజంవైపూ తీసుకపోవడానికీ జరిగే పోరాటానికి అనుకూలంగా బాహాటంగా నిలబడుతుంది. మార్క్సిస్టు సామాజిక శాస్త్రానికి పార్టీ తత్వాన్ని యిచ్చేది అదే. కానీ, శ్రామిక ప్రజల వాస్తవ పోరాటాన్ని అది పెంపొందించగల యేకైక మార్గం యేమిటంటే, అది వాస్తవికతనూ, బలాబలాల తారతమ్యాన్ని అప్పుడు వున్న అంతర్వైరుధ్యాలకూ, అభివృద్ధి ధోరణులకూ చెందిన వాస్తవ చిత్రాన్ని

---

* విలువలు అనేవి మనిషికి అతని భౌతిక, ఆత్మిక కార్యకలాపాలలో యెదురయ్యే విషయాలూ, వస్తువులూ, భావాలూ, మొదలైనవి, అతనికి నిర్దిష్టమైన అర్థం కలిగినట్టివి, అతని అవసరాలనూ, ప్రయోజనాలనూ తీర్చేటట్టివి.

విలువ గీటురాళ్లు అనేవి వస్తుగత ప్రపంచంలోని విషయాలపట్లా, భౌతిక, ఆత్మిక కార్యకలాపాల ఫలితాలపట్లా మనిషియొక్క (సామాజిక బృందంయొక్క, వర్గంయొక్క, సమాజంయొక్క) అనుకూల, లేదా ప్రతికూల వైఖరిని నిర్ణయించే ప్రమాణాలు. విలువ గీటురాళ్లు సామాజిక జ్ఞానార్జనలోనూ, దరహంమీద సృజనాత్మక కార్యకలాపాలలోనూ, మనుషుల సామాజిక ప్రవర్తనలోనూ మార్గదర్శక సూత్రాలను సమకూరుస్తాయి.

చిత్రించడం. యిది జరిగినప్పుడు, ఆచరణయొక్క ఫలితాలను దాని లక్ష్యాలకు అనుగుణంగా చేసేటందుకు యీ శాస్త్రం ఆచరణాత్మక కార్యకలాపాలకు అన్వయించబడుతుంది — అంటే కేవలం వ్యక్తుల కార్యకలాపాలు కాదు, జనాల, వర్గాల, సామాజిక బృందాల పోరాటం. కార్మిక వర్గ పోరాటంతో గల గాఢ, అవిచ్ఛేద్య సంబంధం సామాజిక శాస్త్రాన్నీ, మొత్తం మార్క్సిస్టు దృక్పథాన్నీ శాస్త్రీయమూ, విప్లవకరమూ, విమర్శనాత్మకమూ చేస్తుంది, భవిష్యత్తువైపు చూసే శాస్త్రంగా చేస్తుంది. సామాజిక శాస్త్రం సామాజిక అభివృద్ధియొక్క వస్తుగత నియమాన్ని ఆవిష్కరించినప్పుడు మాత్రమే దానికి గతాన్ని వివరించడానికీ, వర్తమానాన్ని పరిశీలించడానికీ, భవిష్యత్తును ఊహించడానికీ సామర్థ్యం వుంటుంది. భవిష్యత్తును ఊహించ డమంటే, సహజంగావే, భవిష్యత్తులోని నిర్దిష్ట ఘటనలను కాదు, సామాజిక అభివృద్ధి యొక్క సాధారణ ధోరణిని మాత్రమే. మానవుడు ఒక సహజ చారిత్రక నియమాన్ని ఆవిష్కరించిన తర్వాత దానిని మార్చడానికి గానీ, రద్దుచేయడానికి గానీ అతను అశక్తుడు, కానీ కొత్తది పుట్టేటప్పుడు దాని పురిటి నొప్పులను అతను తగ్గించగలడు. అదే సామాజిక శాస్త్రంయొక్క గొప్ప ప్రాముఖ్యం.

తమ సామాజిక జన్మనుండీ, తమ ఐశ్వర్యంనుండీ, అధికారంనుండీ ఉత్పన్నమయ్యే తమ అధిక సౌకర్యాలను నిలుపుకొనేటందుకు సమాజంమీద తమ అభీష్టాన్ని రుద్దడానికీ, సామాజిక పురోగతిని మందగింపజేయడానికీ పూనుకున్న అధిక సౌకర్యయుత సామాజిక బృందాల, లేదా వర్గాల స్వార్థ ప్రయోజనాలతో ఒక సామాజిక సిద్ధాంతం యే విధంగా నైనా సరే లంకె నెలకొల్పుకుంటే, అది అనివార్యంగా యెలాంటి స్థావరం తీసుకుంటుం దంటే, ఆ స్థావరం మూలంగా అది వాస్తవికతను గురించి వస్తుగత నిర్ణయాలు చేయజాలక, విధిగా వికృతీకరణలు చేస్తుంది. అలాంటి సందర్భాలలో "పార్టీ" వైఖరి శాస్త్రీయ దృష్టితో ఘర్షించి, వస్తుగత జ్ఞానం కలగకుండా అడ్డంకులు సృష్టించి, పుక్కిటి పురాణాలు వర్ధి ల్లేటట్లు చేస్తుంది. మార్క్స్ 1868 జూలై 11న లుడ్విగ్ కూగెల్‌మన్‌కు రాసిన జాబులో యీ సమస్యయొక్క సారాన్ని యిలా వ్యక్తం చేసినాడు: "రెండిటి మధ్య గల సంబంధం అర్థమైతే, ప్రస్తుత పరిస్థితులు కూలిపోక ముందే, వాటి శాశ్వత అవశ్యకతలో సిద్ధాంత విశ్వాసమంతా కూలిపోతుంది. కనుక, యీ మతిహీనపు గంద్రగోళాన్ని శాశ్వతపరచడం కేవలం పాలకవర్గాలకు ప్రయోజనకరం."*

వస్తుగతతత్వమూ, <u>వస్తుగతవాదమూ</u> భిన్నమైనవని గమనించాలి. మొదటిది శాస్త్ర

---

* K. Marx and F. Engels, *Selected Correspondence* ("యేరిన ఉత్తర ప్రత్యుత్తరాలు"), Moscow, 1965, పుట 210.

జ్ఞానాన్ని వర్ణిస్తుంది. రెండవది సామాజిక జీవితాన్ని గ్రహించడంలో సిద్ధాంతవేత్తయొక్క "నిష్పాక్షిక" వైఖరిని – సామాజిక క్రమాలను వస్తుగతంగా, స్వప్రయోజన రహితంగా గమనిస్తున్నట్లు కనిపించేవాని వైఖరిని – వర్ణిస్తుంది. వస్తుగతవాదాన్ని లెనిన్ నిశితంగా విమర్శించి, దానిని బూర్జువా పార్టీ వైఖరియొక్క ప్రచ్ఛన్న రూపంగా పరిగణించినాడు. తమ పార్టీ వైఖరిని బాహాటంగా వెల్లడించి తద్వారా తమ సిద్ధాంత కల్పనలకూ, పాలక వర్గపు స్వార్థ ప్రయోజనాలకూ మధ్య గల సంబంధాన్ని వెల్లడి చేయడం బూర్జువా సిద్ధాంత వేత్తలకు అనుకూలంగా వుండదు. అలాంటి సందర్భాలలో, ఉద్దేశపూర్వకంగా గానీ, అప్రయత్నంగా గానీ, వస్తుగతవాద వైఖరి తీసుకోవడం మహా అనుకూలంగా వుంటుంది.

కనుక, సామాజిక విషయాలయొక్కా, ప్రక్రియలయొక్కా ముఖ్యమైన పార్శ్వాలను గురించిన వస్తుగత జ్ఞానాన్ని కలిగించేది ఒడ్డున కూర్చొని గమనించేవాని నిష్క్రియాత్మక వైఖరి కాదు, ప్రగతిశీల శక్తుల పక్షాన సామాజిక జీవితంలో క్రియాత్మకంగా పాల్గొనడమే. సామాజిక శాస్త్రంలో పార్టీ వైఖరిని నిరాకరించడంద్వారా కాక, శాస్త్రీయ వస్తుగతతత్వాన్నీ, పార్టీ వైఖరినీ మేళవించడంద్వారా శాస్త్రం సామాజిక వాస్తవికతను గురించి జ్ఞానం సంపాదించడానికీ రూపాంతరీకరించడానికీ సమర్థమైన పరికరంగా పనిచేస్తుంది.

సామాజిక శాస్త్రం నిశ్చితమైన స్థావరం తీసుకోవలసిన అవసరం వుందనీ, ఆచరణతో లంకించబడవలసిన అవసరం వుందనీ, మొదలైనవి పాఠకునికి నచ్చచెప్పాలని గ్రంథకర్తలు యెందుకు కోరుతున్నారని అతను అడగవచ్చు. ఒక సామాజిక సిద్ధాంతంయొక్క, ఒక సామాజిక శాస్త్రంయొక్క, విషయ వస్తువును వివరించడానికి తోడు, అది శాస్త్రీయమైనది కూడా అని నొక్కిచెప్పవలసిన అవసర మేమిటి? శాస్త్రం అనే మాటలోనే ఆ అర్థం వుంది కదా? ఉదాహరణకు, భౌతికశాస్త్ర పాఠ్యగ్రంథాలు ఆ శాస్త్రాన్ని వివరిస్తాయి గానీ, అది శాస్త్రీయమైనదని పట్టుబట్టి చెప్పవు. క్వాంటమ్ యాంత్రికశాస్త్రం తన సిద్ధాంతాలు "యేకైక శాస్త్రీయ సిద్ధాంతా"లని వాదించదు. యెక్కాల పుస్తకాన్ని వూరక కంఠస్థం చేస్తాం, అంతే. సామాజిక శాస్త్రపు సూత్రాలు సరియైనవని నమ్మించడం యెందుకు? నిజమే, యివి చాలా సందర్భ శుద్ధి గల ప్రశ్నలు, వీటి జవాబు సామాజిక శాస్త్రాలయొక్కా, ముఖ్యంగా మానవుల సామాజిక, రాజకీయ కార్యకలాపాలతో సన్నిహిత సంబంధం గల సామాజిక శాస్త్రాల యొక్క, విశిష్ట క్రియలనుండి ఉత్పన్నమౌతుంది. సామాజిక శాస్త్రంలో భావాల నిత్య ఘర్షణ వుంటుంది, ప్రయోజనాల ఘర్షణ వుంటుంది; తత్ఫలితంగా జ్ఞానంమీద ఆధారపడిన విశ్వాసం వ్యష్టి ప్రాముఖ్యం మాత్రమే కాక, చాలా సామాజిక ప్రాముఖ్యం గల విషయమౌతుంది. సామాజిక శాస్త్రంయొక్క సూత్రాలూ, నిర్ధారణలూ సరైనవనే నిశ్చయం వ్యక్తికి కలిగించేది అతని సామాజిక దృక్పథమే. సామాజిక సిద్ధాంతపు పలుకుబడి దాని అనుయాయుల

సంఖ్యమీద ఆధారపడుతుంది; కనుక, యీ సిద్ధాంతం చుట్టూ యెక్కువమందిని సమీకరిం చాలంటే, దానిని వస్తుగతంగా ప్రదర్శించడంద్వారానూ, దానిని యితర భావాలతో పోల్చ డంద్వారానూ అది సరైనదని మనుషులను నమ్మించవలసిన అవసరం వుంది. ఒక సిద్ధాంతా నికి అనుకూలంగా వుండే కీలకమైన వాదం కాదనుకున్నా, ఒక ముఖ్యమైన వాదం యేమి టంటే, అది యే లక్ష్యాలకు సేవచేస్తుంది, అది యే ప్రయోజనాలతో ముడివడి వుంది, యే ప్రయోజనానికి అభిముఖంగా వుంది అనేవి నిర్ణయించడం.

సామాజిక అభివృద్ధికి చెందిన మార్క్సిస్టు సిద్ధాంతం యీ ప్రశ్నల కన్నిటికీ స్పష్ట మైన కచ్చితమైన జవాబులు యిస్తుంది. అది నూతన సోషలిస్టు సమాజ నిర్మాణానికి ఉపకరిస్తుంది, కార్మికవర్గంయొక్క దోపిడీ చేయబడే సమస్త శ్రామిక జనాలయొక్క ప్రయో జనాలతో ముడివడివుంది, మానవతావాదపు విలువలకు అభిముఖంగా వుంది, అనగా అంతి మంగా మానవజాతి ప్రయోజనాలతో ముడివడివుంది. మానవుడు తన అంతస్సారాన్ని తన కార్యకలాపాలలో, తన పనిలో, వెల్లడిస్తాడు. మార్క్సిస్టు సిద్ధాంతపు మానవతావాదపు లక్ష్యం యేమిటంటే, అమానుషమైన పని పరిస్థితులను తొలగించడమూ, మానవ అంత స్సారపు అన్యధాకరణను అధిగమించడమూ, శ్రమను విమోచన చేయడమూ, శ్రామిక ప్రజ లకు సంతోషాన్ని చేకూర్చడమూ.

ప్రకరణం రెండు

సామాజిక పరిశోధనకు తాత్విక పూర్వావసరాలు

సమాజం గురించిన నిజంగా శాస్త్రీయమైన, సమగ్రమైన ప్రజ్ఞానంలో విధిగా సాధారణ సామాజిక సిద్ధాంతం చేరివుంటుందని నిరూపించినాం. కానీ, అలాంటి సిద్ధాంతాన్ని పథకంగా మార్చి, చారిత్రక సందర్భంనుండి వెలికి లాగి, నిర్దిష్ట చారిత్రక వాస్తవికతమీద రుద్దే ప్రమాదం యెప్పుడూ వుంది; తత్ఫలితంగా ఊహాగానపు భావాలు నిర్మించబడుతాయి; అవి తార్కికంగా సుసంబద్ధంగానూ, ఆకర్షణీయంగానూ వుండవచ్చు గానీ, చరిత్రయొక్క వాస్తవ గతికి సంబంధం లేనివిగా వుంటాయి.

అందుకనే, మార్క్సిస్టు సామాజిక సిద్ధాంతాన్ని వివరించడంలో మేము మొట్ట మొదటినుండి ఒక విషయం నొక్కిచెప్పాలి: యిది ప్రధానంగా చరిత్ర అధ్యయనానికి మార్గదర్శి మాత్రమే, చరిత్ర గతిని నిర్మించే సాధనం కాదు. చరిత్రయొక్క రహస్యాలను అధ్యయనం చేయవలసిన అవసరాన్ని తొలగించే మంత్రదండం కాదు యిది. చారిత్రక భౌతికవాదం ఫలానా కాలంలో ఫలానా దేశపు చరిత్ర గతికి కారణాలను వివరించగలనని చెప్పకోదు. అది సమాజాభివృద్ధిని పాలించే సాధారణ నియమాలను అధ్యయనం చేసి, కేవలం సాధారణ మార్గదర్శక సూత్రాలను ప్రకటిస్తుంది; కానీ వాటి అన్వయం బ్రిటన్‌లోనూ, ఫ్రాన్సులోనూ ఒకటిగా వుండదు, ఫ్రాన్సులోనూ, సంయుక్త రాష్ట్రాలలోనూ ఒకటిగా వుండదు, పెట్టుబడిదారీ దేశాలలోనూ, సోషలిస్టు దేశాలలోనూ ఒకటిగా వుండదు, పారిశ్రామిక దేశాలలోనూ,

వర్తమాన దేశాలలోనూ ఒకటిగా వుండదు. యెందుకంటే, యీ దేశాలలో, లేదా యీ దేశాల బృందాలలో నిర్దిష్ట పరిస్థితులూ, మొత్తం చరిత్ర గతి ప్రతిదానికీ విలక్షణంగా వుంటాయి.

చారిత్రక భౌతికవాదం మొత్తం మార్క్సిస్టు అవగాహనలో సజీవమైన భాగం, దాని సాధారణ తాత్విక దృక్పథంతో గాఢంగా ముడివడివుంది. కానీ, దానిలో తాత్విక సూత్రాలు సామాజిక సిద్ధాంతపు పరిభాషలో వ్యక్తం చేయబడి, యే సామాజిక పరిశోధనకైనా పూర్వావసరాలుగా వుంటాయి.

యీ సూత్రాలు శ్రద్ధార్హమైనవి; యెందుకంటే, యీ సూత్రాలమీద ఆధారపడిన సాధారణ సామాజిక సిద్ధాంతం సామాజిక జీవితాన్ని పరిశోధించడానికి శాస్త్రీయమైన పద్ధతిగా ఉపకరిస్తుంది.

మార్క్సిస్టు సామాజిక సిద్ధాంతంలోని ఒక అత్యంత ముఖ్యమైన సూత్రం, దాని సారాన్ని వ్యక్తం చేసి, వివిధ గత, వర్తమాన సామాజిక తాత్విక అవగాహనలకంటె దానిని భిన్నమైనదిగా చేసేది యేమిటంటే, భౌతికవాద సూత్రం, సామాజిక జీవితాన్ని గురించిన భౌతికవాద దృక్పథం.

చరిత్రను గురించిన దృక్పథంలో భౌతికవాదానికి అర్థం యేమిటంటే, సమాజంయొక్క భౌతిక జీవితం, ప్రప్రథమంగా పాదార్థిక ఉత్పత్తి అనే సామాజిక క్రమం, కేవలం సామాజిక జీవితంలో ఒక ముఖ్యమైన అంశం కాదనీ, ఆత్మిక రంగాన్నీ, సామాజిక జీవితపు సకల యితర వ్యక్తీకరణలనూ అంతిమంగా నిర్ణయించే సకల సామాజిక విషయాల చర్యా ప్రతిచర్యలకు భౌతిక పునాది అనీ గుర్తించడం.

చరిత్రలో భౌతికవాద భావం గురించి భిన్నభిన్న అభిప్రాయాలు వుంటాయి. కొందరు దానిని సహజమైనదిగా చూస్తారు; మరికొందరు దానిని శాస్త్రవిజ్ఞానానికి యేమీ ఉపకరించని ఆదిమ భావమని పట్టుబట్టుతారు. కొందరు దానిని అన్ని సామాజిక సిద్ధాంతాలలోనూ వున్న భావంగా ఊహిస్తారు, మరికొందరు దానిని పూర్తిగా నిరాకరిస్తారు. చరిత్రలో భౌతికవాద సూత్రం గురించి సరైన అభిప్రాయం వెలిబుచ్చి, సరైన అంచనా యిచ్చినవాడు లెనిన్; సామాజిక శాస్త్రంలో భౌతికవాదం అనే భావమే మహా ప్రతిభావంతమైన భావం అని ఆయన అన్నాడు.

ప్రకృతి విషయాలకు అమాయకమైన పౌరాణిక, మత ''వివరణలు'' నిరాకరించబడి, ఆ విషయాల అధ్యయనానికి పరివర్తన జరగడంతో ప్రకృతి శాస్త్రానికి తర్కబద్ధమైన పూర్వావసరం సమకూరింది. అలాగే, చరిత్రను మానవ చైతన్యంద్వారా గానీ, మానవాతీత చైతన్యంద్వారా గానీ వివరించే ప్రయత్నాలు అధిగమించబడి, భౌతికవాద వైఖరికి పరివర్తన జరగడం సమాజంలో జరిగే క్రమాలను వస్తుగతంగా, శాస్త్రీయంగా అర్థం చేసుకోడానికి

అవసరమైన షరతు, ప్రాతిపదిక. కానీ, యిక్కడ భౌతికవాదం నిర్దిష్టమైన పదాలలో వ్యక్తం చేయబడాలి, దానిని వాస్తవీకరించడానికి వీలు కలిగించే భావాల వ్యవస్థలో ప్రకటింపబడాలి.

యీ భావాల వ్యవస్థను రూపొందించడం శాస్త్రవిజ్ఞానంయొక్క గొప్ప విజయం. యెంతైనా, యాంత్రిక చలనాన్ని శాస్త్రీయంగా వర్ణించే భావాలను రూపొందించడానికీ, దాని నియమాలను ఆవిష్కరించడానికీ వేల యేండ్లు పట్టింది. కానీ, యాంత్రిక శాస్త్రం పాదార్థిక కణాల చలనాన్ని, స్థలంలో వస్తువుల చలనాన్ని, అధ్యయనం చేస్తుంది; అనగా అది మానవుడు ఆవిష్కరించినవాటిలో కెల్ల అత్యంత సరళమైన, అత్యంత ప్రాథమికమైన రకానికి చెందిన చలనాన్ని, మానవునికి దినదినమూ అనుభవంలో వున్నదానిని, అధ్యయనం చేస్తుంది. గలీలియో, న్యూటన్, లగ్రాంజ్, మొదలైన మహా ధీమంతులు సృష్టించిన సాంప్రదాయిక యాంత్రిక శాస్త్రం వేగం, త్వరణం, పదార్థ పరిమాణం, జడత్వం, శక్తి, మొదలైన సుప్రసిద్ధ భావాలమీద ఆధారపడుతుంది. వాటి సంబంధాలద్వారా శాస్త్రవిజ్ఞానం ప్రకృతి నియమాలను వ్యక్తం చేస్తుంది. ఆ నియమాల జ్ఞానంతో మానవుడు ఆచరణలో ప్రకృతి శక్తులను ఉపయోగించుకోగలడు. చారిత్రక భౌతికవాద భావాలకు కూడా యిదే వర్తిస్తుంది.

చారిత్రక భౌతికవాదానికి దాని నిర్దిష్ట భావాలు వున్నాయి. వాటిని ధాతువులు (categories) అంటారు.

ధాతువులు అనేవి నిర్దిష్ట విజ్ఞానశాస్త్రంయొక్క మౌలిక భావాలు, ఆ శాస్త్ర విషయం లోని ముఖ్యమైన ఆయా అంశాలను ప్రతిఫలించేవి. సమాజం అటుంచి, యే శాస్త్ర విషయమైనా భిన్న అంశాల యేకత్వంగా, వివిధ సంబంధాల, మధ్యస్థాల యేకత్వంగా వుంటుంది. కనుక, అధ్యయనం చేయబడే విషయంలోని అన్ని అంశాలనూ, అన్ని సంబంధాలనూ యే ఒక్క భావమూ మనసులో పునరుత్పత్తి చేయజాలక పోవడం సహజమే. వస్తువును గురించి యేక పార్శ్వగతమైన లేదా అభౌతికమైన జ్ఞానాన్ని విడివిడిగా యిచ్చే కొన్ని భావాల వ్యవస్థ మాత్రమే వాస్తవికతయొక్క సమస్త వైవిధ్యాన్నీ, దాని చలనాన్నీ, అభివృద్ధినీ మనసులో పునరుత్పత్తి చేయగలదు. వస్తువుయొక్క విశ్లేషణనుండి, విభజననుండి ధాతువులు యేర్పడుతాయి; దాని ప్రజ్ఞానంలోని దశలుగా వున్నాయి. అవి మనసుచేత యిష్టారాజ్యంగా సృష్టింపబడినవి కావు. మనసులో నిర్దిష్ట వస్తువుయొక్క నిశ్చితమైన అంశాల, గుణాల, లంకెల ప్రతిబింబమే అవి.

వస్తువును ముక్కలు చేయకుండా, దాని వేరువేరు అంశాలను ధాతువులుగా నె కొల్పకుండా, దానిని గురించి సుసంబద్ధమైన నిర్దిష్ట అవగాహన పొందడం అసాధ్యం. యీ కారణంవలన ప్రజ్ఞానంయొక్క చారిత్రకాభివృద్ధిలో ధాతువులను రూపొందించవలసిన అవసరం యేర్పడింది. కానీ, యిది సమస్యలో ఒక పార్శ్వం మాత్రమే.

అంతే కాక, వస్తుగత ప్రపంచ నియమాలను తెలుసుకోవడంలో ధాతువులు నిర్వహించే పాత్రవలన కూడా వాటిని రూపొందించవలసిన అవసరం యేర్పడుతుంది. తెలుసుకోవడమనేది కేవలం మనసులో వస్తువుయొక్క పునరుత్పాదన కాదు, మరి దాని అంతర్గత నియమాలనూ, సారభూతమైన లంకెలనూ, సంబంధాలనూ ఆవిష్కరించడం. కానీ, వస్తువుయొక్క సారమూ, దాని నియమాలూ విషయాల ఉపరితలంమీద వుండవు; అవి గుప్తంగా వుంటాయి, యింద్రియానుభూతులకు అందుబాటులో వుండవు. అందువల్లనే బాహ్యరూపంనుండి అంతస్సారానికి పోవలసిన అవసరం వుంది, వస్తువుయొక్క సారం లోపలికి సిద్ధాంతరీత్యా దూరి, తదనుగుణమైన ధాతువులలో సాధింపబడిన ప్రజ్ఞాన దశను నెలకొల్పవలసిన అవసరం వుంది. వస్తుగత నియమాలు అంతస్సారాల సంబంధాన్ని వ్యక్తం చేస్తాయి. ధాతువుల సంబంధంద్వారా వ్యక్తం చేయబడే శాస్త్ర నియమాలుగా అవి మనసులో ప్రతిబింబించబడుతాయి. కనుక, ధాతువులను రూపొందించడం శాస్త్ర నియమాలను రూపొందించడానికి తర్కబద్ధమైన పూర్వావసరం.

చారిత్రక భౌతికవాదం పరిశీలించే వస్తువు శాస్త్ర ధాతువులలో ప్రతిబింబించబడాలి. భౌతిక వస్తువుగా వున్న సమాజంలో కూడా వస్తుగత నియమాలు వుంటాయి, పనిచేస్తాయి. యీ విషయంలో, సమాజానికీ యితర భౌతిక వస్తువులకూ యేమీ భేదం లేదు. కానీ, సమాజం ఒక విశిష్టమైన పరిశోధన వస్తువు. ప్రకృతి విషయాల పరిశీలన ప్రాతిపదికమీద రూపొందించబడిన ప్రకృతి శాస్త్రాల ధాతువులూ అత్యంత సాధారణ తాత్విక భావాలూ సామాజిక జీవితపు విశిష్ట లక్షణాలను ప్రతిబింబించజాలవు, వ్యక్తం చేయజాలవు. అందువల్లనే, సామాజిక జీవితాన్ని గురించిన ప్రజ్ఞానంలో చారిత్రక భౌతికవాదం తన సొంత ధాతువులను రూపొందించుకొంటుంది, ఆ క్రమంలో సకల యితర సామాజిక శాస్త్రాల విజయాలనూ వినియోగించుకొంటుంది.

చారిత్రక భౌతికవాదంలోని పరిశోధన వస్తువు ధాతువుల నిర్మాణాన్ని కూడా నిర్ణయిస్తుంది. వీటిలో మౌలికమైన, ప్రధానమైన ధాతువులు యేవంటే, చారిత్రక అభివృద్ధిలోని అన్ని దశలకూ సామాన్యమైన సామాజిక జీవితపు ముఖ్య అంశాలను ప్రతిబింబించేవి (సామాజిక అస్తిత్వం, సామాజిక చైతన్యం, ఉత్పత్తి విధానం, ప్రాతిపదిక, ఉపరినిర్మాణం, వగైరా), లేదా సమాజ అభివృద్ధిలోని ప్రతి దశలోనూ సమాజంయొక్క అంతర్నిహితమైన ఐక్యతనూ, సంసక్తినీ ప్రతిబింబించేవి (సామాజికార్థిక నిర్మాణరూపం, ఆదిమ సమష్టి వ్యవస్థ, పెట్టుబడిదారీ వ్యవస్థ, కమ్యూనిస్టు నిర్మాణరూపం లాంటివి). చారిత్రక భౌతికవాదంలోని కొన్ని ధాతువులు సామాజిక జీవితంలోని ఆయా అంశాలను ప్రతిబింబిస్తాయంటే, ఆ అంశాలు కొన్ని నిర్మాణరూపాలకు మాత్రమే వర్తిస్తాయి, కానీ ఆ నిర్మాణరూపాల అభివృద్ధిని

అర్థం చేసుకోడానికి అవి అత్యంత ముఖ్యమైనవి (వర్గాలు, రాజ్యం, రాజకీయాలు, యుద్ధం, వగైరా).

సమాజం పరస్పర సంబంధాలు గల విషయాల, ఘటనల, ప్రక్రియల క్లిష్ట సమాహారంగా కనపడుతుంది. లెనిన్ యిలా రాసినాడు: "...ధాతువులు ప్రపంచాన్ని వింగడించడంలోని, అనగా ప్రజ్ఞానంలోని దశలు, అల్లికలోని సంగమ బిందువులు, ఆ అల్లికను తెలుసుకోడానికీ, స్వాయత్తం చేసుకోడానికీ తోడ్పడేవి."* చారిత్రక భౌతికవాదపు ధాతువులు సామాజిక జీవితపు పరిశీలన ఫలితంగానూ, ఆ జీవితపు సారంలోకి దూరిన ఫలితంగానూ యేర్పడినాయి; అందువలన అవి ప్రజ్ఞానంయొక్క నిశ్చితమైన ఫలితం. అవి అజ్ఞేయంనుండి జ్ఞాతానికి జరిగిన ప్రజ్ఞాన పురోగతిలో భాగాలుగా, సామాజిక జీవితంలోని నిజమైన వైవిధ్యాన్ని జీర్ణం చేసుకొనే సాధనాలుగా, సామాజిక విషయాల క్లిష్ట సమాహారాన్ని స్వాయత్తం చేసుకొనే సాధనాలుగా కూడా కనిపిస్తాయి. మరొక విధంగా చెప్పాలంటే, ధాతువులు ప్రజ్ఞాన ఫలితమూ, ప్రజ్ఞాన సాధనమూ కూడా.

చివరి విషయంగా, చారిత్రక భౌతికవాదపు ధాతువుల సరైన అవగాహనకు మనసులో పెట్టుకోవలసింది యేమిటంటే: యితర సామాజిక శాస్త్రాలకు భిన్నంగా చారిత్రక భౌతికవాదం తాత్వికమూ, పరిశీలన పద్ధతీ (methodological) అయిన శాస్త్రం; అనగా, అది సామాజిక జీవితపు ఆయా క్రమాలనూ, అంశాలనూ అధ్యయనం చేయదు, సమాజాన్ని, సామాజిక జీవితాన్ని, సుసంబద్ధమైన క్రమంగా అధ్యయనం చేస్తుంది, దాని సకల అంశాలనూ పరస్పర సంబంధాలలోనూ, పరస్పర చర్యా ప్రతిచర్యలలోనూ పరికిస్తుంది, ఫలితంగా అది సమాజాన్ని గురించిన ప్రజ్ఞానానికి సాధారణ సిద్ధాంతమూ, పద్ధతీ అవుతుంది. అందువలన, చారిత్రక భౌతికవాదపు ధాతువులకు సామాజిక జీవితాన్ని గురించిన ప్రజ్ఞానంలోనూ, మానవుల ఆచరణాత్మక కార్యకలాపాలలోనూ పరిశీలన పద్ధతిగా ఉపకరించే ప్రాముఖ్యం వుంది. అంటే, యివే సిద్ధాంత నిర్ధారణలకూ, ఆచరణాత్మక నిర్ణయాలకూ ప్రాతిపదికగా పనిచేయ జాలవు.

యీ ధాతువులూ, వీటి సాయంతో వ్యక్తమయ్యే చారిత్రక భౌతికవాద నియమాలూ మొత్తంగా వాస్తవికతనూ, దాని వ్యష్టి అంశాలనూ గురించిన ప్రజ్ఞానంలో మార్గదర్శకంగా వుంటాయి. అందువల్లనే, ఆచరణకు మార్గదర్శిగా ఉపయోగపడే సరైన సైద్ధాంతిక నిర్ధారణలు యీ ధాతువులనుండే లభ్యం కావు, చారిత్రక భౌతికవాద పద్ధతియొక్క, దాని ధాతువులయొక్క, నియమాలయొక్క సాయంతో పరిశీలించబడే నిర్దిష్ట సన్నివేశాన్ని

---

* V. I. Lenin, *Collected Works*, Vol. 38, పుట 93.

పరిగణించడంద్వారా లభ్యమౌతాయి. అందువల్లనే, చారిత్రక భౌతికవాదానికి మేము ముందు యివ్వబోయే వివరణలో, యీ శాస్త్రంయొక్క మౌలిక ధాతువుల విలక్షణ గుణాన్ని యెలా యిస్తామంటే, వాటి వస్తుగత సారం దృష్ట్యానూ, సామాజిక జీవితాన్ని గురించిన ప్రజ్ఞానంలోనూ, రూపాంతరీకరించడంలోనూ ఒక పద్ధతిగా వాటికి గల ప్రాముఖ్యం దృష్ట్యానూ యిస్తాము. యీ శాస్త్ర నియమాలను రూపొందించడంలోనూ, అధ్యయనం చేయడంలోనూ, చారిత్రక క్రమంయొక్క యేకత్వాన్నీ, వైవిధ్యాన్నీ, ఆంతరిక సంబంధాన్నీ, సుసంబద్ధతనూ గ్రహించడంలోనూ ఒక పద్ధతిగా వాటికి గల ప్రాముఖ్యం దృష్ట్యానూ యిస్తాము.

"సామాజిక అస్తిత్వమూ," "సామాజిక చైతన్యమూ" అనేవి భౌతికవాదం అనే సాధారణ భావాన్ని సామాజిక సిద్ధాంతపు పరిభాషలో చెప్పడంలో ఉపయోగించబడే మౌలిక ధాతువులు. యీ భావాలూ, "అస్తిత్వమూ," "చైతన్యమూ" అనే సాధారణ తాత్విక భావాలూ ఒకటి కాదు. సామాజిక అస్తిత్వం — సమాజంయొక్క భౌతిక జీవితం — అనేది విశిష్ట సామాజిక ధాతువు. సామాజిక అస్తిత్వాన్ని దరహంమీద ప్రాకృతిక అస్తిత్వంకంటె భిన్నమైనదానిగా చూపించడంలో మార్క్స్ సమాజాన్ని గుణాత్మకంగా విలక్షితమైన వస్తువుగా, భౌతిక వస్తువుగా గానీ, జీవగత వస్తువుగా గానీ, ఆత్మిక వస్తువుగా గానీ కుదించబడజాలనిదానిగా పరిగణించినాడు. సమాజం ప్రకృతిలోనే వుంటూ, దానినుండి విడదీయరానిదిగా వున్నప్పటికీ, సజీవ మానవుడు జీవగత వ్యవస్థ అయినప్పటికీ, వేటికి సమాజమూ, మానవుడూ లోబడివుంటారో ఆ భౌతిక ప్రపంచపు నియమాలు గానీ, జీవ ప్రపంచపు నియమాలు గానీ సమాజపు నిర్దిష్ట స్వభావాన్ని ప్రతిబింబించవు, అందువలన అవి సమాజాన్ని వివరించే సాధనంగా ఉపకరించజాలవు. సామాజిక అస్తిత్వాన్నీ, ఆ ప్రాతిపదికమీద మొత్తం సామాజిక జీవితాన్నీ అర్థంచేసుకోడానికి సామాజిక నియమాల జ్ఞానం అవసరం.

నిర్దిష్ట వస్తుగత నియమాలు అన్ని పాదార్థిక విషయాలలోనూ, క్రమాలలోనూ వున్నాయి, పనిచేస్తాయి. సామాజిక అస్తిత్వాన్ని మొత్తం సామాజిక జీవితానికి పాదార్థిక ప్రాతిపదికగా వ్యక్తం చేయడంతో దాని నియమాలను, అనగా చరిత్రలో పనిచేసే నియమాలను, తెలుసుకోడానికి మార్గం యేర్పడుతుంది. సామాజిక క్రమాన్ని గురించిన జ్ఞానాన్ని సంపాయించడంలో భౌతికవాదంయొక్క ప్రాముఖ్యాన్ని కూడా యిది తెలియజేస్తుంది.

సామాజిక చైతన్యం — అనగా మానవులూ, సామాజిక బృందాలూ, సమాజమూ ఆత్మికంగా పరిసర ప్రపంచాన్ని జీర్ణం చేసుకోడానికీ, తమ సొంత అస్తిత్వాన్ని అర్థం చేసుకోడానికీ, తాము యెదుర్కొనే సమస్యలను పరిష్కరించడానికీ తోడ్పడే వివిధ భావాలూ, అభిప్రాయాలూ, సిద్ధాంతాలూ, అవగాహనలూ, సామాజిక అనుభూతులూ, వగైరా — సమాజపు పాదార్థిక జీవితంనుండీ, సామాజిక సంబంధాలయొక్క వైవిధ్యంనుండీ మానవుల కార్య

కలాపాలనుండీ ఉత్పన్న మౌతుంది. చైతన్యం అనేది సామాజిక జీవితంలో అవశ్యమైన అంశం; యెందుకంటే, చైతన్యయుత జీవులైన మానవుల కార్యకలాపాల ఫలితంగా సామాజిక జీవితపు వ్యక్తీకరణలన్నీ యేర్పడుతాయి. సామాజిక చైతన్యంయొక్క స్వభావమూ, స్థాయీ, అభివృద్ధి ధోరణులూ అంతిమంగా సామాజిక అస్తిత్వంచేత నిర్ణయించబడుతాయి — మనం ముందు చూడబోయేటట్లు, వాటి మధ్య నిజమైన చర్యా ప్రతిచర్యలు మహా క్లిష్టంగా, వివిధంగా వున్నప్పటికీ.

కనుక, సామాజిక అస్తిత్వమూ, సామాజిక చైతన్యమూ అనే భావాలు ప్రతి తాత్విక సామాజిక సిద్ధాంతానికి మౌలికమైన సమస్యను — సామాజిక జీవితంలో దేనిని ప్రాథమికమైన, ముఖ్యమైన, నిర్ణాయకమైన అంశంగా గుర్తించాలి, పాదార్థిక అంశాన్నా, ఆత్మిక అంశాన్నా, అనే సమస్యను — పరిష్కరించడానికి తోడ్పడుతాయి. భౌతికవాద వైఖరి సామాజిక అస్తిత్వాన్ని సామాజిక చైతన్యంకంటె ప్రాథమికమైనదిగా గుర్తించాలి; యిది చరిత్రయొక్క భౌతికవాద దృక్పథానికి ప్రాతిపదిక అవుతుంది. అందువల్లనే యీ ధాతువులు మొత్తం చారిత్రక భౌతికవాదపు భావాల వ్యవస్థకు కీలకమైనవి, మౌలికమైనవి.

కానీ, సామాజిక జీవితాన్ని పరిశీలించడంలో భౌతికవాద సూత్రం యెంత ముఖ్యమైనప్పటికీ, దానిని స్థిరంగా ప్రయోగించాలంటే, ఒకటి కావాలి; యేమిటంటే, అధ్యయనం చేయబడే వస్తువు మారడానికి అభిముఖంగా వుందా లేదా అనేదీ, అది యే రకం భావాలలో — నిశ్చలమైన, పరమమైన భావాలలోనా, లేక మారేటట్టి, సాపేక్షమైనట్టి, వెనులుబాటు గలట్టి భావాలలోనా — ప్రతిబింబింపబడాలి అనేదీ నిర్ణయింపబడాలి. క్రియాశీలమైన మన యీ యుగంలో, ఒక తరం జీవిత కాలంలోనే సమాజంలో అపారమైన మార్పులు జరుగుతున్నప్పుడు, యీ ప్రశ్నకు జవాబు స్వయంవ్యక్తంగా వున్నట్లు కనపడుతుంది. నిజమే, సమాజం అభివృద్ధి చెందుతుంది, అది వెనులుబాటు గలట్టి, మారేటట్టి భావాలలో ప్రతిబింబింపబడవలసి వుంది. కానీ, గతంలో లాగే యీనాడు కూడా చాలామంది సామాజిక శాస్త్రజ్ఞులూ, చరిత్రకారులూ, రాజకీయవాదులూ ఒకే మూసలో పోసిన భావాలను, తాము రూపొందించి, అభిమానించే భావాలను, ప్రయోగించడంద్వారా సమాజంలో జరిగే ఘటనలను అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తారు. వాళ్లు "సమాజం," "మానవ స్వభావం," "వ్యక్తి," "స్వేచ్ఛ" లాంటి భావాలు ఉపయోగిస్తారు. వాటికి సర్వ కాలాలలోనూ ఒకే అర్థం వున్నట్లు పరిగణిస్తారు. ప్రాచీన సమాజంలోనే "పెట్టుబడి," "అదనపు విలువ" మొదలైనవి వుండినట్లు వాళ్లు ఆవిష్కరిస్తారు. భూత, వర్తమాన కాలాలకు చెందిన భిన్న సమాజాలను అవి యే మేరకు అభౌతిక ఆదర్శాలకు అనుగుణంగా వున్నాయనే దృష్ట్యా వాళ్లు అంచనా వేస్తారు. సమాజంలోని ఘటనలమీద వాళ్లు నీతులు ఉపదేశిస్తారు, చరిత్రాతీత నైతిక

ధాతువులద్వారా యీ ఘటనలకు విలువ గట్టుతారు. వీటి మూలంగా వాళ్ళు సమాజంలో జరుగుతున్న మార్పుల నిజమైన స్వభావాన్ని అర్థం చేసుకోలేరు, వాటిని వస్తుగతంగా అధ్యయనం చేయలేరు. దీనికి భిన్నంగా, సామాజిక జీవితంయొక్క నిజంగా శాస్త్రీయమైన పరిశీలనయొక్క తాత్విక ఆధారం యేమిటంటే, సమాజంలోని మార్పులు నియమబద్ధమైనవనీ, సమాజం పురోగమనాత్మకమైన అభివృద్ధి క్రమంలో వుందనీ గుర్తించడం. తదనుగుణంగా అది సమాజంలో జరిగే మార్పులను వాటి సమస్త మహా వైవిధ్యంలోనూ, వాటి వివిధ పరస్పర సంబంధాలలోనూ, గతంలోనూ, భవిష్యత్తులోనూ, వాటి అభిముఖ్యాలలోనూ, వాటి అంతర్వైరుధ్యాలలోనూ అర్థం చేసుకోడానికి వీలు కలిగించేటట్లుగా శాస్త్రీయ భావాలతో పనిచేసే పద్ధతిని రూపొందించడానికి ప్రయత్నిస్తుంది. దీనిని సామాజిక జీవితంపట్లా, దానిని వ్యక్తం చేయడానికి ఉపయోగించే ధాతువులపట్లా పరస్పరవాద వైఖరి అంటారు.

సకల సామాజిక విషయాలనూ గురించిన ప్రజ్ఞానంపట్ల, సమాజాన్ని అధ్యయనం చేయడంపట్ల, పరస్పరవాద వైఖరి సామాజిక పరిశోధనకు అత్యంత ముఖ్యమైన తాత్విక ఆధారం. యెందుకంటే, సమాజాన్ని అంతర్వైరుధ్యాలద్వారా అభివృద్ధి చెందుతున్నట్లు చూసే బాధ్యతనూ యే సామాజిక విషయం అయినా యెలా ఉద్భవించిందీ, తన అభివృద్ధిలో అది యే దశలగుండా గడచిందీ, ప్రస్తుతం అది యేమి అయిందీ, దానిలో యే భవిష్యత్తుయొక్క బీజాలు వున్నదీ నిర్ధరించే బాధ్యతనూ అది పరిశోధకునిమీద మోపుతుంది. కనుక, సామాజిక పరిశోధనలో పరస్పరవాదం అన్నిటినీ మించి సమాజంపట్లా, సామాజిక విషయాల పట్లా చారిత్రక వైఖరి అనే రూపం ధరిస్తుంది; టూకీగా దీనికి చారిత్రక సూత్రం అని పేరు పెట్టబడింది.

సమాజమూ, దాని భాగాలూ యే నిర్దిష్ట సమయంలోనైనా నిశ్చితమైనవిగా వుంటాయి గనుక, వాటిని ప్రతిబింబించే భావాలు కూడా కచ్చితంగా నిర్వచించబడి, స్థిరంగా వుండాలి. కానీ, సమాజమూ, మనం తెలుసుకోగోరే మొత్తం వాస్తవికతా నిత్యం అభివృద్ధి చెందుతూ, మారుతూ వున్నాయి గనుక, వాటిని ప్రతిబింబిస్తున్న భావాలూ, వాటిని గురించిన మన ప్రజ్ఞానమూ కూడా మారాలి. కనుక, ప్రజ్ఞానంయొక్క, సామాజిక భావాల వాడుకయొక్క, పరస్పరవాదాత్మకతలో సాపేక్షవాదం అనే భావం కూడా వుంది; అనగా, శాస్త్రీయ భావాలు సాపేక్షమనీ, మార్పుకు లోనౌతాయనీ అది గుర్తిస్తుంది. కానీ, దీనిని సాపేక్షవాదంగా కుదించడం పూర్తిగా తప్పౌతుంది. యెందుకంటే, లెనిన్ అన్నట్లు, "వస్తుగత సత్యాన్ని నిరాకరించే అర్థంలో కాక, యే పరిమితులలో మన జ్ఞానం యీ సత్యానికి సమాన మౌతుందో ఆ పరిమితులు చారిత్రకంగా సాపేక్షమైనవనే అర్థంలో"* పరస్పరవాదం మానవ జ్ఞానం

* V. I. Lenin, *Collected Works*, Vol. 14, పుట 137.

యొక్క సాపేక్ష స్వభావాన్ని గుర్తిస్తుంది. మరొక విధంగా చెప్పాలంటే, శాస్త్రీయ జ్ఞానంలో వస్తుగత సత్యం వుంది, కానీ ప్రజ్ఞానంలో అది అంతా ఒకేసారి సంపూర్ణంగా, ఒక సమస్తంగా వ్యక్తం కాదు, సాపేక్ష, పాక్షిక సత్యాలుగా వ్యక్తమౌతుంది. సాపేక్ష సత్యాలనుండి పరమ సత్యానికి పురోగమించడం జ్ఞాన పురోగతి అవుతుంది. దీనికి భిన్నంగా, సాపేక్షవాదం మానవ జ్ఞానంయొక్క సాపేక్ష స్వభావాన్ని మాత్రమే గుర్తిస్తుంది. యిది మార్పులను అతిశయోక్తిగా చెప్పడం, మార్పులను పరమమైనవిగా చూడడం, ప్రపంచంలో ప్రతిదీ సాపేక్షమే ననడం; యిది అంతిమంగా ఆత్మగత భావవాద మౌతుంది, అనగా వస్తుగత సత్యాన్ని నిరాకరించడం, వ్యష్టి శాస్త్రీయ సిద్ధాంతాలలోనే కాక, దరహంమీద మానవ జ్ఞానంలో వస్తుగత సారాన్ని నిరాకరించడం. చారిత్రక ప్రజ్ఞానంలో యిది వివిధ ఘటనల గురించి వస్తుగత జ్ఞానాన్ని పొందవచ్చుననేదాన్నీ, వీటిని సముచితంగా విలువ కట్టవచ్చుననేదాన్నీ నిరాకరించడానికి కూడా దారితీస్తుంది, సమాజం గురించి యెలాంటి వస్తుగత జ్ఞానమూ, సామాజిక శాస్త్రాలలోని భావాలలో వస్తుగతంగా స్థిరమైన యెలాంటి సారమూ లేదనడానికి దారి తీస్తుంది, వగైరా. కానీ, వాస్తవంగా, సామాజిక శాస్త్రం ఉపయోగించే భావాలు పరస్పర వాదాత్మకంగా ఒకవైపున స్పష్టంగా, నిశ్చితంగా, స్థిరంగా వుండాలి, మరొక వైపున, వెనులుబాటుగా, మార్పుకు లోనౌతూ, సాపేక్షంగా వుండాలి.

సమాజ అధ్యయనంలో భౌతికవాద సూత్రమూ, పరస్పరవాద చారిత్రక సూత్రమూ, యివి రెండూ ఒక లక్ష్యాన్ని – వున్నదున్నట్లుగా పరిశీలిత వస్తువును గురించిన జ్ఞానాన్ని సంపాయించడం అనే లక్ష్యాన్ని – సాధిస్తాయని సులభంగా అర్థమౌతుంది. యీ రెండింటి సజీవ ఐక్యతను యిది వ్యక్తం చేస్తుంది.

సమాజం అనేది వస్తుగతంగా అస్తిత్వం కలిగి, అభివృద్ధి చెందే వ్యవస్థ. కానీ, యీ గుణం నిర్దిష్ట జ్ఞాతవ్యం (object of cognition) గా సమాజాన్ని ప్రకృతినుండి వేరుచేయదు. యెందుకంటే, రెండు విషయాలలోనూ భౌతిక వ్యవస్థల క్రియా నిర్వహణ (functioning)నూ మార్పునూ పాలించే నియమాలు అధ్యయనం చేయబడుతాయి.

కానీ, మేము గత ప్రకరణంలో చెప్పినట్లు, సమాజం అనేది ప్రకృతికంటె మౌలికంగా భిన్నమైన వస్తువు; యెందుకంటే, దానిలో కర్త (subject) కూడా యిమిడివుంది గనుక. అందుకనే, సామాజిక శాస్త్రం సమాజాన్ని సామాజిక సంబంధాల వ్యవస్థగా మాత్రమే అధ్యయనం చేయకూడదు, మనిషిని నిర్దిష్ట వ్యవస్థలో ఒక అంశంగా మాత్రమే, సామాజిక శరీర (social organism)లో ఒక అణువుగా మాత్రమే అధ్యయనం చేయకూడదు. అది మనిషిని యీ సంబంధాల కర్తగా కూడా, కార్యాచరణ చేతనైన, సృజనాత్మక కృషి చేతనైన వ్యక్తిగా కూడా, తన ఆత్మిక ప్రపంచమూ, రాగ ద్వేషాలూ గల వ్యక్తిగా కూడా

అధ్యయనం చేయాలి. కర్తనుండి విడివడిన సామాజిక శాస్త్రం మానవతా విలువల పట్ల నిర్లక్ష్యంగా వుండి, మానవునికి హానికరంగా ఉపయోగించబడవచ్చు. కానీ, శాస్త్రానికి ముఖ్యమైనది యేమిటంటే, అది కేవలం మానవ సమస్యలను అధ్యయనం చేయవలసిన అవసరాన్ని గుర్తించడం కాక, అలాంటి అధ్యయనానికి కావలసిన సూత్రాలనూ, పద్ధతులనూ కూడా రూపొందించాలి. యిది అన్నిటినీ మించి యీ ప్రశ్నను ఉత్పన్నం చేస్తుంది: సామాజిక శాస్త్రానికి తన అధ్యయన వస్తువైన మానవుణ్ని చారిత్రక సృజనాత్మకతయొక్క కర్తగా, అతని కార్యకలాపాలయొక్కా, అతని ఆంతరిక ఆత్మిక ప్రపంచంయొక్కా, అతని సుఖదుఃఖాలయొక్కా, అతని ఆశయాలయొక్కా, ఉద్రేకాలయొక్కా కర్తగా అంగీకరించడం సూత్రరీత్యా చేతనౌతుందా? బహుశా యివి కళకూ, సాహిత్యానికీ మాత్రమే వస్తువు కాదా? నిజంగా, సామాజిక శాస్త్రం మానవుని ఆంతరిక ప్రపంచాన్ని కేవలం ఆంతరిక ప్రపంచంగా చూడదు, అది దానిని అన్నిటినీ మించి మానవుని చర్యలలో వ్యక్తమైన బాహ్య రూపంలో, అధ్యయనం చేయగలదు, చేయాలి. కానీ, కార్యాచరణ అనే సూత్రానికి మరింత సాధారణమైన, తాత్వికమైన అర్థం కూడా వుంది. మానవుడు చింతనా జీవి కాదు, క్రియాత్మక జీవి. కార్యాచరణలోనే సామాజిక మానవుడు ప్రపంచాన్ని రూపాంతరీకరించేదీ, తనను తాను మార్చుకొనేదీ. మానవుని సారభూతమైన శక్తులు అతని కార్యాచరణలో వ్యక్తీకరింపబడుతాయి, ఫలవంతమౌతాయి. చరిత్రే మానవుడు మానవుని శ్రమద్వారా, అనగా తన సొంత కార్యాచరణద్వారా మానవుడుగా రూపొందడం అని మార్క్స్ అన్నాడు. కార్యాచరణతో సంబంధం లేకుండా చరిత్ర లేదు, సమాజం లేదు, మానవుడే లేడు. సామాజిక జీవితం సారభూతంగా ఆచరణాత్మక స్వభావం గలది. అందువల్లనే, మానవుడు తన కార్యాచరణద్వారా మాత్రమే కర్తగా పరిశీలింపబడగలడు. కార్యాచరణ సూత్రం సామాజిక పరిశోధనలో కీలకమైన తాత్విక ఆధారంగా పరిగణింపబడాలి.

మార్క్సిజంలో కార్యాచరణ సూత్రం భౌతికవాదంతోనూ, పరస్పరవాదంతోనూ సజీవంగా ముడివడివుంది. అనగా, ఒకటి, కార్యాచరణకే పరస్పరవాద భౌతికవాద వ్యాఖ్యానం యివ్వబడింది; రెండు, కార్యాచరణ సూత్రం సమాజంపట్ల జడాత్మక, చింతనాత్మక వైఖరిని అధిగమించడానికి తోడ్పడుతుంది, కార్యాచరణ కర్మను మాత్రమే కాక, కార్యాచరణ కర్తను కూడా అధ్యయనం చేయడానికి శాస్త్రాన్ని అభిముఖంగా చేస్తుంది, వాస్తవికతను రూపాంతరీకరించడానికీ, కర్తయొక్క సామాజిక కార్యశీలతను అభివృద్ధి చేయడానికీ శాస్త్రాన్ని పరికరంగా ఉపయోగించుకుంటుంది.

కార్యాచరణ అనేది, ప్రయోజనవాదులు నమ్ముతున్నట్లు, కేవలం మానవుని సద్యోజనిత శక్తియొక్క వ్యక్తీకరణ కాదు; అది సామాజిక మానవునికీ, భౌతిక ప్రపంచానికీ మధ్య

జరిగే భౌతిక చర్యా ప్రతిచర్యలు; దానిలో ప్రకృతీ, సమాజమూ రెండూ వున్నాయి. మానవుని భౌతిక కార్యాచరణ క్రమంలో అతను వస్తువుమీద ఆచరిస్తాడు, తాను ముందుగా పెట్టుకొన్న లక్ష్యాలనుబట్టి దానిని రూపుదిద్దుతాడు. అందుకనే కార్యాచరణ అనేది యిటు మానవుని లక్ష్యాన్నీ, ఆశయాన్నీ, జ్ఞానాన్నీ, అటు భౌతిక ప్రపంచాన్నీ ఒక చోట చేర్చడం, అనగా భావాత్మకమైనదానినీ, భౌతికమైనదానినీ ఒకచోట చేర్చడం. కార్యాచరణ, సామాజిక మానవుని ఆచరణ, ఆ రెండిటి ఐక్యతకు సాకార రూపం. వస్తువు మానవుని లక్ష్యాల సంబంధంతో మారుతుంది, రూపాంతరం చెందుతుంది; కాగా అతని లక్ష్యాలూ, ఆశయాలూ, జ్ఞానమూ అతని కార్యాచరణలోనూ, దాని ఫలితాలలోనూ రూపం ధరిస్తాయి.

సామాజిక పరిశోధనలో కార్యాచరణ సూత్రానికి మరొక ప్రాముఖ్యం కూడా వుంది; యేమిటంటే, సమాజంలో పదార్థమూ, చైతన్యం — అనగా భౌతికమైనదీ, భావాత్మకమైనదీ — ఒకదానికొకటి ప్రతిగా పెట్టడంలో పరిమితులను నిర్వచించడానికీ, దాని సాపేక్ష స్వభావాన్ని అర్థం చేసుకోడానికీ కార్యాచరణ సూత్రం తోడ్పడుతుంది. యేది మొదట వచ్చేది, సమాజంలో యేది ప్రథమం, యేది ద్వితీయం, అనేదాన్ని నిర్ణయించవలసిన అవసర మున్నప్పుడల్లా యీ పోటీ తప్పనిసరి అవుతుంది. యీ ప్రశ్నకు జవాబు చెప్తే తప్ప శాస్త్రీయమైన సామాజిక సిద్ధాంతాన్ని సృష్టించడం అసాధ్యమని మనం గుర్తుపెట్టుకోవాలి. కానీ, యీ ప్రశ్నయొక్క చట్రానికి వెలుపల భౌతికమైనదానికీ, భావాత్మకమైనదానికీ మధ్య గల పోటీ సాపేక్షమైనది, యెందుకంటే వాటి మధ్య విడదీయరాని ఐక్యత వుంది. అందువల్లనే, యీ ఐక్యతకు సాకార రూపమిచ్చే కార్యాచరణ చైతన్యానికీ, పదార్థానికీ మధ్య పరమమైన పోటీ వుందనడాన్ని అర్థరహితం చేస్తుంది.

కార్యాచరణ సూత్రాన్ని పరిగణించేటప్పుడు, యిటు కార్యాచరణకూ, అటు సామాజిక చారిత్రక క్రమంయొక్క వస్తుగత పరిస్థితులకూ, నియమాలకూ మధ్య గల సంబంధాన్ని ఉపేక్షించడం అసాధ్యం. మార్క్సిస్టు సామాజిక సిద్ధాంతంలో పరస్పర వ్యతిరేకంగా కనపడే రెండు సూత్రాలు వున్నాయి: ఒకటీ, చారిత్రక క్రమం మానవ కార్యాచరణయొక్క ఫలితం అనేది; రెండు, సమాజ జీవితమూ, అభివృద్ధి మనుషుల సంకల్పంమీదా, చైతన్యంమీదా, కార్యాచరణమీదా ఆధారపడని వస్తుగత నియమాలచేత పాలింపబడుతాయనేది. చరిత్ర మానవులచేత నిర్మింపబడితే, వాళ్ల కార్యాచరణ సృజనాత్మకమైతే, మానవులు చరిత్రను భిన్న మార్గాలలో నిర్మించగలరనీ, తాము కోరిన దిశలో దానిని తిప్పగలరనీ యేర్పడుతుందట. జర్మనీలో ఫాసిజం విజయం అనివార్యమా? ఘటనలు మరొక మార్గం పట్టివుండజాలవా? యెంతైనా, ఫ్రాన్సులో ఫాసిస్టు వ్యవస్థను నెలకొల్పడానికి ప్రయత్నాలు జరిగినప్పటికీ, యుద్ధానికి ముందు అక్కడ అది జయించలేకపోయింది. చైనాలో మావో "సాంస్కృతిక విప్లవం"

అనివార్యమా? యెంతైనా, చైనా అలాంటి అరాజకత్వంలోనూ, అవ్యవస్థలోనూ మునిగి పోకుండా అరికట్టగల శక్తులు దేశంలో వుండినాయి. అనగా, ప్రతి నిర్దిష్ట సందర్భంలోనూ ఘటనలు మరొక మార్గం పట్టివుండవచ్చు. ప్రతిదీ మానవులమీదా, వాళ్ల అభిప్రాయాల మీదా, ఆశయాలమీదా, కార్యాచరణమీదా, బలంమీదా ఆధారపడింది. కానీ, ఘటనల యీ మార్గం సహజమనీ, నియమబద్ధమనీ గుర్తిస్తే, మానవుల కార్యాచరణకూ, వాళ్ల చొరవకూ యేమీ విలువ లేనట్లు కనపడుతుంది. చరిత్రలో వస్తుగత నియమాలను గుర్తించడమంటే, కార్యాచరణకు స్వతస్సిద్ధమైన ప్రాముఖ్యం యేమీ లేదనడం కాదా? అసలు కార్యాచరణ సూత్రం వస్తుగత నియమాల చర్యచేత చరిత్ర గతి పాలింపబడుతుందనే గుర్తింపుతో పొసగుతుందా?

యిది అనేక మేధావులను తికమకపరచినట్లు సామాజిక శాస్త్ర చరిత్ర తెలుపుతుంది. వాళ్లందరూ రెండిటిలో యేదో ఒక పార్శ్వానికి ప్రాముఖ్యం యిచ్చినారు. చరిత్ర విధి నిర్ణయం లాగ అనివార్యమైన మార్గంలో నడుస్తుందనీ, మానవులు తమ యిచ్ఛ ప్రకారం వ్యవహరిస్తున్నామని ఊహిస్తారు గానీ, దుర్వారమైన అవశ్యకత (లేదా విధి, లేదా యేదో అతీత శక్తి) వాళ్లమీద రుద్దినదానిని మాత్రమే చేస్తారనీ కొందరు నమ్మినారు. తద్భిన్నంగా యితరులు కార్యాచరణను ప్రాథమికంగా యెంచి, చారిత్రక నియమాల నన్నిటినీ నిరాకరించినారు.

మరి, సత్యం యెక్కడుంది? యీ రెండు సూత్రాలూ క్రియలో ఒకదాని నొకటి నిషేధిస్తాయా, లేక ఒకదానితో ఒకటి పొసగుతాయా? అవి పరస్పరం పొసగుతాయనీ, అవశ్యంగా కూడా అనీ తేలింది. ప్రతిదీ అనివార్యమని ప్రకటించి, మానవుణ్ని కీలుబొమ్మగా మార్చే విధి నిర్ణయవాద దృక్పథం గానీ, ఐచ్ఛికవాద, ఆత్మగతవాద దృక్పథం గానీ చారిత్రక వాస్తవికతను తెలుసుకోడానికి అవసరమైన ప్రాతిపదికను సృష్టించదు. యాదృచ్ఛికతను చారిత్రకంగా అనివార్యమైనదిగా చేయడంద్వారా విధినిర్ణయవాదం (fatalism) శుద్ధ అసంబద్ధ మౌతుంది. చరిత్ర గతిని కేవలం మానవుల స్వేచ్ఛాయుత సృజనాత్మక కృషియొక్క, స్వేచ్ఛాయుత సంకల్పంయొక్క, లక్ష్యాల స్వేచ్ఛాయుత వరణంయొక్క ఫలితంగా యెంచే ఐచ్ఛికవాదం (voluntarism) అనేక ప్రశ్నలకు జవాబు చెప్పలేని స్థితిలో వుంది. చరిత్రలో మానవుల కార్యకలాపాలు ఆ మానవులే పెట్టుకొన్న లక్ష్యానికి భిన్నమైన ఫలితాన్ని యివ్వడం అనే మౌలిక వాస్తవాన్ని అది యెలా వివరిస్తుంది? మానవులు మంచి చేయాలనుకుంటారు, కానీ అప్పుడప్పుడు చెడ్డ చేస్తారు. సదుద్దేశాలతో నరకానికి బాట నిర్మించబడుతుంది అనే పాత లోకోక్తి వెనుక చాలా చరిత్ర వుంది. కార్యాచరణయొక్క లక్ష్యాలకూ ఫలితాలకూ మధ్య వున్న అంతరం తెలియజేసేదేమిటంటే, మానవుని అదుపులో లేని శక్తులు చరిత్రలో పనిచేస్తున్నాయనీ, అతని కార్యాచరణ ఫలితాలను అంతిమంగా అవి నిర్ణయిస్తాయనీ. సమాజానికి వెలుపల వున్న పరిసరాలలోనే కాక, సమాజం లోపలే కూడా వస్తుగత నియమాలు

వున్నాయి. కానీ, మానవుల కార్యాచరణ దాని సృజనాత్మక స్వభావాన్ని కోల్పోకుండా, సామాజిక అభివృద్ధి నియమాలకు కట్టుబడివుండాలంటే, జడవాదాత్మక ఆలోచనా ధోరణియొక్క యేక ముఖత్వాన్ని అధిగమించడానికి తోడ్పడే పరస్పరవాదం అవసరమౌతుంది.

మానవుల ప్రతి కొత్త తరమూ జీవితంలో ప్రవేశించినప్పుడు, దానికంటె ముందు సృష్టింపబడిన సామాజిక పరిస్థితులు వుంటాయి. అది ఆ పరిస్థితుల ప్రాతిపదికమీద వ్యవహరించాలి, వాటిని పునరుత్పత్తి చేస్తూ గానీ, మారుస్తూ గానీ. యీ పరిస్థితులు యేదో ఒక రకం కార్యాచరణకు నిర్దిష్టమైన అవకాశాలను సృష్టిస్తాయి. యీ పరిస్థితులమీద ఆధారపడుతాయి యీ కార్యాచరణయొక్క భౌతిక, ఆత్మిక సాధనాలు. ముందు సాధింపబడిన అభివృద్ధి స్థాయిలో కొన్ని సామాజిక సమస్యలు వుంటాయి, వాటిని మానవులు గుర్తించి, వాటి పరిష్కారాన్ని తమ లక్ష్యంగా పెట్టుకుంటారు. అందుకనే, కార్యాచరణ యే వస్తుగత పరిస్థితులలో నిర్వహించబడుతుందో వాటినుండి అది వేరుచేయబడజాలదు. యీ వస్తుగత పరిస్థితుల ఉనికి మానవుని కార్యాచరణయొక్క ప్రాముఖ్యాన్ని గానీ, స్వాతంత్ర్యాన్ని గానీ యే విధంగానూ తగ్గించదు సరి కదా, పైగా, మానవుని కార్యాచరణను యింకా బాగా అర్థం చేసుకోడానికి తోడ్పడుతుంది. చారిత్రక దశలు గొలుసుగా యేర్పడడం కూడా సామాజిక మార్పుల్లో వున్న ప్రబలమైన ధోరణులకు, అనగా చారిత్రక పురోగతిని పాలిస్తూ, చారిత్రక వాస్తవికతలోని ఒక ముఖ్య పార్శ్వాన్ని వ్యక్తం చేసే నియమాలకు, నిదర్శనంగా వుంది. వస్తుగత సామాజిక నియమాలకూ, మానవ కార్యాచరణకూ మధ్య గల సంబంధం యేమిటనే ప్రశ్నపట్ల సార్వత్రిక సిద్ధాంత వైఖరిలో యీకింది అంశాలు వున్నాయి. ఒకటి, మానవ కార్యాచరణ చారిత్రక క్రమంగా యేర్పడే ఘటనలయొక్క వస్తుగతంగా అవశ్యమైన అను క్రమం లోపల జరుగుతుంది. మానవులు తమ జీవితానికి కావలసిన ప్రతిదాన్నీ ఉత్పత్తి చేస్తారు, తమ పనిముట్లను మెరుగుపరుస్తారు, తామే పెట్టుకున్న లక్ష్యాలను సాధిస్తారు, మేలైన జీవిత పరిస్థితుల కొరకు పోరాడుతారు, యింకా యిలాంటివి చేస్తూ, తద్వారా తమ సొంత సామాజిక జీవితాన్ని సృష్టిస్తారు. సామాజిక జీవితమంటే నిత్యం సాగే ఆచరణ. మానవుల ఆచరణాత్మక కార్యకలాపాలకు వెలుపల సామాజిక అభివృద్ధి నియమాలు వుండడమనే వూసే లేదు. కానీ, చరిత్రయొక్క పరస్పరవాదాత్మకత యెలాంటిదంటే, పరిస్థితుల ఒత్తిడివల్లనే మానవులు పరిస్థితులను మారుస్తారు; సామాజిక అభివృద్ధి నియమాలు మానవుల ఆచ రణాత్మక కార్యకలాపాలలో మాత్రమే వ్యక్తమౌతున్నప్పటికీ, అవి యీ కార్యకలాపాల సారాన్నీ, మార్గాన్నీ నిర్ణయిస్తాయి. ప్రపంచమంతటా సోషలిజం విజయం అనివార్యం. ఆధునిక యుగం లోని సామాజిక అభివృద్ధి నియమాలచేత యిది నిర్ణయింపబడింది. కానీ, యీ విజయం కోటానుకోట్లమంది మానవుల కార్యకలాపాలద్వారా మాత్రమే, పాత సమాజాన్ని వెను

కేసుకవచ్చేవాళ్ల ప్రతిఘటనను అధిగమించే పురోగామి సామాజిక శక్తుల నిస్వార్థ పోరాటం ద్వారా మాత్రమే సాధింపబడగలదు.

రెండు, యీ నియమాలు చారిత్రక క్రమంయొక్క సాధారణ రేఖలను మాత్రమే నిర్ణయిస్తాయి; కాగా, చరిత్రయొక్క నిర్దిష్ట మార్గాన్నీ, ప్రతి బిందువువద్దా యీ క్రమంయొక్క సవివరమైన "రంగవల్లి"నీ, అభివృద్ధియొక్క రూపాలనూ, వేగాన్నీ మరింత నిర్దిష్టమైన అంశాలు, మానవుల సృజనాత్మక చొరవతో సహా, నిర్ణయిస్తాయి. సమాజం వస్తుగత నియమాలనుబట్టి అభివృద్ధి చెందుతుంది; మానవులు తమ చర్యలలో నిశ్చితమైన భౌతిక పరిస్థితులచేత పరిమితపరచబడుతారు. కానీ వస్తుగత ఆవశ్యకత అనే చట్రం లోపల — యీ చట్రం బాగా విశాలమైనది — భిన్న నిర్ణయాలు చేయడానికి మానవులకు స్వేచ్ఛ వుంది, తమ ప్రయోజనాలనుబట్టీ, వస్తుగత పరిస్థితులను గురించి తమకున్న అవగాహననుబట్టీ, తమ కార్యకలాపాల నిర్దిష్ట పరిస్థితులనుబట్టీ, వగైరాలనుబట్టీ అత్యంత వివిధమైన చొరవను ప్రదర్శించడానికి మానవులకు స్వేచ్ఛ వుంది. మానవ చర్యలను యాంత్రిక నిర్ణాయకవాదం (mechanical determinism) దృష్ట్యా చూడకూడదు; యెందుకంటే, మానవుడు యాంత్రిక కణం కాదు, అతని చర్యలు యాంత్రిక వస్తువుయొక్క బాహ్య ప్రేరిత గమనంతో సమానమైనవి కావు. యెంతైనా, ఒకే సామాజికార్థిక వ్యవస్థలు గల అన్ని దేశాలలోనూ ఒకే నియమాలు పనిచేస్తున్నప్పటికీ, ప్రతి జాతికీ దాని సొంత నిర్దిష్ట చరిత్ర వుంది. అందుకనే, సామాజిక అభివృద్ధికి చెందిన వస్తుగత నియమాల గుర్తింపుకూ, సమాజంలో మానవ కార్యాచరణయొక్క సృజనాత్మక స్వభావానికీ వైరుధ్యం వుందనడం తప్పు. యీ కార్యాచరణ సామాజిక అభివృద్ధి వెనుక వున్న చోదక శక్తి, యిది నిజమైన అర్థంలో చరిత్రను సృష్టిస్తుంది, దాని నిర్దిష్ట వైవిధ్యంతోనూ.

కనుక, మానవులు తమ చరిత్రను తామే నిర్మిస్తారు, కానీ యిష్టం వచ్చినట్లుగా కాదు. వాళ్లు వస్తుగత పరిస్థితులను బట్టీ, సామాజిక నియమాలను బట్టీ చరిత్రను నిర్మిస్తారు. యివి నిస్సంశయంగా వున్నాయి, కానీ విధి నిర్ణయం లాగ పనిచేయవు; యెందుకంటే, యివి కార్యాచరణలో, భిన్న సామాజిక శక్తుల ఘర్షణలో వ్యక్తమౌతాయి, యే అర్థంలోనూ చరిత్ర నిర్దిష్ట మార్గాన్ని విధించవు.

లెనిన్ యీ భావాన్ని గట్టిగా నొక్కిచెప్పినాడు: "మార్క్సిజం సకల యితర సోషలిస్టు సిద్ధాంతాల కంటె ఒక గమనీయమైన విషయంలో భిన్నమైనది. యే విషయంలో నంటే, అది సంపూర్ణ శాస్త్రీయ చిత్తస్పష్టతతో వస్తుగత స్థితినీ, వస్తుగత పరిణామ గతినీ పరిశీలిస్తుంది, అదే సమయంలో జనాల — అలాగే, సహజంగానే, యేదో ఒక వర్గంతో సంపర్కాన్ని ఆవిష్కరించి, నెలకొల్పుకోగల ఫలానా వ్యక్తుల, బృందాల, సంస్థల, పార్టీల — విప్లవ

శక్తియొక్కా, విప్లవ సృజనాత్మక మేధయొక్కా, విప్లవ చొరవయొక్కా ప్రాముఖ్యాన్ని అత్యంత స్పష్టంగా గుర్తిస్తుంది.'' *

వాస్తవికతపట్ల స్వస్థచిత్తపు, వాస్తవిక వైఖరి వామపక్ష దుందుడుకువాద చర్యలకంటె భిన్నమైనది. జనాల సృజనాత్మక చొరవయొక్కా, ఉదాత్త ఆశయాలయొక్కా, విప్లవ శక్తియొక్కా పాత్రను గుర్తించడం అవకాశవాద పద్ధతిలో పరిస్థితులకు అనుగుణంగా మారడంకంటె భిన్నమైనది.

చరిత్రపట్ల పరస్పరవాద భౌతికవాద వైఖరి స్వస్థచిత్తపు వాస్తవికతయొక్కా, విప్లవ లక్ష్యశుద్ధియొక్కా సమ్మేళనం.

యీ వైఖరికి, ఒకవైపున, మారుతున్న చారిత్రక సన్నివేశానికి అనుగుణంగా వుండేటట్లు సిద్ధాంతాన్ని నిత్యం అభివృద్ధి చేయడం అవసరం; మరొక వైపున, సామాజిక అభివృద్ధికి చెందిన శాస్త్రీయ సిద్ధాంతంమీద కొత్త దాడులు చేయడానికి చరిత్రయొక్క ప్రతి కొత్త వంకరటింకరనూ, ప్రజ్ఞాన పురోగతిలోని ప్రతి కష్టాన్నీ ఉపయోగించుకొనే మార్క్సిజంయొక్క శత్రువు లందరిమీదా సడలుబాటు లేని పోరాటం అవసరం. చరిత్రపట్ల ఆ వైఖరినే సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ యెల్లప్పుడూ అవలంబించింది. యెందుకంటే, అది మార్క్సిస్టు లెనినిస్టు శాస్త్రంచేత నడిపించబడడం మాత్రమే కాక, దానిని ముందుకు తీసుకపోవడానికి తనకు చేతనైనంతా చేస్తున్నది.

---

*V. I. Lenin, *Collected Works*, Vol. 13, పుట 36.

ప్రకరణం మూడు

సామాజిక వ్యవస్థలు

సామాజిక వ్యవస్థగా సామాజికార్థిక నిర్మాణరూపం

సమాజం మనుషులతో యేర్పడుతుంది గనుక, సమాజ అధ్యయనాన్ని వ్యక్తితో ప్రారంభించడం సహజంగా కనపడవచ్చు. కానీ, దానివల్ల అంత ఉపయోగం లేదు; సమాజంతో మానవునికి గల సంబంధాల వెలుపల మానవుణ్ణి గురించి విలువైన సమాచార మేమీ దానిద్వారా లభించదు; యెందుకంటే, మానవుడే యీ సమాజంచేత రూపుదిద్దబడినాడు. అంతే కాక, సమాజ మనేది కేవలం వ్యక్తుల సముదాయం కాదు, అది సంకీర్ణమైన క్రియాశీల వ్యవస్థ. మనుషులు పుట్టుతారు, జీవిస్తారు, చస్తారు; కానీ, ఒక వ్యవస్థగా సమాజం కొనసాగుతుంది.

యీ వ్యవస్థయొక్క స్వభావం యేమిటి? యే సూత్రాలనుబట్టి దీని అంశాలను వెల్లడించాలి? యెంతైనా చరిత్రలో భిన్న నిర్మాణరూపాలు వున్నాయి: గణ నిర్మాణరూపాలూ, జాతి నిర్మాణరూపాలూ, ప్రాంతీయ నిర్మాణరూపాలూ, మొదలైనవి. కొందరు పాశ్చాత్య సంస్కృతీ, ప్రాచ్య సంస్కృతీ లాంటి సంస్కృతికీ, మరి కొందరు క్రైస్తవ మతం, క్రైస్తవేతర మతం, వగైరా మతానికీ చెందిన విశిష్ట గుణాల ప్రాతిపదికమీద సామాజిక జీవితాన్ని పరిశీలించినారు. కానీ, సమాజం జీవగత వ్యవస్థ గానీ, సాంస్కృతిక వ్యవస్థ గానీ కాదు, అది <u>సామాజిక</u> వ్యవస్థ.

కనుక, మేము సమాజాన్ని సామాజిక వ్యవస్థగా వర్ణించడంతో ప్రారంభించి, దాని నిర్మాణాన్నీ, అది యే నియమాల ప్రకారం పనిచేస్తుందో, అభివృద్ధి చెందుతుందో ఆ నియమాలను విశదపరచే కర్తవ్యాన్ని పెట్టుకుంటాం.

మనం సమాజాన్ని దరహంమీద పరిగణించడం కొనసాగించినంత కాలం చరిత్రను గురించిన శాస్త్రీయ, వస్తుగత పరిశీలన వద్దకు పోలేమని సులభంగా అర్థమౌతుంది; యెందుకంటే, ప్రాచీన రోమన్ బానిస యజమాన సామ్రాజ్యమూ, 14వ లూయీ కింది ఫ్యూడల్ ఫ్రాన్సూ, పెట్టుబడిదారీ అమెరికా సంయుక్త రాష్ట్రాలూ, సోషలిస్టు సోవియట్ యూనియనూ లాంటి నిజమైన, నిర్దిష్టమైన సమాజాల అనుక్రమం గురించి చరిత్ర మనకు తెలుపుతుంది. యీ సమాజాల చరిత్రను గురించి శాస్త్రీయమైన జ్ఞానం కావాలంటే, చారిత్రక ఘటనల వెల్లువలో యేది యీ సమాజాలలో ఒక దానికంటె మరొకదానిని భిన్నమైనదిగా చేసేదీ తెలుసుకోవడం అవసరం. లేకపోతే సిద్ధాంతం వాటి విలక్షణత్వాన్ని నిరూపించజాలదు, అనగా వాస్తవికతను అర్థం చేసుకోడానికి మనకు తోడ్పడదు.

మార్క్సిస్టు శాస్త్రంచేత రూపొందించబడి, చారిత్రకంగా నిర్దిష్టమైన సమాజాలను సామాజిక వ్యవస్థగా వర్ణించడానికి తోడ్పడే యిలాంటి మౌలిక భావం యేమిటంటే, సామాజికార్థిక నిర్మాణరూపం అనే ధాతువు.*

ఒకవైపున, కాలక్రమాన ఆటవిక దశనుండి ఆధునిక నాగరికతకు జరిగిన మానవుని ఆరోహణ క్రమంగానూ, మరొక వైపున, స్థలంలో వ్యాపించిన ఆయా దేశాలయొక్క, ప్రాంతీయ సంఘాల ప్రజానీకాలయొక్క, రాజ్యాలయొక్క చరిత్రల సముదాయంగానూ చూడబడే ప్రపంచ చరిత్రను గురించిన సిద్ధాంత అవగాహన ఒక విధంగా క్రోడీకరించే ధాతువు సామాజిక నిర్మాణరూపం అనేది.

''సామాజికార్థిక నిర్మాణరూపం'' అనేది సమాజం గురించి నిర్దిష్టమైన యే జ్ఞానాన్నీ యింకా యివ్వని భావ మనేమాట నిజమే; కానీ, దాని శాస్త్రీయ అధ్యయనాన్ని ప్రారంభించడానికి అది తోడ్పడుతుంది. ఉదాహరణకు, ''ఫ్యూడల్ సమాజం,'' లేక ''ఫ్యూడల్ నిర్మాణరూపం'' అనే భావాన్ని ఉపయోగిస్తే, అది చరిత్రను సాధారణీకరణ ప్రాతిపదికమీద చరిత్ర గతిలో చారిత్రకంగా నిశ్చితమైన ఒక దశను, మునుపటి (బానిస యజమాన) దశకంటె, తదనంతరపు (పెట్టుబడిదారీ) దశకంటె భిన్నమైన ఒక సమాజ స్థితిని, గుర్తుపట్టడానికీ శాస్త్రానికి తోడ్పడుతుంది. ప్రతి నిర్మాణరూపమూ ఒక సామాజిక వ్యవస్థ, అనగా గుణాత్మకంగా నిర్దిష్టమై సాపేక్షంగా స్థిరమైన నిర్మాణం.

---

*యికముందు ''సామాజిక నిర్మాణరూపం'' అని గానీ, కేవలం ''నిర్మాణరూపం'' అని గానీ, అనబడుతుంది. — సం.

కానీ, ప్రాచీన రోమ్ ఒక్కటే కాదు బానిస యజమాన సమాజం; ఏథెన్స్, స్పార్టా, కార్తేజి కూడా వుండినాయి. ఫ్రాన్సు ఒక్కటే కాదు ఫ్యూడల్ సమాజం; రష్యా, చైనా, జర్మనీ, తదితర దేశాలు కూడా వుండినాయి. సంయుక్త రాష్ట్రాలు ఒక్కటే కాదు పెట్టుబడిదారీ సమాజం; ఆధునిక ఫ్రాన్సు, ఇటలీ, జపాన్, తదితర దేశాలు కూడా వున్నాయి. ''నిర్మాణరూపం'' అనేది ఒకే చారిత్రక అభివృద్ధి దశలో వున్న వివిధ దేశాలలోని సారభూతంగా సార్వత్రికమైన, విలక్షణమైన పార్శ్వాలను వెల్లడించే భావం — వాటి చరిత్రలోని వ్యష్టి విశిష్ట లక్షణాలకింద వున్న సార్వత్రిక లక్షణాన్ని వెల్లడించే భావం. యీ సార్వత్రిక, సారభూత లక్షణం వెల్లడించబడిన తర్వాత, పునరావృత్తి అనే సాధారణ శాస్త్రీయ గీటురాయిని చరిత్రకు అన్వయించడమూ, నిర్దిష్ట సామాజిక వ్యవస్థ చట్రం లోపల నిర్దిష్ట చారిత్రక అభివృద్ధి దశలో పనిచేసే నియమాలను తెలుసుకోడానికి ప్రయత్నించడమూ సాధ్య మౌతాయి. యెందుకంటే, పునరావృత్తి వుండడం వస్తువులోపల కొన్ని నియమాలు వుండడానికీ, పని చేయడానికీ సూచన.

మార్క్స్ ప్రధాన రచన అయిన ''పెట్టుబడి'' ఒక సామాజిక నిర్మాణరూపం — పెట్టుబడిదారీ సామాజిక నిర్మాణరూపం యే ఆర్థిక, సామాజిక నియమాల ప్రకారం పని చేస్తుందో, అభివృద్ధి చెందుతుందో వాటిని పరిశీలిస్తుంది. మార్క్స్ తన సిద్ధాంత ప్రతి పాదనలకు బ్రిటిష్ జీవితంలోని వాస్తవాలను ఉపపత్తులుగా యిచ్చినాడు; యెందుకంటే, 19వ శతాబ్దిలో, యీ గ్రంథం రచింపబడినప్పుడు, బ్రిటన్ లాక్షణిక (classic) పెట్టుబడిదారీ దేశంగా వుండింది. కానీ, ఒక సామాజికార్థిక నిర్మాణరూపంగా పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క అభివృద్ధిలోని ధోరణులు, ఆయన ఆవిష్కరించినట్టివి, బ్రిటన్‌కు మాత్రమే కాక, పెట్టుబడిదారీ దశలోని యే దేశానికైనా వర్తిస్తాయి; యెందుకంటే, వస్తుగత నియమాలు యేదో ఒక దేశానికి చెందిన నియమాలు కాక ఒక నిర్మాణరూపానికి చెందిన నియమాలు, అనగా సమాజంయొక్క చారిత్రకాభివృద్ధిలోని ఒక నిర్దిష్ట దశకు చెందిన నియమాలు.

భిన్న చారిత్రక పరిస్థితులలో జరిగే ఒకే విధమైన ఘటనలు పూర్తిగా భిన్నమైన ఫలితాలకు దారి తీయడం యెందుకంటే, నిర్మాణరూపాలలో భిన్నమైనవిగా వుంటాయి గనుక, వాటి నియమాలు భిన్నమైనవిగా వుంటాయి గనుక. యీకింది ఉదాహరణ చూడండి. ఒకే విధమైన రెండు క్రమాలను మార్క్స్ పోల్చినాడు: ప్రాచీన రోమ్‌లో భూమి గల రైతుల ఆస్తి హరణమూ, ఆదిమ పెట్టుబడిదారీ సంచయన కాలంలో భూమి గల రైతుల ఆస్తి హరణమూ. రెండు సందర్భాలలోనూ దీనిద్వారా నిరాస్తిపరవర్గం యేర్పడింది; అనగా, స్వేచ్ఛాయుతులుగా వుంటూ, ఉత్పత్తి సాధనాలు లేని జన బాహుళ్యం. కానీ, జ్ఞాపకం పెట్టుకోవలసింది యేమిటంటే, రోమన్ నిరాస్తిపరులు సమాజపు ఖర్చుమీద బతికే పనిలేని మూక కాగా,

పెట్టుబడిదారీ సమాజంలోని పారిశ్రామిక నిరాస్తిపరులు యెవరంటే, ఎవరి ఖర్చుమీద పాలకవర్గం ధనికులు అవుతారో ఆ శ్రమజీవులు.*

నిర్మాణరూపం అనే భావంయొక్క సారాన్నీ, అర్థాన్నీ నిర్ధరించడానికి మరొక ముఖ్యమైన విషయాన్ని పరిగణించాలి. ప్రతి నిర్దిష్ట సమాజమూ భిన్న సామాజిక విషయాల అస్తవ్యస్తపు కుప్ప కాదు; అది సునంబద్ధమైన వ్యవస్థ, దాని అంశాలు ఒకదానిమీద ఒకటి పనిచేస్తాయి, ఒకదానితో ఒకటి సజీవంగా లంకించబడి వుంటాయి.

అనేక బూర్జువా సామాజిక శాస్త్రజ్ఞులూ, చరిత్రకారులూ "అంశాల సిద్ధాంతా"న్ని అంగీకరిస్తారు. ఆర్థిక వ్యవస్థా, వ్యక్తీ, రాజ్యమూ, భౌగోళిక పరిస్థితులూ, భావాలూ, జనాభా పెరుగుదలా, మొదలైన భిన్న, సమాన అంశాల పరస్పర చర్యా ప్రతిచర్యల ఫలితమే చారిత్రక క్రమం అని యీ సిద్ధాంతం అంటుంది. "అంశాల సిద్ధాంతం"లోని లోపం యేమిటంటే, సామాజిక విషయాలన్నీ యే ప్రాతిపదికమీద పరస్పరం పనిచేసేదీ అది వెల్లడించదు, తత్ఫలితంగా సమాజం యీ అన్ని విషయాల యాంత్రిక సమూహంగా ప్రదర్శింపబడుతుంది. సమాజంలో వివిధ అంశాలు వుంటూ, పరస్పరం పనిచేస్తాయనే విషయాన్ని చారిత్రక భౌతికవాదం నిరాకరించదు; కానీ మిశ్రమ "అంశాల సిద్ధాంతా"నికి భిన్నంగా మార్క్సిజం సమాజాన్ని దాని ప్రతి అభివృద్ధి దశలోనూ అఖండమైన, యేకీకృతమైన "సామాజిక శరీరి"గా పరిగణిస్తుంది, దానిలో వివిధ సామాజిక విషయాలు అంతర్గతంగా పరస్పరం లంకించబడి వున్నాయనీ, పరస్పరం పనిచేసే శక్తులు సమానమైన ప్రాముఖ్యం గలవి కావనీ అంటుంది. చారిత్రక భౌతికవాదం పాదార్థిక వస్తువుల ఉత్పత్తి విధానాన్ని ప్రాతిపదికగా వెల్లడించి, ఆ ప్రాతిపదికమీద సామాజిక విషయాలన్నీ పరస్పరం పనిచేస్తాయనీ, అది సామాజికార్థిక నిర్మాణరూపానికి పాదార్థిక పునాది అనీ అంటుంది. (ముందుముందు యీ భావాన్ని యింకా వివరంగా చర్చిస్తాం.)

చివరి విషయంగా, సామాజికార్థిక నిర్మాణరూపం అనేది నిర్దిష్ట చారిత్రక సంబంధాల వ్యవస్థను మాత్రమే కాక, యీ సంబంధాలను పునరుత్పత్తి చేస్తూ, మారుస్తూ వుండే మానవుల సామాజిక కార్యాచరణను కూడా వర్ణించడానికి తోడ్పడే భావం. కార్యాచరణకు సంబంధించిన ఆశయాలూ, ప్రేరణలూ, అది జరిగే పరిస్థితులూ, అది యిచ్చే ఫలితాలూ నిర్దిష్ట పరిస్థితులచేత, అనగా, అంతిమంగా అది యే రకం సామాజికార్థిక నిర్మాణరూపం అనేదాని చేత, నిర్ణయింపబడుతాయి. ఫ్యూడల్ రైతు భూమిని సంపాయించాలనీ, క్విట్‌రెంటులనూ,

---

*చూ: K. Marx and F. Engels, *Selected Correspondence*, Moscow, 1965, పుటలు 312–13.

ఉచిత సేవలనూ తొలగించుకోవాలనీ కోరుతాడు; వేతన కార్మికుడు యెక్కువ వేతనం కొరకు పోరాడుతాడు; సోషలిస్టు సమాజంలోని కార్మికునికి తన స్వప్రయోజనాలలోనే కాక, నూతన సమాజ నిర్మాణంలో అందరికీ వున్న సమష్టి ప్రయోజనాలలో కూడా ఆసక్తి వుంటుంది. యీ ఆశయాలనూ, ప్రేరణలనూ, ప్రోత్సాహాలనూ, చర్యలనూ చారిత్రక నిర్మాణరూపాల సందర్భంలో చూస్తే తప్ప, వీటిలో గల భేదం అర్థం కాదు.

కనుక, సామాజికార్థిక నిర్మాణరూపం అనేది ఒక నిశ్చితమైన, చారిత్రకంగా నిర్దిష్టమైన సమాజం, నిర్దిష్ట ఉత్పత్తి విధానపు ప్రాతిపదికమీద సజీవంగా యేకమై, పరస్పరం పనిచేసే సామాజిక విషయాల, సంబంధాల వ్యవస్థగా యేర్పడి, తన సొంత విశిష్ట నియమాల ప్రకారం అభివృద్ధి చెందేది.

నిర్మాణరూపం అనేది అల్లకల్లోలంగా కనపడే సామాజిక జీవితాన్ని నియమ పాలితమైన సామాజిక వ్యవస్థల అనుక్రమంగా కుదించడానికి తోడ్పడే భావం. ఆ వ్యవస్థలు యేవంటే: చారిత్రకంగా మొదటి సామాజిక నిర్మాణరూపమైన ఆదిమ సమష్టి వ్యవస్థ, దాని తర్వాత బానిస యజమాన నిర్మాణరూపమూ, ఫ్యూడల్ నిర్మాణరూపమూ, యిప్పుడు దేనినుండి మానవజాతి కమ్యూనిస్టు సామాజిక నిర్మాణరూపానికి పరివర్తన చెందే క్రమంలో వుందో ఆ పెట్టుబడిదారీ నిర్మాణరూపం. ఆదిమ సమష్టి నిర్మాణరూపపు చట్రంలోపల మానవుడు ఆదిమ ఉత్పత్తి ప్రాతిపదికమీద రూపుదాల్చినాడు, నాగరికతాభివృద్ధికి కావలసిన పూర్వావసరాలు సృష్టింపబడినాయి. బానిస యజమాన, ఫ్యూడల్, పెట్టుబడిదారీ నిర్మాణ రూపాలు అంతర్వైరుధ్య పూరిత నిర్మాణరూపాలు, యెందుకంటే, అవి సొంత ఆస్తిమీద ఆధారపడినవి. వాటి సామాన్య ధర్మం యేమిటంటే, అవన్నీ ఆధిపత్యాన్నీ, పరాధీనతనూ కలిగిన సంబంధాలమీద ఆధారపడతాయి, వాటి విధ్వంసక అంతర్వైరుధ్యాలు వర్గపోరాటాన్నీ, యుద్ధాలనూ, విప్లవాలనూ కలుగజేస్తాయి.

కమ్యూనిస్టు నిర్మాణరూపం సమాజ అభివృద్ధిలో అత్యున్నత దశ; అది సహకారమూ, సామాజిక సమానత్వమూ అనే సంబంధాలమీద ఆధారపడింది; దానిలో వ్యక్తి వికాసమూ, మానవ జాతియొక్క పాదార్థిక, ఆత్మిక సంస్కృతీ వికాసమూ జరుగుతాయి.

సామాజికార్థిక నిర్మాణరూపం అనే భావంయొక్క ప్రాముఖ్యం యేమిటంటే, అది చరిత్రను మానవజాతి అభివృద్ధియొక్క యేకైక, నియమపాలిత క్రమంగా అధ్యయనం చేయడానికి వీలు కలిగిస్తుంది. యీ భావాన్ని రూపొందించడంద్వారా, ఒకటి, ఒక చారిత్రక దశను మరొక దానినుండి వేరుపరచడమూ, సమాజ చరిత్రలో గుణాత్మకంగా విలక్షితమైన దశలను, ప్రతిదీ విశిష్టమైన తన సొంత గమన నియమాలు గలవాటిని, నిర్ధరించడమూ, సామాజిక అభివృద్ధిని గురించిన శాస్త్రీయ అధ్యయనాన్ని ప్రారంభించడమూ సాధ్యమైనాయి. రెండు,

ఒకే సామాజిక అభివృద్ధి దశలోని భిన్న దేశాలలో మనకు కనపడే ఆస్తి రూపాలూ, ఉత్పత్తి సంబంధాలూ, దోపిడీ రూపాలూ, ప్రధాన వర్గాలూ లాంటి సాధారణ, పునరావర్తక అంశాలను వెల్లడించడమూ, సామాజిక జీవిత నియమాల గురించిన జ్ఞానాన్ని పొందడమూ సాధ్యమైనాయి. మూడు, ప్రతి నిర్దిష్ట కాలంలోనూ సామాజిక జీవితపు వివిధ విషయాల యేకత్వాన్నీ, వాటి పరస్పరవాదాత్మకమైన సంబంధాన్నీ వెల్లడించడమూ, యే పాదార్థిక ప్రాతిపదికమీద సామాజిక విషయాలన్నీ ఒకదానిమీద ఒకటి పని చేస్తాయో దానిని నిర్ధరించడమూ సాధ్యమైనాయి. చివరి విషయంగా, నిర్మాణరూపం అనే ధాతువు సామాజిక అభివృద్ధిని మనుషుల కార్యాచరణయొక్క ఫలితంగా చూడడానికి తోడ్పడింది; యెందుకంటే, అది వాళ్ల కార్యాచరణను చారిత్రకంగా నిర్దిష్టమైన సమాజంయొక్క పరిస్థితులతో లంకిస్తుంది. సామాజిక నిర్మాణరూపం అనే భావం చరిత్రను గురించిన భౌతికవాద దృక్పథానికి పునాది రాయి.

సామాజిక నిర్మాణరూపాల మధ్య సారభూతమైన, మౌలికం కూడా అయిన భేదాలు వుండడమంటే, అవన్నీ మానవజాతియొక్క చారిత్రక పురోగతిలో దశలనీ, ఆ నిర్మాణరూపాలకు విభేదాలతో పాటు సామాన్య లక్షణాలూ, సామ్యం గల క్రమాలూ వున్నాయనీ అనే విషయం అబద్ధం కాదు. ఉదాహరణకు, పారిశ్రామిక అభివృద్ధీ, శాస్త్ర, సాంకేతిక విప్లవమూ పెట్టుబడిదారీ వ్యవస్థలోనూ, సోషలిజంలోనూ రెండిటిలోనూ జరుగుతాయి. నిజమే, అవి గుణాత్మకంగా భిన్నమైన సామాజిక రూపాలు ధరించి, భిన్న సామాజిక ఫలితాలను కలిగిస్తాయి; కానీ, గ్రామీణ ప్రజానీకం పట్టణాలకు చేరడమూ, పట్టణీకరణా, శాస్త్రజ్ఞుల, యింజనీర్ల, సాంకేతికుల సంఖ్య పెరుగుదలా, శాస్త్రంయొక్క పాత్ర పెరుగుదలా, వగైరాల లాంటి కొన్ని సామాన్య అంశాలు కూడా వాటిలో వున్నాయి.

అంతే కాక, చారిత్రక అభివృద్ధి అసమంగా వున్నందున, అవే క్రమాలు భిన్న దేశాలలో భిన్న కాలాలలో జరుగుతాయి. కొన్ని దేశాలు ముందుకు పోతాయి, మరికొన్ని తమ చారిత్రక పురోగతిలో వెనుకబడుతాయి. అందుకనే ఒకే కాలంలో భిన్న అభివృద్ధి దశలలో వుంటూ, భిన్న నిర్మాణరూపాలకు చెందిన దేశాలు మనకు కనపడుతాయి; అవి సహజీవిస్తూ, పరస్పరం ప్రభావితం చేస్తాయి, పరస్పరం పనిచేస్తాయి; దీనికి కూడా వాటి అభివృద్ధిమీదా, వాటి అదృష్టాలమీదా విధిగా కొంత ప్రభావం వుంటుంది. నిర్మాణరూపం అనేది నిర్దిష్ట చరిత్ర అధ్యయనానికి పరికరంగా వుండే భావమనీ, కానీ అదే ఆ అధ్యయనం కాదనీ దీన్నిబట్టి కూడా తెలుస్తుంది.

సామాజిక నిర్మాణరూపం అనే భావంలో, క్రమపద్ధతియుత వైఖరి మొత్తంగా సమాజానికి అన్వయించబడుతుంది. కానీ, ఒక సామాజిక వ్యవస్థగా సమాజంలో అనేక భిన్న విషయాలు

వున్నాయి; వాటిలో ప్రతి కొకటీ, దాని పాలికి అది, ఒక వ్యవస్థగా పరిగణింపబడవచ్చు. అందువల్లనే సమాజంలో (నిర్మాణరూపంలో) అనేక ఉపవ్యవస్థలు వుంటాయి, వాటి మూలంగా సమాజంయొక్క సవివరమైన క్రమపద్ధతియుత పరిశీలన మహా జటిలమైన సమస్య అవుతుంది. కనుక, సామాజిక వ్యవస్థగా సమాజాన్ని మొత్తంగా పరిశీలించడంలో, అనేకంగా వున్న వివరాలనుండి వేరుపడి పోయి, వ్యవస్థయొక్క మౌలికమైన, అత్యంత ముఖ్యమైన, అత్యంత సాధారణమైన నిర్మాణగత అంశాలను వెల్లడించడం సహజం.

చారిత్రక క్రమాన్ని గురించిన సంపూర్ణ, సమగ్ర జ్ఞానం పొందడానికి, దానిని యేదో ఒక విధంగా ప్రభావితం చేసే విషయాల నన్నిటినీ పరిగణించడం అవసరమే. కానీ, వీటిలో కొన్ని యెక్కువ ప్రభావమూ, కొన్ని తక్కువ ప్రభావమూ కలిగిస్తాయి. అందుకనే, తన మొదటి రమారమి అంచనా వేయడంలో సాధారణ సిద్ధాంతానికి సామాజిక వ్యవస్థయొక్క, మొత్తంగా సమాజంయొక్క, చట్రంగా యేర్పడే సామాజిక జీవితపు ప్రధానమైన, సారభూతమైన విషయాల, అంశాల పరిశీలనకు మళ్లే హక్కు వుంది. యావత్ ప్రపంచ నిర్మాణపు పరిశీలన యే సామాజిక విషయాన్నైనా, క్రమాన్నైనా పరిశోధించడానికి కావలసిన మౌలిక పరిశీలన పద్ధతి (methodological) సూత్రాలను రూపొందించడానికి తోడ్పడుతుంది. కానీ, వాటి నిర్దిష్ట కారణాలను వివరించడంలో మనం దీనిని దాటి యింకా ముందుకు పోయి, పనిచేసే వివిధ అంశాలనూ, శక్తులనూ, కారణాలనూ, పరిస్థితులనూ అన్నిటినీ సాధ్యమైనంత పూర్తిగా పరిగణించాలి. సమాజంలో జరిగే ఘటనల సారాన్ని మరింత లోతుగా పరిశీలించడానికీ, సమాజం గురించి మనకున్న ప్రస్తుత జ్ఞానాన్ని పరమమైనదిగా, సంపూర్ణమైనదిగా, మార్పు లేనిదిగా పరిగణించకుండా వుండడానికీ యిది మనకు తోడ్పడుతుంది.

భిన్న సామాజిక నిర్మాణరూపాలకు నిర్మాణగత అంశాలు సాధారణమైనవీ, విశిష్టమైనవీ రెండూ వుంటాయి. సామాజికార్థిక నిర్మాణరూపాల కన్నిటికీ సార్వత్రికమైనవాటిని మొదట పరిశీలిద్దాం.

సామాజిక నిర్మాణ రూపంయొక్క పాదార్థిక, ఆర్థిక ప్రాతిపదిక అయిన ఉత్పత్తి విధానం

మానవ సమాజంలోని యేర్పాట్లు యేవైనప్పటికీ, దాని అభివృద్ధి దశ యేదైనప్పటికీ, దాని ఉనికికి ప్రాథమికమైన షరతు యేమిటంటే, ప్రకృతితో వస్తువుల మార్పిడి, తిండి, బట్ట, నివాసం, మొదలైన మానవుల పాదార్థిక అవసరాలు తీరడం. కానీ, మానవునికి బతికే

డానికి అవసరమైన భౌతిక వస్తువులన్నీ ప్రకృతిలో స్వతస్సిద్ధంగా లేవు; అతను వాటిని చేసుకోవాలి. దీనివలన, పరిస్థితులు యేవైనప్పటికీ, ఉత్పత్తి మానవ ఉనికికి ప్రాతిపదిక అవుతుంది, శాశ్వతమైన, సహజమైన అవసర మౌతుంది. కానీ, సమాజ జీవితంలో ఉత్పత్తియొక్క ప్రాముఖ్యం మానవులకు జీవనాధారాలు సమకూర్చడం మాత్రమే కాదు. మానవులు భౌతిక వస్తువులను ఉత్పత్తి చేయడంలో తమ జీవితపు నిర్మాణ మంతటినీ ఉత్పత్తి చేస్తారు, పునరుత్పత్తి చేస్తారు, ఉత్పత్తిలో వాళ్ళు సామాజిక జీవులుగా రూపుదిద్దబడుతారు, అనే శాస్త్రీయ ఆవిష్కరణను మార్క్సు, ఎంగెల్సు చేసినారు.

ఉత్పత్తి విధాన మనేది "యీ వ్యక్తుల కార్యాచరణయొక్క నిర్దిష్ట రూపం, వీళ్ల జీవితాన్ని వ్యక్తంచేసే నిర్దిష్ట రూపం, వీళ్ల నిర్దిష్ట జీవిత విధానం. వ్యక్తులు తమ జీవితాన్ని యెలా వ్యక్తం చేస్తారో అలాగే వుంటారు వాళ్ళు. కనుక, వాళ్ళు యేమిగా వున్నారనేది వాళ్ల ఉత్పత్తితో సమవసిస్తుంది – వాళ్ళ యేమి ఉత్పత్తి చేస్తారనేదానితోనూ, యెలా ఉత్పత్తి చేస్తారనేదానితోనూ. ఆవిధంగా, వ్యక్తుల స్వభావం వాళ్ల ఉత్పత్తిని నిర్ణయించే భౌతిక పరిస్థితులమీద ఆధారపడుతుంది."* అందుకనే, ప్రతి సామాజికార్థిక నిర్మాణరూపంయొక్క నిర్మాణమూ దానికి ఉచితమైన సామాజిక జీవితపు ఉత్పత్తి విధానంచేత నిర్ణయింపబడుతుంది.

శ్రమ క్రమంలో మానవులు ప్రకృతి పదార్థాన్ని మారుస్తారు, దానిని తమ అవసరాలు తీర్చే వస్తువులుగా మారుస్తారు. జంతువులకు భిన్నంగా వాళ్ళు తమకు బతకడానికి కావలసిన ప్రతిదానినీ చేసుకోవడంద్వారా తమ అవసరాలు తీర్చుకొంటారు. ప్రకృతితో మానవునికి గల సంబంధంలో మౌలికమైన మార్పును కలిగించి, అతనిని యితర జీవు లన్నిటికంటె భిన్నంగా చేసేది యీ విషయమే.

సకల రూపాల జీవుల జీవితానికీ బాహ్య ప్రకృతి కేవలం అవసరమైన పరిస్థితి మాత్రమే కాక, కీలకమైన పరిస్థితి కూడా అని మనకు తెలుసు. ప్రతి జీవీ తన పరిసరాలతో చేసే చర్యా ప్రతిచర్యలలో మాత్రమే జీవిస్తుంది. జీవపరిణామం అనేది తమ పరిసరాలలోని మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మలచుకొనే జీవుల నిర్మాణంలో వచ్చే మార్పులలో వ్యక్తమౌతుంది.

మానవ సమాజ అభివృద్ధి భిన్నమైనది. మానవుడు జంతు ప్రపంచంనుండి బయటపడడానికి ఉత్పత్తి తోడ్పడుతుంది. అతను పరిసర పరిస్థితులకు జడాత్మకంగా తన్ను తాను మలచుకోడు. అతను వాటిమీద పనిముట్లు ఉపయోగిస్తాడు, తన అవసరాలను బట్టి వాటిని రూపాంతరీకరించి, "రెండవ ప్రకృతిని" అనగా సంస్కృతిని సృష్టిస్తాడు, ఆ

---

*K. Marx and F. Engels, *The German Ideology* ("జర్మన్ భావజాలం"), Moscow, 1968, పుట 32.

ప్రాతిపదికమీద తన ఉనికియొక్క సామాజిక పరిస్థితులను రూపుదిద్దుతాడు. అందువల్లనే, జంతు ప్రపంచపు అభివృద్ధి జీవశాస్త్ర నియమాలచేత నిర్ణయింపబడగా, మానవ సమాజ అభివృద్ధి నిర్దిష్ట ఉత్పత్తి విధానంమీద ఆధారపడిన సామాజిక నియమాలచేత నిర్ణయించ బడుతుంది.

ఉత్పత్తి విధాన మనేది ఉత్పత్తిలోని రెండు విడదీయరాకుండా లంకించబడిన పార్శ్వాల యేకత్వం: ఉత్పాదక శక్తులూ, ఉత్పత్తి సంబంధాలూ. అవి మానవులలో రెండు రకాల సంబంధాలను వ్యక్తం చేస్తాయి: ప్రకృతితో వాళ్ల సంబంధాలనూ, వాళ్ల పరస్పర సంబంధా లనూ.

ఉత్పాదక శక్తులు ప్రకృతితో మనుషులకూ, సమాజానికీ గల సంబంధాలను వ్యక్తం చేస్తాయి; వాటి అభివృద్ధి స్థాయి ప్రకృతిమీద మనిషికి యే మేరకు ఆధిపత్యం వుండేదీ తెలుపుతుంది.

అత్యంత అభౌతికమైన మాటల్లో చెప్పాలంటే, ఉత్పత్తి అనేది శ్రమ క్రమం, అనగా ప్రకృతి వనరులను మానవుల అవసరాలకు మలచే లక్ష్యంతో మానవులు చేసే క్రియాత్మకమైన, బుద్ధిపూర్వకమైన, ప్రయోజనయుతమైన భౌతిక కార్యాచరణ. శ్రమ గ్రహీతలూ, శ్రమ సాధనాలూ, శ్రమా — యివి శ్రమ క్రమంలో సాధారణమైన, అవసరమైన అంశాలు, యివి లేకుండా శ్రమ జరగజాలదు. కానీ, యివి ఉత్పత్తిలో భిన్న పాత్రలు నిర్వహిస్తాయి. శ్రమ గ్రహీతలు జడంగా వుంటాయి. ఉత్పత్తి క్రమంలో యేదో ఒక పనికి గురి అవుతూ, మార్పుకు లోనయ్యే ప్రతిదీ శ్రమ గ్రహీతే. అది శ్రమ సాధనాల సాయంతో, మానవునికి అవసరమైన వస్తువుగా మార్చబడుతుంది. శ్రమ సాధనమంటే, "మనిషి తనకూ, శ్రమ గ్రహీతకూ మధ్య పెట్టేదీ, అతని ఆచరణకు వాహికగా పనిచేసేదీ అయిన వస్తువు, లేదా వస్తువుల సమాహారం."* శ్రమ సాధనాలలో చాలా రకాలు వున్నాయి — విద్యుత్ స్థావరాలూ, పారిశ్రామిక భవనాలూ, గోదాములూ, వార్తా, రవాణా సాధనాలూ, మొదలైనవి. కానీ, వాటిలో ముఖ్యమైనవి ఉత్పత్తి పరికరాలు, పనిముట్లు — శ్రమ గ్రహీతమీద పడే మానవుని ప్రభావంయొక్క సూటి వాహికలైన యంత్రాలూ, యంత్ర సాధనాలూ లాంటివి.

శ్రమ గ్రహీతలూ, శ్రమ సాధనాలూ కలిసి శ్రమ క్రమంలోని భౌతిక అంశాలౌతాయి. శ్రమ గ్రహీతలకు భిన్నంగా, ఉత్పత్తి సాధనాలు ఉత్పత్తిలో క్రియాత్మక పాత్ర నిర్వహిస్తాయి. కానీ, వాటి యీ పాత్ర యెంత గొప్పదైనప్పటికీ, సజీవ శ్రమతో, మానవ కార్యాచరణతో, కలిసి మాత్రమే అవి ఉపయోగించబడగలవు. ఉత్పత్తిలో మానవుడు నిర్ణయాత్మక పాత్ర

---

* K. Marx, *Capital*, ("పెట్టుబడి"), Vol. I, Moscow, 1959, పుట 179.

వహిస్తాడు. కనుక, శ్రమ క్రమంలోని క్రియాత్మక అంశాలే — అనగా శ్రమ సాధనాలూ, ఉత్పాదక నైపుణ్యాలనూ, జ్ఞానాన్నీ, అనుభవాన్నీ కలిగి, భౌతిక వస్తువుల ఉత్పత్తిని సాగించే మానవులూ — సమాజంయొక్క ఉత్పాదక శక్తులుగా యేర్పడేది.

శ్రమ సాధనాలకూ, శ్రమ గ్రహీతలకూ మధ్య గల భేదం సాపేక్షమైనది; యెందుకంటే, ఒకే వస్తువులు ఉత్పత్తిలో భిన్న ప్రయోజనాలకు ఉపయోగించబడవచ్చు. ఉదాహరణకు, భూమి పరికరాల, యంత్రాల సాయంతో సాగుచేయబడుతుంది గనుక, అది శ్రమ గ్రహీతగా కనపడుతుంది. కానీ, అది మానవునికి అవసరమైన మొక్కలను "ఉత్పత్తి చేసి," యీ మొక్కలమీద అతని ప్రభావానికి వాహికగా పనిచేసినప్పుడు, అది శ్రమ సాధనంగా, సమాజంయొక్క ఉత్పాదక శక్తిగా కూడా కనపడుతుంది. బొగ్గు, నూనె, వివిధ కృత్రిమ పదార్థాలూ, పెంపుడు జంతువులూ, మొదలైనవాటికి యిదే వర్తిస్తుంది; యివి ఉత్పత్తి క్రమంలో శ్రమ గ్రహీతలుగానూ, శ్రమ సాధనాలుగానూ పనిచేయవచ్చు.

కానీ, శ్రమ సాధనాలకూ, శ్రమ గ్రహీతలకూ మధ్య గల మౌలిక భేదాలను మనం చూడాలి. శ్రమ గ్రహీతలు ఉత్పత్తిలోని జడ వస్తువులు గనుక, అవి ప్రకృతితో సమాజానికి గల సంబంధంయొక్క గుణాన్ని వర్ణించవు, అవి మానవుడు ఉత్పత్తిలో ఉపయోగించే ప్రకృతియొక్క గుణాలను వర్ణిస్తాయి. ఉదాహరణకు, కొయ్యను ఆదిమ చేతి రంపంతోనూ కోయవచ్చు, విద్యుత్ రంపంతోనూ కోయవచ్చు, గోధుమను కొయ్య నాగలితో దున్నిన పొలంలోనూ, యంత్ర నాగలితో దున్నిన పొలంలోనూ పండించవచ్చు, వగైరా. ఉత్పత్తి క్రమంలో ప్రకృతితో మానవునికి గల సంబంధాలనూ, అతని శ్రమ ఉత్పాదకతనూ నిర్ణయించేది ఉత్పత్తి సాధనాలే.

ఉత్పత్తి పురోగతిలో కొత్త పదార్థాలను ఉపయోగించడం కూడా వుంటుంది; ప్రకృతి గుణాలను మరింత విస్తృత ప్రమాణంలో ఉపయోగించడానికి అవి మానవునికి వీలు కలిగిస్తాయి. కనుక, మానవుడు ఉపయోగించే పదార్థాలు కూడా ఉత్పాదక శక్తుల అభివృద్ధి స్థాయిని వర్ణిస్తా యనవచ్చు. ఆవిధంగా, పురాతత్వశాస్త్రజ్ఞులు రాతి యుగాన్నీ, కంచు యుగాన్నీ, యినప యుగాన్నీ వింగడించినారు; యిటీవలి వరకు దాదాపు యెక్కడా ఉపయోగించబడని అరుదైన లోహాలనూ, వివిధ కృత్రిమ వస్తువులనూ, మొదలైనవాటిని విస్తారంగా ఉపయోగించకుండా ఆధునిక సాంకేతిక విజ్ఞానాన్ని అభివృద్ధి చేయడం అసాధ్యం. కానీ, నొక్కిచెప్పవలసిన ముఖ్య విషయం యేమిటంటే, రాయీ, కంచూ, యినుమూ, అరుదైన లోహాలూ, ప్లాస్టిక్కులూ, యితర పదార్థాలూ శ్రమ సాధనాలుగా ఉత్పత్తిలో ప్రవేశిస్తేనే, అవి శ్రమ గ్రహీతలమీద పనిచేసేటట్లు ఉపయోగించబడితేనే, అవి ఉత్పాదక శక్తుల అభివృద్ధికి కొలత బద్దను సమకూరుస్తాయి, ఉత్పత్తిలో క్రియాత్మక పాత్ర నిర్వహిస్తాయి. తుపాకి మందు

యెలా కేవలం టపాకాయలలో ఉపయోగించినప్పుడు కాక, తుపాకులలో ఉపయోగించి నప్పుడు మాత్రమే యుద్ధ నిర్వహణ పద్ధతులలో విప్లవం తెచ్చిందో అలాంటిదే యిది.

కనుక, శ్రమ గ్రహీతలంటే, ప్రకృతిలో యే భాగం ఉత్పత్తితో సంబంధం కలిగి, రూపు మారుతుందో అదే. శ్రమ గ్రహీతలంటే, నిర్దిష్ట కాలంలో మానవుడు ఉత్పత్తిలో ఉపయోగించ గల ప్రకృతి గుణాల దస్తావేజు; కానీ, తదనుగుణమైన శ్రమ సాధనాలు వున్నప్పుడే యీ అవకాశం వాస్తవమౌతుంది.

ప్రతి చారిత్రక యుగంలోనూ మానవులు ప్రకృతిమీద తమ ఆచరణయొక్క వాహికలుగా భిన్న శ్రమ సాధనాలను ఉపయోగిస్తారు. యీనాడు ఉత్పత్తిలో వివిధ యంత్రాలూ, యంత్ర సాధనాలూ, విద్యుత్ స్థావరాలూ, రవాణా సాధనాలూ, పనిముట్లూ, ఆహారపదార్థాల నిలువ లాంటివాటికి అవసరమైన యితర సహాయక శ్రమ సాధనాలూ ఉపయోగబడుతున్నాయి.

వివిధ యుగాలలో ఉపయోగించబడే శ్రమ సాధనా లన్నిటినుండీ మార్క్స్ ప్రకృతి మీద మానవుని ఆచరణయొక్క వాహికలుగా పనిచేసే ఉత్పత్తి సాధనాలను, తద్వారా అతని శ్రమయొక్క ఉత్పాదక శక్తిని నిర్ణయించేవాటిని గురించి నొక్కి చెప్పతాడు. యివి సామాజిక ఉత్పత్తి క్రమాన్ని వర్ణించే పరికరాలు, దాని నిర్దిష్ట అభివృద్ధి స్థాయికి విలక్షణమైనట్టివి. మార్క్స్ అభిప్రాయం ప్రకారం యివి "ఉత్పత్తియొక్క యెముకలూ, కండరాలూ,"* ఉత్పత్తి స్థాయినీ, సమాజానికీ, ప్రకృతికీ మధ్య గల సంబంధాల స్థాయినీ తెలిపే నిశ్చితమైన సూచికలు. "భిన్న ఆర్థిక యుగాలను మనం వింగడించ గలిగేది యే వస్తువులు చేయబడినా యనేదానిచేత కాదు, అవి యెలా చేయబడినాయి, యే శ్రమ సాధనాలచేత చేయబడినాయి అనే వాటిచేత."**

ఉత్పాదక శక్తులకు చెందిన అంశాలుగా ప్రధానమైన ఉత్పత్తి పరికరాల నిర్ణయాత్మక ప్రాముఖ్యాన్ని మనం నొక్కిచెప్పడంలో దానిని అతిశయోక్తిగా చెప్పకూడదు. సామాజిక అభివృద్ధియొక్క నిమ్న దశలలో, మానవులు అత్యంత సరళమైన పరికరాలను ఉపయోగించినప్పుడు, ఉత్పత్తి అనేదే ఆదిమంగా వుండినప్పుడు, సాంకేతిక పురోగతి అంటే దాదాపు పూర్తిగా యీ శ్రమ పరికరాలలో జరిగే మార్పులే. 18వ శతాబ్దిలో బ్రిటన్‌లో ప్రారంభమైన పారిశ్రామిక విప్లవమంతా చేతి పనిముట్టు స్థానంలో యంత్రం రావడమే. యంత్రం పుట్టుకతో యింజను అవసరం యేర్పడింది. యిది ఆవిరి యింజను సృజనకు దారితీసింది. అది రవాణా సాధనాలలో విప్లవాత్మకమైన మార్పులను కలిగించింది, వగైరా. ఆధునిక ఉత్పత్తి మహా

---

* K. Marx, *Capital*, Vol. I, పుట 180.

** అదే చోట.

క్లిష్టమూ, వివిధమూ అయింది. దానిలో ప్రధానమైన శ్రమ పరికరాల వినియోగం ఉత్పత్తికి చెందిన అనేక యితర పార్శ్వాలతో ముడిపడి వుంది – వ్యవస్థీకరణ (organisation), సాంకేతిక విజ్ఞానం, శక్తి మూలం (power source) లాంటివాటితో. పరిస్థితులను బట్టి, ఉత్పత్తిలోని అత్యంత వివిధమైన విభాగాలు సాంకేతిక ప్రగతిలోని నిర్ణాయక అంశాలు కావచ్చు. ఉదాహరణకు, కన్వేయర్ బెల్టులను ప్రవేశపెట్టడంవల్ల విధిగా యంత్రాలలో మార్పులు చేయనక్కర లేదు, కానీ అది శ్రమ ఉత్పాదకతలో అపారమైన లాభం చేకూరుస్తుంది.

గత కొద్ది దశాబ్దాలలో, శాస్త్రీయ ఆవిష్కరణలూ, వాటి ఆచరణాత్మక ప్రయోగమూ ఉత్పాదక శక్తులకు కొత్త వూపు యిచ్చినాయి. అణుశక్తియొక్క శాంతియుత వినియోగాలూ, జెట్ యింజన్లూ, సెమీకండక్టర్లూ, సింతెటిక్ పదార్థాలూ, రేడియో యెలెక్ట్రానిక్సూ, యెలెక్ట్రానిక్ కంప్యూటర్లూ ఆధునిక ఉత్పత్తిలోని వివిధ పార్శ్వాలను విప్లవీకరించడానికి తోడ్పడడం మాత్రమే కాక, ఉత్పాదక శక్తులను గుణాత్మకంగా సరికొత్త స్థాయికి లేవనెత్తి, స్వయంచలిత ఉత్పత్తి అభివృద్ధికి భూమికనూ, పూర్వావసరాలనూ సృష్టించినాయి. ప్రస్తుత శాస్త్ర, సాంకేతిక విప్లవంలో ప్రధాన దిశ అయిన స్వయంచలిత ఉత్పత్తిని అభివృద్ధి చేయడంలో సైబెర్నెటిక్సూ, యెలెక్ట్రానిక్ కంప్యూటర్లూ నిర్ణాయక పాత్ర కాకపోయినా, చాలా ముఖ్యమైన పాత్ర నిర్వహిస్తాయి. యెలెక్ట్రానిక్ కంప్యూటర్లు శ్రమ గ్రహీతలమీద పని చేయడానికి మానవులు ఉపయోగించే కేవల యంత్రాలకంటె యెక్కువ అయినాయి; యెందుకంటే, అవి ఉత్పత్తి క్రమాల అజమాయిషీలో కొన్ని మేధాగత క్రియలను స్వీకరించి, "చేయియొక్క కొనసాగింపు" కాక, "మెదడుయొక్క కొనసాగింపు"గా వున్నాయి.

శ్రమ సాధనాలను మానవుని ప్రత్యక్ష కార్యాచరణపు ఫలితంగానూ, భౌతిక రూపం ధరించిన సంచిత అనుభవంగానూ, జ్ఞానంగానూ చూసినప్పుడు, అవి ప్రకృతితో చేసే పోరాటంలో మానవులు సాధించిన విజయాల సూచిక మాత్రమే కాదు, అవి ఉత్పత్తియొక్కా, మొత్తం సమాజంయొక్కా అభివృద్ధికి నిర్ణాయకమైన ప్రాతిపదిక కూడా. అంతే కాక, ప్రతి కొత్త తరానికీ మునుపటి తరాలనుండి సంక్రమించే శ్రమ సాధనాలు దాని యితోధిక పురోగతికి ప్రారంభ స్థానం అవుతాయి; యిది చరిత్రలో అనుస్యూతికి ప్రాతిపదిక.

మానవులకు నరాలూ, కండరాలూ, మెదడూ, అవయవాలూ వున్నందువల్ల కాక (జంతువులకు కూడా యివన్నీ వున్నాయి), వాళ్లు ఉత్పత్తి పరికరాలను సృష్టిస్తారు గనుక, వాటిని ఉపయోగించడం యెరుగుదురు గనుక, మానవులు సమాజంయొక్క ఉత్పాదక శక్తి అవుతారు. ఉత్పత్తి అనుభవమూ, శ్రమ నైపుణ్యాలూ ప్రకృతి యిచ్చినవి కాదు, అవి భౌతిక ఉత్పాదక కార్యాచరణమీద ఆధారపడిన సామాజిక జీవితపు ఉత్పాదితం. కనుక, ఉత్పాదక శక్తిగా మానవుడు చరిత్రయొక్క ఉత్పాదితం.

ప్రకృతిలోని వస్తువులు మానవుని చేతిలో మాత్రమే ఉత్పత్తి పరికరా లౌతాయి గనుక, అతను మాత్రమే వాటిని పనిలో పెడతాడు గనుక, మానవులు, శ్రామికులు, ఉత్పాదక శక్తు లలో ప్రధాన అంశం.

ఉత్పత్తిలో ఉపయోగించబడని యంత్రం సంభావ్య ఉత్పాదక శక్తి మాత్రమే, ఆచరణకు సంబంధించినంతవరకు లోహపు కుప్ప మాత్రమే. శ్రామికుడు దానిని ఉపయోగించినప్పుడు మాత్రమే అది ప్రాణం పోసుకొని, క్రియాత్మకమైన, ఫలవంతమైన, నిజంగా ఉత్పాదక మైన శక్తి అవుతుంది. యే సమాజంలోనైనా, దాని రూపం యేదైనా, మానవులూ, శ్రమ సాధనాలూ యేకమైనప్పుడు మాత్రమే ఉత్పాదక శక్తులుగా యేర్పడుతారు. యీ ఐక్యత లోపల శ్రమ సాధనాలు జ్ఞానంయొక్క భౌతిక రూపం ధరించిన శక్తిగా, సాంకేతిక సాధనాల నన్నిటినీ సృష్టించే మానవుని బౌద్ధిక కార్యాచరణయొక్క ఉత్పాదితంగా వుంటూ, అదే సమ యంలో ప్రకృతితో అతని సంబంధాలను నిర్ధరిస్తాయి, మానవునియొక్కా, మొత్తం సమా జంయొక్కా అభివృద్ధి స్థాయికి సూచికగా వుంటాయి. మానవుడు సమాజంలో లభ్యమయ్యే శ్రమ సాధనాలకు అనుగుణంగా తన్ను తాను మలచుకుంటాడు, వాటిని మారుస్తాడు. మానవుడు తనకూ, ప్రకృతికీ మధ్య పెట్టే శ్రమ సాధనాలను మెరుగుపరచడంలోనూ, వాటిని ఉత్పత్తిలో ఉపయోగించడంలోనూ, తన్ను తాను మార్చుకుంటాడు కూడా.

మానవుల అనుభవమూ, నైపుణ్యాలూ అన్నిటినీ మించి వాళ్ళ తమ పనిలో ఉపయో గించే రకం పరికరాలచేత నిర్ణయించబడుతాయి. సాంకేతిక విజ్ఞానం అభివృద్ధి చెందేకొద్దీ, మానవుల జ్ఞానంమీదా, అనుభవంమీదా చేయబడే డిమాండ్లు కూడా పెరుగుతాయి. కొయ్య నాగలి వేరు, ట్రాక్టరు వేరు.

యంత్రోత్పత్తి అభివృద్ధి ప్రకృతి శాస్త్రాన్ని బుద్ధిపూర్వకంగా ప్రయోగించడంతో ముడివడి వుంది. కనుక, దానికి గాను ప్రత్యక్ష ఉత్పాదకునిలో శుద్ధ ఆచరణగత అనుభవం మాత్రమే కాక, ప్రకృతి శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాల జ్ఞానం కూడా అవసరం. శాస్త్ర, సాంకేతిక పురోగతిలోని ఒక అత్యంత ముఖ్యమైన లక్షణం యేమిటంటే, పెరుగుతున్న సాంకేతిక సంక్లిష్టతల సూటి ఫలితంగా ఆత్మిక అంశంయొక్క ప్రాముఖ్యమూ, ఉత్పత్తిలో శాస్త్రవిజ్ఞానంయొక్క పాత్రా పెరుగుతూండడం. యిది ఉత్పాదక శక్తుల అంగనిర్మాణాన్ని యింకా విస్తృతపరచడానికి అభిముఖంగా వుంది. శరీరక శ్రమ మాత్రమే కాక, ఉత్పత్తి క్రమానికి సూటి శాస్త్ర, సాంకేతిక సేవలు సమకూర్చే సాంకేతికుల, యింజనీర్ల శ్రమా, పరిశోధకుల శ్రమ కూడా ఉత్పాదక మౌతుంది. ఉత్పాదక శక్తులు అనే భావంయొక్క సారం మారడం కొనసాగుతుంది, ముఖ్యంగా, యీనాటి శాస్త్ర, సాంకేతిక విప్లవం సందర్భంగా. యీ విప్లవం స్వయంచలిత ఉత్పత్తికి అవకాశాలను కలిగిస్తుంది. దాని ద్వారా మానవుడు

ప్రత్యక్ష ఉత్పత్తి క్రమంనుండి తొలగింపబడడం మాత్రమే కాదు, ఆ క్రమాన్ని నడిపించే కర్తవ్యాలనుండి కూడా విముక్తుడౌతాడు, ఆ కర్తవ్యాలను యంత్రాలు స్వీకరించి, మొత్తానికి చెందిన అజమాయిషీనీ, తనిఖీనీ, మరమ్మతులనూ, పునరుద్ధరణనూ, వగైరాలను మానవునికి వదలిపెడతాయి. శ్రమ సాధనాలకూ, మానవునికీ మధ్య గల ఐక్యత మరింత ఉన్నతమైన నూతన దశకు కొనిపోబడుతుంది. శాస్త్ర, సాంకేతిక విప్లవంలో, మొత్తం ఉత్పత్తి క్రమం అధికాధికంగా శాస్త్రవిజ్ఞానంయొక్క సాంకేతిక వినియోగ మౌతుంది. ఆ క్రమం అభివృద్ధి చెందేకొద్దీ, శాస్త్రవిజ్ఞానం దానిలో ప్రత్యక్ష భాగస్వామి అవుతుంది, సామాజిక ఉత్పాదక శక్తి అవుతుంది.

ఉత్పత్తియొక్క ఆర్థిక సంబంధాలు ఉత్పాదక శక్తుల లాగే ఉత్పత్తిలో ఒక అవసరమైన పార్శ్వం. యెందుకంటే, సంయుక్త కార్యాచరణ కొరకూ, కార్యాచరణయొక్క మార్పిడి కొరకూ నిర్దిష్ట పద్ధతిలో కలవకుండా మానవులు ఉత్పత్తి చేయజాలరు.

ఉత్పత్తి సంబంధాలు వస్తుగత, పాదార్థిక సంబంధాలు, అవి మానవుల చైతన్యంమీద ఆధారపడవు; సామాజిక ఉత్పాదితంయొక్క ఉత్పత్తిలోనూ, ఆ ఉత్పాదితం మార్పిడిద్వారానూ, పంపకంద్వారానూ వ్యష్టి అనుభోగందాకా యింకా ముందుకు పయనించడంలోనూ మానవుల మధ్య ఆ సంబంధాలు నెలకొల్పబడుతాయి.

ప్రతి సమాజంలోనూ అవి సంకీర్ణమైన సమస్తంగా యేర్పడుతాయి. తక్షణ ఉత్పత్తి క్రమంలో మానవుల మధ్య సంబంధాలూ, సామాజిక శ్రమ విభజనయొక్కా, కార్యాచరణ మార్పిడియొక్కా వివిధ రూపాలూ, భౌతిక వస్తువుల పంపకానికి చెందిన విశిష్ట సంబంధాలూ వాటిలో భాగాలే. యీ సంబంధాల మొత్తం వైవిధ్యం చారిత్రకంగా నిర్దిష్టమైన ఆస్తి రూపంలో వ్యక్తమౌతుంది. యెందుకంటే, అది మానవుల మధ్య గల సంబంధాలను ఉత్పత్తి సాధనాల దృష్ట్యా వాళ్లకు గల హోదా ద్వారా వ్యక్తం చేస్తుంది. ఆస్తి రూపం యే పద్ధతిలో మానవులు ఉత్పత్తి సాధనాలనూ, ఉత్పాదితాలనూ సొంతపరచుకొనేదీ వర్ణిస్తుంది.

ఉత్పత్తి సాధనాలు మొత్తం సమాజపు ఆస్తిగా వున్న చోట ఈ సమాజపు సభ్యులకు ఉత్పత్తి సాధనాల విషయంలో సమానమైన హోదా వుంటుంది, ఒకే సమష్టి ఉత్పత్తి సంఘంలోని సభ్యులుగా వాళ్ల మధ్య సహకార, పరస్పర సహాయ సంబంధాలు నెలకొల్పబడుతాయి. సామాజిక ఆస్తి రూపాల లాగే యీ సహకార రూపాలు భిన్నభిన్నంగా వుండవచ్చు. ఆవిధంగా సామాజిక ఆస్తి గణానికీ, తెగకూ, గ్రామ సమాజానికీ, సహకార సంఘాలలో గానీ, సమష్టి సంఘాలలో గానీ ఐక్యమైన శ్రామికులకూ, రాజ్యానికీ, మొత్తం ప్రజానీకానికీ చెందిన ఆస్తి రూపాలలో మనకు చరిత్రలో కనపడుతుంది.

ఉత్పత్తి సాధనాలు వ్యక్తుల ఆస్తిగా వున్నచోట, ప్రధానమైన ఉత్పత్తి సాధనాలు సమా

జంలోని ఒక విభాగం చేతుల్లో వుండి, తక్కిన విభాగానికి అవి లేనిచోట, ఆస్తి అనేది సొంత ఆస్తి అవుతుంది, సమాజంలో అనివార్యంగా ఆధిపత్యమూ, పరాధీనతా అనే సంబంధాలు ఉత్పన్నమౌతాయి. యీ సంబంధాల రూపాలు కూడా భిన్నభిన్నంగా వుంటాయి, నిర్దిష్ట సమాజంమీద పెత్తనం చేసే సొంత ఆస్తి రూపంమీద ఆధారపడుతాయి. అందువలన, ప్రతి సందర్భంలోనూ, శ్రామికుడూ, ఉత్పత్తి సాధనాలూ జోడించబడే నిర్దిష్ట రూపాన్ని నిర్ణయించేది ఉత్పత్తి సాధనాలమీద గల ఆస్తి సంబంధాలే.

చరిత్రలో మూడు మౌలిక రకాల సొంత ఆస్తి వుండింది — బానిస యజమాన ఆస్తి, ఫ్యూడల్ ఆస్తి, పెట్టుబడిదారీ ఆస్తి. తదనురూపంగా, మానవ దోపిడీయొక్క మూడు మౌలిక రూపాలు వుండినాయి. వీటికి తోడు, సొంత శ్రమమీద ఆధారపడే ఉత్పాదకుని సొంత ఆస్తి కూడా వుండింది, కానీ యీ రూపం యెప్పుడూ నిర్దిష్ట సమాజంలో ప్రాబల్యంలో వున్న ఉత్పత్తి సంబంధాలకు లోబడి వుండింది. కాని అదే ఎప్పుడూ ప్రాబల్యం వహించలేదు. ఉదాహరణకు, పెట్టుబడిదారీ వ్యవస్థలో సన్నకారు క్షేత్రాలూ, చేతిపనివాళ్ల, వర్తకుల చిన్న సంస్థలూ ప్రత్యేక ఆర్థిక రంగంగా యేర్పడుతాయి; యీ రంగం ప్రాబల్యంలో వున్న పెట్టుబడిదారీ సంబంధాల ప్రభావానికి నిత్యం లోబడి వుంటుంది.

యీవిధంగా, ఆస్తియొక్క మౌలిక రూపాలు — సామాజిక రూపమూ, సొంత రూపమూ— మానవుల మధ్య ఉత్పత్తి సంబంధాలకు చెందిన రెండు మౌలిక రూపాలుగా చరిత్రలో కనపడుతాయి: సహకార, పరస్పర సహాయ సంబంధాలూ, ఆధిపత్య, పరాధీనతా సంబంధాలూ.

ఉత్పత్తి సంబంధాలకు చెందిన యీ రెండు మౌలిక రూపాలకు తోడు, ఒక సామాజిక నిర్మాణరూపం విచ్ఛిన్నమై, మరొకటి ఉత్పన్న మయ్యేటప్పుడు పరివర్తనాత్మక ఉత్పత్తి సంబంధాలు కూడా ఉత్పన్న మౌతాయి. యీ సంబంధాల విశిష్ట గుణం యేమిటంటే, ఒకే ఆర్థిక వ్యవస్థ చట్రం లోపల భిన్న రకాల ఆర్థిక సంబంధాలు కలిసివుండడం. ఆవిధంగా, ఆదిమ సమష్టి వ్యవస్థ విచ్ఛిన్న మయ్యేటప్పుడు, (పలు తరాలతోనూ, దాయాదులతోనూ, యేర్పడిన) పితృస్వామిక కుటుంబపు చట్రం లోపల ఆదిమ సమష్టి సమాజ సంబంధాల అవశేషాలూ, బానిస యజమాన సంబంధాల బీజాలూ కలిసి కనపడుతాయి. బానిస యజమాన వ్యవస్థ విచ్ఛిన్న మయ్యేటప్పుడు, బానిస యజమాన సంబంధాల, ఫ్యూడల్ సంబంధాల అంశాలు కలిసిన కోలన్ అనే రకం మనుషులు కనపడుతారు. పెట్టుబడిదారీ వ్యవస్థనుండి సోషలిజంకు పరివర్తన జరిగే కాలంలో కొన్ని ఆర్థిక రంగాలలో సోషలిస్టు సంబంధాలూ, సొంత ఆస్తి సంబంధాల అవశేషాలూ కలిసివుంటాయి, యివి రూపంలోనూ, పరిమాణంలోనూ భిన్నభిన్నంగా వుంటాయి ((ప్రభుత్వ పెట్టుబడిదారీ వ్యవస్థా, గ్రామీణ ప్రాంతంలో అర్ధ సోషలిస్టు సహకార రూపాలూ, వగైరా). కానీ, మొత్తంమీద, పెట్టుబడిదారీ వ్యవస్థనుండి

సోషలిజంకు పరివర్తన జరిగే కాలంలోని ఆర్థిక వ్యవస్థ పరివర్తనాత్మక స్వభావం గలది. దానిలో అనేక రంగాలు వుంటాయి, సామాజికంగా యేక స్వభావం లేని రంగాల మధ్య నిర్దిష్టమైన సంబంధం వుంటుంది; దీని చట్రం లోపల సోషలిస్టు రంగం క్రమక్రమంగా యితర రంగాల నన్నిటినీ ఖండించివేస్తుంది.

ఉత్పాదక శక్తులకూ, ఉత్పత్తి సంబంధాలకూ మధ్య గల భేదం ఒకే ఉత్పత్తియొక్క రెండు పార్శ్వాల మధ్య, ఒకటి లేకుండా మరొకటి యెప్పుడూ వుండని రెండు పార్శ్వాల మధ్య గల భేదమే. ఉత్పత్తి సంబంధాలు లేకుండా ఉత్పాదక శక్తులనూ, ఉత్పాదక శక్తులు లేకుండా ఉత్పత్తి సంబంధాలనూ భావనాత్మకంగా మాత్రమే పరిగణించగలం. వాస్తవంలో యీ రెండూ ఒకదానినుండి మరొకటి విడదీయరానివి. ఉత్పాదక శక్తులు సామాజిక ఉత్పత్తి యొక్క సారం, ఉత్పత్తి సంబంధాలు దాని అవశ్య భౌతిక రూపం. ఉత్పత్తి సంబంధాలు ఉత్పాదక శక్తులచేత నిర్ణయించబడుతాయి, ఉత్పాదక శక్తులకు అనుగుణంగా వుంటాయి. ఉత్పత్తి సంబంధాల రూపంలోనే ఉత్పాదక శక్తులు పనిచేస్తాయి, అభివృద్ధి చెందుతాయి. యీ అనురూపత యెందుకు అవసరం? ఉత్పాదక శక్తులు మానవ అస్తిత్వాన్ని నిలుపుకోడానికి ఉద్దేశించబడిన మానవ కార్యాచరణయొక్క ప్రధానమైన రకానికి విలక్షణంగా వుంటాయి. కనుక, యీ కార్యాచరణ మానవుల మధ్య గల సంబంధాలకు, వేటి చట్రం లోపల ఉత్పాదక శక్తులు పనిచేయగలవో, అభివృద్ధి చెందగలవో ఆ సంబంధాలకు, ప్రాతిపదికగా పనిచేయడం సహజమే. యెంతైనా, మానవులు తమ అస్తిత్వాన్ని నిలుపుకొనేటందుకు నిశ్చితమైన సంబంధాలు యేర్పరచుకుంటారు; కాగా, వాళ్ల అస్తిత్వం నిలుపుకొనే పద్ధతి యేమిటంటే, ఉత్పత్తి — శ్రమ సాధనాలను ఉపయోగించడంద్వారా ప్రకృతిని మార్చడం.

కనుక, ఉత్పత్తి సంబంధాలు మానవుల యిచ్ఛతో సంబంధం లేకుండానూ, ఉత్పాదక శక్తులయొక్క అభివృద్ధి స్థాయినీ, స్వభావాన్నీ బట్టీ అంతిమంగా శ్రమ సాధనాలను బట్టీ రూపుదాలుస్తాయి. మార్క్స్ యిలా రాసినాడు: "శ్రమ సాధనాలు మానవ శ్రమ సాధించిన అభివృద్ధి స్థాయికి కొలమానాన్ని సమకూర్చడమే కాక, యే సామాజిక పరిస్థితులలో శ్రమ జరిగేదీ కూడా అవి సూచిస్తాయి."*

ఉత్పాదక శక్తుల క్రియానిర్వహణ, అనగా శ్రమ క్రమం, దాని వంతుకు, ఉత్పత్తి సంబంధాలచేత క్రియాత్మకంగా ప్రభావితం చేయబడుతుంది. ఉత్పత్తి సంబంధాలు ఉత్పాదక శక్తులకు నిశ్చితమైన సామాజిక గుణాన్ని యిస్తాయి; ఫలితంగా ఉత్పత్తి బానిస యజమాన ఉత్పత్తిగానో, ఫ్యూడల్ ఉత్పత్తిగానో, పెట్టుబడిదారీ ఉత్పత్తిగానో, సోషలిస్టు ఉత్పత్తిగానో కనపడుతుంది.

---

* K. Marx, *Capital*, Vol. I, పుట 180.

ఉత్పాదక శక్తుల సామాజిక గుణం, మనం శ్రమ పరికరాలను తీసుకున్నా సరే, వాటిని పనిలో పెట్టే మానవులను తీసుకున్నా సరే, పూర్తిగా ఉత్పత్తి సంబంధాలమీద ఆధారపడుతుంది. శ్రమ పరికరాలు గానీ, శ్రమ సాధనాలు గానీ యే సామాజిక రూపంలో పనిచేసేదీ వాటిమీద ఆధారపడదు. యెందుకంటే, యంత్రం కేవలం యంత్రమే. యంత్రం పెట్టుబడిదారుని ఆస్తి అయినప్పుడు మాత్రమే, అనగా నిర్దిష్ట సామాజిక పరిస్థితులలో మాత్రమే, అది పెట్టుబడి అయి, దోపిడీ సాధనంగా ఉపయోగించబడుతుంది.

అనుభవమూ, నైపుణ్యాలూ గల మానవుడు ఒక ఉత్పాదక శక్తి. కానీ, కొన్ని పరిస్థితులలో అతను బానిస, మరి కొన్ని పరిస్థితులలో ఫ్యూడల్ దాసుడు, యింకొక కొన్ని పరిస్థితులలో వేతన కార్మికుడు. బానిస యజమానుల భావజాలం ప్రకారం మానవులు స్వేచ్ఛగానూ, బానిసలుగానూ పుట్టుతారు; ఫ్యూడల్ ప్రభువుల భావజాలం ప్రకారం ప్రకృతి కొందరు మనుషులను ప్రభువులుగానూ, మరికొందరిని ఫ్యూడల్ దాసులుగానూ చేస్తుంది; బూర్జువా వర్గపు భావజాలం ప్రకారం పెట్టుబడిదారులు కార్మికులకంటె యెక్కువ శక్తి సామర్థ్యాలు గలవాళ్లు. యీ ప్రగతి వ్యతిరేక భావజాలాన్ని మార్క్సిజం నిశ్చయంగా నిరాకరిస్తుంది. మానవులు సహజంగా బానిసలూ కారు, ఫ్యూడల్ దాసులూ కారు, వేతన కార్మికులు కూడా కారు. రూసో ఒకప్పుడు బాధతో ఇలా అన్నాడు: "మానవుడు స్వేచ్ఛగా పుట్టినాడు, కానీ ప్రతిచోటా సంకెళ్లలో వున్నాడు." మనుషులకు యీ సంకెళ్లు తగిలించేది సొంత ఆస్తి సంబంధాలు. నిర్దిష్ట ఉత్పత్తి సంబంధాలు యేర్పరచుకోవడంద్వారా మానవులు బానిసలో, వేతన కార్మికులో అవుతారు. ఆ సంబంధాలు యేర్పరచుకోవాల్నా లేదా అనేది నిర్ణయించుకోడానికి గానీ, వాటిని యేరుకోడానికి గానీ వాళ్లకు స్వేచ్ఛ లేదు. ఆ సమాజంలో వున్న ఉత్పత్తి సంబంధాలను మానవులు యేర్పరచుకోక తప్పదు.

కనుక, ఉత్పాదక శక్తులు ఉత్పత్తి సంబంధాలను నిర్ణయించినప్పటికీ, ప్రతి ఉత్పత్తి విధానానికీ నిర్దిష్ట సామాజిక స్వభావాన్ని యిచ్చేది ఉత్పత్తి సంబంధాలే.

సమాజంలోని ఉత్పత్తి సంబంధాలు యితర సామాజిక విషయాలతో కూడా లంకించబడి వున్నాయి. నిజమే, అనేక విషయాలకూ, ఉత్పత్తికీ మధ్య గల లంకె చాలా పరోక్షంగా వుంటుంది, కానీ అది తప్పక వుంటుంది. యీ లంకె వుందనే నిర్ధారణే మార్క్సిస్టు సామాజిక చారిత్రక సిద్ధాంతాన్ని అద్వైత (monist) సిద్ధాంతంగా చేసేది. అసలు విషయం యేమిటంటే, మనం యే సామాజిక విషయాన్ని పరిశీలించినా — అది భాష, కళ, రాజ్యం, జాతి, శాస్త్రవిజ్ఞానం, నీతిశాస్త్రం, వగైరా యేదైనా గానీ — దానిపాటికది అర్థం కాదు, సమాజంచేత ఉత్పత్తి చేయబడిన విషయంగా, నిర్దిష్ట సామాజిక అవసరాలను తీర్చేదిగా మాత్రమే అర్థం కాగలదు. యే సమాజంలోనైనా జీవిత విధానం ఉత్పత్తి విధానంచేత

నిర్ణయింపబడుతుంది గనుక, ఆ సమాజంలోని యితర విషయాలన్నీ అంతిమంగా ఉత్పత్తి విధానంమీద ఆధారపడుతాయి, దానినుండి మొలకెత్తుతాయి, దానిచేత నిర్ణయింపబడుతాయి.

యిప్పుడు మేము నిర్ధరించే సూత్రం మొత్తం చారిత్రక భౌతికవాద అవగాహనకు మౌలిక ప్రాముఖ్యం గలది; అందువలనే, దీనిని అంగీకరించనివాళ్లు దీనిమీద అంత భీషణంగా దాడిచేసినారు. వాస్తవానికి వందల కొలది "సిద్ధాంత" రచనలలో చారిత్రక భౌతికవాదానికి ఆర్థిక భౌతికవాదమనే ముద్ర వేయబడింది; యెందుకంటే, ఆర్థిక వ్యవస్థ నిర్ణాయకమైన పాత్ర నిర్వహిస్తుందని అది గుర్తిస్తుంది గనుక. కానీ, సకల సామాజిక విషయాలూ, ఘటనలూ సూటిగా ఉత్పత్తి విధానంనుండి యేర్పడుతాయనీ, ఆర్థిక వ్యవస్థచేత వివరించి పారవేయ బడుతాయనీ చారిత్రక భౌతికవాదం అంటుందా? ఆర్థిక వ్యవస్థతో చాలా స్వల్ప సంబంధం గల నిర్దిష్ట విషయాలూ, ఘటనలూ సమాజంలో చాలా వున్నాయి. సామాజిక వ్యవస్థ యొక్క స్వభావమూ, అది యే మార్గాలలో మారేదీ అంతిమంగా మాత్రమే పాదార్థిక ఉత్పత్తి విధానంచేత నిర్ణయింపబడుతాయి.

ఆర్థిక వ్యవస్థయొక్క ప్రభావం గురించి ప్రాచీనులు అప్పటికే రాసినారు గనుక, యీ విషయంలో కార్ల్ మార్క్స్ ఆవిష్కరణ యేమీ చేయలేదని కొందరు రచయితలు (పి. సొరోకిన్ లాంటివాళ్లు) అంటారు. యిది చాలా దుర్బలమైన వాదమే. యెంతైనా, ఉదాహరణకు, ప్రాచీనులు అయస్కాంతపు ప్రభావాన్ని గుర్తించినారు, వర్షాకాలంలో మెరుపు తీగలను గమనించి వుంటారు. కానీ, వాళ్లకు విద్యుదయస్కాంత సిద్ధాంతం తెలుసునని దాని అర్థమా? ఆర్థిక వ్యవస్థ నిశ్చితమైన పాత్ర నిర్వహిస్తుందని చెప్పే సుసంబద్ధమైన మార్క్స్ సిద్ధాంతానికి యిదే వర్తిస్తుంది. ప్రతి సామాజికార్థిక నిర్మాణరూపంలోని సామాజిక విషయాలన్నీ ఒక యేకీకృత సమస్తంలో భాగంగా యేర్పడుతాయని యీ సిద్ధాంతం అనడానికి చాలా మంచి కారణం వుంది; సమాజపు జీవితంలోనూ, అభివృద్ధిలోనూ ఉత్ప త్తికి కీలకమైన పాత్ర వుండడమే ఆ కారణం. ఉత్పత్తి విధానం యే సామాజిక నిర్మాణ రూపానికైనా పాదార్థిక, ఆర్థిక ప్రాతిపదిక. ఉత్పత్తి విధానానికి యితర సామాజిక అంశా లన్నిటి విషయంలోనూ నిర్ణాయకమైన పాత్ర వుందనేది చారిత్రక అభివృద్ధియొక్క నిర్ని బంధమైన నియమం.

అన్ని సామాజిక నిర్మాణరూపాలకూ సామాన్యమైన నిర్మాణ అంశాలను ప్రతిఫలించే కీలక భావాలలో "ప్రాతిపదిక," "ఉపరినిర్మాణం" అనే ధాతువులు వున్నాయి.

ప్రాతిపదికా, ఉపరినిర్మాణమూ

యీ ధాతువుల ప్రాముఖ్యం అన్నిటినీ మించి యెందులో వుందంటే, చారిత్రక క్రమం యొక్క ఆత్మిక రంగంతో సహా సామాజిక జీవితపు యితర పార్శ్వా లన్నిటిమీదా ఉత్పత్తి విధానం నెరపే ప్రభావాన్ని వెల్లడించడానికి యివి తోడ్పడుతాయి.

ఉత్పత్తి విధానం సమాజ జీవితంలోని సామాజిక, రాజకీయ, ఆత్మిక క్రమాలను నిర్ణ యిస్తుంది. కానీ, యీ సమస్యను పరిగణించేటప్పుడు, మనకు ఒక విషయం స్పష్టమవుతుంది. ఉత్పత్తియొక్క రెండు పార్శ్వాలూ — ఉత్పాదక శక్తులూ, ఉత్పత్తి సంబంధాలూ — ప్రతి సమాజానికీ విలక్షణమైన భావాలనూ, అభిప్రాయాలనూ, సంబంధాలనూ నిర్ణయించడంలో భిన్నమైన పాత్ర వహిస్తాయనే విషయం మనకు స్పష్టమవుతుంది. యేమిటి యీ పాత్ర?

మొక్కలూ, జంతువులూ ఒకదానినుండి ఒకటి యెలా పూర్తిగా విభేదిస్తాయో, అలాగే సామాజికార్థిక నిర్మాణరూపాలు ఒకదానినుండి ఒకటి పూర్తిగా విభేదించే సామాజిక శరీరులు. మేము చెప్పినట్లు, యీ విభేదాలు వాటి భిన్న ఉత్పత్తి విధానాలనుండి మొలకె త్తుతాయి. ఉత్పాదక శక్తులు ఉత్పత్తి విధానంయొక్క నిర్ణాయక పార్శ్వం గనుక, అవి అంతి మంగా సామాజిక అభివృద్ధిలోని ప్రతి దశయొక్క గుణాత్మక లక్షణాలనూ నిర్ణయిస్తాయి. కానీ, అప్పుడప్పుడు సామాజిక జీవితపు వాస్తవాలు యీ ఉద్ఘాటనను వ్యతిరేకిస్తున్నట్లు కనపడుతాయి. ఉదాహరణకు, అమెరికా సంయుక్త రాష్ట్రాలలో పెట్టుబడిదారీ వ్యవస్థ వున్నప్పటికీ, అనగా సోషలిజంకంటె హీన సామాజిక అభివృద్ధి స్థాయి వున్నప్పటికీ, అక్కడ ప్రస్తుతానికి ఉత్పాదక శక్తులు సోవియట్ యూనియన్‌లోకంటె ఉన్నత స్థాయిలో వున్నాయి. కనుక, అమెరికా సంయుక్త రాష్ట్రాలకూ, సోవియట్ యూనియన్‌కూ మధ్య సామాజిక వ్యవ స్థలోనూ, భావజాలంలోనూ, రాజ్య వ్యవస్థలోనూ, వగైరాలలో గల భేదాలకు ఉత్పాదక శక్తుల స్థాయి ఒక్కటే కారణమని చెప్పడం తప్పు. మార్క్సిస్టు సిద్ధాంతం తప్పు అనడానికి యీ విషయం బూర్జువా సామాజిక శాస్త్రజ్ఞులకు చాలా అనుకూలమైన "నిదర్శనం"గా కన పడుతుంది. కాని, మార్క్సిస్టుల దృష్టిలో యిది నియమంయొక్క సారానికీ, అది వ్యక్తం చేయబడే రూపానికీ మధ్య గల భేదం, మధ్యంతర అంశాల ప్రభావంవల్ల కలిగే భేదం. యేమైనా, బెలూన్ ఆరోహణను గమనించే భౌతికశాస్త్రజ్ఞుడు భూమ్యాకర్షణ నియమాన్ని నిరాకరించడు, అతను ఆ నియమానికి యీ నిర్దిష్ట వ్యక్తీకరణను యిచ్చే మధ్యంతర అంశాలను పరిగణి స్తాడు.

ఉత్పాదక శక్తుల నిర్ణాయక పాత్ర యిది: అవి తమకు అనుగుణమైన ఉత్పత్తి సంబంధాలను అపేక్షిస్తాయి; యీ సంబంధాలద్వారా అవి సామాజిక జీవితపు యితర రంగాలమీద పరోక్షంగా ప్రభావం నెరపుతాయి. కానీ, ఉత్పాదక శక్తుల అభివృద్ధి దానంతట అదే ఉత్పత్తి సంబంధాలలో మార్పును కలిగించదు గనుక, యెక్కువగా అభివృద్ధి చెందిన ఉత్పాదక శక్తులు గల దేశం కొంత కాలం పాటు హీన సామాజిక అభివృద్ధి స్థాయిలో వున్న సందర్భాలు చరిత్రలో ఉన్నాయి. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో జరుగుతున్నది యిదే.

ఉత్పాదక శక్తుల అభివృద్ధి మొత్తంగా చారిత్రక క్రమానికి ప్రాతిపదికగా వున్నప్పటికీ, ఒక సామాజిక నిర్మాణరూపాన్ని మరొక సామాజిక నిర్మాణరూపంనుండి వేరుచేసే సకల సామాజిక విషయాల నిర్దిష్ట లక్షణాలను నిర్ణయించేది ఉత్పత్తి సంబంధాలే. ఉత్పత్తి సంబంధాలకు గల యీ పాత్రలో అవి సమాజపు ఆర్థిక ప్రాతిపదికగా నిర్వచింపబడుతాయి.

సమాజపు ఆర్థిక ప్రాతిపదిక అంటే ఉత్పత్తి సంబంధాల సాకల్యం – అనగా ఉత్పత్తి, మారకం, పంపకం రంగంలోని సంబంధాల సాకల్యం. యీ ప్రాతిపదిక సకల యితర సామాజిక సంబంధాలనూ, మనుషుల భావాలనూ, అభిప్రాయాలనూ, ఆశయాలనూ, ఉపరి నిర్మాణంగా నిర్వచింపబడే సమాజపు రాజకీయ, తదితర సంస్థలనూ ఉత్పన్నం చేస్తుంది. ఉపరినిర్మాణం యేక స్వభావం లేని అంశాలచేత నిర్మించబడినప్పటికీ, వీటికి కొన్ని సామాన్య లక్షణాలూ, సామాన్య అభివృద్ధి నియమాలూ వున్నాయి; యీ కారణంగా మొత్తం ఉపరి నిర్మాణాన్ని ఒక నిర్దిష్ట సామాజిక విషయంగా పరిగణించవచ్చు.

"ప్రాతిపదిక," "ఉపరినిర్మాణం" అనే భావాలు పరస్పర సంబంధం గలిగి వున్నాయి, సామాజిక నిర్మాణరూపం అనే ధాతువుతో గాఢంగా ముడిపడి వున్నాయి. ప్రాతిపదిక మొత్తం సామాజిక శరీరియొక్క ఆర్థిక చట్రం లాంటిది, అది ప్రతి సామాజికార్థిక నిర్మాణ రూపంయొక్క గుణాత్మక విలక్షణాలనూ నిర్ణయించి, తద్వారా ఒక నిర్మాణరూపాన్ని మరొక దానికంటె భిన్నమైనదిగా చేస్తుంది. కాగా, ఉపరినిర్మాణం ప్రతి సామాజిక నిర్మాణరూపంలోని సామాజిక, ఆత్మిక రంగంయొక్క విశిష్ట లక్షణాలను నిర్ణయిస్తుంది. అందువల్లనే, సామాజిక నిర్మాణరూపానికి వెలుపల యీ భావాలు అర్థం లేనివి, లేదా శరీరంనుండి విడదీయబడిన అంగాల లాగ నిర్జీవమైనవి.

నిర్దిష్ట నిర్మాణరూపపు ప్రాతిపదికగా యేర్పడే మొత్తం ఉత్పత్తి సంబంధాల సముదాయాన్ని ఆ సమాజంలో ప్రాబల్యంలో వున్న ఆస్తి రూపంనుండి యేర్పడే ఆర్థిక సంబంధాల సాకల్యంగా చూడాలి. కానీ, వాస్తవ జీవితంలో, వివిధ దేశాల, జాతుల చరిత్రలో, ఆ కాలంలో ప్రాబల్యంలో వున్న ఉత్పత్తి సంబంధాలతో పాటు సాధారణంగా పాత ఉత్పత్తి విధానపు అవ

శేషాలు గానీ, కొత్త, భావి ఉత్పత్తి విధానపు బీజాలు గానీ అయిన ఆర్థిక సంబంధాలు వుంటాయి. వీటిని సాధారణంగా రంగం అంటారు. కానీ, ప్రాతిపదికను నిర్దిష్ట సమాజంలో వున్న ఆర్థిక రంగాల వెరసి మొత్తంగా పరిగణించకూడదు; యెందుకంటే, అలా చేస్తే వివిధ అంతర్వై రుధ్యాలు యేర్పడుతాయి. ఉదాహరణకు, 18వ శతాబ్దపు ఫ్రాన్సులో, ప్రాబల్యంలో వుండిన ఫ్యూడల్ సంబంధాలతో పాటు అప్పటికే పెట్టుబడిదారీ రంగం వుండింది. ప్రాతిపదికను రంగాల మొత్తంగా మనం పరిగణిస్తే, ఆనాటి ఫ్రాన్సులోని ఆర్థిక వ్యవస్థను ఫ్యూడల్ బూర్జువా వ్యవస్థ అనవలసి వుంటుంది. అందుకనే, యే సమాజపు ఆర్థిక, సామాజిక జీవితపు నిర్దిష్ట పరిశీలనలోనైనా మనం భిన్న రంగాల ఉనికినీ, వాటి పరస్పర చర్యా ప్రతి చర్యలనూ లెక్కలోకి తీసుకోవాలి, కాని ప్రాబల్యపు ఉత్పత్తి సంబంధాలను సామాజిక నిర్మాణరూపంలోని ప్రాతిపదికగా వెల్లడించడంద్వారా మాత్రమే ఒక సామాజిక నిర్మాణ రూపాన్ని మరొకదానినుండి స్పష్టంగా వింగడించగలం.

యే సిద్ధాంత పరిశీలనలోనైనా, అధ్యయనం చేయబడే విషయాన్ని దాని శుద్ధ రూపంలో వెలికి తీయడం అన్నిటికంటె ముఖ్యంగా అవసరం; తత్ఫలితంగా, దాని అచ్చమైన సారాన్ని మరుగుపరచగల అన్ని పార్శ్వాలనుండీ, సంబంధాలనుండీ మనం కాసేపు విడివడాలి. పెట్టుబడిదారీ నిర్మాణరూపం దాని భావానికి అనుగుణంగా "శుద్ధ" రూపంలో యెన్నడూ లేక పోయినప్పటికీ, మార్క్స్ అన్ని అముఖ్య అంశాలనుండీ, పరిసర అంశాలనుండీ కొంతవరకు విడివడి, తన "పెట్టుబడి" గ్రంథంలో శుద్ధ పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క అభివృద్ధిని పాలించే నియమాలను అధ్యయనం చేసినాడు. అదే విధంగా, సామాజిక నిర్మాణరూపాన్ని సిద్ధాంత పరిశీలన చేయడంలో మనం దాని సారాంశాన్ని నిర్ణయించే సంబంధాలను దాని ప్రాతిపదికగా వెలికి తేవాలి. "నిర్మాణరూపం," "ప్రాతిపదిక" అనేవి అభౌతిక భావాలు, కానీ, చరిత్రను దాని సకల వైవిధ్యంతో, సంబంధాలతో, నిర్దిష్ట రూపాలతో సహా అధ్యయనం చేయడానికి వీలు కలిగించే శాస్త్రీయమైన అభౌతిక భావాలు.

పాత సమాజపు కడుపులో ఆర్థిక వ్యవస్థయొక్క కొత్త రంగంతో పాటు ఉద్భవించే ఉత్పత్తి సంబంధాలు యింకా మొత్తం సమాజపు ప్రాతిపదిక కావు. కొత్త ఉత్పత్తి సంబంధాలు సామాజిక నిర్మాణరూపపు ప్రాతిపదికగా రూపాంతరం చెందడమే సామాజిక విప్లవంయొక్క ఆర్థిక సారం, అది సామాజిక అభివృద్ధిలో ఒక లంఘనం.

మునుపటి ఉత్పత్తి సంబంధాల కన్నిటికీ భిన్నంగా, సోషలిస్టు ఉత్పత్తి సంబంధాలు పాత సమాజపు కడుపులో ఒక రంగం రూపంలో ఉద్భవించవు. అందువలన పెట్టుబడిదారీ నిర్మాణరూపం కమ్యూనిస్టు నిర్మాణరూపంగా రూపాంతరం చెందడానికీ, తదనుగుణంగా పెట్టుబడిదారీ ప్రాతిపదిక స్థానంలో సోషలిస్టు ప్రాతిపదిక రావడానికీ ప్రత్యేక విప్లవాత్మక

దశ అవసరం. దీనిని పెట్టుబడిదారీ వ్యవస్థనుండి సోషలిజంకు పరివర్తన జరిగే దశ అంటారు.

యీ దశలో, పాత ప్రాతిపదిక బద్దలు చేయబడి కొత్తది నిర్మించబడేకొద్దీ, పాత సామాజికార్థిక నిర్మాణరూపం ధ్వంసం చేయబడి, కొత్తది నెలకొల్పబడుతుంది. అందువలన యీ దశ ప్రత్యేక సామాజిక నిర్మాణరూపంగా పరిగణించబడజాలదు. పరివర్తన దశలో కొత్త ప్రాతిపదికకు బీజమై, ప్రధాన పాత్ర నిర్వహించే సోషలిస్టు రంగం, పెట్టుబడిదారీ రంగంతో చేసే పోరాటం వుంటుంది. సోషలిజం జయించడమంటే సోషలిస్టు రంగం మొత్తంగా సమాజంయొక్క ప్రాతిపదికగా నెలకొల్పబడిందన్న మాట. సోషలిజంనుండి కమ్యూనిజంకు జరిగే పురోగతిలో సోషలిస్టు ప్రాతిపదిక తొలగించబడదు, అది మరింత అభివృద్ధి చేయబడి, మెరుగుపరచబడగా, సోషలిస్టు ఉత్పత్తి సంబంధాలు కమ్యూనిస్టు ఉత్పత్తి సంబంధాలుగా రూపాంతరం చెందుతాయి. యివే సంపూర్ణ కమ్యూనిస్టు నిర్మాణరూపానికి ప్రాతిపదిక.

అస్థిపంజరమే మొత్తం జీవి కానట్లు, ప్రాతిపదికే మొత్తం సామాజిక నిర్మాణరూపం కాదు. సామాజిక నిర్మాణరూపంలోని మరొక కీలక భాగం, మేము చెప్పినట్లు, ఉపరి నిర్మాణం. యిది అస్థిపంజరానికి రక్త మాంసాల లాంటిది.

ఉపరినిర్మాణ మనేది నిర్దిష్ట ఆర్థిక ప్రాతిపదికనుండి ఉద్భవించే భావజాల సంబంధాల, భావాల, సంస్థల సాకల్యం. అది ప్రాతిపదికతో సజీవంగా ముడివడి, దానిమీద చురుకైన ప్రభావం నెరపుతుంది.

ఉపరినిర్మాణంయొక్క కూర్పు మహా జటిలమైనది, వైవిధ్య పూరితమైనది. దానిలో అన్నిటికంటె ముఖ్యమైనది భావజాలం. వర్గాలుగా విభజింపబడిన సమాజంలో దీనికి వర్గ స్వభావం వుంటుంది. భావజాలం అప్పుడు అమలులో వున్న ఆర్థిక సంబంధాలను దృఢపరచ డానికి గానీ, ధ్వంసం చేయడానికి గానీ ఉపయోగపడుతుంది. అది సమాజానికి యెదురయ్యే సామాజిక సమస్యలను పరిష్కరించడానికీ, ఆ సామాజిక నిర్మాణరూపంయొక్క భావజాల సంబంధాలను రూపుదిద్దడానికీ తోడ్పడుతుంది. ఉపరినిర్మాణంలోని భావజాలపు భాగాలు సారంలోనే కాక, రూపంలో కూడా ఒక సామాజికార్థిక నిర్మాణరూపంలో వున్నట్లు మరొక దానిలో వుండవు. వర్గ విభజిత సమాజం పుట్టినప్పటినుండి అది రాజకీయ, న్యాయశాస్త్ర, మత అభిప్రాయాల, తాత్విక సిద్ధాంతాల, నైతిక సూత్రాల, కళల, సౌందర్య భావాల చారి త్రకంగా నిర్దిష్టమైన సాకల్యంగా కనపడింది.

భావజాల రూపాలు సామాజిక శత్రుత్వాలను గుర్తుపట్టడానికీ, వాటి పరిష్కార మార్గా లను నిర్ణయించడానికీ తోడ్పడుతాయి; అవి వివిధ వర్గాల విరుద్ధ ప్రయోజనాల ఘర్షణను ప్రతిబింబిస్తాయి. యీనాడు, మార్క్సిస్టు లెనినిస్టు భావజాలానికీ, బూర్జువా భావజాలానికీ

మధ్య జరిగే ఘర్షణ కార్మికవర్గానికీ, బూర్జువావర్గానికీ మధ్యా, సోషలిస్టు ప్రపంచానికీ, పెట్టుబడిదారీ ప్రపంచానికీ మధ్యా గల నిజమైన శత్రుత్వాన్ని ప్రతిబింబిస్తుంది.

ప్రతి వర్గ సామాజిక నిర్మాణరూపంలోనూ పాలకవర్గపు భావజాలం ప్రాబల్యం వహిస్తుంది. యీ వర్గం పాదార్థిక ఉత్పత్తి రంగంలో ప్రాబల్యం వహిస్తుంది గనుక, ఆత్మిక ఉత్పత్తి సాధనాలను కూడా వశపరచుకుంటుంది. చర్చి, పాఠశాలా, సామూహిక బహుళ ప్రచార సాధనాలు ప్రజా విద్యా పాలకవర్గం చేతుల్లో వున్నాయి; కనుక "సాధారణంగా, మానసిక ఉత్పత్తి సాధనాలు లేనివాళ్ల భావాలు దానికి లోబడుతాయి."*

చారిత్రక అభివృద్ధి గతిలో సామాజిక శత్రుత్వాలు తీవ్రమయ్యే కొద్దీ, విప్లవ వర్గాల ప్రయోజనాల ప్రతిబింబంగా కొత్త భావజాలం ఉత్పన్నమౌతుంది. అది ప్రాబల్యపు భావజాలాన్ని యెదుర్కొని, క్రమక్రమంగా అంతకంతకూ విస్తారమైన జనాల అండదండలను చూరగొంటుంది. జనాలమీద పట్టు సంపాయించడంద్వారా కొత్త భావజాలం సామాజిక అభివృద్ధికి చెందిన జరూరు కర్తవ్యాలను పరిష్కరించగల శక్తి అవుతుంది.

దోపిడీ వర్గాలేవీ లేని సోషలిజంలో భిన్న భావజాలాలు వుండడానికి యే ఆధారమూ వుండదు. అందువల్లనే, సోషలిజంలో శాస్త్రీయ మార్క్సిస్టు లెనినిస్టు భావజాలం క్రమక్రమంగా మొత్తం సమాజంయొక్క భావజాల మౌతుంది.

ఉపరినిర్మాణంలో భావజాలం కాక, మామూలు అభిప్రాయాల, భావాల, అనుభూతుల, చిత్తవృత్తుల వెరసి మొత్తం వుంటుంది — సామాజిక మనస్తత్వం అనబడేది. భావజాలమూ, మనస్తత్వమూ ఒకదానిమీద ఒకటి పనిచేస్తాయి. ఆవిధంగా, పెట్టుబడిదారీ సమాజంలోని కార్మికుని మనస్తత్వం, అతని దినదిన చైతన్యం, ఒకవైపున సోషలిస్టు భావజాల వ్యాప్తికి అనుకూల పరిస్థితులను సృష్టిస్తుంది (కార్మికవర్గం అప్రయత్నంగా సోషలిజం కొరకు పాటుపడుతుంది గనుక). మరొకవైపున అది అనేక దురభిప్రాయాలతోనూ, భ్రమలతోనూ, బూర్జువా అభిప్రాయాలతోనూ నిండివుంటుంది. కార్మికవర్గం తన విప్లవ పోరాట గతిలో మాత్రమే వాటిని వదలించుకొంటుంది. సోషలిస్టు భావజాలం కార్మికవర్గపు వివేకంమీద పనిచేయగా, బూర్జువా భావజాలం దాని దురభిప్రాయాలను వినియోగించుకుంటుంది. పీడకుల ప్రాబల్యపు భావజాలాన్ని పీడిత వర్గాల స్వతంత్ర భావజాలం యెదిరించని చోట, మొదటిది శ్రామిక జనంమీద రెండు విధాలుగా రుద్దబడుతుంది — వాళ్ల పరిసరాలద్వారా అప్రయత్నంగానూ, పాలకవర్గమూ, దాని సిద్ధాంతకారులూ, రాజకీయవాదులూ, ప్రాతికేయులూ, మొదలైనవాళ్లు చేసే ప్రయత్నాలద్వారా ఉద్దేశపూర్వకంగానూ. బూర్జువా భావజాలంమీద రాజీలేని

* K. Marx and F. Engels, *The German Ideology*, పుట 61.

పోరాటం జరిగితే తప్ప, శాస్త్రీయ మార్క్సిస్టు లెనినిస్టు భావజాలం గెలిచి, జనాల మనస్సులలో పాదుకొనజాలదు.

వాస్తవ జీవితంలో మనుషులు ఒకరితో ఒకరు ఉత్పత్తి సంబంధాలు — ప్రాతిపదికకు చెందిన సంబంధాలు — మాత్రమే కాక, అనేక యితర సామాజిక సంబంధాలను కూడా యేర్ప రచుకుంటారు. మరి మనం ప్రాతిపదికకు చెందిన సంబంధాలనూ, ఉపరినిర్మాణానికి చెందిన సంబంధాలనూ యెలా వింగడించాలి?

సామాజిక సంబంధాలు చారిత్రకంగా వేర్పాటైన ఉత్పత్తి విధానపు ప్రాతిపదికమీద సామాజిక జీవితపు భిన్న రంగాలలో మానవులు చేసే కార్యకలాపాల క్రమంలో వాళ్ల మధ్య యేర్పడే వివిధ అనుబంధాలు. యీ సంబంధాలు నిర్దిష్టమైన రకం సంబంధాలుగా యేర్పడి, అన్నీ కలిసి మానవుని సామాజిక ఉనికి అయిన సమాజాన్ని నిర్మిస్తాయి. తద్వారా యివి, ఒకవైపున, జంతువులనుండి మానవుని గుణాత్మక భిన్నత్వాన్ని నిర్ణయిస్తాయి, మరొకవైపున, యేకాకి వ్యష్టి జీవితంయొక్క అసాధ్యతను వెల్లడిస్తాయి. మానవుడు సామాజిక జీవిగా మాత్రమే, అనగా సమాజంలో మాత్రమే, వివిధ సామాజిక సంబంధాల వ్యవస్థ లోపల మాత్రమే, వుంటాడు, అభివృద్ధి చెందుతాడు. అదే సమయంలో మానవులు సామాజిక జీవులుగా వ్యక్తిగత సంబంధాలు యేర్పరచుకొన్నప్పటికీ సామాజిక సంబంధాలను వ్యక్తుల మధ్య సంబంధాలకంటె భిన్నంగా చూడాలి. సామాజిక సంబంధాలు, సరైన అర్థంలో, భిన్న మానవ సముదాయాల మధ్యా, సామాజిక బృందాల మధ్యా, వర్గాల మధ్యా, వాటి లోపలా గల సంబంధాలూ, రాజ్యం లోపల గల సంబంధాలూ, రాజ్యాల మధ్యా, జాతుల మధ్యా గల సంబంధాలూ, మొదలైనవి.

చరిత్రలో భౌతికవాదపు ప్రధాన భావం యేమిటంటే: "సామాజిక సంబంధాలు భౌతిక సంబంధాలు అనీ, భావజాల సంబంధాలు అనీ రెండు రకాలు. మానవుడు తన మనుగడ సాగించడానికి చేసే కార్యకలాపాల రూపంగా (ఫలితంగా), మానవుని యిచ్ఛతోనూ, చైతన్యంతోనూ సంబంధం లేకుండా రూపుదాల్చే భౌతిక సంబంధాలమీద యేర్పడే ఉపరినిర్మాణం మాత్రమే భావజాల సంబంధాలు"* అని లెనిన్ చెప్పినాడు. భావజాల సంబంధాలు భౌతిక, ఆర్థిక సంబంధాలకంటె యెలా భిన్నమంటే, అవి ద్వితీయమైనవి, అనుమేయాలు, మొదట మానవుల మనస్సుల గుండా గడచి తరువాత మాత్రమే ఉద్భవించేవి. అనగా, అవి భౌతిక సంబంధాలచేత నిర్ణయింపబడుతూ, పూర్తిగా వాటిమీద ఆధారపడుతూ, నిర్దిష్ట ఆర్థిక సంబంధాలను ప్రతిబింబించే నిశ్చితమైన భావాలనుబట్టి రూపుదాలుస్తాయి.

---

*V. I. Lenin, *Collected Works*, Vol. I, పుట 151.

భావజాల సంబంధాలు ప్రతి సామాజిక నిర్మాణరూపంలోనూ యేర్పడుతాయి; యెందు కంటే, దాని ఆర్థిక ప్రాతిపదికను అవి పోషించాలి, నిలపాలి, దృఢపరచాలి. యీ సంబంధాలు విధిగా వర్గ నిర్మాణరూపాల ఆర్థిక వ్యవస్థచేత సృష్టింపబడుతాయి, వీటి స్వభావమూ, సారమూ పూర్తిగా ఆ ప్రాతిపదికమీద ఆధారపడుతాయి. కానీ, మనుషులు చైతన్యవంతంగా యీ సంబంధాలు నెలకొల్పుకొంటారు. ఆవిధంగా రాజకీయ సంబంధాలు నిర్దిష్ట నిర్మాణ రూపంలోని వర్గాల ఆర్థిక శత్రుత్వాన్ని వ్యక్తం చేస్తున్నప్పటికీ, అవి వర్గ స్వీయచైతన్యం పుట్టినప్పుడు మాత్రమే అవతరించడంలో వాటి భావజాల స్వభావం వ్యక్తమౌతుంది. బూర్జువా వర్గంమీద కార్మికవర్గపు రాజకీయ పోరాటం విప్లవ పార్టీ లేకుండా, కార్మికవర్గ ఉద్యమంలోకి విప్లవ సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టకుండా సాగజాలదు, అనగా జనాలలో రాజకీయ చైతన్యం నిరంతరంగా పెరగకుండా సాగజాలదు. కనుక, భావజాల సంబంధాలు కేవలం భావాలమధ్య సంబంధాలు కాదు, అవి నిర్దిష్ట భావాల కనుగుణంగా మనుషుల మధ్య యేర్పడే సంబంధాలు; యీ భావాలు ప్రతి సామాజిక నిర్మాణరూపంలోనూ అత్యంత అవసరమైన కొన్ని అంశాలుగా వుండి, దాని ఉపరినిర్మాణంలో ఒక భాగంగా యేర్పడుతాయి.

సమాజపు భావజాలాన్నీ, దాని రూపాలనూ బట్టి ప్రతి సామాజికార్థిక నిర్మాణరూపం లోనూ భావజాల సంబంధాలు మాత్రమే కాక, వివిధ సంస్థలు కూడా రూపుదాలుస్తాయి. వీటిలో రాజ్య, న్యాయ సంస్థలూ, రాజకీయ పార్టీలూ, ట్రేడ్ యూనియన్లూ, చర్చి, తదితర మత సంస్థలూ, సాంస్కృతిక, విద్యా, శాస్త్రీయ సంస్థలూ, వగైరా వుంటాయి.

వర్గ సమాజంలో రాజ్యం ఉపరినిర్మాణపు ప్రధాన సంస్థ, దానికి కీలకమైనది; ఆర్థిక వ్యవస్థలో ప్రాబల్యం వహించే వర్గం ఉపరినిర్మాణంలో కూడా ప్రాబల్యం వహించడానికి దానిని ఉపయోగించుకొంటుంది.

ఎంగెల్సు యిలా రాసినాడు: "నిర్దిష్ట సమాజంలోని ఆర్థిక సంబంధాలు మొట్ట మొదట ప్రయోజనాలుగా కనపడుతాయి."*

యీ ప్రయోజనాలు రూపుదాల్చేకొద్దీ, వర్గ పోరాటం అభివృద్ధి చెందేకొద్దీ, వర్గ ప్రయోజనాలూ, విరుద్ధ వర్గాల ప్రయోజనాలతో వాటి వైరుధ్యాలూ వాస్తవమయ్యే కొద్దీ, యీ వర్గాల ప్రయోజనాలను వ్యక్తంచేస్తూ, కాపాడుతూ, సంరక్షిస్తూ వుండే సంస్థ లను నెలకొల్పుకోవలసిన అవసరం అంతకంతకూ యెక్కువగా గ్రహించబడుతుంది. కనుక,

---

* K. Marx and F. Engels, *Selected Works* in three volumes, Vol. 2, p. 363.

ఉపరినిర్మాణంలో సంస్థలను నెలకొల్పడం మనుషుల చైతన్యంమీద, సామాజిక భావాలమీద, ఆధారపడడం నిజమే అయినప్పటికీ, యీ భావాలు పొద్దుబోని ఆలోచనల ఫలితం కాదు, సంస్థల యేర్పాటు స్వేచ్ఛాయుతమైన ఒప్పందపు ఫలితం గానీ, సామాజిక కాంట్రాక్టు ఫలితం గానీ కాదు.

శత్రుత్వ పూరిత నిర్మాణరూపాల ఉపరినిర్మాణం, దాని సకల భావాలతోనూ, భావజాల సంబంధాలతోనూ, సంస్థలతోనూ కలిసి, వర్గాల మధ్య జరిగే పోరాటపు ఫలితమూ, సాధనమూ.

ఉపరినిర్మాణం లోపల వుండే సంస్థల నిర్దిష్ట లక్షణం యేమిటంటే, అవి భావజాల శక్తి మాత్రమే కాక, భౌతిక శక్తి కూడా. ఆవిధంగా, రాజ్యానికి సైన్యమూ, పోలీసులూ, జైళ్ళూ, వగైరా లాంటి భౌతిక సాధనాలు వున్నాయి; అది తన కర్తవ్యాలను నిర్వహించడానికీ, సమాజాన్ని పాలకవర్గపు ప్రయోజనాలకూ, యిచ్ఛకూ లోబరచడానికీ వాటిని ఉపయోగిస్తుంది. రాజకీయ పార్టీల లాంటి వివిధ సంస్థలు వ్యవస్థీకరణా, ఉమ్మడి ప్రయోజనమూ, క్రమశిక్షణా, వగైరాల భౌతిక ఐక్యతచేత యేకం చేయబడుతాయి; అందువలన అవి విస్తారమైన జనాల, వర్గాల ఆచరణను సమాజం యెదుర్కొనే సమస్యల పరిష్కారంవైపు మళ్ళించగలుగుతాయి. అధికారం కొరకు జరిగిన పోరాటంలో కార్మికవర్గానికి వ్యవస్థీకరణ తప్ప యే ఆయుధమూ లేదు అని లెనిన్ అన్నాడు, తద్వారా, భౌతిక శక్తిగా దాని అపారమైన ప్రాముఖ్యాన్ని నొక్కిచెప్పాడు.

సమాజంలోని వివిధ సామాజిక బృందాల నిర్దిష్ట చర్యలుగా వ్యక్తమయ్యే భావజాల సంబంధాలూ, వాటికి సంబంధించిన సంస్థలూ సామాజిక జీవితంలో ఒక ప్రత్యేక రంగంగా యేర్పడుతాయి; అదే సామాజిక రాజకీయ రంగం. ఉపరినిర్మాణంలోని సంస్థలకు భౌతిక పార్శ్వం వుండడం వలన, అవి ప్రాతిపదికమీద, సామాజిక అస్తిత్వంమీద, నిర్దిష్ట భావాల ప్రభావానికి వాహికలుగా పనిచేయగలుగుతాయి, తద్వారా ఆ భావాలను భౌతిక శక్తిగా రూపాంతరీకరించగలుగుతాయి. సామాజిక జీవితంలో యీ రంగం లేకుండా వుంటే, భావాలు కేవలం కోరికగానే వుండి, సమాజ అభివృద్ధిని ప్రభావితం చేయకుండా వుండేవి. సామూహిక ఆచరణద్వారా మాత్రమే, ఉపరినిర్మాణంలోని వివిధ సంస్థల కార్యకలాపాలద్వారా మాత్రమే సామాజిక భావాలు సమాజంలో జీవితాన్నీ, అభివృద్ధినీ ప్రభావితం చేయగలవు.

సకల సామాజిక నిర్మాణరూపాలకు సామాన్యమైన యీకింది విషయాల వలన ఉపరినిర్మాణం అవసర మౌతుంది. ఒకటి, మానవులు అవసరమైన భౌతిక సంబంధాలు యేర్పరచుకొని, వస్తుగత నియమాల చర్యకు లోబడినప్పుడు, యీ నియమాల అవసరాలు చైతన్యపూర్వ

కమూ ఇచ్ఛాపూర్వకమూ అయినట్లు వాళ్లు యేదో ఒక విధంగా వాస్తవీకరిస్తారు. మరొక విధంగా చెప్పాలంటే, సామాజిక అభివృద్ధియొక్క వస్తుగత అవసరాలూ, నియమాలూ మానవ కార్యకలాపాలలో వాస్తవీకరింపబడడానికి అవి యేదో ఒక రూపంలో వాళ్లచేత ప్రతిబింబింప బడాలి, అనగా అవి వాళ్ల మనస్సులగుండా గడచి, వాళ్ల కార్యకలాపాల వెనుక వున్న భావాత్మక ప్రేరణలుగా కనపడాలి. అందువల్లనే, నిర్దిష్ట సామాజిక నిర్మాణరూపంయొక్క ఉపరి నిర్మాణంగా యేర్పడే భావజాలమూ, తదనుగుణమైన సామాజిక సంబంధాలూ, సంస్థలూ విధిగా భౌతిక సంబంధాల ప్రాతిపదికమీద ఉద్భవిస్తాయి. రెండు, సమాజానికి యెదురయ్యే సామాజిక కర్తవ్యాలు విస్తారమైన జన సముదాయాలచేత, వర్గ సమాజంలో వర్గాలచేతా, వివిధ సామాజిక బృందాలచేతా, నిర్వహించబడుతాయి; వీటి సంయోగానికీ, వ్యవస్థీకరణకూ కూడా భావజాలమూ వివిధ రకాల సంస్థలూ, అనగా ఉపరినిర్మాణం, అవసరం.

ఉపరినిర్మాణం అన్ని సామాజిక నిర్మాణరూపాలలోనూ విధిగా వుండే విషయం, ప్రతి నిర్మాణరూపంలోనూ దానికి నిర్దిష్ట లక్షణాలు వుంటాయి. యే సామాజిక శక్తుల చర్యా ప్రతిచర్యలవల్ల సామాజిక నిర్మాణరూపాల అభివృద్ధి జరుగుతుందో, చారిత్రక క్రమాన్ని పరిశోధించినప్పుడల్లా వేటి ప్రభావాన్ని తప్పక పరిగణించాల్నో, ఆ సామాజిక శక్తులలో ఒకటి ఉపరినిర్మాణం.

బానిస యజమాన, ఫ్యూడల్, బూర్జువా ఉపరినిర్మాణాలు తదనుగుణమైన సామాజిక నిర్మాణరూపాలలో ప్రబలంగా వుండినాయి. కానీ, ప్రతి శత్రుత్వపూరిత నిర్మాణరూపంయొక్క ఉపరినిర్మాణంలోనూ పీడిత వర్గాల దృష్ట్యా ప్రాతిపదికను ప్రతిబింబించే భావాలూ, సంస్థలూ వుంటాయి, ప్రాబల్యపు ఉపరినిర్మాణంలో భాగం కానట్టివి. వాస్తవంలో, యీ ఉపరినిర్మాణం వాటిని అణచివేయడానికి, యేమైనప్పటికీ వాటి ప్రభావ పరిధిని పరిమిత పరచడానికి ప్రయత్నిస్తుంది. అవి ఆ ప్రాతిపదికను దృఢపరచడానికి పనిచేయవు, దానిని ధ్వంసం చేయడానికీ, సమూలంగా మార్చడానికీ పనిచేస్తాయి; అవి ఆ నిర్మాణరూపంయొక్క అభివృద్ధిచేతనే ఉత్పన్నం చేయబడిన వ్యతిరేక అంశాలు. ప్రతి నిర్మాణరూపమూ అభివృద్ధి చెందుతుంది, దాని ఆర్థిక వ్యవస్థలో మాత్రమే కాక, ఉపరినిర్మాణంలో కూడా గతానికి చెందిన అవశేషాలూ, భవిష్యత్తుకు చెందిన బీజాలూ వుంటాయి. పెట్టుబడిదారీ వ్యవస్థలో అలాంటి భవిష్యత్తు బీజాలు యేవంటే, మార్క్సిస్టు లెనినిస్టు భావాలూ, కమ్యూనిస్టు పార్టీలూ, కార్మికవర్గానికి చెందిన యితర విప్లవ సంస్థలూ; యివి బూర్జువా ఉపరినిర్మాణంలో భాగం కావు. సోషలిజంలో గతానికి చెందిన అవశేషాలు యేవంటే, మతమూ, చర్చీ; యివి సోషలిస్టు ఉపరినిర్మాణంలో భాగం కావు.

శత్రుత్వపూరిత నిర్మాణరూపాల ప్రాబల్యపు ఉపరినిర్మాణం దోపిడీ వర్గాల ప్రయోజనాలతో ముడివడి వుంటుంది. తద్వ్యతిరేకంగా, సోషలిస్టు సమాజపు ఉపరినిర్మాణం శ్రామిక ప్రజలకే చెందిన ప్రయోజనాలను వ్యక్తం చేస్తుంది; కనుక అది సోషలిస్టు ప్రాతిపదికను నిలిపివుంచడానికీ, కాపాడడానికీ సాధనంగా పనిచేస్తుంది, జనాల ప్రయోజనాలకే అనుగుణంగా దానిని మార్చడానికీ, అభివృద్ధి చేయడానికి శక్తివంతమైన సాధనంగా పనిచేస్తుంది.

సమాజపు యితర నిర్మాణ అంశాలు

ఉత్పత్తి విధానమూ, ప్రాతిపదికా, ఉపరినిర్మాణమూ యే సామాజిక నిర్మాణ రూపానికైనా అత్యంత ముఖ్యమైన నిర్మాణ అంశాలు. అవి ప్రతి సామాజిక నిర్మాణ రూపంలోనూ భౌతిక ప్రాతిపదికనూ, ఆర్థిక చట్రాన్నీ, సామాజిక రాజకీయ, ఆత్మిక స్వభావాన్నీ నిర్ణయిస్తాయి. కానీ, యివి కాక, సమాజంలో యితర నిర్మాణ అంశాలు వున్నాయి. వాటిని పరిగణించకుండా, సామాజిక వ్యవస్థయొక్క సిద్ధాంత పరిశీలన యేదీ, యెంత సాధారణమైనదైనా, సంపూర్ణం కాదు.

నిర్మాణ అంశాలలోని వైవిధ్యాన్ని విడదీయడానికి సమాజ పరిశీలనలో కనీసం రెండు విషయాలనైనా నొక్కిచెప్పాలి. ఒకటి, సమాజంపట్ల వైఖరి – సామాజిక నిర్మాణరూపాన్ని అన్నీ ఒక సంకీర్ణ సామాజిక శరీరియొక్క అంగాలుగా చూడబడే భిన్న సామాజిక సంస్థలయొక్కా, సామాజిక జీవితపు వివిధ పరస్పర సంబంధిత పార్శ్వాలయొక్కా, సంస్థలూ, వగైరాలయొక్కా వస్తుగత వ్యవస్థగా చూడడం. యీ స్థాయిలో సామాజిక నిర్మాణాన్ని పరిశీలించడంలో, మనం పైన గమనించిన ఉత్పత్తికీ, ప్రాతిపదికకూ, ఉపరినిర్మాణానికీ తోడుగా వెల్లడించబడే అంశాలు యేవంటే, జీవిత విధానమూ, కుటుంబమూ, పాఠశాలా, భాషా, శాస్త్రీయ సంస్థలు, క్రీడా సంస్థల లాంటి సామాజిక సంస్థలూ.

రెండు, సమాజాన్ని మానవుల చర్యా ప్రతిచర్యల ఫలితంగా, మానవుల మధ్య గల సంబంధాల సముదాయంగా, వాళ్ల కార్యకలాపాల ఫలితంగా చూడడం. యీ స్థాయిలో వెల్లడించబడే నిర్మాణ అంశాలలో వున్నవి చారిత్రకంగా వేర్పాటైన మానవ సమూహాలు. అవి సమాజపు ఆర్థిక జీవితంమీద ఆధారపడుతూ, రక్త బంధుత్వం, ప్రాదేశిక ఐక్యత, ఆస్తి సంబంధాల, వృత్తుల, జాతి, వయో విభేదాల, ప్రయోజనాల, మత విశ్వాసాల బట్టి యేర్పడతాయి. అందువల్ల వర్గాలు, జాతులు లాంటి ప్రధాన నిర్మాణపు అంగాలుగా వెల్లడించడంతో

పాటు, యితర సామాజిక బృందాలు, వాటి మధ్య వున్న సంబంధాలు దృష్టిలో పెట్టుకోవాలి (ప్రకరణం అయిదు చూడండి).

సామాజిక నిర్మాణంలోని ప్రతి అంశంయొక్క నిర్దిష్ట లక్షణాలనూ అర్థం చేసుకోడానికి, కింది అంశాలను పరిగణించాలి:

1) నిర్దిష్ట సామాజిక విషయంయొక్క విశిష్ట లక్షణాలు;

2) అది దేనినుండి ఉద్భవిస్తుందో ఆ సామాజిక అవసరంయొక్క స్వభావమూ, దాని సామాజిక క్రియలూ;

3) ఆ సామాజిక వ్యవస్థలో ఆ నిర్దిష్ట విషయంయొక్క స్థానమూ, ఉత్పత్తితోనూ, ప్రాతిపదికతోనూ, ఉపరినిర్మాణంతోనూ, సామాజిక నిర్మాణరూపంయొక్క యితర నిర్మాణ అంశాలతోనూ దానికి గల సంబంధంయొక్క స్వభావమూ.

యిక యీ అంశాలలో కొన్నిటిని పరిశీలిద్దాం.

జీవిత విధానం భౌతిక, ఆత్మిక వస్తువుల వ్యష్టి అనుభోగపు రంగం, పని గంటల తర్వాత జరిగే వ్యక్తిగత నిత్య జీవిత రంగం. అది అనుభోగపు క్రమంతోనూ, యీ క్రమానికి సరఫరా చేయడంతోనూ ముడివడిన మానవ సంబంధాల నిర్దిష్ట రంగం కూడా.

పనిక్రమంలో ఖర్చైన శారీరిక, ఆత్మిక శక్తులను పునరుద్ధరించుకోవలసిన అవసరం ప్రతి వ్యక్తికీ వుంది గనుక, నిత్య జీవిత రంగం సామాజిక జీవితపు ప్రత్యేక రంగంగా రూపు దాలుస్తుంది. యిది వ్యష్టి అనుభోగపు రంగ మైనప్పటికీ, మానవులు సామాజిక జీవులుగా అనుభోగిస్తారు; అందువల్లనే యీ రంగంలో కూడా కుటుంబంలోని మానవుల మధ్యా, కుటుంబాల మధ్యా వివిధ సంబంధాలు యేర్పడుతాయి — యిరుగుపొరుగు సంబంధాలూ, అనుభోగ వస్తువుల సంయుక్త వినియోగానికి సంబంధించిన సంబంధాలూ, వగైరా.

యే సమాజంలోనైనా నిత్య జీవితపు విశిష్ట గుణాలు ఉత్పత్తి స్థాయీ, సంస్కృతీ స్థాయీ, తదితర పరిస్థితులమీద ఆధారపడుతాయి. అది వర్గ విభజనచేత కూడా గమనార్హంగా ప్రభావిత మౌతుంది. నిత్య జీవితానికి చెందిన అనేక లక్షణాలు జాతీయ విశిష్టతలచేతా, భౌగోళిక పరిస్థితులచేతా, చారిత్రక సంప్రదాయాలచేతా నిర్ణయింపబడుతాయి. మతమూ, కళలూ, నీతులూ, మొదలైన వివిధ రూపాల సామాజిక చైతన్యంచేత నిత్య జీవితం ప్రభావితం చేయబడుతుంది. విలువలకూ, ప్రమాణాలకూ, నియమాలకూ చెందిన వివిధ వ్యవస్థలూ, సామాజిక మనస్తత్వానికి చెందిన కొన్ని లక్షణాలూ నిత్య జీవిత రంగంలో రూపుదాలుస్తాయి. తన వంతుకు యీ రంగం, ఉత్పత్తిమీదా, సామాజిక జీవితపు యితర పార్శ్వాలమీదా ప్రభావం నెరపుతుంది. యిప్పుడు పౌర సేవల రంగంలో పనిచేసే కార్మికుల సంఖ్య పెరిగే ధోరణి వుంది. ఫాక్టరీల, ఆఫీసుల శ్రమ ఉత్పాదకత నిత్య సేవలూ, సౌకర్యాలూ యెలా యేర్పాటు చేయబడినా

యనేదానిమీదా, పౌర సేవల రంగంలో పనిచేసేవాళ్ళ శ్రమ ఉత్పాదకతమీదా యెక్కువగా ఆధారపడుతుందని స్థిరంగా నిర్ధారించబడింది.

సమాజం అభివృద్ధి చెందే కొద్దీ, నిత్య జీవితపు సేవలు సమకూర్చడానికి ప్రత్యేక పరిశ్రమల మొత్తం వ్యవస్థ ఒకటి నెలకొల్పబడుతుంది. దీనిద్వారా గృహ పరికరాల అభివృద్ధీ, రోజువారీ సేవలలో అంతకంతకూ యెక్కువ మంది స్త్రీపురుషులు వినియోగింపబడడమూ జరుగుతుంది. రోజువారీ సేవల రంగం అభివృద్ధిలో రెండు స్పష్టంగా గమనార్హమైన, పరస్పర వ్యతిరేకమైన ధోరణులు వున్నాయి. ఒకవైపున, రోజువారీ అవసరాలను తీర్చడంలో సమాజం ఆధునిక సాంకేతిక విజయాలను ఉపయోగించే కొద్దీ, నిత్య జీవితాన్ని సామాజీకరించే ధోరణి వుంది (పౌర భోజనశాలలూ, శిశు సంక్షేమ సంస్థలూ, పబ్లిక్ లాండ్రీలూ, డ్రై క్లీనింగులూ, వగైరా అభివృద్ధి చేయడం). మరొక వైపున, మానవుడు యీ రంగంలో తన ప్రత్యేకతను ప్రదర్శించుకోవాలనీ, తన వ్యక్తిగత యిష్టాలనూ, అభిరుచులనూ, అవసరాలనూ తీర్చుకోవాలనీ ప్రయత్నించడంతో, నిత్య జీవితాన్ని వ్యష్టీకరించే ధోరణి వుంది.

సోషలిజం యీ రెండు ధోరణులనూ అభివృద్ధి చేయడానికీ, యీ రెండిటి గరిష్ఠ సంయోజనం వైపు క్రమక్రమంగా పురోగమించడానికీ ప్రయత్నిస్తుంది. యీ స్థితిలో ప్రతి వ్యక్తీ, ఒకవైపున, సామాజిక అనుభోగపు రూపాల వినియోగంద్వారా, రోజువారీ పనులనుండి గరిష్ఠంగా విముక్తుడౌతాడు, మరొక వైపున, తన వ్యక్తిగత అవసరాలనూ, యిష్టాలనూ, ప్రయోజనాలనూ తీర్చుకోడానికి అవకాశం పొందుతాడు. నిత్య జీవిత రంగంలో అచ్చమైన కమ్యూనిస్టు సంబంధాలు కూడా అభివృద్ధి చెందే ప్రాతిపదిక అదే. నిత్య జీవితపు కమ్యూనిస్టు సామాజీకరణ క్రమానికీ, "బారకాసు కమ్యూనిజం" గురించిన ఆదిమ భావాలకూ యేమీ సంబంధం లేదు.

కుటుంబం. కుటుంబం అనేది ప్రతి సమాజంలోనూ కనపడే వ్యవస్థ. భార్యా భర్తల వైవాహిక సంబంధాలమీద యిది ఆధారపడింది. (మేమిక్కడ ఆదిమ సమాజంలోని బృంద వివాహాన్ని చర్చించడం లేదు.) వివాహ సంబంధాలచేతా (భార్యా భర్తలు), రక్త సంబంధాల చేతా (తల్లిదండ్రులూ, సంతానమూ, అన్నదమ్ములూ, అక్కచెల్లెండ్లూ) బంధింపబడిన మనుషుల బృందంతో కుటుంబం యేర్పడుతుంది. యీ బృందాన్ని ఒకే కుటుంబపు సభ్యులనుగా చేసే మరొక విషయం యేమిటంటే, వాళ్ళందరూ ఒకే సంసారంలో భాగస్వాములై, నిత్య జీవితంలో కలిసివుంటారు.

కుటుంబ వ్యవస్థ పుట్టడానికీ, మనడానికీ ప్రధాన కారణం యేమిటంటే, మానవ పునరుత్పత్తికీ, పిల్లల పెంపకానికీ గల అవసరం. కానీ, మానవ సమాజంలో యీ క్రియలు

సామాజికమైనవి. అందువల్లనే, కుటుంబ రూపాలూ, అది అభివృద్ధి చెందే పద్ధతీ సామాజిక విషయాల అభివృద్ధిని పాలించే సాధారణ నియమానికీ ఆర్థిక పరిస్థితులకూ, అవసరాలకూ అనుగుణంగా నిర్ణయింపబడుతాయి. ఆవిధంగా, సొంత ఆస్తియొక్క ఆవిర్భావం ఆస్తిని వంశ పారంపర్యంగా అందజేయవలసిన అవసరంతో ముడిపడివుంది. ఉత్పత్తిలో పురుషుడు ప్రధాన పాత్ర నిర్వహించినందున, వంశ పారంపర్యం పితృ పార్శ్వంలో వుండింది. యిది యేక భార్యాభర్తృక కుటుంబానికి గానీ, బహు భార్యా భర్తృక కుటుంబానికి గానీ పరివర్తనను నిర్ణయించింది. రెండవ రకం కుటుంబంలో వంశ పారంపర్యం కూడా పురుష పార్శ్వంలో వుండింది. తదనంతరం, స్త్రీ పురుష సంబంధాల స్వభావంమీదా, కుటుంబ రూపాలమీదా యితర సామాజిక చారిత్రక అంశాలు ప్రభావం నెరపినాయి.

మానవ జాతిని పునరుత్పత్తి చేయవలసిన అవసరంనుండి ఉత్పన్నమైన కుటుంబం సమాజ చరిత్రలో వివిధ సామాజిక క్రియలు నిర్వహించింది. కుటుంబంయొక్క సామాజిక స్వభావం యీ విషయంలో కూడా వ్యక్తమౌతుంది. కుటుంబమనేది దాని సభ్యులు కలిసి అనుభోగించే చోటు, దీనికిగాను సంసారాన్ని పోషించే చోటు. సంయుక్త అనుభోగానికి అవకాశం వుండడమంటేనే, నిశ్చితమైన ఆదాయ మార్గాలు వుండడ మన్నమాట; వీటి మొత్తమూ, ఆర్జన పద్ధతీ సమాజంలో వున్న ఉత్పత్తి స్థాయిమీదా, ఉత్పత్తి సంబంధాలమీదా ఆధారపడుతాయి. సొంత ఆస్తిచేత పెత్తనం చేయబడే సమాజంలో, ఐశ్వర్య సంచయనమూ, సంరక్షణమూ, దానిని వంశ పారంపర్యంగా అందజేయడమూ చిన్న, పెద్ద ఆస్తిపరుల కుటుంబాల ప్రముఖ క్రియలలో చేరుతాయి.

రైతులలోనూ, చేతిపనివాళ్లలోనూ కుటుంబం నూటిగా ఉత్పత్తిచేసే యేకకం (unit) యొక్క రూపం ధరిస్తుంది; యీ క్రియ ముఖ్యంగా సన్నకారు సొంత ఆస్తి ప్రాతిపదికమీద అభివృద్ధి చెందుతుంది.

కుటుంబం అనేది పిల్లలు పెంచబడే చోటు కూడా, ఒక తరం తన అనుభవాన్నీ, తన ఆత్మిక విలువలనూ, నైతిక నియమాలనూ, సాంప్రదాయిక భావాలనూ, వగైరాలను మరొక తరానికి అందించే చోటు కూడా.

కుటుంబంయొక్క సారాంశానికీ, సామాజిక క్రియలకూ చెందిన యీ సాధారణమైన, బాగా అభౌతికమైన నిర్వచనాలకు భిన్న చారిత్రక పరిస్థితులలో కుటుంబ వ్యవస్థను పరిశీలించడానికి పద్ధతులుగా ఉపయోగపడే నిశ్చితమైన ప్రాముఖ్యం వుంది. కానీ, కుటుంబాన్ని గాఢంగా అధ్యయనం చేయాలంటే, దానిని ఆ పరిస్థితులతో గల సన్నిహిత సంబంధంలోనూ, పరస్పరాధారంలోనూ పరిశీలించాలి.

కుటుంబమనేది సమాజంలో వున్న సామాజిక సంబంధాల సూక్ష్మరూపం. కుటుంబంలోని

సంబంధాలమీద ఆ సమాజంలోని ఆర్థిక, న్యాయ, నైతిక, మత సంబంధాల ముద్ర వుంటుంది. ఆ ముద్ర యెంత గాఢంగా వుంటుందంటే, అర్థాత్తూ ప్రతి సామాజిక నిర్మాణరూపానికీ దానికి మాత్రమే విలక్షణమైన ఒక రకం కుటుంబం వుంటుంది.

సమాజ నిర్మాణంలో కుటుంబానికి గల స్థానాన్ని నిర్వచించడంలో, ఒక విషయాన్ని పరిగణించవలసిన అవసరం వుంది – అది జీవగత సంబంధాలతో, పాదార్థిక ఆర్థిక సంబంధాలతో, ఆత్మిక సంబంధాలతో సహా తన సొంత సంకీర్ణ నిర్మాణం గల నిర్దిష్ట సామాజిక వ్యవస్థ అనే విషయాన్ని.

మనిషి కుటుంబంలో రూపుదిద్దబడుతాడు. ప్రేమ, మైత్రి, పరస్పర శ్రద్ధ, నైతిక బాధ్యత, వగైరాలలాంటి అతని వ్యక్తిగత గుణాలనూ, సంబంధాలనూ కూడా అది రూపు దీరుస్తుంది. ప్రపంచ సాహిత్యంలోని కొన్ని అజరామరమైన పుటలు అచ్చమైన మానవీయ అనుభూతుల, సంబంధాల ఆవిర్భావానికీ, శత్రుత్వపూరిత సమాజాలలోని పాశవిక సామాజిక పరిస్థితులకూ మధ్య జరిగిన భీకర ఘర్షణను చిత్రిస్తాయి. ఆ పరిస్థితులు వాటి సంపూర్ణ, సమగ్ర వ్యక్తీకరణను అరికట్టినాయి, వాటిని వికృతపరచి, వికలాంగం చేసినాయి. వివాహ, కుటుంబ సంబంధాలు డబ్బు, తదితర నీచ విషయాలమీద ఆధారపడడం సోషలిజంలో చివరకు అధిగమించబడుతున్నది. కమ్యూనిస్టు సామాజిక సంబంధాల అభివృద్ధి స్త్రీ పురుషుల మధ్యా, తరాల మధ్యా వుండే సంబంధాలతో సహా మానవుల మధ్య అచ్చమైన మానవీయ సంబంధాలను రూపుదీర్చడానికీ, వాటికి సంపూర్ణ వ్యక్తీకరణ యివ్వడానికీ అవసరమైన పరిస్థితులను సృష్టిస్తుంది.

భాష. భాష అనేది సామాజిక జీవితానికి అవసరమైన ఒక అంశం; అది లేకుండా యే సమాజమూ వుండజాలదు.

భాష సంసర్గ సాధనం (medium of communication)గా, ఆలోచనల పరస్పర మార్పిడికి సాధనంగా సమాజానికి ఉపకరిస్తుంది. మనుషులు తమ ఆలోచనలకు భౌతిక రూపాన్ని యివ్వడానికి భాష, వాగ్రూపమైనదీ, లిఖితమైనదీ, తోడ్పడుతుంది. అది వాళ్లను నిర్దిష్ట సంకేతాల వ్యవస్థతో అనుబంధించి, యితర మనుషులకు అర్థమయ్యేటట్లు చేస్తుంది. భాష "ఆలోచనయొక్క ప్రత్యక్ష వాస్తవ"మనీ, అది "యితర మనుషుల విషయంలో కూడా వున్న ఆచరణాత్మక చైతన్యం అనీ, ఆ కారణంగా మాత్రమే అది స్వయంగా నా విషయంలో కూడా నిజంగా వుంది"* అనీ మార్క్సు, ఎంగెల్సు అన్నారు.

---

* K. Marx and F. Engels, *The German Ideology* ("జర్మన్ భావజాలం"), పుట 42.

ఉత్పత్తి క్రమంలో మానవులు ఒకరితో ఒకరు సంసర్గం కలిగించుకోవలసిన అవసరంనుండి భాష పుట్టింది. అది మానవజాతి అనుభవంయొక్కా, సాంస్కృతిక విజయాలయొక్కా భాండాగారం. అందువల్లనే భాష వ్యక్తికి జీవితపు సామాజిక పరిస్థితులతోనూ, సంస్కృతి తోనూ సంపర్కం కలిగించడానికి అవసరమైన సాధనం. భాషను నేర్చుకొనే గతిలో, ఆ ప్రాతి పదికమీద వ్యక్తి చైతన్యం రూపు దాలుస్తుంది. శ్రమా, భాషా మానవుని మానవునిగా చేసినాయి, ప్రతి వ్యక్తినీ సామాజీకరించడానికి అవి అవసరమైన నిత్య సాధనాలుగా కొనసాగుతాయి.

చైతన్య మెంత పాతదో భాష అంత పాతది గనుకనూ, దానితో సూటిగా ముడివడివుంది గనుకనూ, అది సహజంగా సామాజిక జీవితపు ఆత్మికరంగానికి చెందుతుంది. కానీ, భాష యొక్క ఉనికీ, అభివృద్ధీ, నిర్దిష్ట లక్షణాలూ ఆర్థిక ప్రాతిపదికచేత నిర్ణయింపబడవు గనుక, దానిని ఉపరినిర్మాణంలో చేర్చజాలం. యీ భావంయొక్క మౌలిక ప్రాముఖ్యం యేమిటంటే, "ప్రాతిపదిక," "ఉపరినిర్మాణం" అనే ధాతువులు చారిత్రకాభివృద్ధి గతిమీద ప్రభావాన్ని నెరపే అన్ని విషయాలనూ ఆవరించవు. సమాజం వైవిధ్య పూరితమైనది. సకల సామాజిక విషయాల నిర్దిష్ట లక్షణాలనూ, యితర సామాజిక విషయాలతో వాటి పరస్పర సంబంధాన్నీ ప్రగాఢంగా విశదపరచడమూ, సమాజపు జీవితంలోనూ, అభివృద్ధిలోనూ వాటి పాత్రను పరిగణించడమూ ప్రచండమైన సిద్ధాంత, ఆచరణాత్మక ప్రాముఖ్యం గలవి. ప్రతి సామాజిక విషయంయొక్క నిర్దిష్ట లక్షణాలు కూడా దానిపట్ల మన వైఖరిని నిర్ణయిస్తాయి. సామా జిక విషయంయొక్క నిర్దిష్ట లక్షణాలను పరిగణించకపోతే, సిద్ధాంతంలోనే కాక, ఆచరణలో కూడా తీవ్రమైన పొరపాట్లు అనివార్యంగా కలుగుతాయి. ఆవిధంగా, మనం భాషను ఉపరి నిర్మాణంలో చేరిస్తే, పాత ప్రాతిపదికమీద ఉద్భవించిన భాషయొక్క విప్లవాత్మక విచ్ఛిత్తినీ, కొత్త ప్రాతిపదికకు అనుగుణమైన మరొక భాషయొక్క యేర్పాటునూ మనం డిమాండు చేయవలసి వుంటుంది. మరి అది తప్పు మాత్రమే కాక, అసాధ్యం కూడా. మనుషులు సంసర్గ సాధనంగా తమ భాషను విసర్జించలేరు. ఉపరినిర్మాణానికి భిన్నంగా, భాష యే ఒక్క ప్రాతి పదికనుండీ ఉద్భవించదు; అది దీర్ఘ కాలంమీద మొత్తం చరిత్ర గతినుండి ఉద్భవిస్తుంది, మనుషుల సామాజిక జన్మ స్థానాలతో నిమిత్తం లేకుండా వాళ్ల మధ్య సంసర్గ రూపంగా స్థిరపడుతుంది. అనగా భాష అభివృద్ధి చెందదని కాదు. ప్రపంచంలో ప్రతిదానిలాగే అది అభివృద్ధి చెందుతుంది, కానీ ప్రాతిపదికా, ఉపరినిర్మాణమూ యే నియమాలనుబట్టి అభివృద్ధి చెందుతాయో వాటినిబట్టి కాదు, భిన్న నియమాలను బట్టి. భాష ఉత్పత్తికీ, శాస్త్రవిజ్ఞానానికీ, సంస్కృతికీ, సామాజిక రాజకీయ జీవితానికీ చెందిన అభివృద్ధికి సూటి ప్రతిబింబం, అనగా సామాజిక జీవితపు ప్రతి రంగంలోనూ జరుగుతున్న మార్పులకు సూటి ప్రతిబింబం. భాష నిరంతరం కొత్త పదాలచేతా, నుడికారాలచేతా సంపన్న మౌతుంది, పాతబడిన

పదాలు మరుగున పడిపోతాయి. వ్యాకరణ వ్యవస్థా, భాషయొక్క యితర అంగాలూ అలాగే మార్పుకు లోనౌతాయి.

సామాజిక జీవితంలో తీవ్రమైన మార్పులు కలిగించే సామాజిక విప్లవాలు సహజంగా భాషమీద కూడా శక్తివంతమైన ప్రభావం నెరపుతాయి. కానీ, అవి ఒక భాషను తొలగించి మరొకదానిని పెట్టవు.

ఆవిధంగా, సమాజపు నిర్మాణ అంశాలను గురించిన మన పరిశీలనను క్రోడీకరిస్తూ, సామాజికార్థిక నిర్మాణరూపం మహా సంకీర్ణమైన, బహుముఖమైన సామాజిక శరీరి అని మరొకసారి నొక్కిచెప్పాలి. చారిత్రక క్రమాన్ని సరిగా అర్థం చేసుకోడానికి సామాజిక జీవితపు సకల పార్శ్వాలనూ, సకల సామాజిక విషయాలనూ వాటి పరస్పర చర్యా ప్రతిచర్యలలోనూ లెక్కలోకి తీసుకోవడం అవసరం. నిర్మాణరూపం అనేది సామాజిక విషయాల బీరకాయ పీచును అర్థం చేసుకోడానికి మనకు తోడ్పడే ధాతువూ, పరిశీలనా పద్ధతి పాత్రను నిర్వహించే ధాతువూ కావడం యెందుకంటే, అది సమాజాన్ని దాని వ్యక్తీకరణల సమస్త వైవిధ్యంలోనూ అఖండమైన సమస్తంగా వర్ణిస్తుంది గనుకనే. యీ ధాతువుయొక్క సారంలో చేరని యే విషయాలైనా నిర్దిష్ట సమాజపు పరిశీలనలో ఉపేక్షింపబడవలసి వుంటుంది; యిది ప్రత్యక్ష సమాజాన్ని గురించి సరైన అవగాహనను మనకు యివ్వదు.

ఒక వస్తువును గురించి అసలైన జ్ఞానం పొందడానికి దానిని సమగ్రమైన దృష్టితో చూడడమూ, దాని సకల పార్శ్వాలనూ, సంబంధాలనూ, మధ్యవర్తనాలనూ అధ్యయనం చేయడమూ అవసరం. సమగ్రమైన వైఖరి వుండాలని పరస్పరవాదం కోరుతుంది. దీనిని పూర్తిగా మన మెన్నడూ సాధించలేము, అనగా నిర్దిష్ట వస్తువుయొక్క, లేదా విషయం యొక్క సంబంధాల నన్నిటినీ పూర్తిగా మన మెన్నడూ వెల్లడించలేము. కానీ, సమగ్రత అవసర మన్నదే మనల్ని పొరపాట్లనుండి కాపాడుతుంది, వస్తువును గురించి నేడు మనకున్న సాపేక్ష భావాలను పరమమైనవిగా చూడకుండా, అనగా వికృతమైన శవాలుగా చేయకుండా మనల్ని కాపాడుతుంది.

* * *

ఆధునిక బూర్జువా సామాజిక శాస్త్రం కూడా సమాజ నిర్మాణాన్ని పరిశీలించడంలో క్రమపద్ధతియుత, నిర్మాణ క్రియా వైఖరిని ఉపయోగిస్తుంది. కానీ, సమాజ నిర్మాణం గురించీ, దాని ప్రధాన పార్శ్వాల పరస్పర సంబంధాల గురించీ బూర్జువా సామాజిక శాస్త్రజ్ఞులు మార్క్సిస్టులకంటె మౌలికంగా భిన్నమైన దృక్పథం అవలంబిస్తారు.

బూర్జువా సామాజిక శాస్త్రంలో సమాజ నిర్మాణం గురించి అత్యంత వ్యాప్తిలో వున్న సిద్ధాంతం యేమిటంటే, టి. పార్సన్స్‌కూ, ఆర్. మెర్టన్‌కూ చెందిన నిర్మాణ క్రియా

సిద్ధాంతం. దీని ప్రధాన భావం యేమిటంటే, సమాజం సుసంబద్ధమైన వ్యవస్థ అనీ, దాని సమతూకాన్నీ, స్థిరత్వాన్నీ నిలబెట్టడంలో దాని ప్రతి నిర్మాణ అంశమూ నిర్వహించవలసిన నిర్దిష్టమైన క్రియ వుందనీ.

పార్సన్స్ ప్రకారం, యే సామాజిక వ్యవస్థ అయినా నిర్దిష్ట లక్ష్యాలను పొందడానికి ప్రయత్నించే వ్యక్తులుగా పనిచేస్తూ, పరిసర వస్తువులకూ, విషయాలకూ ప్రతిస్పందిస్తూ, సన్నివేశాన్ని గురించీ, తమను గురించీ తెలిసివున్న మనుషులచేత యేర్పడుతుంది. వ్యక్తుల చర్యల చేత వాళ్ల చర్యా ప్రతిచర్యల, సంబంధాల వ్యవస్థ — సామాజిక వ్యవస్థ — యేర్పడుతుంది. అతని ప్రకారం, "సమాజమనేది స్వయంపోషక వ్యవస్థగా తన సొంత ఉనికికి కావలసిన పూర్వావసరాల నన్నిటినీ కలిగిన రకం సామాజిక వ్యవస్థ.*

యే సామాజిక వ్యవస్థనైనా యేకీకరణ చేసే అంశాలు విలువలు, అని నిర్మాణ క్రియా ధోరణికి చెందిన సిద్ధాంతకారులు అంటారు. నిర్దిష్ట సామాజిక వ్యవస్థలో అంగీకరింపబడిన ప్రమాణాలూ, విలువలూ మానవుడు అనుసరించవలసిన ప్రవర్తన ప్రమాణాలకు నమూనాలను సమకూర్చి, తద్వారా ఆ వ్యవస్థ లోపల స్థిరత్వాన్ని కట్టుదిట్టం చేస్తాయి. మానవుడు తన చర్యలద్వారా సామాజిక వ్యవస్థయొక్క క్రియా నిర్వాహణలో పాల్గొంటాడు; అతని స్థాయిని బట్టి దానిలో అతను నిర్వహించే పాత్ర వుంటుంది. తన చుట్టూ వున్నవాళ్ళు ఆశించినట్లు అతను తన పాత్రను నిర్వహించాలి, అనగా అతని ప్రవర్తన ఆ వ్యవస్థయొక్క సక్రమమైన ఆచరణను పెంపొందించాలి. అందువల్లనే పార్సన్స్ విలువలనూ, ప్రమాణాలనూ, పాత్రలనూ, వగైరాలను సామాజిక వ్యవస్థయొక్క ప్రధాన అంగాలుగా పరిగణిస్తాడు.

క్రమపద్ధతియుత, నిర్మాణ క్రియా వైఖరియొక్క ఫలవంతమైన భావాలను బూర్జువా సామాజిక శాస్త్రం పెట్టుబడిదారీ వ్యవస్థను సమర్థించడానికి యెలా ఉపయోగిస్తున్నదీ పార్సన్స్ సిద్ధాంతం చూపుతుంది. యీ విషయం యీ సిద్ధాంతాలయొక్క సారాంశాన్నే వికృతపరుస్తుంది. అసలు విషయం యేమిటంటే, సమాజ నిర్మాణంయొక్క నిర్దిష్ట రూపాలతో నిమిత్తం లేకుండా దాన్ని గురించి చెప్పే యీ మాటల వెనుక నిర్దిష్టమైన బూర్జువా సమాజం వుంది; క్రియావాదులు దీని "స్థిరత్వా"నికి చెందిన సిద్ధాంతాన్ని తయారుచేయడానికి ప్రయత్నిస్తున్నారు. పార్సన్స్ సిద్ధాంతం యథాస్థితివాదాత్మకమైన దనీ, సమర్థనాత్మకమైన దనీ సార్వత్రికంగా గుర్తింపబడిందనే విషయం కూడా చెప్పాలి. పార్సన్స్ సమాజ నిర్మాణాన్ని అభివృద్ధితో సంబంధం లేకుండా, గమనశీలత లేకుండా పరిగణిస్తాడు.

---

* *Toward a General Theory of Action* ("చర్యను గురించిన సాధారణ సిద్ధాంతంవైపు"), New York, 1962, పుట 26.

అతని నిర్మాణ వైఖరి ప్రజనన, చారిత్రక వైఖరితో మేళవించబడలేదు. యీ లోపాన్ని సవరించడానికి మెర్టన్ దుష్క్రియ (dysfunction) అనే భావాన్ని ప్రవేశపెట్టినాడు, అనగా వ్యవస్థయొక్క స్థిరత్వాన్ని తలక్రిందులు చేసే చర్యను. కానీ, యీ భావాన్ని ప్రవేశ పెట్టినందువల్ల క్రియావాదంయొక్క జడ స్వభావం వాస్తవంలో అధిగమింపబడలేదు; యెందుకంటే, దుష్క్రియ ప్రవర్తన అభివృద్ధిని కలిగించే అంశంగా, భవిష్యత్తుయొక్క బీజంగా పరిగణించబడక, వ్యవస్థయొక్క ఉత్పాదితంగా, వ్యవస్థయొక్క అస్థిరత్వాన్ని పెంచేదిగా మాత్రం పరిగణించబడింది. దుష్క్రియలను పరిశీలించడంలోని కర్తవ్యం యేమిటంటే, వ్యవస్థయొక్క క్రియా సంబంధమైన యేకత్వాన్నీ, స్థిరత్వాన్నీ దృఢపరచడానికి, అనగా పెట్టుబడిదారీ వ్యవస్థను నిలిపి వుంచడానికి, ఆ దుష్క్రియలను అధిగమించే మార్గాలను నిర్ణయించడం. కనుక, సమాజం క్రియా నిర్వహణ చేసే వ్యవస్థగా చూడబడుతున్నది గానీ, అభివృద్ధి చెందే వ్యవస్థగా కాదు.

పార్సన్స్ చెప్పే క్రియావాదంలోని మరొక మౌలిక లోపం యేమిటంటే, సమాజ నిర్మాణాన్ని పరిశీలించడంలో అతను సామాజిక జీవితపు కారణాత్మక ప్రాతిపదికను వెలికి తీయడానికి నిరాకరించడం. సామాజిక జీవితంలోని ప్రతి అంశమూ "వాదం" (స్వతంత్ర అస్థిరాంశం)గానూ, "క్రియ" (పరతంత్ర అస్థిరాంశం)గానూ పనిచేయవచ్చుననే సాకుతో అతను అలా నిరాకరిస్తాడు. సామాజిక వ్యవస్థకు దరహంమీద ప్రాబల్యం గల కారణాలు లేవనేది అతని తాత్పర్యం. పర్యవసానంగా, క్రియావాదులు బాహ్య చర్యా ప్రతిచర్యలను గుర్తుపట్టే చట్రం లోపలనే పూర్తిగా వుండిపోతారు గానీ, యీ చర్యా ప్రతిచర్యల ప్రాతిపదికను లోతుగా పరిశోధించరు. యీ పాజిటివిజం వెనుక వాస్తవమైన భావవాదం వుంది; యెందుకంటే, పార్సన్స్ ప్రకారం, సామాజిక ఆచరణ వ్యవస్థ చర్యల ప్రేరణలచేతా, ప్రతిష్ఠిత సామాజిక ప్రవర్తనను (అనగా విలువలనూ, ప్రమాణాలనూ) అనుసరించడంచేతా యేర్పడింది. కనుక, క్రియావాదులు తత్వశాస్త్రపు మౌలిక ప్రశ్నను దాటవేయలేదు, కేవలం దానికి ఆత్మగత, భావవాదాత్మక జవాబును యిచ్చినారు.

యీ సమస్యా పరిష్కారానికి భౌతికవాదాత్మక, మార్క్సిస్టు వైఖరి మాత్రమే సమాజంయొక్క సామాజిక నిర్మాణానికి శాస్త్రీయ పరిశీలన సూత్రాలను సమకూరుస్తుంది.

ప్రకరణం నాలుగు

ప్రపంచ చరిత్రయొక్క వస్తుగత తర్కం

సామాజికార్థిక నిర్మాణరూపపు పరిశీలన దాని అంగ నిర్మాణాన్నీ, దాని భాగాలైన అంశాల పరస్పర సంబంధాన్నీ నిర్ధరించడానికి తోడ్పడింది. సమాజంయొక్క యీ ప్రధానంగా "జడమైన" పరీక్షా, దాని విశ్లేషణా, ఒకదానిమీద ఒకటి పనిచేసే దాని వ్యష్టి విషయాల అధ్యయనమూ తదనంతర పరిశీలన దశకు పోవడానికి కావలసిన పూర్వావసరం. సమాజం నిలకడగా వుండదు, నిత్యం అభివృద్ధి చెందుతూ వుంటుంది. సామాజిక చారిత్రక అభివృద్ధి దృష్టిని మార్క్స్ వివరించగా ఒకనాడు విన్న పాల్ లఫార్గ్ యిలా అన్నాడు: "నా కనుల ముందున్న తెర చించివేయబడినట్లైంది. మొట్టమొదటి సారిగా ప్రపంచ చరిత్రయొక్క తర్కం నాకు స్పష్టంగా అనుభూతమైంది."* పాదార్థిక ఉత్పత్తి అభివృద్ధిని పాలించే నియమాలను చూపడంద్వారానూ, సామాజిక జీవితపు యితర పార్శ్వాలన్నీ దానిమీద ఆధారపడతాయని నిర్ధరించడంద్వారానూ, చారిత్రక భౌతికవాదం అభివృద్ధియొక్క వస్తుగత తర్కం గురించి గాఢ అవగాహనను యిస్తుంది. కానీ, యీ విషయాన్ని పరిశీలించడానికి ముందు, సమాజ అభివృద్ధిమీద ప్రకృతిసిద్ధమైన భౌతిక పరిస్థితుల ప్రభావాన్ని గమనిద్దాం; యెందుకంటే, సమాజం ప్రకృతికంటె భిన్నంగా వుంటూ, ప్రకృతితో సజీవంగా ముడివడి కూడా వుంది గనుక.

---

* **Paul** Lafargue et Wilhelm Liebknecht, *Souvenirs sur Marx* ("మార్క్స్ గురించిన స్మృతులు"), Paris, 1935, పుట 11 (కిందిగీత కెల్లె, కొవల్జోన్‌లది).

సమాజమూ, ప్రకృతీ

సమాజం భౌతిక ప్రపంచంలో ఒక భాగం. అది దాని సొంత ఆంతరిక నియమాలచేత పాలించబడుతున్నది. కానీ, అది ప్రకృతినుండి విడదీయరానిది, తన అభివృద్ధిలో ప్రకృతితో నిత్యం చర్యా ప్రతిచర్యలు కలిగివుంటుంది. అందువల్లనే సామాజిక శాస్త్రం యీ సంబంధాన్ని కూడా పరీక్షించాలి. మళ్లీ యిక్కడ చారిత్రక భౌతికవాదం పరిశీలన పద్ధతికి చెందిన పార్శ్వంమీద దృష్టిని సాంద్రీకరిస్తుంది.

మానవుల జీవితానికీ, సమాజపు అస్తిత్వానికీ, అభివృద్ధికీ ప్రకృతి అవశ్యకం. మానవ సమాజం యే ప్రకృతిసిద్ధ పరిస్థితులలో వుంటుందో వాటిని, అది ప్రకృతితో సూటిగా చర్యా ప్రతిచర్యలు కలిగివుండే రంగాన్ని, భౌగోళిక పరిసరావళి అంటారు. విశ్వంతోనూ, సహజంగానే అన్నిటినీ మించి సూర్యునితోనూ సంబంధం గలిగిన భూమీ, వాతావరణమూ, నదులూ, సముద్రాలూ, మహా సముద్రాలూ, శీతోష్ణస్థితీ, నేలా, ఖనిజాలూ — యివన్నీ కలిసి మానవ సమాజం యే పరిస్థితులలో అభివృద్ధి చెందుతుందో ఆ ప్రకృతిసిద్ధ భౌగోళిక పరిస్థితులు అవుతాయి. హేగెల్ దీనినే ప్రపంచ చరిత్రయొక్క "భౌగోళిక వస్త్రం" అన్నాడు.

సమాజం అన్నిటినీ మించి ఉత్పత్తిద్వారా ప్రకృతితో ముడివడి వుంది. సామాజిక సంపద శ్రమచేత సృష్టించబడుతుంది. శ్రమ ప్రకృతియొక్క పదార్థాన్ని మానవ అవసరాలకు అనుగుణంగా రూపాంతరీకరిస్తుంది, మలుస్తుంది. ఆలంకారికంగా చెప్పాలంటే, సంపదకు శ్రమ తండ్రి, ప్రకృతి తల్లి. భూమిమీది ప్రకృతిసిద్ధ పరిస్థితులు ఉత్పత్తియొక్క సహజ ప్రాతిపదిక, అందువల్లనే, యే పద్ధతులలో మానవ కార్యాచరణా, ఉత్పాదక శక్తుల అభివృద్ధీ, వాటి స్థల నిర్దేశమూ, శ్రమ విభజనా జరుగుతాయో ఆ పద్ధతులమీద వాటి ప్రభావం వుంటుంది.

వివిధ ప్రజానీకాల చారిత్రక అభివృద్ధి వేగంమీద భౌగోళిక పరిసరావళి ప్రభావం కూడా వుంటుంది. అనుకూల భౌగోళిక పరిస్థితులు ఉత్పత్తి అభివృద్ధిని త్వరపరుస్తాయి, ప్రతికూల భౌగోళిక పరిస్థితులు దానిని మందగింపజేస్తాయి. సమాజం అభివృద్ధి చెందేకొద్దీ మానవుడు ప్రతికూల పరిస్థితులను అధిగమించడానికీ, ప్రకృతిమీద అధిపతి కావడానికీ అంతకంతకూ యెక్కువగా సమర్థుడయ్యేది నిజమే. కానీ, ఉత్పత్తి అభివృద్ధి చెందేకొద్దీ, ప్రకృతిసిద్ధ పరిస్థితుల ప్రభావంనుండి మానవుడు పూర్తిగా విడివడుతాడని దాని అర్థం కాదు. సమాజానికీ, ప్రకృతికీ మధ్య గల చర్యా ప్రతిచర్యలు అంతకంటె చాలా క్లిష్టమైనవి, పరస్పర వాదాత్మకమైనవి. భౌగోళిక పరిసరావళి ఉత్పత్తి అభివృద్ధికి నిర్దిష్టమైన అవకాశాలను సృష్టిస్తుంది; కానీ, అది యెలా ఉపయోగింపబడేదీ సమాజంమీదనే ఆధారపడుతుంది. సమాజ

అభివృద్ధిమీద, దాని అభివృద్ధి స్థాయిని బట్టి, ఒకే ప్రకృతిసిద్ధ పరిస్థితులకు భిన్న ప్రభావం వుండవచ్చు. సమాజ అభివృద్ధిలో పాత్రను బట్టి మార్క్స్ వీటిని రెండు పెద్ద వర్గాలుగా విభజింపజేసినాడు.*

1) జీవనాధారాల రూపంలో ప్రకృతి సంపద—అనగా ఫలవంతమైన నేలా, ధాన్యాలూ, పండ్లచెట్లూ, పశులూ, చేపలూ, వగైరా;

2) శ్రమ సాధనాల రూపంలో ప్రకృతి సంపద— అనగా లోహాలూ, బొగ్గూ, కలపా, పెట్రోలియం, వగైరా, నౌకాయాన యోగ్యమైన నదులూ, జలపాతాలూ, వగైరా.

వీటిలో మొదటివి సామాజిక అభివృద్ధియొక్క నిమ్న దశలలోనూ, రెండవవి ఉన్నత దశలలోనూ పెద్ద పాత్ర నిర్వహిస్తాయి. ఉత్పత్తిలో బొగ్గు, పెట్రోలియంలను ఉపయోగించడం ఉత్పత్తి అభివృద్ధిలోనే బాగా ఉన్నతమైన దశలో సాధ్యమూ, అవసరమూ అవుతుందనేది స్పష్టం. మొదటి దశలలో వాటి లభ్యత అప్రస్తుత విషయం; యెందుకంటే, సామాజిక ఉత్పత్తి క్రమంలో అవి పాల్గొనవు. యీనాడు పెట్రోలియం లేకుండా ఉత్పత్తి దురూహ్యం; ప్రపంచ రాజకీయాలలో అది ఒక కీలక సమస్య కావడానికి తగిన కారణం వుంది.

నిజమే, మానవునిమీదా, అతని జీవితంమీదా ప్రకృతి ప్రభావం వుంది. యిది అతని జీవిత విధానంలోనూ (అతని నివాసమూ, దుస్తులూ, తిండీ, వగైరాలలో), వివిధ గణ, జాతి విశిష్ట లక్షణాలలోనూ, వగైరాలలో ప్రతిబింబిస్తుంది. యీ ప్రభావాన్ని పరిగణించడం జాతిశాస్త్రజ్ఞునికీ, వైద్యునికీ, వాస్తుశిల్పికీ, మొదలైనవాళ్లకు ఆచరణాత్మక విలువ కలిగి వుండవచ్చు. కానీ, సమాజ నిర్మాణపు స్వభావాన్నీ, అది మారే దిశనూ నిర్ణయించడంలో, మానవునిమీద ప్రకృతియొక్క సూటి ప్రభావానికి గణనీయమైన ప్రాముఖ్యం వుండజాలదు. రష్యాలో శీతోష్ణస్థితి కొత్త వెచ్చబడినందున అక్టోబర్ సోషలిస్టు మహా విప్లవం జరిగిందని అమెరికన్ భూగోళశాస్త్రజ్ఞుడు ఎ. హంటింగ్టన్ చేసిన చిత్రమైన ఉద్ఘాటన కేవలం హాస్యాస్పదం.

"భౌగోళిక నిర్ణాయకవాద"పు సిద్ధాంతాలకు భిన్నంగా, భౌగోళిక పరిసరావళి సామాజిక అభివృద్ధిని నిర్ణయించదనీ, నిర్ణయించజాలదనీ మార్క్సిజం అంటుంది. ప్రకృతిసిద్ధ పరిసరావళికీ, సామాజిక పరిసరావళికీ మధ్య కచ్చితమైన సంబంధం యేదీ మనకు చరిత్రలో కనపడదు. దాదాపు సమానమైన ప్రకృతిసిద్ధ పరిస్థితులలో పూర్తిగా భిన్నమైన సామాజిక వ్యవస్థలు గల దేశాలు మనకు కనపడుతాయి (ఉదాహరణకు సోవియట్ తుర్క్మేనియ, ఇరాన్, కరేలియా, ఫిన్లండు, వగైరా). దీనికి భిన్నంగా, వేరు వేరు భౌగోళిక మండలాలలో ఒకే

* చూ: K. Marx, *Capital*, Vol. I, పుట 512.

విధమైన సామాజిక వ్యవస్థలు గల దేశాలు దాదాపు ఒకే స్థాయిలో వున్న ఉత్పాదక శక్తులతో మనకు కనపడుతాయి. దీనికి కారణం యేమిటంటే, యితర జీవులలాగ మానవులు కేవలం పరిసరావళికి అనుగుణంగా తమ్ము తాము మలచుకోరు; వాళ్లు దానిని మారుస్తారు, ప్రకృతి సిద్ధ పరిసరావళియొక్క తరుచుగా ప్రతికూలమైన ప్రభావాన్ని అధిగమిస్తారు.

సమాజం నిశ్చితమైన ప్రకృతిసిద్ధ పరిస్థితులలో వుంటుంది, వాటితో గల నిత్య చర్యా ప్రతిచర్యలలో అభివృద్ధి చెందుతుంది, కానీ తన సొంత నియమాల ప్రకారం. సమాజ చరిత్ర ప్రకృతి చరిత్రయొక్క కొనసాగింపు, ప్రకృతే మరింత ఉన్నత దశకు లేవనెత్తబడిన స్థితిలో. "చరిత్ర అనేదే ప్రకృతి చరిత్రలో – ప్రకృతి మానవుడుగా అభివృద్ధి చెందే క్రమంలో – నిజమైన భాగం."*

సమాజం అభివృద్ధి చెందేకొద్దీ, ప్రకృతిమీద మానవుని ప్రభావం పెరుగుతుంది. యీనాడు మన చుట్టూ వున్న భౌగోళిక పరిసరావళి, కచ్చితంగా చెప్పాలంటే, యిక యెంత మాత్రమూ కేవలం ప్రకృతి అభివృద్ధియొక్క ఫలితం కాదు. యెందుకంటే, అది యెక్కువగా ప్రకృతిమీద సమాజపు ప్రభావంచేత రూపుదాల్చింది, మానవుని రూపాంతరీకరణాత్మక కార్యాచరణయొక్క ఫలితంగా యేర్పడింది. మానవులు కాలువలూ, ఆనకట్టలూ, పెద్ద చెరువులూ నిర్మిస్తారు. మానవుని ప్రభావంవలన ప్రపంచపు వృక్షజాలంలోనూ, జంతు జాలంలోనూ తీవ్రమైన మార్పు వచ్చింది – మానవులు చాలా చెట్లు పడగొట్టినారనీ, పలు వన్యమృగ జాతులను నిర్మూలించినారనీ అనే అర్థంలోనే కాదు, వాళ్లు పలు వృక్ష, జంతు జాతులను అభివృద్ధి చేసినారనే అర్థంలో కూడా. యీనాటి అలంకారపు మొక్కలూ, ధాన్యం పైరులూ, కూరగాయలూ, పండ్లూ వాటి పూర్వీకులలాగ యెంత మాత్రమూ లేవు. మొక్కల మార్పు యే విధంగానూ పూర్తికాలేదు కూడా. తొలి కాలపు కొద్దిపాటి జంతువులనుండి మానవులు సుమారు 400 రకాల ఆవులనూ, 150 రకాల గుర్రాలనూ, 400 రకాల కుక్కలనూ, వగైరా అభివృద్ధి చేసినారు. శాస్త్రవిజ్ఞానపు అభివృద్ధీ, సజీవ ప్రకృతి లోని క్రమత్వాల అవగాహనా మానవుల అవసరాలను తీర్చడానికి ప్రాణులను త్వరగా, బుద్ధి పూర్వకంగా మార్చేటందుకు కొత్త మార్గాలనూ, కొత్త అవకాశాలనూ సృష్టిస్తాయి. తత్ఫలితంగా, మానవ కార్యాచరణ భూతల దృశ్యంలో, ప్రపంచంలోని వివిధ భాగాలలో రూపు దాల్చే భౌగోళిక సంకీర్ణకాలలో, గణనీయమైన మార్పులు కలిగించి, భౌగోళిక పరిసరావళిని రూపుదిద్దే అంశంగా పనిచేస్తుంది. నిజమే, మానవులు శీతోష్ణస్థితినీ (సూక్ష్మ శీతోష్ణ

---

* K. Marx, *Economic and Philosophic Manuscripts of 1844* (1844 నాటి ఆర్థిక, తాత్విక రాతప్రతి), Moscow, 1961, పుట 111.

స్థితులను సృష్టించగలిగి నప్పటికీ), భూగర్భ ప్రక్రియలనూ, వగైరాలను యింకా ప్రభా వితం చేయజాలకున్నారు; కానీ, అలా చేయడానికి వాళ్ల శక్తి సామర్థ్యాలు వేగంగా పెరుగు తున్నవి. మానవులు అంతరిక్షంలోకి పోయి, తద్వారా ప్రకృతితో తమ చర్యా ప్రతిచర్యల రంగాన్ని గుణనార్హంగా విస్తృతపరచినారు. అణుశక్తిని ఆచరణాత్మకంగా ఉపయోగించడమూ, పూర్వ నిర్ణీత గుణాలు గల వివిధ పోలిమెర్ సంయోగ పదార్థాలు, రేడియో యెలెక్ట్రానిక్స్‌నూ, వగైరాలను ఆవిష్కరించడంద్వారా ప్రకృతిమీద మానవుని ప్రభావానికి విస్తారమైన అవకాశాలు సృష్టింపబడుతున్నాయి. యిటీవలి శాస్త్ర, సాంకేతిక విజయాలు భూమండలపు రూపు రేఖలను మార్చడానికి విస్తారమైన అవకాశాలను మానవజాతికి యిస్తున్నాయి. కానీ, ప్రకృతిమీద మానవుని అదుపులేని ప్రభావంనుండి ఉత్పన్నమయ్యే ప్రమాదాలు కూడా మనకు కనిపిస్తున్నాయి.

కేవలం మన యీనాటి అవసరాల దృష్ట్యా, మన చర్యల సుదూర పర్యవసానాలపట్ల నిర్లక్ష్యంగా, అనాలోచితంగా ప్రకృతిని రూపాంతరీకరించ కూడదు. ఉదాహరణకు, చెట్లను అపరిమితంగా కొట్టివేస్తే నదులు పూడిపోయి, వ్యవసాయానికి అనుకూలమైన పరిస్థితులు క్షీణిస్తాయనీ, వ్యవసాయశాస్త్ర సూత్రాలను సరిగా ఉపయోగించకపోతే, నేల సారం కోల్పోయి, కోతపడుతుందనీ, పారిశ్రామిక సంస్థల విసర్జితాలను శుద్ధిచేసే సౌకర్యాలు లేకుండా ఆ సంస్థలను నిర్మిస్తే, నదులు కలుషితమై, చేపలు చచ్చిపోవచ్చుననీ ప్రతివొకరికీ తెలుసు. ప్రకృతి ప్రక్రియలలో హ్రస్వదృష్టితో జోక్యం కలిగించుకుంటే, ప్రకృతిలోని లంకెలు తెగిపోతాయి, ప్రకృతి ప్రక్రియల క్రమత్వం దెబ్బతింటుంది.

ప్రకృతిమీద ప్రభావం నెరపే సాధనాలు అంతకంతకూ శక్తివంతమైనవి మానవుని చేతిలోకి వచ్చేకొద్దీ, అతను అంతకంతకూ యెక్కువ అప్రమత్తంగా వుండాలి. యెందుకంటే, ప్రకృతి మీద ప్రతికూల ప్రభావాల ప్రమాదం పెరుగుతుంది గనుక. పరిశ్రమలయొక్కా, అణు శక్తియొక్కా, రసాయన ప్రక్రియలయొక్కా వ్యర్థ పదార్థాలూ, విసర్జితాలూ నదులనూ, సముద్రాలనూ, మహా సముద్రాలను కూడానూ కలుషితపరచడంద్వారా అత్యంత హానికరమైన ఫలితాలు కలుగుతాయి. మానవుని పరిసరావళిని ఆరోగ్యకరంగా వుంచే సమస్య అపార ప్రమా ణాలను అందుకుంది. అది ప్రపంచవ్యాప్త సమస్య గనుక, సకల జాతుల సంయుక్త ప్రయ త్నాలద్వారా మాత్రమే పరిష్కరింపబడగలదు.

సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ 24వ మహాసభకు యిచ్చిన నివేదికలో యల్. ఐ. బ్రేజ్నేవ్ యిలా నొక్కిచెప్పినాడు: "పరిసరావళిని కాపాడడమూ, విద్యుచ్ఛక్తి వనరులనూ తదితర ప్రకృతి వనరులనూ అభివృద్ధి చేయడమూ, రవాణా, వార్తా సాధనాలను అభివృద్ధి చేయడమూ, అత్యంత ప్రమాదకరమైన, విస్తృతవ్యాప్తమైన రోగాలను నివారించ డమూ, నిర్మూలించడమూ, అంతరిక్షాన్నీ, ప్రపంచ మహా సముద్రాలనూ పరిశోధించడమూ,

అభివృద్ధి చేయడమూ లాంటి సమస్యలను పరిష్కరించడంలో ఆసక్తి గల యితర రాజ్యాలతో కలిసి పాల్గొనడానికి మా దేశం సిద్ధంగా వుంది.''*

సమాజం ముందు రెండు ప్రత్యామ్నాయాలున్నాయి. అవి మానవ జాతి ఎదురుచూడని విషాదకర పర్యవసానాలకు దారితీయగల పరిసరాలను కలుషితపరచడ మనేది కొనసాగడమా లేక యీ ప్రమాదాన్ని నివారించే మార్గాలనూ సాధనాలనూ కనుగొనడమా. యీ సమస్యకు కమ్యూనిజం మౌలికమైన పరిష్కారాన్ని చూపిస్తుందని మార్క్సిస్టులు నమ్ముతారు.

సోవియట్ యూనియన్‌లోని కమ్యూనిస్టు నిర్మాణపు ఆచరణ యీ అభిప్రాయాన్ని పూర్తిగా రుజువుచేస్తుంది. శాస్త్ర, సాంకేతిక పురోగతి ప్రకృతి వనరుల సంరక్షణతో పాటు జరిగేటట్లూ, గాలినీ, నీటినీ మలినపరచకుండానూ, నేలను కోతకోయకుండామా జరిగేటట్లూ జాగ్రత్త వహిస్తారు. ప్రకృతిని రక్షించే దృష్టితో సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ కొత్త పారిశ్రామిక సంస్థలకు పథకాలు వేయడంలోనూ, వాటిని నిర్మించడంలోనూ, పాతవాటి పనిని మెరుగుపరచడంలోనూ ప్రణాళికా సంస్థలకూ, ఆర్థిక సంస్థలకూ, రూప నిర్మాణ సంస్థలకూ మరింత ఉన్నతమైన, మరింత కచ్చితమైన ప్రమాణాలు నెలకొల్పుతుంది. ప్రకృతి ప్రసాదించే వనరులను యీ తరమే కాక, వచ్చే తరాలన్నీ కూడా ఉపయోగించుకో గలగాలి.

భావి కమ్యూనిస్టు సమాజంలో, యుద్ధ ప్రమాదమూ, ఆయుధాల కొరకు డబ్బు ఖర్చుపెట్టవలసిన అవసరమూ శాశ్వతంగా తొలగిపోయిన తర్వాత, దేశాలను విభజించే సొంత ఆస్తి అనే అవరోధాలు పోయిన తర్వాత, ప్రకృతిని జయించడానికి మానవజాతి తన ప్రయత్నాలనూ, భౌతిక వనరులనూ యేకం చేసిన తర్వాత, సమాజం ప్రపంచవ్యాప్త ప్రమాణంలో ప్రకృతి క్రమాలమీద తన ప్రభావాన్ని అదుపులో పెట్టుకోగలిగి వుంటుంది, కనుక మానవుని ప్రయోజనాలకు అనుగుణంగా, మానవుని లాభం కొరకు మాత్రమే భూతలాన్ని మార్చ గలిగి వుంటుంది.

సాంకేతిక పురోగతి ఫలితంగా ప్రకృతినుండి సమాజం వేరైనట్లు భావించకూడదు. మానవుడు ప్రకృతియొక్క మకుటాయమైన విజయం, ప్రకృతిలో విడదీయరాని భాగం. ప్రకృతిమీద అతని ఆధిపత్యమూ, దాని నియమాలను ఉత్పత్తిలో అతను ఉపయోగించ డమూ పెరిగేకొద్దీ, అనగా ప్రకృతితో అంతకంతకూ విస్తృతమయ్యే అతని చర్యా ప్రతి చర్యలు పెరిగేకొద్దీ, అతని శక్తీ, బలమూ పెరుగుతాయి.

మానవుని జీవగత లక్షణలు సామాజిక అభివృద్ధిలో మరొక ప్రకృతిసిద్ధమైన అంశం.

---

* *24th Congress of the CPSU*, పుట 38.

మానవ జీవియొక్క పుట్టుకా, చావూ, పెరుగుదలా, ముసలితనమూ, స్త్రీ పురుష భేదమూ, యివన్నీ జీవశాస్త్రానికి సంబంధించిన ప్రక్రియలూ, విషయాలూ; కానీ, జనాభా పెరుగుదలా, స్త్రీ పురుషుల మధ్యా, భిన్న వయస్కుల మధ్యా గల భేదాలూ ప్రతి సమాజంలోనూ సామాజిక ప్రాముఖ్యం పొందుతాయి, నిర్దిష్టమైన సామాజిక సమస్యలను ఉత్పన్నం చేస్తాయి. అందువల్లనే, ప్రజా పునరుత్పత్తీ, తదితర ప్రజానీక సమస్యలు జీవ, వైద్య శాస్త్రాలచేత మాత్రమే కాక, మొత్తం ఒక పరిధికి చెందిన సామాజిక శాస్త్రాలచేత (జనాభాశాస్త్రమూ, సామాజిక శాస్త్రమూ, న్యాయశాస్త్రమూ, ఆర్థికశాస్త్రాలూ, ఎత్నోగ్రఫీ (నరవర్గ శాస్త్రమూ), వగైరాలచేత) కూడా అధ్యయనం చేయబడుతాయి.

జనాభా పెరుగుదలకూ, దాని సాంద్రతలో వచ్చే మార్పులకూ ఉత్పత్తి అభివృద్ధితో గల సంబంధం యేమిటి? సామాజిక అభివృద్ధిలో వాటి పాత్ర యేమిటి?

చారిత్రక భౌతికవాదం దృష్టిలో, జనాభా పెరుగుదల ఉత్పత్తియొక్కా, సమాజం యొక్కా అభివృద్ధిమీద కొంత ప్రభావం నెరపుతుంది గానీ, వాటి అభివృద్ధికి కీలకమైన శక్తి కాదు. అది అలాంటి శక్తి అయివుంటే, అధిక జనాభా సాంద్రత విధిగా ఉన్నత ఉత్పత్తి స్థాయినీ, ఉన్నత సామాజిక వ్యవస్థనూ కలిగించివుండేది. వాస్తవంలో యిలా జరగడం లేదు. నిజమే, జనాభా సాంద్రత అస్థిరమైన అంశం. ప్రపంచంలో జనాభా పంపకం చాలా అసమంగా వుంది. ప్రపంచంలోని అత్యంత ప్రజా సమృద్ధమైన భాగాలు భూతలంలోని 7 శాతంతో, మొత్తం జనాభాలో 70 శాతం కలిగివున్నాయి; మరొకవైపున భూతలంలోని 10 శాతం (యెడారులూ, ధ్రువ మండలాలూ, మొదలైనవి) దాదాపు నిర్జనంగా వున్నాయి. భూమిమీది జన సాంద్రత కాలగతిలో మారింది కూడా. ప్రస్తుత శకం ప్రారంభంలో భూమండలపు జనాభా సుమారు 15, 20 కోట్లు వుండింది. 1000వ సంవత్సరానికి అది సుమారు 30 కోట్లు వుండింది; మన కాలంలో అది 400 కోట్లకు చేరుతుంది; జనావాసం గల ఖండాల నగటు జన సాంద్రత చదరపు కిలోమీటరుకు సుమారు 25 వుంది.

కానీ, గతంలో లాగే, యీనాడు కూడా ఒక దేశంయొక్క సామాజిక వ్యవస్థ దాని జన సాంద్రతచేత నిర్ణయింపబడదు. జనాభా పునరుత్పత్తీ, పెరుగుదలా, జన సాంద్రతలోని మార్పులూ ఒక వ్యవస్థనుండి మరొక వ్యవస్థకు — ఉదాహరణకు, ఫ్యూడలిజంనుండి పెట్టుబడిదారీ వ్యవస్థకూ, లేదా పెట్టుబడిదారీ వ్యవస్థనుండి సోషలిజంకూ — జరిగే పరివర్తనకు కారణాలు కావు కూడా. అంతే కాక, మొదటివే మానవులు జీవించే సామాజిక పరిస్థితులమీద ఉత్పత్తి స్థితీ, సంస్కృతీ స్థాయీ, నిత్య జీవిత పరిస్థితులూ, జాతీయ సంప్రదాయాలూ, మత సంప్రదాయాలూ లాంటి అనేక అంశాలమీద — ఆధారపడుతాయి. అందువల్లనే, చరిత్రతో సంబంధం లేకుండా జనాభాకు చెందిన అభౌతిక నియమం యేదీ లేదు.

ప్రతి సామాజిక వ్యవస్థకూ దాని సొంత నిర్దిష్ట జనాభా నియమం వుందని మార్క్స్ నిర్ధరించినాడు. ఉత్పత్తి అనేది లాభార్జన కొరకు జరిగే పెట్టుబడిదారీ వ్యవస్థలో, శ్రమ యొక్క హేతుబద్ధీకరణా, ఉత్పత్తియొక్క యాంత్రికీకరణా, స్వయంచలనీకరణా, శ్రమ ఉత్పాదకతను అపారంగా పెంచుతాయి గానీ, అదే సమయంలో కార్మికులలో కొందరిని వెళ్ల గొట్టి, నిరుద్యోగాన్ని కలిగిస్తాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ నిత్యం సాపేక్షంగా అదనపు శ్రామిక జనాభాను ఉత్పత్తి చేస్తుంది, జీవనాధారాలు లేని జనాభాను. యిది పెట్టుబడిదారీ వ్యవస్థకు విశిష్టమైన జనాభా నియమం.

సోషలిజంలో చాలా భిన్నమైన జనాభా నియమం పనిచేస్తుంది. అక్కడ ఉత్పత్తి అభివృద్ధి మానవుని ప్రయోజనాల కొరకూ, అతని అవసరాలు తీర్చడానికీ జరుగుతుంది, అక్కడ పెరుగుతున్న జనాభా అభివృద్ధి చెందుతున్న ఉత్పత్తిలోకి చేర్చుకోబడుతుంది, అక్కడ సంక్షోభాలు గానీ, నిరుద్యోగం గానీ వుండవు, అక్కడ శ్రామిక ప్రజలు అనుభవించే భౌతిక జీవిత పరిస్థితులు స్థిరంగా మెరుగుపరచబడుతున్నాయి.

జనాభా పునరుత్పత్తి స్వయంకృత ప్రక్రియ. కానీ, భిన్న కాలాలలో అనేక సమాజాలూ, రాజ్యాలూ తమ సొంత ప్రయోజనాల కొరకు యేదో ఒక ప్రాంతంలోని జనాభా పరిమాణాన్నీ, దాని అంగనిర్మాణాన్నీ నియంత్రించడానికి ప్రయత్నించినట్లు చరిత్ర తెలుపుతుంది. వివిధ రాజ్యాలు జనాభా గమనాగమనాలను నియంత్రించడానికి తీసుకున్న చర్యలు చూడండి — విదేశీయ ఆగమనానికి, లేదా విదేశ గమనానికి ప్రోత్సాహమూ, అంగబలాన్ని కూర్చుకోవ డమూ, మొదలైన చర్యలు. పెద్ద కుటుంబాలకు ప్రోత్సాహమూ, జనాభా పెరుగుదలను త్వరపరచే చర్యలూ జనాభా పెరుగుదలను ప్రభావితం చేసే మార్గాలలో కొన్ని.

కానీ, జనన రేటును తగ్గించవలసిన అవసరం సమాజానికి అప్పుడప్పుడు యెదురౌతుంది. ఆవిధంగా, వలస పరాధీనతను తొలగించుకొని, ప్రజల జీవన ప్రమాణాలను పెంచగోరే కొన్ని దేశాలలో, అధిక జనాభా పెరుగుదల రేట్లు ప్రతికూల విషయ మౌతాయి. యెందుకంటే, జనాభా పెరుగుదల జాతీయ ఆదాయపు పెరుగుదలను మీరిపోతుంది, అందువలన సాధారణ జీవన ప్రమాణాలను పెంచడం అసాధ్య మౌతుంది. సహజంగానే యిది యే విధంగానూ పరమ మైన అమిత జనాభా కాదు; యిది వలసవాదపు దుష్ఫలితం. వలసవాదం అనేక దేశాల ఆర్థికాభివృద్ధిని మందగింపజేసి, సాపేక్ష అమిత జనాభా సమస్యను వాటి యెదుట బెట్టింది. కనుక, జనన రేటును తగ్గించడానికి తీసుకొనే చర్యలు జాతీయ అభివృద్ధి సమస్యలను పరి ష్కరించడానికి తీసుకొనే చర్యల బృందంలో భాగంగా కనపడవచ్చు. కానీ, తక్కువ జననరేటు ఆర్థిక, సామాజిక మార్పులతో పాటు జరిగినప్పుడే అది అనుకూల ఫలితం యివ్వగలదు.

జనాభా పునరుత్పత్తిమీద కొంత ప్రభావం నెరపడానికి ఉద్దేశింపబడిన ప్రభుత్వ

చర్యల వ్యవస్థను జనాభా విధానం అంటారు. అలాంటి విధానాన్ని అనుసరించవలసిన అవసరాన్ని మార్క్సిజం యే విధంగానూ కాదనదు. సమాజ అవసరాలను తీర్చడమే లక్ష్యంగా గల సోషలిస్టు ఉత్పత్తియొక్క అభివృద్ధి దీర్ఘకాలిక ప్రణాళికలద్వారా జనాభా పెరుగుదలతోనూ, దాని అవసరాలతోనూ ముడివడి వుండాలి. మాల్థూసియనిజంయొక్క, నయా మాల్థూసియనిజంయొక్క భావజాలంతో పోరాడడంలో యీ విషయాన్ని నొక్కిచెప్పడం మరీ ముఖ్యం.

ప్రగతి వ్యతిరేకమైన మాల్థూసియన్ జనాభా సిద్ధాంతం 18వ శతాబ్దపు చివరి భాగంలోనే వచ్చింది; కానీ, అది యీనాడు కూడా వ్యాప్తిలో వుండి, గొప్ప ప్రభావం నెరపుతున్నది. జీవ జాతులన్నీ తమ వశంలో వున్న మొత్తం ఆహారం అనుమతించినంతకంటె వేగంగా పెరగడానికి ప్రయత్నిస్తాయని మాల్థస్ 1797లో రాసిన ఒక పుస్తకంలో రుజువు చేయడానికి ప్రయత్నించినాడు. మానవ జనాభాకు రేఖాగణిత శ్రేఢిలో పెరిగే ధోరణి వుండగా, మానవుల జీవనాధారాలు మహా అయితే గణిత శ్రేఢిలో పెరగగలవని అతను అన్నాడు. ప్రపంచ జనాభాను ఒకటి అనుకుంటే, యే అడ్డంకులూ లేకపోతే మానవ జనాభా ప్రతి 25 యేండ్లకూ రెండంతలు చొప్పున పెరుగుతుంది. రెండు శతాబ్దాల లోపల ప్రపంచ జనాభా 256 రెట్లు పెరుగుతుంది, జీవనాధారాలు 9 రెట్లు పెరుగుతాయి. "మానవుడు జీవించిన, లేదా జీవిస్తున్న ప్రతి యుగంలోనూ, ప్రతి స్థితిలోనూ" యీ "నియమం" పనిచేస్తుందని మాల్థస్ అన్నాడు.* జీవనాధారాలు నిదానంగా పెరగడానికి గల కారణాలలో ఒకటి క్షీణమాన రాబడుల "నియమం" అని అతను చెప్పి, యిలా నిర్ణయం లాగినాడు: "ప్రధానమైన అత్యంత శాశ్వతమైన దారిద్ర్య కారణానికి ప్రభుత్వ రూపాలతో గానీ, అసమాన ఆస్తి పంపకంతో గానీ యేమీ సూటి సంబంధం లేదు; బీదలకు ఉపాధినీ, భృతినీ చూపే శక్తి ధనికులకు నిజంగా లేదు గనుక, బీదలకు వస్తుతః వాటిని డిమాండు చేసే హక్కు లేదు."** బీదరికంలో పుట్టిన

---

* Thomas Robert Malthus, *An Essay on the Principle of Population or a View of Its Past and Present Effects on Human Happiness with an Inquiry into Our Prospects Respecting the Future Removal or Mitigation of the Evils Which It Occasions* ("జనాభా సూత్రంమీద ఒక వ్యాసం, లేదా మానవ శ్రేయస్సుమీద దాని గత, ప్రస్తుత ఫలితాల గురించి ఒక దృక్పథం, అది కలిగించే కీడులను భవిష్యత్తులో తొలగించడానికి, లేదా తగ్గించడానికి మనకు గల అవకాశాల పరిశీలనతో సహా"), London, 1890, పుట 295.

** పై గ్రంథమే, పుట 541.

వాడు అనవసరం. "ప్రకృతిమాతయొక్క మహా విందులో అతనికి స్థానం లేదు. అతన్ని వెళ్లిపొమ్మని ఆమె చెపుతుంది, తన ఉత్తరువును వడిగా అమలుపరుస్తుంది."* తన సిద్ధాంతం కేవల వర్గ ప్రయోజనాల కొరకు ప్రచారం చేయబడే విషయాన్ని మాల్తస్ రహస్యంగా వుంచడు: యీ నియమాన్ని అర్థం చేసుకుంటే, యిది మానవుడు తన బాధలను మరింత ఓర్పుతో భరించడానికి తోడ్పడుతుందనీ, అతను "తన బీదరికం మూలంగా ప్రభుత్వం పట్లా, సమాజంలోని ఉన్నత వర్గాలపట్లా తక్కువ అసంతృప్తి, చిరాకూ"** చెందేటట్లు చేస్తుందనీ అతను పట్టుబట్టుతాడు.

మాల్తస్ జనాభా నియమాన్ని మార్క్సూ, ఎంగెల్సూ మహా తీవ్రమైన విమర్శకు గురిచేసినారు; యెందుకంటే, అది "కార్మికవర్గంమీద బూర్జువావర్గం చేసిన అత్యంత బహిరంగ యుద్ధ ప్రకటన"*** గనుక. మరొక చోట మార్క్సు ఆగ్రహావేశాలతో యిలా రాసినాడు: "పచ్చి క్షుద్రత్వం మాల్తస్‌యొక్క విలక్షణ గుణం — మానవుల బాధను పాపానికి శిక్షగా చూసే మతగురువుకు మాత్రమే సాధ్యమైన క్షుద్రత్వం...."****

మాల్తూసియన్ సిద్ధాంతం చెల్లదని 19వ శతాబ్దంలోనే సామాజిక అభివృద్ధి రుజావు జేసింది. 1804నుండి 1914 వరకు జనాభా సగటున యేడాదికి 0.864 శాతం పెరగగా, గోధుమ ఉత్పత్తి సగటున 2.1 శాతం పెరిగింది. పశ్చిమ జర్మన్ అర్థ శాస్త్రజ్ఞుడు ఆఫ్. బాడె ప్రకారం 2000వ సంవత్సరం నాటికి ధాన్యం ఉత్పత్తిని 1200, 1600 కోట్ల టన్నులకు పెంచవచ్చు; అది 3000 కోట్ల జనానికి తినడానికి సరిపోతుంది.***** కానీ, 21వ శతాబ్ది ప్రారంభం నాటికి ప్రపంచ జనాభా సుమారు 600 – 700 కోట్లకు పెరగవచ్చునని ఊహించబడుతున్నది. ప్రస్తుతం భూతలంలో 9 శాతం భూమి మాత్రమే సాగులో వుంది, కానీ కనీసం 40 శాతం భూమిని సాగుచేయవచ్చు. అనగా యింకా బోలెడు అవకాశా లున్నాయన్నమాట.

---

* పై గ్రంథమే, పుట 465.

** పై గ్రంథమే, పుట 542.

*** K. Marx and F. Engels, *On Britain* ("బ్రిటన్ గురించి"), Moscow, 1962, పుట 321.

**** K. Marx, *Theories of Surplus-Value* ("అదనపు విలువ సిద్ధాంతాలు"), Part II, Moscow, 1962, పుట 117.

***** F. Baade, *Der Wettlauf zum Jahre 2000* ("2000 నాటికి పోటీ"), Oldenburg, 1961, పుట 65.

యీవిధంగా, మాల్థూసియన్ "నియమం" శాస్త్ర పరీక్షలో నెగ్గలేదు, కాని దానికి యింకా అనుచరులు వుంటూనే వున్నారు. భూమండలంమీద అమిత జనాభా వుందనీ, జనాభా యిక యేమాత్రం పెరిగినా మానవజాతికి విపత్తు సంభవిస్తుందనీ యీనాటి మాల్థూసియన్లు వాదిస్తారు; యెందుకంటే, సంక్షోభాలకూ, విప్లవాలకూ, యుద్ధాలకూ, యితర సామాజిక ఉత్పతనాలకూ మూల కారణం అమిత జనాభా అట.

మానవులు మితిమీరిన సంఖ్యలో వున్నారు గనుక వాళ్లు చస్తుండాలి, అందరికీ చాలి నంత తిండి లేదు, మితిమీరిన జనాభా పెరుగుదల అన్ని కీడులకూ మూలం, వగైరా, వగైరా. యిలాంటి మాటలు నయా మాల్థూసియన్ల రచనల నిండా వున్నాయి. కమ్యూనిజం అద ర్శాలకూ, అవసరాన్ని బట్టి పంపకం అని చెప్పే దాని సూత్రానికీ భిన్నంగా, మాల్థూసియన్లు అమిత జనాభా బీభత్సాలతో మానవజాతి భవిష్యత్తును భీకరంగా చిత్రిస్తారు.

వాస్తవంలో, ఉత్పాదక శక్తులయొక్కా, శాస్త్రవిజ్ఞానంయొక్కా ప్రస్తుత అభివృద్ధి స్థాయితో కూడా, లభ్యమయ్యే వ్యవసాయ భూమితో కూడా, భూమండలంమీది ప్రతి వొకరికీ తిండి పెట్టడమూ, ఆకలినీ, పస్తులనూ తుడిచివేయడమూ, వ్యవసాయ శ్రమయొక్క ఉత్పాదక శక్తులను పెంచడమూ సాధ్యమే. అడ్డుపడేది యేమిటంటే, భూమండలంలో అనేక ప్రాంతాలలోని ఆర్థిక వెనుకబాటుతనమూ, వాటి అభివృద్ధిని కుంటుపరుస్తున్న సామాజిక సంబంధాల వ్యవస్థా, భారమైన వలసవాదపు వారసత్వమూ, అలాంటి యితర అంశాలూ.

మానవులు పడవలమీద నివసించవలసినంతగా భూమండలపు జనాభా పెరిగినా కూడా, అప్పటికీ భూమి అందరికీ తిండి పెట్టగలిగే స్థితిలో వుంటుందని రష్యన్ శాస్త్రజ్ఞుడు తిమి ర్యాజెవ్ చెప్పింది నిజమే ననడానికి ఆధునిక శాస్త్రవిజ్ఞానం విశ్వసనీయమైన సాక్ష్యం యిస్తు న్నది. కానీ, మాల్థూసియనిజంను విమర్శించేటప్పుడు మనం యే వాస్తవ సమస్యలను యీ సిద్ధాంతం వక్రంగా ప్రతిబింబిస్తుందో ఆ సమస్యలను గమనించవలసిన అవసరం వుంది. అలాంటి నిజమైన సమస్యలు కనీసం రెండు వున్నాయి: ఒకటి, పెరుగుతున్న జనాభా అవసరాలను తీర్చేటట్లుగా వ్యవసాయ ఉత్పత్తిని పెంచే సమస్య; రెండు, పరిస్థితులనుబట్టి జనన రేటును పెరిగేటట్లో, తరిగేటట్లో నియంత్రించే సమస్య. సమాజం యీ సమస్యలను యెదుర్కోవలసి వుంది; సూత్రరీత్యా వాటిని పరిష్కరించడం సాధ్యమే — సామాజిక శత్రు త్వాలను అధిగమిస్తే, సమస్త మానవజాతియొక్క హేతుబద్ధ ప్రయత్నాలను యేకం చేస్తే.

ప్రకృతి, భౌగోళిక పరిసరాలూ, జనాభా సామాజిక జీవితానికి అవసరమైన, ముఖ్యమైన షరతులుగా వుంటూ, సామాజిక అభివృద్ధిని ప్రభావితం చేస్తూ, సామాజిక అభివృద్ధి వెనుక వున్న కీలక శక్తి కాకపోతే, మరి యేమిటి ఆ శక్తి? సామాజిక అభివృద్ధిని నియమ

పాలితమైన ప్రాకృతిక చారిత్రక శక్తిగా మార్చేది యేమిటి? సామాజిక అభివృద్ధి వెనుక వున్న కీలక శక్తి ఉత్పత్తి.

ఉత్పత్తి అనేది సమాజంయొక్క జీవితానికీ, అభివృద్ధికీ ప్రాతిపదిక గనుక, దాని అభివృద్ధికి చెందిన నియమాలనూ, సమాజ చరిత్రలో వాటి అమలునూ పరిశీలించడం సామాజిక శాస్త్రపు ప్రాథమిక కర్తవ్యం. ఉత్పత్తిలో పనిచేసే నియమాలలో ఆయా సామాజిక నిర్మాణ రూపాలకు విశిష్టమైన నియమాలూ, అన్ని సామాజిక నిర్మాణ రూపాలకు సామాన్యమైన నియమాలూ వున్నాయి. కానీ, ఉత్పత్తి సంబంధాలు ఉత్పాదక శక్తుల స్వభావానికీ, వాటి అభివృద్ధి స్థాయికీ అనుగుణంగా వుంటాయన్న నియమం ప్రత్యేక ప్రాముఖ్యం గలది. అది మొత్తం మానవ చరిత్ర అంతటా పనిచేసే సార్వత్రిక సామాజిక నియమం. దాని పరిశీలన మనకు చారిత్రక క్రమ సారాంశాన్ని తెలుసుకోడానికి తోడ్పడుతుంది.

**ఉత్పత్తి సంబంధాలు
ఉత్పాదక శక్తుల
స్వభావానికీ,
వాటి అభివృద్ధి
స్థాయికీ అనుగుణంగా
వుంటాయన్న నియమం**

సకల సామాజిక వ్యవస్థల అభివృద్ధి క్రమంలోనూ ఉత్పాదక శక్తులకూ, ఉత్పత్తి సంబంధాలకూ మధ్య గల సంబంధాన్ని వ్యక్తం చేస్తుంది అనుగుణతా నియమం. ఉత్పత్తి సంబంధాలు ఉత్పాదక శక్తులమీద ఆధారపడుతాయి, వాటిచేత నిర్ణయింపబడుతాయి, తమ వంతుకు మళ్లీ వాటిమీద కొంత ప్రభావం నెరపుతాయి. ఉత్పత్తి సంబంధాల ప్రభావం ద్వివిధం: అవి ఉత్పాదక శక్తులకు అనుగుణంగా వుంటే, వాటి అభివృద్ధిని పెంపొందిస్తాయి, ఆ శక్తులకు ప్రతికూలంగా వుంటే, వాటి అభివృద్ధికి గుదిబండ అవుతాయి. అందుకనే, ఉత్పత్తి సంబంధాలు ఉత్పాదక శక్తుల స్వభావానికీ, అభివృద్ధి స్థాయికీ అనుగుణంగా వుండడం అవసరం. అనుగుణతా నియమం ఉత్పత్తి సంబంధాలు ఉత్పాదక శక్తుల అభివృద్ధిమీదా, ఉత్పాదక శక్తుల అభివృద్ధి ఉత్పత్తి సంబంధాలమీదా ఆధారపడడాన్ని వర్ణిస్తుంది. కానీ, ఉత్పత్తియొక్క రెండు పక్షాల యీ చర్యా ప్రతిచర్యలలో ప్రతిదానికీ భిన్నమైన పాత్ర వుంది; యీ చర్యా ప్రతిచర్యలలో ఉత్పాదక శక్తులు నిర్ణాయక శక్తిగా వుంటాయి. కనుక, అనుగు

ణతా నియమం ఉత్పాదక శక్తులకూ ఉత్పత్తి సంబంధాలకూ మధ్య గల పరస్పరత్వాన్ని, లేదా చర్యా ప్రతిచర్యలను వ్యక్తం చేస్తుంది, ఉత్పాదక శక్తుల అభివృద్ధి అనే ప్రాతిపదిక మీద జరిగేదానిని.

సామాజిక ఉత్పత్తి క్రమం అంటే, శ్రమ సాధనాలను తయారు చేయడమూ, వాటిని ఉపయోగించి అనుభోగ వస్తువులను తయారు చేయడమూ. అందువల్లనే సామాజిక ఉత్పత్తి యెప్పుడూ రెండు పెద్ద శాఖల కిందికి వస్తుంది: శాఖ I (ఉత్పత్తి సాధనాల ఉత్పత్తి), శాఖ II (అనుభోగ వస్తువుల ఉత్పత్తి). నిజమే, వివిధ సామాజిక అభివృద్ధి దశలలో యీ రెండు ఉత్పత్తి శాఖల మధ్య భేదం అంతో యింతో ప్రస్ఫుటంగా వుంటుంది. కానీ, ఉత్పత్తి క్రమంలో మనుషులు ఖర్చుపెట్టే కాలాన్ని బట్టీ, ఉత్పాదితంయొక్క సహజ రూపాన్ని బట్టీ, యీ రెండు పెద్ద శాఖలలో ఒక్కొక్కటి నిర్వహించే పాత్రను బట్టీ, సామాజిక ఉత్పత్తిలో యీ శాఖలను యెప్పుడూ వెలికి తీయవచ్చు. సామాజిక ఉత్పత్తి యెలా అభివృద్ధి చెందేదీ తెలుసుకోడానికి యీ విభజన మౌలిక ప్రాముఖ్యం గలది. ఉత్పత్తిలోని సంవిధానాలనూ, సాంకేతిక పద్ధతులనూ మెరుగుపరచడంద్వారా మాత్రమే అనుభోగ వస్తువుల ఉత్పత్తి పెరగగలదు గనుక, సామాజిక ఉత్పత్తి ప్రగతికి మొదటి శాఖయొక్క అభివృద్ధి మౌలికమైన భూమిక. మొదటి శాఖలోని ఉత్పత్తియొక్క అనుస్యూతి (continuity)నీ, విస్తరణనూ నిస్సందేహం చేయడానికి, అనుభోగ వస్తువులను తయారు చేయడానికి ఉపయోగించే శ్రమ సాధనాలూ, ఉత్పత్తి సాధనాలను తయారు చేయడానికి ఉపయోగించే శ్రమ సాధనాలూ నిత్యం పునరుత్పత్తి కావాలి, దానితో పాటు సామాజిక ఉత్పత్తిని విస్తృతపరచడానికి శ్రమ సాధనాలు అదనంగా వుండాలి. అందువల్లనే, ఉత్పత్తి సత్వరంగా విస్తరించడానికి ఉత్పత్తి సాధనాల ఉత్పత్తి (శాఖ I) ముందు అభివృద్ధి కావాలి. కానీ, విస్తృత పునరుత్పత్తి అంటే, ఉత్పత్తి చేయబడే శ్రమ సాధనాల సంఖ్య పెరగడం మాత్రమే కాదు, ఉత్పత్తి పరికరాలనూ, శ్రమ సాధనాలనూ వున్నవాటిని మెరుగుపరచడమూ, అంతకంతకూ యెక్కువగా తయారు చేయడమూ, కొత్త సాంకేతిక విజ్ఞానమూ, విద్యుచ్ఛక్తి పరిశ్రమను అభివృద్ధి చేయడమూ, వగైరా, జాతీయ ఆర్థిక వ్యవస్థయొక్క ప్రతి శాఖలోనూ వాటిని ప్రవేశపెట్టడమూ కూడా, అనగా సాంకేతిక పురోగతి—సామాజిక ఉత్పత్తి అభివృద్ధికి ముఖ్యం.

సకల అభివృద్ధి లాగే, ఉత్పత్తి అభివృద్ధిలో రెండు పార్శ్వా లున్నాయి: అనుస్యూతీ, కొత్త అంశాల ఉత్పన్నం. అప్పటికే లభ్యమయ్యే శ్రమ సాధనాల సాయంతోనూ, సాధింపబడిన ఉత్పత్తి స్థాయి యిచ్చే అవకాశాలను ఉపయోగించుకోవడంద్వారానూ మాత్రమే కొత్త శ్రమ సాధనాలు సృష్టింపబడగలవు. అందువల్లనే, అనుస్యూతి, అనగా మునుపటి అభివృద్ధియొక్క అనుకూల ఫలితాలను నిలిపివుంచడం, ఉత్పాదక శక్తులను అభివృద్ధి చేయడానికి అవశ్యమైన అంశం, షరతు.

యీ అభివృద్ధిని పురోగతి అనే అవిచ్ఛిన్నమైన సరళ రేఖగా భావించకూడదు; యిది అంతకంటె యెంతో క్లిష్టమైనది. ఒక కారణం యేమిటంటే, భిన్నభిన్నమైన ఉత్పత్తి పరికరాల ప్రాతిపదికమీద జరిగే సాంకేతిక పురోగతి భిన్నభిన్నంగా వుంటుంది. సరళమైన చేతి పనుల పరికరాల అభివృద్ధి యంత్రోత్పత్తి అభివృద్ధికంటె గుణాత్మకంగా భిన్నంగా వుంటుంది. యీ విషయం మార్క్స్ అప్పడే చెప్పినాడు. పెట్టుబడిదారీ పూర్వపు ఉత్పత్తి విధానాలన్నిటి సాంకేతిక ప్రాతిపదిక సారభూతంగా మార్పు లేకుండా వుండిందనీ, పెట్టుబడిదారీ ఉత్పత్తి యొక్క సాంకేతిక ప్రాతిపదిక విప్లవాత్మకంగా వుండిందనీ ఆయన చెప్పినాడు.* దీనికి కారణ మేమిటి? సరళమైన పరికరానికీ, యంత్రానికీ భేదం యేమిటంటే, మొదటిదానిని మనిషే స్వయంగా చేతబట్టుకుంటాడు, కానీ యంత్రాన్ని యంత్రాంగం నడిపిస్తుంది, తత్ఫలితంగా ఒకప్పుడు కార్మికులు చేసే చర్యలను యిప్పుడు యంత్రాలు చేస్తాయి. ఒక పరికరం ఒక నిర్దిష్ట శ్రమ చర్యకు సరిపోడానికి ప్రయోగాత్మకంగా సృష్టింపబడినప్పుడు, దానికి మారకుండా వుండే ధోరణి వుంటుంది. గొడ్డలీ, సుత్తే, నాగలీ యే ప్రత్యేకీకరణా లేకుండా వేల యేండ్లుగా వాడుకలో వున్న పరికరాలలో కొన్ని. అందువల్లనే, యీ పరికరాల ప్రాతి పదికమీద జరిగే సాంకేతిక పురోగతి చాలా మందంగా వుంది, మారకుండే ధోరణి వుంది. తత్ఫలితంగా, శ్రమ ఉత్పాదకత ప్రధానంగా కార్మికుని చాకచక్యంద్వారానూ, సరుకును తయారు చేయడంలో సూక్ష్మమైన శ్రమ విభజనద్వారానూ పెరుగుతుంది.

భారీ స్థాయి పరిశ్రమల సాంకేతిక ప్రాతిపదిక భిన్నమైనది. మొత్తం పారిశ్రామిక, వ్యావసాయిక ఉత్పత్తినీ, రవాణానూ, యితర పరిశ్రమలనూ యంత్రం రూపాంతరీకరిస్తుంది. విస్తారమైన సామాజిక శ్రమ విభజనా, వివిధ ఉత్పత్తి శాఖల మధ్య సజీవమైన లంకెలూ లేకుండా యంత్రోత్పత్తి దురూహ్యం. ఒక ఉత్పత్తి శాఖలో జరిగే ప్రతి ముఖ్యమైన మెరుగుదలా దానితో సంబంధం గల యితర శాఖలలో అదే విధమైన పురోగతికి అవసరాన్ని సృష్టిస్తుంది, యెందుకంటే, ఉత్పత్తిలో సరైన నిష్పత్తులను పోషించడానికీ, సరుకుల సరఫరాలో అడ్డంకులను తొలగించడానికీ. ఉదాహరణకు, జెట్ యింజన్ల ఆవిర్భావం ఆ యింజన్ల ఉత్పత్తి కొరకు పదార్థాలను సరఫరా చేసే లోహోత్పాదక, రసాయనిక, యితర పరిశ్రమలకు కొత్త ప్రమాణాలను నెలకొల్పింది. యంత్రోత్పత్తికి విస్తారంగా, వేగంగా పెరిగే సామర్థ్యమూ, విస్తరించే సామర్థ్యమూ వున్నాయని మనసులో పెట్టుకోవాలి; యివి చేతిపనులకు యెప్పుడూ లేనట్టివి.

చివరి విషయంగా, భారీస్థాయి పరిశ్రమలకు జరిగే పరివర్తన బుద్ధిపూర్వకంగా

---

* K. Marx, *Capital*, Vol. I, Moscow, 1965, పుట 486.

ఉత్పత్తికి శాస్త్రవిజ్ఞానాన్ని సాంకేతికంగా ప్రయోగించడంతో ముడిపడివుంది. యిది అంత కంతకూ యెక్కువ ప్రకృతి శక్తులనూ, కొత్తగా ఆవిష్కరించబడిన పదార్థ గుణాలనూ, ప్రకృతి నియమాలనూ ఉత్పత్తి క్రమంలో ఉపయోగించుకోడానికి అపారమైన అవకాశాలను కలిగించి, తద్వారా ఉత్పాదక శక్తుల అభివృద్ధికి అపారమైన అవకాశాలను కలిగిస్తుంది. శాస్త్రవిజ్ఞానానికి భౌతిక ప్రాతిపదిక అయిన ఆధునిక యంత్రోత్పత్తి మరింత అభివృద్ధి చెందడానికి శాస్త్రవిజ్ఞానం శక్తివంతమైన వూపు యిస్తుంది. అణు భౌతికశాస్త్రమూ, సెమీ కండక్టర్ల భౌతికశాస్త్రమూ, సైబెర్నెటిక్స్, అధికాణువుల సంయోగాల రసాయనశాస్త్రమూ, వగైరాలు యీనాటి శాస్త్ర, సాంకేతిక విప్లవానికి కారణాలు. ఆధునిక యంత్రోత్పత్తియొక్క సాంకేతిక ప్రాతిపదిక సత్వర లంఘనాలూ, విప్లవాత్మక మార్పులూ చేయగలదని రుజువైంది. సహజంగానే, ఆధునిక సాంకేతిక విజ్ఞానంయొక్క అవకాశాలు వాస్తవం కావడం చాలా మేరకు సామాజిక పరిస్థితులమీద కూడా ఆధారపడుతుంది. యీ విషయం కింద వివరిస్తాం.

ఈవిధంగా, సాంకేతిక పురోగతి అనేది ఉత్పాదక శక్తులు అభివృద్ధి చెందడానికి ప్రాతి పదిక; కానీ, వాటి అభివృద్ధి సాంకేతిక పురోగతి మాత్రమే కాదు. వాటి అభివృద్ధిలో ఉత్పత్తి వ్యవస్థీకరణయొక్క మెరుగుదలా, ఉత్పాదక శక్తిగా మానవుని అభివృద్ధీ, అనగా అతని అనుభవమూ, నైపుణ్యాలూ, సాంస్కృతిక ప్రమాణాలూ, సాంకేతిక జ్ఞానమూ, వగైరాల అభివృద్ధీ, యిమిడివున్నాయి.

సాంకేతిక అభివృద్ధితో పాటు మారడానికి అభిముఖంగా వున్న మానవుని అనుభవమూ, నైపుణ్యాలూ కూడా ఉత్పాదక శక్తులలో క్రియాత్మకమైన భాగం. మనుషులు లేకుండా యంత్రాలు నడవవు; మనుషులు యంత్రాలను ఉపయోగించుకోవడమే కాక, యంత్రాలనూ, సాంకేతిక విజ్ఞానాలనూ అభివృద్ధి చేస్తారు, మెరుగుపరుస్తారు, కొత్త పరికరాలను సృజన చేస్తారు, ఉత్పత్తిని హేతుబద్ధం చేస్తారు (rationalise). అందువల్లనే, యితర విష యాలన్నీ సమానంగా వున్నప్పుడు, యంత్రాల అభివృద్ధీ, వాటి అవకాశాల వినియోగమూ మనుషుల అనుభవంమీదా, నైపుణ్యాలమీదా, జ్ఞానంమీదా, సాంస్కృతిక ప్రమాణాలమీదా, సామర్థ్యాలమీదా ఆధారపడుతాయి.

ఈవిధంగా, ఉత్పాదక శక్తుల అభివృద్ధి క్లిష్టమైన ప్రక్రియ. దానిలో వివిధ అంశాలు ఒకదానిమీద ఒకటి పనిచేస్తాయి, ఒకదానిమీద ఒకటి క్రియాత్మకమైన ప్రభావం నెరపు తాయి: కానీ, అన్నిటికంటె ముఖ్యంగా, ఉత్పాదక శక్తులలోని కారక అంశంగా వున్న శ్రమ సాధనాల అభివృద్ధిచేతా, మెరుగుదలచేతా పురోగతియొక్క సాధారణ మార్గం నిర్ణయింప బడుతుంది.

ఉత్పాదక శక్తులు ఉత్పత్తి సంబంధాలను నిర్ణయిస్తాయి, యెందుకంటే, ఉత్పాదక

శక్తులయొక్క, అన్నిటినీ మించి ఉత్పత్తి సాధనాలయొక్కా, పరికరాలయొక్కా స్వభావమూ, అభివృద్ధి స్థాయీ శ్రమ క్రమంలోని మనుషుల మధ్య నిశ్చితమైన సంబంధాల అవసరాన్ని విధిస్తాయి. యీ పరాధీనత మానవజాతి చరిత్రలో ప్రముఖంగా కనపడే ధోరణిగా వ్యక్త మౌతుంది.

చరిత్ర ప్రారంభంలోని ఆదిమమైన రాతి పనిముట్టునుండీ, పదునైన కర్రనుండీ యీనాటి సంక్లిష్టమైన యంత్రాలూ, సాధనాలూ, విద్యుత్ కర్మాగారాలూ, మొదలైన వాటిదాకా జరిగిన శ్రమ పరికరాల అభివృద్ధిలోని గొప్ప పురోగతికి పరిమాణాత్మక పార్శ్వమూ, గుణాత్మక పార్శ్వమూ వున్నట్లు చరిత్రను గురించిన భౌతికవాద దృక్పథం తెలుపుతుంది. ఉత్పాదక శక్తులు యెక్కువగానో, తక్కువగానో అభివృద్ధి చెందినాయని మన మన్నప్పుడు మనం వాటిని పరిమాణాత్మకంగా అంచనా వేసి, వాటి అభివృద్ధి స్థాయిలను పోలుస్తాము. శ్రమ పరికరాలు యెలా పనిచేస్తాయి, యెలా ఉపయోగించబడుతాయి అనేదానిమీద ఉత్పాదక శక్తుల గుణాత్మక వర్ణన ఆధారపడుతుంది. గుణాత్మకంగా చూసినప్పుడు ఉత్పాదక శక్తులకు రెండు రకాల స్వభావం వుండవచ్చు: శ్రమ పరికరాలు (చేతి పనిముట్ల లాగ) వ్యక్తి శ్రమచేత నడిపించబడి, అతనికి అవసరమైన జీవనాధారాలు ఉత్పత్తి చేయడానికి తోడ్పడినప్పుడు, ఉత్పాదక శక్తులకు వ్యష్టి (ప్రైవేటు) స్వభావం వుందంటారు; వాటిని నడిపించడానికి (ఫాక్టరీల లాగ) సమష్టి శ్రమ అవసరమైనప్పుడు, ఉత్పాదక శక్తులకు సామాజిక స్వభావం వుందంటారు.

ఉత్పాదక శక్తుల సామాజిక స్వభావానికీ, వ్యష్టి స్వభావానికీ అనుగుణంగా రెండు రూపాల ఉత్పత్తి సంబంధాలు వుండగలవు, చరిత్రలో కనపడే రెండు మౌలిక రూపాలు. అవి యేవంటే: ఉత్పత్తి క్రమంలో మనుషుల మధ్య సహకార, పరస్పర సహాయ సంబంధాలు, ఉత్పత్తి సాధనాలలో సామాజిక ఆస్తిమీద ఆధారపడినట్టివి; ఆధిపత్య, పరాధీనతా సంబంధాలు, ఉత్పత్తి సాధనాలలో సొంత ఆస్తిమీద ఆధారపడినట్టివి.

మానవజాతి జంతు స్థితినుండి బయటపడినప్పుడు, మానవులు రాతితోనూ, కొయ్య తోనూ, యెముకతోనూ చేసిన పరికరాలు ఉపయోగించినారు. యివి వ్యష్టి ఉపయోగపు పరికరాలైనప్పటికీ, వీటిని ఉపయోగించే వ్యక్తి అవసరమైన జీవనాధారాలను ఉత్పత్తి చేయ జాలక పోయినాడు. వ్యష్టి ఉత్పత్తి అసంభవమైంది, మనుషులు కలిసి పనిచేయవలసి వచ్చింది, ఒకరి కొకరు అండగా వుండవలసి వచ్చింది. యెందుకంటే, ఒంటరిగా మనిషి ప్రకృతి యెదుట బలహీనుడు. తత్ఫలితంగా, సమష్టి సంఘం ఆ కాలంలో మౌలిక ఉత్పాదక శక్తిగా వుంది. ఆదిమ సమాజంలో రూపుదాల్చిన సమష్టితత్వపు సంబంధాలకు అది ప్రాతిపదికను సమకూర్చింది.

ఉత్పాదక శక్తులు అభివృద్ధి చెందేకొద్దీ, రాతి పనిముట్లు వాడకంనుండి కంచు పని ముట్లకూ, తరువాత యినప పనిముట్లకూ ఆదిమ సమష్టి సమాజం లోపల మార్పు జరిగింది. యినప పనిముట్లు శ్రమ ఉత్పాదకతను యెంతగా పెంచినాయంటే, వ్యక్తులూ, విడివిడి కుటుంబాలూ ఉత్పత్తి చేయసాగినారు. ఉత్పాదక శక్తులు వ్యష్టి స్వభావం పొందినప్పుడు, వాటి అభివృద్ధిలో గుణాత్మకమైన లంఘనం జరిగింది. దీనికి ప్రచండమైన సామాజిక పర్యవసానాలు వుండినాయి. ఉత్పాదక శక్తుల వ్యష్టి స్వభావానికి అనుగుణంగా, ఆ ప్రాతి పదికమీద అనివార్యంగా సొంత ఆస్తి ఉత్పత్తి సంబంధాలు ఉత్పన్న మౌతాయి — బానిస యజమాన సంబంధాలూ, ఫ్యూడల్ సంబంధాలూ, పెట్టుబడిదారీ సంబంధాలూ. ప్రతి ఉన్నతతర రకానికి చెందిన సొంత ఆస్తి సంబంధాలూ వ్యష్టి స్వభావం కలిగిన ఉత్పాదక శక్తుల ఉన్నతతర స్థాయి అనే ప్రాతిపదికమీద రూపుదాలుస్తాయి. సొంత ఉపయోగంలోని శ్రమ పరికరాల అభివృద్ధి, మెరుగుదలా కొత్త గుణాత్మక లంఘనానికి, చేతిపనుల పరికరాలనుండి యంత్రోత్పత్తికి జరిగిన పరివర్తనకు, ప్రమాణాత్మక సన్నాహంగా వుండింది. యీ పరి వర్తన శ్రమ క్రమానికి సామాజిక స్వభావాన్ని యిచ్చింది. నిజమే, అత్యంత సరళమైన యంత్రాలు (గాలిచేతా, నీటిచేతా నడపబడే మిల్లులు) చాలా పూర్వ కాలంలోనే మొదట ఉపయో గించబడినాయి: నీటి మిల్లులు పురాతన కాలంలోనూ, గాలి మిల్లులు సుమారు 10వ శతాబ్ది నుండీ. కానీ, అవి ఉత్పత్తిలో అప్రధాన పాత్రను నిర్వహించినాయి, వాటి వాడకం ఉత్పత్తి స్వభావాన్ని నిర్ణయించలేదు. పెట్టుబడిదారీ వ్యవస్థ మాత్రమే, వ్యష్టి స్వభావం కలిగిన శ్రమ పరికరాల ప్రాతిపదికమీద మొదట ఉద్భవించి, క్రమక్రమంగా ఉత్పత్తి క్రమానికి సామాజిక స్వభావం యిస్తుంది. యీవిధంగా పెట్టుబడిదారీ వ్యవస్థా, దానివెంట సమస్త సొంత ఆస్తీ కాలం చెల్లినవైపోతాయి; యెందుకంటే, సామాజిక స్వభావం కలిగిన ఉత్పత్తి క్రమానికి ఉత్పత్తి సాధనాలు సామాజిక ఆస్తి కావడం అవసరం. ఆధునిక భారీస్థాయి పరి శ్రమలను అభివృద్ధి చేయడంద్వారా పెట్టుబడిదారీ వ్యవస్థ ఉత్పత్తి సాధనాలలో సామాజిక సోషలిస్టు ఆస్తియొక్క ఆవిర్భావానికి భౌతిక, సాంకేతిక పూర్వావసరాలను సృష్టిస్తుంది.

యీవిధంగా ఉత్పాదక శక్తుల స్వభావంలో వచ్చిన గుణాత్మకమైన మార్పు, చేతిపనుల పనిముట్లనుండి యంత్రోత్పత్తికి జరిగిన పరివర్తననుండి యేర్పడినట్టిది, సొంత ఆస్తి సంబంధాలనుండి ఉత్పత్తి సాధనాలలో సామాజిక ఆస్తికి జరిగే సమాజపు పరివర్తనకు అంతిమ కారణంగా, ప్రాతిపదికగా వుంటుంది.

ప్రస్తుతం మనం ఉత్పత్తి అభివృద్ధిలో కొత్త లంఘనం చూస్తున్నాం. అది కాలక్రమాన యెలాంటి సన్నివేశాన్ని కలిగిస్తుందంటే, ఆ సన్నివేశంలో మానవుడు తనకూ ప్రకృతికీ మధ్య కేవలం ఒక యంత్రాన్నో, యంత్ర వ్యవస్థనో కాక, స్వయంచలిత, స్వయంనియంత్రిత

ఉత్పత్తి క్రమాన్ని పెడతాడు. స్వయంచలనం యంత్రాల అభివృద్ధిలో కొత్త యుగాన్ని ప్రవేశపెడుతుంది.

సమగ్ర యాంత్రికీకరణా, స్వయంచలనమూ విడివిడి సంస్థలనూ, పరిశ్రమలనూ మాత్రమే కాక, మొత్తం ఆర్థిక ప్రాంతాలనే కూడా, తదనంతరం ఆయా దేశాలయొక్క, దేశాల బృందాలయొక్క ఆర్థిక సమాహారాలను కూడానూ, దీర్ఘ కాలంమీద మొత్తం ప్రపంచం యొక్క ఆర్థిక వ్యవస్థనూ ఒక చోట చేర్చి యేకైక సమస్తంగా పనిచేసే అఖండ ఉత్పాదక యంత్రాంగంగా చేస్తాయి. సోవియట్ యూనియన్‌లోని యూరపియన్ ప్రాంతంలో జరిగి నట్లు విస్తారమైన భూభాగాలమీద గొప్ప విద్యుత్ వ్యవస్థల స్థాపనలో యీ ధోరణి యిప్పటికే వ్యక్తమైంది. ఉత్పత్తియొక్క యితోధిక సామాజికీకరణ ఉత్పత్తిని గుణాత్మకంగా కొత్తదిగా చేస్తుంది. ఉత్పత్తి క్రమాన్ని సమస్త సమాజంయొక్క ప్రయోజనాలకూ, బుద్ధిపూర్వక అజమాయిషీకి లోబరచడానికీ, జాతుల, దేశాల వేరుపాటును అధిగమించడానికీ వస్తుగత అవకాశమూ, అవసరమూ యీ భౌతిక ప్రాతిపదికనుండి ఉద్భవిస్తాయి. దీర్ఘ కాలంమీద దీనినుండే ఉద్భవిస్తుంది జాతులు ప్రపంచ స్థాయిలో స్వేచ్ఛాయుత శ్రామిక ప్రజల యేకైక సమాఖ్యగా యేకీకరణ చెందే ధోరణి.

ఉత్పత్తి పరికరాల అభివృద్ధిలోని పరిమాణాత్మక, గుణాత్మక పార్శ్వాలకూ, వాటి స్వభావంలో వచ్చే మార్పుకూ చెందిన సమస్యకు సకల సామాజికార్థిక వ్యవస్థల పాదార్థిక, సాంకేతిక ప్రాతిపదికను నిర్ణయించడంలోనూ ప్రకృతిసిద్ధ చారిత్రక క్రమంగా వాటి అభి వృద్ధిని అర్థం చేసుకోవడంలోనూ నిర్ణయాత్మక ప్రాముఖ్యం వుంది.

ఉత్పత్తి సంబంధాలు ఉత్పాదక శక్తులను యెలా ప్రభావితం చేస్తాయి?

ఒక దశవరకు ఉత్పాదక శక్తులు నిర్దిష్ట ఉత్పత్తి సంబంధాల సారాంశాన్ని మార్చ కుండా అభివృద్ధి చెందుతాయి. కనుక ఆ సంబంధాలు ఉత్పాదక శక్తులు అభివృద్ధి చెంద డానికి కావలసినంత అవకాశం యిచ్చినంత వరకు అవి కొత్త రూపంచేత తొలగింపబడవు— కుర్రవాడు బట్టలు మరీ బిర్రు అయిందాకా వాటిని ధరించినట్లు.

కానీ, తదనంతర అభివృద్ధి గతిలో కొత్త ఉత్పత్తి సంబంధాలు క్రమక్రమంగా పాత బడిపోతూ, అభివృద్ధి చెందే ఉత్పాదక శక్తులకు వ్యతిరేకమై, వాటిని బంధించడం ప్రారంభి స్తాయి. యీ దశలో అవి తొలగిపోయి, ఉత్పాదక శక్తుల అభివృద్ధికి ఉపకరించే కొత్త ఉత్పత్తి సంబంధాలకు స్థానం యివ్వవలసి వుంటుంది.

1846 డిసెంబర్ 28న అన్నెన్‌కొవ్‌కు రాసిన సుప్రసిద్ధమైన ఉత్తరంలో మార్క్స్ యిలా అన్నాడు: "మానవులు తాము సంపాయించుకున్నదాన్ని యెప్పుడూ వదలుకోరు. అంటే, యే సామాజిక రూపంలో తాము నిర్దిష్ట ఉత్పాదక శక్తులను సంపాయించు

కున్నారో ఆ సామాజిక రూపాన్ని వదులుకోరని అర్థం కాదు. తద్వ్యతిరేకంగా, లభించిన ఫలితాన్ని పోగొట్టుకోకుండానూ, నాగరికతా ఫలితాలను వదులుకోకుండానూ వుండేటందుకు వాళ్ళు తమ పరస్పర సంబంధాల విధానం తమకు లభించిన ఉత్పాదక శక్తులకు యిక యే మాత్రమూ అనుగుణంగా లేని సమయంనుండి తమ సాంప్రదాయిక సామాజిక రూపాల నన్నిటినీ మార్చుకోవలసి వుంటుంది.''*

ఉత్పత్తి సంబంధాలు తమ చట్రంలోపల అభివృద్ధి చెందే ఉత్పాదక శక్తులకు నిర్దిష్ట చారిత్రక స్వభావాన్ని యిస్తాయి. చారిత్రకంగా నిర్దిష్టమైన ప్రతి ఉత్పత్తి విధానానికీ దాని సొంత నిర్దిష్ట ఆర్థిక నియమాలు వున్నాయి; వాటి ప్రాతిపదికమీద ఆ యుగంలో ఉత్పాదక శక్తులు అభివృద్ధి చెందుతాయి.

ప్రతి ఉత్పత్తి సంబంధాల రూపమూ ఉత్పత్తిని నిర్దిష్ట లక్ష్యానికి లోబరుస్తుంది గనుక, అది మనుషుల మధ్య—విస్తారమైన జన సముదాయాల మధ్య, వర్గ సమాజంలో అయితే వర్గాల మధ్య—కార్యాచరణకు నిశ్చితమైన ప్రేరణలు కలిగిస్తుంది; అవి పెట్టుబడిదారీ సమాజంలో వున్నట్లు సోషలిస్టు సమాజంలో వుండవు. ఉత్పత్తి సంబంధాల క్రియాత్మక స్వభావానికి యిది ప్రాథమిక వ్యక్తీకరణ.

అంతర్వైరుధ్యపూరిత ఉత్పత్తి సంబంధాలంటే, ఉత్పాదకులకూ, ఉత్పత్తి సాధనాలకూ మధ్య సంపూర్ణమైన, లేదా పాక్షికమైన వేర్పాటు వుంటుంది, ఉత్పాదకులే సరళమైన ఉత్పత్తి సాధనంగా మార్చబడుతారు. బానిస యజమానులూ, ఫ్యూడల్ ప్రభువులూ, పెట్టుబడిదారులూ—ఆయా సామాజిక నిర్మాణ రూపాల పాలకవర్గాలు, ఉత్పత్తి సాధనాల సొంతదారులు—ఉత్పత్తి అభివృద్ధిని తమ సొంత ప్రయోజనాలకూ, అవసరాలకూ లోబరుస్తారు. ఉదాహరణకు, పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాల వాహికలైన పెట్టుబడిదారులు తమ స్వప్రయోజనమైన లాభార్జనకు ఉత్పత్తిని లోబరచగల స్థితిలో వున్నారు.

ఒక పాలకవర్గంయొక్క ఉనికి, అది ఉత్పాదక శక్తుల అభివృద్ధిని పెంపొందించినంత వరకు, మరొక విధంగా చెప్పాలంటే, ఆ వర్గంయొక్క ఆధిపత్యానికి అవసరమైన నిర్దిష్ట ఉత్పత్తి సంబంధాలు ఉత్పాదక శక్తులకు అనుగుణంగా వున్నంత వరకు మాత్రమే చారిత్రకంగా సమర్థనీయం. ఫ్యూడల్ ఉత్పత్తి సంబంధాలు పోయి, వాటి స్థానంలో పెట్టుబడిదారీ సంబంధాలు వచ్చినప్పుడు, అవి ఉత్పాదక శక్తులకు బలీయమైన చోదకశక్తిగా వుండి, వాణిజ్య, పారిశ్రామిక కార్యకలాపాలకూ, సొంత వర్తకానికీ, లాభాల వేటకూ, పెట్టుబడిదారీ ఆర్థి

---

* K. Marx and F. Engels, *Selected Correspondence* (''యేరిన ఉత్తరప్రత్యుత్తరాలు''), పుటలు 35–36.

కాభివృద్ధికి యింకా అలాంటి ప్రేరణలకూ అపారమైన అవకాశం కలిగించినాయి. చారిత్రకంగా పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలు అవశ్యంగా, ప్రగతిశీలంగా వుండినాయి. కానీ, సొంత ఆస్తిమీద ఆధారపడిన యేదో ఒక ఉత్పత్తి సంబంధాల రూపం ప్రగతిశీలమా కాదా అని నిర్ణయించడానికి పాలకవర్గాల ఉద్దేశాలూ, కార్యకలాపాలూ మాత్రమే ప్రాతిపదికగా ఉపకరిస్తాయని భావించకూడదు. యీ ఉత్పత్తి సంబంధాల వ్యవస్థలోపల ప్రత్యక్ష ఉత్పాదకుని ప్రతిపత్తి నిర్ణయాత్మక ప్రాముఖ్యం గలది. అంతర్వైరుధ్యపూరిత ఉత్పత్తి సంబంధాల రూపం యేదైనా జనాలకు వాళ్ల మునుపటి ప్రతిపత్తితో పోలిస్తే కొన్ని సౌకర్యాలను యిస్తే, ఆ రూపం ప్రగతిశీలమే; యెందుకంటే, అది దోపిడీని తగ్గించి, పనికి కొత్త ప్రేరణలు కల్పిస్తుంది. అనంతరం యీ సమస్యను సవివరంగా చర్చిస్తాము.

మనం ఉత్పాదక శక్తుల చారిత్రక అభివృద్ధిని గుణ నిర్ధారణ చేసేటప్పుడు, ఉత్పత్తి పరికరాలు మాత్రమే కాక, ఉత్పాదక శక్తిగా మానవుడు కూడా మార్పుకు లోనౌతాడని అంటాం. ఉత్పత్తి సంబంధాల అమలును పరిశీలించడంలో మనం తక్షణ ఉత్పత్తి రంగంలోని కార్యకలాపాలపట్ల భిన్న వైఖరి అవలంబించాలి. నిజంగా, ఉత్పాదక శక్తుల అభివృద్ధిని అది యే సామాజిక పరిస్థితులలో జరుగుతుందో వాటితో సంబంధం లేకుండా, అనగా ఆ ఉత్పత్తి సంబంధాల వ్యవస్థలోపల ప్రత్యక్ష ఉత్పాదకుని ప్రతిపత్తిని వివరించకుండా, పరిగణించడం తప్పు. యెందుకు తప్పంటే, ఫలానా దశలోని ఉత్పత్తి సంబంధాలు యే మేరకు ఉత్పాదక శక్తుల యేజంటు పాత్రను నిర్వహించేదీ నిర్ణయించడానికి శ్రామిక జనాల స్థితీ, శ్రమ ఉత్పాదకతను పెంచడానికి అది ఉత్పన్నంచేసే ప్రేరణలూ మహా ముఖ్యమైనవి. యీ ప్రశ్న ఉత్పన్నమౌతుంది: పాత ఉత్పత్తి సంబంధాలు ఉత్పాదక శక్తుల అభివృద్ధికి గుదిబండగా వున్నాయని అన్నప్పుడు మన ఉద్దేశ మేమిటి? దరహంమీద ఉత్పత్తి అభివృద్ధి పూర్తిగా ఆగిపోయిందని అర్థమా?

పాత ఉత్పత్తి సంబంధాలు గుదిబండగా పనిచేస్తాయన్న మార్క్సిస్టు సూత్రాన్ని రైలుకు బ్రేకులు వేసి ఆపిన విధంగా, యాంత్రికంగా వ్యాఖ్యానించకూడదు. ఉత్పత్తి ఆగిపోదు సరి కదా, పాత ఉత్పత్తి సంబంధాలలో కూడా అభివృద్ధి చెందుతూనే వుంటుంది. ఉదాహరణకు, పెట్టుబడిదారీ దేశాలలో పాతబడిన ఉత్పత్తి సంబంధాలు యిప్పుడు ప్రాబల్యంలో వున్నాయి, యివి ఉత్పాదక శక్తులకు మహా విరుద్ధంగా వున్నాయి, కానీ యీ దేశాలలో ఉత్పత్తి అభివృద్ధి చెందుతూనే వుంది, యే విధంగానూ ఆగిపోలేదు.

<u>పాత ఉత్పత్తి సంబంధాలు గుదిబండలాగా పనిచేస్తాయని అన్నప్పుడు మన ఉద్దేశ మేమిటి?</u>

మొదటి విషయం యేమిటంటే, యీ పాత ఉత్పత్తి సంబంధాలలో, సాధింపబడిన ఉత్పత్తి స్థాయియొక్క అవకాశాలన్నీ ఉపయోగించబడవు. "...పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి

ఒకానొక విస్తృత ఉత్పత్తి దశలో అడ్డంకులు యెదురౌతాయి; మరో తర్కాధారంనుండి చూస్తే ఆ అడ్డంకులు పూర్తిగా అరకొరగా వుండేవి. అవసరాలు తీరిన దశలో కాక, లాభో త్పత్తి, లాభ సంగ్రహణమూ నిర్ణయించిన దశలో అది ఆగిపోతుంది."* పెట్టుబడిదారీ ఉత్పత్తియొక్క పరిమిత స్వభావాన్ని యిది వెల్లడిస్తుందని మార్క్స్ అన్నాడు.

అమెరికా సంయుక్త రాష్ట్రాలయొక్కా, తదితర పెట్టుబడిదారీ దేశాలయొక్కా వనరులు సమాజ ప్రయోజనాలకు ఉపయోగించబడితే, నూరు కోట్ల పీడిత, క్షుధార్త ప్రజ లను ఆరోగ్యంగా, క్షేమంగా జీవించేటట్లు చేయడానికి పదేండ్లకంటె యెక్కువ పట్ట దని బ్రిటిష్ శాస్త్రజ్ఞుడు జె. డి. బెర్నాల్ "శాస్త్రవిజ్ఞానమూ, సమాజమూ" అనే తన గ్రంథంలో అన్నాడు. కానీ, అమెరికా సంయుక్త రాష్ట్రాలూ, యితర పెట్టుబడిదారీ దేశాలూ బూర్జువావర్గం పాలించినంత కాలం ఉత్పత్తి ప్రజల ప్రయోజనాలకు కాక గుత్త సంస్థల గరిష్ఠ లాభాల వేటకు అనుగుణంగా మలచబడుతుంది. కనుక, ఉత్పత్తి సంబంధాలకూ, యీనాటి ఉత్పాదక శక్తుల స్వభావానికీ మధ్య వున్న వైరుధ్యం అభౌతిక సిద్ధాంత ప్రతిపాదన కాదు, మహా భౌతికమైన వాస్తవం.

అంతేకాక, పారిశ్రామిక సంస్థలు యెప్పుడూ పూర్తి సామర్థ్యంతో పనిచేయడం లేదు, అనుభోగ వస్తువులు విపరీతంగా ఉత్పత్తి చేయబడుతూ, వందల కోట్ల డాలర్లు ఆయుధాల కొరకు ఖర్చుపెట్టబడుతూ, ఉత్పాదక శక్తులు విధ్వంసక శక్తులుగా మార్చబడుతూ పరి శ్రమలు యేకముఖంగా, వికృతంగా అభివృద్ధి చెందినాయి; వీటిలో కూడా పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాల గుదిబండ ప్రభావం వ్యక్తమౌతున్నది.

చివరి విషయంగా, పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలు ఒక వైపున శ్రమ క్రమాన్ని రాక్షసంగా తీవ్రపరచి, కార్మికులు కఠోరమైన పరిస్థితులలో చాకిరీ చేసేటట్లు నిర్బంధించి నాయి, మరొక వైపున పాక్షికంగా పనిచేసేవాళ్లనూ, బొత్తిగా పనిచేయనివాళ్లనూ విస్తారంగా తయారు చేసినాయి; సమాజపు అత్యంత ముఖ్య ఉత్పాదక శక్తి అయిన మానవుడే వ్యర్థం కావడానికి యిది దారితీసింది. యీ విషయం కూడా పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాల గుదిబండ స్వభావమే.

కనుక, పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలు ఉత్పాదక శక్తుల అభివృద్ధికి గుదిబండగా తయారైనాయని మన మన్నప్పుడు ఆ శక్తుల అభివృద్ధి ఆగిపోయిందని మన ఉద్దేశం కాదు. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉత్పత్తి చాలా అసమంగా, యేకముఖంగా వుందనీ, సంక్షోభాల గుండా, ఉత్పతనాల గుండా ఉత్పాదక శక్తులు అభివృద్ధి చెందుతున్నాయనీ మాత్రమే భావిం

---

* K. Marx, *Capital*, Vol. III, Moscow, 1971, పుట 258.

చాలి. శాస్త్ర, సాంకేతిక విజయాలు యుద్ధ సేవలో పెట్టబడి, మనుషులను ధ్వంసం చేయ డానికీ, ప్రగతి శక్తులతో పోరాడడానికీ ఉపయోగించబడుతున్నాయి.

కనుక, అనుగుణతా నియమం ఉత్పత్తి సంబంధాల క్రియాశీలతలో కూడా వ్యక్తం చేయబడుతుంది. ఉత్పత్తి అభివృద్ధి కేవలం స్వయంగా ఆస్తి రూపంచేత కాక, ఉత్పత్తిలోని మనుషుల మధ్య గల సంబంధాలచేత, లేదా యే రూపంలో ఉత్పాదితం పంపకం చేయబడు తుందో ఆ రూపంచేత త్వరితం కావడమో, మందగించడమో జరుగుతుందనే విషయంచేత యీ క్రియాశీలత సాధ్యమౌతుంది. మానవులు మాత్రమే ఉత్పత్తిని అభివృద్ధి చేస్తారు, లేదా దానిని అభివృద్ధి చేయడంలో వాళ్లకు ఆసక్తి వుండదు. వాళ్లే తమ సొంత ఉత్పత్తి విధా వాన్ని అభివృద్ధి చేస్తారు, లేదా మారుస్తారు, యిది వాళ్ల చరిత్రకు ప్రాతిపదిక అవుతుంది. మార్క్సిజంయొక్క బలం యేమిటంటే, ప్రతి నిర్దిష్ట దశలోనూ మానవుల — విస్తార మైన జన సముదాయాల, బృందాల, వర్గాల — కార్యాచరణను నిర్ణయించేది యేమిటనే ప్రశ్నకు అది శాస్త్రీయ, భౌతికవాద సమాధానం యిచ్చింది. యీ కార్యాచరణను నిర్ణయించేది ఉత్ప త్తిలో వాళ్ల స్థానం, ఉత్పత్తి సాధనాలపట్ల వాళ్ల వైఖరి, కనుక ఉత్పాదితాలపట్ల వాళ్ల వైఖరి; మరొక విధంగా చెప్పాలంటే, దీనిని నిర్ణయించేది వాళ్ల ఉత్పత్తి సంబంధాలు. అవి మనుషుల యిచ్ఛయొక్కా, చైతన్యంయొక్కా ప్రభావంకింద కాక, ఉత్పాదక శక్తుల స్వభా వంయొక్కా, స్థితియొక్కా, అభివృద్ధి స్థాయియొక్కా ప్రభావంకింద రూపుదాలుస్తాయి. యీవిధంగా, ఉత్పత్తి సంబంధాల క్రియాశీలత మనుషుల కార్యాచరణద్వారా వ్యక్తమౌతుంది; తత్ఫలితంగా, ఉత్పాదక శక్తుల అభివృద్ధి, అన్నిటినీ మించి ఉత్పత్తి పరికరాల అభివృద్ధి యెందుకు జరుగుతుందనే ప్రశ్న యీ పరికరాలను అభివృద్ధి చేసే మనుషుల కార్యాచరణను నిర్ణయించేది యేమిటనే ప్రశ్నగా మారుతుంది. యీ ప్రశ్నకు జవాబు ఉత్పత్తియొక్క ఆర్థిక సంబంధాల పరిశీలననుండి వస్తుంది; యీ సంబంధాలు ప్రతి నిర్దిష్ట దశలోనూ మానవ కార్యాచరణయొక్క పరిస్థితులనూ, ఉద్దేశాలనూ నిర్ణయిస్తాయి.

పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలు ప్రత్యక్ష ఉత్పాదకుని యెలాంటి సన్నివేశంలో పెడతాయంటే, ఆ సన్నివేశంలో దోపిడీద్వారా, కఠిన శ్రమద్వారా అతని శ్రమయొక్క ఉత్పాదకత పెంచబడుతుంది. సోషలిజంలో చాలా భిన్నమైన పరిస్థితులు సృష్టింపబడు తాయి; అక్కడ ఉత్పత్తిలోని నూత్నవిషయకారులూ, శాస్త్రజ్ఞులూ, యింజనీర్లూ, సాంకే తికులూ సాంకేతిక విజ్ఞానాన్నీ, యంత్రాలనూ అభివృద్ధి చేస్తారు, శ్రమయొక్క వైపు ణ్యాలనూ, వ్యవస్థీకరణనూ, సోషలిస్టు సమాజపు ఉత్పాదక శక్తులనూ అభివృద్ధి చేస్తారు; యెందుకంటే, కేవలం వాళ్ల పనికి న్యాయమైన డబ్బు ముట్టుతున్నందువల్ల కాదు, వాళ్లు తమ కోసమే పనిచేస్తారు కనుకా, తమ జాతి జనుల కొరకూ, తమ సొంత రాజ్యం కొరకూ

పనిచేస్తారు కనుకా కూడా. అందువల్ల, మనుషులకూ, వాళ్ల పరికరాలకూ మధ్య — ఉత్పత్తి అభివృద్ధికి చోదక శక్తిగా వున్న ఉత్పాదక శక్తులలోని అంశాల మధ్య — జరిగే చర్యా ప్రతిచర్యలు ప్రతిచోటా నిర్దిష్ట ఉత్పత్తి సంబంధాల రూపంలో వ్యక్తమౌతాయి; యివి మనుషులను కార్యకలాపాలకు పురికొల్పే నిర్దిష్ట ప్రేరణలుగా వెల్లడౌతాయి.

అనుగుణతా నియమం నిర్దిష్ట ఉత్పత్తి విధానపు అభివృద్ధిని మాత్రమే కాక, వర్ద మాన ఉత్పాదక శక్తులు పాత ఉత్పత్తి సంబంధాలతో ఘర్షించినప్పుడు ఒక ఉత్పత్తి విధానాన్ని తొలగించి మరొక ఉత్పత్తి విధానాన్ని పెట్టే అవసరాన్ని కూడా నిర్ణయిస్తుంది. ఒక ఉత్పత్తి విధానంనుండి మరొక ఉత్పత్తి విధానానికి మార్పు జరిగే కాలంలో అనుగుణతా నియమం యెలా పనిచేస్తుంది?

కొత్త ఉత్పాదక శక్తులూ, తదనుగుణమైన ఉత్పత్తి సంబంధాలూ పాత వ్యవస్థ గర్భంలో ఉద్భవిస్తాయి. దరహంమీద, పాత వ్యవస్థ అదృశ్యమైన తర్వాత, దానితో సం బంధం లేకుండా కొత్త అంశమేదీ ఉద్భవించజాలదు, అది పాతదాని అభివృద్ధియొక్క అవశ్య ఉత్పాదితంగా మాత్రమే ఉద్భవిస్తుంది. ఉత్పత్తి అభివృద్ధి కూడా అంతే. బతికేటందుకూ, అవసరమైన జీవనాధారాలను ఉత్పత్తి చేయగలిగేటందుకూ మానవులు తమకంటె ముందు సృష్టింపబడిన ప్రతిదాన్నీ తమ కార్యాచరణకు ప్రాతిపదికగా అంగీకరించక తప్పదు. కానీ, నిర్దిష్ట ఉత్పత్తి సంబంధాలు ఉత్పన్నం చేసే ప్రేరణల ప్రభావంతో ప్రతి కొత్త తరమూ శ్రమ సాధనాలలో మార్పులు ప్రవేశపెట్టి తన ఉత్పత్తి అనుభవాన్నీ, నైపుణ్యాలనూ మెరుగు పరచుకుంటుంది, తద్వారా ఉత్పాదక శక్తులను అభివృద్ధి చేస్తుంది. యిది క్రమక్రమంగా కొత్త ఉత్పాదక శక్తుల సృష్టికి తోడ్పడుతుంది; అవి కొత్త తరానికి అందజేయబడు తాయి. ఉత్పాదక శక్తుల అభివృద్ధిలోని ఒక నిర్దిష్ట దశలో, పాత సమాజపు గర్భం లోపల కొత్త ఉత్పత్తి సంబంధాలు పుట్టుతాయి, ఒక నిర్దిష్ట ఆర్థిక నిర్మాణంగా యేర్ప డేటట్టివి. దీనితో కొత్త ఉత్పత్తి విధానపు అంశాలు ఉత్పన్నమౌతాయి. ఆదిమ సమష్టి ఉత్పత్తి విధానంలో, దాని అభివృద్ధి ఫలితంగా, బానిస యజమాన ఉత్పత్తి విధానం పుట్టు తుంది. బానిస యజమాన వ్యవస్థలో పుట్టే ఫ్యూడల్ ఉత్పత్తి విధానానికీ, ఫ్యూడల్ వ్యవస్థ గర్భంలో పుట్టే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికీ యిదే వర్తిస్తుంది.

యీవిధంగా, పాత ఉత్పత్తి విధానం లోపల కొత్త ఆర్థిక విధానం అభివృద్ధి చెంద నారంభిస్తుంది. మొలకెత్తే కొత్త ఉత్పాదక శక్తులు సమాజంమీద పెత్తనం చేసే పాత ఉత్పత్తి సంబంధాలతో ఘర్షణపడుతాయి. పాలకవర్గమూ, అది సృష్టించిన ఉపరి నిర్మాణమూ పోషించే పాత ఉత్పత్తి సంబంధాలను తొలగించకుండా యీ ఘర్షణను పరిష్క రించడం, అనగా కొత్త ఉత్పత్తి సంబంధాలను ప్రాబల్యంలో నెలకొల్పడం, అసాధ్యం.

అందువల్లనే, పాత ఉత్పత్తి సంబంధాలనుండి కొత్తవాటికి మారడంలో, గుణాత్మక మైన లంఘనం అవసరం, కొత్త ఉత్పత్తి విధానాన్ని స్థాపించడానికి దారిచేసేటందుకు పాత బడిన, కరుడుగట్టిన ఆర్థిక, సామాజిక, రాజకీయ రూపాల విప్లవాత్మక విధ్వంసం అవసరం.

సోషలిస్టు ఉత్పత్తి విధానపు ఆవిర్భావానికి గల విశిష్ట లక్షణం యేమిటంటే, దానికి కావలసిన పూర్వావసరాలు మాత్రమే పాత వ్యవస్థ అయిన పెట్టుబడిదారీ వ్యవస్థ గర్భంలోపల ఉద్భవిస్తాయి. అవి యేవంటే, సామాజిక స్వభావం గల ఉత్పాదక శక్తులూ, కార్మికవర్గమూ, సోషలిస్టు భావజాలమూ, కార్మికవర్గ పార్టీ, వగైరా.

కానీ, గొప్పగా పెరిగిన ఉత్పాదక శక్తులకు అనుగుణమైన కొత్త సోషలిస్టు ఉత్పత్తి సంబంధాలు పెట్టుబడిదారీ పరిస్థితులలో రూపుదాల్చవు. యీ మార్క్సిస్టు సూత్రాన్ని అవకాశవాదులు యెప్పుడూ నిరాకరిస్తారు. ఉత్పత్తి సంబంధాలతో సహా సోషలిజంయొక్క అంశాలు పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉద్భవిస్తాయనీ, అందువల్లనే సోషలిజం కొరకు "పోరాట" మంటే యీ అంశాల క్రమక్రమ విస్తరణ అనీ, కనుక పెట్టుబడిదారీ వ్యవస్థనుండి సోష లిజంకు మారడం, ముఖ్యంగా బూర్జువా ప్రజాస్వామ్యంలో, విప్లవ ఉత్పతనాలు లేకుండా కేవల పరిణామాత్మక పద్ధతిలో జరగగలదనీ అవకాశవాదులు అంటారు. యీవిధంగా, సోష లిస్టు సంబంధాలు పెట్టుబడిదారీ వ్యవస్థ గర్భంలో ఉద్భవిస్తాయా లేదా అనే ప్రశ్న సిద్ధాంత ప్రాముఖ్యం మాత్రమే కాక, ఆచరణాత్మక ప్రాముఖ్యం కూడా కలిగినట్టిది, తీవ్ర భావజాల పోరాటానికి గురి అయినట్టిది. పెట్టుబడిదారీ వ్యవస్థలో సోషలిస్టు సంబంధాలు యెందుకు ఉద్భవించవు, ఉద్భవించజాలవు?

చరిత్రలోని శత్రువర్గ వ్యవస్థల అనుక్రమం ఉత్పత్తి సంబంధాలలో యే ప్రగాఢమైన మార్పునూ కలిగించక, కేవలం ఒక రకం సొంత ఆస్తిని తొలగించి మరొక రకాన్నీ, ఒక దోపిడీ రూపాన్ని తొలగించి మరొక రూపాన్నీ పెట్టింది, ఫ్యూడల్ దోపిడీని తొలగించి, పెట్టుబడిదారీ దోపిడీని పెట్టినట్లు. అందువల్లనే, సొంత ఆస్తి యజమానులైన పెట్టుబడిదారులు సొంత ఆస్తి నిర్మితమే అయిన ఫ్యూడలిజంలో ఉద్భవించగలిగి, కాలక్రమాన ఆర్థిక ప్రాబల్యపు స్థానాలు వహించగలిగినారు. వాళ్ల ఆర్థిక ప్రాబల్యం స్థిరపడిన తర్వాత వాళ్ళు ఫ్యూడల్ ప్రభువుల రాజ కీయ ప్రాబల్యాన్ని కూలదోయడానికి ముందుకు సాగినారు. ఆ దశతోనే ప్రతి బూర్జువా విప్ల వమూ పరిమితమైంది.

పెట్టుబడిదారీ వ్యవస్థనుండి సోషలిజంకు జరిగే పరివర్తన పూర్తిగా భిన్నమైనది. పెట్టుబడిదారీ ఆస్తిని తొలగించడానికి యే ప్రయత్నం జరిగినా, పెట్టుబడిదారీ వర్గం ఉపరి నిర్మాణపు సంపూర్ణ శక్తిమీద ఆధారపడి ఆ ఆస్తిని రక్షించుకొంటుందని మనం జ్ఞాపకం

పెట్టుకోవాలి. అందువల్లనే, బూర్జువావర్గపు రాజకీయ పెత్తనాన్ని కూలదోయడంద్వారా తప్ప పెట్టుబడిదారీ ఆస్తిని సోషలిస్టు ఆస్తిగా రూపాంతరీకరించడం ప్రారంభించబడజాలదు. నూతన సమాజ నిర్మాణంలో చైతన్యపూరితమైన సమతూకపు కృషికి శ్రామిక జనాలను ఉత్తేజపరచడానికి అది పూర్వావసరం.

మునుపటి ప్రతి సామాజిక వ్యవస్థలో లాగే సోషలిజంలో కూడా, ఉత్పాదక శక్తుల అభివృద్ధి ఫలితంగా వాటికీ ఉత్పత్తి సంబంధాలకూ మధ్య వైరుధ్యం యేర్పడుతుంది. కానీ, యీ వైరుధ్యం మౌలికంగా భిన్నమైనది, భిన్న అభివృద్ధి రూపాలు ధరిస్తుంది, భిన్న పరిష్కార మార్గాలను అపేక్షిస్తుంది.

సోషలిజంలో అనుగుణతా నియమంయొక్క ప్రధాన లక్షణం యేమిటంటే, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఉత్పాదక శక్తులకు ఉత్పత్తి సంబంధాలు అనుగుణంగా వుండేటట్లు చేయడానికి సమాజం సకాలంలో చర్యలు తీసుకోగల స్థితిలో వుంటుంది, అనగా వాటి మధ్య ఉత్పన్నమయ్యే వైరుధ్యాలను చైతన్యపూరితంగా పరిష్కరించగల స్థితిలో వుంటుంది.

సోషలిస్టు ఉత్పత్తి సంబంధాలు ఉత్పాదక శక్తుల సత్వర అభివృద్ధికి అవకాశాలను సృష్టిస్తాయి, వాటి అభివృద్ధికి గొప్ప చోదక శక్తిగా వుండి, సాంకేతిక పురోగతిని ప్రోత్స హిస్తాయి, పనిపట్ల కమ్యూనిస్టు వైఖరిని పెంపొందించడానికి తోడ్పడుతాయి, శ్రమ ఉత్పా దకతను వేగంగా పెంచుతాయి. కానీ, యీ అవకాశాలు వాటంతటవే వాస్తవం కావు; అందు వల్లనే, సోషలిజంలో ఉత్పత్తిని అభివృద్ధి చేయడానికీ, శాస్త్ర, సాంకేతిక పురోగతిని గరిష్ఠంగా త్వరపరచడానికీ, ప్రజల — అనగా కార్మికుల, సమష్టి రైతుల, మేధావుల — శ్రమ క్రియా శీలతయొక్క అభివృద్ధి ఒక అత్యంత ముఖ్యమైన షరతు. సాంకేతిక పురోగతి కొరకూ, మేలైన ఉత్పత్తి వ్యవస్థీకరణ కొరకూ, శాస్త్రవిజ్ఞానపు అభివృద్ధి కొరకూ, దాని విజయాలను ఆచరణలో ప్రయోగించడం కొరకూ, శ్రమ ఉత్పాదకతను పెంచడం కొరకూ, పదార్థాల వాడకంలో పొదుపు కొరకూ, వగైరాల కొరకు చేసే పోరాటం యావత్ప్రజల యెదుట వున్న ఒక మహా ముఖ్యమైన కర్తవ్యంగా యెంచబడుతుంది.

అనుగుణతా నియమం: సామాజిక పర్యవసానాలు

సామాజిక అభివృద్ధి అనేది సామాజికార్థిక వ్యవస్థల అభివృద్ధీ, అనుక్రమమూ. అది ఉత్పత్తి అభివృద్ధిచేత నిర్ణయింపబడుతుంది. ప్రతి సామాజిక వ్యవస్థయొక్క నిర్మాణాన్నీ, అభివృద్ధినీ, ఒక వ్యవస్థనుండి మరొక వ్యవస్థకి జరిగే పరివర్తననూ, చరిత్ర క్రమం యే

మార్గాలలో నడుస్తుందో ఆ మార్గాలనూ నిర్ణయించి, చరిత్ర క్రమాన్ని యేకైక సమస్తంగా యేకీకరించేది ఉత్పత్తే. సమస్త సమాజంయొక్క అభివృద్ధిలోనూ ఉత్పత్తి నిర్వహించే నిర్ణాయక పాత్ర అది.

ప్రప్రథమంనుండి చరిత్రలో అంతర్గతమైన ఉద్దేశమేదీ లేదు. చరిత్ర గతి అనేది నియమపాలిత క్రమం. మానవ కార్యాచరణకు మాత్రమే లక్ష్యాలు వున్నాయి, యీ లక్ష్యాలూ, వీటిని సాధించడానికి గల అవకాశాలూ ప్రతి యుగంలోని భౌతిక పరిస్థితులచేత నిర్ణయించ బడుతాయి.

సామాజిక నిర్మాణరూపాల నియమపాలిత అభివృద్ధినీ, అనుక్రమాన్నీ ప్రతి జాతిమీదా, మొత్తం చరిత్రమీదా రుద్దబడిన తాత్విక చారిత్రక నమూనాగా చూడడం కూడా తప్పే. నిర్దిష్ట చరిత్ర నిశ్చయంగా అంతకంటె సంపన్నంగా, వైవిధ్యపూరితంగా వుంది. కానీ, అన్ని నదులూ, వాటి మార్గాలు యెంత వంకరటింకరగా వున్నప్పటికీ, నిర్దిష్ట దిశలో ప్రవహించినట్లు, అన్ని జాతులూ, వాటి చారిత్రక అభివృద్ధి యెంత చిత్రాతిచిత్రంగా వున్నా, అనుగుణతా నియమంచేత నిర్ణయింపబడిన చారిత్రక క్రమంయొక్క వస్తుగత తర్కానికి మొత్తంమీద లోబడివుంటాయి. ఆదిమ సమష్టి వ్యవస్థా, సకల శత్రుత్వపూరిత వ్యవస్థలూ, కమ్యూనిస్టు సామాజికార్థిక వ్యవస్థా సమాజపు నియమపాలిత అభివృద్ధియొక్క దశలు.

సమాజ చరిత్ర ప్రకృతి చరిత్రయొక్క కొనసాగింపు. జంతు ప్రపంచపు అభివృద్ధి మానవ ఆవిర్భావానికి కావలసిన జీవగత పూర్వావసరాలను సిద్ధం చేసింది. మానవుని పూర్వీకులైన జంతురూపులు తమ జీవనాధారాలు సంపాయించుకొనే కార్యాచరణలో శ్రమ పరికరాలు చేయడమూ, ఉపయోగించడమూ ప్రారంభించినప్పుడు మానవ సమాజం ఆవిర్భవించింది. పరిసర ప్రకృతితో చర్యా ప్రతిచర్యలు కలిగి వుండే జీవగతాతీత పద్ధతిగా శ్రమ అభివృద్ధి చెందిన ఫలితంగా మానవ హస్తమూ, మెదడూ ఆవిర్భవించినాయి. శ్రమ వ్యక్తుల మధ్య కొత్త సంబంధాల వ్యవస్థను కూడా సృష్టించింది, సామాజిక సంబంధాలూ, ప్రకృత్యతీత సామాజిక క్రమత్వాలూ గల వ్యవస్థను. మానవ స్పందనలూ, మనస్సూ, భాషా, ఆలోచనా, యివన్నీ శ్రమయొక్కా, మనుషుల సంసర్గంయొక్కా క్రమంలోనూ, వాటి ప్రాతిపదికమీద రూపుదాల్చి, అభివృద్ధి చెందినాయి. కనుక, మానవులను జంతు ప్రపంచం నుండి పైకి లేవనెత్తే ప్రతిదానికీ అంతిమంగా కారణం శ్రమే. సామాజిక మానవుడు శ్రమ చేత సృష్టింపబడినాడు.

సమాజ ఆవిర్భావంతో, సామాజిక అనుభవం యే జీవగతాతీత సాధనాలద్వారా ముందు తరాలకు అందజేయబడుతుందో అవి కూడా రూపుదాలుస్తాయి. మానవ ప్రవర్తనయొక్క అనుభవమూ, ఆచరణాత్మక కార్యకలాపాల పద్ధతులూ, ఆలోచనా పద్ధతులూ, మొదలైనవి

అనువంశికమైనవి కావు; వేటితో ప్రతి కొత్త తరం మానవులూ సంపర్కం పొందుతారో ఆ భాషా, భౌతిక, ఆత్మిక సంస్కృతీ అనే రూపాలలో సమాజంలో నమోదు చేయబడుతాయి. యీ ప్రక్రియను వ్యక్తియొక్క సామాజికీకరణ అంటారు. మానవుడుగా ప్రతి వ్యక్తియొక్క కార్యాచరణకూ యిది పూర్వావసరమూ, షరతూ. అందువల్లనే, మానవుడు సమాజంలో, సమాజ సహాయంతో మాత్రమే బతకగలడు, అభివృద్ధి చెందగలడు. ప్రప్రథమంనుండి మానవుడు సమాజ జీవి.

అదే సమయంలో, మానవుడూ, సమాజమూ ఆవిర్భవించడమంటే ఆదిమ, పురాతన సామాజిక నిర్మాణ రూపం అయిన ఆదిమ సమష్టి వ్యవస్థ యేర్పడడం.

ఆదిమ సమష్టి వ్యవస్థ భూమండల మంతటా వుండింది. జీవిత విధానమూ, మొత్తం సంబంధాల వ్యవస్థా ఉత్పత్తి స్థాయిమీద యెలా ఆధారపడేదీ అది తన ఆదిమ సరళత్వంతో కన్నులకు కట్టినట్లు నిరూపిస్తుంది. మానవుడు అనాడు ఉపయోగించిన మహా ఆదిమ శ్రమ పరికరాల మూలంగా మానవుడు ఒంటరిగా ఉత్పత్తిని సాగించడం అసాధ్యమైంది. ప్రకృతి యెదుట వ్యక్తే అశక్తుడుగా వుండినాడు గనుక, సమష్టి శ్రమ ఆవశ్యకమైంది. సజీవంగా వుండేటందుకు మానవులు గణం, తెగ లాగ సమష్టి బృందాలుగా కలిసి వుండ వలసి వచ్చింది. అవి ఒకే సమయంలో గణ సమూహాలూ (రక్త బాంధవ్యంమీద ఆధారపడిన సంబంధాలు గలవి), ఉత్పత్తి బృందాలూ (మనుషులు తమ జీవనాధారాలను సమష్టిగా సంపాయించుకొనేవాళ్లు గనుక), సామాజిక వ్యవస్థ రూపాలూ, భాషా, సమాజాలూ. మొత్తం జీవిత విధానంమీద రక్త సంబంధాలకు గల మహత్తర ప్రభావాన్ని కూడా ఉత్పత్తియొక్క ఆదిమ స్థితి నిర్ణయించింది; వాటికి మానవజాతి పునరుత్పత్తితో సంబంధం వుంది. జంతువుల మంద అంతఃప్రవృత్తులనుండి ఉద్భవించి కేవలం జీవగత అగత్యాన్ని వ్యక్తం చేస్తుంది; దీనికి భిన్నంగా, కలిసి శ్రమ చేయవలసిన ఆవశ్యకత మానవ సమష్టి సమాజం యేర్పడడానికి ప్రధాన కారణం. యీ జీవిత విధానం తదనురూపమైన సామాజిక చైతన్యాన్ని ఉత్పన్నం చేసింది.

నీతి, మతం, కళ అనేవి ఆదిమ సమాజంలో ఉద్భవించిన చైతన్యంయొక్క రూపాలు. కానీ ఆ కాలంలో అవి విడివిడిగా లేక, ఒకే సమస్తంగా వుండి, గణానికీ, తెగకూ చెందిన సంప్రదాయాల, ఆచారాల, భావాల వ్యవస్థగా వుండినాయి, అవి ప్రకృతి సిద్ధమైనవిగా కనపడేవి, వాటికి తెగలోని ప్రతి సభ్యుడూ మనోవాక్కర్మలలో పూర్తిగా లోబడివుండేవాడు. మానవుని సంబంధాలన్నీ గణంచేతా, తెగచేతా పరిమిత పరచబడినట్లుండేవి: అతనికి తన భూభాగంమీద మాత్రమే కదలడానికి స్వేచ్ఛ వుండింది గనుక స్థల విషయంగానూ, అతని అస్తిత్వమే సమష్టి సమాజంమీద ఆధారపడింది గనుక ఆర్థికంగానూ, ఫలానా తెగ సభ్యు

డుగా తప్ప వ్యక్తిగా అతనికి స్వీయ స్పృహ లేదు గనుక ఆత్మికంగానూ. తెగ చైతన్యమే దాని సభ్యులలో ప్రతి వొక్కని చైతన్యమూ కూడా, గణానికీ, తెగకూ చెందిన చట్రానికి ఆవల వుండిందల్లా అతనికి పరాయిది.

మానవుడు సమష్టి సమాజంలో జీవించినప్పటికీ, జీవితం అతనిమీద కఠినమైన డిమాండ్లు మోపింది. యీ డిమాండ్లు ఒకేసారి చాలా సరళంగానూ, చాలా క్లిష్టంగానూ వుండినాయి. ఒక వైపున, ఆదిమ పరికరాలను చేయడానికీ, ఉపయోగించడానికీ చాలా జ్ఞానమూ, నైపుణ్యమూ అక్కర లేకపోయింది; మరొక వైపున, మానవుని కార్యాచరణయొక్క సామర్థ్యం అతని భౌతిక గుణాలమీదా (బలమూ, లాఘవమూ, ఓపికా, వగైరా), ఆత్మిక గుణాలమీదా (దృఢ సంకల్పమూ, పట్టుదలా, ఆత్మనిగ్రహమూ, సమయస్ఫూర్తీ), పరిసర ప్రకృతిని గురించి అతనికి తెలిసిన సమాచారంమీదా, మొదలైనవాటిమీదా ఆధారపడి వుండింది. ఉత్పాదక శక్తులు అతి ఆదిమ స్థాయిలో వుండినందున, మానవుడు కేవలం తన మనుగడ కొరకే పరాయి, ప్రతికూల ప్రకృతితో ప్రతి దినమూ, ప్రతి గంటా పోరాటం చేయవలసి వుండింది. అగ్గిపుల్లతో మంట చేయడం సులభం, చెకుముకితో చేయడం అంత సులభం కాదు, ఆదిమ పద్ధతి లాగ రెండు కర్రల రాపిడితో మంట చేయడం మహా కష్టం. రాతి మొన యీటెతోనూ, విల్లునమ్ములతోనూ వేటాడడానికి చాలా సాధన అవసరం.

యీవిధంగా, మానవజాతి జీవితంలో వేల యేండ్లు సాగిన యీ దశలో సామాజిక సంబంధాలలోని విలక్షణ గుణాలు యేమిటంటే, సమష్టి కార్యాచరణా, స్త్రీపురుషుల మధ్యా, భిన్న వయస్కుల మధ్యా శ్రమ విభజనా, సమానమైన పంపకమూ, ప్రవర్తనమీద కచ్చితమైన నియంత్రణా, తెగ నియమాలకు వ్యక్తి నోరెత్తకుండా లోబడడమూ మనుగడ కొరకు చేసే కఠినమైన దినదిన పోరాటానికి గాను యువజనులకు తర్ఫీదు యిచ్చే విపులమైన పద్ధతీ.

యెంత నిదానంగా అయినా, ఆదిమ సమష్టి వ్యవస్థ చట్రంలోపల కూడా ఉత్పాదక శక్తులు స్థిరంగా అభివృద్ధి చెందినాయి. యీ క్రమాన్ని పురాతత్వశాస్త్రజ్ఞులూ, చరిత్రకారులూ బాగా అధ్యయనం చేసినారు. సాధారణ పురోగమనం యెలా జరిగిందంటే, రాతి పరికరాలు పోయి లోహ (కంచు, యినప) పరికరాలు వచ్చినాయి, దూర ఘాతక సాధనాలు (మొదట యీటె, తరువాత వడిసెలా, విల్లునమ్ములూ, ఆస్ట్రేలియాలో బూమ్‌రాంగ్) అభివృద్ధి చెందినాయి, కంద మూల ఫలాలు యేరుకోవడం, కోసుకోవడం, చేపలు పట్టడం, వేట, వీటినుండి ఉత్పాదక ఆర్థిక వ్యవస్థకు — వ్యవసాయమూ, పశుపాలనా అనేవాటికి — పరివర్తన జరిగింది.

వ్యష్టి శ్రమయొక్క ఉత్పాదకత పెరిగే కొద్దీ, కుటుంబంయొక్క వ్యష్టి ఉత్పత్తి అభివృద్ధి కాసాగింది. దీనికి సమాన పంపకపు ప్రాతిపదికను బలహీనపరచే ధోరణి వుండింది.

వ్యవసాయానికీ పశుపాలనకూ మధ్యా, చేతిపనులకూ వ్యవసాయానికీ మధ్యా గల శ్రమ విభజనలో జరిగిన పురోగతి మానవుని శ్రమను మరింత ఉత్పాదకం చేసింది. దీనివలన ప్రచండమైన సామాజిక పర్యవసానాలు యేర్పడినాయి. తెగల మధ్య మారకం ప్రారంభమైంది — యిది ఆర్థిక సంబంధాలలో కొత్త రూపం. అదనపు ఉత్పాదితం అనేది యేర్పడింది, అనగా ప్రాథమిక అవసరాలు తీరిన తర్వాత యింకా మిగిలిన ఉత్పాదితం. దీని పర్యవసానంగా ఉత్పాదితాలను సంచయనమూ, పునఃపంపకమూ చేసే అవకాశం యేర్పడింది, సమాజంలోని కొందరు సభ్యులు సంపదను తమ చేతులలో సాంద్రీకరించే అవకాశం యేర్పడింది. మానవుడే యీ సంపదలో భాగం కాగలిగినాడు, అయినాడు; యెందుకంటే, మానవ శ్రమశక్తిని దోపిడీ చేయడం ఆర్థికంగా అంతకంతకూ యెక్కువ లాభదాయకం అయింది. వ్యవసాయానికి స్థిర జీవితం అవసరమైంది. ఉత్పాదితాలు గణనీయమైన పరిమాణాలలో యేర్పడడంవలన మనుషులు గణమూ, తెగా అనేవాటికంటె యెంతో పెద్ద బృందాలుగా యేర్పడగలిగినారు.

యీ పరిస్థితులన్నీ కలిసి ఆదిమ సమష్టి సమాజం బలహీనపడడానికీ, ఆదిమ సమానతా సంబంధాలు విచ్ఛిన్నం కావడానికీ దారితీసినాయి. పాత ఉత్పత్తి సంబంధాలు కొత్త ఉత్పాదక శక్తులకు వ్యతిరేకమైనాయి; సొంత ఆస్తీ, మనిషిమీద మనిషి దోపిడీ గల వర్గ సమాజానికి ఆ సంబంధాలు దారి ఇవ్వవలసి వచ్చింది.

వర్గ సమాజం ప్రతి చోటా అవతరించలేదు. యాన్‌త్సె, హ్వాంగ్‌హో, నైల్, గంగ, టైగ్రిస్, జ్యూఫ్రేటిస్ నదుల సారవంతమైన మైదానాలలో అది మొదట ఆవిర్భవించింది. యీ మైదానాలలో అత్యంత ఆదిమ పరికరాలతో సారవంతమైన భూమిని దున్నడమూ, సాపేక్షంగా మంచి పంటలు ఒడుపుకోవడమూ సులభంగా వుండింది. ఆదిమ సమష్టి సమాజాలు మొదట విచ్ఛిన్నం కాసాగింది అక్కడే, బానిసత్వం మొదట ఆవిర్భవించింది అక్కడే. బానిసత్వం మొదటి దోపిడీ రూపం, అత్యంత మొరటు, ఆదిమ, పాశవిక రూపం; అది ప్రత్యక్ష ఉత్పాదకుని అనుభోగాన్ని అత్యంత హీన స్థాయికి తగ్గించడంద్వారా బానిస యజమానికి అదనపు ఉత్పాదితాన్ని సమకూర్చింది.

ఆ కాలంలో కూడా బానిసత్వం ప్రతిచోటా సమాజ స్వభావాన్ని నిర్ణయించే ప్రధాన ఆర్థిక వ్యవస్థగా లేదు. చరిత్రలో వివిధ బానిసత్వ రూపాలు వుండినాయి: కూలిపోయే ఆదిమ సమష్టి సమాజంలో పితృస్వామిక బానిసత్వమూ, పెట్టుబడిదారీ సంబంధాలు అభివృద్ధి చెందినప్పుడు అమెరికా సంయుక్త రాష్ట్రాలలో దక్షిణాదిన నీగ్రోల ప్లాంటేషన్ బానిసత్వమూ, వగైరా. యేదో ఒక రూపంలో అది ఆసియా, ఆఫ్రికాలలోని కొన్ని దేశాలలో యిటీవలిదాకా వుండింది.

ప్రాచీన కాలంలో ఆదిమ సమష్టి సమాజ విచ్ఛిత్తి కొన్ని దేశాలలో బానిస సమూహాల

దోపిడీని సామాజిక ఉత్పత్తికి ప్రాతిపదికగా చేసింది; యిది బానిస యజమాన సమాజాన్ని ఉత్పన్నం చేసింది. యీ సమాజం దాని లాక్షణిక రూపంలో మధ్యధరా సముద్ర ప్రాంతంలో వర్ధిల్లింది (గ్రీసు, దాని వలసలు, కార్తేజి, రోమ్, రోమన్ సామ్రాజ్యం). అక్కడ బానిస శ్రమ బానిస యజమానుల సంపదకు ప్రధాన మూలంగా వుండింది. ప్రాచీన ప్రపంచంయొక్క మొత్తం సామాజిక వ్యవస్థా, సంస్కృతీ బానిస శ్రమ ప్రాతిపదికమీద అభివృద్ధి చెందినాయి. అసలు విషయం యేమిటంటే, ఉత్పత్తి సాపేక్షంగా అభివృద్ధి చెందని స్థితిలో వుండగా, ఉత్పాదక శక్తుల పెరుగుదలా, మారకం వ్యాప్తీ, సామాజిక వ్యవహారాల నిర్వహణా, శాస్త్రాలూ, కళలూ, వగైరాల అభివృద్ధీ దేనిమీద ఆధారపడినాయంటే, సరళమైన శరీర శ్రమ చేసే ప్రజా బాహుళ్యానికీ, ఉత్పాదక శ్రమ చేయకుండా యితర సామాజిక కర్తవ్యాలు నిర్వహించే కొద్దిమందికీ మధ్య జరిగిన ప్రధాన శ్రమ విభజనమీద. తదనుగుణంగా సమాజం దోపిడీ చేయబడేవాళ్లూ, దోపిడీదారులూ అనే వర్గాలుగా విభజింపబడింది. వర్గాల ఆవిర్భావంతో బానిస యజమానులమీద బానిసలు చేసే వర్గపోరాటం కూడా ఉత్పన్నమై, అభివృద్ధి చెందుతుంది.

బానిస యజమాన ఉత్పత్తి సంబంధాల ప్రాతిపదికమీద తదనుగుణమైన ఉపరినిర్మాణం ఆవిర్భవించి, బానిస యజమాన దోపిడీ సంబంధాలను నెలకొల్పుతుంది. యజమాన బానిస సంబంధాన్ని కాపాడుకోడానికీ, సమాజాన్ని పాలించడానికీ పాలకవర్గానికి కొత్త రూపాలూ, కొత్త సాధనాలూ అవసరమైనాయి. యీ ప్రయోజనాలను ఆ దశలో మొదటి సారిగా నెలకొల్పబడిన రాజ్యం తీర్చింది, దాని అధికార సాధనాలతో కలిసి. ఆ సాధనాలు యేవంటే: సైన్యమూ, పోలీసులూ, ఉద్యోగులూ, రాజ్య శక్తియొక్క అండదండలనూ, రక్షణనూ పొందిన శాసనాల వ్యవస్థగా న్యాయశాస్త్రమూ, వగైరా. బానిస యజమానులు తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోడానికీ, అమానుషమైన దోపిడీ మూలంగా అనివార్యంగా బానిసలు చేసే ప్రతి ఘటనను అణచివేయడానికీ బలం ఉపయోగించేవాళ్లు.

అదే సమయంలో, యీ పరిస్థితులలో కూడా, మానసిక శ్రమా, శరీర శ్రమా విడిపోవడంవలన సిద్ధాంత జ్ఞానాన్ని ప్రోగుచేయడమూ, వృద్ధిచేయడమూ సాధ్యమైంది. శాస్త్ర విజ్ఞాన, తత్వశాస్త్రాల ప్రారంభమూ, మత రంగంలో గణనీయమైన మార్పులూ మనకు జరిగినాయి. కనుక, వర్గాలుగా సమాజం విభజింపబడడంతో ఉపరినిర్మాణంలోనూ, మొత్తంగా సమాజపు ఆత్మిక జీవితంలోనూ తీవ్రమైన మార్పు వచ్చింది.

ఆదిమ సమాజంతో పోలిస్తే బానిస యజమాన వ్యవస్థ మానవ సమాజపు ప్రగతి శీల పురోగతిలో ఒక ముందడుగే అయినప్పటికీ, ఉత్పాదక శక్తులు అభివృద్ధి చెందడానికి అది సంకుచితమైన చట్రాన్ని మాత్రమే అనుమతించింది. బానిస యజమాన ఆర్థిక

వ్యవస్థలో, సమాజపు ప్రధాన ఉత్పాదక శక్తి అయిన మానవుని కొల్లగొట్టడం జరిగింది.

బానిస శ్రమయొక్క హీన ఉత్పాదకత మూలంగా, బానిస యజమానికి బానిస చౌకగా లభించినప్పుడు మాత్రమే బానిస శ్రమ లాభదాయకంగా వుండింది. బానిస మనిషిగా పరిగణింపబడక, పనిముట్లతో సమానంగా చూడబడి, మానవ హక్కు లన్నిటికీ దూరం చేయబడినాడు. దీనికి ప్రధాన కారణం యేమిటంటే, తన బానిసకు కుటుంబమూ, సంతానమూ, మొదలైనవి అనుమతించడం బానిస యజమానికి మహా లాభరహితమైన పని. అందువలన ఆ కాలంలో సహజ వంశవృద్ధి బానిసలను సంపాయించే మార్గంగా విస్తృతంగా ఉపయోగించబడలేదు. యుద్ధంలో బానిసలను పట్టుకోవడమూ, స్వేచ్ఛాయుతులైన మనుషులను బానిసీకరించడమూ, యితర దౌర్జన్య పద్ధతులు ఉపయోగించడమూ అంతకంటె చాలా లాభదాయకంగా వుండింది. అనేక బానిస యజమాన రాజ్యాలకు (గ్రీసూ, రోమూ లాంటివాటికి) యుద్ధం ప్రధానమైన బానిస సంపాదనా మార్గంగా వుండింది; అందువల్లనే యీ రాజ్యాలు నిత్యం యుద్ధాలు చేసి, తమ పొరుగు దేశాల ప్రజలను కొల్లగొట్టి, మొత్తం ప్రాంతాలను ధ్వంసం చేసి, ఓడినవాళ్లను బానిసలను చేసినాయి.

ఉత్పాదక శక్తుల అభివృద్ధిద్వారా బానిస శ్రమయొక్క ఆర్థిక అసమర్థత అంతకంతకూ వెల్లడి అయింది. దుర్భరమైన స్థితిలో వుండిన శ్రామికునికి పనిచేయడానికి యే ప్రేరణా లేదు, నిజానికి అతనికి పని అంటేనే అసహ్యంగా వుండింది. యిది తీవ్రమైన అంతర్వైరుధ్యాన్ని, బానిస యజమాన సమాజపు ఆంతరంగిక బలహీనతకూ, స్తబ్ధతకూ కారణమైనట్టిదాన్ని కలిగించింది. ఆ అంతర్వైరుధ్యం యేమిటంటే, యే సమాజపు మనుగడకైనా మౌలిక అవసరమైన శ్రమ మానవునికి అయోగ్యమైన వృత్తిగానూ, బానిస భరించవలసిన శాపంగానూ తయారవుతూ వుండింది. పనిచేయకుండా మానవులు బతకలేరు, కానీ బానిసలైతేనే మానవులు పనిచేయగలరు. యీ అంతర్వైరుధ్యంనుండి బయటపడే మార్గం యేమిటంటే, బానిస యజమాన ఉత్పత్తి సంబంధాలనూ, వాటితో ముడిపడివున్న వర్గాలనూ ధ్వంసం చేయడమూ, ప్రత్యక్ష ఉత్పాదకులకు పనికి కొన్ని ప్రేరణలు కల్పించే కొత్త ఉత్పత్తి సంబంధాలను నెలకొల్పడమూ.

మొత్తం ప్రాచీన కాలంయొక్క స్వభావాన్ని తెలుసుకోడానికి తరుచుగా పురాతన గ్రీసునూ, రోమ్‌నూ నమూనా బానిస యజమాన సమాజాలుగా చెప్తారు. చారిత్రక పరిభాషలో యిది పూర్తిగా నిజం కాదు; యెందుకంటే, పురాతన ఈజిప్టు, భారతదేశం, చైనాలలో అభివృద్ధి కొంత భిన్నమైన రూపాలు ధరించింది. గ్రీసులో, రోములో లాగ అక్కడ బానిసత్వం విస్తృతంగా అభివృద్ధి చెందలేదు. ఆదిమ సమష్టి సమాజ సంబంధాల స్పష్టమైన అవశేషాలతో సాపేక్షంగా ముకుళితమైన (closed) గ్రామీణ సమాజాల వ్యవస్థా, కేంద్రీకృత నిరంకుశ

రాజ్యాలూ — అవి రాజకీయ కర్తవ్యాలతోపాటు వ్యవసాయానికి ఆధారమైన నీటి పారుదల వ్యవస్థలను నిర్మించడమూ, పోషించడమూ అనే ఆర్థిక కర్తవ్యాలను కూడా నిర్వహించేవి — కఠినమైన కుల విభజనా, యివన్నీ కలిసి ఒక విలక్షణమైన రకం సమాజాన్ని సృష్టించినాయి. దీనిని మార్క్స్ ఆసియా ఉత్పత్తి విధానం అన్నాడు. యీ ఉత్పత్తి విధానం నిర్దిష్ట సామాజిక నిర్మాణమా కాదా అనేది యింకా చర్చనీయంగా వుంది. యేమైనప్పటికీ, స్పష్టంగా తెలిసే దేమిటంటే: అదొక విశిష్టమైన రకం సామాజిక వ్యవస్థ, మహా స్తబ్దమైనట్టిది, మార్పుకూ, అభివృద్ధికీ లోనుగానట్టిది; యీ కారణంవల్లనే అది ఆ కాలం దృష్ట్యా బాగా క్రియాశీలమైన మధ్యధరా సముద్ర తీరపు ప్రపంచంకంటె అంత భిన్నంగా వుంది.

క్రమక్రమంగా, వంకరటింకర మార్గాలలోనూ, విరుద్ధ రూపాలలోనూ బానిస యజమాన సమాజం పెరిగి ఫ్యూడల్ సమాజం అవుతుంది. దీని సాంకేతిక ప్రాతిపదిక మునుపటి దానికంటె మౌలికంగా భిన్నమైనది కాదు: అవే శ్రమ పరికరాలు వ్యష్టి ఉపయోగంలో వున్నాయి, అవే చేతిపనులూ, వ్యవసాయమూ, పశుపాలనా; కానీ వాటి అభివృద్ధి స్థాయి మునుపటికంటె ఉన్నతంగా వుంది. ఫ్యూడలిజం కూడా విస్తారమైన భూభాగాలలో వ్యాపించి వుంటుంది. మధ్య, తూర్పు యూరప్‌లోని జర్మానిక్, స్లావ్ తెగలు బానిస యజమాన వ్యవస్థను దాటవేసి, ఆదిమ సమష్టి సమాజ వ్యవస్థ అయిన తెగ వ్యవస్థనుండి నేరుగా పోయింది ఫ్యూడల్ వ్యవస్థకే.

ఫ్యూడల్ వ్యవస్థ బానిస యజమాన వ్యవస్థకంటె అభివృద్ధి చెందిన సామాజిక వ్యవస్థ. దాని విశిష్ట గుణం యేమిటంటే, ప్రధాన ఉత్పత్తి సాధనంగా వున్న భూమిపై ఫ్యూడల్ యజమాన్యంమీద ఆధారపడిన ఉత్పత్తి సంబంధాలూ, ఆ ప్రాతిపదికమీద రూపుదాల్చి, భూమి సొంతదారుడైన ఫ్యూడల్ ప్రభువుకు వివిధ రూపాలలో గల రైతుల వ్యక్తిగత పరాధీనతా. ఫ్యూడల్ ప్రభువుల భూములలో కొంత భాగం వ్యష్టి రైతులు ఉపయోగించుకోడానికి యివ్వబడింది. బానిసకు భిన్నంగా, ఫ్యూడల్ సమాజంలోని రైతు తన సొంత భూమి కేటా యింపును సాగుచేసుకోగలిగినాడు, తన శ్రమ శక్తిని పునరుత్పత్తి చేయడానికి అవసరమైన చిన్న భాగాన్ని తన ఉత్పాదితంలోనుండి తన సొంతానికి వుంచుకోగలిగినాడు. ఫ్యూడల్ దాస్యంలో వుండిన రైతులు కూడా అత్యధికంగా సొంత కుటుంబాలు కలిగి వుండగలిగినారు. అందువల్లనే, ఫ్యూడల్ సమాజంలో అంగబల పునరుత్పత్తి యుద్ధాలతో విధిగా ముడిపడి వుండలేదు, బానిస యజమాన సమాజంలో లాగ దానికి కొల్లగొట్టే స్వభావమూ, దుర్వ్యయ స్వభావమూ లేదు. బానిస పనిముట్టుతో సమానంగా చూడబడగా, ఫ్యూడల్ దాసుడు మనిషిగా పరిగ ణింపబడినాడు, అత్యంత హీన జాతి మనిషిగానే అయినప్పటికీ. కానీ, ఫ్యూడల్ సమాజంలో కూడా దోపిడీ, పీడనల రూపాలు మహా పాశవికంగా, అమానుషంగా వుండినాయి. ఆర్థికే తర నిర్బంధం విస్తృతంగా ఉపయోగించడం ఫ్యూడల్ దోపిడీ స్వభావం; యెందుకంటే,

రైతుకు తన కేటాయింపులోనుండి వచ్చే అదనపు ఉత్పాదితాన్ని అతనినుండి పొందే మార్గం అదొక్కటే. రైతు స్థితి దారుణంగా వుండింది. దారిద్ర్యమూ, వస్తులూ, రోగాలూ నిత్యం అతని వెంట వుండినాయి. అతనికి రాజకీయ హక్కులు లేవు, అతని జీవితమే ఫ్యూడల్ ప్రభువు దయా దాక్షిణ్యాలమీద ఆధారపడివుండింది.

కానీ, ప్రత్యక్ష ఉత్పాదకునికి శ్రమకు కొన్ని పాదార్థిక ప్రోత్సాహాలూ, మానవ శ్రమ శక్తి పునరుత్పత్తికి బానిసత్వంలోకంటె మేలైన పరిస్థితులూ కల్పించడంద్వారా ఫ్యూడలిజం ఉత్పాదక శక్తుల అభివృద్ధికి మునుపటి సామాజిక వ్యవస్థలకంటె విస్తృతమైన అవకాశాలు కలిగించింది.

ఫ్యూడల్ సమాజపు వర్గ నిర్మాణం బాగా క్లిష్టంగా వుండింది. దాని వర్గ విభేదాలు అంతస్తులుగా జరిగిన విభజనచేత మరుగుపరచబడతాయి. ప్రతి మనిషీ పుట్టినప్పటినుండి ఒక నిర్దిష్ట అంతస్తుకు చెందుతాడు: అతను భూస్వామ్య ప్రభువో, రైతో, వర్తకుడో, చేతిపనివాడో, యిలా యేదో ఒకటిగా వుంటాడు. ఒక స్థితినుండి మరొక స్థితికి మారడం మహా కష్టంగా వుండేది. ప్రభువులూ, ఉన్నత మత గురువులూ అధిక సౌకర్యాలు గల ఆధిపత్యపు అంతస్తులు.

ఉపరినిర్మాణ రంగంలో, ఫ్యూడల్ వర్గపు ఆర్థిక ప్రాబల్యం నిశ్చితమైన రాజకీయపు, భావజాలపు ముసుగులో వుండింది. పరిమిత రాజరికం గానీ, నిరంకుశ రాజరికం గానీ ఫ్యూడల్ రాజ్యానికి విలక్షణమైనది, మతంయొక్క అవిభజిత పెత్తనం ఫ్యూడల్ భావజాలానికి విలక్షణమైనది. రాజ్యమూ, చర్చీ — ఆ సమాజపు రెండు మహా శక్తివంతమైన సంస్థలు — పాలక వర్గాల ఆస్తికీ, అధిక సౌకర్యాలకూ కాపలా కాస్తాయి. తీవ్ర ఆర్థిక పీడనపట్లా, హక్కుల సంపూర్ణ రాహిత్యంపట్లా రైతులు నిత్యం నిరసన తెలుపుతారు, ఫ్యూడలిజం చరిత్ర ఫ్యూడల్ దాస్యంనుండి విముక్తి కొరకు రైతుల యెడతెగని పోరాటపు చరిత్ర. యీ పోరాటపు రూపాలు, వ్యష్టి రైతులు యేస్టేట్లనుండి పారిపోవడం మొదలు విస్తారమైన భూభాగాలలో సాయుధ తిరుగుబాటుల దాకా అనేకమై వుండినాయి. కానీ, సాధారణంగా రైతుల తిరుగుబాట్లు ఓడిపోయినాయి; యెందుకంటే, రైతులు చెల్లాచెదరుగానూ, అవ్యవస్థీకృతంగానూ వుండినారు, వాళ్లకి స్పష్టమైన రాజకీయ లక్ష్యాలు లేవు.

మధ్య యుగాలలోని సామూహిక ఉద్యమాల విలక్షణగుణం యేమిటంటే, వాటిలో అత్యధిక భాగం మత పతాకకింద జరిగినాయి. ఆ కాలంలో జనాల అనుభూతులు మతంచేత పోషింపబడినాయనీ, ఒక భావం జనాలకు అందాలంటే, అది మత రూపాలలో వ్యక్తం కావలసి వుండిందనీ ఎంగెల్సు అన్నాడు. మత యుద్ధాలూ, సంప్రదాయ వ్యతిరేక మతాలూ, మతోద్యమాలూ, మొదలైనవి ఉద్భవించింది ఆ ప్రాతిపదికమీదనే.

ఫ్యూడలిజం నిదానంగా, క్రమక్రమంగా అభివృద్ధి చెందింది. బానిస యజమాని వ్యవస్థ కంటె ఫ్యూడలిజం ఎక్కువ లాభకారి అని వెల్లడి కావడానికి చాలా శతాబ్దాలు పట్టింది. ఫ్యూడలిజం అభివృద్ధితో పట్టణాలకు మళ్లీ జీవ కళ వచ్చింది — రాజకీయ, మత కేంద్రాలు గానే కాక, చేతిపనులకూ వర్తకానికీ కేంద్రాలుగా కూడా. చేతిపనులు అభివృద్ధి చెందినాయి, మెరుగుపడినాయి, వ్యవసాయ పద్ధతులు మెరుగుపడినాయి. సామాజిక శ్రమ విభజన విస్త రించింది, కొత్త భూములు సాగులోకి వచ్చినాయి.

యీవిధంగా, నిదానంగా, అయినా స్థిరంగా జీవితపు నూతన సామాజిక రూపాలకు దారి చేసుకోడానికి కావలసిన భౌతిక పూర్వావసరాలూ, పరిస్థితులూ సిద్ధమౌతూ వుండినాయి. ఫ్యూడలిజం చరిత్రను పరిశీలిస్తే, యీ క్రమంయొక్క చోదక శక్తులు స్పష్టంగా కనపడ తాయి. అవి యేవంటే, శ్రమ విభజనా, వర్తకమూ, సరుకు — డబ్బు సంబంధాల పెరుగు దలా, కొత్త మార్కెట్ల ఆవిర్భావమూ, పెరుగుతున్న ప్రజావసరాలూ, ఆయుధాల తయారీ, వగైరా.

కానీ, ఫ్యూడలిజంయొక్క ఉచ్చదశలో సమగ్ర స్థితి నందుకొన్న చేతిపనుల ఉత్పత్తి పెరుగుతున్న డిమాండ్లను తీర్చజాలక పోయింది. యెందుకంటే, ఉత్పత్తి విస్తరణకు అది చాలా పరిమితమైన అవకాశాలను కలిగించింది.

మార్కెట్ అవసరాలు కొత్త ఉత్పాదక శక్తులను సృష్టించినాయి; అవి సహకారమూ, కార్ఖానా ఉత్పత్తీ.

సరళమైన సహకారం, అనగా పనిచేయడానికి మనుషులను కేవలం ఒకటిగా కూడగట్ట డం, అదే శ్రమ ఉత్పాదకతను గణనీయంగా పెంచింది, కానీ కార్ఖానా ఉత్పత్తియొక్క ఆవి ర్భావానికి యీ విషయంలో ప్రత్యేక ప్రాముఖ్యం వుండింది. చేతిపనులకు భిన్నంగా, ఒక సరుకును తయారుచేయడంలో కార్ఖానా ఉత్పత్తి సవివరమైన శ్రమ విభజనను యేర్పర చింది. చేతిపనుల పరికరాలు కార్ఖానా ఉత్పత్తికి సాంకేతిక ప్రాతిపదికగా వుండడం కొన సాగినప్పటికీ, ఉత్పత్తి క్రమాన్ని ప్రాథమిక చర్యలుగా విడగొట్టడంతో శ్రమ ఉత్పాదకత గణనీయంగా పెరిగింది, అంతే కాక, మనుషుల చర్యల స్థానంలో యంత్రాల చర్యలను పెట్ట డానికి కావలసిన పూర్వావసరాలు సృష్టించబడినాయి. యీవిధంగా కార్ఖానా ఉత్పత్తియొక్క అభివృద్ధి యంత్రోత్పత్తి ఆవిర్భావానికి కావలసిన పరిస్థితులను సిద్ధం చేసింది.

కానీ, మొత్తంమీద ఫ్యూడలిజంకు వ్యాపార చొరవా, నిర్నిబంధ వర్తకమూ, సరుకుల అమ్మకం కొరకు దేశీయ మార్కెట్లూ అనేవాటి అభివృద్ధిని మందగింపజేసింది. రైతుల వ్యక్తిగత దాస్యం పరిశ్రమలకు అవసరమైన నిర్నిబంధ శ్రమ మార్కెట్ సృష్టి కాకుండా అరికట్టింది. ఆస్తియొక్క ఫ్యూడల్ రూపమూ, దాని తరతమాత్మక అధిక సౌకర్యాల వ్యవస్థా,

నిరంకుశ రాజరికమూ, మొదలైనవి ఉత్పాదక శక్తుల యితోధిక అభివృద్ధికి కావలసిన అవసరాలకు విరుద్ధంగా వుండినాయి. కొత్త ఉత్పాదక శక్తులకు అవసరమై వుండింది యేమిటంటే, వాటి అభివృద్ధికి విశృంఖల స్వేచ్ఛ యిచ్చే నూతన ఆర్థిక, సామాజిక రూపాలు. యీ వైరుధ్యమే పెట్టుబడిదారీ వ్యవస్థ అనే నూతన సామాజిక నిర్మాణ రూపానికి ఫ్యూడలిజం దారి ఇవ్వవలసి వచ్చిన, ఇచ్చిన, మౌలిక కారణం.

ఆదిమ పెట్టుబడిదారీ సంచయన ప్రక్రియగా పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ పుట్టుక యొక్క లాక్షణిక వర్ణన మార్క్స్ రాసిన "పెట్టుబడి"లో వుంది. రైతులూ, చేతివనివాళ్లూ అయిన ప్రత్యక్ష ఉత్పాదకుల చేతుల్లోని ఉత్పత్తి సాధనాలను హరించడమే దాని సారం. పెట్టుబడిదార్ల ప్రారంభ సంపద వాళ్ల సొంత శ్రమమీద ఆధారపడినట్టిదనే ఆకాశ పురాణాన్ని మార్క్సిజం గుట్టుకడిగింది. యథార్థంలో, శ్రామికులను ఉత్పత్తి సాధనాలనుండి "వేరు చేయ"డానికి అన్ని రకాల పద్ధతులూ ఉపయోగించబడినాయి — సన్నకారు సరుకు ఉత్పాదకుల ఆర్థిక వినాశమూ, పరాధీనతా, రైతులను వాళ్ల భూమినుండి వెళ్లగొట్టడమూ ఆర్థిక బలవంతమూ, పచ్చి దౌర్జన్యమూ లాంటివాటితో సహా. పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రారంభాలు తుపాకుల, ఖడ్గాల జాజ్వల్యమాన శబ్దాలతో చరిత్రలో నమోదైనాయని మార్క్స్ అన్నాడు. ఆదిమ పెట్టుబడిదారీ సంచయన ఫలితంగా ఒక కొసన పెట్టుబడిదారుల చేతులలో ఉత్పత్తి సాధనాలయొక్కా, సంపదయొక్కా సాంద్రీకరణ జరిగింది, మరొక కొసన నిర్నిబంధ శ్రమ మార్కెట్ ఏర్పడింది. ఉత్పత్తి సాధనాలూ, జీవనాధారాలూ లేని మనుషులతో శ్రమ మార్కెట్ యేర్పడింది. ఉత్పత్తి సాధనాలలో పెట్టుబడిదారీ ఆస్తి, ఉత్పాదకులలో ఆస్తి కొరతా పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాల ప్రాతిపదిక.

పశ్చిమ యూరప్ దేశాలలో పెట్టుబడిదారీ వ్యవస్థకు జరిగిన పరివర్తన బయటి ఒత్తిడులు లేకుండా దానంతటు అదే జరిగింది. అక్కడ పెట్టుబడిదారీ వ్యవస్థ నిర్మాణంలోని కొండగుర్తులు యేమిటంటే, ఇటాలియన్ వర్తక నగరాల అభివృద్ధి, పోర్చుగీస్, స్పానిష్ సముద్ర యాత్రికుల గొప్ప భౌగోళిక ఆవిష్కరణలూ, అమెరికా, ఆగ్నేయ ఆసియాల వలస కరణా, బ్రిటన్‌లోని బూర్జువా విప్లవమూ, పారిశ్రామిక విప్లవమూ, 18వ శతాబ్దిలో ఫ్రాన్సులోని బూర్జువా విప్లవమూ. పందొమ్మిదవ శతాబ్దిలో ఉత్తర అమెరికా, రష్యా, జపాన్‌లు పెట్టుబడిదారీ అభివృద్ధి మార్గం చేపట్టినాయి.

ఫ్యూడల్ ఉత్పత్తి సంబంధాలు పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలకు దారి ఇచ్చే కొద్దీ, ఉపరినిర్మాణం మార్పు చెంది, కొత్త ప్రాతిపదికకు అనుగుణంగా తయారైంది; సమాజ స్వభావం మారింది.

బూర్జువా విప్లవాల జ్వాలలలో ఫ్యూడల్ సామాజిక అంతస్తులు కూలిపోయినాయి;

నిరంకుశ రాజరికం పోయి, దాని స్థానంలో రాజ్యాంగబద్ధ రాజరికం గానీ, పార్లమెంటరీ రిపబ్లిక్ గానీ వచ్చింది.

బూర్జువా ప్రజాస్వామ్యం వ్యక్తివాద సూత్రాన్ని ఉద్ఘోషించి, దానిని అచ్చమైన వ్యక్తి స్వేచ్ఛగా చిత్రించి, చట్టం యెదుట అందరూ సమానమని ప్రకటించింది. కానీ, యీ సమానత్వం నామకార్థం మాత్రమే; యెందుకంటే, ఆర్థిక అసమానత్వం, అనగా ఉత్పత్తి సాధనాల విషయంలో మనుషుల అసమానత్వం, సమాజపు ప్రాతిపదికగా కొనసాగుతుంది. బూర్జువా భావజాలం పెట్టుబడిదారీ సంబంధాల అసలైన సారం గురించి భ్రమలు వ్యాపింప జేస్తుంది.

కనుక, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు స్థాపనతో, సామాజిక జీవితపు యితర రంగాలన్నీ దానికీ, దాని అవసరాలకూ అనుగుణంగా చేయబడినాయి.

పెట్టుబడిదారీ సామాజిక నిర్మాణరూపమూ, దాని అభివృద్ధిలోని నియమాలూ, ధోరణులూ మార్క్సిజం స్థాపకులచేత గాఢ పరిశీలన చేయబడినాయి.

యంత్రోత్పత్తికి సంబంధించిన కొత్త ఉత్పాదక శక్తుల అభివృద్ధి పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధికి మూలమూ, ప్రాతిపదికా. యంత్రోత్పత్తిని రూపొందించడం — ఉత్పాదక శక్తులను గుణాత్మకంగా కొత్తదైన దశకు లేవనెత్తడం — పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క చారిత్రక కర్తవ్యం.

పెట్టుబడిదారీ ఆస్తి రూపం లాభం అనే రూపంలో సొంతపరచుకోబడే అదనపు విలువ కొరకు పెట్టుబడిదారుల వేట ఉత్పత్తికి ప్రధాన చోదక శక్తి అనే విషయాన్ని నిర్ణయిస్తుంది. కానీ, యీ పరిస్థితులలో లాభం కొరకు వేట అనివార్యంగా పెట్టుబడిదారుల మధ్య పోటీని ఉత్పన్నం చేస్తుంది. సాంకేతిక అభివృద్ధియొక్కా, పోటీయొక్కా ఫలితంగా పెట్టుబడియొక్క సాంద్రీకరణా, కేంద్రీకరణా జరిగి, గుత్త సంస్థలనే శక్తివంతమైన పెట్టుబడిదారీ కూటములు యేర్పడుతాయి.

పెట్టుబడిదారీ వ్యవస్థ బయట కూడా విస్తరిస్తుంది. ప్రముఖ పెట్టుబడిదారీ దేశాలు కొత్త భూభాగాలను స్వాధీనపరచుకొని, వలస సామ్రాజ్యాలు నెలకొల్పి, యావత్ప్రపంచాన్నీ పెట్టుబడిదారీ అభివృద్ధిలోకి లాగినాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ సాధారణంగా వలసలలో వెనుకబడిన జీవిత రూపాలనూ, ఆర్థిక వ్యవస్థలనూ నిలబెట్టి, తద్వారా వాటిని సామ్రాజ్యవాద (metropolitan) దేశాలకు ముడిసరుకుల తోటలుగానూ, ఫాక్టరీ సరుకులకు మార్కెట్లుగానూ మార్చింది. పెట్టుబడిదారీ వ్యవస్థ మొదట యేకీకృత ప్రపంచ ఆర్థిక వ్యవస్థను, ప్రపంచ మార్కెట్‌ను, సృష్టించింది. యీ దశలో చరిత్ర పరిపూర్ణ అర్థంలో ప్రపంచ చరిత్ర అవుతుంది; యెందుకంటే, వివిధ ప్రాంతాల, ప్రజానీకాల యేకాకితనం అధిగమింపబడింది.

పెట్టుబడిదారీ వ్యవస్థలో ఆర్థిక, సామాజిక అభివృద్ధి వేగం చురుకుగా పెరుగుతుంది. సాపేక్షంగా స్వల్పమైన చారిత్రక కాలంలో పెట్టుబడిదారీ నిర్మాణరూపం పలు అభివృద్ధి దశలగుండా గడుస్తుంది — ఆదిమ పెట్టుబడిదారీ సంచయనంనుండి, నిర్నిబంధ వ్యాపార ఉద్యమ వ్యవస్థగుండా, గుత్త పెట్టుబడిదారీ వ్యవస్థ దశదాకా. కానీ, పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెందేకొద్దీ, దాని సొంత నాస్తికరణ అంశాలను అంతకంతకూ యెక్కువగా ప్రోగు చేసే ధోరణి వస్తుంది దానికి. పెట్టుబడిదారీ వ్యవస్థ నిత్యమైనది కాదు, దాని విధ్వంసానికి మౌలిక కారణం యేమిటంటే, సరిగ్గా ఉత్పత్తియొక్క సామాజిక స్వభావానికీ, భుక్తం చేసుకునే సొంత పెట్టుబడిదారీ రూపానికీ మధ్య అది ఉత్పన్నం చేసే వైరుధ్యమే.

పెట్టుబడిదారీ వ్యవస్థ ఉత్పత్తిని సామాజికం చేస్తుంది; యెందుకంటే, పెట్టుబడిదారీ ఫాక్టరీ తయారు చేసే ఉత్పాదితం సమష్టి శ్రామికుని ఉత్పాదితం. దానివి తానొక్కడే చేసినట్లు అక్కడ యెవరూ చెప్పజాలరు. ఫాక్టరీల, కర్మాగారాల లోపల మాత్రమే కాక, వివిధ ఉత్పత్తి శాఖల మధ్య కూడా విస్తృతమైన శ్రమ విభజన జాతీయ ఆర్థిక వ్యవస్థను సుసంబద్ధమైన వ్యవస్థగా యేకీకరించే ఉత్పత్తి బంధాలను నెలకొల్పుతుంది, వివిధ ఉత్పత్తి రకాలను ఒకదానిమీద ఒకటి సజీవంగా ఆధారపడేటట్లు చేస్తుంది. ఉత్పాదక శక్తుల యీ స్థితికి అనుగుణంగా వుండేది యిక యెంత మాత్రమూ ఉత్పత్తి సాధనాలలో సొంత ఆస్తి కాదు, సామాజిక ఆస్తి; తత్కారణంగా, సొంత ఆస్తి ఉత్పాదక శక్తుల అభివృద్ధి రూపంగా వుండడం ఆగిపోయి, వాటిని బంధించడం ప్రారంభిస్తుంది. సొంత పెట్టుబడిదారీ ఆస్తి కొనసాగడం మొత్తం సమాజంయొక్క ఉత్పాదక శక్తుల అభివృద్ధిని మందగింపజేస్తుంది, పెట్టుబడిదారీ వ్యవస్థలోని ప్రధాన అంతర్వైరుధ్యంయొక్క వ్యక్తీకరణగా బూర్జువావర్గంమీద కార్మిక వర్గపు వర్గ పోరాటాన్ని తీవ్రపరుస్తుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క అంతర్వైరుధ్యాలు దాని అత్యున్నత అభివృద్ధి దశ అయిన సామ్రాజ్యవాదంలో మహా తీవ్ర మౌతాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ 19వ శతాబ్ది అంతంలో — 20వ శతాబ్ది ప్రారంభంలో సామ్రాజ్యవాదంలో ప్రవేశించింది. మార్క్స్ ప్రారంభించిన పెట్టుబడిదారీ వ్యవస్థ పరిశీలనను కొనసాగించిన లెనిన్ సామ్రాజ్యవాదాన్ని గాఢంగా పరిశీలించినాడు. నిర్నిబంధ పోటీ స్థానంలోకి గుత్తాధిపత్యం రావడమూ, గుత్త పూర్వ పెట్టుబడిదారీ వ్యవస్థనుండి గుత్త పెట్టుబడిదారీ వ్యవస్థకు పరివర్తన జరగడమూ, ఫైనాన్షల్ ప్రభుమండలి పెత్తనం స్థాపించబడడమూ పెట్టుబడిదారీ వ్యవస్థలో జడత్వమూ, క్షయమూ చెందే ధోరణి ఆవిర్భవించినట్లు తెలియజేస్తాయనీ, పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క క్షీణతను వ్యక్తం చేస్తాయనీ లెనిన్ రుజువుచేసినాడు. సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క అంతిమ దశ, పెట్టుబడిదారీ సామాజిక నిర్మాణరూపంయొక్క

మనుగడను అంతానికి తీసుకపోతుంది. బూర్జువా ప్రచారం ''పాశ్చాత్య నాగరికత''కు కీర్తి గానం చేస్తూ వుండగా, మార్క్సిజం లెనినిజం పెట్టుబడిదారీ ఆర్థిక సామాజిక వ్యవస్థ విచ్ఛిత్తి పొందడం ప్రారంభించిందని నిరూపించి, ఆ క్రమం తిరుగు లేనిదని చూపడానికి దాని అంతర్వైరుధ్యాలను గురించి కచ్చితంగా శాస్త్రీయమైన పరిశీలనను యిచ్చింది.

ప్రపంచ చరిత్రయొక్క తదనంతర అభివృద్ధి యీ ప్రగాఢ నిర్ధారణలను ప్రత్యక్షంగా, నిర్వివాదంగా ధ్రువీకరించింది. యీ సందర్భంలో మనం గమనించదగిన దేమిటంటే: గత కొద్ది దశాబ్దాలలో బూర్జువావర్గం చలించిన తన స్థానాలను భద్రపరచుకోడానికి పలు చర్యలు తీసుకోవలసి వచ్చింది. పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క చట్రంలోపలనే ఉత్పాదక శక్తుల సామాజిక స్వభావాన్ని మరింతగా పరిగణనలోకి తీసుకొనే ప్రయత్నంలో అది ఉత్పత్తి, అనుభోగాల క్రమాన్ని సర్దుబాటు చేయడానికి రాజ్యాన్ని అధికాధికంగా ఉపయోగించు కొంటున్నది, తద్వారా నిత్యం వెంటాడే ఆర్థిక ప్రళయాలను తప్పించుకోజూస్తున్నది. కానీ, యిది శ్రమకూ, పెట్టుబడికీ మధ్యా, కొద్దిమంది గుత్తాధిపతులకూ, విస్తారమైన శ్రామిక జనాలకూ మధ్యా, ఆర్థికంగా పురోగమించిన పెట్టుబడిదారీ దేశాలకూ, వెనుకబడినవాటికీ మధ్యా గల మౌలిక పెట్టుబడిదారీ వైరుధ్యాలను పరిష్కరించజాలదు. ఉత్పత్తిని నియంత్రించడానికి బూర్జువావర్గం తీసుకొనే చర్యలు కేవలం పెట్టుబడిదారీ సమాజంలోని ఉత్పాదక శక్తుల సామాజిక స్వభావాన్ని పెంచినాయి, ఆధునిక ఉత్పాదక శక్తులకు అనుగుణమైన ఆర్థిక సంబంధాల వ్యవస్థకు, అనగా సోషలిస్టు ఉత్పత్తి సంబంధాలకు, మారవలసిన వస్తుగత అవసరాన్ని వృద్ధిచేసినాయి. ప్రపంచ చరిత్రయొక్క యీ మౌలిక సమస్య పరిష్కరించబడాలని కార్మికవర్గం లాగే కోరే కొత్త సామాజిక శక్తులను ఉత్పత్తిచేసే ధోరణి పెట్టుబడిదారీ వ్యవస్థకు వుంది.

ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధిలోని యీ ధోరణులమీద ప్రగాఢమైన పరిశీలనను సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ 24వ మహాసభకు యిచ్చిన కేంద్ర కమిటీ నివేదికలో బ్రెజ్నెవ్ యిచ్చినాడు. ఆయన యిలా చెప్పినాడు: ''సమకాలిక పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క లక్షణాలు ప్రపంచంలోని నూతన సన్నివేశానికి అనుగుణంగా తన్ను తాను మలచుకోడానికి అది చేసే ప్రయత్నంనుండి ప్రధానంగా ఉద్భవిస్తున్నాయి. సోషలిజంతో ముఖాముఖిగా వున్న పరిస్థితులలో పెట్టుబడిదారీ దేశాల పాలక వర్గాలు వర్గ పోరాటం గొప్ప విప్లవోద్యమంగా అభివృద్ధి చెందుతుందని యెన్నడూ లేనంతగా భయపడుతున్నాయి. బూర్జువావర్గం శ్రామిక ప్రజల దోపిడీకీ, పీడనకూ మరింత ప్రచ్ఛన్న రూపాలు ఉపయోగించడానికి ప్రయత్నించడమూ, జనాలను తమ భావజాల, రాజకీయ అజమాయిషీకింద వుంచే టందుకు పాక్షిక సంస్కరణలకు ఒప్పుకోడానికి అప్పుడప్పుడు సిద్ధపడడమూ అందువల్లనే.

గుత్త సంస్థలు తమ స్థావరాలను భద్రపరచుకోడానికీ, ఉత్పత్తియొక్క సామర్థ్యాన్ని పెంచ డానికీ, వేగాన్ని వృద్ధిచేయడానికీ, శ్రామిక ప్రజలమీద దోపిడీని, పీడననూ తీవ్రపరచడానికీ శాస్త్ర, సాంకేతిక విజయాలను విస్తృతంగా ఉపయోగిస్తున్నాయి.

"కానీ, కొత్త పరిస్థితులకు అనుగుణంగా మలచుకోవడమంటే, పెట్టుబడిదారీ వ్యవస్థ ఒక వ్యవస్థగా స్థిరపడిందని భావించకూడదు. పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క సార్వత్రిక సంక్షోభం తీవ్రతరం కావడం కొనసాగుతున్నది."*

యీవిధంగా, పెట్టుబడిదారీ వ్యవస్థ మానవ చరిత్రలో ఒక దీర్ఘ దశను, శత్రుత్వ పూరిత సమాజపు దశను, అంతానికి తెస్తుంది. యీ క్రమంమీద మన సంక్షిప్త పరిశీలన తెలియజేసేదేమంటే, సమాజాభివృద్ధియొక్క సాధారణ పంథా నిర్దిష్ట ఉత్పత్తి సంబంధాల చట్రం లోపల గల ఉత్పాదక శక్తుల పురోగతిచేత నిర్ణయింపబడుతుందనీ, ఒక సామాజిక నిర్మాణరూపంనుండి మరొకదానికి జరిగే పరివర్తన అలాగే ప్రకృతి సిద్ధమూ, చారిత్రకమూ అయిన ఆవశ్యకతనుబట్టి జరుగుతుందనీ. కానీ, యీ ఆవశ్యకత మానవ కార్యాచరణద్వారా మాత్రమే వాస్తవీకరించబడుతుంది. ముఖ్యమైన సామాజిక సమస్యలన్నీ సామాజిక వర్గాల మధ్య జరిగే తీవ్ర పోరాటంచేత, శత్రుత్వపూరిత నిర్మాణరూపాలన్నిటా ప్రదీప్తమై వున్న పోరా టంచేత, పరిష్కరింపబడుతాయి. వర్గాలు వస్తాయి, పోతాయి, వైరుధ్యాల స్వభావం మారు తుంది, కానీ చారిత్రకాభివృద్ధి రకం యధాతధంగా వుంటుంది; యెందుకంటే, దానిలో సామాజిక బృందాల ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల ఘర్షణ, వర్గాల పోరాటం, వుంది. చరిత్ర బానిస యజమాని వ్యవస్థలో మానవ బానిసీకరణయొక్క అత్యంత పాశవికమైన రూపంతో ప్రారంభమై, యెలా పురోగమించిందంటే, క్రమక్రమంగా మితమైన దోపిడీ రూపాలు వచ్చినాయి, ఆర్థికేతర నిర్బంధ రూపాలు పోయి ఆర్థిక నిర్బంధ రూపాలు వచ్చి నాయి, ఉత్పత్తి సాధనాల సొంతదారులకు మాత్రమే కాక, ప్రత్యక్ష ఉత్పాదకులకు కూడా ఉత్పాదక కార్యాచరణ ఫలితాలలో భౌతిక ప్రేరణల అభివృద్ధి జరిగింది.

మానవజాతి చరిత్రలోని యీ యుగంలో జరిగిన గొప్ప విజయాలు యేవంటే, సాంకే తిక విజ్ఞానమూ, శాస్త్ర విజ్ఞానమూ, సంస్కృతీ శక్తివంతంగా అభివృద్ధి చెందడం. యివి మానవుని గతంలో యెన్నడూ లేని యెత్తులకు తీసుకపోయినాయి, సామాజిక అంతర్వైరు ధ్యాలను అధిగమించడానికీ, మానవుని మౌలికంగా నూతనమైన సమాజపు స్థాయికి తీసుక పోడానికీ కావలసిన పూర్వావసరాలను సృష్టించినాయి; ఆ నూతన సమాజం యెలాంటి దంటే, దాని రూపురేఖలు సామాజిక ఆస్తిచేతా, సమష్టి శ్రేయస్సు కొరకు కృషిచేయడానికి

---

* *24th Congress of the CPSU*, పుట 20.

సమాజ సభ్యు లందరి సమ్మైక్యతచేతా నిర్ణయింపబడుతాయి. సరిగా యిప్పుడు మానవజాతి ప్రపంచ ప్రమాణంలో పెట్టుబడిదారీ వ్యవస్థనుండి కమ్యూనిస్టు సమాజానికి పరివర్తన చెందే స్థితిలో వుంది. అంతర్వైరుధ్య పూరిత సమాజానికి చెందిన దీర్ఘ దశ అంతమౌ తున్నది, కొత్త వ్యవస్థ అభివృద్ధి ప్రారంభమౌతున్నది.

కమ్యూనిస్టు సమాజ వ్యవస్థ యేర్పడడమూ, అభివృద్ధి చెందడమూ అనే ప్రకృతిసిద్ధ చారిత్రక క్రమంలో విధిగా వరుసగా వచ్చే మూడు దశలు వున్నాయి: సోషలిస్టు విప్లవంతో ప్రారంభమయ్యే పరివర్తన దశ; కమ్యూనిస్టు వ్యవస్థయొక్క నిమ్న దశ అయిన సోషలిజం; కమ్యూనిజం.

కార్మికవర్గం రాజకీయ అధికారం స్వాధీనం చేసుకోవడంతో ప్రారంభమయ్యే సోషలిస్టు విప్లవానికి గల ప్రధాన కర్తవ్యం నూతన, సోషలిస్టు ఆర్థిక వ్యవస్థను నిర్మించడం.

సోషలిస్టు అభివృద్ధి పథంలో ప్రవేశించే యే దేశానికైనా పెట్టుబడిదారీ వ్యవస్థనుండి సోషలిజంకు పరివర్తన జరిగే దశ అవశ్యమైనది. ప్రతి దేశంలోనూ దాని అభివృద్ధికి సంబంధించిన చారిత్రక పరిస్థితులనుబట్టీ, జాతీయ విలక్షణతలనుబట్టీ, సోషలిస్టు విప్లవ సమయంలో దాని ఆర్థికాభివృద్ధి స్థాయినిబట్టీ, మొదలైనవాటినిబట్టి ఆ పరివర్తన దశయొక్క నిర్దిష్ట లక్షణాలు వుంటాయి. కానీ, పెట్టుబడిదారీ వ్యవస్థనుండి సోషలిజంకు జరిగే పరివర్తనకు సాధారణ నియమాలు కూడా వున్నాయి. అవి యేవంటే: కార్మికవర్గ విప్లవాన్ని నిర్వహించ డంలోనూ, యేదో ఒక రూపంలో కార్మికవర్గ నియంతృత్వాన్ని స్థాపించడంలోనూ శ్రామిక ప్రజలమీద కార్మికవర్గంయొక్కా, దాని మార్క్సిస్టు లెనినిస్టు పార్టీలయొక్కా నాయకత్వం; కార్మికవర్గానికి రైతాంగంలోనూ, యితర శ్రామిక విభాగాలలోనూ గల ప్రజాబాహుళ్యంతో పొత్తు; మౌలిక ఉత్పత్తి సాధనాలలో పెట్టుబడిదారీ ఆస్తిని తొలగించి, సామాజిక ఆస్తిని నెల కొల్పడం; సోషలిస్టు పద్ధతులలో వ్యవసాయాన్ని క్రమక్రమంగా రూపాంతరీకరించడం; సోషలిజంనూ, కమ్యూనిజంనూ నిర్మించే లక్ష్యంతోనూ శ్రామిక ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచే లక్ష్యంతోనూ జాతీయ ఆర్థిక వ్యవస్థను సమపాళ్లలో అభివృద్ధి చేయడం; పాత మేధావులకు నూతన మనఃపరిపాకం కలిగించడమూ, కొత్త, ప్రజా మేధావులను సృష్టించ డమూ, యావత్ ప్రజల సాంస్కృతిక ప్రమాణాలను పెంచడమూ అనేవాటితో కూడిన సాంస్కృతిక విప్లవాన్ని నిర్వహించడం; జాతీయ పీడనను తొలగించడం, వివిధ జాతుల మధ్య వాస్తవమైన సమానత్వాన్నీ, సోదర మైత్రినీ నెలకొల్పడం, బాహ్య, ఆంతరంగిక శత్రువుల బారినుండి సోషలిజంయొక్క లాభాలను రక్షించడం; కార్మికవర్గ అంతర్జాతీయతా సూత్రాల ప్రాతిపదికమీద యితర దేశాల కార్మికవర్గంతో ఆ నిర్దిష్ట దేశంయొక్క కార్మికవర్గపు సంఘీభావం.

ఉత్పత్తి సాధనాలలో సామాజిక ఆస్తీ, ఉత్పత్తిలోనూ, యితర సామాజిక కార్యకలాపాల రంగాలలోనూ మనుషులమీద దోపిడీ లేని సహోదరతత్వపు సహకార సంబంధాలూ సోషలిజంయొక్క విలక్షణ గుణాలు. సోషలిజంలో సమాజం దోపిడీ సాధనాలుగా ఉపయోగించబడజాలని అనుభోగ వస్తువులలో మాత్రమే వ్యక్తిగత ఆస్తిని నిలిపివుంచుతుంది, కాపాడుతుంది. ''పనిచేయనివానికి తిండి లేదు'' అనే సూత్రంమీద సమాజం నడుస్తుంది; సమాజానికి యిచ్చే శ్రమయొక్క పరిమాణాన్నీ, గుణాన్నీ బట్టి ప్రతిఫలం యివ్వడం పంపకం నియమంగా వుంటుంది. యీ సంబంధాలు యీనాటి ఉత్పాదక శక్తుల స్వభావానికీ, అభివృద్ధి స్థాయికీ అనుగుణంగా వున్నాయి. యివి ఉత్పత్తి సాధనాలలో సొంత ఆస్తికి యిక యెంత మాత్రమూ పొసగవు, కానీ, శ్రామిక ప్రజల అవసరాల నన్నిటినీ తీర్చే సరుకులనూ, సేవలనూ సమృద్ధిగా అందించగల స్థితిలో యింకా లేవు.

మొత్తంగా సమాజపు ప్రయోజనాలకు ఉత్పత్తియొక్క అభివృద్ధిని లోబరచడంద్వారానూ, ఉత్పత్తి సాధనాల విషయంలో ప్రతి వొక్కరినీ సమానం చేయడంద్వారానూ సామాజిక ఆస్తి జాతీయ ఆర్థిక వ్యవస్థయొక్క ప్రణాళికాబద్ధమైన సమతూకపు అభివృద్ధికీ, ఆర్థికాభివృద్ధి నియమం సద్యోజనితంగా పనిచేసే పద్ధతిని అధిగమించడానికీ పాదార్థిక ప్రాతిపదికను సృష్టిస్తుంది, ఉత్పత్తిని అభివృద్ధి చేయడంలో శ్రామిక ప్రజలకు పాదార్థిక ప్రోత్సాహకాలనూ, పనికి కొత్త నైతిక ప్రేరణలనూ కలిగిస్తుంది, ఆధునిక ఉత్పాదక శక్తుల అభివృద్ధికి శక్తివంతమైన మూలంగా వుంటుంది.

సోషలిస్టు ప్రాతిపదికమీద యేర్పడే ఉపరినిర్మాణంలోని ప్రధాన అంశాలు సోషలిస్టు రాజ్యమూ, సోషలిస్టు ప్రజాస్వామ్యమూ, మార్క్సిస్టు లెనినిస్టు సోషలిస్టు భావజాలమూ. సోషలిస్టు రాజ్యాన్ని పాలించడంలో జనాలు అధికాధికంగా పాల్గొనడమూ, సామాజిక వ్యవహారాలలో అంతకంతకూ యెక్కువయ్యే వాళ్ల చొరవా, క్రియాశీల భాగస్వామ్యమూ, స్వేచ్ఛా, సమానత్వమూ, శత్రు వైరుధ్యాలతో ఛిన్నాభిన్నం కాని సమాజంయొక్క సామాజిక, రాజకీయ, భావజాల ఐక్యతా, సమాజపు రాజకీయ నాయకులైన కమ్యూనిస్టు, కార్మిక పార్టీల చుట్టూ జనాల సమీకరణా, ప్రజాతంత్ర కేంద్రాధికారమూ — యివన్నీ సోషలిస్టు ప్రజాస్వామ్యంయొక్క విశిష్ట లక్షణాలు. శాస్త్రీయమైన మార్క్సిస్టు లెనినిస్టు భావజాలం శ్రామిక ప్రజల ముఖ్య ప్రయోజనాలను వ్యక్తం చేయడం మాత్రమే కాక, చారిత్రక క్రమ నియమాలనుబట్టే జరిగే సామాజిక అభివృద్ధిని స్పష్టంగా అవగాహన చేసుకోడానికి వాళ్లకు తోడ్పడుతుంది కూడా.

ఆర్థిక రంగంలో సోషలిస్టు సంబంధాల స్థాపన జనాల మనస్సులలోనూ, మనస్తత్వంలోనూ జరిగే ప్రగాఢమైన మార్పులతోనూ, మనుషుల మధ్య సంబంధాలను పాలించే నూతన

నియమాలు రూపు దాల్చడంతోనూ సన్నిహితంగా ముడిపడివుంది. కానీ సోషలిజం అనేది పెట్టుబడిదారీ వ్యవస్థనుండి నేరుగా పెరిగిన సమాజం గనుక, ఆర్థిక వ్యవస్థలోనూ, నిత్య జీవితంలోనూ, మనుషుల ఆలోచనా విధానంలోనూ పాతదానికి చెందిన అనేక అవశేషాలు దానివెంట వస్తాయి. మనుషులు తమ సొంత ఆస్తి మనస్తత్వంయొక్క, నీతులయొక్క, తమ జాతీయవాద దురభిప్రాయాలూ, వగైరాలయొక్క అవశేషాలను అధిగమించడానికి తోడ్పడడమూ, నేరస్తులూ, రౌడీలూ, దొంగలూ, మొదలైనవాళ్లను సమాజంనుండి తొల గించడమూ క్లిష్టమైన కర్తవ్యం. యిది ఒక్క సారే పరిష్కరింపబడే కర్తవ్యం కాదు, సోషలిజం అభివృద్ధి చెందేకొద్దీ పరిష్కరింపబడేది. కమ్యూనిస్టు సమాజపు నూతన మాన వుని తీర్చిదిద్దుకోడానికి కావలసిన సకల పరిస్థితులనూ, పూర్వావసరాలనూ సోషలిజం క్రమ క్రమంగా సృష్టిస్తుంది. ఆ మానవుని ఆత్మిక ప్రవృత్తులు అన్నిటినీ మించి సమాజం కొరకు చేసే పనిలో రూపుదాలుస్తాయి.

ప్రస్తుతం కమ్యూనిస్టు సామాజిక నిర్మాణరూపం దాని మొట్టమొదటి అభివృద్ధి దశలో వుంది; మానవజాతి చరిత్రలో యీ కొత్త దశను రష్యాలో అక్టోబర్ సోషలిస్టు మహా విప్లవం ప్రవేశపెట్టింది. తదనంతరం సోషలిజం ఒకే దేశపు చట్రాన్ని దాటి వ్యాపించి నప్పుడు ప్రపంచ సోషలిస్టు వ్యవస్థ ఉద్భవించింది. చారిత్రకాభివృద్ధిలో గుణాత్మకంగా కొత్తదైన స్థాయికి మానవజాతి ప్రవేశద్వారం యేర్పరచింది. భీషణ పోరాటంలో, కష్టాలలో, అంతర్వైరుధ్యాలలో, తన శత్రువుల ప్రతిఘటనను అధిగమిస్తూ, స్వపక్ష పరిత్యాగులనూ, స్వపక్ష ద్రోహులనూ వదలించుకుంటూ, తటపటాయించేవాళ్లను స్వపక్షానికి తిప్పుకోడానికి ప్రయత్నిస్తూ నూతన ప్రపంచం పుట్టుతున్నది. అది పురోగమించేకొద్దీ తప్పులు చేస్తుంది, తప్పులు దిద్దుకుంటుంది, తన అభివృద్ధి అనుభవాన్ని క్రోడీకరించి, గతం నేర్పే పాఠాలు నేర్చుకుంటుంది. యీ పురోగమనం సులభమైన విజయ పురోగమనం కాదు; యిది విజ యాలూ, అపజయాలూ, సాఫల్యాలూ, వైఫల్యాలూ గల క్లిష్టమైన, కష్టమైన మార్గంలో జరిగే పురోగమనం. కమ్యూనిజంను నిర్మించడం ఒక మహత్కార్యం; యెందుకంటే, అది శాస్త్రీయ, హేతుబద్ధ సూత్రాలమీద నూతన సమాజాన్ని నిర్మించే కర్తవ్యాన్ని, మానవునికి జీవ యోగ్యమైన పరిస్థితులను సృష్టించే కర్తవ్యాన్ని ఆచరణలో నిర్వహిస్తున్నది.

కమ్యూనిస్టు సామాజిక నిర్మాణరూపంయొక్క మొదటి దశ అయిన సోషలిస్టు సమాజం సోషలిజంయొక్క అంతర్గత నియమాలనుబట్టి క్రమక్రమంగా పెరిగి, తన ఉన్నత దశ అయిన పరిపూర్ణ కమ్యూనిజం అవుతుంది. యీ పరివర్తన సమాజ జీవితంలో గణనీయమైన మార్పులు కలిగిస్తుంది; యెందుకంటే, సోషలిజమూ, కమ్యూనిజమూ సమాజంయొక్క ఆర్థిక, ఆత్మిక పరిణతిలో గుణాత్మకంగా భిన్నమైన దశలు. సోషలిజం అనేది పెట్టుబడి

దారీ వ్యవస్థలోనుండి పుట్టి, పాత సమాజపు "పుట్టు గుర్తులు" కలిగివుండగా, పరిపూర్ణ కమ్యూనిజం అనేది కమ్యూనిస్టు నిర్మాణరూపంయొక్క ఉన్నత దశ, తన సొంత ప్రాతి పదికమీద అభివృద్ధి చెందేది.

సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమం యిలా చెపుతుంది: "కమ్యూనిజం అనేది ఉత్పత్తి సాధనాలమీద యావత్ప్రజా యాజమాన్యమూ, సమాజ సభ్యు లందరికీ సంపూర్ణ సామాజిక సమానత్వమూ గల వర్గరహిత సామాజిక వ్యవస్థ. దానిలో ప్రజల సర్వతోముఖ అభివృద్ధితో పాటు, శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాలలో జరిగే నిరంతర ప్రగతి మూలంగా ఉత్పత్తి సాధనాల పెరుగుదల వుంటుంది; సమష్టి ఐశ్వర్యపు జలలన్నీ మరింత సమృద్ధిగా ప్రవహిస్తాయి, 'ప్రతివానినుండీ వాని సామర్థ్యాన్నిబట్టి, ప్రతివానికీ వాని అవసరాలను బట్టి' అనే మహత్తర సూత్రం అమలు జరపబడుతుంది. కమ్యూనిజం అనేది స్వేచ్ఛాయుత, సామాజిక చైతన్యపూరిత శ్రామిక ప్రజల మహా వ్యవస్థీకృత సమాజం. దానిలో ప్రజా స్వపరిపాలన స్థాపించబడుతుంది, దానిలో సమాజ శ్రేయస్సు కొరకు శ్రమ అనేది ప్రతి వానికీ ప్రధాన ముఖ్య అవసరమూ, అందరూ గుర్తించే ఆవశ్యకమూ అవుతుంది, దానిలో ప్రతి వ్యక్తి సామర్థ్యమూ అత్యున్నత ప్రజోపయోగానికి వినియోగింపబడుతుంది."*

పరిశ్రమలలోనూ, వ్యవసాయంలోనూ ఉత్పాదక శక్తుల శక్తివంతమైన అభివృద్ధి సోష లిజంనుండి కమ్యూనిజంకు జరిగే పరివర్తనకు ప్రాతిపదికను సమకూరుస్తుంది, మాన వుని ముఖ్య అవసరాలనూ, సమాజ అవసరాలనూ తీర్చడానికి కావలసిన పాదార్థిక సంపద సమృద్ధిని నిస్సందేహం చేస్తుంది. యీ సందర్భంలో, సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమం కమ్యూనిజంయొక్క పాదార్థిక, సాంకేతిక ప్రాతిపదికను సృష్టించడం సోవియట్ యూనియన్‌యొక్క ప్రధాన ఆర్థిక కర్తవ్యంగా పెట్టింది. ఆ ప్రాతిపదిక మూడు ముఖ్య కర్తవ్యాల పరిపూర్తిని సమీపించడానికి తోడ్పడుతుంది: ఒకటి, అవసరాన్ని బట్టి పంపకం అనే కమ్యూనిస్టు సూత్రాన్ని అమలుపరచడానికి అవసరమైన అనుభోగ వస్తువుల సమృద్ధిని సృష్టించడం; రెండు, సామాజిక వ్యవహారాలలో పాల్గొనడానికి పౌరు లందరికీ తగినంత వ్యవధి కలిగించేటట్లుగా పని గంటలను తగ్గించడం; మూడు, ప్రతి ఆరోగ్య వంతునికీ శ్రమ సంతృప్తి దాతగా, ప్రాథమిక అవసరంగా వుండేటట్లు దానిని తేలికపరచడమూ, దాని స్వభావాన్ని మార్చడమూ.

సోషలిస్టు ఉత్పత్తియొక్క అభివృద్ధి సమాజంయొక్క ఆర్థిక, సామాజిక సంబం ధాలను మెరుగుపరచడానికీ, ప్రజల పాదార్థిక, సాంస్కృతిక ప్రమాణాలను నిరంతరంగా

---

* *The Road to Communism*, పుట 509.

పెంచడానికీ ప్రాతిపదికను సృష్టిస్తుంది. జనాల సాంస్కృతిక స్థాయి పెరగడమూ, సంపూర్ణ మానవుని రూపొందించడమూ, యివి ఉత్పత్తి అభివృద్ధియొక్క ఫలితమూ, అదే సమయంలో ఉత్పత్తి అభివృద్ధికి అవసరమూ.

కమ్యూనిజంకు పరివర్తన అంటే, పట్టణానికీ, గ్రామానికీ మధ్య సామాజికార్థిక భేదాలూ, సాంస్కృతిక భేదాలూ, నిత్య జీవిత భేదాలూ తొలగిపోవడమూ, మానసిక శ్రమకూ, శారీరిక శ్రమకూ మధ్య ముఖ్యమైన భేదాలు తొలగిపోవడమూ, సమాజంలోని వర్గాల మధ్యా, సామాజిక బృందాల మధ్యా భేదాలు నమసిపోవడమూ. యీ ముఖ్య సామాజిక కర్తవ్యాలు నెరవేర్చబడేటప్పుడు, మనుషుల మధ్య వాస్తవమైన సమానత్వం గల వర్గరహిత కమ్యూనిస్టు సమాజం నెలకొల్పబడి వుంటుంది. యిది కమ్యూనిజంయొక్క విజయాలలో కెల్ల గొప్పదిగా వుంటుంది.

కమ్యూనిజంకు జరిగే పరివర్తన రాజ్యం కృశించి పోయేటట్లు చేస్తుంది, సమాజంయొక్క ఆత్మిక సంపద మరింత పెరిగేటట్లు చేస్తుంది, శాస్త్ర విజ్ఞానమూ, సంస్కృతీ వికసించే టట్లు చేస్తుంది, జనాల సాంస్కృతిక, సాంకేతిక ప్రమాణాలు శక్తివంతంగా పెరిగేటట్లూ, వాళ్ల చొరవ అభివృద్ధి చెందేటట్లూ చేస్తుంది, మనుషుల మధ్య సంబంధాలలో సమష్టి తత్వపు, మానవతావాదపు సూత్రాలూ, కమ్యూనిస్టు నైతిక నియమాలూ నెలకొనేటట్లు చేస్తుంది.

సామాజిక అసమానత్వమూ, పాత సామాజిక శ్రమ విభజనలోని అవశేషమూ తొలగి పోవడమూ, ఉన్నత స్థాయి పాదార్థిక సంక్షేమమూ, సంస్కృతీ సాధింపబడడమూ, తక్కువ పని దినమూ, మొదలైనవన్నీ వ్యక్తి వికసించడానికీ, తన శక్తి సామర్థ్యాలను బయటపెట్ట డానికీ తోడ్పడక తప్పదు.

కమ్యూనిజం వైపు సోషలిస్టు సమాజపు పురోగమనం దానిని నిర్మించే స్త్రీ పురు షులమీదా, వాళ్ల సంసక్తిమీదా, ఐక్యతమీదా, వాళ్ల విజ్ఞతమీదా, ప్రజలమీదా, వాళ్ల కార్యశీలతమీదా, చొరవమీదా, వాళ్ల సాహసంమీదా, భక్తిమీదా, వాళ్ల క్రమశిక్షణమీదా, బాధ్యతా పరిజ్ఞానంమీదా, వాళ్ల జ్ఞానంమీదా, అనుభవంమీదా, వాళ్ల నైతిక పరిణతిమీదా, సంస్కారంమీదా కీలకంగా ఆధారపడుతుంది.

నూతన సమాజ నిర్మాణమనే యీ బహుముఖ ప్రక్రియలో కమ్యూనిస్టు పార్టీ అగ్రే సర, మార్గదర్శక శక్తి.

* * *

కమ్యూనిస్టు ఆదర్శాన్ని సాధించే అవకాశం గురించి బూర్జువా సిద్ధాంతవేత్తలు సందే హం వ్యాప్తిచేయ జూస్తారు. వాళ్లు దానిని ఊహాస్వర్గం, పగటి కల, వగైరా అంటారు. అది నిజమా? హేతుబద్ధమైన, న్యాయమైన సమాజం అనే భావం పాతది, శతాబ్దాల తరబడి

దాని స్థాపనకు కావలసిన పదార్థిక, ఆత్మిక పూర్వావసరాలు సామాజిక అభివృద్ధి గతిలో పరిణతి చెందనంత కాలం అది కేవలం ఒక అందమైన కలగా, ఊహాస్వర్గంగా వుండిపోయింది. కమ్యూనిజం రూపంలో అలాంటి సమాజాన్ని నిర్మించడం సాధ్యమని మార్క్సిజం నిరూపించి, దాని ప్రధాన లక్షణాలను వర్ణించి, దానిని చేరే మార్గాలను సూచించి, తద్వారా ఊహాస్వర్గ భావం స్థానంలో సోషలిజమూ, కమ్యూనిజమూ అనే శాస్త్రీయ భావాన్ని పెట్టింది. యీనాడు కమ్యూనిజం ఊహాస్వర్గమని పట్టుబట్టడమంటే, మేలైన భవిష్యత్తును నిర్మించడానికి గల అవకాశాలనూ, మానవజాతి సాధించిన అభివృద్ధి స్థాయి దానిని చేరడానికి యేర్పరచే మార్గాలనూ చూడడానికి నిరాకరించడ మన్నమాట. యీనాటి శక్తివంతమైన ఉత్పాదక శక్తులను సృష్టించి, శాస్త్ర విజ్ఞానంలోనూ, సంస్కృతిలోనూ యింత యెత్తులకు చేరిన మానవజాతికి హేతుబద్ధమైన సామాజిక వ్యవస్థను స్థాపించడమూ, పస్తులూ, దారిద్ర్యమూ, యుద్ధాలూ, సామాజిక అంతర్వైరుధ్యాలూ తొలగించుకోవడమూ, సమానత్వమూ, సంక్షేమమూ, ఆత్మికాభివృద్ధి చెందడానికి అందరికీ అవకాశమూ, మొదలైనవి నిస్సందేహం చేయడమూ చేత కాదా అనే ప్రశ్న సహజమైనది. దీనిలో ఊహాస్వర్గ మేమున్నది? యీ అచ్చమైన మానవతావాద ఆదర్శానికి ఆక్షేపణ లేమి వుండగలవు? జాతులలో ఉన్నతమైనవీ, నీచమైనవీ వుండడమా? కానీ, యీ జాతితత్వమనే జంతుశాస్త్రపు సిద్ధాంతం పూర్తిగా అప్రతిష్ఠ పాలైంది. అసమానత్వమనే వరప్రసాదం లేకుంటే మానవజాతి దిగనాసిల్లిపోక తప్పదా? కానీ, మార్క్సిజం వ్యక్తిగత సమానత్వం సాధ్యమనీ, అవసరమనీ యెప్పుడూ అనలేదు; అది సామాజిక అసమానత్వాన్ని మాత్రం యెల్లప్పుడూ వ్యతిరేకించి, అందరూ అభివృద్ధి చెందడానికి సమాన అవకాశాలు వుండాలని మాత్రమే చెప్పింది.

మానవుని నిర్మాణంలోనే అది పాపపు అంశ వుందా? కానీ, యెంతైనా, మానవుడు జన్మతః మంచివాడూ కాదు, చెడ్డవాడూ కాదు, సమాజంలో యేదో ఒకటిగా తయారు చేయబడుతాడు. నిజమే మానవుడు దేవుడు కాదు, యెప్పుడూ కాబోడు. తన భౌతిక అవసరాలు తీరాలని అతను యెప్పుడూ కోరుతాడు. మరి, వీటిని పాప హేతువని యెందుకనుకోవాలి? యెంతైనా, మానవుని సంపూర్ణ సంతోషానికి పునాదిని వేసేది వైరాగ్యం కాదు, భౌతిక అవసరాలు తీరడమే — సంతోషమంటే భౌతిక సంతృప్తి మాత్రమే కాని మాట నిజమే అయినప్పటికీ.

లోప భూయిష్ఠమైనది మానవ స్వభావం కాదు, సమాజం; యెందుకంటే, సమాజం మానవుని నీచ అంతఃప్రవృత్తులనూ, ఆవేశాలనూ ప్రకోపింపజేస్తుంది, తదనుగుణంగా అతన్ని రూపుదిద్దుతుంది. చరిత్రయొక్క పరస్పరాత్మకతను అంత క్లిష్టం చేసేది యేమిటంటే, నూతన సమాజం నిర్మింపబడవలసింది నారుమడి లాంటి పరిస్థితులలో పెరిగిన మనుషుల

చేత కాదు, పాత సమాజంలో పెరిగిన మనుషులచేత. పరిష్కారం మానవుని స్వభావంలో లేదనీ, అతని కార్యాచరణలో వుందనీ మార్క్సిజం రుజువుచేసింది; యెందుకంటే, మానవుడు తనచుట్టూ వున్న వస్తువులను మార్చేకొద్దీ తనను తాను మార్చుకుంటాడు. అందువల్లనే, మానవుని స్వభావం అనబడేది నూతన సమాజ నిర్మాణానికి అధిగమించరాని ఆటంక మేమీ కాదు.

యితర అభ్యంతరాలు యేమున్నాయి? ప్రపంచ అణుయుద్ధంలో నాగరికత నాశన మయ్యే ప్రమాదమా? ఆ ప్రమాదం వున్నమాట నిజమే, కానీ ప్రమాద మూలం సోష లిజం కాదు, సామ్రాజ్యవాదం; యెందుకంటే, అది సామాజిక వ్యవస్థగా కాలం తీరినట్టిదై, కొత్త యుద్ధాలను కలిగిస్తున్నది. అందువల్లనే, సామ్రాజ్యవాదానికీ, వలసవాదానికీ, నయా వలసవాదానికీ వ్యతిరేకంగానూ, శాంతి కొరకూ, సోషలిజం కొరకూ చేసే పోరాటం సర్వ విధ్వంసక అణుయుద్ధాన్ని నివారించడానికి చేసే పోరాటంతో సమవసిస్తున్నది. యీ విష యం 1969లో మాస్కోలో జరిగిన కమ్యూనిస్టు, కార్మిక పార్టీల అంతర్జాతీయ సమావే శం ప్రకటించింది, సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ 24వ, 25వ మహాసభలు మహా స్పష్టంగా ఉద్ఘాటించినాయి.

దోపిడీ, పీడనల వ్యవస్థా, యీ వ్యవస్థను నిలుపుకోవడంలో ప్రయోజనం గల వర్గాలూ, సామాజిక విభాగాలూ, బృందాలూ, అనగా సామ్రాజ్యవాద వ్యవస్థకు చెందిన పాలకవర్గాలూ, సకల ప్రగతి వ్యతిరేక, గుత్తాధిపత్య శక్తులూ, కమ్యూనిజం వైపు మానవజాతి పురోగతికి ప్రధాన ఆటంకం. అందువల్లనే, నూతన సమాజం వర్గాల పోరాటంనుండి మాత్రమే ఉద్భవించగలదు. ఆకాశానికి మానవజాతి దారి నిజంగా కష్ట భూయిష్ఠమైనది. యీ పోరాటంలో, కమ్యూనిస్టు భావాలు ఉజ్వలమైన, ఉదాత్తమైన ఆదర్శం, భవిష్యత్తుకు దారిచూపి, దాని దృశ్యాలను చూపించే ధ్రువ నక్షత్రం. యీ ఆదర్శాన్ని యేదీ మాసి పోయేటట్లు చేయలేదు. "జర్మనీ" అనే కావ్యంలో జర్మన్ కవి హైనె ఇలా రాసినాడు:

"Wir wollen hier auf Erden Schön
Das Himmelreich errichten."*

మరి యిది కవిత్వం. కమ్యూనిజం అనేది దేవతా సద్గుణాలు తొణకిసలాడే అశరీర స్త్రీ పురుషుల క్రైస్తవ స్వర్గం కాదు. అది మానవజాతియొక్క సామాజిక వ్యవస్థ, మానవు నికే సేవచేసేది.

మానవజాతి తన అభివృద్ధిలో దీర్ఘ, క్లిష్ట మార్గం గడచిందని గమనించినాము.

---

* "యిక్కడ, అందమైన భూతలంపై స్వర్గ రాజ్యం నిర్మించాలని మా కోరిక." — సం.

చారిత్రక క్రమంలోని మొదటి దశ ఫలితంగా — అనగా ఆదిమ సమష్టి సమాజ వ్యవస్థ ఫలితంగా — మానవుడు జంతు ప్రపంచంనుండి వెలికి వచ్చి, తన సామాజిక అభివృద్ధికి కావలసిన పూర్వావసరాలు సృష్టించుకోవడం మనకు కనపడుతుంది. ఆదిమ సమాజంలో మానవుడు తన ప్రకృతి సహజమైన స్థితినుండి బైటపడి, మొదట స్వయంగా తన కాళ్లమీద తాను నిలబడినాడు.

శత్రుత్వపూరిత సామాజిక వ్యవస్థల అభివృద్ధి ఫలితంగా మానవుడు ప్రకృతి శక్తులతో ఊడిగం చేయించుకొనే స్థాయికి శాస్త్రవిజ్ఞానమూ, పాదార్థిక ఉత్పత్తి రావడం.

చరిత్రలో మూడవ దశ అయిన కమ్యూనిస్టు నిర్మాణరూపంయొక్క కర్తవ్యం యేమిటంటే, మానవుడు తన సొంత సామాజిక సంబంధాలను కరతలామలకం చేసుకొని, పాదార్థిక, ఆత్మిక ఉత్పత్తియొక్క మరింత ఉన్నత అభివృద్ధి అనే ప్రాతిపదికమీద, కామ్రేడ్‌తత్వపు సహకారం గల సమష్టితత్వపు సంబంధాల అభివృద్ధి అనే ప్రాతిపదికమీద, సంపూర్ణ మానవుని అభివృద్ధి చేయడం.

కమ్యూనిస్టు నిర్మాణరూపం ఆవిర్భవించడంతో మానవజాతియొక్క నిజమైన చరిత్ర ప్రారంభమౌతుంది; యెందుకంటే, మానవజాతి ప్రకృతికీ, తన సొంత సామాజిక సంబంధాలకూ బానిసగా వుండడం ఆగిపోతుంది గనుక.

చరిత్రను గురించిన శాస్త్రీయ దృక్పథం తెలియజేసేదేమంటే: చరిత్ర అనేది పురోగమనశీలం, నిమ్న రూపాలనుండి ఉన్నత రూపాలకు జరిగే నిత్య పరివర్తన; ప్రస్తుతం మానవజాతి యే దశకు చేరుకుందంటే, ఆ దశ కమ్యూనిస్టు నిర్మాణరూపానికి చెందిన పరిస్థితులలో సర్వతోముఖ అభివృద్ధికీ, సౌభాగ్యానికీ గొప్ప అవకాశాలను కలిగిస్తుంది. ప్రపంచ చరిత్రయొక్క వస్తుగత తర్కం అలాంటిది.

ప్రపంచ చరిత్రలోని సాధారణ అభివృద్ధి రేఖ యే మేరకు పాదార్థిక ఉత్పత్తి అభివృద్ధి నియమాలచేత నిర్ణయింపబడుతుందో ఆ మేరకు దానిని పరిశీలించినాం. కానీ, చారిత్రక క్రమంలోని ప్రతి బిందువు వద్దా సామాజిక అభివృద్ధిని వివరించినామని దీని అర్థం కాదు. చరిత్ర అంతకంటె యెంతో వైవిధ్య పూరితమైనది; యెందుకంటే, దానిలోపల చారిత్రక క్రమాన్ని భిన్నభిన్నంగా చేసే అనేక అంశాలు పనిచేస్తాయి; అందువల్లనే దానిని సరళ రేఖ లాంటిదిగా చూడకూడదు. చారిత్రక అభివృద్ధి అనేక అంశాల చర్యయొక్క ఫలితం; చరిత్రను అర్థం చేసుకోవాలంటే, చారిత్రక క్రమంలో ఒకదానిమీద ఒకటి పనిచేసే అన్ని ముఖ్యమైన అంశాలనూ, శక్తులనూ పరిగణించాలి. చారిత్రక భౌతికవాదం చరిత్ర అధ్యయనానికి ఒక పద్ధతిని సమకూరుస్తుంది; అందువలన అది ప్రపంచ చరిత్రయొక్క సుసంబద్ధతమూ దాని సాధారణ అభివృద్ధి దిశనూ చూపడం మాత్రమే కాక, దాని వైవి

ధ్యాన్ని తెలుసుకొనే మార్గాన్ని కూడా సూచిస్తుంది. చారిత్రక భౌతికవాదాన్ని వెకిలిపరచకూడదనీ, దాని సూత్రాలను పిడిసూత్రాలుగా మార్చి చరిత్రమీద రుద్ది, వాస్తవాల అధ్యయనం స్థానంలో వాటిని పెట్టకూడదనీ మార్క్సిజం స్థాపకులు పదేపదే హెచ్చరించినారు. యీ విషయంమీద ఎంగెల్సు చెప్పినదానిని జ్ఞాపకం చేసుకుందాం: "చరిత్రను గురించిన భౌతికవాద అవగాహన ప్రకారం చారిత్రక క్రమంలో అంతిమంగా నిర్ణయించే అంశం వాస్తవ జీవితపు ఉత్పత్తి, పునరుత్పత్తి. యింతకు మించి మార్క్సు గానీ, నేను గానీ యెప్పుడూ ఉద్ఘాటించలేదు. కనుక, ఆర్థిక అంశం ఒక్కటే నిర్ణాయకమైనదని చెప్పినట్లు దీనిని యెవడైనా వక్రీకరిస్తే, ఆ సూత్రాన్ని అతను అర్థరహితమైన, అభౌతికమైన, మతిహీనమైన మడికారంగా మారుస్తున్నాడు."* ఉపరినిర్మాణంలోని వివిధ అంశాలు, భావజాలమూ, మొదలైనవి, అభివృద్ధి గతిని ప్రభావితం చేస్తాయనీ, దాని రూపాన్ని ప్రధానంగా నిర్ణయిస్తాయనీ కూడా ఎంగెల్సు చెప్పినాడు. యీ చారిత్రక చర్యా ప్రతిచర్యలనూ, ఆర్థిక ఆవశ్యకత అనేది వేటిగుండా దారిచేసుకోవలసివుందో ఆ విస్తారమైన యాదృచ్ఛిక అంశాలనూ పరిగణించవలసిన అవసరం లేకపోతే, "యే చారిత్రక దశకైనా యీ సిద్ధాంతాన్ని వర్తింపజేయడం వోటిలెక్కకంటె సులభంగా వుండేది."**

వర్గ శక్తుల వాస్తవ తారతమ్యాన్నీ, ఆత్మగత అంశంయొక్క ప్రభావాన్నీ, రాజకీయాలనూ, భావజాలాన్నీ మొట్టమొదట అధ్యయనం చేయకుండా ఆయా దేశాల చరిత్రయొక్క గతినీ, విశిష్టతలనూ అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. యిందువలన, చరిత్ర గమనంలోని మహా సంక్లిష్టతను చూడడానికి ప్రయత్నించాలి; వాస్తవాలను సాధారణ సూత్రావళికి సరిపడేటట్లు వక్రీకరించకుండా, సామాజిక యాథార్థ్యాన్ని పరిశీలించడానికి ఉపయోగించడం చారిత్రక భౌతికవాద పద్ధతికి అవసరమని గుర్తించడానికి ప్రయత్నించాలి.

అయితే, ప్రపంచ చరిత్రయొక్క సాధారణ గతిని అంత వైవిధ్యపూరితం చేసేది యేమిటి? స్థలాభావంవల్ల యీ సమస్యను అత్యంత సాధారణ పద్ధతిలో మాత్రమే చర్చించవలసివుంది. భౌగోళిక పరిసరావళి ప్రభావాన్ని మరొక సారి చూద్దాం. చరిత్ర కారణాలను వివరించడంలో, భౌగోళిక పరిసరావళిని విస్మరించడం సమంజసం కాదు; అది యే విధంగా నిజమైన ప్రభావం నెరపేదీ ఆవిష్కరించడానికి ప్రయత్నించాలి. ప్రపంచ చరిత్రను అంత అసమ గతిలో నడిచేటట్లు చేసి, కొన్ని జాతులను ముందుకు తీసుకపోయి, మరికొన్నిటిని కుంటుపరచిన అంశా

* K. Marx and F. Engels, *Selected Correspondence* ("యేరిన ఉత్తరప్రత్యుత్తరాలు"), పుట 417.

** పై గ్రంథమే.

లలో భౌగోళిక పరిసరావళి నిస్సందేహంగా ఒకటి. కానీ యీ ప్రభావాన్ని పరమమైనదిగా యెంచకూడదు; యెందుకంటే, యిది సామాజిక పరిస్థితులచేత మార్చబడుతుంది. ప్రతి జాతి, దాని భౌగోళిక స్థలం యేదైనప్పటికీ, నిర్దిష్ట చారిత్రక పరిసరావళిలో జీవిస్తుంది, దానిచేత ప్రభావిత మౌతుంది. చారిత్రక పరిసరావళి యుద్ధాలూ, విజయాలూ మొదలుకొని భిన్న రూపాల సంపర్కాలదాకా అత్యంత వివిధమైన ప్రభావాలకు కారణం కావచ్చు. ఆర్థిక వ్యవస్థ మొదలుకొని భావజాలందాకా సామాజిక జీవితపు ప్రతి రంగంలోనూ దాని ప్రభావం వుండవచ్చు. చారిత్రక అభివృద్ధిలో ఒకే స్థాయిలో గానీ, భిన్న స్థాయిలలో గానీ వున్న అత్యంత వివిధమైన ప్రజానీకాల చర్యా ప్రతిచర్యలను కూడా పర్యాలోచించండి. యీ మన యుగంలో, గణ వ్యవస్థ మొదలు సోషలిజందాకా భిన్న సామాజిక అభివృద్ధి స్థాయిలలో సహ జీవనం చేస్తూ, పరస్పరం ప్రభావితం చేసుకుంటూ వున్న ప్రజానీకాలు మనకు కనిపిస్తాయి. మన కాలపు సామాజిక సమస్యల మహా వైవిధ్యాన్ని సృష్టించే అంశాలలో యిది మరొకటి.

భిన్న ప్రజానీకాల చరిత్రయొక్క నిర్దిష్ట లక్షణాలు వాటి సంస్కృతిలోని నిర్దిష్ట లక్షణాలలో ప్రతిబింబింపబడుతాయి, సమోదౌతాయి. సంస్కృతులు ముకుళితంగా (closed), పూర్తి స్వతంత్రంగా వుంటాయన్న స్పెంగ్లర్ భావం ప్రపంచ చరిత్రలోని సుసంబద్ధతను నిరాకరిస్తుంది; చారిత్రక భౌతికవాదం దృష్ట్యా చూస్తే ఆ భావం నిలవదు. కానీ, జాతీయ సంస్కృతులలోనే కాక, మొత్తం ప్రాంతాలలోని సంస్కృతులలో కూడా కల విశిష్టతను నిరాకరించడం తప్పు. కనుక, యూరప్, ఆసియాల ప్రజానీకాల సంస్కృతులకు అనేక సామాన్య లక్షణాలు వున్నప్పటికీ, వాటికి గాఢమైన విశిష్ట లక్షణాలు కూడా వున్నాయి. యీ దేశాల, ఖండాల ప్రజానీకాల చరిత్రను అధ్యయనం చేసేటప్పుడు వీటిని పరిగణన లోకి తీసుకోవాలి.

ఆయా దేశాల, లేదా దేశ బృందాల చరిత్రలోని విశిష్ట లక్షణాలను అర్థం చేసుకో డానికి భావజాల ప్రభావాలు కూడా చాలా ముఖ్యమైనవి. ఉదాహరణకు, యూరప్, అమెరికాల గత చరిత్రలో క్రైస్తవమత వ్యాప్తి ఒక ముఖ్యమైన చారిత్రక అంశం. తదనంతరం, విప్లవ కార్మికవర్గ ఉద్యమ అభివృద్ధి మార్క్సిస్టు భావజాలం విస్తృతంగా వ్యాపించడానికి బాట వేసింది; యీ భావజాలం మొత్తం ఆధునిక చరిత్ర గతిమీద గొప్ప ప్రభావం నెరపుతున్నది.

అవి ప్రపంచ చరిత్ర గతికి వైవిధ్యాలు కలిగించే పరిస్థితులలో కొన్ని. చారిత్రక క్రమంలో ఐక్యతనూ, భిన్నత్వాన్నీ, రెంటినీ గుర్తించాలి, అభివృద్ధిలోని ప్రముఖ ధోరణులనూ, భిన్న ప్రజానీకాలు అనుసరించే మార్గాల భిన్నత్వాన్నీ, రెంటినీ గుర్తించాలి, అభివృద్ధికి చెందిన సాధారణ నియమాలనూ, ఆయా దేశాల విశిష్ట లక్షణాలనూ, రెంటినీ గుర్తించాలి. యీ

అంశా లన్నిటినీ వాటి పరస్పరవాదాత్మక సంబంధంలో గ్రహించాలి, దేని ప్రాముఖ్యాన్నీ యెక్కువ పరచకుండా, తక్కువ పరచకుండా.

ప్రపంచ ప్రమాణంలో పెట్టుబడిదారీ వ్యవస్థనుండి కమ్యూనిజంకు జరిగే పరివర్తన ఆధునిక యుగంయొక్క ప్రముఖ ధోరణీ, ప్రధాన సారమూ. యీ అభివృద్ధి పంథాయొక్క ప్రధాన ఫలితం యేమిటంటే, భూమండలంమీద సోషలిజం దృఢంగా నెలకొల్పబడింది. భూమిమీద యే శక్తీ యీ చారిత్రక వెల్లువను వెనక్కి తిప్పేటంత బలంగా లేదు. సోషలిజంయొక్క భవిష్యత్తు కమ్యూనిజం, మానవజాతియొక్క యితోధిక అభివృద్ధికి ప్రాతిపదిక. అసలు విషయం యేమిటంటే, ఉత్పత్తి సాధనాలలో కమ్యూనిస్టు ఆస్తి స్థాపన మానవ జాతికి ఆచరణలో ఆస్తి సమస్య లేకుండా చేస్తుంది; యెందుకంటే, ఉత్పత్తి సాధనాలలో యావత్ప్రజా ఆస్తి ఒక్కటే సామాజిక స్వభావం గల ఉత్పాదక శక్తులకు తగిన రూపం; వాటి అభివృద్ధికి అది అపారమైన అవకాశాలు కలిగిస్తుంది. కనుక, సహజంగానే, మానవ జాతియొక్క యితోధిక అభివృద్ధికి చెందిన చారిత్రక క్రమం ఆస్తి రూపంలో ఒకదానినుండి ఒకటి విభేదించే సామాజికార్థిక నిర్మాణరూపాల అనుక్రమంగా వుండడం ఆగిపోతుంది. కానీ, భావి సమాజం తన అభివృద్ధిలో గుణాత్మకంగా భిన్నమైన యే దశలగుండానూ గడవదని దీని అర్థం కాదు. అసలు విషయ మేమంటే, యీ దశలు యిక యెంత మాత్రమూ ఆస్తి రూపంలో కాక, యితర వస్తుగత గీటురాళ్లలో ఒకదానినుండి ఒకటి విభేదిస్తాయి.

సామాజిక అంతర్వైరుధ్యాలు ప్రపంచ మంతటా అధిగమింపబడినప్పుడు, మానవులు యేకమై, తమ బలాలనూ, శక్తులనూ, ఆలోచననూ యేకంచేసి, ప్రకృతిని గురించి మరింత సంపూర్ణమైన జ్ఞానం పొందడమూ, మానవుని స్వీయ సర్వతోముఖ అభివృద్ధికి ఆ జ్ఞానాన్ని ఉపయోగించుకోవడమూ అనే మహత్తర కర్తవ్యాలను, స్వేచ్ఛాయుత సమాజంలోని స్వేచ్ఛాయుత మానవులు మాత్రమే సాధించగల కర్తవ్యాలను, సాధించడానికి ప్రయత్నిస్తారు.

ప్రకరణం అయిదు

సమాజమూ, సంస్కృతీ

సంస్కృతి అంటే యేమిటి?

గత ప్రకరణాలలో మనం సమాజాన్ని సుసంవక్తమైన, కానీ అంతరంగికంగా విభజితమైన సామాజిక శరీరిగా పరిగణించినాము; తత్ఫలితంగా అది సంబంధాలూ, వ్యవస్థలూ, సామాజిక బృందాలూ, పాదార్థిక, ఆత్మిక అంశాలూ అనే సామాజిక విషయాల విలక్షణ వ్యవస్థగా కనిపించింది. మనం యీ వ్యవస్థయొక్క నిర్మాణాన్నీ, దాని అంశాల మధ్య గల సంబంధాన్నీ, దాని అభివృద్ధికి చెందిన ప్రధాన నియమాలనూ పరిశీలించినాము.

యిప్పుడు మనం సమాజాన్నీ, సంస్కృతినీ చర్చించవలసి వుంది. యెందు కవి రెండూ అంతగా లంకింపబడి వున్నాయి? యెంతైనా సంస్కృతి అనేది సమాజానికి వెలుపల వున్నది కాదా? స్పష్టంగా, కాదు. సంస్కృతి సమాజంలో వుంటుంది; సమాజానికి వెలుపల యెప్పుడూ లేదు, అనగా ప్రకృతిలో మానవునికి ముందు గానీ, మానవుడు లేకుండా గానీ లేదు. అదే సమయంలో, సంస్కృతి అనేది చాలా విశాలమైన భావం, పరిమాణంలో సమాజమనే భావంతో పోల్చదగింది; యెందుకంటే, మనం సామాజిక జీవితానికీ, కార్యాచరణకూ సంబంధించిన యే రంగాన్ని పరిగణించినా, సంస్కృతికి చెందిన యేవో కొన్ని అంశాలు యెప్పుడూ కన పడతాయి. అందువల్లనే, సంస్కృతిని సార్వత్రిక సిద్ధాంత రీత్యా పరిశీలించడానికీ, సామాజిక మానవుని ముఖ్య కార్యాచరణలో దాని పాత్రను అర్థం చేసుకోడానికీ, సంస్కృతిని సమాజంతో పోల్చడం అవసరం.

అయితే, సంస్కృతి అనేది యేమిటి? సంస్కృతికీ, సమాజానికీ గల సంబంధం యేమిటి? యీ విషయంమీద మార్క్సిస్టులూ, తదితరులూ చాలా రాసినారు. సంస్కృతికి చాలా నిర్వచనాలు వున్నాయి. దృశ్యమానంగా, దీనికి కారణం యేమిటంటే, సంస్కృతి అనేది మహా క్లిష్టమైన, కొంతవరకు అనిశ్చితమైన విషయం కావడం మాత్రమే కాక, నిత్య జీవితంలోనూ, వివిధ శాస్త్రాలలోనూ — మానవశాస్త్రం, తెగలశాస్త్రం, మనశ్శాస్త్రం, భాషాశాస్త్రం, చరిత్ర, సామాజిక శాస్త్రాలలో — సంస్కృతిలోని భిన్న పార్శ్వాలు, లేదా భిన్న అంశాలు కూడా వెలికి తేబడుతాయి; తత్ఫలితంగా, భిన్న నిర్వచనాలు మహా భిన్నమైన విషయాలను గురించి చెపుతాయి. అందువల్లనే, ముఖ్యమైన విషయం, సంస్కృతి అంటే యేమిటో నిర్ణయించడమూ, దాన్ని నిర్వచించడానికి సూత్రాలను రూపొందించడమూ.

సంస్కృతి అనేది నిత్య వ్యవహారపు పదం మాత్రమే, లేదా కొన్ని ప్రత్యేక శాస్త్ర విజ్ఞాన శాఖలలో ఉపయోగించబడే భావం మాత్రమే అనే సాకుతో కొందరు సంస్కృతి అనే సాధారణ భావాన్ని రూపొందించవలసిన అవసరాన్ని నిరాకరిస్తారు. కానీ, సాంస్కృతిక సమస్యలు యేదో ఒక రూపంలో సామాజిక ఆచరణచేత మహా ముఖ్యమైన సామాజిక సమస్యలుగా ముందుకు తేబడుతున్నాయి; అందువలన అవి తీవ్ర భావజాల పోరాటానికి గురి అవుతున్నాయి. సోషలిస్టు నిర్మాణ మార్గం చేపట్టిన దేశాలలో సాంస్కృతిక విప్లవ అవసరాన్ని, యిది ఉత్పన్నం చేసే సమస్యలనూ తీసుకోండి; ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాల జాతులు, ప్రతిఒక్కటీ తన సొంత విలక్షణమైన సంస్కృతిని కలిగినట్టివి, చురుకైన చారిత్రక చర్యలో నిమగ్నం కావడం తీసుకోండి; పురోగామి పెట్టుబడిదారీ దేశాలలోని "సామూహిక సమాజం," "సామూహిక సంస్కృతి" అనే క్లిష్టమైన, అంతర్వైరుధ్య పూరితమైన సమస్యలనూ, మొదలైనవాటిని తీసుకోండి. సంస్కృతి లాంటి విషయాన్ని ప్రత్యేకంగా అధ్యయనం చేయవలసిన అవసరం మార్క్సిస్టు సామాజిక శాస్త్రం యెదుట వున్నదని యివన్నీ స్పష్టపరుస్తాయి.

సంస్కృతి అనే భావం సామాజిక శాస్త్ర భావాల వ్యవస్థలో చేరగలదు, చేరితీరాలి; యెందుకంటే, సామాజిక శాస్త్రం మానవ కార్యాచరణను అధ్యయనం చేయడానికీ, తత్పర్యవసానంగా వివిధ సామాజిక వ్యవస్థల క్రియా నిర్వహణనూ అభివృద్ధినీ అధ్యయనం చేయడానికీ తోడ్పడే ధాతువులలో అది ఒకటి.

ప్రకృతి భిన్నంగా "సంస్కృతం" అనేది మానవ కృషిద్వారా ఉద్భవించిన ఏదో ఒకటి. పెంచబడిన మొక్క మానవ కృషిద్వారా మార్పుచెందిన అడవి మొక్క; దున్నిన నేల మానవ కృషిద్వారా చక్కచేయబడిన నేల; సంస్కృతి చెందిన మానవుడు (నాగరికుడు) తీర్చి దిద్దడం ద్వారా మార్పుచెందిన ప్రాకృతుడు. అందుకని అన్ని విషయాలను ప్రకృతికి సంబం

ధించినవిగానూ, సంస్కృతికి సంబంధించినవిగానూ విభజించుతారు. "సంస్కృతి" అనేది భావం "సమాజం" అనే భావానికి సమానమైనదిగా పరిగణిస్తారు. సంస్కృతి అంటే మానవ ఉనికికి అత్యంత విశిష్టమైన లక్షణం. ప్రకృతికి సంబంధించిన, సంస్కృతికి సంబంధించిన విషయాలకూ మధ్య గల భేదం చివరకు ప్రకృతిసిద్ధ, స్వయంజనిత క్రమాలకూ, చైతన్య పూరిత, సృజనాత్మక, ప్రయోజనాత్మక మానవ కార్యాచరణ ఫలితమైన క్రమాలకూ మధ్య గల భేదంగా తేలుతుంది గనుక, సమాజం, దాని సకల వ్యక్తీకరణలలోనూ, ఫలితాలలోనూ, సాంస్కృతిక చరిత్రకు, అనగా మానవుని ఆత్మిక సృజనాత్మక కార్యాచరణయొక్క చరిత్రకు, కేవలం అనుబంధంగా పరిగణింపబడింది. పాదార్థిక సంస్కృతికీ, దాని స్మారకాలకూ యెక్కువ శ్రద్ధ అర్పించబడినా, తక్కువ శ్రద్ధ అర్పించబడినా, "సాంస్కృతిక చారిత్రక సంప్రదాయం" అనబడేదానికి, "సాంస్కృతిక మానవశాస్త్రానికీ," దాని భిన్న పాఠాంతరాలకూ, విలక్షణమైన యీ వైఖరి చరిత్రను గురించిన భావవాద దృక్పథానికి రూపాంతరం మాత్రమే. విజ్ఞానశాస్త్రాల నన్నిటినీ ప్రకృతికి చెందిన శాస్త్రాలుగానూ, సంస్కృతికి చెందిన శాస్త్రాలుగానూ రికెర్ట్ చేసే విభజనకూ, మానవజాతి చరిత్రను స్థానిక, యేకాకి సంస్కృతుల, నాగరికతల చరిత్రగానూ చూసే దృక్పథానికీ యిది ప్రాతిపదికగా ఉపకరిస్తుంది.

ప్రకృతి విషయాలకు భిన్నంగా సృజనాత్మక మానవ కార్యాచరణయొక్క మొత్తం ఫలితాలను తెలపడానికి "సంస్కృతి" అనే పదాన్ని నిత్య వ్యవహారంలోనూ, శాస్త్రీయంగానూ వాడడం సమంజసమే అని మేము నమ్ముతాం — కానీ, ప్రకృతిని భౌతికవాదాత్మకంగానూ, సమాజాన్ని భావవాదాత్మకంగానూ చూసేటట్లు ఆ రెంటికీ మధ్య భేదం చూపడానికి ఆ పదాన్ని వాడకుండా వుండే పక్షంలో.

కానీ, సంస్కృతిని గురించిన యీ అవగాహన మరీ సాధారణంగా, మరీ అభౌతికంగా వుంది; వివిధ సమాజాల క్రియా నిర్వహణమూ, అభివృద్ధినీ అధ్యయనం చేసే సామాజిక శాస్త్రానికి స్పష్టంగా యిది చాలదు. యిందువలన, సంస్కృతిని సమాజంతో దానికి గల సంబంధం దృష్ట్యా పరిశీలించవలసిన అవసరం ఉత్పన్నమౌతుంది — అనగా, సంస్కృతి అనే భావంలో సమాజ కార్యాచరణకు అత్యంత ముఖ్యమైనదానిని బయలుపరచేటందుకు, సంస్కృతిని ప్రకృతినుండే కాక, సమాజంనుండి కూడా వింగడించవలసిన అవసరం ఉత్పన్నమౌతుంది. దీనిని బట్టి, సంస్కృతిని గురించిన విశాల దృక్పథానికీ, సంకుచిత దృక్పథానికీ మధ్య భేదం వుండాలని కొందరు సూచించినారు. సంకుచిత దృక్పథమంటే, శాస్త్రవిజ్ఞానమూ, కళలూ, మొదలైన ఆత్మిక సృజనాత్మక కార్యాచరణా, దాని ఫలితాలూ, జనాలలో వాటి వ్యాప్తీ అని అర్థం. సంస్కృతియొక్క యీ నిర్వచనం పైన యిచ్చిన విశాల నిర్వచనంనుండి దానిని వింగడిస్తుంది; పై నిర్వచనంలో మానవ కార్యాచరణయొక్క ఫలితాలన్నీ — పాదార్థి

కమూ, ఆత్మికమూ, రెండూ — సంస్కృతిలో భాగాలు. ఆత్మిక సంస్కృతినీ, పాదార్థిక సంస్కృతినీ వేరుచేయడానికి తగిన కారణం వుంది; సంస్కృతినుండి ఉత్పన్నమయే సమస్యలు వాస్తవానికి ఆత్మిక సంస్కృతి (సంస్కృతియొక్క సంకుచిత అవగాహన)యొక్క అభివృద్ధినుండి ఉత్పన్నమౌతాయనే అభిప్రాయం విస్తృతంగా అంగీకరించబడింది. కానీ, యీ అభిప్రాయం సంస్కృతి అనే బహుముఖమైన విషయంలో కొన్ని పార్శ్వాలను వ్యక్తం చేస్తుంది గానీ, విశాల సంస్కృతి భావంతో పోలిస్తే దీనిలో కొన్ని లోపాలు వున్నాయి. నిజానికి, పాదార్థిక సంస్కృతికీ, ఆత్మిక సంస్కృతికీ మధ్య గల భేదం కేవలం సాపేక్షమైనది. యెంతైనా, మానవుడు తయారుచేసిన ప్రతి పాదార్థిక వస్తువూ మొదట భావంగా, మానవుని ఆత్మిక సృజనాత్మకతయొక్క ఉత్పాదితంగా, వుండింది. ఆత్మిక సృజనాత్మకత మానవ కార్యాచరణలో అవశ్య భాగం. ప్రకృతి రైలింజన్లను గానీ, వ్యవసాయ యంత్రాలను గానీ, రైల్వేలను గానీ చేయదు అని మార్క్స్ అన్నాడు. యివన్నీ మానవుని పని, అతని చేతులయొక్క, మెదడుయొక్క ఉత్పాదితాలు, మానవుని జ్ఞానానికీ, అనుభవానికీ, సృజనాత్మక శక్తికీ సాకార రూపాలు. సామాజికంగా ప్రాముఖ్యం వహించడానికి ప్రతి భావమూ పాదార్థికం కావాలి: ఆచరణలో, భాషలో, పుస్తకంలో, బొమ్మలో, యంత్రంలో, వగైరా. సంస్కృతియొక్క సారాన్ని ఆత్మిక సంస్కృతి విషయాలకు పరిమితం చేయడం తప్పనడానికి యిదొక్కటే చాలు. నిజంగా, వర్ణచిత్రం చిత్రించే కళాకారుడు సంస్కృతిని సృష్టిస్తున్నాడనీ, కాగితంమీద యంత్రాన్ని చిత్రించే రూపనిర్మాణ యింజనీరు సంస్కృతిని సృష్టించడం లేదనీ అనడం సరైనదా?

అంతే కాక, సంస్కృతి అంటే ఆత్మిక కార్యాచరణా, దాని ఫలితాలూ ("ఆత్మిక సంస్కృతి") మాత్రమే అయితే, "సమాజంయొక్క ఆత్మిక జీవితం" లాంటి భావంలో కంటె దీనిలో యెక్కువ మౌలికమైన అర్థం వుండదు. ఆ పక్షంలో, ఆత్మిక సృజనాత్మకతయొక్క రూపాలలోని, వ్యక్తీకరణలలోని మొత్తం వైవిధ్యాన్నీ, దాని ఫలితాల వ్యాప్తినీ, వగైరాను వర్ణించడానికి మాత్రమే యిది అర్థవంతంగా ఉపయోగించబడగలదు. ప్రతి సమస్తమూ కేవలం దాని భాగాల మొత్తంకంటె యెక్కువైనది గనుక, యిలాంటి సంయోజిత భావం వుండదగినదే. ముఖ్యంగా, సమాజాన్ని సుసంసక్తమైన వస్తువుగా చెప్పే భావానికీ, సంస్కృతిని ఆ వస్తువులోని భాగంగా చెప్తూ, నిర్దిష్ట యుగంయొక్క సామాజిక చైతన్యపు అభివృద్ధిని సూచించే భావానికీ మధ్య గల భేదాన్ని గుర్తించడానికి యిది తోడ్పడుతుంది గనుక.

సంస్కృతి భావాన్ని ఆత్మిక సంస్కృతికి పరిమితం చేయడం సరైనదని మేము అనుకోవడం లేదు; పాదార్థిక సంస్కృతియొక్కా, ఆత్మిక సంస్కృతియొక్కా ఉత్పాదితాలు రెండూ మానవ కార్యాచరణయొక్క ఫలితాలు గనుక వాటికి కొన్ని సామాన్య లక్షణాలు వున్నా

యని నొక్కిచెప్తున్నాము. కానీ, పాదార్థిక సంస్కృతికీ, ఆత్మిక సంస్కృతికీ మధ్య భేదం చూడడం అనవసరమని బొత్తిగా నమ్మము. ఉదాహరణంగా ఉత్పత్తి సాధనాలు పాదార్థిక సంస్కృతియొక్క ఉత్పాదితాలు, దాని నియమాలకు లోబడినట్టివి; కానీ, సమాజం యొక్క మొత్తం సామాజిక నిర్మాణానికి ప్రాతిపదిక అయిన ఉత్పాదక శక్తుల కింది సామాజిక క్రియను కూడా అవి నిర్వహిస్తాయి. ఉత్పత్తి సాధనాలనూ, పాదార్థిక సంస్కృతియొక్క యితర అంశాలనూ (శ్రమ సాధనాలూ, భవనాలూ, బట్టలూ, వగైరాలను) ఉపయోగించడంయొక్క, అనగా "అనుభోగం"యొక్క, ఫలితంగా అవి అరిగిపోతాయి, లేదా భౌతికంగా, రసాయనికంగా, ఆహారమైతే శక్తిగా రూపాంతరం చెందుతాయి. అందుకనే, సమాజం బతకాలంటే, యివి నిరంతరం పునరుత్పత్తి కావాలి. కనుక, సామాజిక మానవుని పాదార్థిక ఉత్పాదక కార్యాచరణ నిత్య అవసరం.

ఆత్మిక ఉత్పత్తియొక్క ఉత్పాదితాలు భిన్న స్వభావం గలవి. ఒక ప్రకృతి నియమం ఒకసారి ఆవిష్కరింపబడితే, అది సమాజ ఆస్తిలో భాగమౌతుంది, వ్యయం కాకుండా, అనుభోగంద్వారా నాశనం పొందకుండా, మళ్లీ మళ్లీ ఉపయోగింపబడగలదు. ఒక పుస్తకం ఒకసారి సమాజ ఆస్తిలో భాగమైతే, దానికి పాఠకులు వున్నంత కాలం, అనగా అది పాతబడిపోకుండా, సాంస్కృతిక అవసరాలు తీరుస్తున్నంత కాలం, దానిని యెన్ని సార్లైనా "అనుభోగించ"వచ్చు (భౌతిక వస్తువుగా మాత్రమే పుస్తకం అరిగిపోతుంది గనుక).

యీవిధంగా, సమాజంలో పాదార్థిక ఆత్మిక కార్యాచరణయొక్క వస్తువులయొక్క సృష్టి, వ్యాప్తి (పంపకం), అనుభోగం అనే క్రమం సాగుతుంది. అనుభోగింపబడాలంటే, పాదార్థిక ఉత్పత్తియొక్క ఉత్పాదితాలు నిత్యం పునరుత్పత్తి కావాలి. ఆధునిక సమాజంలో అవి అమ్మకం వ్యవస్థద్వారా సరుకులుగా పంపకం చేయబడి, అనుభోగంద్వారా అరిగిపోతాయి, లేదా పూర్తిగా అదృశ్యమౌతాయి.

ఆత్మిక ఉత్పాదితాలు అద్వితీయమైనవి (విడుదలైన ప్రతుల సంఖ్య విషయం వేరు). మనుషులు తదనుగుణమైన సాంస్కృతిక "మడికారా"లను కరతలామలకం చేసుకోగా అవి విద్యా, విజ్ఞాన వ్యవస్థద్వారా పంపకం చేయబడుతాయి, కానీ అనుభోగంలో అదృశ్యం కావు. బూర్జువావర్గం ఆత్మిక ఉత్పత్తిని కూడా పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క నియమాలకు లోబరచడానికి ప్రయత్నిస్తున్న మాట నిజమే, కానీ అది కొంతవరకు మాత్రమే అలా చేయగలదు; యెందుకంటే, యీ ఉత్పత్తియొక్క స్వభావం దాని ప్రయత్నాలను ప్రతిఘటిస్తుంది. ఆత్మిక ఉత్పత్తియొక్క విశిష్ట లక్షణం యేమిటంటే, ఆత్మిక సంస్కృతికి చెందిన వస్తువుల బాహ్య భౌతిక రూపానికి గల ప్రాముఖ్యం సరిగ్గా మానవునికి దృశ్యమానమై, జీర్ణం కాగల దాని ఆత్మిక సారంయొక్క వ్యక్తీకరణగానే.

వర్గ సమాజంయొక్క ఆత్మిక ఉత్పత్తి వర్గాల వైరుధ్యానికి ప్రతిబింబంగా కూడా వుంటుంది. దాని ఫలితంగా సంస్కృతియొక్క భావజాల సారానికి వర్గ స్వభావం కలిగిస్తుంది. సంస్కృతి అనే రంగంలో సామాజిక అనుభవమూ, జ్ఞానమూ, మొదలైనవి ఒక తరంనుండి మరొక తరానికి అందజేయబడుతాయి, అనగా "సామాజిక సమాచారం" నిలువచేయబడుతుంది; తద్వారా, సంస్కృతి అభివృద్ధి చెందడానికీ, కొత్త సాంస్కృతిక విలువలు ప్రత్యక్షం కావడానికీ వీలు కలుగుతుంది. బదలాయింపు యంత్రాంగం చారిత్రక పరిస్థితులమీదా, సామాజిక అభివృద్ధి స్థాయిమీదా, వివిధ వర్గాల ప్రయోజనాలమీదా ఆధారపడుతుంది, కానీ అది యెప్పుడూ సాంస్కృతిక విలువలతో మానవునికి గల సంపర్కంతో ముడివడి వుంటుంది.

యీ నిర్వచనాలు సంస్కృతియొక్క వస్తుగత పార్శ్వాన్ని వెలికి తెచ్చి, ఒక విషయాన్ని స్థిరపరుస్తాయి — మనుషులు యే పరిసరాలలో జీవిస్తారో, వ్యవహరిస్తారో ఆ పాదార్థిక, ఆత్మిక పరిసరాలుగా యేర్పడే పాదార్థిక, ఆత్మిక విలువల నిర్దిష్ట సాకల్యంగా సంస్కృతి సమాజంలో వుంటుందనే విషయాన్ని.

సంస్కృతి అనగా సామాజిక సంఘాలచేత స్వీకరించబడి, తదనంతర తరాలకూ, యితర సమాజాలకూ అందజేయబడే మానవ కార్యాచరణయొక్క (పాదార్థిక, ఆత్మిక) ఉత్పాదితాల సాకల్యం, అనేది ఒక నిర్వచనం. సంస్కృతి అనగా చారిత్రకంగా యెన్నుకోబడి, తరువాతి తరాలకు సంక్రమించే భావాలయొక్కా, తదనుబంధిత విలువలయొక్కా సాకల్యం, అనేది మరొక నిర్వచనం. యీ రెండిటిలో ప్రతిదీ సంస్కృతియొక్క నిజమైన పార్శ్వాలను ప్రతిబింబించినప్పటికీ, యేదీ సంస్కృతియొక్క సారాన్ని పూర్తిగా గుణ నిర్ధారణ చేయదు.

ప్రకృతి విషయాలకు భిన్నంగా, సంస్కృతి అనేది — కేవలం వస్తుగతమైన విషయం కాక, నిర్దిష్టంగా సంస్కృతిగా కూడా — మానవునితోనూ, అతని భౌతిక కార్యాచరణతోనూ ముడివడి మాత్రమే వుండగలదు. అందువల్లనే, సంస్కృతికి యెల్లప్పుడూ ఆత్మగత పార్శ్వం కూడా వుంటుంది. మానవుడు పాదార్థిక, ఆత్మిక వస్తువులను సృష్టిస్తాడు, తన ఆత్మిక కార్యాచరణయొక్క ఫలితాలకు సాంస్కృతిక కృతులలో శరీరం యిస్తాడు, వాటి "మానవీయమైన" సారాన్ని అశరీరం చేసి, లేదా బహిర్గతపరచి, తనకు అందుబాటులోకి తెచ్చుకొని, జీర్ణం చేసుకుంటాడు. సమాజంలో సంస్కృతియొక్క సృష్టికి మాత్రమే కాక, సంస్కృతియొక్క అంతరంగీకరణ*కు కూడా చెందిన నిత్య క్రమం జరుగుతుంది.

---

* అంతరంగీకరణ — బాహ్యమైన దానిని అంతరంగికమైనదానిగా రూపాంతరీకరించడం, సమాజ సంస్కృతిని మానవుని అంతరంగిక సంస్కృతిగా రూపాంతరీకరించడం.

ఆంతరంగీకరణ మానవునికీ, సంస్కృతికీ మధ్య జరిగే చర్యా ప్రతిచర్యలలో ఒక అవశ్యమైన పార్శ్వం, సమాజంయొక్క జీవితానికీ, అభివృద్ధికీ తప్పనిసరి అవసరం.

జంతు ప్రపంచంనుండి మానవుని వింగడించడమూ, మంద స్థానంలో సామాజిక సంఘాలు రావడమూ అనేవి ముఖ్య కార్యాచరణయొక్క నిర్దిష్టంగా మానవీయమైన విధానాల ఆవిర్భావంతోనూ, అభివృద్ధితోనూ ముడివడి వున్నాయి. యివి లేకుండా ఆ సంఘాల ఉనికీ, అభివృద్ధీ అనేవే దురూహ్యం.

శ్రమద్వారా, జీవితావసరాల ఉత్పత్తిద్వారా యిది అర్థమౌతుంది. పైన చెప్పినట్లు, ఉత్పత్తి క్రమం జరగాలంటే, నిర్దిష్టమైన పాదార్థిక భాగాలు — శ్రమ గ్రహీతలూ, ఉత్పత్తి సాధనాలూ, ఉత్పత్తి పరికరాలూ — వుండాలి, అలాగే, వేటి సాయంతో మానవులు యీ పరికరాలను ఉపయోగించడమూ, నడిపించడమూ, ఉత్పాదక కార్యాచరణను సాగించడమూ సాధ్యమౌతుందో ఆ అనుభవమూ, జ్ఞానమూ, శ్రమ నైపుణ్యాలూ గల మానవులు కూడా వుండాలి. శ్రమ పరికరాలు మాత్రమే కాక, వాటితో పనిచేసే పద్ధతులు కూడా సమాజంలో చారిత్రకంగా వేర్పూని, తరువాతి తరానికి అందజేయబడుతాయి. ఒకే రకమైన పరికరాలూ, యితర ఉత్పత్తి అంశాలూ గల వివిధ దేశాలు, వాటి పాదార్థిక సాంకేతిక అభివృద్ధీ, సామాజికార్థిక అభివృద్ధీ ఒకే స్థాయిలో వున్నప్పుడు కూడా, ఉత్పత్తి సామర్థ్యంలో చాలా భిన్నమైన స్థాయిలు కలిగి వుండవచ్చు.

మానవ సంబంధాల — ఆర్థిక, రాజకీయ, వర్గగత, అంతర్వర్గ, జాతీయ, అంతర్జాతీయ, కుటుంబ, నిత్య జీవిత, క్రీడా, విద్యా, వగైరా, వగైరా సంబంధాల — వైవిధ్యం మూలంగా ప్రతి వ్యక్తికీ ఒక అవసరం యెదురౌతుంది; యేమిటంటే, అతను వేటి చట్రంలో వ్యవహరించాల్సో ఆ అనేక సమష్టి సంఘాల అవసరాలకు అనుగుణంగానూ, తన కార్యాచరణను నియంత్రించే యంత్రాంగాలుగా పనిచేసే సంప్రదాయాలూ, ప్రమాణాలూ, విలువలూ, వగైరాగా వ్యక్తమయ్యే అవసరాలకు అనుగుణంగానూ తన ప్రవర్తననూ, ఆచరణ విధానాన్నీ మలుచుకోవాలి. ఒక సమాజపు సాంస్కృతిక విలువలూ, అవి యే మేరకు కరతలామలక మైనాయనేదీ చారిత్రకంగా వేర్పూనిన సంఘాల చట్రం లోపల వ్యక్తియొక్క ప్రవర్తన విధానాలను నిర్ణయిస్తాయి, అంటే సమాజ సంస్కృతిని నిర్ణయిస్తాయి. అన్నట్లు, మన మొకటి గుర్తుపెట్టుకోవాలి: ఒక సమాజంయొక్క సంస్కృతిని మనం చర్చించేటప్పుడు, మన మనసులో వున్నది ఒక వ్యక్తి కాదు, ఆ సమాజపు వాస్తవమైన స్త్రీ పురుషులూ, ఆ సమాజపు వ్యక్తులకు సామాన్యంగానూ, విలక్షణంగానూ వుంటూ, సామాజిక జీవితపు వివిధ రంగాలలో సామాజిక ప్రాముఖ్యం గల వాళ్ల ప్రవర్తనలోనూ, కార్యాచరణలోనూ వ్యక్తమయ్యే సంస్కృతి.

మానవ కార్య విధానాలూ, మానవ ప్రవర్తన స్వభావమూ చేసిపెట్టిన ప్రవర్తన నమూనాలు స్థిరపడి, ఒక తరంనుండి మరొక తరానికి పోయేవిగా సంస్కృతిద్వారా అందజేయబడవచ్చు. యెంతైనా, ప్రతి సమాజంలోనూ తల్లి తన బిడ్డను వూపుతూ నిద్రపుచ్చుతుంది, మనుషులు వండుకొని, తింటారు, కలుసుకొన్నప్పుడు ఒకరి నొకరు పలకరించుకొంటారు, పనిచేస్తారు, విశ్రమిస్తారు, పండుగలు చేసుకుంటారు, వగైరా, వగైరా, కానీ యివన్నీ వాళ్ళు భిన్నభిన్నంగా చేస్తారు, తాము పొందిన సంస్కృతియొక్క స్వభావాన్ని బట్టి చేస్తారు.

నిర్దిష్ట సన్నివేశానికి ప్రతిస్పందనలూ, కార్య విధానాలూ భిన్నమూ, మారేవీ అయిన పరిస్థితులమీద ఆధారపడే కొన్ని రూపాంతరాలుగా ఒక సంస్కృతిలో వుండవచ్చు. అలాంటి పక్షంలో, సంస్కృతి చేసిపెట్టిన ప్రవర్తన నమూనాలను కాక, కార్యాచరణ సూత్రాలను సమకూర్చి, మొత్తం మానవ జాతియొక్క మునుపటి సామాజిక సాంస్కృతిక అభివృద్ధి నుండి ఆచరణ విధానాన్ని యేరుకొనే అవకాశాన్ని యిస్తుంది. సాంస్కృతిక వ్యవస్థ చేసిపెట్టిన ప్రవర్తన నమూనాలను అందించేటట్టి సన్నివేశంనుండి మరొక సన్నివేశానికి సంస్కృతి అభివృద్ధి సాగుతుంది; మరొక సన్నివేశం యెలాంటిదంటే, అక్కడ ప్రవర్తన ప్రయోజనాలుగానూ, సాధనాలుగానూ, పద్ధతులుగానూ ముక్కలు చేయబడుతుంది, తదనంతరం, అవి ప్రమాణాలూ, విలువ నిర్ణయాలూ, మొదలైన రూపంలో ప్రదర్శింపబడుతాయి. కాని, కొన్ని పరిస్థితులలో చేసిపెట్టిన ప్రవర్తన నమూనాలు అందివ్వడం అర్థవంతంగా వుండడం కొనసాగుతుంది.

ఆత్మిక కార్యాచరణ రంగంలో సంస్కృతీ భావానికి ఒక ప్రత్యేక అర్థం కూడా మనకు కనపడుతుంది; యేమిటంటే, ఆ భావంలో సృజనాత్మక కార్యాచరణ స్వభావమూ, దాని ఫలితాలను అవగతం చేసుకొనే స్వభావమూ, రెండూ వుంటాయి. ఒక కళా ఖండాన్ని విలువ కట్టడంలో, కళాకారుని ప్రజ్ఞకూ, సృజనాత్మక శక్తికీ మాత్రమే కాక, అతని సాధారణ సంస్కృతికీ, వృత్తిగతమైన సంస్కృతికీ కూడా మన దృష్టి ఆకర్షింపబడుతుంది.

ఆవిధంగా, మంచి కంఠం గల గాయకునికి అవసరమైన తర్ఫీదు కూడా కావాలి, అనగా గానంలో వృత్తి ప్రమాణాలు కావాలి.

కళా ఖండాల అనుభూతి చెందిన సంస్కృతి కూడా వుంది, అనగా అనుభూతి విధానం; యిది, ఒక విధంగా, స్రష్టకు సృజనాత్మక క్రమంతో సంబంధం కలిగిస్తుంది, అతనిలోని కళాకారుని మేల్కొల్పుతుంది, కళా ఖండంలో ప్రతిబింబింపబడిన ఘటనలనూ, విషయాలనూ గురించి కళాస్రష్ట అనుభవంతో సహానుభూతి గల అనుభవాన్ని అతనిలో కలిగిస్తుంది. కళా ఖండాలు గత సంస్కృతికి స్మారకాలు మాత్రమే కాక, కొత్త తరాల భావాలనూ, అను

భూతులనూ, దృష్టులనూ రూపుతీర్చే ప్రస్తుత సంస్కృతిలోని అంశాలు కూడా కావడం యిందువల్లనే.

శ్రమ సంస్కృతీ, సామాజిక ప్రవర్తన సంస్కృతీ, గ్రహణ సంస్కృతీ, నిత్య జీవితంలో, ఉత్పత్తిలో, ఆఫీసులలో, వగైరాలలో మానవ సంబంధాలకు చెందిన సంస్కృతీ వున్నాయి. యీ అన్ని సందర్భాలలోనూ మనం చరిత్రలో వేర్పాటైన, యేరుకోబడి, సంక్రమించినట్టి ప్రవర్తన, కార్య విధానాలతోనూ, నమూనాలతోనూ — నిర్దిష్ట సామాజిక బృందంచేత అవలంబించబడి, తత్కారణంగా, ఆ బృందంలోని వ్యక్తుల సభ్యత్వాన్నీ, యేకీకరణనూ నిర్ణయించేవాటితో — వ్యవహరించాలి.

సంస్కృతిని చర్చించేటప్పుడు, మనం మనసులో వుంచుకోవలసింది మానవులు సృష్టించిన పాదార్థిక వస్తువులు మాత్రమే కాదు, పుస్తకాలూ, చిత్రాలూ, విగ్రహాలూ, వగైరాలలో ఆకారం దాల్చిన విలువల వ్యవస్థలూ భావాలూ, సిద్ధాంతాలూ, కళాభిప్రాయాలూ మాత్రమే కాదు. పుస్తకాలు, వాటిలోని సకల భావాలతో, వాక్చిత్రాలతో సహా, చదవగలవానికి మాత్రమే అస్తిత్వం వహిస్తాయి — శ్రమ పరికరాన్ని ఉపయోగించడం తెలిసినవాడు మాత్రమే దానిని దాని నిర్దిష్ట కర్తవ్యానికి ఉపయోగించినట్లు.

అనేక సంస్కృతీ సిద్ధాంతవేత్తలు సంస్కృతియొక్క సంకేత స్వభావాన్ని నొక్కి చెప్తారు. యిది సంస్కృతిని కొంతవరకు భాష లాంటిదానిని చేస్తుంది. నిత్యం వాడే భాషలోని పదాలకు ఒక అర్థం వుంది; అది ఆ భాష తెలిసినవాళ్లకు ఒక సందేశాన్ని యిస్తుంది, తెలియనివాళ్లకు యేమీ యివ్వదు; అలాగే సాంస్కృతిక విషయాలు నిర్దిష్ట సందేశాల సాంకేతిక వాహికలు. సంస్కృతిని కరతలామలకం చేసుకోడానికి దాని "సుడికారా"న్ని కరతలామలకం చేసుకోవాలి. మానవులు తమ చర్యలలో సంస్కృతీ "సంకేతాల"చేత నడిపించబడుతారు; అందువల్లనే వాళ్ల ప్రవర్తనను దరహంమీద <u>సాంకేతికం</u> అనవచ్చు; యిది జంతువుల చర్యలకంటే భిన్నమైనది; జంతు ప్రవర్తన <u>అనుద్దిష్టం</u>. అది <u>సంకేతశాస్త్ర</u> (semiotics) ఆవిర్భావానికి ప్రాతిపదికను సమకూర్చింది; యీ శాస్త్రం సంకేత వ్యవస్థల శాస్త్రం, సంస్కృతియొక్క వివిధ "సుడికారాల"ను కూడా అధ్యయనం చేసేది.

కనుక, సంస్కృతి అనేది యితర సామాజిక విషయాలకంటె భిన్నమైనది కాదు, కానీ వాటితో సమసమించేదీ కాదు. సంస్కృతి అనేది మానవ కార్యాచరణయొక్క సకల పాదార్థిక విజయాలనూ, వాటిచేత నిర్ణయించబడిన సామాజిక, ఆత్మిక విజయాలనూ వర్ణించడానికి రూపొందించబడిన సంయోజిత భావం; ఆ విజయాలు మానవునిలోనూ, అతని జీవిత విధానంలోనూ, అతని ఆలోచనా విధానాలలోనూ, కార్య విధానాలలోనూ యెలా వ్యక్తమౌతాయనే దృష్టితోనూ, మానవుడు తన జంతు మూలాలను అధిగమించడానికి అవి

యే మేరకు తోడ్పడతాయనే దృష్టితోనూ చూడబడుతాయి. అందువల్లనే, సంస్కృతి అన్నిటికంటె ముఖ్యంగా మానవులయొక్క, వాళ్ళ మానవీకరణ స్థాయియొక్క గుణం; అది నిర్దిష్టంగా మానవీయమైన ఆలోచనకూ, సామాజిక ప్రవర్తనకూ, ఆచరణకూ చెందిన విధానాలలో వ్యక్తమౌతుంది.

సామాజిక అభివృద్ధీ, సంస్కృతియొక్క వైవిధ్యమూ

సంస్కృతి స్వభావం సామాజిక అవసరాలచేత నిర్ణయింపబడుతుంది గనుక, అది సామాజిక పరిస్థితులచేత నిర్ణయింపబడుతుందని చెప్పవచ్చు.

చిన్న బృందాలుగా గానీ, సమష్టి సంఘాలుగా గానీ, మొత్తం సమాజంగా గానీ, యే ప్రమాణంలోనైనా మనుషులు సంయుక్తంగా పనిచేయడానికి సంస్కృతి సృష్టింపబడడమూ, పనిచేయడమూ తప్పనిసరి అవసరం. అందువల్లనే, సంస్కృతి సామాజిక వ్యవస్థతో అల్లిబిల్లిగా పెనవేసుకొని వుంది, సామాజిక వ్యవస్థ లోపల జరిగే యే విభజనలైనా సంస్కృతిలో అనివార్యంగా ప్రతిఫలిస్తాయి. ఒకేసారి భిన్న సమాజాలు వుండడం వలన యేర్పడే స్థలగత సామాజిక వైవిధ్యమూ, సామాజిక అభివృద్ధీ, శ్రమ విభజనకూ, భిన్న కార్యాచరణ రంగ ఉనికికీ, వ్యతిరేక వర్గ ప్రయోజనాలకూ సామాజిక బృందాల పోరాటానికీ మొదలైనవాటికి సంబంధించిన సామాజిక అంతర్గత విభేదాలూ — యివన్నీ సంస్కృతిలో వ్యక్తమౌతాయి.

మానవజాతి చరిత్రలో, భిన్న ఆదిమ సంస్కృతులు మొదట ప్రతిచోటా రూపు దాల్చి, చిన్న సమష్టి సంఘాలకు (తెగలకూ, గణాలకూ) ప్రవర్తనలోనూ, కార్యాచరణలోనూ చేసిపెట్టిన సిద్ధ నమూనాలను యేర్పరచినాయి. యీ సంస్కృతులు మహా స్థిరంగా, దాదాపు మార్పుచెందనివిగా వుండినాయి. సమష్టి సంఘాలలోని మనుషుల జీవితాన్ని కఠినంగా నియంత్రించడానికి అవి తోడ్పడినాయి. యీ సంస్కృతులు నివాస స్థల పరిస్థితులకు మహా అనుగుణంగా మలచబడి, మనుషులు మనుగడ సాగించడానికి తోడ్పడినాయి. ఒక సాంస్కృతిక వ్యవస్థయొక్క చట్రం లోపల పెరిగిన మనిషికి దాని లోపల ''సుఖంగా'' వుండేది, దానిని అతను ''తనది''గా యెంచేవాడు; యెందుకంటే, అతను ఆలోచనకూ, ప్రవర్తనకూ కచ్చితమైన మూసపోసిన రూపాలు యేర్పరచుకొన్నాడు, అవి అతనిలో సజీవ భాగాలైనాయి. అలాంటి మనిషి మరొక సాంస్కృతిక వ్యవస్థకు మారాలంటే, అతను

రూపొందించుకొన్న అలవాట్లూ, ప్రవర్తన విధానాలూ ప్రగాఢమైన పునర్నిర్మాణం పొంద వలసి వుంటాయి. అలాంటి పునర్నిర్మాణానికి నిలదట్టుకొని, మరొక సాంస్కృతిక పరిసరా వళికి తన్ను తాను మలచుకోవడం ప్రతివొక్కరికీ చేతకాదు. ఉదాహరణకు, జిప్సీలు సంచార జీవితాన్ని కోరుకుంటున్నట్లు కనపడడానికి యిది కారణం కావచ్చు.

సాపేక్ష యేకాంతంలోని (పసిఫిక్ మహాసముద్ర ద్వీపాలలోని లాంటి) ఆదిమ సంస్కృతు లను అధ్యయనం చేసిన కొందరు మానవశాస్త్రజ్ఞులు (బి. మలినోవ్స్కీ లాంటివాళ్ళు) మానవుడు యే సాంస్కృతిక వ్యవస్థలో పెరుగుతాడో దానికి అనుగుణంగా తన్ను తాను "మలచుకొనే" అసాధారణ సామర్థ్యం అతనికి వుండడం చూసి ఒక నిర్ధారణకు వచ్చినారు — అదేమిటంటే సంస్కృతులను ఉన్నతమైనవి గానూ, హీనమైనవి గానూ వర్గీకరించడం తప్పు అనీ ప్రతి సంస్కృతీ అద్వితీయమైనదనీ, ఒకసారి దానికి అనుగుణంగా మలచబడిన మనుషులు యితర సాంస్కృతిక వ్యవస్థలకు బాధారహితంగా మారజాలరు అనీ. యిది యేమని సూచిస్తుందంటే, అభివృద్ధి అనే భావం సంస్కృతికి వర్తించదనీ, సంస్కృతిని అధ్యయనం చేయడంలో అవలంబించవలసిన సరైన వైఖరి చారిత్రక వైఖరి కాదు, నిర్మాణ క్రియా వైఖరి అనీ. యీ దృష్టితో చూస్తే, ప్రతి సాంస్కృతిక వ్యవస్థా ఒక యేకీకృత సమస్తం, సమస్తంయొక్క క్రియా నిర్వహణలో దాని నిర్మాణ భాగాలకు నిర్దిష్టమైన పాత్ర గల వ్యవస్థ. సమస్తంయొక్క క్రియా నిర్వహణను అధ్యయనం చేయడంద్వారా మాత్రమే మనం ఆయా సంస్కృతియొక్క అర్థాన్నీ, ప్రాముఖ్యాన్నీ గ్రహించగలం; పోలిక కొరకు అభివృద్ధి నిశ్రేణిమీద వాటిని పేర్చడంద్వారా దానిని సాధించలేం.

తేటతెల్లంగా యిది యేకపక్ష వైఖరి. యెంతైనా, ఆదిమ, యేకాకి సంస్కృతుల పరిశీలనలనుండి లాగిన నిర్ధారణలను మార్పులు లేకుండా మానవజాతియొక్క మొత్తం చరిత్రకు వర్తింపజేయడం సరైనది కాదు; సమాజంలో సాంస్కృతిక పురోగతి వున్నట్లు చరిత్రలో స్పష్టమైన సాక్ష్యం వుంది. అయినప్పటికీ, కొన్ని విషయాలలో యీ అభిప్రా యాలు జాగ్రత్తతో కూడిన పరిశీలనకు అర్హం.

ఒకటి, ప్రతి సంస్కృతీ తాను అభివృద్ధి చేసుకొన్న అభిప్రాయాల వ్యవస్థా, నిబంధ నలూ, ప్రవర్తన ప్రమాణాలూ, సంప్రదాయాలూ, వగైరాలలో అద్వితీయమైనదనే విష యాన్ని అవి ప్రతిబింబిస్తాయి. యీ అద్వితీయతను అతిశయంగా చెప్పకూడదు, కానీ యిది వాస్తవంగా వుంది. ప్రతి సంస్కృతీ, ఒక వ్యవస్థగా, ఒక యేకీకృత సమస్తంగా, నిర్దిష్ట సామాజిక పరిస్థితులతో (ప్రకృతిసిద్ధమైన పరిస్థితులతో కూడా) సజీవంగా ముడిపడి, సామాజిక వ్యవస్థయొక్క నిర్దిష్ట రూపాన్ని పోషించే క్రియలను నిర్వహిస్తుంది; కానీ, సామాజిక రూపం మారినప్పుడు ఒక సంస్కృతినుండి మరొక సంస్కృతికి జరిగే చారిత్రక

పరివర్తనను యిది నిరాకరించదు. సంస్కృతిని గురించి తద్వ్యతిరేకంగా, అచారిత్రకంగా చూసే దృక్పథం చారిత్రక వాస్తవాలకు విరుద్ధంగా వుంది.

రెండు, యీ అభిప్రాయాలలో జాతితత్వానికీ, వలసవాద భావజాలానికీ వ్యతిరేకమైన ప్రగతిశీల మానవతావాద అంశం వుంది. శత్రుత్వపూరిత సమాజంలో సంస్కృతులు సమాన మైనవనే భావం సంస్కృతీ వాహికలైన ప్రజలకు స్వతంత్రంగా బతికే హక్కు వుందని నిరూపిస్తుంది. యిది చాలా ముఖ్యమైనది; యెందుకంటే, పెట్టుబడిదారీ విధానపు వలస దోపిడీ వ్యవస్థ పీడిత జాతుల సంస్కృతియొక్క అణచివేతకూ, అప్పుడప్పుడు మొత్తం జాతులయొక్కా, వాటి సంస్కృతులయొక్కా విధ్వంసనానికీ దారి తీసింది. కానీ, సోషలిజం మరొక, అచ్చం మానవతావాదపు అవకాశాన్ని కలిగిస్తుంది. యీ అవకాశం ఆదిమ సంస్కృతు లను యధాతథంగా నిలిపి వుంచేది కాదు, వెనుకబడిన జాతులకు పురోగతినీ, వాటి ఆర్థిక వ్యవస్థకూ, సంస్కృతికీ అభివృద్ధినీ, ఆధునిక ప్రగతిశీల సంస్కృతితో వాటి సంపర్కాన్నీ కలిగించి, యీ సామాజిక సమస్యను పరిష్కరించడానికి తదనుగుణమైన పద్ధతులను రూపొం దించేది.

మూడు, యీ అభిప్రాయాలు సంస్కృతిపట్ల క్రియాగత వైఖరియొక్క ప్రాము ఖ్యాన్నీ, ఫలదాయకత్వాన్నీ, దానిని ఒక నిర్దిష్ట వ్యవస్థలో భాగంగా పరిగణించవలసిన అవస రాన్నీ మన దృష్టికి తెస్తాయి. చారిత్రక పద్ధతితో కలిసి యీ వైఖరి సామాజిక జ్ఞానంలో ఉపయోగించబడగల సాధనాల విస్తృతిని సంపన్నం చేస్తుంది.

కానీ, మొత్తంమీద పై అభిప్రాయాల వ్యవస్థ తప్పు; యెందుకంటే, అది సంస్కృతుల అద్వితీయతను పరమమైనదిగా చూసే ధోరణి వహించి, వాటి అభివృద్ధిని నిరాకరించి, చారిత్రక సాపేక్షవాదాన్ని సమర్థించింది.

సహజంగానే, ఆదిమ సంస్కృతులు మాత్రమే కాక, అంతకంటె అభివృద్ధి చెందిన సంస్కృతులు కూడా అద్వితీయమైనవే. కానీ, పురోగామి జాతులయొక్కా, ఆధునిక జాతుల యొక్కా, మొత్తం ప్రాంతాలయొక్కా నిజమైన సంస్కృతులు యే విధంగానూ ముకు ళితమైనవీ, యేకాకివీ కావు. చరిత్రలో, సంస్కృతులు రూపుదాల్చడమూ, అభివృద్ధి చెందడమూ అనేవి యెల్లప్పుడూ భిన్న సంస్కృతుల ఘర్షణా, పోరాటమూ, యెదురుపాటూ లాంటి పరస్పర ప్రవేశమూ, పరస్పర ప్రభావమూ అనే క్లిష్ట క్రమాలతో కలిసి జరిగినాయి. పెట్టుబడిదారీ వ్యవస్థలో కూడా, సామాన్య అంశాలు అభివృద్ధి చెందడమూ, సంస్కృతులు అంతర్జాతీయం కావడమూ అనే ధోరణికి యెంతైనా అవకాశం వుంది. ఆధునిక పరిశ్రమల యొక్కా, శాస్త్రవిజ్ఞానంయొక్కా అభివృద్ధీ, వార్తా రవాణా సాధనాలూ, అంతర్జాతీయ శ్రమ విభజనా, ఆర్థిక సంబంధాల పెరుగుదలా, జనాభాయొక్క పెరుగుతున్న చలనశీలతా,

సాంస్కృతిక సంపర్కాలూ సంస్కృతిని అంతర్జాతీయం చేయడానికి తోడ్పడే శక్తివంత మైన అంశాలు. యీనాడు సాంకేతిక సాధనాల మూలంగా యే సాంస్కృతిక విజయాన్నైనా స్వల్ప కాలంలో సమస్త మానవజాతికీ లభ్యం చేయడం సాధ్యమౌతున్నది. అందువల్లనే, ఆ సాంకేతిక సాధనాలు యెవరి అదుపులో వున్నదీ, యెలాంటి సంస్కృతి వ్యాప్తి చేయ బడుతున్నదీ తెలుసుకోవడం ముఖ్యం. ఆర్థిక వ్యవస్థలో లాగే సంస్కృతీ రంగంలో, పెట్టు బడిదారీ వ్యవస్థలో అంతర్జాతీయకరణ జరిగే ధోరణిలో వర్గ వైరుధ్యంయొక్కా, జాతీయ వైరుధ్యంయొక్కా చిహ్నాలు వున్నాయి, యీ సందర్భంలో పీడిత జాతుల సంస్కృతిని అణచివేయడమూ, ధ్వంసం చేయడమూ, వాటిమీద బూర్జువా సాంస్కృతిక ప్రమాణాలను రుద్దడమూ అనేవాటికి చెందిన చిహ్నాలు వున్నాయి. సంస్కృతికి చౌకబారు నకిలీలైన వర్తకపు జాజ్ సంగీతమూ, హింసాపూరితమైన సినిమాలూ, వగైరాలు విస్తృతంగా వ్యాప్తి కావడం మనం చూస్తున్నాం. నిజమే, పెట్టుబడిదారీ వ్యవస్థలో కూడా ప్రజాస్వామిక మైన, అచ్చం మానవీయమైన సంస్కృతి అభివృద్ధి చెందడమూ, వ్యాప్తిచెందడమూ కొన సాగుతున్నది; కానీ ఆధిపత్యపు జాతులకూ, పీడిత జాతులకూ మధ్య గల వైరుధ్యం సంస్కృతి అంతర్జాతీయం కావడానికి అడ్డంకులు కలిగిస్తున్నది. సోషలిజంలో మాత్రమే, జాతుల మధ్య గల శత్రు సంబంధాలనుండి ఉత్పన్నమయ్యే అడ్డంకులు తొలగిపోవడంతో, సోషలిస్టు జాతుల సంస్కృతి అంతర్జాతీయం కావడం శరవేగంతో సాగుతుంది.

సంస్కృతుల అద్వితీయతను, మనం గమనించినట్లు (చూ: ప్రకరణం నాలుగు) చారిత్రక క్రమంలోకి వైవిధ్యాన్ని ప్రవేశపెట్టేటట్టిదాన్ని, శూన్యవాద దృష్టితో నిరా కరించకూడదు, దానిని పరమమైనదిగానూ మార్చకూడదు; అలా చేస్తే ప్రపంచ చారిత్రక క్రమంలోని సుసంబద్ధతను నిరాకరించడ మౌతుంది. అలాంటి వైఖరి ఓస్వాల్డ్ స్పెంగ్లర్ రచించిన "యూరప్ క్షీణత"లోనూ, ఆర్నాల్డ్ టోయ్న్బీ రచించిన "చరిత్ర అధ్యయనం" లోనూ వ్యక్తం చేయబడిన తాత్విక చారిత్రక భావాలలో నిరూపితమైంది. యీ గ్రంథాలు కొన్ని ముఖ్యమైన విషయాలలో విభేదిస్తాయి, కానీ వీటిలో ఒక భావం సామాన్యమైనది వుంది; యేమిటంటే, మానవజాతి చరిత్ర విలక్షణమైన, ముకుళితమైన, అద్వితీయమైన "స్థానిక సంస్కృతుల" (టోయ్న్బీ వాటిని నాగరికత అంటాడు) చరిత్రచేత యేర్పడుతుందనీ, వాటికి సొంత జీవితమూ, నిర్దిష్ట అభివృద్ధి వలయమూ వున్నాయనీ, అవి ఒకదాని కొకటి సమాంతరంగా వుంటాయనీ అనే భావం. స్పెంగ్లర్ ప్రకారం అలాంటి సంస్కృతులు 8 వున్నాయి, టోయ్న్బీ ప్రకారం 26. పర్యవసానంగా, ప్రపంచ చరిత్రలో నిజమైన ఐక్యత యేదీ లేదనడానికి యిద్దరూ సంస్కృతీ భావాన్ని ఉపయోగించుకుంటారు. కానీ, ప్రపంచ చరిత్ర వైవిధ్యం గల యేకత్వం, యేకత్వం లేని వైవిధ్యం కాదు. చరిత్రకు యేకైక మూలం

వుందనే విషయాన్ని టోయ్న్బీ పూర్తిగా నిరాకరించని మాట నిజమే, కానీ ఆ మూలం అతనికి ప్రపంచ మతం యేర్పడి, అభివృద్ధి చెందడంలో కనబడుతుంది, చారిత్రక యాథార్థ్యంలో కాదు. సామాజిక రాజకీయ స్థాయిలో యివి రెండూ మార్క్సిజానికీ, కమ్యూనిజానికీ వ్యతిరేకం.

యీవిధంగా మనకు చరిత్రలో వివిధ సంస్కృతులు వున్నాయి. యివి భిన్న జాతులకు చెందిన స్థానిక మానవ సంఘాలలో యేర్పడి, ఆ ప్రజల చరిత్రయొక్కా, నిర్దిష్ట భౌగోళిక, సామాజిక పరిసరాలలో వాళ్ల జీవితంయొక్కా ముద్రను కలిగివుంటాయి. ప్రగతిశీల ప్రపంచ సంస్కృతిలో యీ వివిధ సంస్కృతులన్నీ వుంటాయి, కానీ అది కేవలం వాటి వెరసి మొత్తం కాదు; యెందుకంటే, తన అభివృద్ధిలో అది అన్నిటినీ మించి సార్వత్రిక మానవీయ ప్రాముఖ్యం గలదానినీ, సార్వత్రికంగా అంగీకరింపబడగలదానినీ యేరుకొని, అది యెక్కడ యే నిర్దిష్ట సంస్కృతిలో పుట్టిందనేదానితోనూ, యే విశిష్ట పరిస్థితుల ప్రభావం కలిగి వుందనేదానితోనూ నిమిత్తం లేకుండా దానిని నిలుపుకుంటుంది. భవిష్యత్తులో, కమ్యూనిజం ప్రాతిపదికమీద ఒకే సంస్కృతి గల అవిభజిత మానవజాతి యేర్పడేటట్లు కనపడుతుంది; ఆ సంస్కృతిలో మానవజాతి సామాజిక సాంస్కృతిక అభివృద్ధికి చెందిన దీర్ఘ, వైవిధ్య పూరిత చరిత్రలోని ఉత్తమ విజయాలు చేరివుంటాయి. అంతవరకు, సంస్కృతుల వైవిధ్యం సామాజిక సిద్ధాంతంలోనూ, వాస్తవ జీవితంలోనూ పరిగణించవలసిన యాథార్థ్యంగా నిలిచివుంటుంది.

సంస్కృతికీ, ఒక నిర్దిష్ట చారిత్రక సంఘానికీ (తెగకు గానీ, ప్రజానీకానికి గానీ, జాతికి గానీ, చివరకు ఒకే విధమైన సంస్కృతి గల ప్రజానీకాల బృందానికి గానీ) మధ్య గల లంకెలు సంస్కృతికి ఒక విలక్షణమైన <u>రూపం</u> యివ్వగా, నిర్దిష్ట సామాజిక వ్యవస్థతోనూ, వర్గ ప్రయోజనాలతోనూ, వర్గైరాలతో సంస్కృతికి గల లంకెలు దానికి నిశ్చితమైన ఒక <u>భావజాల సారాన్నీ, ధోరణినీ</u> యిస్తాయి. ప్రతి సామాజిక నిర్మాణమూ ఒక ప్రమాణాల, విలువల వ్యవస్థను ఉత్పన్నం చేస్తుంది; దానిని అనుసరించడానికి నిర్దిష్ట ఆదేశాలూ, సామాజిక అజమాయిషీ, విద్యా పద్ధతులూ, వగైరాల ఆసరా వుంటుంది. శత్రుత్వపూరిత సమాజంలో ఆ సమాజంలో పెత్తనం వహించే వర్గంయొక్క ప్రయోజనాలను తీర్చే ప్రమాణాల వ్యవస్థ ప్రాబల్యంలో వుండడం మనకు కనపడుతుంది. దీనికి భిన్నంగా, పీడిత వర్గం తన సొంత ఆదర్శాల, ప్రమాణాల, విలువ గీటురాళ్ల, ప్రవర్తన సూత్రాల వ్యవస్థను ఉత్పన్నం చేస్తుంది. యీ సందర్భంలో లెనిన్ చెప్పినాడు, <u>శత్రుత్వపూరిత సమాజానికి చెందిన ప్రతి జాతీయ సంస్కృతిలోనూ రెండు సంస్కృతులు వున్నాయని: పాలకవర్గపు బూర్జువా సంస్కృతీ, పీడిత వర్గపు ప్రయోజనాలతో ముడివడిన ప్రజాతంత్ర, సోషలిస్టు సంస్కృతి</u>

యొక్క అంశాలూ.* సంస్కృతియొక్క భావజాల ధోరణిని మహా కచ్చితంగా ప్రతిబింబించే యీ లెనిన్ సూత్రంమీద సంస్కరణవాదులూ, దక్షిణపక్ష రివిజనిస్టులూ దాడిచేస్తారు. వీళ్ల బూర్జువా సంస్కృతిని నిర్విమర్శగా అంగీకరించాలంటారు. సాంస్కృతిక విషయాలను అంచనా వేయడంలో వీళ్ల వర్గ వైఖరిని విసర్జించినారు, యేది లేకుండా సంస్కృతిని శాస్త్రీయంగా పరిశీలించడం అసాధ్యమో దానిని. గతకాలపు సంస్కృతిని, బూర్జువా సంస్కృతితో సహా, సవిమర్శగా జీర్ణం చేసుకొనే సమస్యను వాళ్ల వైఖరి దాటవేస్తుంది. కార్మిక వర్గం ప్రగతి వ్యతిరేకమైన సంస్కృతినీ, బూర్జువావర్గ పాలనను పోషించడానికి ఉపయోగించబడే సామాజిక సాధనాలతో సజీవంగా ముడివడినదానినీ నిరాకరించాలి; కానీ, అచ్చమైన సాంస్కృతిక విజయాలన్నీ విశ్వజనీన మానవ సాంస్కృతిక వారసత్వంలో భాగమే, నూతన, సోషలిస్టు సమాజపు సంస్కృతిని సృష్టించడంలో వాటిని పూర్తిగా ఉపయోగించుకోవాలి. అందుకనే, లెనిన్ యువజనులకు ఉపన్యసిస్తూ, ''మానవజాతి సృష్టించిన సమస్త నిధుల జ్ఞానంతో మనస్సును సంపన్నం చేసుకున్నప్పుడు మాత్రమే యెవడైనా కమ్యూనిస్టు కాగలడు''** అన్నాడు.

భావజాల ధోరణిలో, సోషలిస్టు సమాజపు సంస్కృతి బూర్జువా సమాజంలోని ఆధిపత్యపు సంస్కృతికి వ్యతిరేకమైనది, కానీ అది రూపుదాలుస్తూ, అభివృద్ధి చెందే కొద్దీ, మానవజాతియొక్క గత కాలపు చరిత్రలో గొప్ప సాంస్కృతిక వారసత్వంయొక్క విలువైన అంశాల నన్నిటినీ లీనం చేసుకుంటుంది. గతకాలపు సాంస్కృతిక వారసత్వాన్ని ఉపేక్షించి, సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీచేత ''కార్మికవర్గ సంస్కృతి''ని ఉత్పత్తి చేయించాలని కొందరు కుహనా విప్లవకారులు చేసిన ప్రయత్నాలు వాళ్ల అజ్ఞానానికి సాక్ష్యమనీ, నిరర్థకమనీ లెనిన్ అన్నాడు. రష్యాలో అక్టోబర్ విప్లవం తర్వాత ఆయన సాంస్కృతిక విప్లవాన్ని నిర్వహించే కర్తవ్యాలు పెట్టినాడు; అప్పటి సాంస్కృతిక స్థాయిని అందుకోడానికీ, సవిమర్శగా దానిని జీర్ణం చేసుకోడానికీ జనాలకు తోడ్పడడమూ, ఆ ప్రాతిపదికమీద సోషలిస్టు సమాజానికి ఉచితమైన సంస్కృతిని సృష్టించడమూ దానిలోని భాగాలు. యీ విషయాన్ని ప్రత్యేకంగా నొక్కిచెప్పాలి; యెందుకంటే, మావోసేటుంగ్ ప్రకటించిన ''మహత్తర సాంస్కృతిక విప్లవం'' గతకాలపు సాంస్కృతిక వారసత్వంపట్ల లెనినిస్టు వైఖరితో పూర్తిగా తెంచుకుంది గనుక. యీ ''విప్లవం'' పేరుకు మాత్రమే సాంస్కృతికం, పూర్తిగా భిన్నమైన ప్రయోజనాలకు యిది ఉద్దేశింపబడింది. చైనాలో యిది ''మహా నాయకుని భావాల''

---

* చూ: V. I. Lenin, *Collected Works*, Vol. 20, పుట 24.

** వి. ఐ. లెనిన్, ''యేరిన రచనలు,'' నాల్గవ భాగం, మాస్కో, పుట 130.

చ్చటానికి వెలుపల వుండిన సమస్త సంస్కృతిపట్లా పూర్తిగా శూన్యవాదపు వైఖరిని ప్రదర్శించింది; అందువలన చైనాలోని యువ తరంయొక్క సాంస్కృతిక అభివృద్ధికీ, తత్ఫలితంగా మొత్తం దేశానికీ అపారమైన హాని జరిగింది. సంస్కృతి అభివృద్ధి చేయబడడానికి బదులు, ధ్వంసం చేయబడింది, జనాలను నూతన సాంస్కృతిక స్థాయికి లేవనెత్తడానికి బదులు, వాళ్లతో మావో వేదంలోని సూత్రాలను కంఠపాఠం చేయించినారు, నూతన మేధావి వర్గాన్ని రూపుదిద్దడానికి బదులు, లక్షలమంది యువతీ యువకులకు యేడాది పొడుగునా విద్యాభంగమూ, వృత్తి యోగ్యతల స్థాయిలో తీవ్రమైన పతనమూ, ప్రతిభో న్నతి ప్రతి మేధావినీ అవమానించడమూ, మేధావులను వేటాడడమూ జరిగినాయి. మావో "సాంస్కృతిక విప్లవం"యొక్క దురదృష్టకర ఫలితాలు యివి; వీటి ప్రభావం కొన్ని తరాల చైనా యువజనుల సాంస్కృతిక అభివృద్ధిమీద వుంటుంది.

యీ అనుభవం తెలిపేదేమిటంటే, వివిధ సాంస్కృతిక విషయాల విశిష్ట లక్షణాలనూ వాటిలోని వర్గ అంశాలకూ, విశ్వజనీన మానవీయ అంశాలకూ మధ్య గల సంబంధాన్నీ దృష్టిలో పెట్టుకొని, వర్గతత్వానికీ, భావజాల ధోరణికీ, పార్టీ వైఖరికీ చెందిన భావాలను సంస్కృతిపట్ల నిర్దిష్టంగా అన్వయించాలి. గతకాలపు సంస్కృతి సంతతినీ (ప్రగతిశీల సంస్కృతితో సహా) "పరాయి వర్గా"నికి చెందినదిగా యాంత్రికంగా నిరాకరిస్తే కలిగే ఫలితాలు యేమిటంటే, పార్టీ మూత్రాన్ని అప్రతిష్ట పాల్జేయడమూ, మానవతా విలువలను నిరాకరిస్తున్న ప్రొఫెసర్ల గడ్డాలు పట్టి గుంజుతున్న సాంస్కృతిక స్మారకాలను ధ్వంసం చేస్తున్న, పుస్తకాలూ, చదరంగం పలకలూ తగులబెట్టుతున్న హుంగ్‌వెయ్ పింగ్‌ల ఉన్మత్తపు గుంపును తయారు చేయడమూ.

సంస్కృతీ, వ్యక్తీ

సంస్కృతి అనేది సామాజిక వ్యవస్థగా యేర్పడే యితర సాంస్కృతిక విషయాలనుండి వేరుచేయబడగల నిర్దిష్ట సామాజిక విషయం కాదు. సామాజిక జీవితపు పాదార్థిక, సాంకేతిక, సామాజికార్థిక, ఆత్మిక రంగాలు కాక భిన్నంగా సాంస్కృతిక రంగం ఒకటి వుందని గానీ, సంస్కృతి లేకుండా సామాజిక జీవితపు యే రంగమైనా వుండగలదని గానీ అనుకోవడం తప్పు. అందుకనే మేము సమాజంయొక్క సంస్కృతిని గురించీ, వివిధ సామాజిక బృందాల సంస్కృతిని గురించీ మాట్లాడినాము. కానీ, వ్యక్తియొక్క, వ్యక్తిత్వంయొక్క, సంస్కృతికి చెందిన సమస్యను పరిగణించకుండా, సమాజానికీ, సంస్కృతికీ మధ్య గల సంబంధంయొక్క

పరిశీలన పూర్తి కాదు. యీ సమస్యకు రెండు పార్శ్వాలు వున్నాయి. మొదటిది ప్రతి వ్యక్తి యొక్క మానవ మనుగడకూ (కేవలం జంతువు లాంటి మనుగడకు కాదు), అభివృద్ధికీ గల పరిస్థితులకూ, అవకాశాలకూ చెందినది; రెండవది ఫలానా వ్యక్తి యే మేరకు సంస్కృతితో సంపర్కం కలిగి, యే మేరకు సామాజిక పరిస్థితులకు అనుగుణంగా ఆలోచించడానికీ, జీవించడానికీ, వ్యవహరించడానికీ సామర్థ్యం కలిగి వున్నాడనేదానికి చెందినది. సంస్కృతి అనేది వ్యక్తియొక్క సామాజికీకరణలోని సంయోజిత గుణం, మానవుని వ్యక్తిగత అభివృద్ధి స్థాయికి కొలమానం, అతని ఆలోచనల, చర్యల విధానంతోనూ, అతని వ్యక్తిగత ప్రవర్తనకూ, వివిధ సన్నివేశాలపట్ల ప్రతిస్పందనకూ చెందిన నమూనాలతోనూ సంబంధం గలది. అందువల్లనే, వస్తుగతంగా అభివృద్ధి చెందే వ్యవస్థగా సమాజాన్ని అధ్యయనం చేయడంనుండి, కోటానుకోట్ల మానవుల కార్యాచరణ ఫలితంగా మనుతూ, అభివృద్ధి చెందే అదే సమాజాన్ని అధ్యయనం చేయడానికి మనం మారేటప్పుడు "సంస్కృతి" అనే భావాన్ని ప్రవేశపెట్టవలసిన అవసరం వుంది.

కానీ, మరొక సందర్భంలో సంస్కృతి సంయోజిత భావంగా కూడా వెల్లడి అవుతుంది. మానవుల కార్యకలాపాలలో సంస్కృతియొక్క వివిధ వ్యక్తీకరణలకు అది వ్యాపిస్తుందనే సందర్భంలో. ఒకే రకమైన పరిస్థితులలో మనుషులు తమ అభివృద్ధి స్థాయినీ, అనాటి ఆచరణ పరిస్థితులను తాము యే మేరకు కరతలామలకం చేసుకొన్నారనేదానినీ గుణ నిర్ధారణ చేసే భిన్న కార్య విధానాలను అవలంబించవచ్చు. మరొక విధంగా చెప్పాలంటే, వ్యక్తి యొక్క కార్యాచరణ భిన్న శ్రమ సామర్థ్యాన్నీ, ప్రవర్తనయొక్క నాగరిక స్వభావాన్నీ, వాక్కుకూ, ఆలోచనకూ చెందిన సంస్కృతినీ వ్యక్తం చేస్తుంది.

నిర్దిష్టమైన రకం కార్యాచరణ ప్రాతిపదికమీద రూపుదాల్చి, సంస్కృతికి ఉపకరించే సాంస్కృతిక అంశాల వెరసి మొత్తాన్ని సాంస్కృతిక సంకీర్ణకం అనవచ్చు. ఆవిధంగా, నిర్దిష్ట సమాజానికి విలక్షణంగా వున్న వ్యవసాయ ఉత్పత్తి సాధనాల, అన్నిటినీ మించి శ్రమ పరికరాల, ప్రాతిపదికమీద విలక్షణమైన వ్యవసాయపు మొత్తం సంకీర్ణకం రూపు దాలుస్తుంది. కనుక, ఆర్థిక రంగాన్నీ, దానికి సంబంధించిన కార్యాచరణ రకాలనూ వెల్లడించడంద్వారా మనం ఆ విలక్షణమైన వ్యవసాయాన్నీ, చేతిపనుల సంస్కృతినీ, పారిశ్రామిక ఉత్పత్తి సంస్కృతినీ, వగైరాలను వెల్లడించగలం. భిన్న సామాజిక సంస్థల చట్రం లోపల జరిగే ప్రవర్తనకూ, కార్యాచరణకూ చెందిన విలక్షణమైన సంస్కృతిచేత సామాజిక రాజకీయ సంబంధాల రంగం నిర్ణయింపబడుతుంది. రోజువారీ జీవితానికీ, సేవలకూ చెందిన రంగం రోజువారీ సంస్కృతినీ, సేవా సంస్కృతినీ ఉత్పన్నంచేస్తుంది. చివరి విషయంగా, భాషనూ, వాక్కునూ, రచననూ నేర్చుకోవడంలోనూ, అనుభూతులను పోషించడంలోనూ,

ఆలోచనా శక్తిని అభివృద్ధి చేయడంలోనూ దాని సొంత సాంస్కృతిక వ్యక్తీకరణలు ఆత్మిక కార్యాచరణ రంగంతో ముడివడి వున్నాయి. మనసులో పెట్టుకోవలసింది యేమిటంటే, ఆలోచనా సంస్కృతి కేవలం కంఠపాఠం చేయవలసి వున్న తార్కిక నియమాల మొత్తం కాదు — యివి లేకుండా అది దురూహ్యమే అయినప్పటికీ. ఆలోచనా సంస్కృతి జ్ఞానం, నైపుణ్యాలు, అనుభవం అనేవాటి సమ్మేళనం; అది స్వతంత్రమూ, విమర్శనాత్మకమూ, స్థిరమూ, కఠినమూ, కచ్చితమూ, వగైరాగా వున్నప్పుడు అది ఒక ఆలోచనా విధానంలో వ్యక్తమౌతుంది. కార్యాచరణ మాత్రమే ఆలోచనా సంస్కృతియొక్క విలువను నిర్ణయించ డానికి వీలు కలిగిస్తుంది — యే యితర రకం సంస్కృతియొక్క విలువనైనా నిర్ణయించ డానికి వీలు కలిగించినట్లే. అందువల్లనే, మధ్యయుగాల నాటి మత మౌఢ్యంయొక్కా, జన సమూహపు బోలాతనంయొక్కా, కండ్లు గానని ఆగ్రహంయొక్క వ్యక్తీకరణలు మనకు యెదురైనప్పుడు, వీటిని ఆలోచనా, ప్రవర్తనల సంస్కృతిలో హీన స్థాయికి సాక్ష్యంగా మనం పరిగణించడం సమర్థనీయమే.

ప్రతి నిర్దిష్ట కాలంలో నిర్దిష్ట దేశంలోని సంస్కృతి ((శ్రమ, ప్రవర్తన, వాక్కు, వగైరాల సంస్కృతి)యొక్క వివిధమైన వ్యక్తీకరణలు ఒక యేకకృత సమస్తాన్ని — సాంస్కృతిక సంకీర్ణకాన్ని — యేర్పరుస్తాయి. దీని అంశాలు తమ ఉమ్మడి క్రియాగత కర్తవ్యాల చేతా, అవి నిర్దిష్ట వ్యక్తిలో గానీ, సమాజంలో గానీ సమష్టి బృందంలో గానీ, వ్యక్తమౌతాయనే విషయంచేతా ఒకటిగా కూర్చబడుతాయి. సాంస్కృతిక వ్యవస్థను గట్టిపరచి, దాని ప్రాతి పదికను నిర్ణయించేది యేమిటంటే, శ్రమ సాధనాల అభివృద్ధిలోని నిర్దిష్ట స్థాయి వ్యక్తి మీద చేసే డిమాండ్లు. ఆవిధంగా, "యంత్ర నాగరికత" డిమాండు చేసేది కొత్త సాంకే తిక జ్ఞానాన్నీ, అనుభవాన్నీ మాత్రమే కాదు, మనుషుల మధ్య కొత్త రకం సంబంధాలనూ, కొత్త ఆలోచనా విధానాలనూ, కొత్త దృక్పథాలనూ కూడా — ఉత్పత్తినుండి ఉత్పన్నమయ్యే తక్షణ కర్తవ్యాలను గురించి మాత్రమే కాదు, మానవ జీవితంలోనూ, కార్యాచరణలోనూ గల సాధారణ పార్శ్వాలకూ, ప్రపంచంలో మానవుని స్థానానికీ, ఆ ప్రపంచంమీద అతని ప్రభావంయొక్క స్వభావానికీ సంబంధించిన అనేక సమస్యలను గురించి కూడా.

కానీ, వ్యక్తియొక్క సంస్కృతి, తన జంతు మూలాలనుండి అతని ఉద్ధరణయొక్క కొలమానంగా, అతని "మానవీకరణ"యొక్క కొలమానంగా, సామాజిక సంబంధాలమీదా, అతని సమాజంమీద పెత్తనం వహిస్తూ, నిర్దిష్ట సమాజంలోని మానవుల ఆలోచనా, ప్రవర్తనల విధానాన్ని నిర్ణయిస్తూ వుండే ప్రపంచ దృక్పథంమీదా కూడా ఆధారపడుతుంది. ఆవిధంగా, నాజీ జర్మనీలోని జర్మన్ల జ్ఞానంయొక్కా, సాంకేతిక నైపుణ్యాలయొక్క ప్రమాణం గతంలోకంటె యేమీ తక్కువ కాకపోగా, ఫాసిజంయొక్క, ప్రత్యేక జాతితత్వపు

భావజాలంయొక్క పెత్తనం ఫలితంగా దారుణమైన సాంస్కృతిక పతనమూ పశు బలానికీ, మానవతా వ్యతిరేక నీతికీ చెందిన వెర్రి మతం వ్యాపించడమూ, మానవద్వేష భావజాలమూ, ఆచరణా కలిగినాయి.

మావోయిస్టు చైనాలో మానవతావాదం "బూర్జువా భావజాలం"గా ప్రకటింపబడింది; మానవతావాద విలువలనూ, ప్రమాణాలనూ ద్వేషించాలనీ, యేవగించుకోవాలనీ, సోషలిస్టు మానవతావాదం ఉనికిని నిరాకరించాలనీ బడిపిల్లలకూ, కళాశాల విద్యార్థులకూ బోధిస్తున్నారు.

నిర్దిష్ట సమాజంలోని సాంస్కృతిక స్థాయే ఆ సమాజంలోని వ్యక్తుల సంస్కృతిని స్వయంగతంగా నిర్ణయించదు. అది సాధారణ ప్రమాణాలకంటె యెక్కువగానూ వుండవచ్చు, తక్కువగానూ వుండవచ్చు. శత్రుత్వపూరిత సమాజంలో సాంస్కృతిక అభివృద్ధి స్థాయిలలో అంతరం వుంటుందనీ, ఒక సమాజంయొక్క, లేదా వ్యక్తియొక్క సాంస్కృతిక స్థితిని "ఆటవిక," "అనాగరిక," "హీన," "ఉన్నత," సంస్కృతి వగైరా భావాలతో వర్ణించడం సరైనదనీ చెప్పడానికి తగిన ఆధారం వుంది.

యీ సాంస్కృతిక అంతరానికి, యీ సాంస్కృతిక అన్యధాకరణకు, కారణం యేమిటంటే, శ్రామిక ప్రజల పీడిత ప్రతిపత్తి, సాంస్కృతిక విజయాలను పాలకవర్గాలు గుత్తగొని, తమ ఆధిపత్యాన్ని నిలుపుకోడానికి వినియోగించడం. సమాజం అభివృద్ధి చెందేకొద్దీ, ఉదాహరణకు ఫ్యూడలిజంనుండి పెట్టుబడిదారీ వ్యవస్థకు మారేకొద్దీ, యెక్కువ మంది ప్రజలు బడికి పోతారు గనుక, మనుషులు వివిధ రకాల కార్యకలాపాలను నేర్చుకుంటారు గనుక, జనాల సగటు సాంస్కృతిక స్థాయి పెరిగే మాట నిజమే, కానీ సాంస్కృతిక అంతరం అలాగే వుంటుంది.

బూర్జువా సిద్ధాంతకారులు అలాంటి అంతరానికి సిద్ధాంత ఆధారాన్ని సమకూర్చడానికీ, దానిని సమర్థించడానికీ ప్రయత్నిస్తారు. ఉన్నత సంస్కృతి జనాలలో వ్యాపిస్తే, అచ్చమైన సంస్కృతి క్షీణిస్తుందనీ, ధ్వంసమౌతుందనీ వాళ్లు వాదిస్తారు. అందువలన సంస్కృతికి ప్రమాదం జనాలనుండి వస్తుందనీ, కనుక సంస్కృతి అనేది యెప్పుడూ సామూహికంగా వుండజాలదనీ వాళ్లు అంటారు.

మార్క్సిజం యీ అప్రజాతంత్ర భావానికి పూర్తిగా భిన్నమైన సిద్ధాంత స్థావరం తీసుకుంటుంది. శత్రుత్వపూరిత సమాజం తొలగిపోవడంతో జనాల సాంస్కృతిక స్థాయి పెరగడానికి గల అడ్డంకులన్నీ తొలగిపోతాయి. సంస్కృతి సమస్త మానవాళికీ చెందినది, ప్రతి వ్యక్తికీ తన యుగంలోని సాంస్కృతిక స్థాయికి పెరిగే యోగ్యత వుంది. యీ ప్రయోజనం నెరవేరేది సామాజికార్థిక కర్తవ్యాల నిర్వహణద్వారా—మానసిక శ్రమకూ, శారీరక శ్రమకూ

మధ్యా, పట్టణానికీ, గ్రామానికీ మధ్యా గల వైరుధ్యాలనూ, యిప్పుడున్న విభేదాలను అధిగమించడమూ, ఉత్పత్తియొక్క సమగ్ర యాంత్రికీకరణా, స్వయంచలనమూ, సామాజిక వర్గ విభేదాలను నిర్మూలించడమూ, కమ్యూనిస్టు సంస్కృతిని సృష్టించి, అభివృద్ధి చేయడమూ లాంటి చర్యలద్వారా. వ్యక్తియొక్క సర్వతోముఖ అభివృద్ధికీ, వివిధ సామాజిక రంగాలలో స్వేచ్ఛగా వ్యవహరించే సామర్థ్యం గల సృజనాత్మక వ్యక్తిత్వాన్ని రూపుదిద్దడానికీ కమ్యూనిస్టు సంస్కృతి ప్రాతిపదిక, సాధనం. ప్రతి మానవునీ సమాజం సాధించిన సంస్కృతి యొక్క అత్యున్నత స్థాయికి యెత్తడం అవసరం. యిది సంస్కృతి అనేదానికే కొత్త అర్థాన్ని యిచ్చే మానవతావాద లక్ష్యం; యెందుకంటే, దీని కర్తవ్యం చొరవను ప్రదర్శించి, సృజనాత్మక కార్యాచరణలో నిమగ్నం కాగల వ్యక్తులను సామూహిక ప్రమాణంలో రూపు దిద్దడం.

యిది భావి అవకాశం. కానీ, జనాల సాంస్కృతిక స్థాయిని పెంచడంలో సోషలిజం యిప్పటికే ఘన విజయాలు సాధించింది. పాత రష్యాలో ప్రజానీకంలో మూడింట రెండు వంతులకు పైగా నిరక్షరులు. మరి, అక్షరాస్యత సాంస్కృతిక స్థాయికి సూచిక మాత్రమే కాదు, యే ఆధునిక సమాజంలోనైనా సాంస్కృతిక అభివృద్ధికి అవసరమైన సాధనం. యీ నాడు సోవియట్ యూనియన్ సార్వజనీన నిర్బంధ సెకండరీ విద్యను ప్రవేశపెట్టింది. దేశంలో గ్రంథాలయాలూ, పఠనాగారాలూ, నాటకశాలలూ, సినిమాలూ, రేడియోలూ, టెలివిజన్ సెట్లూ, పుస్తకాలూ, వార్తాపత్రికలూ, పత్రికలూ, ఔత్సాహిక కళా సంఘాలూ, సాంకేతిక క్లబ్బులూ, వీటి సంఖ్య అపారంగా పెరిగింది. మనుషుల మధ్య సంబంధాలు మానవతావాద ఆదర్శాలతోనూ, విలువలతోనూ నిండిన కొత్త రకం నీతిమీద ఆధారపడుతున్నాయి, ప్రజాతంత్ర సంస్థలూ, మొదలైనవి స్థిరంగా అభివృద్ధి చెందుతున్నాయి. సోవియట్ యూనియన్‌లో అచ్చమైన సాంస్కృతిక విప్లవం జరిగింది. అంటే, సోవియట్ యూనియన్‌కు యిక యే సమస్యలూ లేవని కాదు. కానీ, యీ చిత్రమైన పరిస్థితిని గమనించండి: కమ్యూనిస్టులను, యితర భౌతికవాదు లందరి లాగే, మానవుని ఆత్మిక జీవితాన్ని తక్కువగా అంచనా వేసేవాళ్లనుగా బూర్జువా సిద్ధాంతకారులూ, తాత్వికులూ కొట్టిపారవేసినారు; కానీ, సమాజంయొక్కా, విశాలమైన జనాలయొక్కా సాంస్కృతిక అభివృద్ధికి దోపిడీ వర్గాలన్నీ శతాబ్దాల తరబడి చేసినదానికంటె కమ్యూనిస్టులు స్వల్ప చారిత్రక కాలంలో యెక్కువ చేసినారు.

ఆధునిక బహుళ ప్రచార సాధనాల అభివృద్ధి పెట్టుబడిదారీ వ్యవస్థలో కూడా శ్రామిక జనాలకు సంస్కృతిని అందుబాటులోకి తెచ్చిందని కొందరు అంటారు. యిది నిజమే, కానీ పాక్షికంగా మాత్రమే. పెట్టుబడిదారీ "జనతా సమాజా"న్నీ, దాని "జనతా సంస్కృతి"నీ

(mass culture) అధ్యయనం చేసే ప్రగతిశీల నాన్‌మార్కిస్టు సామాజిక శాస్త్రజ్ఞులు చెప్పే దేమిటంటే, అద్భుతావహమైన ఆధునిక బహుళ ప్రచార సాధనాలు – రేడియో, టెలివిజన్, పత్రికలూ, మొదలైనవి – జనాల సాంస్కృతిక అభివృద్ధికి బొత్తిగా ఉపయోగింపబడడం లేదని. "జనతా సంస్కృతి" అత్యధికంగా అసలైన సంస్కృతికి చౌకబారు నకిలీగా వుండి హీన, ఆదిమ కళా అవసరాలను తీరుస్తుంది (కళా సంస్కృతికి సంబంధించి). "జనతా సంస్కృతి"కి బాగా నిశ్చితమైన సామాజిక కర్తవ్యం వుంది; అది యేమిటంటే, మనిషిని సృజనాత్మక వ్యక్తిగా అభివృద్ధి చేయడం కాదు, జనాలను పాలకవర్గ ప్రయోజనాలకు అనుగుణంగా మలచడం. "జనతా సంస్కృతి" ప్రజాభిప్రాయాన్నీ, అనుభోగ వస్తువులపట్ల ఆపేక్షనూ, విలువ గీటురాళ్లనూ తీర్చిదిద్దుతుంది, తీవ్ర సామాజిక సమస్యల నుండి మనిషి దృష్టిని పక్కకు మళ్లిస్తుంది, అతని తీరిక సమయంలో కాలక్షేపం కలిగించి, అతన్ని క్రియారహితమైన సాంస్కృతిక అనుభోక్తనుగా మారుస్తుంది. అందుకనే, "జనతా సంస్కృతి" సారభూతంగా సాంస్కృతిక విలువలనుండి జనాలను అన్యధాకరించే మరింత నిగూఢమైన కొత్త మార్గం తప్ప మరేమీ కాదు, మనిషిని సృజనాత్మక వ్యక్తిగా అభివృద్ధి చేసే సాధనం కాదు. సంస్కృతి వర్గ ప్రయోజనాల కొరకు వినియోగింపబడుతున్న దనడానికి యిది మరొక నిదర్శనాన్ని సమకూరుస్తుంది; యెందుకంటే, జనాలను అభివృద్ధి చేయడంలో పెట్టుబడిదారీ వ్యవస్థకు యే ఆసక్తీ లేదు. వాణిజ్యం యెలా ప్రజల తీరిక రంగంలో ప్రవేశించి, కేవల వాణిజ్య పద్ధతులతో దానినుండి లాభం పొందేదీ యిది తెలుపుతుంది. సామాన్యుడు డబ్బు చెల్లించి, తన తీరిక సమయాన్ని గడపడానికి నిర్దిష్టమైన ప్రమాణాలను కొంటాడు, అవి అతన్ని సంతృప్తునిగా వుంచుతాయి. వాణిజ్యం అనుభోగపు డిమాండ్లను సృష్టించ బూనుకుంటుంది; బూర్జువా పరిసరావళీ, ఆత్మిక వాతావరణమూ, ప్రాబల్యంలో వున్న మనస్తత్వమూ కండ్లకు కనిపించకుండా రూపుదిద్దే కోరికలచేత యిది నిర్ణయింపబడుతుంది. అందుకనే, పెట్టుబడిదారీ విధానపు "జనతా సంస్కృతి" జనాల సాంస్కృతిక స్థాయిని పెంచే కర్తవ్యాలకు పరితూగలేదు, వాటికి సోషలిజం మాత్రమే సరితూగుతుంది.

నిజమే, పెట్టుబడిదారీ వ్యవస్థలో కూడా ప్రగతిశీల, ప్రజాతంత్ర సంస్కృతి అభివృద్ధి చెందుతుంది, కానీ యిది యేదో ఒక రూపంలో పెట్టుబడిదారీ వ్యవస్థపట్లా, దాని వివిధ సంస్థలపట్లా వ్యతిరేక, విమర్శనాత్మక వైఖరిని వ్యక్తం చేస్తుంది. యీ సంస్కృతికి గొప్ప భవిష్యత్తు వుంది; యెందుకంటే, పెట్టుబడిదారీ వ్యవస్థ మానవాళిని యే మొండిగోడల వద్దకూ, అంతర్వైరుధ్యాలలోకీ తరిమిందో, వాటినుండి బయటపడే మార్గాల అన్వేషణకు సంబంధించిన కార్యకలాపాలను యిది పెంపొందిస్తుంది.

కమ్యూనిస్టు ఉద్యమంయొక్క బలమూ, ప్రభావమూ యెక్కడున్నాయంటే, అది పరిణత సామాజిక సమస్యలను పరిష్కరించే మార్గాలను చూపడంలో వున్నాయి. గతకాలపు ఉత్తమ సాంస్కృతిక విజయాలకు తాను వారసురాలననీ, యీ నాడూ, భవిష్యత్తులోనూ యితోధిక సాంస్కృతిక పురోగతికి తాను సంరక్షకురాలిననీ కమ్యూనిజం అంతకంతకూ స్పష్టంగా నిరూపించుకొనే కొద్దీ, ఆ ఉద్యమంయొక్క బలమూ, ప్రభావమూ పెరగక తప్పదు.

ప్రకరణం ఆరు

చారిత్రక క్రమానికి కర్తలు (జనాలూ, వర్గాలూ, పార్టీలూ, అగ్రగణ్య వ్యక్తులూ)

మానవాళియొక్క మొత్తం చారిత్రక అభివృద్ధిని పరిశీలించడంలోనూ, ప్రపంచ చరిత్రయొక్క వస్తుగత తర్కాన్ని వెల్లడించడంలోనూ మేము మనుషుల యిచ్ఛతో సంబంధం లేకుండా చరిత్రలో ప్రతిదీ దానంతకది జరుగుతుందని ఎంత మాత్రం ఉద్ఘాటించడం లేదు. యిది సామాజిక చారిత్రక క్రమంలోని ఒక నిర్ణీత పార్శ్వంపట్ల ఒక వైఖరి మాత్రమే — ఒక సామాజిక వ్యవస్థ చారిత్రక క్రమంలో ఉన్నత దశ అయిన మరొక వ్యవస్థగా పరిణమించడమూ, రూపాంతరం చెందడమూ, పరివర్తన చెందడమూ అనేవాటి దృష్ట్యా దానిని వస్తుగత సామాజిక విషయంగా పరిగణించినప్పుడు అవలంబించే వైఖరి. సామాజిక వ్యవస్థలో అవశ్యమైన భాగంగా మానవుడూ, అతని కార్యాచరణా, చైతన్యమూ చేరి వున్నాయనీ, యీ కార్యాచరణలో మాత్రమే ఆ వ్యవస్థ వుండడమూ, పనిచేయడమూ, మారడమూ జరుగుతుందనీ అనే భావం యీ వైఖరిలో యిమిడి వుంది. యీ సామాజిక శాస్త్ర పరిశీలన విధానం చరిత్రను వస్తుగత ప్రకృతిసిద్ధ చారిత్రక క్రమంగా చూడడానికీ, దాని నియమాలను వెలికి లాగడానికీ తోడ్పడుతుంది. మార్క్స్ పెట్టుబడిదారీ ఉత్పత్తియొక్క అభివృద్ధినీ, దాని చారిత్రక ధోరణులనూ పరిశీలించినప్పుడు తన "పెట్టుబడి" గ్రంథంలో అత్యధికంగా ఉపయోగించింది ఆ విధానమే. కానీ, యీ పరిశీలన పార్శ్వం వెలికి తేబడింది గనుక, చారిత్రక క్రమంయొక్క కర్తను గురించిన పరిశీలననుండీ, యీ క్రమంయొక్క పరిశీలననుండీ ఉత్పన్నమయ్యే కొత్త సమస్యల పరిధిని పరిగణించవలసిన అవసరం యేర్పడుతుంది. చారిత్రక అభివృద్ధి నియమాల జ్ఞానం మన కిప్పటికే వుండగా, యీ సమస్యలలో మన మెందుకు ఆసక్తులం కావాలి? కారణాలు అనేకం. మొట్టమొదట, అలాంటి పరిశీలన చారిత్రక జ్ఞానార్జన క్రమంలో అవ

సరమైన అంశంగా ఉపకరిస్తుంది. చారిత్రక క్రమానికి కర్తను దాటవేసి, సాధారణ నియమాలనుండి నేరుగా నిర్దిష్ట చారిత్రక క్రమాన్ని వివరించడానికి పోవడం అసాధ్యం; యెందుకంటే, అప్పుడు చరిత్రకు సొంత వ్యక్తిత్వం అనేది వుండదు, లేదా మానవులు చారిత్రక ఆవశ్యకత చేత ఆడింపబడే కీలుబొమ్మలుగా మాత్రమే కనబడతారు. వాస్తవం యేమంటే, కర్త యీ ఆవశ్యకతయొక్క క్రియారహితమైన వాహనమో, వాహికో కాదు. వస్తుగత సామాజిక క్రమత్వాలు మానవుల కార్యాచరణా, పోరాటమూ, ఘర్షణా అనేవాటిద్వారా చారిత్రక ధోరణులుగా దారిచేసుకోవడం నిజమే అయినప్పటికీ, అవి యే విధంగానూ చరిత్రయొక్క నిర్దిష్ట గతిని ముందుగా నిర్ణయించవు. అందువల్లనే, సామాజిక జీవితపు భౌతిక పరిస్థితుల, వస్తుగత నియమాల సందర్భంలో చారిత్రక క్రమంయొక్క కర్తను — మానవుల ఆసక్తులనూ, ఉద్దేశాలనూ, ప్రయోజనాలనూ, వ్యవస్థీకరణ రూపాలనూ, వగైరాలను — అధ్యయనం చేయడం జ్ఞానార్జనలో అవశ్యమైన అంశం.

చారిత్రక క్రమానికి ప్రత్యేకంగా యెవరు కర్త అనేది తెలుసుకోడానికి, అన్నిటినీ మించి, సామాజిక జీవితంలో ఆత్మగత (కర్తృ) విషయానికీ, వస్తుగత (కర్మ) విషయానికీ మధ్య గల భేదాన్ని చూడడం అవసరం. యీ రెండు భావాలూ పరస్పర సంబంధం గలవి. కార్యాచరణలో వ్యక్తం చేయబడే చైతన్యయుత అంశంయొక్క వాహనంగా కర్త అనేది ఆ కార్యాచరణకు లక్ష్యమైన కర్మ కంటే, అది యే పరిస్థితులలో జరుగుతుందో ఆ పరిస్థితుల కంటే భిన్నమైనది.

ప్రకృతి పరిసరాల విషయంలో మొత్తం సమాజం సరిగా ఆ చైతన్యయుత అంశంయొక్క వాహనంగా వుంటుంది. కానీ, యేదో ఒక సామాజిక వస్తువు కార్యాచరణకు కర్మగా వున్నప్పుడు, కర్తను గురించిన యీ విశాల దృష్టి పనికి రాదు. అందువల్లనే, ఒక వ్యక్తి గానీ, సామాజిక బృందం గానీ సామాజిక చర్యకు కర్త కావచ్చు. యే సందర్భంలోనూ చర్యకు కర్తగా వ్యక్తిని ఉపేక్షించకూడదు. యెందుకంటే, మనం సమాజాన్ని మొత్తంగా పరిగణించినా, దాని బృందాలలో దేనినైనా పరిగణించినా, వ్యక్తి యెప్పుడూ అక్కడ వుంటాడు. కానీ, వ్యక్తిని సామాజిక ఆచరణయొక్క కర్తగా తీసుకుంటే, అతన్ని తక్కిన సమాజం కంటె, మానవ బాహుళ్యం కంటె, భిన్నంగా చూడాలి. అప్పుడు అనివార్యంగా యీ ప్రశ్న ఉత్పన్నమౌతుంది: యే పరిస్థితులలో వ్యక్తి చర్యలు సామాజిక ప్రాముఖ్యం కలిగి, సామాజిక జీవితంమీద దృగ్గోచరమైన ప్రభావం నెరపగలిగి వుంటాయి? వ్యక్తుల చర్యలు యేకమై, విస్తారమైన మానవ సముదాయాల — సామాజిక బృందాల — చర్యలుగా రూపాంతరం చెందినప్పుడు, సామాజిక ప్రాముఖ్యం గల ఫలితం కలుగుతుందని చారిత్రక అనుభవం తెలుపుతుంది. అంతేకాక, సమాజంమీదా, దాని అభివృద్ధిమీదా దృగ్గోచరమైన ప్రభావం నెరప

గలిగిన మనుషులు యెప్పుడూ తమ చేతులలో గొప్ప అధికారాన్నీ, పాదార్థిక బలాన్నీ సాంద్రీ కరించుకున్నవాళ్ళుగా గానీ, జ్ఞానానికీ, కళాత్మక కృషికీ, మొదలైనవాటికి చెందిన రంగాలలో కొత్త విజయాలు సాధించిన వ్యక్తులుగా గానీ వుండినారు. కొందరు ఈ విషయాలను పరమ నియమాలుగా పరిగణించి, సాధారణ మర్త్యుల సమూహం కంటె యెంతో ఉన్నతులైన మహాపురుషులు చరిత్రలోని ఆత్మగత సృజనాత్మక కార్యాచరణకు యేకైక మూలమనే సిద్ధాంతాలు సృష్టించినారు. ప్లూటార్క్ కాలంనుండి యీ భావంయొక్క వివిధ రూపాంతరాలు సామాజిక చైతన్యంలోకి యెక్కించబడి, యీ ప్రపంచపు పాలకుల అండదండలను పొందినాయి; యెందుకంటే, యిది వాళ్ల పరిపాలన హక్కును సమర్థించుకోడానికి తోడ్పడింది. థామస్ కార్లైల్ యీ భావాన్ని తార్కిక అంతం దాకా లాగి అసంబద్ధ విషయంగా మార్చినాడు; అతను ప్రపంచ చరిత్రను మహాపురుషుల జీవిత చరిత్రలుగా కుదించినాడు.

చరిత్రలో వ్యక్తుల పాత్రను అతిశయంగా చేయడంతో జనాల పాత్రను తగ్గించడం జరిగింది. యీ భావంలోని సైద్ధాంతిక బలహీనతలనూ, రాజకీయ హానినీ మార్క్సిజం వెల్లడించింది; అది జనాల విప్లవాత్మక స్వీయసృహను అభివృద్ధి చేయడం తన అత్యంత ముఖ్యమైన కర్తవ్యంగా యెంచింది. "అనుత్తేజిత సమూహం" కంటె భిన్నమైన "విమర్శనాత్మక మనస్కుడైన వ్యక్తి" చరిత్రకు కర్త అనే యువ హెగెలియన్లతో చేసిన వాదోపవాదాలలో మార్క్స్ వ్యక్తి ప్రాముఖ్యాన్ని నిరాకరించకుండానే, <u>నిజమైన చరిత్రను వ్యక్తులు కాదు, జనాలు నిర్మిస్తారని</u> రుజావుచేసినాడు. జనాలు చారిత్రక క్రియకు కర్మ మాత్రమే కాదు, కర్త కూడా, అనే విషయం చరిత్రయొక్క విప్లవాత్మక దశలలో ప్రత్యేక స్పష్టతతో వెల్లడి అవుతుంది. కొన్ని దశలలో జనాలను చరిత్రయొక్క కర్మగా చేసేది యేమిటంటే, దోపిడీ ఫలితంగా యేర్పడే జడత్వమూ, అధఃపతనమూ, అవమానమూ. కానీ, వాళ్ళు తమ ప్రయోజనాల కొరకు పోరాడడానికి లేచినప్పుడు, మొత్తం చారిత్రక గతిమీద వాళ్ల కార్యాచరణయొక్క ముద్ర పడుతుంది. అందువల్లనే, వ్యక్తిపూజ సిద్ధాంతపు భక్తులు చేసేటట్లు, చారిత్రక ఆచరణయొక్క కర్తను యేకపక్షంగా పరిగణించకూడదు. చారిత్రక సృజనాత్మకతయొక్క కర్త ప్రప్రథమంగా జనాలే; జనాల కార్యాచరణ సందర్భంలో మాత్రమే వ్యక్తి కార్యాచరణను సరిగా గ్రహించగలం.

జనాలు అంటే అస్పష్టమైన, ఆకారరహితమైన వస్తువులు కాదు. భిన్న సామాజిక బృందాలూ, సమూహాలూ, వర్గాలూ కలిసి జనాలు అవుతారు. అందువల్లనే, చరిత్ర కర్తలుగా మనుషుల — జనాల — కార్యాచరణను విడమరచడానికి, సామాజిక విభేదకరణయొక్క సారాన్నీ, కారణాలనూ, దాని పర్యవసానాలనూ స్పష్టపరచడం అవసరం.

సామాజిక విభేదకరణను గురించిన మార్క్సిస్టు అవగాహన <u>వర్గ సిద్ధాంతంమీద</u>

ఆధారపడుతుంది. యిది ప్రతి నిర్దిష్ట సమాజంలోనూ మానవుల మధ్య గల ముఖ్యమైన సామాజిక విభేదాలను వెలికితీయడానికీ, పరిశీలించడానికీ అవసరమైన పద్ధతిని సమకూరుస్తుంది; యిది ఆదిమ సమష్టి సమాజం విచ్ఛిన్నమైనప్పటినుండి మొత్తం చరిత్రకు అన్వయించే సిద్ధాంతం.

వర్గాల మధ్య గల సామాజిక భేదాలను కలిగించే కారణాలనూ, యీ భేదాల స్వభావాన్నీ నిర్ణయిస్తే తప్ప, పెద్ద మానవ బృందాల ప్రయోజనాలనూ, సంబంధాలనూ, పోరాటాలనూ, అభిప్రాయాలనూ తెలుసుకోలేము. అందువల్లనే, వర్గమూ, వర్గ సమాజమూ అనేవి లేకుండా, "సామాజిక వ్యవస్థ," లేక "సామాజిక నిర్మాణం" అనే భావం తగినంత నిర్దిష్టం కాదు, అని లెనిన్ రాసినాడు.*

చారిత్రక కార్యాచరణ కర్తను అర్థం చేసుకోడానికి వర్గ సిద్ధాంతం ప్రత్యేక ప్రాముఖ్యం గలది. నిజంగా, చరిత్ర అనేది మానవుల చరిత్ర అయితే, కోట్లాది మానవులు తమ ఆశయాల, చర్యల ఘర్షణలతోనూ, అడ్డదిడ్డాలతోనూ చరిత్రలో వ్యవహరిస్తే, అనివార్యంగా యీ ప్రశ్న యెదురౌతుంది: వ్యక్తుల చర్యల యీ అల్లకల్లోలాన్ని విడమరచడం యెలా? వ్యక్తుల చర్యలను సామాజిక అర్థం గలవాటినిగా, సామాజికంగా గమనించబడి, వివరించబడగలవాటినిగా కుదించడం యెలా? వర్గ సిద్ధాంతపు ప్రాముఖ్యం సరిగ్గా యేమిటంటే, అది వ్యక్తుల చర్యలను వేటి చర్యా ప్రతిచర్యలూ, పోరాటాలూ సామాజిక అభివృద్ధికి చోదక శక్తిని సమకూరుస్తాయో ఆ గొప్ప సామాజిక బృందాల (వర్గాల) చర్యలనుగా కుదిస్తుంది.**

సామాజిక విభేదకరణ సారాంశమూ, కారణాలూ. వర్గాలుగా సమాజ విభజన

జాతీ, సామాజిక అంతస్తూ, లింగమూ, వయసూ, వృత్తీ, విద్యా, ఆదాయమూ, అధికార స్థానమూ, మొదలైన కారణాల మూలంగా సమాజంలో మనుషుల మధ్య అనేక భేదాలు వున్నాయి. యీ అన్నిటి ఫలితంగా మనుషులలో తరతమ వ్యవస్థా, వివిధ సమూహాలూ,

---

* చూ: *Lenin Miscellany XI* ("లెనిన్ సంకలనం XI"), పుట 383.

** దీనికి వ్యతిరేకమైనది—సామాజిక చర్యనుండి వ్యక్తి చర్యకు పరివర్తన—కూడా సామాజిక జ్ఞానార్జనకు అవసరం (ప్రకరణం IX చూడండి).

సామాజిక బృందాలూ యేర్పడుతాయి. కానీ, సామాజిక విభేదాలు వీటిలో కెల్ల ముఖ్యమైనవి; యెందుకంటే, మనుషులు సామాజిక వర్గాలుగా విభజింపబడడం వలన అవి ఉత్పన్నమౌతాయి.

యే శత్రుత్వపూరిత సమాజంలోనైనా సామాజిక పొరలు వుండడం దాని సభ్యులకు యెల్లప్పుడూ తేటతెల్లంగా వుండింది. బానిస యజమాన సమాజంలో, స్వతంత్రులకూ, బానిసలకూ మధ్యా, వివిధ కులాల మధ్యా గొప్ప అగడ్త వుండింది; ఫ్యూడల్ సమాజంలో మనిషి స్థాయి అతను యే అంతస్తులో సభ్యు డనేదానిమీద ఆధారపడి, నిర్ణయమయ్యేది. కానీ, మనుషులే యీ భేదాలను సహజమైనవిగా, దైవికమైనవిగా భావించినారు. ఫ్యూడలిజం గర్భంనుండి ఉద్భవించే బూర్జువా సమాజం చట్టం యెదుట సమస్త మానవుల నామకార్థపు సమానత్వాన్ని ఉద్ఘాటిస్తుంది గానీ, సామాజిక విభేదాలను, లేదా వర్గాలుగా సమాజపు విభజనమూ, వర్గాల మధ్య వైరుధ్యాలనూ తొలగించదు, అది కేవలం పాత వర్గాల స్థానంలో కొత్తవాటిని పెట్టి, కొత్త రూపాల పీడననూ, పోరాటాన్నీ ఉత్పన్నం చేస్తుంది.

వర్గాలు వున్నాయనే విషయాన్ని మార్క్స్ పూర్వపు దశలో బూర్జువా విద్వాంసులు ఆవిష్కరించినారు. ఇంగ్లీషు అర్థశాస్త్రపు లాక్షణిక రచయితలైన ఆడం స్మిత్, డేవిడ్ రికార్డోలు సమాజంలో మూడు వర్గాలు — బూర్జువాలూ, భూస్వాములూ, కార్మికులూ — వున్నాయనీ, వాటి మధ్య గల భేదాలు వాటి ఆదాయ మార్గాలచేత నిర్ణయింపబడినాయనీ యెంచినారు. బూర్జువాలకు లాభమూ, భూస్వాములకు కౌలూ, కార్మికులకు వేతనమూ వస్తుంది.

సమాజపు ఆర్థిక వ్యవస్థ సందర్భంలో వర్గాల స్థితిని గురించి స్మిత్, రికార్డోలు చేసిన పరిశీలన నిస్సంశయంగా సామాజిక ఆలోచనలో గణనీయమైన విజయం. కానీ, వర్గాలుగా మనుషుల విభజననూ, దానివెంట వుండే సామాజిక అసమానతనూ వాళ్లు న్యాయమైనవిగానూ, అవసరమైనవిగానూ యెంచినారు. వర్గాల మధ్య శత్రు వైరుధ్యా లేమీ వాళ్లకు కనపడలేదు, అందువల్ల అవి యే ప్రాతిపదికనుండి ఉత్పన్నమైందీ వాళ్లు చూపలేకపోయినారు. అంతేకాక, వర్గాలుగా మానవుల విభజనకు కారణాలు పంపకపు రంగంలో వున్నాయని వాళ్లు నమ్మి, వర్గాల "పంపకం సిద్ధాంతా"న్ని స్థాపించినారు; యిది యీ నాడు కూడా పెట్టుబడిదారీ ప్రపంచంలో విస్తృతంగా అంగీకరింపబడి వుంది.

స్మిత్, రికార్డోలు వర్గాల ఉనికికి దృష్టిని ఆకర్షించగా, పునరుద్ధరణ కాలపు ఫ్రెంచి చరిత్రకారులు — త్యేర్రీ, గిజో, మిన్యే — చరిత్రను, ముఖ్యంగా ఫ్రెంచి విప్లవపు చరిత్రను, వర్గ పోరాటపు దృష్ట్యా పరిగణించి, ఫ్రెంచి విప్లవపు గతి భూ ఆస్తి కొరకు జరిగిన వర్గాల పోరాటంచేత నిర్ణయింపబడిందని నమ్మినారు. వాళ్లు వర్గ పోరాటానికి చారిత్రక వివరణను

యిచ్చినారు, కానీ ఆ పోరాటం గతానికి మాత్రమే వర్తిస్తుందనీ, సమకాలీన బూర్జువాలమీద కార్మికుల పోరాటం అనవసరమనీ, అక్రమమనీ, కూడదనీ ప్రకటించినారు.

ఈవిధంగా, వర్గాల ఉనికీ, వర్గ పోరాటమూ మార్క్సుకు ముందు ఆవిష్కరింప బడినట్లు మనకు కనపడుతుంది. మార్క్సిజం స్థాపకులు సమాజపు వర్గ నిర్మాణాన్నీ, వర్గాల పోరాటాన్నీ అధ్యయనం చేయడంలో సామాజిక శాస్త్రపు విజయాలను ఉపయోగించు కున్నారు, కానీ వాళ్లు అక్కడ ఆగలేదు.

1852 మార్చి 5న జె. వేడిమేయర్‌కు రాసిన ప్రసిద్ధమైన జాబులో మార్క్సు వర్గాలకూ, వర్గ పోరాటానికీ చెందిన మార్క్సిస్టు సిద్ధాంతపు సారాన్నీ, దాని విశిష్ట లక్షణాలనూ యిలా నిర్వచించినాడు: "నేను కొత్తగా చేసింది యేమిటంటే, యివి రుజువు చేయడం: 1) వర్గాల ఉనికి ఉత్పత్తి అభివృద్ధిలోని నిర్దిష్ట చారిత్రక దశలతో మాత్రమే ముడివడి వుందనీ, 2) వర్గపోరాటం విధిగా కార్మికవర్గ నియంతృత్వానికి దారితీస్తుందనీ, 3) యీ నియంతృత్వమే సకల వర్గాల రద్దుకూ, వర్గరహిత సమాజానికీ పరివర్తనగా మాత్రమే వుంటుందనీ."*

అభివృద్ధి చెందే ఉత్పత్తియొక్క అవసరాల ప్రాతిపదికమీద వర్గాలు ఆవిర్భవిస్తాయనీ, వుంటాయనీ చూపడంద్వారా మార్క్సు మొదటిసారిగా వర్గాలను గురించిన భౌతికవాద దృక్పథాన్ని యిచ్చినాడు. వర్గాలు నిత్యమైనవి కావనీ, అవి ఆవశ్యకతనుండి ఉద్భవించినాయనీ, అదృశ్యం కాక తప్పదనీ ఆయన నిరూపించినాడు. యిది వర్గాల సమస్యపట్ల చారిత్రక, అనగా పరస్పరవాదాత్మక వైఖరి.

వర్గ సిద్ధాంతంలో ముఖ్యమైన విషయం యేమిటంటే, సమాజం వర్గాలుగా విభజన కావడానికి శాస్త్రీయమైన గీటురాళ్లను నిర్ణయించడమూ, వాటిని బట్టి వర్గ విభేదాల ముఖ్యమైన చిహ్నాలను నిర్ణయించడమూ. "మహా ప్రారంభం" అనే రచనలో లెనిన్ వీటిని వెలికి తెచ్చి, యిలా సూత్రీకరించినాడు: "వర్గాలు అంటే, చారిత్రకంగా నిర్ణీతమైన సామా జిక ఉత్పత్తి వ్యవస్థలో తాము ఆక్రమించే స్థానంలోనూ, ఉత్పత్తి సాధనాలతో తమకు గల సంబంధం (అత్యధిక సందర్భాలలో చట్టంచేత నిర్ణయించబడి, రూపొందించబడిన సంబంధం) లోనూ, శ్రమయొక్క సామాజిక వ్యవస్థీకరణలోని తమ పాత్రలోనూ, తత్పర్యవసానంగా, సామాజిక ఐశ్వర్యంలో తాము ఖర్చుపెట్టే భాగంయొక్క పరిమాణాలలోనూ, ఆ భాగాన్ని సంపాయించే పద్ధతిలోనూ పరస్పరం భిన్నమైన విశాల ప్రజా బృందాలు. వర్గాలు అంటే, నిర్ణీత సామాజిక ఆర్థిక వ్యవస్థలో తాము ఆక్రమించే భిన్న స్థానాల మూలంగా, ఒకదాని

---

* K. Marx and F. Engels, *Selected Correspondence*, పుట 69.

శ్రమను మరొకటి సొంతపరచుకోగల ప్రజా బృందాలు."* ఈ నిర్వచనాన్ని మరింత వివరంగా పరిశీలిద్దాం.

సమాజం వర్గాలుగా విభజింపబడి వుంటుంది, లేదా విభజింపబడకుండా వుంటుంది. వర్గ విభజిత సమాజం నిర్దిష్ట — వర్గ — ప్రయోజనాలచేత యేకం చేయబడిన కొన్ని పెద్ద మానవ బృందాలుగా చీలి వుంటుంది.

వర్గాలు సామాజిక ఉత్పత్తి వ్యవస్థ లోపల వాటికి గల స్థానాన్ని బట్టి భిన్నభిన్నంగా వుంటాయి: కొన్ని ప్రాబల్యం గల వర్గాలుగానూ, మరికొన్ని పీడింపబడేవిగానూ వుంటాయి. వర్గాల యీ స్థితి ఉత్పత్తి సాధనాల విషయంలో వాటి భిన్నభిన్న స్థాయిలనుండి ఉద్భవిస్తుంది; యీ భిన్నత్వం అత్యంత ముఖ్యమైన లక్షణం, యిది నిర్దిష్ట సమాజంలో వర్గ విభేదాలనూ, ప్రతి వర్గంయొక్క ప్రయోజనాలనూ, కార్యాచరణనూ, యితర వర్గాలతో దాని సంబంధాన్నీ నిర్ణయిస్తుంది. ఉత్పత్తి సాధనాలలో సొంత ఆస్తి సమాజం వర్గాలుగా విభజింపబడేందుకు ఆర్థిక ప్రాతిపదిక, ఉత్పత్తి సాధనాల సొంతదారులచేత శ్రామిక వర్గాలు దోపిడీ చేయబడేందుకు ప్రాతిపదిక, వర్గాల మధ్య సామాజిక వైరుధ్యానికి ప్రాతిపదిక. ఉత్పత్తి సాధనాల విషయంలో ప్రతిఒక్కరికీ సమానమైన స్థాయి గల సమాజంలో వర్గాలు వుండవు, మనిషిమీద మనిషి దోపిడీ వుండదు.

యీవిధంగా, మార్క్సిస్టు లెనినిస్టు వర్గ సిద్ధాంతం చారిత్రకంగా నిర్దిష్టమైన సామాజిక ఉత్పత్తి వ్యవస్థలో పెద్ద సామాజిక బృందాల వస్తుగత స్థాయిని పరిశీలించడంద్వారా వాటి ప్రయోజనాలనూ, కార్యాచరణనూ విలువగట్టడానికి తోడ్పడుతుంది.

ఉత్పత్తి సాధనాల విషయంలో గల స్థాయి కూడా శ్రమయొక్క సామాజిక వ్యవస్థలో ప్రతి వర్గంయొక్క పాత్రనూ నిర్ణయిస్తుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో బూర్జువావర్గం ఉత్పత్తికి సారథ్యం వహించేది. కాగా, కార్మికులు పెట్టుబడిదారీ శ్రమ వ్యవస్థకు లోబడి వుండాలి. పెట్టుబడిదారులు ఉత్పత్తిని వ్యవస్థీకరించడం వలన పెట్టుబడిదారులు కావడం లేదు, తద్వ్యతిరేకంగా, పరిగ్గా వాళ్ళు పెట్టుబడిదారులు, అనగా ప్రధాన ఉత్పత్తి సాధనాల సొంతదారులు అయినందువల్ల ఉత్పత్తికి సారథ్యం వహించే స్థితిలో వున్నారు.**

గుత్త పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెందే కొద్దీ, అంతకంతకూ యెక్కువమంది నిపుణులు ఉత్పత్తిని వ్యవస్థీకరించడానికి రిక్రూట్ చేసుకోబడి కంపెనీల అధ్యక్షులుగానూ,

---

* V. I. Lenin, *Collected Works*, Vol. 29, పుట 421. (తెలుగులో వి. ఐ. లెనిన్, "యేరిన రచనలు," మూడవ భాగం (రెండవ ముద్రణ,) మాస్కో, పుట 179.)

** చూ: K. Marx, *Capital*, Vol. I, పుట 332.

డైరెక్టర్లుగానూ, మేనేజర్లుగానూ, వగైరాలుగా నియమింపబడుతారు; యివన్నీ పెద్ద జీతాలు గల పదవులు. వ్యష్టి పెట్టుబడిదారీ సొంతదారుడు పోయి, శక్తివంతమైన గుత్త కూటములు వచ్చేకొద్దీ, పెట్టుబడి వ్యక్తిత్వరహిత మౌతుంది.

యీ విషయాన్నిబట్టి బూర్జువా రచయితలు చెప్పే దేమిటంటే, ఒకటి, పెట్టుబడిదారీ వ్యవస్థ "మేనేజర్ల సమాజం"గా మారిందనీ, దానిలో కీలక స్థానాలు యిక యెంత మాత్రమూ సొంతదారుల చేతుల్లో లేక, సాంకేతిక నిపుణుల చేతుల్లో వున్నాయనీ; రెండు, యిది దోపిడీ అంతానికి నిదర్శనమనీ. యీవిధంగా, ఉత్పత్తి సాధనాలమీద "క్రియాశీల స్వామ్యం" పోయి, "షేర్లమీద క్రియారహిత స్వామ్యం" వచ్చింది గనుక, ఆస్తి సంబంధాలు ఆర్థిక పెత్తనానికి ప్రాతిపదిక అని చెప్పడం యిక యెంత మాత్రమూ నిజం కాదని బ్రిటిషు లేబర్ పార్టీ పార్లమెంటు సభ్యుడు కాస్‌లండ్ అంటాడు.

ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థ 19వ శతాబ్దపు పెట్టుబడిదారీ వ్యవస్థ కంటె భిన్నమైన మాట నిజమే. కానీ, వ్యష్టి పెట్టుబడిదారుని స్థానంలో "సమష్టి పెట్టుబడిదారుడు" రావడం గానీ, ఉత్పత్తియొక్క రోజువారీ మేనేజిమెంటునుండి ఆస్తిపరులు తొలగింపబడడం గానీ, ఉత్పత్తి సాధనాలలో కొంత భాగం రాజ్యం చేతుల్లోకి బదలాయింపబడడం కూడా గానీ పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క స్వభావాన్ని మార్చదు. యీ వ్యవస్థలో ఉత్పత్తి సాధనాలు పెట్టుబడి రూపం ధరిస్తాయి, యితరుల శ్రమ సొంతపరచుకోబడుతుంది, ఉత్పత్తి పెట్టుబడిదారీ లాభాలకు అనుగుణంగా మలచబడుతుంది. యెంతైనా, "మేనేజర్లు" కేవలం కంపెనీల సొంతదారులైన పెట్టుబడిదార్ల అభీష్టాన్ని నెరవేరుస్తారు, దోపిడీ కొనసాగడమే కాక, వాస్తవానికి తీవ్రతరమైంది. మేనేజిమెంటు కర్తవ్యాలు "మేనేజర్ల"కు యిలా బదలాయింపబడడం కేవలం యేమి తెలుపుతుందంటే, బూర్జువావర్గం అంతకంతకూ యెక్కువగా పరరక్తోపజీవి అవుతున్నదనీ, సామాజిక ఉత్పత్తిని పెట్టుబడిదారులు లేకుండా వ్యవస్థీకరించవచ్చుననీ.

అంతే కాక, ఉత్పత్తి సాధనాల విషయంలో గల స్థాయి కూడా ఆయా వర్గాల ఆదాయ మార్గాన్నీ, ఆదాయపు మొత్తాన్నీ నిర్ణయిస్తుంది. ఆవిధంగా, బూర్జువాకూ, కార్మికునికీ మధ్య గల భేదం యేమిటంటే, బూర్జువా ఆదాయం లాభం రూపం ధరించగా, కార్మికుని ఆదాయం వేతనం రూపం ధరిస్తుంది.

బూర్జువా సిద్ధాంతకారులు ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థను దాదాపు స్వర్గతుల్యంగా చిత్రిస్తారు. పురోగామి పెట్టుబడిదారీ దేశాలలో ఆదాయాలూ, జీవన ప్రమాణాలూ ఒకే స్థాయికి వస్తున్నాయనీ, ధనికుల ఆదాయాలు తరుగుతూ, బీదల ఆదాయాలు పెరుగుతూ వున్నందువలన, "మధ్య తరగతి" పెరుగుతూ పైపొరనూ, కిందిపొరనూ కబళించి వేస్తున్న

దనీ వాళ్ళు అంటారు. పెట్టుబడిదారీ సమాజంలో వర్గ విభేదాలూ, వర్గ పోరాటమూ అదృశ్యమౌతున్నాయనే దీర్ఘ ప్రభావపు నిర్ధారణలకు యిదే ప్రాతిపదిక; సహజంగానే, మార్క్సిస్టు సిద్ధాంతానికి ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థతో యేమీ సంబంధం లేదనే సూత్రీకరణను దీనినుండి లాగుతారు.

కానీ, యీ చిత్రం వాస్తవికతను పూర్తిగా వికృతపరుస్తుంది. అత్యంత ధనిక పెట్టుబడిదారీ దేశమైన అమెరికా సంయుక్త రాష్ట్రాలను తీసుకోండి. అక్కడ కార్మికవర్గం పెట్టుబడిదారులతో పోరాడి, నిజంగా యితర పెట్టుబడిదారీ దేశాల కార్మికవర్గం కంటె యెక్కువ స్థాయి వేతనాలను సాధించుకుంటుంది. కానీ, ఆ దేశంలో ఆదాయాల సమానత్వమేమైనా వుందా? వుంటే, సంయుక్త రాష్ట్రాల కాంగ్రెసు యింకా "బీదరికపు కార్యక్రమం" అమలు పరచడం యెందుకు? మరొక వైపున, అత్యంత ధనిక కుటుంబాలలో 5 శాతానికి శత కోట్ల డాలర్ల ఆస్తులు వుండడం యెందుకు? బీదలు కాపిటల్ హిల్ సమీపంలోని మైదానాలలో మకాం వేయడం యెందుకు? సంయుక్త రాష్ట్రాలలో జాతీయ సంపదలో అధిక భాగం పెట్టుబడిదారుల చేతుల్లో వుండగా, కోట్లమంది యింకా మురికి పేటలలో నివసించడం యెందుకు? ఆ దేశంలో ఆదాయాల సమానత్వానికి సూచన యేమీ లేదు. మొత్తంమీద పెట్టుబడిదారీ ప్రపంచంలో, ఐశ్వర్యానికీ, దారిద్ర్యానికీ మధ్య అగడ్త యింకా పెద్దదిగా కూడా వుంది. పెట్టుబడిదారీ ప్రపంచంలో, యితరుల శ్రమను సొంతపరచుకోవడం దోపిడీ వర్గాల ఐశ్వర్యానికి ప్రధాన మూలం.

యివి వర్గాల ప్రధాన లక్షణాలు. సమాజం వర్గాలుగా విభజితమైందని చెప్పే మార్క్సిస్టు లెనినిస్టు సిద్ధాంతం వర్గ విభజనకు చెందిన యీ లక్షణాలను సమైక్య సజీవ సమస్తంగా పరిగణిస్తుంది; యెందుకంటే, వీటిలో యేదో ఒకదానిని వర్గ విభేదకరణకు ఒకేఒక గీటురాయిగా వేరుచేయడం అశాస్త్రీయంగా వుంటుంది.

వర్గ విభేదాలు ఆర్థిక వ్యవస్థలో ఉత్పన్నమై, సామాజిక జీవితపు రంగాలన్నిటిలోకీ వ్యాపిస్తాయి. ప్రతి వర్గంయొక్క రాజకీయ ప్రయోజనాలూ, దాని మనస్తత్వపు లక్షణాలూ, భావజాలమూ ఆ వర్గంయొక్క ఆర్థిక పరిస్థితీ, పదార్థిక ప్రయోజనాలూ అనే ప్రాతిపదికమీద రూపుదాలుస్తాయి. అదే సమయంలో ప్రతి వర్గంయొక్క స్వభావమూ దాని మనుగడకు చెందిన నిర్దిష్ట చారిత్రక పరిస్థితులచేతా, యితర వర్గాలతో దానికి గల సంబంధాలచేతా, మొదలైనవాటిచేత నిర్ణయింపబడుతుంది.

వర్గాలు యెందుకు ఉత్పన్నమౌతాయి?

మనం గత ప్రకరణంలో చూసినట్లు, శ్రమ ఉత్పాదకత పెరుగుదలలో వర్గాలు ఉత్పన్న

మయ్యే అవకాశం యేర్పడుతుంది. పెరిగిన శ్రమ ఉత్పాదకత అదనపు ఉత్పాదితాన్ని యిచ్చి, మనుషుల దోపిడీని ఆర్థికంగా లాభదాయకం చేస్తుంది.

శ్రమ విభజన తీవ్రతరం కాకుండా ఉత్పత్తి అభివృద్ధి స్థాయిలో యితోధిక పురోగతి అసాధ్యమైనప్పుడు, ఆ స్థాయిలో వర్గాల పుట్టుకకు అవశ్యకత యేర్పడుతుంది. శ్రమ విభజనా, శ్రమలో ప్రత్యేక నైపుణ్యమూ లేకుండా, ఉత్పాదక శక్తులు గానీ, శ్రమ ఉత్పాదకత గానీ, మొత్తంగా సమాజం గానీ పెరగడం అసంభవం. అందువల్లనే ఉత్పత్తియొక్కా, మొత్తంగా సమాజంయొక్కా అభివృద్ధిలో శ్రమ విభజన అత్యంత ముఖ్యమైన అంశం.

శ్రమ విభజన పర్యవసానాలను సరిగా పరిశీలించడానికి దాని సాంకేతిక పార్శ్వాలకూ, సామాజిక పార్శ్వాలకూ మధ్య గల భేదాన్ని చూడడం అవసరం.

సాంకేతికంగా, శ్రమ విభజన ఫలితాలు యేమిటంటే, కార్యాచరణలో ప్రత్యేక నైపుణ్యమూ, వివిధ వృత్తుల ఆవిర్భావమూ, భిన్న ఉత్పత్తి శాఖల మధ్య వివిధమైన లంకెలు నెలకొల్పడమూ, వివిధ రకాల కార్యాచరణల మార్పిడీ. సామాజికంగా, దాని ఫలితాలు యేమిటంటే, సొంత ఆస్తి ఆవిర్భావమూ, ఆస్తులలో అసమానతా, వర్గాలుగా సమాజం విభజింపబడడమూ. యీ సమస్య మార్క్సిజం లెనినిజం స్థాపకుల వివిధ రచనలలో విస్తృతంగా చర్చింపబడింది, ప్రత్యేకించి ఎంగెల్సు రాసిన "ఆంటీ డ్యూరింగ్"లో. దానిలో ఆయన యిలా నొక్కిచెప్పినాడు: "సమాజంయొక్క సమష్టి వ్యవహారాలను — శ్రమ దర్శకత్వమూ, రాజ్య వ్యవహారాలూ, న్యాయశాస్త్ర వ్యవహారాలూ, కళలూ, శాస్త్రవిజ్ఞానమూ, వగైరాలను — చూసుకోడానికి తీరిక లేనంతగా నిజంగా పనిచేసే ప్రజానీకం తమ అవసర శ్రమలో నిమగ్నమైనంత కాలం, యీ వ్యవహారాలను నిర్వహించడానికి ప్రత్యక్ష శ్రమనుండి విముక్తమైన ఒక ప్రత్యేక వర్గం నిత్యం వుండడం అవసరమైంది. యీ వర్గం, స్వప్రయోజనం కొరకు, శ్రామిక జనాలమీద అంతకంతకూ యెక్కువ శ్రమ భారాన్ని మోపకుండా యెప్పుడూ వుండలేదు."* కనుక, వర్గాలు శ్రమ విభజననుండి ఉద్భవిస్తాయి.

ప్రారంభంలో, వర్గాలు రెండు విధాలుగా ఉద్భవించినాయి: ఆదిమ సమష్టి సమాజంలో ఆంతరంగికంగా పొరలు యేర్పడడంద్వారానూ, యితర సమష్టి సమాజాలకూ, తెగలకూ చెందిన మనుషులను బానిసలుగా చేయడంద్వారానూ.

మొదటి విషయంలో పౌర పదవులను స్వీకరించి, తమ చేతుల్లో అంతకంతకూ యెక్కువ ఐశ్వర్యాన్ని ప్రోగుచేసుకోడానికి యీ పదవులను ఉపయోగించుకొన్న కుటుంబాలనుండి ఒక పాలక వర్గం ఉద్భవించింది. శ్రమ విభజనా, సొంత ఆస్తీ పుట్టిన ప్రారంభ దశలో నిర్దిష్ట

---

* F. Engels, *Anti-Dühring*, Moscow, 1969, పుటలు 217–18.

పౌర కార్యాలు నిర్వహించడానికి యెన్నుకోబడిన మనుషులు తమ సామాజిక స్థానాన్ని దుర్వినియోగపరచడం ప్రారంభించి, తమ పదవులను మొదట యావజ్జీవిత పదవులుగానూ, తరువాత అనువంశిక పదవులుగానూ మార్చినారు. యీవిధంగా ప్రజా సేవకులు ప్రజా యజమానులైనారు.

రెండవ విషయంలో, వర్గ నిర్మాణ క్రమంలోని మరొక పార్శ్వాన్ని నొక్కిచెప్పాలి. ప్రతి శాఖలోనూ — పశుపాలనలోనూ, వ్యవసాయంలోనూ, చేతిపనులలోనూ — ఉత్పత్తి పెరిగే కొద్దీ, మానవుని శ్రమశక్తికి అతని సొంత జీవనానికి అవసరమైనంత కంటె యెక్కువ పరిమాణాల ఉత్పాదితాలను ఉత్పత్తి చేసే సామర్థ్యం యేర్పడింది. అదే సమయంలో, గణంలోని, లేదా కుటుంబంలోని ప్రతి సభ్యునిమీదా పడే రోజువారీ శ్రమ పరిమాణాలు పెరగ సాగినాయి; దీనితో యెక్కువ అంగబలాన్ని కూర్చుకోవలసిన అవసరం యేర్పడింది. యుద్ధం దీనిని సమకూర్చింది; యుద్ధ ఖైదీలు బానిసలుగా మార్చబడినారు.

కనుక, సామాజిక శ్రమ విభజన, ఒకవైపున తన ఉత్పాదకతను పెంచుకుంటూ, పాదార్థిక సంపదను పెంచుతూ, ఉత్పాదక కార్యాచరణ రంగాన్ని విస్తృతపరుస్తూ, అదే సమయంలో, ఆ నాటి చారిత్రక పరిస్థితుల నన్నిటినీ మొత్తంగా పరిగణించినప్పుడు, వర్గాలూ, వర్గ సమాజమూ యేర్పడడానికి విధిగా కారణమైంది.

దౌర్జన్యం సమాజపు వర్గ విభజనకు ఆదిమ మూలమని అనేక బూర్జువా సిద్ధాంత వేత్తలు ఉద్ఘాటిస్తారు. నిజమే, వర్గాలు యేర్పడడంలో దౌర్జన్యం — యుద్ధాలూ, బానిసలను పట్టుకోవడమూ, ఆస్తి కొల్లగొట్టడమూ, వగైరా — పెద్ద పాత్ర వహించింది, కానీ అదే వర్గాలను ఉత్పన్నం చేయలేదు. మనుషులు రాతి గొడ్డలిని ఉపయోగించినంత కాలం, యెంత దౌర్జన్యమైనా దోపిడీ సంబంధాలను నెలకొల్పడానికి కావలసిన పరిస్థితులను సృష్టించేటట్లుగా అదనపు ఉత్పాదితాన్ని ఉత్పన్నం చేయజాలదు. దౌర్జన్యం కారణం కాదు, ఫలితం. వర్గాల పుట్టుకకు బాట వేసిందీ, వాటి పుట్టుకను నిర్ణయించిందీ ఆర్థిక విషయాలే.

బానిసలూ, బానిస యజమానులూ అనే రెండు వర్గాలుగా సమాజం మొదట విభజింపబడింది. అయితే, వర్గాల పుట్టుకకు సంబంధించిన సమస్య దీనికి పరిమితం కాదు. బానిస యజమాన సమాజంనుండి ఫ్యూడల్ సమాజానికీ, ఫ్యూడల్ సమాజంనుండి పెట్టుబడిదారీ సమాజానికీ పరివర్తన చెందడమంటే, కేవలం మునుపటి వర్గాలు కొత్త సామాజిక నిర్మాణంలోని వర్గాలుగా రూపాంతరం చెందడం మాత్రమే కాదు — ఉదాహరణకు, బానిసలు ఫ్యూడల్ దాసులు గానూ, బానిస యజమానులు ఫ్యూడల్ ప్రభువులు గానూ రూపాంతరం చెందడం మాత్రమే కాదు. పాత సామాజిక నిర్మాణం పోయి కొత్తది వచ్చేటప్పుడు, కొత్త

నిర్మాణపు వర్గాలు యేర్పడే క్రమం మహా విలక్షణంగా, క్లిష్టంగా వుంటుంది. ప్రతి కొత్త నిర్మాణంలోనూ కొత్త వర్గాలు ఉత్పన్న మౌతాయి.

ప్రస్తుతం ఉత్పత్తియొక్కా, ఉత్పాదక శక్తులయొక్కా అభివృద్ధి యే స్థాయికి చేరు కుందంటే, యీ స్థాయిలో వర్గాల నన్నిటినీ రద్దుచేసే కర్తవ్యం మహా సకాలికమైనది. సోషలిస్టు దేశాలలో యీ కర్తవ్యం యిప్పటికే నిర్వహించబడుతున్నది.

వర్గ పరిశీలన పద్ధతి.
సమాజపు వర్గ నిర్మాణం

సమాజం వర్గాలుగా చీలిపోవడం అనేది సామాజిక సంబంధాల వ్యవస్థ అంతటిలోనూ వ్యక్తమై, స్థిరపడి, సకల సామాజిక విషయాలలోనూ అనేక విధాల వ్యాపించే వర్గ వైరుధ్యాలను కలిగిస్తుంది. వర్గ పరిశీలన పద్ధతి యీ విషయాలలో వేటి మధ్యనైనా గల సంబంధాన్నీ, సమాజం వర్గాలుగా విభజింపబడడాన్నీ, వివిధ వర్గాల ప్రయోజనాలనూ వెల్లడించడానికి తోడ్పడుతుంది. కానీ, యీ పద్ధతిని ప్రయోగించడంలో రెండు వైపరీత్యాలను పరిహరించడం అవసరం: ఒకటి, సమాజం వర్గాలుగా విభజింపబడిందనే మౌలిక వాస్తవాన్ని ఉపేక్షించే బూర్జువా వస్తుగతవాదం; యీ వైఖరి పెట్టుబడిదారీ గుత్త సంస్థలూ, బూర్జువా రాజ్యమూ, రాజకీయ పార్టీలూ, వగైరాలలోని వర్గ స్వభావాన్ని నిరాకరించే, లేదా మరుగు పరచే వివిధ సిద్ధాంతాలను ఉత్పన్నం చేసింది; రెండు, వర్గ పరిశీలన పద్ధతిని వెకిలిగా, పిడివాదంగా, మోటుగా ప్రయోగించడం; యిది భిన్న సామాజిక విషయాలలోని విశిష్ట లక్షణాలను పరిగణించకుండా, రాజ్యంనుండి కేశాలంకరణదాకా, భావజాలంనుండి ఫాషన్లదాకా అన్నీ సమానంగా వర్గ వైరుధ్యాలతో నిండి వున్నాయని ప్రకటిస్తుంది. మొదటిదాని విషయంలో మార్క్సిజం వర్గాతీత వైఖరిని యెదుర్కోడానికి వర్గ పార్టీ వైఖరి కావాలని పట్టుబట్టుతుంది; రెండవదాని విషయంలో అది వర్గ పరిశీలన పద్ధతిని వికృతపరచే ఆత్మగతవాదంతోనూ, ఆదిమతత్వంతోనూ పోరాడుతుంది.

వర్గ పరిశీలన పద్ధతిని శాస్త్రీయంగా ఉపయోగించాలంటే, ప్రతి సామాజిక విషయంలోనూ గల విశిష్ట లక్షణాలను పరిగణించాలి. సకల సామాజిక విషయాలలోని అత్యంత ముఖ్యమైన లక్షణాలను తీసుకుంటే, వాటిని కనీసం మూడు ప్రధాన బృందాలుగా విభజించవచ్చు, వాటిలో వర్గతత్వం ఒకొకదానిలో ఒకొక విధంగా వ్యక్తమవుతుంది. మొదటిది సారభూతంగా వర్గ స్వభావం కలిగి, వర్గాలతో ఉత్పన్నమై, వర్గాలు ఉన్నంత కాలం మాత్రమే వుండే సామాజిక విషయాల బృందం. మొట్టమొదట రాజ్యమూ, మొత్తం రాజకీయ సంబంధాల వ్యవస్థా యీ

బృందానికి చెందుతాయి. అందువల్లనే, రాజ్యంయొక్క సారాన్నీ, దాని అభివృద్ధి స్వభావాన్నీ అర్థం చేసుకోడానికి రాజ్యం గురించిన వర్గ అంచనా కీలకమైనది. రెండవది, యే సామాజిక నిర్మాణరూపంలోనైనా నిర్మాణ అంశాలుగా కనిపిస్తూ, శత్రు వర్గాలుగా విభజింపబడిన సమాజంలో వర్గ స్వభావం సంతరించుకొనే విషయాల బృందం. యివి ఉత్పత్తి సంబంధాలూ, నీతీ, భావజాలమూ, కళలూ, మొదలైనవి. వర్గ పరిశీలన పద్ధతిని యీ విషయాల బృందానికి ప్రయోగించడంలో పరిగణించవలసినవి యేమిటంటే, ఒకటి, వాటి వర్గ స్వభావమూ, రెండు, వర్గాల పోరాటం సమాజంయొక్క యీ నిర్మాణ అంశాలను ధ్వంసం చేయకుండా కేవలం వాటి వ్యక్తీకరణయొక్క నిర్దిష్ట చారిత్రక రూపాన్ని మార్చడానికి అభిముఖంగా వుంటుందనే విషయమూ. ఉత్పత్తి సంబంధాలూ, నీతీ లేకుండా యే సమాజమూ మన జాలదు. పెట్టుబడిదారీ నిర్మాణరూపం పోయి కమ్యూనిస్టు నిర్మాణరూపం రావడమంటే, దరహంమీద ఉత్పత్తి సంబంధాలూ, నీతీ తొలగిపోవడం కాదు, ఒక రకం ఉత్పత్తి సంబంధాలు పోయి మరొకటీ, ఒక రకం నీతి పోయి మరొకటీ రావడం మాత్రమే.

మూడవ బృందంలోని సామాజిక విషయాలు సమాజపు నిర్మాణ అంశాలలో వర్గ స్వభావం లేనివి, అనగా వర్గ స్వభావం పొందితే తమ సామాజిక కర్తవ్యాలు నిర్వహించ జాలనివి — భాష, సాంకేతిక విజ్ఞానం, ప్రకృతి శాస్త్రాలు, మొదలైనవి. కానీ, అవి కూడా సమాజపు వర్గ విభజనచేత ప్రభావిత మౌతాయనీ, వర్గాలు వాటిని స్వప్రయోజనాల కొరకు వినియోగించుకో జూస్తాయనీ మనసులో పెట్టుకోవాలి. ఆవిధంగా, బూర్జువావర్గం శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాలను శ్రామిక ప్రజలను దోచుకొనే సాధనంగా వినియోగిస్తుంది. యిలాంటి వినియోగం యీ విషయాలమీదా, వీటి అభివృద్ధి స్వభావంమీదా కొంత ప్రభావం నెరపుతుంది, కానీ వీటి సారాన్ని మార్చదు, మార్చజాలదు.

సామాజిక విషయాలలోని యీ భేదాలనూ, యింతకంటె కూడా సూక్ష్మమైన భేదాలనూ లెక్కలోకి తీసుకుంటే తప్ప, మార్క్సిస్టు వర్గ పరిశీలన పద్ధతి వికృతపరచబడి, వెకిలిపరచబడే ధోరణి వహిస్తుంది, తత్ఫలితంగా, సంస్కృతిపట్ల వర్గ వైఖరి మానవ చరిత్ర అంతటా ప్రోగుచేయబడిన సంస్కృతి అంతటినీ అప్రతిష్ఠ పాలు చేయడానికి ఉపకరిస్తుంది.

అంతే కాక, వర్గ వైఖరి లేకుండా వర్గ సమాజంలోని మానవుల కార్యాచరణను గానీ, మానవులను వాళ్ల కార్యాచరణలో నడిపించే వివిధ ఉద్దేశాలనూ, ఆశయాలనూ గానీ అర్థం చేసుకోవడం అసాధ్యం. వర్గాలకూ, వర్గ పోరాటానికీ చెందిన మార్క్సిస్టు లెనినిస్టు సిద్ధాంతం యీ ఉద్దేశాల, ఆశయాల మూలాలను విశదీకరించడానికీ, వాటిని వర్గాలకు చెందిన కచ్చితమైన పాదార్థిక ప్రయోజనాలుగా కుదించడానికీ తోడ్పడుతుంది. వర్గ పరిశీలన

పద్ధతి అంటే సారభూతంగా మానవుల వివిధ భావాలనూ, ఉద్దేశాలనూ, మాటలనూ, చర్యలనూ దాటి, ఘర్షించే వర్గాల వాస్తవ ప్రయోజనాల వద్దకు పోవడం. యీ వైఖరి మానవుల కార్యాచరణలోని ఉద్దేశాలలో గల వ్యక్తిగత విభేదాలను లెక్కలోకి తీసుకోకుండా, వాళ్ల కార్యాచరణలోని సారభూతమైన, సామాజికంగా ముఖ్యమైన పార్శ్వాన్ని వెల్లడిస్తుంది. ఆవిధంగా, ఒక పెట్టుబడిదారుడు మంచి సంసారిగా, తన పిల్లలను ప్రేమించేవాడుగా వుండవచ్చు, క్రమంగా దానధర్మాలు చేస్తూ వుండవచ్చు, మంచి కళాఖండాలు సేకరించి వుండవచ్చు; మరొక పెట్టుబడిదారుడు కఠినుడూ, దుష్టుడూ కావచ్చు, తన కుటుంబ సభ్యులను హింసిస్తూ వుండవచ్చు, యింకా యిలాంటి గుణాలు కలిగి వుండవచ్చు. కానీ, పెట్టుబడిదారులుగా వాళ్ల కిద్దరికీ సామాన్యమైనది యేమిటంటే, వాళ్లకు ఆస్తి వుంది, వాళ్లు లాభాలు సంపాయిస్తారు, తద్వారా తమ వర్గంయొక్క సామాజిక క్రియను నెర వేరుస్తారు. అందువల్లనే, తమ వర్గానికి ప్రతినిధులుగా పెట్టుబడిదారుల విలక్షణ గుణాన్ని యివ్వడంలో ముఖ్యమైనది వాళ్ల వ్యక్తిగత గుణాలను గానీ, లోపాలను గానీ వర్ణించడం కాదు, వాళ్లు పెట్టుబడిదారీ సంబంధాలను మూర్తీభవిస్తారనే విషయాన్ని స్పష్టపరచడం. యీ వర్గ సంబంధాలూ, వర్గ ప్రయోజనాలూ బూర్జువావర్గాల సభ్యుల వ్యక్తిగత గుణాలను ప్రభావితం చేస్తాయి కూడా. బూర్జువా ప్రయోజనాల కలుషకర ప్రభావం గురించీ, అచ్చమైన మానవ సంబంధాలతో వాటికి పొత్తు కుదరని విషయం గురించీ చాలా రాసినారు, కానీ ప్రతి మనిషియొక్క వ్యక్తిత్వమూ అతని సామాజిక జన్మ మూలంమీద, లేదా ఒక వర్గంలో అతని సభ్యత్వంమీద ఆధారపడిన విలక్షణ గుణం వున్నంత సంకుచితంగా వుండదని యెల్ల ప్పుడూ జ్ఞాపకం పెట్టుకోవాలి.

కనుక, చారిత్రకంగా నిర్దిష్టమైన ఉత్పత్తి వ్యవస్థలో తమకు గల స్థాయిచేత నిర్ణ యింపబడిన వర్గాల ప్రయోజనాలను నిర్వచించడంలో, వ్యక్తిగతమైనదానిని సమాజ గతమైనదిగా కుదించడమూ, ప్రతి వర్గమూ తన జీవిత పరిస్థితులను బట్టి సాధించ దలచుకొన్నదానిని తెలుసుకోవడమూ, వర్గాల కార్యాచరణలో వస్తుగత, ఆత్మగత పార్శ్వాల మధ్య గల తారతమ్యాన్ని వెలికితేవడమూ సాధ్యమౌతుంది.

వర్గ పరిశీలన పద్ధతిలో, చారిత్రకంగా నిర్దిష్టమైన ప్రతి సమాజంయొక్క వర్గ నిర్మాణపు పరిశీలన కూడా చేరుతుంది. నిర్దిష్ట సమాజంయొక్క, నిర్దిష్ట దేశంయొక్క వర్గ నిర్మాణాన్ని పరిశీలించడంద్వారానూ, ప్రతి వర్గంయొక్క ప్రయోజనాలను నిర్వ చించడంలోనూ సమాజంలోని శక్తుల తారతమ్యం గురించిన వస్తుగత చిత్రం లభిస్తుంది, దాని వైరుధ్యాల, ఘర్షణల, పోరాటాల ముఖ్య పార్శ్వం వెలికి వస్తుంది. మార్క్సిస్టు లెనినిస్టు వర్గ సిద్ధాంతం చూపిన సమాజపు వర్గ నిర్మాణపు పరిశీలన పద్ధతి చరిత్ర అధ్యయనానికి

అవసరమైన మార్గదర్శి, వర్గ పోరాటపు చిక్కులలో దారి తెలుసుకోడానికి విశ్వసనీయమైన సాధనం. యీ పద్ధతిని మార్క్సు, ఎంగెల్సు, లెనినూ ఉజ్వలంగా ప్రయోగించినారు; యిది ప్రపంచపు కమ్యూనిస్టు, కార్మిక పార్టీలకు పోరాటపు అత్యంత వివిధ పరిస్థితులలో తమ విధానాన్ని రూపొందించుకోవడంలో దారిచూపుతుంది.

ప్రతి సమాజంయొక్క వర్గ నిర్మాణం క్లిష్టంగా వుంటుంది. దాని పరిశీలనలో, అన్నిటినీ మించి, ప్రధాన వర్గాలను వెలికి తేవలసిన అవసరం వుంది. ఈ ప్రధాన వర్గాల మధ్య సంబంధాలు ప్రతి సమాజపు ప్రధాన అభివృద్ధి మార్గాన్ని వ్యక్తం చేస్తాయి. భిన్న ఆర్థిక రంగాలతో ముడివడిన మనుగడ గల వివిధ అప్రధాన వర్గాలు కూడా మామూలుగా సమాజంలో వుంటాయనే విషయాన్ని లెక్కించవలసిన అవసరం కూడా వుంది. యీ విధంగా, యీ వర్గ నిర్మాణంలో, మొత్తం సమాజం లోపల మాత్రమే కాక, వర్గాల లోపల కూడా భిన్న సామాజిక విభాగాలు వుంటాయి.

ఉదాహరణగా, బూర్జువావర్గమూ, కార్మికవర్గమూ అనేవి ప్రధాన వర్గాలుగా గల నేటి పెట్టుబడిదారీ సమాజపు సామాజిక నిర్మాణాన్ని పరిశీలిద్దాం. యీ వర్గాల చర్యా ప్రతిచర్యలు పెట్టుబడిదారీ ఉత్పత్తి చలనానికి చోదక శక్తి.

సన్నకారు సరుకుల రంగానికి ప్రతినిధులు చేతిపనివాళ్ళూ, సన్నకారు వర్తకులూ, రైతులూ. రైతులు పెట్టుబడిదారీ సమాజపు మధ్యస్థ, అప్రధాన వర్గం, దాదాపు అన్ని దేశాలలోనూ వున్నట్టిది. పెట్టుబడిదారీ సంబంధాల ప్రభావంతో యీ వర్గం విచ్ఛిన్నమై, గ్రామీణ బూర్జువావర్గాన్నీ, కార్మికవర్గాన్నీ ఉత్పన్నం చేసే ధోరణి కలిగి వుంటుంది. కొన్ని దేశాలలో పెద్ద భూస్వాముల వర్గం వుంది; వీళ్ళ పెట్టుబడిదారీ దోపిడీ రూపాలకు తోడు, వివిధ ఫ్యూడల్ అవశేష రూపాలను కూడా ఉపయోగిస్తారు.

పెట్టుబడిదారులూ, కార్మికులూ, పెటీబూర్జువాలూ కాక, పెట్టుబడిదారీ సమాజంలో బహుళ సంఖ్యలో మేధావుల, ఆఫీసు ఉద్యోగుల విభాగం కూడా వుంటుంది. వీళ్ల చేతుల్లోయే ఉత్పత్తి సాధనాలూ వుండవు, వీళ్ళు పాదార్థిక విలువలు ఉత్పత్తి చేయరు, అందువల్లనే వీళ్లకు ఉత్పత్తి వ్యవస్థ లోపల స్వతంత్రమైన స్థానం లేదు. యీ కారణంవలన వీళ్ళు సామాజిక విభాగంగా పరిగణింపబడుతారు గానీ, సామాజిక వర్గంగా కాదు. ఆఫీసు ఉద్యోగులు సామాజిక శ్రమయొక్క అనుత్పాదక రంగంలోని వేతన కార్మికులు — ప్రభుత్వ ఆఫీసులూ, పరిశ్రమలకూ, మార్కెటింగుకూ చెందిన కంపెనీల సిబ్బందీ, వగైరా. మేధావులు మానసిక శ్రమచేసేవాళ్ల — యింజనీర్లూ, డాక్టర్లూ, ఉపాధ్యాయులూ, రచయితలూ, కళాకారులూ, వగైరా. వాళ్ళు వర్గాల మధ్య ఒక మధ్యస్థ స్థానం ఆక్రమించి, బౌద్ధిక కార్యా

చరణకు సంబంధించిన ముఖ్యమైన క్రియలు నిర్వహిస్తూ, ఉత్పత్తియొక్క, సమాజం యొక్క, పాలక వర్గంయొక్క అవసరాలు తీరుస్తారు.

ఆధునిక పెట్టుబడిదారీ సమాజపు వర్గ నిర్మాణాన్ని మరింత విశదపరచాలంటే, యీ నిర్మాణంలోని చలన నియమాలనూ, మార్పులనూ చూడవలసిన అవసరం వుంది. యీ వర్గాలూ, సామాజిక విభాగాలూ, పొరలూ అన్నీ యేక స్వభావం కలిగినవి కావు, వీటికి భిన్న భిన్న ప్రయోజనాలు వుంటాయి. ఉదాహరణకు, పురోగామి పెట్టుబడిదారీ దేశాలలో మధ్యమ బూర్జువాలకూ, బడా గుత్త బూర్జువాలకూ భిన్నభిన్న ప్రయోజనాలు వున్నాయనే విష యం మహా ప్రాముఖ్యం గలది. పెట్టుబడిదారీ ప్రపంచపు "పాలక శ్రేష్ఠు"లైన గుత్త బూర్జువావర్గానికి తన ఆర్థిక శక్తినీ, రాజకీయ పెత్తనాన్నీ నిలుపుకోవాలనే ప్రేరణ వుంటుంది; అందువలన అది మన కాలపు ముఖ్య ప్రగతివ్యతిరేక శక్తి, శాంతికీ, ప్రజాస్వామ్యానికీ, సామా జిక పురోగతికీ వ్యతిరేకమైన శక్తి, అవుతుంది.

పెటీబూర్జువావర్గంలో భాగాలు — పట్టణ పెటీబూర్జువావర్గమూ, రైతాంగమూ; రైతాంగంలో భాగాలు మధ్యరకం రైతులూ, బీద రైతులూ, వగైరా.

కార్మికవర్గంలో పారిశ్రామిక కార్మికులూ, గ్రామీణ కార్మికులూ, నిపుణులూ, అని పుణులూ వున్నారు.

మేధావులలో కూడా వివిధ విభాగాలు వున్నాయి — బూర్జువా, పెటీబూర్జువా, విప్లవ సోషలిస్టు విభాగాల లాంటివి.

ప్రస్తుతం సేవా పరిశ్రమలలో పనిచేసేవాళ్లయొక్క, పెట్టుబడిదారీ సంస్థలలోని ఆఫీసు ఉద్యోగుల, యింజనీర్ల, సాంకేతికులయొక్క — అనగా "మధ్య విభాగాలు" అనబడే వాళ్లయొక్క — సంఖ్య వడిగా పెరుగుతున్నది. అదే సమయంలో పాదార్థిక ఉత్పత్తి రంగంలో పనిచేసేవాళ్ల సంఖ్య సాపేక్షంగా తగ్గుతున్నది. పెట్టుబడిదారీ దేశాలలో, పని పరిస్థితులలోనూ, యితర విషయాలలోనూ పారిశ్రామిక కార్మికులకూ, ఆఫీసు పనివాళ్లకూ మధ్య విశిష్ట మైన "విభేదాలు మాసిపోవడం" కనపడుతున్నది: కొంతమంది ఆఫీసు ఉద్యోగులు కార్మికు లుగా మార్చబడి, కార్మికవర్గానికి దగ్గరగా వస్తున్నారు. యీ అన్నిటి దృష్ట్యా, యీ రకం శ్రామికులను కార్మికవర్గంలో ఒక దళంగా లెక్కించడం సమంజసం కావచ్చు. నిజంగా వాళ్ళు అదే కార్మికులే, నల్ల చొక్కాలకు బదులు తెల్ల చొక్కాలు వేసుకొని, ఆధునిక యంత్రాలకూ, సాంకేతిక విజ్ఞానానికీ అవసరమైన సేవలనుండి ఉత్పన్నమయ్యే క్రియలు నిర్వహించేవాళ్ళు, అందువలన ఉత్పత్తిలో భాగమైనట్టివాళ్లు. కాగా, పరిశ్రమలలోని యింజనీర్లూ, సాంకేతికులూ కూడా ఉత్పాదక శ్రమలో నిమగ్నులైనవాళ్లు. కానీ, కొంతమంది యీ వైఖరిని ఆక్షేపించి, పారిశ్రామిక కార్మికులకూ, ఆఫీసు ఉద్యోగులకూ మధ్య సామాజిక విభేదాలు యింకా వున్నా

యని న్యాయంగా చెప్తారు. కార్మికవర్గం అదనపు విలువను సృష్టిస్తుంది; కాగా, ఆఫీసు పనివాళ్ల కార్యకలాపాలు ఉత్పత్తి అయిన విలువయొక్క లెక్కాచారానికీ, దాని మార్పిడీ, పంపకమూ, వగైరాలకూ సంబంధించినవి. నేరుగా పాదార్థిక ఉత్పత్తి రంగంలో పనిచేసే యింజనీర్లు, సాంకేతికుల విషయం యేమిటంటే, వాళ్ళు అనేక విధాలలో కార్మికుల లాంటి వాళ్ళే అయినప్పటికీ, తనిఖీ చేయడం వాళ్ల క్రియ. సమాధానం యేమైనప్పటికీ, ఒకటి మాత్రం స్పష్టం: కార్మికవర్గపు అంగనిర్మాణం విస్తృతమౌతున్నది; యెందుకంటే, దానిలో యిప్పుడు పారిశ్రామిక కార్మికులూ, వ్యావసాయిక కార్మికులూ మాత్రమే కాక, వాళ్లతో చేరివున్న వివిధ యితర విభాగాల శ్రామికులు కూడా చేరుతారు.

వర్గాలనూ, సామాజిక బృందాలనూ విభజించే రేఖ సాపేక్షమైనది, కదలుతూ వుండేది; వాటి మధ్య జరిగే పరివర్తనలు క్రమక్రమంగానూ, కనిపించీ కనిపించకుండానూ వుంటాయి, కానీ యీ విభేదాలు వస్తుగతంగా యెల్లప్పుడూ వుంటాయి.

సమాజపు సామాజిక నిర్మాణమూ, వివిధ సామాజిక బృందాల ప్రయోజనాలూ, సమాజంలో వాటి ప్రాముఖ్యమూ, సామాజిక వ్యవహారాలమీద వాటి ప్రభావపు ప్రమాణమూ, స్వభావమూ, వగైరాల పరిశీలనను యింకా కొనసాగించవచ్చు. వర్గాలూ, వాటి సంబంధాలూ, మొదలైనవాటిమీద జాతీయ విశిష్ట లక్షణాలు నెరపే ప్రభావాన్ని లెక్కలోకి తీసుకొని, ఆయా దేశాలకూ, దేశాల బృందాలకూ వర్తించేటట్లు ఆ పరిశీలనను నిర్దిష్టంగా వ్యక్తం చేయవచ్చు. అప్పుడు, సమాజంలోని శక్తుల యేర్పాటుకూ, తారతమ్యానికీ చెందిన వస్తుగత చిత్రం ఉత్పన్నమౌతుంది. చారిత్రక ఘటనల గతిని వివరించడంలోనూ, వివిధ పరిస్థితులలో రాజకీయ పంథాను రూపొందించుకోవడంలోనూ ఆ జ్ఞానం అవసరం.

సామాజిక నిర్మాణపు వర్గ పరిశీలనకు చెందిన మార్క్సిస్టు సూత్రాలకు భిన్నంగా బూర్జువా సామాజిక శాస్త్రజ్ఞులు పొరల కల్పన పద్ధతిని, అనగా వివిధ లక్షణాల ఆధారంమీద సమాజం "పొరలు"గా విభజింపబడే పద్ధతిని, ఉపయోగిస్తారు. సమాజం పొరలుగా విభజింప బడడాన్నీ, సామాజిక నిర్మాణం లోపల (లేదా స్థలంలో) జరిగే మానవుల చలనాన్నీ — అనగా సామాజిక పొరల కల్పననూ, సామాజిక చలనశీలతనూ — అధ్యయనం చేయడం సామాజిక శాస్త్రజ్ఞుల కర్తవ్యమని వాళ్ళు అంటారు.

వివిధ పొరల మధ్య భేదం గుర్తించడానికి గీటురాళ్ళు యేమిటి? యీ విషయంమీద బూర్జువా సామాజిక శాస్త్రజ్ఞుల మధ్య అంగీకారం లేదు. కానీ, ఉత్పత్తి సాధనాల విషయంలో గల స్థానం వర్గాలుగా సమాజాన్ని విభజించడంలో కీలక అంశం అనేదాన్ని నిరాకరించ డంలో వాళ్ల మధ్య యేకగ్రీవత వుంది. ఆర్థిక గీటురాళ్లను అంగీకరించేవాళ్లు పంపకం రంగాన్ని (ఆదాయపు పరిమాణాన్ని), లేదా పాదార్థిక జీవన పరిస్థితులను, అంటే ఉత్పత్తిమీద

ఆధారపడే అప్రధానమైన జీవిత పార్శ్వాలను చూస్తారు. "బహు పరిమాణాల పొరల కల్పన" సిద్ధాంతాన్ని చూడండి. దీనిని మొదట సూచించినవాడు జర్మన్ సామాజిక శాస్త్రజ్ఞుడు మాక్స్ వెబర్. యిది అత్యంత సుసంగతమైనదని అంటారు గాని, నిజాని కిది మిశ్రమం. వెబర్ ఆర్థిక, సామాజిక ("జీవిత విధానం"), రాజకీయ రంగాలను సామాజిక జీవితపు భిన్న, స్వతంత్ర "పరిమాణాలు" (dimensions)గా పరిగణించి, యీ పరిమాణాలలో ప్రతిదానిలోనూ విడివిడిగా సామాజిక విభజన చూడవచ్చునని ఊహించినాడు. యిది పలు "పొరల కల్పనల"ను ఉత్పన్నం చేసింది: ఆర్థిక పరిమాణంలో మనుషులు వర్గాలుగా విభజింపబడినారు, సామాజిక పరిమాణంలో "స్థాయిల" వ్యవస్థ వుంది, రాజకీయ పరిమాణంలో పార్టీలుగా విభజన వుంది. యీ సిద్ధాంతంలోని తప్పు యేమిటంటే, యిది సామాజిక జీవితంలోని వివిధ రంగాలు ఆర్థిక వ్యవస్థమీద ఆధారపడడాన్ని నిరాకరించి, సామాజిక జీవితం గురించిన అద్వైత దృక్పథం స్థానంలో మిశ్రమ దృక్పథాన్ని పెడుతుంది. యిది ఆధునిక బూర్జువా సామాజిక శాస్త్రజ్ఞులకు మహా విలక్షణమైన వైఖరి. "బహు పరిమాణాల పొరల కల్పన" సూత్రం సామాజిక శాస్త్రపు ఘన విజయంగా చెప్పబడడంలో ఆశ్చర్యం లేదు. దీని ప్రాతిపదికమీద కొత్త సిద్ధాంతాలు వెల్లువగా వచ్చినాయి; పరిమాణాల సంఖ్య విషయంలోనూ, పొరల కల్పనకు ప్రాతిపదికగా తీసుకోబడిన లక్షణాల స్వభావం విషయంలోనూ యివి వెబర్ సిద్ధాంతంతోనే కాక, ఒకదానితో ఒకటి కూడా విభేదిస్తాయి.

మార్క్సిస్టు వర్గ పరిశీలన పద్ధతికీ, మార్క్సిస్టు వర్గ సిద్ధాంతానికీ కాలం తీరిందా అనీ, సామాజిక నిర్మాణపు అధ్యయనంలో పొరల కల్పన అనేది పురోగమనం అనడానికి ఆధారం వుందా అనీ యెవరైనా అడగవచ్చు. జవాబు యేమిటంటే, మొదట మార్క్సిస్టు వర్గ సిద్ధాంతం వర్గ విభేదాలను మాత్రమే గుర్తిస్తుందనీ, యితర విభేదాల నన్నిటినీ త్రోసిపుచ్చుతుందనీ అనడం మార్క్సిస్టు వర్గ సిద్ధాంతంనుండి వచ్చే నిర్ధారణ కాదు. మేము చెప్పినట్లు, మనుషుల మధ్య వివిధ విభేదా లున్నాయి; వీటిని నిర్ణయించి, వర్గాలతో పాటు వివిధ బృందాలు కూడా వున్నాయని ధ్రువపరచవచ్చు. అందుకనే, పొరల కల్పన సూత్రం, అనగా భిన్న లక్షణాల ఆధారంమీద వివిధ విభాగాలను పోల్చుకొనే సూత్రం, త్రోసిపుచ్చబడ లేదు సరికదా, వాస్తవంలో మార్క్సిజంచేత ఉపయోగించుకోబడుతున్నది. కానీ, పొరల కల్పన, దాని మార్క్సిస్టేతర వ్యాఖ్యానంలో, సామాజిక వర్గ విభజన స్థానంలో తరచుగా కేవల యాదృచ్ఛిక లక్షణాల ప్రాతిపదికమీద పోల్చుకోబడే పొరల బాహుళ్యాన్ని పెట్టడానికి ఉద్దేశింపబడింది. యీ పొరల బాహుళ్యం సమాజం కార్మికవర్గమూ, బూర్జువావర్గమూ అనే ప్రధాన వర్గాలుగా విభజింపబడిందనే విషయాన్నీ, వాటి మధ్య గల వైరుధ్యాన్నీ మరుగుపరచే ధోరణి వహిస్తుంది. తద్వారా, వర్గాలుగా జరిగిన మానవ విభజనను

అనుమేయమైన తరుచు అప్రధానమైన తారతమ్యాలుగా గంద్రగోళపడడం జరుగుతుంది; యిది సామాజిక జీవితాన్ని గురించి ఆత్మగత దృక్పథాన్ని కలిగిస్తుంది. అందువల్లనే, పౌరల కల్పన మాత్రం శాస్త్రరీత్యా విమర్శకు బొత్తిగా నిలవదు, భావజాలరీత్యా అది సామాజిక నిర్మాణం గురించిన బూర్జువా అభిప్రాయాలకు వాహనంగా ఉపకరిస్తుంది. అందువలన అది, సహజంగానే, సమాజపు సామాజిక నిర్మాణంయొక్క అచ్చమైన శాస్త్రీయ పరిశీలనకు అంగీకారయోగ్యం కాదు; నిజమైన శాస్త్రీయ పరిశీలనను మార్క్సిస్టు వర్గ పరిశీలన పద్ధతి, మార్క్సిస్టు వర్గ సిద్ధాంతం, సమకూర్చింది.

వర్గ పోరాటమూ, చరిత్రలో దాని పాత్రా. కార్మికవర్గపు వర్గ పోరాటంయొక్క విశిష్ట లక్షణాలు

ప్రతి వర్గమూ ఉత్పత్తి సంబంధాల వ్యవస్థలో తన ప్రతిపత్తినిబట్టీ, దానినుంచి ఉత్పన్నం అయ్యే ప్రయోజనాలనుబట్టీ ప్రవర్తిస్తుంది. పీడిత వర్గాలూ, పీడక వర్గాలూ పరస్పర పోరాటంలోకి అనివార్యంగా తోయబడుతాయి; యెందుకంటే, వాటి ప్రయోజనాలు విరుద్ధమైనవి. అందుకనే, సమాజం వర్గాలుగా విభజింపబడినప్పుడు వర్గ పోరాటం ఉద్భవిస్తుంది. సొంత ఆస్తి సంబంధాలనుండి ఉద్భవించిన వర్గ పోరాటాన్ని పాలక, దోపిడీ వర్గం తన ఆధిపత్యాన్ని దృఢపరచుకొనే సాధనంగానూ, దోపిడీ చేయబడే పీడిత వర్గం యేకైక విమోచన సాధనంగానూ ఉపయోగించుకుంటాయి. వర్గ పోరాటంలో యెప్పుడూ రెండు ధ్రువాలు వుంటాయి — యథాస్థితివాద, ప్రగతి వ్యతిరేక ధ్రువమూ, విప్లవాత్మక ధ్రువమూ. పీడిత వర్గాలతో చేసే పోరాటంలో పాలక వర్గాలు కొత్త సామాజిక వ్యవస్థ స్థాపనకూ అవసరమైన పాదార్థిక పరిస్థితులు పరిపక్వం కానంత వరకు తమ ఆధిపత్యపు స్థానాన్ని నిలబెట్టుకోగలవు.

విప్లవ శక్తులు యెప్పుడు గెలుస్తాయంటే, వాటి విజయానికి కావలసిన పాదార్థిక పూర్వావసరాలు పరిపక్వమైనప్పుడు, సమాజ గర్భం లోపల కొత్త ఉత్పాదక శక్తులకూ, పాత ఉత్పత్తి సంబంధాలకూ మధ్య ఘర్షణ ఉచ్చ దశకు చేరినప్పుడు. యీ పరిస్థితులలో, పాత ఆర్థిక రూపాలను ధ్వంసం చేయడంలో ప్రయోజనం గల సామాజిక శక్తులు యీ సంబంధాలకు వాహనాలుగా వున్న వర్గాలతో చేసే విప్లవాత్మక వర్గ పోరాటంద్వారా మాత్రమే

సంభావ్య ఘర్షణ పరిష్కరింపబడి, ఉత్పాదక శక్తుల యితోధిక అభివృద్ధికి దారి యేర్పరచబడుతుంది. శత్రుత్వపూరిత సామాజిక నిర్మాణాలలో చారిత్రకంగా పరిపక్వమైన సామాజిక అభివృద్ధి కర్తవ్యాలు నిర్వహించబడేదీ, పాతదానిమీద కొత్తదాని విజయం నిస్సందేహం చేయబడేదీ విప్లవాత్మక వర్గ పోరాటంద్వారా మాత్రమే. అందువల్లనే, అది శత్రుత్వపూరిత సామాజిక నిర్మాణరూపాల అభివృద్ధిలో ప్రధాన చోదక శక్తి, సమాజంలోని సామాజిక వైరుధ్యాల అభివృద్ధియొక్క, పరిష్కారంయొక్క ప్రధాన రూపం, సమాజ అభివృద్ధిలో ఒక నియమం. పాత వ్యవస్థను ధ్వంసం చేసి, కొత్త ఉత్పత్తి విధానపు అభివృద్ధికి బాటవేసే విప్లవంలో యీ వైరుధ్యాలు పరిష్కరింపబడుతాయి. విప్లవ మనేదే వర్గ పోరాటపు అభివృద్ధిలో శిఖర దశ. కనుక, విప్లవ వర్గాల పోరాటం చారిత్రకంగా అవసరమైన సామాజిక ఆచరణ రూపం, కాలం తీరిన సామాజికార్థిక నిర్మాణ చట్రాన్ని దాటిపోయేది, తద్వారా సమాజాన్ని ముందుకు తీసుకపోయి, కొత్త, ఉన్నత దశకు లేవనెత్తేది. యీ దశకు అవసరమైన పాదార్థిక పరిస్థితులు ఉత్పత్తి అభివృద్ధిచేత సిద్ధం చేయబడి వుంటాయి.

ఫ్యూడలిజంను తొలగించి, పెట్టుబడిదారీ అభివృద్ధికి దారి యేర్పరచింది బూర్జువావర్గ నాయకత్వంకింద రైతులూ, పట్టణవాసులూ చేసిన పోరాటమే. పెట్టుబడిదారీ వ్యవస్థలో బూర్జువావర్గంతో కార్మికవర్గ పోరాటం సాగుతూ, నిశిత మౌతుంది. వర్గ పోరాటం ఒక సామాజిక నిర్మాణంనుండి మరొకదానికి పరివర్తన జరిగేటప్పుడు సామాజిక అభివృద్ధిమీద ప్రభావం నెరపడమే కాక, ప్రతి నిర్దిష్ట సమాజంలోనూ ఉత్పత్తి అభివృద్ధిమీదా, సామాజిక, సాంస్కృతిక పురోగతిమీదా కూడా ప్రభావం నెరపుతుందని కూడా మనం గమనించాలి.

కార్మికవర్గపు వర్గ పోరాటమూ, దాని కారణాలూ, దాని అభివృద్ధికి సంబంధించిన పరిస్థితులూ, అవకాశాలూ — వీటి శాస్త్రీయ పరిశీలన మార్క్సిజం లెనినిజం సాధించిన చారిత్రక విజయం. యీ సమస్యమీద, చారిత్రక భౌతికవాదం చారిత్రక అభివృద్ధియొక్క వస్తుగత క్రమత్వంనుండి ముందుకు సాగుతుంది — కార్మికవర్గానికీ, బూర్జువావర్గానికీ మధ్య గల వైరుధ్యాలు పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలనుండి, కూలి శ్రమమీద పెట్టుబడి చేసే దోపిడీనుండి, అనివార్యంగా ఉత్పన్న మౌతాయనీ, పెట్టుబడిదారీ విధానపు అభివృద్ధితో యీ వైరుధ్యాలు సర్దుబాటు కావు సరికదా యింకా తీవ్రం కూడా అయ్యే ధోరణి వహిస్తాయనీ అనే నిర్వివాదమైన విషయంనుండి ముందుకు సాగుతుంది.

అదే సమయంలో, పెట్టుబడిదారీ వ్యవస్థ కార్మికవర్గపు వర్గ పోరాటంయొక్క పంథాలనూ, ఫలితాలనూ నిర్ణయించే పాదార్థిక పరిస్థితులను సృష్టిస్తుంది. ఉత్పత్తిని సామాజిక క్రమంగా చేయడంద్వారా పెట్టుబడిదారీ వ్యవస్థ దోపిడీని తొలగించడానికీ, సొంత ఆస్తి స్థానంలో ఉత్పాదక శక్తుల స్వభావానికి అనుగుణమైన సామాజిక ఆస్తిని

పెట్టడానికి కావలసిన పాదార్థిక పూర్వావసరాలను సృష్టిస్తుంది. సామాజిక ఉత్పత్తి అభివృద్ధిలోని నిర్దిష్ట దశలలో అవసరంగా వుండినట్టి వర్గాల ఉనికి చారిత్రక పురోగతికి బంధనం అవుతుంది. యీ పరిస్థితులలో కార్మికవర్గం పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలను ధ్వంసం చేసి, సొంత ఆస్తినుండీ, దోపిడీనుండీ మొత్తం సమాజాన్ని విముక్తి చేసి, సోషలిస్టు సమాజాన్నీ, తరువాత కమ్యూనిస్టు సమాజాన్నీ నిర్మించడంద్వారా మాత్రమే తన్ను తాను విమోచన చేసుకోగలదు. యీ సామాజిక కర్తవ్యాన్ని నిర్వహించడం ప్రపంచ చరిత్రలో కార్మికవర్గపు మహత్తర కర్తవ్యం; యెందుకంటే, అది చరిత్రలో అత్యంత విప్లవాత్మక వర్గం.

కార్మికవర్గానికి వివిధ మహత్తులు ఆపాదిస్తారనీ, దానిని అసాధారణమైన వర్గంగానూ, "కారణ జన్మురాలు"గానూ పరిగణిస్తారనీ మార్క్సిస్టులను నిందిస్తారు. కానీ యిందులో తప్పేమీ లేదు; యెందుకంటే, ప్రతి వర్గానికీ దాని విలక్షణ గుణాలు వుంటాయి, అలాగే కార్మికవర్గానికీ వుంటాయి. దానికి సొంత ఆస్తి యేమీ లేదు, సొంత ఆస్తిని కాపాడుకొనే పని లేదు. అందువల్లనే అది సొంత ఆస్తితో స్థిరంగా పోరాడుతుంది. అంతే కాక, కార్మికవర్గం ఉత్పత్తియొక్క అత్యంత పురోగామి రూపమైన భారీస్థాయి పరిశ్రమలతో ముడిపడి వుంది, అందువలన అది పెట్టుబడిదారీ వ్యవస్థతో పాటు అభివృద్ధి చెందుతుంది. కార్మికులు అపారమైన సంఖ్యలో ఫాక్టరీలలోనూ, కర్మాగారాలలోనూ, నగరాలలోనూ, పారిశ్రామిక కేంద్రాలలోనూ సాంద్రీకృత మౌతారు. కార్మికులు సమష్టిగా పనిచేయవలసి వుంటారు, అందువలన వాళ్లు వ్యవస్థీకృతంగా, క్రమశిక్షితంగా వుండడం నేర్చుకుంటారు. పెట్టుబడిదారీ సమాజంలో కార్మికవర్గపు ప్రతిపత్తి సమాజాన్ని సోషలిస్టు పద్ధతిలో పునర్నిర్మించేందుకు స్థిరమైన, దీక్షాపూరితమైన పోరాటానికి దానిని సమర్థురాలిని చేసి, సోషలిస్టు ఆదర్శానికి వాహనంగా చేస్తుంది. కనుక, యిది వర్గ ప్రత్యేకతను బోధించడం కాదు, వస్తుగత పరిస్థితిని అంచనా వేయడం మాత్రమే. కానీ, పెట్టుబడిదారీ వ్యవస్థ, ముఖ్యంగా పెట్టుబడిదారీ గుత్త సంస్థలు, రైతులనూ, పట్టణ పెటీబూర్జువాలనూ, మేధోపజీవులనూ, వలస, పరాధీన దేశాలలోని మొత్తం ప్రజానీకాలనూ కూడా పీడించి, దోపిడీ చేస్తాయి. అందువల్లనే, కార్మికవర్గపు ప్రయోజనాలు సమస్త శ్రామిక ప్రజల మౌలిక ప్రయోజనాలతో, సమాజంలోని అధిక సంఖ్యాకుల ప్రయోజనాలతో, సమవసించగా, కార్మికవర్గపు స్థానం వస్తుగతంగా దానిని ప్రజాస్వామ్యం కొరకూ, సోషలిజం కొరకూ జరిగే పోరాటంలో దోపిడీ చేయబడే శ్రామిక జనాల నాయకునిగా చేస్తుంది.

ఆధునిక పెట్టుబడిదారీ సమాజం తీవ్ర వర్గ పోరాటానికి రంగం. యీ పోరాటానికి వివిధ దేశాలలో నిర్దిష్ట లక్షణాలు వున్నాయి. పరిస్థితులనుబట్టి యీ పోరాటం తీవ్రంగా

వుండవచ్చు, మితంగా వుండవచ్చు; కానీ, శ్రామిక ప్రజల జీవన ప్రమాణాలమీద పెట్టుబడి చేసే ఒత్తిడి వలనా, వాళ్ల సామాజిక విజయాలు నష్టమయ్యే, లేదా తగ్గించబడే ప్రమాదం వలనా, ప్రజాస్వామిక హక్కులమీదా, స్వేచ్ఛలమీదా గుత్త సంస్థల దాడి వలనా, ఆయుధాల పోటీని తీవ్రతరం చేసేటందుకు, ప్రముఖ పెట్టుబడిదారీ దేశాలు అవలంబించే ప్రమాద కరమైన దౌర్జన్య విధానాల వలనా, వగైరాల వలన యీ పోరాటం ప్రతి చోటా సాగుతుంది.

గుత్త సంస్థల పెత్తనంతో చేసే పోరాటం సాధారణ ప్రజాస్వామిక స్వభావం గలది. యిది జనాలలో రాజకీయ చైతన్యాన్ని పెంచడానికీ, వాళ్లను కార్మికవర్గం చుట్టూ సమీ కరించడానికీ సోషలిస్టు విప్లవంయొక్క అవసరాన్ని వాళ్లు గుర్తించడానికీ తోడ్పడుతుంది. ప్రజాస్వామ్యం కొరకు చేసే పోరాటం సోషలిజం కొరకు చేసే పోరాటంలో ఒక అంగం.

కార్మికవర్గపు వర్గ పోరాటంయొక్క కర్తవ్యం పెట్టుబడిదారీ వ్యవస్థనుండి సోష లిజంకు పరివర్తనను సాధించడం. అది చేయవలసిన మొదటి పని అధికారాన్ని తన చేతుల్లోకి తీసుకోవడం. అధికారపు సమస్య వర్గ పోరాటంలో ప్రధాన సమస్య. కానీ, కార్మికవర్గపు ప్రయో జనాలూ, బూర్జువావర్గపు ప్రయోజనాలూ రాజీపడజాలనివి గనుకా, నూతన సామాజిక వ్యవస్థ స్థాపనకు బూర్జువావర్గపు ప్రతిఘటన అనివార్యం గనుకా, పెట్టుబడిదారీ సమాజంలో కార్మికవర్గం అత్యంత వ్యవస్థీకృతమైన, స్థిరంగా విప్లవాత్మకమైన వర్గం గనుకా, సోషలిజంకు యేకైక మార్గం శ్రామిక ప్రజల యితర విభాగాల పొత్తుతో కార్మికవర్గంయొక్క అధికార స్వీకారంద్వారా వుంది. అందువల్లనే, కార్మికవర్గ నియంతృత్వ స్థాపన బూర్జువా సమాజంలో కార్మికవర్గంయొక్క వర్గ పోరాటపు అవశ్య ఫలితమని మార్క్సిజం చెపుతుంది. "వర్గ పోరాటపు గుర్తింపును కార్మికవర్గ నియంతృత్వపు గుర్తింపుకు విస్తృతపరచేవాడు మాత్రమే మార్క్సిస్టు."* యిది వర్గ పోరాటం గురించిన మార్క్సిస్టు దృక్పథం.

తన వర్గ ప్రయోజనాలనుబట్టి బూర్జువావర్గం విప్లవోద్యమాన్ని అణచివేయ జూస్తుంది. యీ పని చేయడానికి అది లంచమూ, దౌర్జన్యమూ కాక, కార్మికవర్గానికి దాని వర్గ చైతన్యాన్ని నష్టపరచేటందుకూ, దానిమీద బూర్జువావర్గానికి అనుకూలమైన భావ జాలాన్ని రుద్దేటందుకూ వివిధ భావజాల ప్రభావపు పద్ధతులను ఉపయోగిస్తుంది. వర్గ వైరుధ్యాలు బూర్జువా వ్యవస్థ చట్రం లోపల కూడా రాజీపడగలిగినవే అనీ, పోరాటమంటూ జరిగితే కూడా, విధిగా పెట్టుబడిదారీ వ్యవస్థ తొలగిపోదనీ, వర్గాల మధ్య రాజీ మాత్రమే ఫలిస్తుందనీ కార్మికవర్గాన్ని నమ్మించడానికి వివిధ ప్రయత్నాలు జరుగుతున్నాయి. వర్గ పోరాటానికి భిన్నంగా బూర్జువా రాజకీయవాదులూ, సిద్ధాంతకారులూ "వర్గ శాంతి"నీ,

* వి. ఐ. లెనిన్, "యేరిన రచనలు," రెండవ భాగం (రెండవ ముద్రణ), మాస్కో, పుట 173.

"వర్గ సహకారా"న్ని, "శ్రమ, పెట్టుబడుల భాగస్వామ్యా"న్ని, వర్గైరాలను బోధిస్తారు. కార్మికవర్గం తన పీడిత ప్రతిపత్తికి లొంగివుండాలనీ, తన లక్ష్యాలను విసర్జించాలనీ, బూర్జువా భావజాలానికి అణగివుండాలనీ, బూర్జువా విధానాలకు విధేయమైన పరికరం కావాలనీ చేసే డిమాండుకు ముసుగు మాత్రమే యీ "శాంతికాముక" పడికట్టు పదాలన్నీ. దక్షిణపక్ష సోషలిస్టులూ, సంస్కరణవాదులూ తమ కార్యక్రమాలలో వర్గ పోరాటాన్ని బొత్తిగా ప్రస్తా వించరు, రాజకీయ, సామాజిక సమస్యల పరిష్కారంలో వర్గ వైఖరిని విసర్జిస్తారు.

బూర్జువా సామాజిక శాస్త్రజ్ఞులు పెరుగుతున్న "సామాజిక చలనశీలత," అనగా కిందినుండి పై సామాజిక పొరలకు మనుషుల చలనం, పురోగతికి ప్రధాన విషయం అని సూచిస్తారు. తత్ఫలితంగా, నిర్దిష్ట సమాజంలో అలాంటి చలనానికి అవకాశాలు యెంత యెక్కువగా వుంటే ఆ సమాజం అంత "వికసితం"గా, ప్రగతిశీలంగా వుంటుందట. "సామాజిక చలనశీలత" సిద్ధాంతానికి అనుగుణంగా అమెరికా సంయుక్త రాష్ట్రాల బూర్జువా ప్రచారం ఆ దేశంలో యే బూటు పాలిష్ కుర్రవాడైనా కోటీశ్వరుడు కావచ్చునని చెపుతూ వుంటుంది.

కానీ, "సామాజిక చలనశీలత" వ్యక్తులనూ, బృందాలనూ ప్రభావితం చేసినప్పటికీ, అది వర్గాల సమస్యను పరిష్కరించదు. అది వర్గ వైరుధ్యాలనూ, వర్గ విభేదాలనూ తొలగించదు గనుక, పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క సామాజిక సమస్యలను కూడా పరిష్కరించదు. యెంతైనా, "సామాజిక చలనశీలత"ద్వారా కార్మికు లందరూ పెట్టుబడిదారులు కాగలరని ఊహించడం పరిహాసాస్పదం.

కనుక, వర్గ పోరాటం గురించి రెండు పరస్పర విరుద్ధమైన ప్రపంచ దృక్పథాలు ఘర్షి స్తున్నాయి: దోపిడీనుండి సమాజానికి విముక్తి మార్గం చూపించే మార్క్సిస్టు దృక్పథమూ, శ్రామిక ప్రజలను పెట్టుబడిదారుల ప్రయోజనాలకు లోబరచడానికి ఉద్దేశింపబడిన బూర్జువా దృక్పథమూ.

వర్గాల వైరుధ్యం సామాజిక జీవితపు ప్రతి రంగంలోనూ వ్యక్తమౌతుంది, కానీ ఒక్కొక దానిలో ఒక్కొక విధంగా. వర్గ పోరాటపు ప్రధాన రూపాలు ఆర్థికమూ, రాజకీయమూ, భావజాలాత్మకమూ. అవి యేకమైనప్పుడు మాత్రమే పోరాటపు అంతిమ లక్ష్యాలు సాధింప బడే అవకాశం వుంది. కార్మికవర్గపు వర్గ పోరాటానికి సంబంధించి వాటి విశిష్ట లక్షణాలనూ, పరస్పర సంబంధాలనూ పరిశీలిద్దాం.

ఆర్థిక పోరాటం కార్మికుల దినసరి అవసరాలూ, మేలైన పని పరిస్థితులూ, యెక్కువ వేతనాలూ, వగైరాల కొరకు జరిగే పోరాటం. యిది చాలా ముఖ్యమైనది; యెందుకంటే, యిది దారిద్ర్యాన్ని యెక్కువ చేసే ధోరణికి వ్యతిరేకంగా పనిచేస్తుంది, వర్గ సంఘీభావాన్ని పెంపొం

దించడానికి తోడ్పడుతుంది. కానీ, యీ పోరాటం విధిగా పరిమితమైనది; యెందుకంటే, యిది వ్యష్టి లక్ష్యాల కొరకూ, పాక్షిక లక్ష్యాల కొరకూ జరుగుతుంది గానీ, పెట్టుబడిదారీ వ్యవస్థను తొలగించే సాధారణ కర్తవ్యాన్ని పెట్టదు. కార్మికవర్గ పోరాటాన్ని ఆర్థిక చట్రానికి పరిమితం చేయడమంటే కార్మికులను శాశ్వత దాస్యంలో బంధించడమే అని లెనిన్ ఆర్థిక వాదులతో చేసిన పోరాటంలో చూపించినాడు. అందువల్లనే, ఆర్థిక పోరాటాన్ని సాధ్యమైన ఒకేఒక పోరాటంగానూ, ప్రధానమైనదిగానూ చూడకూడదు.

రాజకీయ పోరాటం కార్మికవర్గపు వర్గ పోరాటంయొక్క ప్రధానమైన, నిర్ణాయకమైన రూపం. ప్రతి వర్గ పోరాటమూ ఒక రాజకీయ పోరాటమనే ప్రసిద్ధ సూత్రాన్ని మార్క్స్ ప్రతిపాదించినాడు. పెట్టుబడిదార్లతో కార్మికులు చేసే పోరాటం రాజకీయమైనంత మేరకు మాత్రమే, అనగా రాజకీయ రంగానికి వ్యాపించ సాగినప్పుడు మాత్రమే వర్గంతో వర్గం చేసే పోరాట మౌతుందని దీని అర్థం. కార్మికులకు చెందిన కొన్ని ఒంటరి బృందాల యొక్క, లేదా వృత్తి బృందాలయొక్క ప్రయోజనాలను కాక, కార్మికవర్గపు సమష్టి వర్గ ప్రయోజనాలను ముందుకు తెచ్చేది రాజకీయ పోరాటమే.

రాజకీయ పోరాటపు గతిలో వివిధ డిమాండ్లు పెట్టబడుతాయి—సామాజిక శాసనాల మెరుగుదలా, ప్రజాతంత్ర స్వేచ్ఛల విస్తరణా, వాటికి హామీలూ, బూర్జువా ప్రభుత్వాలు తీసుకొనే వివిధ ప్రగతివ్యతిరేక చర్యలకు ఆక్షేపణలూ లాంటివి. రాజకీయ పోరాటపు గతిలోనే అధికార సమస్య ఉత్పన్నమయ్యేది. యిది సహజమే, యెందుకంటే, రాజకీయ పోరాటంలో మాత్రమే, రాజకీయ సాధనాలతో మాత్రమే కార్మికవర్గం బూర్జువావర్గంనుండి అధికారాన్ని గుంజుకోగలదు. విప్లవాత్మక సన్నివేశంలో యిది తక్షణ ఆచరణాత్మక కర్తవ్యం అవుతుంది.

వర్గ పోరాటపు మూడవ ప్రధాన రూపమైన భావజాలాత్మక పోరాటం కూడా రాజకీయ పోరాటపు అవసరాలకు లోబడివుంటుంది. అది జనాలమీద పలుకుబడి కొరకు చేసే పోరాటం, జనాల మనస్సులలోకి సోషలిస్టు చైతన్యాన్ని ఎక్కించడానికి చేసే కృషి. అందువల్లనే అది రాజకీయ పోరాటపు ఆచరణనుండీ, దాని అవసరాలనుండీ విడదీయరానిది. బూర్జువా భావ జాలాన్నీ, మార్క్సిస్టు లెనినిస్టు సిద్ధాంతానికి జరిగే రివిజనిస్టు, పిడివాదపు వక్రీకరణలనూ విమర్శించడం భావజాలాత్మక పోరాటపు కర్తవ్యం.

కార్మికవర్గపు వర్గ పోరాటంలో నాయకత్వమూ, దర్శకత్వమూ వహించే పాత్ర విప్లవ రాజకీయ పార్టీకి చెందుతుంది. శాస్త్రీయ సిద్ధాంతంచేత నడిపించబడి, జనాలతో సన్నిహితమైన సంబంధాలు గల పార్టీ లేకుండా కార్మికవర్గం తన వర్గ శత్రువులతో విజయవంతమైన పోరాటం చేయజాలదు. పెట్టుబడిదారీ వ్యవస్థ సామ్రాజ్యవాదంగా అభివృద్ధి చెంది, తద్వారా పెట్టుబడిదారీ వ్యవస్థలోని అంతర్వైరుధ్యాలను మరింత నిశితపరచినప్పుడు, కార్మికవర్గపు వర్గ పోరాటానికి దారి చూపించడానికి పాత సోషల్ డెమోక్రటిక్ పార్టీలు

అసమర్థంగా వుండిన విషయం జ్ఞాపకం చేసుకోవాలి. అవి అవకాశవాదుల పెత్తనానికి లోబడి, సంఘ సంస్కరణ పార్టీలుగా దిగజారి, కార్మికవర్గంమీద బూర్జువా ప్రభావపు సాధనాలుగా పనిచేసినాయి. అందువల్లనే, కార్మికవర్గపు వర్గ పోరాటాన్ని నడిపించే సామర్థ్యం గల కొత్త రకం పార్టీని, సామాజిక విప్లవపు పార్టీని, సృష్టించే జరూరు, ఆచరణాత్మక కర్తవ్యాన్ని చరిత్ర విప్లవ కార్మికవర్గం ముందర పెట్టింది. అలాంటి పార్టీని – బోల్షివిక్ పార్టీని – రష్యాలో లెనిన్ యేర్పరచినాడు. తదనంతరం ఉద్భవించిన యితర కమ్యూనిస్టు, కార్మిక పార్టీలకు అది నమూనాగా వుండింది. ఆ పార్టీలు యిప్పుడు పెట్టుబడిదారీ దేశాలలో ఈ నాటి కార్మికవర్గపు వర్గ పోరాటాన్నీ, సోషలిస్టు దేశాలలో నూతన సమాజ నిర్మాణాన్నీ నడిపిస్తున్న మహా బలీయమైన శక్తిగా వున్నాయి.

లెనిన్ కార్మికవర్గపు విప్లవ పార్టీకి చెందిన సిద్ధాంతాన్నీ, దాని వ్యవస్థీకరణ సూత్రాలనూ రూపొందించినాడు. కమ్యూనిస్టు పార్టీ కార్మికవర్గంలో ఒక భాగం, దాని చైతన్య పూరిత, వ్యవస్థీకృత అగ్రదళం. కార్మికవర్గ విప్లవ పార్టీ వర్గ సంస్థయొక్క అత్యున్నత రూపం, కార్మికవర్గపు సాధారణ వర్గ ప్రయోజనాలను వ్యక్తం చేస్తూ, దాని యితర సంస్థలన్నిటికీ దర్శకత్వం వహించవలసినట్టిది అని లెనిన్ చెప్పినాడు.

పార్టీయొక్క బలం దాని యేకశిలాత్మక ఐక్యతలోనూ, సంసక్తిలోనూ వుంది; యివి కార్మికవర్గపు ముఖ్య ప్రయోజనాల శాస్త్రీయ వ్యక్తీకరణమీద ఆధారపడి, పార్టీ సభ్యులందరికీ సమానంగా విధాయకమైన క్రమశిక్షణచేత దృఢపరచబడి వుండాలి.

మార్క్సిస్టు లెనినిస్టు పార్టీలన్నీ స్వతంత్రమైనవి, సమానమైనవి, మార్క్సిజం లెనినిజం దృష్ట్యా తమతమ దేశాలలోని నిర్దిష్ట పరిస్థితులనుబట్టి తమతమ విధానాలను రూపొందించుకుంటాయి. అదే సమయంలో, 1969లో మాస్కోలో జరిగిన కమ్యూనిస్టు, కార్మిక పార్టీల అంతర్జాతీయ సమావేశం ప్రకటించినట్లు, కార్మికవర్గ ఆశయంకొరకూ, శాంతి, ప్రజాస్వామ్యం, సోషలిజంలకొరకూ జరిగే పోరాటపు ప్రయోజనాలు కమ్యూనిస్టు, కార్మిక పార్టీలలో – ప్రపంచ మంతటా గల కమ్యూనిస్టులలో – యింకా యెక్కువ సంసక్తినీ, సంకల్ప, ఆచరణల ఐక్యతనూ ఆపేక్షిస్తాయి. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ ఐక్యతను నిరంతరం పటిష్ఠపరచడంపట్లా, ఆధునిక అవసరాలను తీర్చేటందుకు దానిని మరింత ఉన్నతమైన స్థాయికి లేవనెత్తడంపట్లా శ్రద్ధ ప్రతి మార్క్సిస్టు లెనినిస్టు పార్టీకీ అత్యున్నత అంతర్జాతీయ విధి. ఆ సమావేశంయొక్క ప్రధాన పత్రం యిలా చెప్పింది: "సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తుల నన్నిటినీ సమీకరించడంలో కమ్యూనిస్టు, కార్మిక పార్టీల ఐక్యత అత్యంత ముఖ్యమైన అంశం."*

---

* *International Meeting of Communist and Worker's Parties, Moscow, 1969*, Prague, 1969, పుట 36.

పార్టీ బలమూ, అజేయతా జనాలతో దానికి గల సంబంధాలలో వున్నాయి. పార్టీ తాను నడిపించే జనాల నమ్మకంమీదా, అండదండలమీదా ఆధారపడుతుంది, వాళ్ల అభిప్రాయాలకు యెల్లప్పుడూ ప్రతిస్పందిస్తూ, వాళ్ల అనుభవాన్ని సాధారణీకరిస్తుంది.

మార్క్సిస్టు లెనినిస్టు విప్లవ పార్టీలు శాస్త్రీయ భావజాలాన్ని జనాల మధ్యకు తీసుకపోతాయి, కమ్యూనిస్టు, కార్మికవర్గ ఉద్యమంయొక్క వ్యూహాత్మక పంథానూ, యెత్తుగడలనూ రూపొందిస్తాయి, వివిధ పోరాట రూపాలను సమ్మేళనం చేయడానికీ, ఉచితమైన సాధనాలను యెన్నుకోడానికీ తగినట్లుగా కృషిచేస్తాయి. రివిజనిజంతోనూ, పిడివాదంతోనూ చేసే పోరాటంలో అవి మార్క్సిస్టు లెనినిస్టు సిద్ధాంతపు స్వచ్ఛతను కాపాడుతూ, కొత్త అనుభవానికీ, చారిత్రక పరిస్థితులకూ అనుగుణంగా దానిని సృజనాత్మకంగా ముందుకు తీసుకపోతాయి, కార్మికవర్గపు అంతిమ లక్ష్యాల కొరకు సాగే పోరాటాన్ని దాని దినసరి అవసరాల కొరకు జరిగే పోరాటంతో లంకిస్తాయి.

కమ్యూనిజం కొరకు కృషి చేయడమూ, సామాజిక అభివృద్ధికి చెందిన మౌలిక సమస్యలను పరిష్కరించడమూ, మానవాళికి పీడనా, దోపిడీ, పస్తులూ, దారిద్ర్యమూ, సైనికతత్వమూ, యుద్ధమూ లేకుండా చేయడమూ, ప్రపంచమంతటా ప్రజాస్వామ్యాన్నీ, శాంతినీ, జాతుల మధ్య మైత్రినీ, మానవ యోగ్యమైన జీవితాన్నీ నెలకొల్పడమూ అనే మహత్తర కర్తవ్యాలను చరిత్ర కమ్యూనిస్టు, కార్మిక పార్టీల యెదుటబెట్టింది.

యీ కర్తవ్యాలను నిర్వహించేటందుకు కమ్యూనిస్టులు సమాజంలోని ప్రగతిశీల శక్తులన్నిటినీ కూడగట్టడానికి కృషిచేస్తారు, సోషలిస్టులూ, సోషల్ డెమొక్రట్లూ, యితర ప్రజాతంత్ర పార్టీలూ, సంస్థలూ ప్రపంచ పునర్నిర్మాణంలో పాల్గొనడానికి యిష్టపడి, సిద్ధపడినప్పుడు వాళ్లతో సహకారాన్ని బలపరుస్తారు.

ప్రస్తుత యుగంలో, ప్రపంచం పరస్పర వ్యతిరేకమైన రెండు సామాజిక వ్యవస్థలుగా విభజింపబడి వుండడంతో సంబంధం లేకుండా వర్గ పోరాటాన్ని అర్థం చేసుకోవడం అసాధ్యం. ఆ రెండు వ్యవస్థల మధ్య వర్గ వైరుధ్యం వున్నప్పటికీ, ఆయా దేశాలలోని వర్గ సంబంధాల పరిశీలనలో రూపొందించబడిన భావాలను వాటికి అన్వయించడం సమంజసం కాదు. వాటి మధ్య మౌలిక సామాజికార్థిక, రాజకీయ విభేదాలూ, వాటి స్వభావాలలో వైరుధ్యమూ వున్నప్పటికీ, అవి రెండూ ఒకరి ఆంతరంగిక వ్యవహారాలలో ఒకరి జోక్యం లేకపోవడమూ, ఉభయులకూ లాభదాయకమైన వర్తకమూ, మొదలైన సంబంధాలు నెలకొల్పుకొని, సహజీవనం చేయగలవు, చేయక తప్పదు. శాంతియుత సహజీవనం సామాజిక అభివృద్ధికి వస్తుగత అవసరం. అది పెట్టుబడిదారీ వ్యవస్థనుండి సోషలిజంకు మారే విప్లవాత్మక పరివర్తన పరిస్థితులు భిన్న దేశాలలో ఒకే కాలంలో పరిపక్వం కాలేదనే వాస్తవంనుండి ఉద్భవిస్తుంది.

యే జాతికైనా తన యిచ్ఛను గానీ, తన సామాజిక రాజకీయ వ్యవస్థను గానీ మరొక జాతి మీద రుద్దే హక్కు లేదు. తనకు ఉత్తమమైనదిగా కనపడే వ్యవస్థను అనుసరించే హక్కు ప్రతి జాతికీ వుంది. అందువల్ల విప్లవం జరిగిన దేశాలూ ఇంకా పాత వ్యవస్థ ఉన్న దేశాలూ సహజీవించక తప్పదు. అత్యంత దౌర్జన్యశీల సామ్రాజ్యవాద బృందాలు సమానత్వంమీదా, ఒకరి వ్యవహారాలలో ఒకరు జోక్యం కలిగించుకోకపోవడంమీదా ఆధారపడిన సంబంధాలను పోషిస్తూ దేశాలతో నెలకొల్పుకోడానికి నిరాకరించి, "ప్రచ్ఛన్న యుద్ధానికి" మరలించడానికి, దానిని బహాట యుద్ధంగా మార్చడానికి ప్రయత్నిస్తున్న మాట నిజమే. కానీ, యిప్పుడిప్పుడే శాంతి శక్తులు యెంతగా బలపడినాయంటే, అవి దౌర్జన్య విధానాన్ని భగ్నం చేయడానికీ, ప్రతీఘాత విప్లవపు యెగుమతితో పోరాడడానికీ, శాంతియుత సహజీవనాన్ని కలిగించడానికీ, నేటి ప్రపంచంలో జరిగే అంతర్జాతీయ ఉద్రిక్తత సడలింపుయొక్క క్రమాలు వెనుక ముఖం పట్టకుండా చేయడానికీ సమర్థంగా వున్నాయి. పెట్టుబడిదారీ దేశాలలోని ఆంతరంగిక క్రమాలే విప్లవ ప్రేలుళ్లను కలిగించి, పెట్టుబడిదారీ వ్యవస్థ స్థానంలో సోషలిజంను పెట్టే స్థితికి దారితీయక తప్పదు; అందువలన యీ ప్రయోజనాలకు యుద్ధంతో యేమీ సంబంధం లేదు. దీనికి కావలసింది శాంతి; శాంతి కొరకు ధైర్యంగా, దీక్షగా పోరాటం చేయాలి. మాస్కో సమావేశపు ప్రధాన పత్రం యిలా నొక్కి చెప్పింది: ప్రస్తుత పరిస్థితులలో "శాంతి పరిరక్షణ భిన్న సామాజిక వ్యవస్థలుగల రాజ్యాలతో శాంతియుత సహజీవనాన్ని అంగీకరించేటట్లు సామ్రాజ్యవాదులను నిర్బంధించడానికి చేసే పోరాటంతో విడదీయరాకుండా ముడివడివుంది; సర్వసత్తాకతా, సమానత్వమూ, పెద్దదైనా, చిన్నదైనా, ప్రతి రాజ్యంయొక్క ప్రాదేశిక అనుల్లంఘ్యతా, యితర దేశాల ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యం కలిగించుకోకపోవడమూ, ప్రతి ప్రజానీకానికీ తమ సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థను స్వేచ్ఛగా నిర్ణయించుకోడానికి గల హక్కులపట్ల గౌరవమూ అనే సూత్రాలను పాటించాలని యీ పోరాటం డిమాండు చేస్తుంది....

"యే పీడిత ప్రజానీకానికైనా తన విమోచన కొరకు తాను అవసరమని భావించే సాధనాలతో — సాయుధ సాధనాలతో నైనా, శాంతియుత సాధనాలతో నైనా — పోరాడడానికి గల హక్కును శాంతియుత సహజీవన విధానం కాదనదు. యీ విధానం యే విధంగానూ ప్రగతి వ్యతిరేక వ్యవస్థలకు అండదండలు కాదు."*

జ్ఞాపకం పెట్టుకోవలసిన మరొక విషయం యేమిటంటే, భిన్న సామాజిక వ్యవస్థలు

* *International Meeting of Communist and Worker's Parties, Moscow, 1969*, Prague, 1969, పుట 31.

గల రాజ్యాల మధ్య శాంతియుత సహజీవనం పెట్టుబడిదారీ వ్యవస్థకూ, సోషలిజంకూ మధ్య జరిగే వర్గ పోరాటానికి ఒక రూపం. యీ పోరాటం సామాజిక జీవితపు ప్రతి ప్రధాన రంగంలోనూ — ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలలో — కూడా జరుగుతుంది. ఆ రెండు వ్యవస్థల మధ్య జరిగే ఆర్థిక పోరాటం ఆర్థిక పోటీ రూపం ధరిస్తుంది; రాజకీయ పోరాటం శాంతి కొరకు పోరాటమూ, శాంతి శత్రువులమీద బలమైన చర్యా, తమ జాతీయ విమోచన కొరకూ, సామాజిక ఉద్ధరణ కొరకూ సామ్రాజ్యవాదంతో పోరాడే ప్రజానీకాలకు సహాయమూ అనే రూపం ధరిస్తుంది. భావజాల రంగంలో, భావజాలాల మధ్య రాజీలేని పోరాటం వుంది.

పీడిత ప్రజానీకాలు సామ్రాజ్యవాదంతో చేసే జాతీయ విమోచన పోరాటపు ప్రయోజనాలకు శాంతియుత సహజీవనం వ్యతిరేకమని కొందరన్నారు. అది తప్పు. ప్రతి పీడిత ప్రజానీకానికీ తన విమోచన కొరకు పోరాడే హక్కు వుంది. భిన్న సామాజిక వ్యవస్థలు గల రాజ్యాల శాంతియుత సహజీవన మనేది ఒక రాజ్యం ఆంతరంగిక వ్యవహారాలలో మరొక రాజ్యపు జోక్యాన్ని నివారించడానికి ఉపకరిస్తుంది. మేము పైన చెప్పినట్లు, అది ఒక జాతిమీద మరొక జాతి పీడనను కాక, రాజ్యాల సర్వసత్తాకతనూ, సమానత్వాన్నీ, పరస్పర జోక్యం లేకపోవడాన్నీ కలిగిస్తుంది.

సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ భిన్న సామాజిక వ్యవస్థలు గల రాజ్యాల మధ్య శాంతియుత సహజీవనమనే లెనిన్ విధానాన్ని స్థిరంగా అనుసరిస్తుంది, యెందుకంటే, రాజ్యాల మధ్య గల భావజాల, రాజకీయ వివాదాలను యుద్ధంద్వారా పరిష్కరించుకోకూడదు.

మేము యిక్కడ దేని మౌలిక సూత్రాలను వివరిస్తూ వుండినామో ఆ వర్గాలకూ, వర్గ పోరాటానికీ చెందిన మార్క్సిస్టు సిద్ధాంతాన్ని నిర్దిష్ట స్థల, కాల పరిస్థితులనూ, ఆయా దేశాల అభివృద్ధియొక్క స్థాయినీ, చారిత్రక లక్షణాలనూ దృష్టిలో పెట్టుకొని అన్వయించాలి. యీ పరిస్థితులు ప్రపంచంలో మహా భిన్నభిన్నంగా వున్నాయి. అందువల్లనే, ప్రతి సందర్భంలోనూ రూళ్ల కర్రలాంటి పరిష్కారాలను సిద్ధాంతంనుండి ఆశించకూడదు. సిద్ధాంతాన్ని నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించడం సృజనాత్మక క్రమం. విప్లవ వర్గానికీ, శ్రామిక ప్రజలకూ అగ్రభాగాన వున్న పార్టీల సిద్ధాంత, రాజకీయ స్థాయి యెంత ఉన్నతంగా వుంటే అంత విజయవంతంగా వుంటుంది ఆ క్రమం.

చారిత్రక సృజనాత్మక చర్యయొక్క, చారిత్రక కార్యాచరణయొక్క, కర్తగా కార్మిక వర్గానికి చాలా ముఖ్యమైనది యేమిటంటే, వస్తుగత పరిస్థితులనుబట్టి నిర్దిష్ట కర్తవ్యాలనూ, పోరాట పద్ధతులనూ నిర్వచించడం; వస్తుగత పరిస్థితులు యేమిటంటే, దేశంయొక్క అభివృద్ధి స్థాయీ, యితర వర్గాల స్వభావమూ, వాటి చర్యలూ, స్వదేశంలోనూ, అంత

ర్జాతీయ రంగంలోనూ వర్గ శక్తుల నిజమైన బలాబలాలూ, మొదలైనవి. కార్మికవర్గంయొక్క విప్లవ చైతన్య స్థాయినీ, వ్యవస్థీకరణ స్థితినీ, భావజాల రీత్యా అది యే మేరకు స్వతంత్రంగా వున్నదీ, లేక, తద్వ్యతిరేకంగా, యే మేరకు బూర్జువావర్గానికీ అంటిపెట్టుకొని వున్నదీ, పోరాటంలో తనకు పొత్తుదారులు కాగల యితర వర్గాల, విభాగాల, సామాజిక బృందాల, తెగల విషయంలో దాని ప్రతిష్ఠనూ, పలుకుబడినీ నిర్ణయించడం కూడా పోరాటపు విజయానికి చాలా ముఖ్యమైనది.

నాయకత్వపు కళలో ఒక అంశం యేమిటంటే, యీ విషయాల నన్నిటినీ సంపూర్ణంగా, సమగ్రంగా లెక్కలోకి తీసుకొనే సామర్థ్యమూ, తన సొంత బలహీనతలనూ, బలాలనూ, అలాగే తన శత్రువుల బలహీనతలనూ, బలాలనూ తెలుసుకునే సామర్థ్యమూ, ఆ ప్రాతి పదికమీద పోరాటపు నిర్దిష్ట లక్ష్యాలను నిర్ణయించి, విప్లవాత్మక చొరవను ప్రదర్శించే సామర్థ్యమూ, తద్వారా సార్వత్రిక ఉద్యమాన్ని పైకి యెత్తడానికి తోడ్పడడమూ.

సోషలిస్టు సమాజపు సామాజిక నిర్మాణమూ, దాని చలన నియమాలూ

కార్మికవర్గ నాయకత్వంకింద శ్రామిక ప్రజల అధికారం, సోషలిస్టు విప్లవ గతిలో గెలుచుకొన్న అధికారం, స్థాపించబడడంతో పెట్టుబడిదారీ వ్యవస్థనుండి సోషలిజంకు మారే పరివర్తన దశ ప్రారంభమౌతుంది. యిది పరివర్తన దశ అనబడేది యెందుకంటే, ఒక వైపున, యిది యిక యెంత మాత్రమూ పెట్టుబడిదారీ వ్యవస్థ కాదు, మరొక వైపున, యిది యింకా సోషలిజం కాదు. కొంత కాలంపాటు దేశంలో భిన్న ఆర్థిక రంగాలు సహజీవనం చేస్తూ ఒకదానితో ఒకటి పోటీచేస్తాయి. యీ రంగాల సంఖ్యా, స్వభావమూ దేశ అభివృద్ధి స్థాయిమీద ఆధారపడుతాయి. సాపేక్షంగా అభివృద్ధి చెందిన దేశంలో విప్లవం జరిగినప్పుడు మూడు రంగాలు సహజీవనం చేస్తూ, ఒకదానితో ఒకటి పోటీపడక తప్పదు: పెట్టుబడిదారీ రంగమూ, సన్నకారు సరుకుల రంగమూ, సోషలిస్టు రంగమూ; యీ చివరిది పెద్ద పెట్టుబడిదార్ల, భూస్వాముల ఆస్తిని జాతీయం చేయడంద్వారా యేర్పడుతుంది. వాటిని బట్టి, బూర్జువావర్గమూ, పెటీబూర్జువా వర్గమూ, కార్మికవర్గమూ పరివర్తన దశలో వుండే వర్గాలు.

సోషలిస్టు విప్లవం సమాజపు వర్గ నిర్మాణంలో మౌలికమైన మార్పును ప్రారంభి స్తుంది. బూర్జువావర్గం సమాజపు ప్రధాన వర్గంగా వుండడం అంతమౌతుంది, యెందు

కంటే, దాని రాజకీయ ఆధిపత్యం తొలగించబడి, ఆర్థిక బలం బలహీనపరచబడుతుంది. కార్మికవర్గం కొంతవరకు యింకా దోపిడీ చేయబడుతుంది (కార్మికులు పెట్టుబడిదారీ సంస్థలలో పనిచేయడం కొనసాగుతుంది గనుక), కానీ కార్మికవర్గంలో ఒక భాగం అప్పటికే సోషలిస్టు ఆర్థిక రంగంలో పనిచేస్తూ వుంటుంది. అంతే కాక, కార్మికవర్గం రాజకీయ అధికారం వహించి, జాతీయ ఆర్థిక వ్యవస్థలో కీలక స్థానాలను చేతిలో పెట్టుకొని వుంటుంది. రైతులకు తమ భూమి వచ్చివుంటుంది. సన్నకారు సరుకుల రంగంయొక్క భాగమూ, దానికి సంబంధించిన పెటీబూర్జువావర్గపు భాగమూ సాధారణంగా పెద్దవిగా వుంటాయి. కొత్త సోషలిస్టు మేధావివర్గం తయారౌతూ వుంటుంది.

ఆర్థిక రంగంలో పరివర్తన దశయొక్క కర్తవ్యం బహుళ రంగ ఆర్థిక వ్యవస్థను తొలగించి ప్రధాన ఉత్పత్తి సాధనా లన్నిటిలోనూ సామాజిక ఆస్తిని స్థాపించడం. యీ కర్తవ్య నిర్వహణ ఫలితంగా కాలక్రమాన సమాజపు సామాజిక నిర్మాణంలో ముఖ్యమైన మార్పులు కలుగుతాయి. దోపిడీ, దోపిడీ వర్గాలూ శాశ్వతంగా తొలగించబడుతాయి. యీ వర్గాల తొలగింపు అంటే, సహజంగానే, వీటి సభ్యులను చంపివేయడం కాదు, సొంత ఆస్తిని తొలగించడం మాత్రమే. నిర్దిష్ట పరిస్థితులనుబట్టి సొంత ఆస్తి స్వాధీనం చేసుకోబడుతుంది, లేదా కొనివేయబడుతుంది. వ్యక్తుల సొంత శ్రమద్వారా ఆర్జింపబడే సన్నకారు సొంత ఆస్తి విషయంలో కర్తవ్యం యేమిటంటే, సహకారంద్వారా దానిని క్రమక్రమంగా సామాజికీకరించడం. అలాంటి సామాజికీకరణ పూర్తిగా ఐచ్ఛికంగా వుండాలనీ, సన్నకారు ఉత్పత్తిదారులలో పెరుగుతున్న సాంస్కృతిక ప్రమాణాలనుండీ, సన్నకారు వ్యవసాయంకంటె భారీస్థాయి సమష్టి వ్యవసాయానికి సౌకర్యాలు వున్నాయని తెలియజేసే నిర్దిష్ట ఉదాహరణలనుండీ, ఉత్పత్తిలో శాస్త్ర, సాంకేతిక విజయాలను ఉపయోగించుకోడానికి భారీస్థాయి సమష్టి క్షేత్రాలకు గల సామర్థ్యంనుండీ దానికి ప్రోత్సాహం రావాలనీ లెనిన్ చెప్పినాడు. ప్రజానీకంలోని పెటీబూర్జువా విభాగాలను సోషలిస్టు తత్వంలో రూపుదిద్దడానికి సహకార సంఘాలు తోడ్పడుతాయి. యిది చాలా ముఖ్యమైన సామాజిక మార్పు. రైతు శ్రమజీవి, కనుక దోపిడీకి వ్యతిరేకంగా సోషలిజం కొరకు జరిగే పోరాటంలో అతను కార్మికునికి పొత్తుదారుడు. కానీ అతను ఆస్తిపరుడు కూడా; అందువలన అతను కార్మికవర్గానికీ, బూర్జువావర్గానికీ మధ్య ఊగిసలాడవచ్చు. పెటీబూర్జువా ఆస్తిపరుల యీ ద్వంద్వ సామాజిక స్వభావాన్ని లెక్కలోకి తీసుకోవడమూ, కార్మికవర్గానికీ, శ్రామిక ప్రజలలోని కార్మికవర్గేతర విభాగాలకూ మధ్య స్థిరమైన పొత్తును కలిగించడమూ పరివర్తన దశలోని అత్యంత ముఖ్యమైన సామాజిక రాజకీయ కర్తవ్యం. యీ పొత్తు సోషలిజం విజయాన్ని నిస్సందేహం చేసే ప్రధాన సామాజిక శక్తి.

మేధావుల విషయంలో, వాళ్ల కార్యాచరణనూ, జ్ఞానాన్నీ, నైపుణ్యాలనూ సోషలిస్టు నిర్మాణంలోకి మళ్లించే కర్తవ్యం కూడా వుంది. కనుక, పాత మేధావులు తమలో జీర్ణమైన బూర్జువా దురభిప్రాయాలను విసర్జించగలిగేటట్లు వాళ్లకు సైద్ధాంతికంగా పునరధ్యయనం యిస్తూ, శ్రామిక ప్రజలనుండి కొత్త, సోషలిస్టు మేధావివర్గం పెంపొందించబడుతున్నది. యీవిధంగా, బూర్జువావర్గం తన పెత్తనాన్ని నిలుపుకోడానికి ఉపయోగిస్తూ వుండిన జ్ఞానంమీద గుత్తాధికారం దానికి లేకుండా చేయబడింది.

పరివర్తన దశలోని యీ క్లిష్ట సామాజిక సమస్యలు పాత ప్రపంచపు శక్తులతో వర్గ పోరాటం లేకుండా పరిష్కరింపబడజాలవు; అందువల్లనే యీ దశ వర్గ పోరాటం కొనసాగే దశ; దాని కర్తవ్యాలూ, పరిస్థితులూ, రూపాలూ, సాధనాలూ మాత్రం మారుతాయి. పోరాటపు తీవ్రత నిర్దిష్ట పరిస్థితులమీద, కూలదోయబడిన వర్గాలనుండి వచ్చే ప్రతి ఘటనమీద ఆధారపడుతుంది. దాని పరిధి చాలా విస్తృతంగా వుంటుంది: అంతర్యుద్ధంనుండి దినసరి విద్యాబోధన కృషిదాకా.

శ్రమలోనూ, సామాజిక, రాజకీయ వ్యవహారాలలోనూ శ్రామిక ప్రజల క్రియాశీలత సర్వతోముఖంగా అభివృద్ధి కాకుండా సోషలిస్టు నిర్మాణం దురూహ్యం; యెందుకంటే, అక్కడ శ్రామిక ప్రజలు నూతన సామాజిక సంబంధాలకు వాహనాలుగానూ, చారిత్రక సృజనాత్మక కార్యాచరణకు నిజమైన కర్తగానూ వ్యవహరిస్తారు. యీ సామాజిక శాస్త్ర నిర్ధారణ లెనిన్ చేసినాడు. సోషలిజం అభివృద్ధి చెందేకొద్దీ అంతకంతకూ యెక్కువమంది జనాలు చైతన్యపూరితంగా చరిత్రను నిర్మించడంలో పాల్గొంటారని ఆయన అన్నాడు. మార్క్సిజం శాస్త్రీయ చైతన్యాన్ని జనాలకు అందివ్వగా, సోషలిజం ప్రతి జీవిత రంగంలోనూ వాళ్ల విశాలమైన సామాజిక క్రియాశీలతకు కావలసిన ఆచరణాత్మక పరిస్థితులను సృష్టిస్తుంది. యిది సామాజిక చొరవయొక్క విస్తీర్ణాన్ని పెంచి సత్వర సామాజిక అభివృద్ధికి కొత్త అవకాశాలను కలిగిస్తుంది.

పరివర్తన దశయొక్క కర్తవ్యాలు నిర్వహించబడిన తర్వాత, సమాజం సోషలిస్టు దశలో ప్రవేశిస్తుంది. మునుపటి సామాజిక నిర్మాణరూపాలతో పోలిస్తే దీనికి గుణాత్మకంగా భిన్నమైన సామాజిక నిర్మాణం వుంది; యెందుకంటే, దీనిలో దోపిడీ వర్గాలు లేవు: సోషలిస్టు సమాజంలో పనిచేసే బాధ్యత ప్రతివొక్కనికీ వుంది, అనార్జిత ఆదాయం పొందే హక్కు యెవనికీ లేదు. యీ దృష్టితో చూస్తే సోషలిజం వర్గరహిత సమాజ మనవచ్చు. కానీ, యిలా అనడం అకాలిక మౌతుంది. సోషలిస్టు సమాజపు సామాజిక నిర్మాణంలో వర్గాలు ముఖ్యాంశంగా వుండడం కొనసాగుతుంది, అవి చాలా భిన్నమైన వర్గాలే అయినప్పటికీ; యెందుకంటే, అవి ఉత్పత్తి సాధనాలలోని సామాజిక ఆస్తియొక్క భిన్న రూపాలతో ముడి

వడి వుంటాయి: యాజమాన్యపు (ప్రభుత్వ ఆస్తి), సహకార (బృంద) ఆస్తి అనే రూపాలతో. ఆస్తి రూపాలలోని యీ భేదమే సోవియట్ యూనియన్‌లో రెండు శ్రామిక సోషలిస్టు వర్గాల ఉనికికి ప్రాతిపదిక: కార్మికవర్గమూ, సమష్టి క్షేత్ర రైతాంగమూ అనేవి.

ఉత్పత్తి సాధనాలలో సొంత ఆస్తినీ, దానివెంట దోపిడీ వర్గాలనూ తొలగించినంత మాత్రాన, సోషలిస్టు ఆస్తి భిన్న విధాలుగా ఉత్పన్నమయ్యే చోట, సాంకేతికంగానూ, సాంస్కృతికంగానూ గ్రామాలు పట్టణాలకంటె వెనుకబడి వుండే చోట, శ్రామిక వర్గాల మధ్య భేదాలు యింకా మాసిపోయి వుండవు. సోషలిజంలో పారిశ్రామిక శ్రమా, వ్యావసాయిక శ్రమా, శరీర శ్రమా, మానసిక శ్రమా అనే విభజన యింకా వుంటుంది, వివిధ రకాల శ్రమకు గల సాంకేతిక పరికరాలలోనూ, ప్రజలలోని భిన్న విభాగాలకు గల విద్యా, సాంస్కృతిక, నైపుణ్య ప్రమాణాలలోనూ యింకా భేదాలు వుంటాయి. కార్మికులూ, రైతులూ కాక, మేధావులకూ, ఆఫీసు పనివాళ్లకూ చెందిన విభాగం వుంటుంది.

సోషలిస్టు సమాజపు సామాజిక నిర్మాణం, అన్ని వివరాలనూ దృష్టిలో పెట్టుకొని చూస్తే, సంకీర్ణంగా కనపడుతుంది. వర్గాల మధ్య విభేదాలకు తోడుగా వర్గాల లోపల విభేదాలు (నైపుణ్యాల స్థాయీ, శ్రమ గుణమూ, వగైరాల వలన) ఉత్పన్న మౌతాయి; వీటికి సహజంగా శ్రామిక ప్రజలలోని వివిధ విభాగాల పాదార్థిక ప్రమాణాలమీదా, సాంస్కృతిక అభివృద్ధి మీదా ప్రభావం వుంటుంది. మేధావివర్గం కూడా — వివిధ శాస్త్ర, సాంకేతిక, కళా రంగాలలో సృజనాత్మక కృషి చేసేవాళ్ళ, యింజనీర్లూ, టీచర్లూ, డాక్టర్లూ లాంటి సామూహిక వృత్తులలోని మేధావులూ, సేవలలోనూ, మేనేజిమెంటులోనూ, వగైరాలలో పనిచేసే నిపుణ కార్మికులూ దీనిలో వుంటారు — అసమంగా వుంటుంది. సోషలిజం ఉత్పత్తి సాధనాల విషయంలో సమానత్వాన్ని నెలకొల్పుతుంది, కానీ పంపకం రంగంలో అసమానత్వాన్ని నిలుపుతుంది; పనికి దాని పరిమాణాన్నీ, గుణాన్నిబట్టి ప్రతిఫలం యిచ్చే సూత్రంమీద యిది ఆధారపడి వుంటుంది. సమాజపు ఆకారం అసమంగా వుందంటే అర్థం సోషలిజంలో యింకా సామాజిక విభేదాలూ, సామాజిక అసమానతలూ వున్నాయని.

అయితే, సోషలిస్టు సమాజంలోని వర్గాల, సామాజిక బృందాల సంబంధాల గుణ నిర్ధారణకు ఆధారం యేమిటి?

సొంత ఆస్తినీ, దోపిడీ వర్గాలనూ తొలగించడంతో సమాజంలోని వర్గ పోరాటానికి ప్రాతిపదిక అదృశ్య మౌతుంది, వేల యేండ్లలో మొదటిసారిగా సమాజ సభ్యు లందరి మౌలిక ప్రయోజనాల యేకత్వం, తాత్కాలికమైనది కాదు, శాశ్వతమైనది, ఉత్పన్న మౌతుంది. కార్మికవర్గానికీ, సమష్టి క్షేత్ర రైతులకూ, మేధావులకూ అందరికీ ఉత్పాదక శక్తులను అభివృద్ధి చేయడంలోనూ, సోషలిస్టు వ్యవస్థను దృఢపరచడంలోనూ, కమ్యూనిజంను నిర్మించ

డంలోనూ ప్రయోజనం వుంటుంది. సమాజపు ప్రధాన ఉత్పాదక శక్తీ, సోషలిస్టు ఆదర్శానికి అత్యంత స్థిరమైన వాహనమూ అయిన కార్మికవర్గం సమాజపు నాయక శక్తిగా నిలిచి వుండగా, కార్మికులకూ, రైతులకూ, మేధావులకూ మధ్య మిత్ర సహకారం అభివృద్ధి చెందడానికి అది ఆధారం.

సోషలిజంయొక్క ఒక మౌలిక లక్షణం యేమిటంటే, సామాజిక జీవితపు ప్రతి రంగంలోనూ మనుషుల కార్యాచరణ మొత్తం సమాజంయొక్క ప్రయోజనాలచేతా, దానిని పటిష్ఠపరచి, అభివృద్ధిపరచే కర్తవ్యాలచేతా ప్రోత్సహించబడుతుంది -- యిది వివిధ సామాజిక బృందాల నిర్దిష్ట ప్రయోజనాలను తొలగించకపోయినప్పటికీ. సమాజం యావత్తూ క్రమక్రమంగా చారిత్రక క్రమానికి కర్త అవుతుంది. తమ కార్యాచరణలో మనుషులు వస్తుగత నియమాల పరిజ్ఞానంచేతా, తమ సొంత ప్రయోజనాల శాస్త్రీయ స్పృహచేతా నడిపించబడే స్థితికి వస్తారు.

అంతే కాక, సోషలిజంలో కమ్యూనిస్టుల మార్క్సిస్టు లెనినిస్టు పార్టీ మొత్తం సమాజంయొక్క అగ్రదళం అవుతుంది. సోషలిస్టు సమాజంలో ఒకే పార్టీయొక్క నాయకత్వపు పాత్ర సకల సామాజిక విభాగాల, వర్గాల ప్రయోజనాల యేకత్వానికి సహజమైన వ్యక్తీకరణ. సోవియట్ యూనియన్‌లో ఒకే పార్టీ వుండడం సోవియట్ వ్యవస్థ "నియంతృత్వం" కావడానికీ, ప్రజాస్వామ్యమూ, స్వేచ్ఛా అణచివేయబడడానికీ సాక్ష్యమని బూర్జువా ప్రచారకులు అంటారు. కానీ, అసలు విషయ మేమిటంటే, బూర్జువా కొలతబద్ద సోషలిజంకు వర్తించదు. విరుద్ధ వర్గాలు గల పెట్టుబడిదారీ వ్యవస్థలో కార్మికవర్గ పార్టీయొక్క చట్టబద్ధ కార్యాచరణను నిషేధించడం స్వేచ్ఛా, ప్రజాస్వామ్యాల అణచివేతకు సమానమే. బహుళ పార్టీ వ్యవస్థ అన్ని పరిస్థితులలోనూ ప్రజాస్వామ్యానికి పర్యాయపద మనడం నిజం కాదు. ఒక పార్టీ నాయకత్వంకింద సోషలిస్టు ప్రజాస్వామ్యం ఆచరణ సాధ్యమనీ, అది సోషలిస్టు సమాజపు శ్రామిక ప్రజల సమష్టి ప్రయోజనాలనూ, యిచ్ఛా, చర్యల యేకత్వాన్నీ వ్యక్తం చేస్తుందనీ చరిత్ర రుజువు చేస్తుంది. కానీ, అనేక పార్టీలు వుండడాన్ని యిది కాదనదు. బల్గేరియా, జర్మన్ ప్రజాతంత్ర రిపబ్లిక్, పోలండు, జెకొస్లొవేకియాల లాంటి సోషలిస్టు దేశాలలో అనేక పార్టీలు వున్నాయి. యీ పార్టీలన్నీ సోషలిస్టు నిర్మాణపు ఉమ్మడి పనిలో పాల్గొంటాయి. వీటి ఉనికి యీ దేశాలలోని విప్లవంయొక్క నిర్దిష్ట అభివృద్ధినుండి యేర్పడింది, సోషలిస్టు విప్లవపు సాధారణ నియమాలనుబట్టి కాదు. పార్టీయొక్క నాయక పాత్ర సమాజ భవిష్యత్తు విషయంలోనూ, సోషలిజంయొక్క భవితవ్యం విషయంలోనూ పార్టీ మీద అపారమైన విధులనూ, ప్రచండమైన బాధ్యతనూ మోపుతుంది. కనుక, సోషలిజంలోని సామాజిక సంబంధాలకు సామాజిక రాజకీయ, భావజాలాత్మక ఐక్యత విశిష్ట లక్షణంగా

వుంటుంది. యిది సోషలిస్టు సమాజాన్ని యేకశిలాత్మకంగా, సమైక్యంగా చేస్తుంది, గతంలో యెన్నడూ లేని ప్రమాణం గల కర్తవ్యాలను స్వల్ప చారిత్రక కాలాలలో నిర్వహించడానికి తోడ్పడుతుంది, సోషలిస్టు సమాజపు అభివృద్ధిలో బలీయమైన కొత్త చోదక శక్తిగా పని చేస్తుంది.

కానీ, యీ ఐక్యత వుండడమంటే సోషలిజంలో అంతర్వైరుధ్యాలు బొత్తిగా వుండవని కాదు. అవి వుంటాయి, కానీ అవి శత్రు వైరుధ్యాలు కాదు; యెందుకంటే, అవి పాత వ్యవస్థను నిలప గోరే సామాజిక వర్గాలనుండి ఉద్భవించవు. సోషలిస్టు సమాజం యీ వైరుధ్యాలను సకాలంలో, యివి పక్వమయ్యే కొద్దీ పరిష్కరించడానికీ, మొత్తం సమాజపు ప్రయోజనాలకు అనుగుణంగా పరిష్కరించడానికీ యిది తోడ్పడుతుంది.

సోషలిస్టు సమాజపు అంతర్వైరుధ్యాలు నిర్దిష్టమైనవి; యెందుకంటే, అవి సోషలిజంయొక్క ఆవిర్భావానికీ, అభివృద్ధికీ చెందిన నిర్దిష్ట లక్షణాలచేత నిర్ణయింపబడుతాయి. ఆర్థిక వ్యవస్థా, నిత్య జీవితమూ, మనుషుల ఆలోచనా, వగైరాలలో సోషలిజంకు పాత సమాజపు "పుట్టు మచ్చలు" వుంటాయని జ్ఞాపకం పెట్టుకోవాలి. సోషలిజంలో ఉదాహరణకు కొత్తకూ, అంతరించిపోతూ, అభివృద్ధిని మందగింపజేయడం ప్రారంభించే పాతకూ మధ్య వైరుధ్యాలు వుంటాయి: అభివృద్ధి చెందే ఉత్పాదక శక్తులకూ, ఉత్పత్తి సంబంధాలలో పాతబడిన వివిధ అంశాలకూ మధ్య, కొత్త ఉత్పత్తి స్థాయికీ, వ్యవస్థీకరణకూ, మేనేజిమెంటుకూ చెందిన పాత రూపాలకూ మధ్య, కొత్త పని పరిస్థితులకూ, కాలం తీరిన పాత పని విధానానికీ మధ్య, యిలా. అప్పుడప్పుడు యీ వైరుధ్యాలు యాదృచ్ఛికమైనవిగా వుంటాయి; యెందుకంటే, అవి, మాట వరుసకు, నాయకత్వంలోనూ, పథకీకరణలోనూ జరిగే పొరపాట్లవల్లా, వస్తుగత నియమాలను తగినంతగా పరిగణించక పోవడంవల్లా ఉత్పన్నమౌతాయి.

సోషలిస్టు సమాజంలో ఉత్పన్నమయ్యే అంతర్వైరుధ్యాలను వెలికితెచ్చి, పరిష్కరించే సమస్యకు చాలా శ్రద్ధ అర్పించబడుతున్నది; యీ సందర్భంలో, లోపాలతో పోరాడడంలో విమర్శకూ, ఆత్మవిమర్శకూ, నేర్పుతో కూడిన వ్యవస్థీకరణకూ చాలా ప్రాముఖ్యం వుంది.

సోషలిస్టు సమాజంలో వర్గాల మధ్యా, సామాజిక బృందాల మధ్యా వర్గ పోరాటం వుండదు. కానీ, అది పూర్తిగా వర్గ పోరాటానికి వెలిగా వుంటుందని నిర్ధరించడం తప్పు. సోవియట్ యూనియన్‌కూ, యితర సోషలిస్టు దేశాలకూ వర్గ పోరాటం ఆ దేశాల వెలుపల వుంది, పెట్టుబడిదారీ వ్యవస్థతో. అందువల్లనే, సోషలిస్టు దేశాల ప్రజానీకాలకు తమ విప్లవ అప్రమత్తతను సడలించే హక్కు లేదు. సోషలిస్టు సమాజ రక్షణకు ప్రధాన ఆయుధంగా తమ రాజ్యాల రక్షణ పాటవాన్ని నిత్యం పటిష్ఠపరచడం వాళ్ల విధి.

పైన చెప్పినట్లు, సోషలిస్టు సమాజపు సామాజిక నిర్మాణం చలనశీలమైనది, మారే స్వభావంగలది. దాని మార్పు ధోరణులు యేమిటి?

సోషలిజంలో మిగిలివుండే సామాజిక విభేదాలు సమాజపు ముఖ్య కార్యాచరణ క్రమంలో కొంత వరకు పునరుత్పన్న మయ్యే మాట నిజమే; కానీ, సోషలిజంయొక్క విలక్షణ గుణం యేమిటంటే, యీ విభేదాలు వ్యాపించవు, వృద్ధిచెందవు, తద్వ్యతిరేకంగా, మాసిపోతాయి, వర్గాలూ, సామాజిక బృందాలూ దగ్గరికి వస్తాయి. సోషలిజంలో అనేక అంశాలు యీ దిశలో పనిచేస్తాయి. వీటిలో ఒకటి, బహుశా అత్యంత ముఖ్యమైనది యేమిటంటే, ఉత్పత్తి సాధనాల విషయంలో సమాన ప్రతిపత్తిని స్థాపించడం. కార్మికులకూ, రైతులకూ మధ్య మిగిలి వున్న వర్గ విభేదాలను క్రమక్రమంగా అధిగమించడానికి అది ఆర్థిక ప్రాతిపదిక. యీ సమస్యకు అంతిమ పరిష్కారం తదనుగుణమైన పాదార్థిక పరిస్థితులను సిద్ధం చేయడంతో ముడిపడి వుంది: వ్యావసాయిక ఉత్పత్తియొక్క సాంకేతిక స్థాయిని పెంచి, వ్యావసాయిక శ్రమను పారిశ్రామిక శ్రమలో ఒక రకంగా మార్చడమూ, గ్రామాలలోని సాంస్కృతిక ప్రమాణాలనూ, నిత్య జీవిత ప్రమాణాలనూ పట్టణాలలోని స్థాయికి పెంచడమూ, వగైరా.

వివిధ సామాజిక విభాగాలను, ముఖ్యంగా శారీరిక శ్రమచేసేవాళ్లనూ, మేధోపజీవులనూ దగ్గరికి తేవడంలో అత్యంత ప్రాముఖ్యం గలది యేమిటంటే, విశాల శ్రామిక జనాలలో పాదార్థిక, సాంస్కృతిక ప్రమాణాలు పెరగడం. సోషలిజంలో విద్యను "సామాజిక చలనశీలత"కు కారణంగా మాత్రమే కాక, మానసిక శ్రమకూ, శారీరిక శ్రమకూ మధ్య గల విభేదాలను అధిగమించే మహా క్లిష్టమైన సామాజిక కర్తవ్యాన్ని నిర్వహించే సాధనంగా కూడా చూడాలి.

యీవిధంగా, సోషలిస్టు సమాజపు మారుతున్న సామాజిక నిర్మాణంలోని ప్రధానమైన, ప్రబలమైన ధోరణి యేమిటంటే, వర్గరహితమైన, సామాజికంగా యేక స్వభావం గల సమాజం వైపు పురోగమించడం. యీ గమ్యాన్ని చేరడమంటే, పరిపూర్ణ కమ్యూనిస్టు సమాజాన్ని—సామాజిక సమానత్వం గల సమాజాన్ని—నిర్మించడం.

ప్రకరణం యేడు

సమాజపు రాజకీయ వ్యవస్థీకరణ: నిర్మాణమూ, చలన నియమాలూ

రాజకీయ రంగం. రాజ్యమూ, న్యాయశాస్త్రమూ

సొంత ఆస్తీ, వర్గాలూ ఆవిర్భావంతో ప్రచండమైన సామాజిక పర్యవసానాలు యేర్పడుతాయి. ఒకటి, అప్పటికే రూపుదాల్చిన సామాజిక జీవిత రంగాలు — ఉత్పత్తి స్వభావమూ, సామాజిక వ్యవస్థపు నిర్మాణమూ, సామాజిక చైతన్యమూ — మౌలికంగా రూపాంతరం చెందుతాయి. రెండు, సామాజిక జీవితంలో కొత్త రంగాలూ, కొత్త విషయాలూ ప్రత్యక్ష మౌతాయి; వీటిలో ప్రత్యేక ప్రాముఖ్యం గలవి సామాజిక రాజకీయ సంబంధాలూ, వ్యవస్థలూ, సంస్థలూ.

సొంత ఆస్తిమీద ఆధారపడే ఉత్పత్తి రావడమంటే, గణ సంఘాల సామాజిక ఉత్పత్తి పోయి, దాని స్థానంలో ఉత్పత్తి సాధనాలమీద స్వామ్యం గల వ్యక్తుల ఆర్థిక యేకకాలు చిన్నవో, పెద్దవో రావడ మన్నమాట. సొంత ఆస్తి మనుషులను వేరుచేసి, ఒకరి కొకరిని వ్యతిరేకం చేస్తుంది. కానీ, సొంత ఆస్తి ఆర్థిక సుసంబద్ధతను పూర్తిగా నిర్మూలిస్తుందని దీని అర్థమా? కాదు. యెంతైనా, ఉత్పత్తి యెల్లప్పుడూ సామాజికంగానే వుంటుంది; యెందుకంటే, అది నిర్దిష్ట సామాజిక ఉత్పత్తి సంబంధాల రూపంలో సాగుతుంది; అనగా, భిన్న వర్గాలకు చెందిన వ్యక్తులను ఉత్పత్తిలోని వాళ్ల ఆర్థిక సంబంధాలు ఒకచోటికి తెస్తాయి. కనుక, ఒక వర్గం వుండడమంటే, మరొక వర్గం వుండడ మన్నమాట.

సొంత ఆస్తి యెలా మనుషుల మధ్య ఆర్థిక సంబంధాలను తొలగించకుండా వాటిని కేవలం మార్పుచేస్తుందో, అలాగే వర్గాలుగా జరిగే సమాజ విభజన సమాజంయొక్క

యేకత్వాన్ని నిర్మూలించదు, కేవలం ఆ యేకత్వానికి పూర్తిగా భిన్నమైన స్వభావాన్ని యిస్తుంది. అప్పటినుండి యీ యేకత్వం యిక యెంత మాత్రమూ యేకైక సమష్టి ఉత్పత్తి సంఘపు సభ్యుల మధ్య సహకారమూ, పరస్పర సహాయమూ అనే సంబంధాలమీద ఆధారపడకుండా, ఆధిపత్యమూ, పరాధీనతా అనేవాటిమీద, విరుద్ధ, శత్రు వర్గాల సంబంధాలమీద, ఆధారపడు తుంది. స్పష్టంగా, ఒక వర్గాన్ని మరొక వర్గమూ, మొత్తం సమాజాన్ని ఒక వర్గంయొక్క యిచ్ఛకూ బలవంతంగా అణచిపెట్టడంద్వారా మాత్రమే సమాజం యేకీకృతంగా వుండడం కొనసాగగలదు. అనగా, వర్గాల ఆవిర్భావంతో సామాజిక జీవితపు ప్రత్యేక రంగం, సాంఘిక రాజకీయ సంబంధాల రంగం, ఉత్పన్నమౌతుంది—అనగా, మొత్తం సమాజంమీద బల ప్రయోగపు యంత్రాంగం సాయంతో ఆధిపత్యం కొరకు వర్గాల పోరాటం జరిగే రంగం. రాజకీయ సంబంధాలు వ్యక్తుల మధ్య సంబంధాలు కావు, అవి వర్గాలలాంటి విస్తారమైన జన సముదాయాల మధ్య సంబంధాలు. యీ నూతన సామాజిక జీవిత రంగంయొక్క సంద ర్భంలో ఆర్థిక వ్యవస్థయొక్క నిర్ణాయక పాత్ర యెలా వ్యక్త మౌతుందంటే, ఆర్థిక వ్యవస్థ మీద ఆధిపత్యం గల వర్గానికి మొత్తం సమాజంమీద తన అభీష్టాన్ని రుద్దడానికీ, తన పరిపాలన వ్యవస్థీకరణకు దానిని లోబరచడానికీ భౌతిక అవకాశం వుంటుంది.

పాదార్థిక, ఆర్థిక సంబంధాలు మొదట మానవుల మనస్సుల గుండా గడవకుండా రూపు దాలుస్తాయి. దీనికి భిన్నంగా, రాజకీయ సంబంధాలు వర్గ పోరాటపు గతిలో వర్గ పోరాటపు ప్రాతిపదికమీద రూపుదాల్చే రాజకీయ చైతన్యాన్ని, రాజకీయ భావజాలాన్నిబట్టి రూపు దాలుస్తాయి. రాజకీయ సంబంధాలు భావజాల సంబంధాలు; యివి పాదార్థిక, ఆర్థిక సంబంధాల మీద నిలబడే ఉపరినిర్మాణం. రాజకీయాలకూ, ఆర్థిక వ్యవస్థకూ మధ్య గల చర్యా ప్రతి చర్యల విశిష్ట లక్షణం యేమిటంటే, "రాజకీయాలు ఆర్థిక వ్యవస్థయొక్క అత్యంత సాంద్రీ కృతమైన వ్యక్తీకరణ," "రాజకీయాలకు ఆర్థిక వ్యవస్థమీద ప్రాధమ్యం ఉండక తప్పదు."* మొదటిది రాజకీయాల పుట్టుకను వర్ణిస్తుంది, రెండవది సమాజ జీవితంలో వాటి పాత్రను వర్ణిస్తుంది.

రాజకీయ రంగం యెలా ఉద్భవిస్తుందంటే, సమాజం వర్గాలుగా విభజింపబడడంతో ఆర్థిక ప్రాబల్యం గల వర్గం దోపిడీ చేయబడే జనాలను బలప్రయోగం సాయంతో మాత్రమే తన యిచ్ఛకు లోబరచుకోగలుగుతుంది గనుకనే. దాని ప్రధాన ఆర్థిక ప్రయోజనం శ్రామిక ప్రజలను అదుపులో పెట్టడంలో వుంది, స్వదేశంలోనూ, విదేశాలలోనూ తన సొంత ఆస్తి సంపాదనా లక్ష్యాలను సాధించడంలో వుంది. అందువల్లనే, రాజకీయాలు అనేవి బలప్రయో

---

*V. I. Lenin, *Collected Works*, Vol. 32, పుటలు 32, 83.

గవు యంత్రాంగాన్ని అదుపులో పెట్టుకొని, దాని సాయంతో తన ఆర్థిక ప్రయోజనాలను సాధించుకోగల వర్గంయొక్క ఆర్థిక ఆశయాల సాంద్రీకృతమైన వ్యక్తీకరణా, పరిపూర్తి తప్ప మరేమీ కాదు. కానీ, దీనినుండి మరొక విషయం కూడా యేర్పడుతుంది: పీడిత వర్గం, దాని వంతుకు, రాజకీయ పోరాటం లేకుండా, దోపిడీదార్ల రాజకీయ పెత్తనాన్ని ధ్వంసం చేయకుండా, తన ఆర్థిక పరిస్థితులలో మౌలికమైన మార్పులు కలిగించలేదు. అందువలన, ఆర్థిక సమస్యలు పరిష్కరించడానికి రాజకీయాలు అవశ్య సాధనం గనుక, రాజకీయాలకు ఆర్థిక వ్యవస్థమీద ప్రాధమ్యం వుంది. రాజకీయాధికారాన్ని గెలుచుకోవడంద్వారా మాత్రమే యే ప్రగతిశీల వర్గమైనా కాలం చెల్లిన ఆర్థిక సంబంధాలను తొలగించి కొత్తవాటిని నెల కొల్పగలదు.

యీవిధంగా, ఆర్థిక సంబంధాలు రాజకీయ రంగంలో అత్యంత సూటిగా, నేరుగా ప్రతిబింబిస్తాయి. వర్గ వైరుధ్యాలతో నిండిన ప్రతి ఆర్థిక ప్రాతిపదికా సమాజంయొక్క నిర్దిష్ట రాజకీయ వ్యవస్థను, తనకు ఉచితమైనట్టిదానిని, ఉత్పన్నం చేస్తుంది. ఆర్థిక వ్యవస్థమీద ఆధిపత్యం వహించే వర్గం రాజకీయాలమీద కూడా ఆధిపత్యం వహిస్తుంది, అనగా అది మొత్తం సమాజంయొక్క నాయక శక్తి ప్రతిపత్తికి చేరుకుంటుంది. ఆధునిక పెట్టుబడిదారీ దేశాలలో కూడా యిలాగే జరుగుతుంది. వర్గాల మధ్య రాజకీయ సంబంధాలు మౌలికమైన, స్థిరమైన వర్గ ప్రయోజనాలచేత నిర్ణయింపబడుతాయి.

కానీ, ఆస్తిపరుల వర్గం ఒకటిగా వ్యవహరించినప్పుడు మాత్రమే, వ్యవస్థీకరింప బడినప్పుడు మాత్రమే మొత్తం సమాజంమీద తన ఆధిపత్యాన్ని చలాయించగలదు. ఆ వర్గం యితర, అధీన వర్గాలతో చేసే పోరాటంలో మాత్రమే ఉమ్మడి వర్గ ప్రయోజనాల స్పృహచేత ఐక్యపరచబడుతుంది, ఒకటిగా వ్యవస్థీకరింపబడుతుంది. ఆర్థిక వ్యవస్థమీద ఆధిపత్యం వహించే వర్గానికి చెందిన వ్యక్తులు దేనిద్వారా యేకైక సమస్తంగా యేర్పడి తమ యిచ్ఛను పీడిత వర్గంమీదా, సమాజంమీదా రుద్దుతారో ఆ వ్యవస్థీకరణను ఉద్భవింపజేసే పోరాటం యిదే. యీ రాజకీయ వ్యవస్థీకరణను రాజ్యం అంటారు.

వర్గాలకూ, వర్గ పోరాటానికీ చెందిన సిద్ధాంతాన్ని రాజ్య సిద్ధాంతంతో ముడిపెట్ట డంద్వారా మార్క్సిజం రాజ్య సమస్యను — వివిధ తాత్విక సిద్ధాంతాలతోనూ, సామాజిక శాస్త్ర సిద్ధాంతాలతోనూ అయోమయంగా చేయబడినట్టి సమస్యను — స్పష్టపరచింది. కానీ, రాజ్య సమస్యను శాస్త్రీయంగా రూపొందించకుండా, వర్గాలకూ, వర్గ పోరాటానికీ చెందిన సిద్ధాంతం అసంపూర్ణంగా వుంటుంది. శత్రుత్వపూరిత సమాజంలో రాజ్య మనేది ఆర్థిక వ్యవస్థమీద ఆధిపత్యం వహించే వర్గంయొక్క ఉమ్మడి వ్యవహారాలను నడిపే కమిటీ, ఆ వర్గం తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకోడానికీ, దృఢపరచుకోడానికీ, మొత్తం సమాజాన్ని

పాలించడానికి తోడ్పడే సంస్థ. రాజ్యం రాజీపడజాలని వర్గ వైరుధ్యాల ఫలితం, వాటి వ్యక్తీకరణ. వర్గాలు లేకుండా రాజ్యం యెప్పుడూ ఉద్భవించలేదు.

రక్త బంధువుల ఐక్యతమీద ఆధారపడిన పాత, గణ వ్యవస్థకు భిన్నంగా, రాజ్యం ప్రాదేశిక ప్రాతిపదికమీద మనుషులను యేకం చేస్తుంది.

రాజ్యం ఆవిర్భవించడమంటే, పరిపాలనా, విధానాన్ని రూపొందించి, నిర్వహించడమూ, రాజకీయ భావజాలాన్ని రూపొందించడమూ, మొదలైనవి యేకైక వృత్తిగా గల మనుషుల బృందం — అనగా రాజకీయవాదులూ, సిద్ధాంతకారులూ, ప్రభుత్వోద్యోగులూ — సమాజంలో ఆవిర్భవించడం కూడా.

రాజ్యంయొక్క సారం దాని క్రియలలోనూ, కార్యకలాపాలలోనూ వ్యక్తమౌతుంది. ఒక వర్గంమీద మరొక వర్గపు ఆధిపత్యాన్ని సాగించడానికీ, పీడిత వర్గాల ప్రతిఘటనను అణచివేయడానికీ రాజ్యాన్ని ఉపయోగించడం రాజ్యంయొక్క ఆంతరంగిక క్రియ. దీనికి తోడు, రాజ్యాల మధ్య సంబంధాల రంగం ఉత్పన్న మౌతుంది; దీన్నిబట్టి రాజ్యంయొక్క బాహ్య క్రియ ఉత్పన్న మౌతుంది. యిది యేమిటంటే, బాహ్య దురాక్రమణల బారినుండి తన భూభాగాన్ని రక్షించుకోవడమూ, దేశాల మధ్య నిశ్చితమైన సంబంధాలు నెలకొల్పడమూ. యీ రెండు క్రియలూ యే దోపిడీ రాజ్యానికైనా మౌలికమైనవి, దాని విధానంలోని అంగాలు.

తన క్రియలు నిర్వహించడానికి రాజ్యానికి అధికార పరికరాలు, లేక నిర్బంధపరచే పరికరాలు వుండాలి — సైన్యమూ, పోలీసులూ, కోర్టులూ లాంటివి, వాటి భౌతిక అనుబంధాలైన జైళ్ళు, వగైరాలతో సహా. రాజ్యం ఆవిర్భవించడమంటే, ప్రజలనుంచి వేరుగా వుండి నిర్బంధపరచే యంత్రాంగం నెలకొల్పబడడ మన్నమాట.

వర్గ పూర్వ సమాజంలో, గణ సభ్యులు తమ ఉమ్మడి ప్రయోజనాలను అందరూ కలిసి రక్షించుకొనేవాళ్ళు, ప్రజలనుంచి వేరుగా ఒక సాయుధ బలాన్ని నెలకొల్పుకోవలసిన అవసరం వాళ్ళకు లేదు. కానీ, వర్గ సమాజంలో అలాంటి బలం వుంది, అది లేకుండా యే రాజ్యానికీ పని జరగదు. అది ప్రత్యేక రకమైన శక్తి, ప్రజలనుంచి వేరుగా వుంటూ పరిపాలనా, బలప్రయోగమూ చేసే యంత్రాంగం.

నిర్బంధపు యంత్రాంగాన్ని పోషించడమూ, యుద్ధాలు చేయడమూ, మొదలైన వాటికి డబ్బు అవసరం; యిది పన్నుల రూపంలోనూ, ప్రజలమీద విధించే యితర కప్పాల రూపంలోనూ వసూలు చేయబడుతుంది. ఖజానా, ప్రభుత్వోద్యోగులూ లేకుండా యే రాజ్యానికీ పని జరగదు. దోపిడీ వర్గాలు సామాన్య ప్రజలను అణచివేయడమే కాక, యీ అణచివేత యంత్రాంగాన్ని పోషించేటట్లు వాళ్ళను నిర్బంధిస్తాయి. పన్నులు శ్రామిక జనం మీద యెల్లప్పుడూ భారంగా వుండివాయి; నిర్బంధపు యంత్రాంగం ఉబికేకొద్దీ, సైన్యాన్ని

పోషించే ఖర్చూ, ఆయుధాల ఖర్చూ, మొదలైనవి పెరిగేకొద్దీ, వాటి బరువు యింకా యెక్కువ య్యేది. ఆధునిక సామ్రాజ్యవాద రాజ్యాలు యీ నియమానికి మినహాయింపు కాకపోవడమే కాక, దీనిని పూర్తిగా ధ్రువపరుస్తాయి.

స్వదేశంలోనూ, అంతర్జాతీయ రంగంలోనూ పాలక వర్గపు ప్రయోజనాలను కాపాడడం ద్వారా యేర్పడే ప్రధానమైన క్రియలు కాక, రాజ్యం పలు యితర క్రియలు నిర్వహిస్తుంది — పౌర శాంతి భద్రతలు కాపాడడమూ, నిర్దిష్ట పరిపాలన క్రియలూ, మొదలైనవి. దోపిడీ వర్గాలు రాక ముందు యే రాజ్యమూ లేకుండానే మనుషులు శాంతి భద్రతలు కాపాడి నేర స్తులను శిక్షించినారనేది నిజమే; కనుక, శాంతి భద్రతలు కాపాడడ మనేదే రాజ్యాన్ని సృష్టించి వుండజాలదు.

రాజ్యం కొన్ని ఆర్థిక క్రియలు కూడా నిర్వహిస్తుంది. అది నిర్దిష్ట ఆర్థిక విధానాన్ని (వాణిజ్య పరిరక్షణవాదం, లేదా నిర్నిబంధ వర్తకం) అమలుపరుస్తుంది, మౌలిక ఉత్పత్తి, రవాణా సాధనాలలో కొన్నిటిని తన చేతుల్లో, అదుపులో పెట్టుకొంటుంది, పెద్ద సాగునీటి పథకాల, రైల్వేల నిర్మాణాన్ని యేర్పాటు చేస్తుంది, అరుదైన పదార్థాలను కేటాయిస్తుంది, పరిశ్రమలకూ, వాణిజ్యానికీ నిబంధనలూ, శాసనాలూ చేస్తుంది, సామాజిక శాసనాలు చేస్తుంది, వగైరా. యీ క్రియల సారమూ, పరిమాణమూ నిర్దిష్ట పరిస్థితులమీద ఆధార పడుతాయి; అవి ప్రగతిశీలంగా నైనా, ప్రగతి వ్యతిరేకంగా నైనా వుండవచ్చు. రాజ్యం నిర్వహిస్తున్న ఆర్థిక క్రియల పరిమాణం ఎక్కువగానో తక్కువగానో వుండవచ్చు.

యీనాడు బూర్జువా రాజ్యం ఆర్థిక వ్యవస్థను నియంత్రించడంలో నిర్వహించే పాత్ర పెరుగుతున్నది. దీనికి ఒక కారణం భారీస్థాయి పారిశ్రామిక ఉత్పత్తి అభివృద్ధిలోని వస్తుగత ధోరణులు, ముఖ్యంగా ప్రస్తుత శాస్త్ర, సాంకేతిక విప్లవ పరిస్థితులలో మరొక కారణం ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేయడానికీ, సోషలిజంతో గల పోటీలో పెట్టుబడిదారీ వ్యవస్థను స్థిరపరచడానికీ ప్రభుత్వ పరికరాలను ఉపయోగించుకోవాలని గుత్త పెట్టుబడికి గల ఉద్దేశం.

కనుక, సారాంశంలో, దోపిడీ రాజ్యం పాలక వర్గంయొక్క వర్గ, రాజకీయ సంస్థ. అది వర్గాలకు అతీతమైనదని చెప్పే మాటలన్నీ అజ్ఞానంవల్లనో, దురుద్దేశంవల్లనో చెప్పేవి. కానీ, రాజ్యం వర్గ సమాజపు సంస్థ గనుక, అది వర్గాలకు అతీతమైనదనే అభిప్రాయం కలిగిస్తుంది, వాటిని రాజీచేస్తూ, నిర్దిష్ట సువ్యవస్థ చట్రం లోపల వుంచుతున్నట్లు కనపడుతుంది. కాని, రాజ్యం సుసమన్విత సమస్తమనే అభిప్రాయం భ్రమ మాత్రమే. దీనినే బూర్జువా శాస్త్రజ్ఞులు (కొందరు తెలిసీ, కొందరు తెలియకా) రాజ్యంయొక్క సారాంశ మని అంటారు. బూర్జువా సిద్ధాంతవేత్తల అభిప్రాయాలలో యెంత వైవిధ్యమున్నా,

అవన్నీ రాజ్యం వర్గాతీతమనే భావంమీద ఆధారపడినవే; యీ భావాన్ని అవకాశవాదులందరూ పూర్తిగా అంగీకరిస్తారు.

న్యాయశాస్త్రం పాలక వర్గం కోరే ఉత్పత్తి సంబంధాలను వ్యక్తం చేస్తుంది, నమోదు చేస్తుంది. నిర్బంధపరచే శాసనాలద్వారా, నిబంధనలద్వారా అది మనుషుల మధ్య సంబంధాలను నియంత్రిస్తుంది. న్యాయశాస్త్రం అన్ని కాలాలలోనూ వుండింది కాదు: చరిత్రయొక్క తొలి దశలలో, ఆదిమ సమష్టి సమాజ వ్యవస్థలో న్యాయశాస్త్రం అనేది లేదు; మనుషుల ప్రవర్తనా, వాళ్ల మధ్య సంబంధాలూ సమష్టి సమాజ సభ్యు లందరి ప్రయోజనాలనూ వ్యక్తంచేసే అలవాట్లచేతా, ఆచారాలచేతా, నియంత్రితమై వుండినాయి. సంప్రదాయాలూ, శిక్షణా, మొత్తం సమష్టి సమాజంయొక్కా, గణ పెద్దలయొక్కా ప్రతిష్ఠ వాటికి పవిత్రతను యిచ్చినాయి. ఎంగెల్స్ యిలా రాసినాడు: "అంతరంగిక రంగంలో హక్కులకూ, బాధ్యతలకూ మధ్య యింకా భేదం యేమీ లేదు. సామాజిక వ్యవహారాలలో పాల్గొనడమూ, గణ శత్రువులమీద ప్రతీకార చర్యలు గానీ, ప్రాయశ్చిత్తాలు గానీ జరపడమూ హక్కా, బాధ్యతా అనే ప్రశ్న యెర్ర యిండియన్ కెప్పుడూ యెదురు కాలేదు. భోజనం గానీ, నిద్ర గానీ, వేట గానీ హక్కా, బాధ్యతా అనే ప్రశ్న లాగే అది అతనికి అసంబద్ధంగా కనిపించి వుండేది."*

వర్గపూర్వ సమాజంలో గణ నాయకుల, పెద్దల అధికారం సంప్రదాయంమీదా, సమష్టి సమాజంయొక్కా, నాయకునియొక్కా ప్రతిష్ఠమీదా ఆధారపడి వుండింది. రాజ్యంలో అధికారం నిర్బంధంమీద ఆధారపడుతుంది. ప్రతిష్ఠకు గల అధికారం పోయి, అధికారానికి గల ప్రతిష్ఠ వచ్చింది.

గణ వ్యవస్థ పోయి, నిర్బంధపు అంగమైన రాజ్యం వచ్చినప్పుడు, అలవాట్లూ, ఆచారాలూ పోయి, నిబంధనల వ్యవస్థగా న్యాయశాస్త్రం వస్తుంది. యీ నిబంధనలను రాజ్యం తయారు చేస్తుంది, రాజ్యం అమలుపరుస్తుంది. న్యాయశాస్త్రంయొక్క కర్తవ్యం యేమిటంటే, సొంత ఆస్తి సంబంధాలను నిర్ణయించి, దానిమీద జరిగే యే దురాక్రమణలనైనా రాజ్య శాసనాల ఉల్లంఘనగా ప్రదర్శించడం. కనుక, సమాజంలో ఆస్తి అసమానత్వం యేర్పడి, దోపిడీచేసే మైనారిటీ మొత్తం సమాజంమీద తన యిచ్ఛను రుద్దకుండా తన ఆర్థిక, రాజకీయ ఆధిపత్యాన్ని కొనసాగించ లేని పరిస్థితులు సృష్టింపబడినప్పుడు, న్యాయశాస్త్రం అనేది ఉద్భవిస్తుంది. న్యాయశాస్త్రమనేది చట్టం పేరుతో సింహాసనంమీద కూర్చో

---

*K. Marx and F. Engels, *Selected Works* in three volumes, Vol. 3, Moscow, 1970, పుటలు 316–17.

బెట్టబడిన పాలక వర్గపు యిచ్ఛ తప్ప మరేమీ కాదు, అని మార్క్సు, ఎంగెల్సు రాసినారు.

న్యాయశాస్త్రం వ్యక్తుల ప్రయోజనాలను కాక, ఆస్తిపరుల పాలక వర్గపు సార్వత్రిక ప్రయోజనాలను వ్యక్తం చేస్తుంది. దోపిడీ సమాజంలో న్యాయశాస్త్రం అన్నిటి కంటె ముఖ్యంగా మానవుల మధ్య సంబంధాలలో సొంత ఆస్తియొక్క ప్రయోజనాలను కాపాడుతుంది. వివాహమూ, దత్తతా, వారసత్వమూ, మొదలైనవి ఆస్తి సంబంధాలతో ముడిపడకుండా వుంటే, ప్రేమ, మైత్రి, వగైరాల లాగే అవి చట్టంచేత నియంత్రించబడకుండా వుండేవి.

న్యాయశాస్త్రం రాజ్యంయొక్క యిచ్ఛను వ్యక్తం చేస్తుంది గనుక, అది మనిషి ప్రవర్తనకు చెందిన విధాయక నిబంధనల వ్యవస్థ రూపం ధరిస్తుంది. అయితే మరి రాజ్యంయొక్క యిచ్ఛను నిర్ణయించేది యేమిటి? ఎంగెల్స్ యిలా రాసినాడు: "...సివిల్ సమాజపు అవసరాలన్నీ — యే వర్గం పాలక వర్గంగా వున్నా సరే — శాసనాల రూపంలో సార్వత్రిక యోగ్యతను పొందడానికి రాజ్యంయొక్క యిచ్ఛగుండా గడవాలి.... కానీ, వ్యక్తిదైనా, మొత్తం రాజ్యందైనా, యీ కేవల లాంఛనగత యిచ్ఛయొక్క సారం యేమిటి? యీ సారం యెక్కడినుండి యేర్పడుతుంది? మరొకటి కాక యిదే యెందుకు యిచ్ఛింపబడింది? యీ విషయాన్ని పరిశీలిస్తే మనకు తెలిసే దేమిటంటే: ఆధునిక చరిత్రలో రాజ్యంయొక్క యిచ్ఛ మొత్తంమీద సివిల్ సమాజపు మారే అవసరాలచేతా, యేదో ఒక వర్గంయొక్క ఆధిపత్యంచేతా, అంతిమంగా ఉత్పాదక శక్తుల, మారకం సంబంధాల అభివృద్ధిచేతా నిర్ణయింపబడుతుంది."*

న్యాయశాస్త్రంయొక్క అసలైన సారాంశం అది. కానీ, బూర్జువా భావజాలం దానిని వికృతంగా ప్రతిబింబిస్తుంది.

పైపైన చూస్తే, శాసనాలు వర్గాలకు అతీతంగా వున్నట్లూ, నిశ్చితమైన సువ్యవస్థనూ, వ్యవస్థీకరణనూ అపేక్షించే మొత్తం సమాజంయొక్క యిచ్ఛను వ్యక్తం చేస్తున్నట్లూ కనిపిస్తాయి. బూర్జువా సిద్ధాంతవేత్తలు సమాజం శాసనాలచేత సృష్టింపబడి, శాసనాలచేత ఒకటిగా బంధింపబడి వుందనే భావాన్ని నెలకొల్ప జూస్తారు. కాని, అది న్యాయశాస్త్ర భ్రమ మాత్రమే.

ప్రతి సామాజిక నిర్మాణంలో రాజ్యాంగ న్యాయశాస్త్రం ప్రాబల్యపు శాసన వ్యవస్థగా మాత్రమే కాక, యేకైక శాసన వ్యవస్థగా వుంటుంది. యే సమాజానికీ రెండు న్యాయ వ్యవస్థలు వుండవు ; యెందుకంటే, న్యాయశాస్త్రం రాజ్యంచేత నెలకొల్పబడి, రాజ్యంచేత అమలుపరచబడినప్పుడు మాత్రమే ఫలదాయకంగా వుంటుంది. యే సమాజానికీ రెండు

---

* K. Marx and F. Engels, *Selected Works*, Vol. 3, పుటలు 369–70.

రాజ్యాలు వుండజాలనట్లే, యిద్దరు శాసనకర్తలూ వుండజాలరు, రెండు న్యాయ వ్యవస్థలూ వుండజాలవు.

రాజ్య సారాంశపు భావం వర్గ సమాజం వుండే మొత్తం దశకు దాని సాధారణ స్వభావాన్ని వర్ణిస్తుంది. కానీ, రాజ్యాన్ని దాని అభివృద్ధిలో పరిశీలించడానికి రాజ్యంయొక్క రకమూ, రూపమూ అనే భావాలు ప్రవేశపెట్టడం అవసరం. రాజ్యంయొక్క రకం రాజకీయ ఆధిపత్యం వహించే వర్గంచేత నిర్ణయించబడుతుంది. పైన చర్చించిన మూడు ప్రధాన శత్రుత్వ పూరిత నిర్మాణరూపాలకు అనుగుణంగా దోపిడీ రాజ్యంలో మూడు మౌలికమైన రకాలు వున్నాయి: బానిస యజమాన రాజ్యం, ఫ్యూడల్ రాజ్యం, బూర్జువా రాజ్యం. సోషలిస్టు రాజ్యం మౌలికంగా కొత్త రకం రాజ్యం; దీని మౌలిక ప్రయోజనం దోపిడీదారులైన మైనారిటీమీద మెజారిటీ ప్రజల అధికారాన్ని అమలుపరచడమూ, సమస్త దోపిడీనీ, వర్గాలనూ, రాజ్యాన్ని కూడా తొలగించడమూ, వర్గరహిత, కమ్యూనిస్టు సమాజాన్ని నిర్మించడమూ.

అంతే కాక, నిర్దిష్ట చారిత్రక దశలలో రాజ్యంయొక్క పరివర్తన రకాలు వుండవచ్చు. విప్లవ స్వభావం అనుమతించేటంతకంటె ప్రగాఢమైన సామాజిక మార్పులను నిర్వహించగోరే వర్గాలు విప్లవంలో నాయకత్వం సంపాయించినప్పుడు యివి ఉద్భవిస్తాయి. పరివర్తన రాజ్యాలు విప్లవంయొక్క యితోధిక పురోగతికి కావలసిన పరిస్థితులను సృష్టించగోరే శక్తుల ఐక్య రూపం.

బూర్జువా విప్లవ గతిలో కార్మిక కర్షక ప్రజాతంత్ర విప్లవ నియంతృత్వం నెలకొల్పబడితే, రైతాంగంతో పొత్తు చేసుకొని పోరాడుతూ, విప్లవాన్ని ముందుకు తీసుకపోవాలని ప్రయత్నించే కార్మికవర్గం చేతుల్లో నాయకత్వం వున్నప్పుడు, అది ఒక పరివర్తన రకానికి చెందిన రాజ్యం.

వలస పరాధీనతనుండి తప్పించుకొనే కొన్ని దేశాలలో, ఫ్యూడల్ వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయ విమోచన పోరాటపు గతిలో, రాజకీయ, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కట్టుదిట్టం చేసే ఉద్దేశంతో ప్రజాతంత్ర శక్తుల కూటముల ఆధిపత్యంకింద వివిధ పరివర్తన రకాల రాజ్యాలు యేర్పడడానికి కావలసిన పూర్వావసరాలు అప్పుడప్పుడు రూపుదాలుస్తాయి. యీ రకానికి చెందిన రాజ్యం సామ్రాజ్యవాదంతో పొత్తు చేసుకోడానికి అభిముఖంగా వున్న ప్రగతి వ్యతిరేక శక్తులను యేకాకులను చేయడానికి తోడ్పడుతుంది, నియంతృ, నిరంకుశ వ్యవస్థలు నెలకొల్ప జూసేవాళ్లతో పోరాటం కొనసాగించడానికీ, దేశంలోని ప్రజాతంత్ర శక్తుల నన్నిటినీ కూడగట్టడానికీ, ప్రజల నిజమైన ప్రయోజనాల కొరకు జరిగే పోరాటంలో వాటిని సమీకరించడానికీ తోడ్పడుతుంది.

కానీ, ఒకే రకానికి చెందిన రాజ్యం భిన్న రూపాలు ధరించవచ్చు. రాజ్యంయొక్క రూపం

పరిపాలన విధానంచేతా (రిపబ్లిక్కా, నిరంకుశ రాజరికమూ, రాజ్యాంగబద్ధ రాజరికమా అనే దానిచేత), రాజ్యంయొక్క నిర్మాణంచేతా (యేకకమా, ఫెడరల్ రాజ్యమా అనే దానిచేత), రాజకీయ వ్యవస్థయొక్క స్వభావంచేతా నిర్ణయింపబడుతుంది. రాజకీయ వ్యవస్థ రాజకీయ ఆధిపత్యాన్ని కట్టుదిట్టం చేయడానికి ఉపయోగించబడే సాధనాల రకంచేత నిర్ణయింపబడుతుంది. రాజ్యం యే రకానికి చెందినదైనా, దాని రూపం నిర్దిష్ట చారిత్రక పరిస్థితులమీదా, వర్గ శక్తుల బలాబలాలమీదా, ఆ దేశంలోని అభివృద్ధియొక్క చారిత్రక విలక్షణత్వాలమీదా ఆధారపడుతుంది. అవిధంగా, బూర్జువా రాజ్యాలు ప్రజాతంత్ర, పార్లమెంటరీ రిపబ్లిక్కులూ, రాజ్యాంగబద్ధ రాజరికాలూ, మొదలైనవిగా వుండవచ్చు. అమలులో వున్న న్యాయశాస్త్రంలో రాజ్యంయొక్క రకమూ, రూపమూ స్థిరపరచబడుతాయి.

చరిత్రలో యీకింది నిర్దిష్ట రకాల న్యాయశాస్త్రాలు వుండినాయి: బానిస యజమాన సమాజపు న్యాయశాస్త్రం, ఫ్యూడల్ సమాజపు న్యాయశాస్త్రం, సోషలిస్టు సమాజపు న్యాయశాస్త్రం. బానిస యజమాన సమాజంలో, బానిసలకు న్యాయశాస్త్రం వర్తించదు. వాళ్ళ బానిస యజమానుల ఆస్తిగా, వాళ్ల యితర ఆస్తిలాగే, కాపాడబడుతారు. ఫ్యూడల్ సమాజపు న్యాయశాస్త్రం భూమిమీద ఫ్యూడల్ ప్రభువుకు గల ఆస్తి హక్కునూ, వాస్తవమైన ఉత్పాదకుల వివిధ రూపాల పరాధీనతనూ పవిత్రపరుస్తుంది; ఫ్యూడల్ దాస్య న్యాయశాస్త్రం ఆ రూపాలలో కెల్ల కఠినమైనది. చట్టం యెదుట వివిధ అంతస్తులకు గల అసమానతకు ఫ్యూడల్ న్యాయశాస్త్రం చట్టపు రూపం యిస్తుంది, ఆధిపత్యపు అంతస్తులైన ప్రభువర్గానికీ, మతగురువులకూ అధిక సౌకర్యయుత ప్రతిపత్తిని యిస్తుంది. ఆస్తిపరుల అత్యంత అభివృద్ధి చెందిన సమాజమైన బూర్జువా సమాజంలో, చట్టం యెదుట పౌరు లందరి నామకపు సమానత్వాన్ని చట్టం ప్రకటిస్తుంది. కానీ, అది బాహ్య విషయం మాత్రమే; యెందుకంటే, బూర్జువా సమాజం లాగ యే సమాజమూ చట్టంయొక్క రూపానికీ, సారానికీ మధ్య గల అంతరాన్ని అంత బాహాటంగా యెప్పుడూ వ్యక్తం చేయలేదు. రూపంలో, బూర్జువా సమాజంలోని చట్టం పాలక వర్గపు యిచ్ఛగా కనపడదు; అది మనుషుల మధ్య సంబంధాలను నియంత్రించడమూ, వాళ్ల హక్కులనూ, పరస్పర విధులనూ నిర్ణయించడమూ, సమాజంయొక్కా, వ్యక్తియొక్కా, స్థానిక సంఘాలయొక్కా, చట్టం అనుమతించిన వివిధ సంస్థలయొక్కా ప్రయోజనాలను నిస్సందేహం చేయడమూ, మొదలైన పనులు చేసే చట్టబద్ధ నిబంధనల వ్యవస్థగా కనిపిస్తుంది. కానీ, బూర్జువా సమాజంలో చట్టం యెదుటగల నామకపు సమానత్వం సామాజిక అసమానతకూ, శ్రామికప్రజలపై సాగే కిరాతకమైన దోపిడీకీ, ఉత్పత్తి సాధనాల సొంతదారుడైన పెట్టుబడిదారుపట్ల వేతన కార్మికుని ఆర్థిక పరాధీనతకూ ముసుగు. యీ చట్టం సైన్యమూ, పోలీసులూ, కోర్టులూ, జైళ్లూ అనే రాజ్య పరికరాలద్వారా చేసే

నిర్బంధంద్వారానూ, విద్యా వ్యవస్థ, బహుళ ప్రచార సాధనాలు అనేవాటిద్వారానూ శ్రామిక ప్రజలమీద రుద్దబడుతుంది.

దోపిడీ సమాజా లన్నిటిలోనూ గల న్యాయశాస్త్రానికి భిన్నంగా, సోషలిస్టు న్యాయశాస్త్రం ఉత్పత్తి సాధనాలలో సామాజిక ఆస్తిని, సోషలిస్టు సమాజ సభ్యుల మధ్య గల పరస్పర సహాయ, సహకార సంబంధాలను రక్షించ గోరే కార్మికవర్గంయొక్కా, సకల శ్రామిక ప్రజలయొక్కా న్యాయశాస్త్ర భావాలకు అనుగుణంగా సృష్టింపబడుతుంది. యిక్కడ, చరిత్రలో మొదటి సారిగా, చట్టం రూపంలోనే కాక, సారంలో కూడా ఫలవంతంగా సమస్త ప్రజల యిచ్ఛయొక్క వ్యక్తీకరణ అవుతుంది.

రాజ్యంయొక్కా, న్యాయశాస్త్రంయొక్కా రకాలకూ, రూపాలకూ మధ్య భేదం చూడడం మౌలిక ప్రాముఖ్యం గలది. రాజ్యంయొక్కా, న్యాయశాస్త్రంయొక్కా రకం వాటి వర్గ స్వభావాన్ని వర్ణిస్తుంది; కాగా, రూపం వర్గ ఆధిపత్యాన్ని చలాయించడంలో ఉపయోగించబడే వ్యవస్థీకరణ విధాలనూ, రాజకీయ సాధనాలనూ వర్ణిస్తుంది. ఫాసిస్టు వ్యవస్థలలో, బూర్జువా వర్గపు నియంతృత్వం బాహాటమైన టెర్రరిస్టు రూపాలు వహిస్తుంది. బూర్జువా ప్రజాతంత్ర రాజ్యాలలో, పాలక వర్గం వివిధ ప్రాతినిధ్యపు ప్రజాతంత్ర సంస్థల వ్యవస్థద్వారా పాలిస్తుంది; అందువలన అది వర్గాలకు అతీతంగా వున్నట్లు భ్రమ కలుగుతుంది. అర్థం చేసుకోవలసిన చాలా ముఖ్యమైన విషయం యేమిటంటే, అక్కడ ప్రజాస్వామ్యం బూర్జువా రాజ్యంయొక్క రూపాన్ని వర్ణిస్తుంది గానీ, సారాన్ని కాదు. అందువలన నియంతృత్వాన్నీ, ప్రజాస్వామ్యాన్నీ పోల్చి, భేదం చూపడం సరి కాదు. శత్రుత్వపూరిత సమాజాలలో ప్రజాస్వామ్యం యెల్లప్పుడూ యేదో ఒక వర్గంయొక్క నియంతృత్వమే. పెట్టుబడిదారీ రాజ్యపు వర్గ స్వభావాన్ని మరుగుపరచడానికి బూర్జువా సిద్ధాంతకారులూ, అవకాశవాదులూ ప్రజాస్వామ్యమనే భావమూ, రాజ్య సారంయొక్క గుణమూ ఒకటే అయినట్లు గంద్రగోళం సృష్టిస్తారు. వాళ్ళు ప్రజాస్వామ్యాన్ని వర్గాతీతమైనదిగా, "శుద్ధ" ప్రజాస్వామ్యంగా పరిగణించి, దానిని నియంతృత్వానికి వ్యతిరేకంగా చెప్తారు. ప్రజాస్వామ్యం వున్నచోట నియంతృత్వం వుండదనీ, నియంతృత్వం వున్నచోట ప్రజాస్వామ్యం వుండదనీ వాళ్ళు పట్టుబట్టుతారు. కానీ, వర్గాతీత ప్రజాస్వామ్య మనేది యెప్పుడూ లేదు. ప్రజాస్వామ్యం ఒక పరికరం మాత్రమే. దానిని పెట్టుబడిదారీ సొంత ఆస్తి రక్షణకైనా మలచవచ్చు, అప్పుడది బూర్జువా ప్రజాస్వామ్య మౌతుంది, లేదా దానిని సొంత ఆస్తిమీద చేసే పోరాటానికీ, సోషలిస్టు నిర్మాణానికీ మలచవచ్చు, అప్పుడది సోషలిస్టు ప్రజాస్వామ్య మౌతుంది.

కనుక, ప్రజాస్వామ్యం రాజ్యంయొక్క రూపాన్ని వర్ణిస్తుంది, దానికి వర్గ స్వభావం వుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రజాస్వామ్యం మైనారిటీ కొరకు వున్నది. వివిధ హక్కులూ, స్వేచ్ఛలూ, "సమాన అవకాశాలూ," వగైరా బూర్జువా ప్రజాతంత్ర రాజ్యాలలో ఉద్ఘోషింపబడుతాయి. కానీ, ప్రశ్న యేమిటంటే, ధనికులకూ బీదలకూ మధ్య, కలవాళ్లకూ లేనివాళ్లకూ మధ్య, యెప్పుడైనా సమానత్వం వుండగలదా అని. నామకపు సమానత్వంలో, అది యిచ్చే అవకాశాలను ఉపయోగించుకోడానికి అవసరమైన సాధనాలు గలవాళ్లు మాత్రమే వాటిని ఫలవంతంగా ఉపయోగించుకుంటారు. ఆధునిక బూర్జువా రాజ్యం బూర్జువావర్గ ప్రయోజనాలకు మాత్రమే కాక, కార్మికవర్గ ప్రయోజనాలకు కూడా ప్రాతినిధ్యం వహించే "శ్రేయోరాజ్యం" అనీ, అందువలన అక్కడినుండి సోషలిజంవైపు జరిగే పురోగతి యేదైనా ఆ రాజ్యపు చట్రంలోపల సాధ్యమనీ, అది "నియంతృత్వం" యేదీ లేకుండా కేవలం "ప్రజాస్వామికం"గా వుండాలని దక్షిణపక్ష సోషలిస్టులు అంటారు. యీ ఉద్ఘాటనలు వాస్తవ పరిస్థితికి వ్యతిరేకం. బూర్జువావర్గం రకరకాల సాధనాలు ఉపయోగించి తన నియంతృత్వాన్ని చలాయిస్తుంది—ప్రభుత్వోద్యోగులకు బహిరంగంగా లంచం యివ్వడంతో సహా, ప్రభుత్వానికీ, స్టాక్‌యెక్స్‌చేంజికీ మధ్య పొత్తుతో సహా, ఉన్నత ప్రభుత్వోద్యోగులు గుత్తాధిపతులతో మిళితం కావడంతో సహా, యెన్నికలలో వివిధ జిత్తులతో సహా, మోసాలతో సహా, వాగార్భాటంతో సహా. యీ సాధనాలు విఫలమైనప్పుడు బూర్జువావర్గం పచ్చి దౌర్జన్యానికీ, బలప్రయోగానికీ పూనుకుంటుంది. అంతే కాక, వాస్తవంలో బూర్జువా ప్రజాస్వామ్యం అందరికీ నామకపు "సమాన అవకాశాలు" కూడా యెప్పుడూ యివ్వదు. అది సార్వజనీన వోటింగు హక్కుకు రకరకాల యోగ్యతలనూ, పరిమితులనూ పెట్టి, శ్రామిక ప్రజలలో గణనీయమైన భాగాన్ని బాలట్ పెట్టెకు దూరం చేస్తుంది. అనేక బూర్జువా రాజ్యాలలో మోసపు యెన్నికల పద్ధతులు కనపడుతాయి; వామపక్ష డెమోక్రట్లు శాసన సభలలోకి రాకుండా అదనపు ఆటంకాలు కలిగించడానికి అవి తోడ్పడుతాయి. అందువల్లనే, బూర్జువా ప్రజాతంత్ర రిపబ్లిక్కులలో "ఐశ్వర్యం తన అధికారాన్ని పరోక్షంగా చలాయిస్తుంది, కానీ మరింత నిశ్చయంగా"* అని ఎంగెల్సు అన్నాడు. బూర్జువా దేశాల అసలు యజమానులు, పార్లమెంట్లకూ, ప్రభుత్వాలకూ వెనుక వున్నవాళ్లు, యెవరంటే, బొగ్గు, నూనె, ఉక్కుల ప్రభువులూ, ఆయుధాల ఉత్పత్తిదారులూ, బాంకర్లూ, మొదలైనవాళ్లు. తమ స్థానం భద్రంగా వుందని వాళ్లకు అనిపించినంత కాలం, తమ ఫలవంతమైన నియంతృత్వానికి "స్వేచ్ఛా, ప్రజాస్వామ్యాల" వేషం వేయడానికి వాళ్లు యిష్టపడుతారు; యెందుకంటే, వ్యక్తులూ, సంస్థలూ, పార్టీలూ మారినా వాళ్ల అధికారం చలించదు గనుక.

---

*K. Marx and F. Engels, *Selected Works*, Vol. 3, పుట 329.

కానీ, బూర్జువా ప్రజాస్వామ్యంమీద మార్క్సిస్టు విమర్శ అంటే దాన్ని పూర్తిగా నిరాకరించడం కాదు. ఉదాహరణకు, మధ్య యుగాలతో గానీ, నియంతృత్వపు బాహాటమైన టెర్రరిస్టు రూపాలతో గానీ పోలిస్తే, బూర్జువా ప్రజాస్వామ్యం చారిత్రకంగా ప్రగతిశీల మైనది. యెందుకంటే, అది కార్మికవర్గపు రాజకీయ సంస్థల చట్టబద్ధ కార్యాచరణకూ, దాని విజ్ఞానానికీ, దాని హక్కుల రక్షణకూ అవకాశాలు కలిగిస్తుంది.

కార్మికవర్గం ప్రజాస్వామ్యం కొరకు అత్యంత స్థిరంగా పోరాడేది. అనేక స్వేచ్ఛలూ, సాంఘిక లాభాలూ, యితర ప్రజాతంత్ర విలువలూ ప్రజలు కఠిన పోరాటంలో బూర్జువా వర్గంనుండి గుంజుకున్నారనీ, వీటిని నిలబెట్టుకోడానికి శ్రామిక ప్రజలు మళ్లీ మళ్లీ కార్యాచరణకు దిగవలసి వుంటుందనీ మనకు తెలుసు. కార్మికవర్గానికి, శ్రామిక ప్రజల విశాల ప్రజాతంత్ర డిమాండ్ల కొరకు చేసే పోరాటం సోషలిజంకు పోయే దారిలో ఒక దశ, శ్రామిక ప్రజల కొరకైన సోషలిస్టు ప్రజాస్వామ్యమనే అత్యున్నత ప్రజాస్వామ్య రూపం కొరకు చేసే పోరాటంలో ఒక ముందంజ.

మరొక వైపున, పెట్టుబడిదారీ గుత్త సంస్థలు ప్రజాస్వామ్యానికి శత్రువులు. సామ్రాజ్య వాద యుగంలో బూర్జువా ప్రజాస్వామ్యం సంక్షోభ దశలో ప్రవేశిస్తుంది. బూర్జువా ప్రజాతంత్ర చట్టబద్ధతను తోసి పారవేయడానికి గుత్త సంస్థలు యెప్పుడూ వెనుకాడవు. కానీ, యీనాడు యీ పని చేయడం ప్రగతి వ్యతిరేకులకు చాలా కష్టంగా వుంటుంది; యెందుకంటే, ప్రజాస్వామ్యానికీ, సోషలిజంకూ అనుకూలమైన శక్తుల బలం చాలా పెరి గింది; కనుక ప్రగతి వ్యతిరేకులు ప్రజాస్వామ్యంమీద చేసే దాడిని వాళ్లు "ప్రజాస్వామ్యాన్ని రక్షించండి" అనే నినాదాలతో మరుగుపరచవలసి వుంది.

కనుక, బూర్జువా రాజ్యం, దాని రూపం యేదైనప్పటికీ, అంతిమంగా పాలక వర్గపు సంస్థ, పెట్టుబడిదారీ వ్యవస్థను దృఢపరచడానికీ, దాని వర్గ శత్రువులను అణచివేయడానికీ పనిచేసేది. కానీ, తన నియంతృత్వాన్ని వెల్లడిగా చెప్పుకోవడం బూర్జువావర్గానికి యెల్ల ప్పుడూ అనుకూలంగా వుండదు, కనుక అది పరోక్షంగా దాన్ని చలాయిస్తుంది. బూర్జువావర్గం శ్రామిక ప్రజలకు విస్తృతమైన హక్కులను యివ్వవలసిన కారణమేమీ లేదు; వాళ్లు వాటిని దానిమీదికే ఉపయోగించవచ్చు. కనుక అది తప్పుకుంటూ, జారుకుంటూ, కొన్ని రాయితీలను యిస్తుంది. యే ప్రజాతంత్ర రూపమూ దానికి అనుకూలంగా లేనప్పుడల్లా, బూర్జువా చట్టబద్ధత తోసిపారవేయబడి, బాహాటమైన నిర్బంధ పద్ధతులు ప్రవేశపెట్టబడుతాయి. తీవ్ర వర్గ పోరాటాల దశలలో రాజ్యంయొక్క వర్గ స్వభావం అత్యంత ప్రస్ఫుటంగా వుంటుంది. వర్గాల మధ్య బహిరంగ పోరాటం జనాల రాజకీయ చైతన్యాన్ని వేగంగా పెంచుతుందనే నిర్వివాద విషయానికి కారణం కూడా యిదే.

వర్గాలతో పాటు ఉద్భవించిన రాజ్యం వర్గాలతో పాటు అదృశ్యం కాక తప్పదు. అది శాశ్వతమైనది కాదు, వర్గాలు తొలగింపబడినప్పుడు అది కృశించిపోతుంది. కానీ, సోషలిస్టు రాజ్యం మాత్రమే కృశించిపోగలదు. యీ విషయం గురించి ముందు మరింత వివరంగా చెప్తాము.

చరిత్ర అంతటా, ఒక రాజ్య వ్యవస్థ పోయి మరొకటి రావడమనేది విప్లవంద్వారా జరిగింది. అందువలన, సాధారణ రాజ్య సిద్ధాంతాన్ని పరిశీలించిన తరువాత, మన మిప్పుడు సామాజిక విప్లవానికి చెందిన మార్క్సిస్టు సిద్ధాంతానికి పోవచ్చు.

సామాజిక విప్లవ సిద్ధాంతం

సామాజిక విప్లవ సిద్ధాంతం సామాజిక అభివృద్ధి క్రమంలో ఒక సామాజికార్థిక నిర్మాణరూపం మరొకటిగా మారే పరివర్తనకు చెందిన పరిస్థితులనూ, నియమాలనూ తెలుపుతుంది.

వర్గ సమాజంలోని మనుషుల మధ్య గల సామాజిక సంబంధాలలో విప్లవాలు ఉత్పత్తి విధానపు అభివృద్ధిని పాలించే వస్తుగత నియమాలచేత నిర్ణయింపబడుతాయి. మేము యింతకు ముందే చెప్పినట్లు (చూ: ప్రకరణాలు రెండు, మూడు), ఒక ఉత్పత్తి విధానంనుండి మరొక దానికి జరిగే పరివర్తనయొక్క ఆవశ్యకత ఉత్పత్తి సంబంధాలకూ, ఉత్పాదక శక్తుల స్వభావానికీ మధ్య గల అనుగుణతా నియమంయొక్క అమలునుండి ఉత్పన్నమౌతుంది. యే సామాజిక విప్లవానికైనా ఆర్థిక ప్రాతిపదిక యేమిటంటే, కొత్త ఉత్పాదక శక్తులకూ, పాత ఉత్పత్తి సంబంధాలకూ మధ్య అత్యంత నిశితంగా పెరిగిన ఘర్షణ. విప్లవంయొక్క లక్ష్యం యీ ఘర్షణను అధిగమించడం. సామాజిక విప్లవం ఉత్పత్తి సాధనాలలో కాలం తీరిన ఆస్తి రూపాన్ని అంతం చేయడమూ, పాత ఉత్పత్తి సంబంధాలను తొలగించడమూ, తద్వారా, సాధింపబడిన ఉత్పాదక శక్తుల స్థాయికీ, స్వభావానికీ అనుగుణమైన కొత్త ఉత్పత్తి సంబంధాల స్థాపనకు బాట వేయడమూ అనే చారిత్రకంగా పక్వమైన కర్తవ్యాన్ని నెరవేరుస్తుంది. విప్లవానికి చెందిన యీ మహా నియమాన్ని మార్క్స్ ఆవిష్కరించినాడు. ఆయన యిలా రాసినాడు: "ఒకానొక అభివృద్ధి దశలో, సమాజంయొక్క పాదార్థిక ఉత్పాదక శక్తులు అమలులో వున్న ఉత్పత్తి సంబంధాలతో ఘర్షిస్తాయి, లేదా — యిది అదే విషయాన్ని కేవలం న్యాయశాస్త్ర పరిభాషలో వ్యక్తం చేస్తుంది — అంతవరకు అవి వేటి చట్రం లోపల అభివృద్ధి చెందినాయో

ఆ ఆస్తి సంబంధాలతో ఘర్షిస్తాయి. యీ సంబంధాలు ఉత్పాదక శక్తుల అభివృద్ధి రూపాల నుండి వాటి శృంఖలాలుగా మారుతాయి. అప్పుడు సామాజిక విప్లవ యుగం ప్రారంభ మౌతుంది.''*

యీ ప్రాతిపదికనుండి కొన్ని చాలా ముఖ్యమైన నిర్ధారణలు వస్తాయి.

1. సామాజిక విప్లవాలు, మార్క్సిజం శత్రువులు అనేటట్లు, సామాజిక అభివృద్ధి యొక్క ''స్థక్రమమైన'' గతికి యే విధంగానూ ''భంగం'' కాదు; వర్గ సమాజం అభి వృద్ధి చెందేకొద్దీ, ఒక సామాజికార్థిక నిర్మాణ రూపంనుండి మరొకదానికి జరిగే పరివర్తనయొక్క అవశ్య రూపం అవి.

2. విప్లవాలు వ్యక్తులయొక్క, లేదా బృందాలయొక్క, లేదా వర్గాలయొక్క యిష్టా లను బట్టి జరగవు, వాటికి తగిన భౌతిక పరిస్థితులు పక్వమైనప్పుడు జరుగుతాయి.

3. ప్రతి విప్లవానికీ నిర్దిష్టమైన వస్తుగత సామాజికార్థిక సారం వుంటుంది, అది మానవుని యిచ్ఛమీదా, చైతన్యంమీదా ఆధారపడదు.

విప్లవంయొక్క స్వభావం, దాని ఫలితంగా ధ్వంసమయ్యే ఉత్పత్తి సంబంధాలమీదా, వాటి స్థానంలో నెలకొల్పబడే కొత్త సంబంధాలమీదా ఆధారపడుతుంది. ఫ్యూడల్ ఉత్పత్తి సంబంధాలను ప్రబద్దలుచేసి, పెట్టుబడిదారీ సంబంధాలను నెలకొల్పే విప్లవాలు బూర్జువా విప్లవాలు. వీటికి మౌలికంగా భిన్నమైనవి సోషలిస్టు విప్లవాలు; అవి పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలను ధ్వంసం చేసి, సోషలిస్టు ఉత్పత్తి సంబంధాలను నెలకొల్పడంద్వారా పెట్టు బడిదారీ వ్యవస్థలోని మౌలిక వైరుధ్యాన్ని పరిష్కరిస్తాయి.

సామాజిక విప్లవంయొక్క కర్తవ్యాలు నెరవేరాలంటే, రాజ్యంమీద పట్టు గల పాత సమాజపు పాలక వర్గాల ప్రతిఘటనను అధిగమించవలసిన అవసరం వుంది. ఆ లక్ష్యంతో, రాజ్యంలో వ్యవస్థీకరింపబడిన పాలక వర్గపు శక్తిని దాని ఆధిపత్యాన్ని కూలదోయడానికి పోరాడే వర్గాల వ్యవస్థీకృత శక్తి యెదిరించాలి. పాలక వర్గం చేతులలోనుండి రాజ్యాధికారాన్ని గుంజుకొని, దాని ప్రతిఘటనను అణచివేయడంద్వారా మాత్రమే పాతదానిమీద కొత్తది గెలవడానికి విప్లవ శక్తులు తోడ్పడగలవు. అందువల్లనే, రాజ్యాధికార సమస్య యే విప్లవంలో నైనా ప్రధానమైనది. సరైన అర్థంలో విప్లవమంటే ఒక వర్గంనుండి మరొక వర్గానికి రాజ్యాధికారంయొక్క బదలాయింపు. ప్రగతిశీల సామాజిక శక్తులు కొత్త విప్లవాధికారాన్ని ఒకసారి నెలకొల్పితే, అవి దానిని సమాజ ఆర్థిక వ్యవస్థలో అవసరమైన మార్పులు తేవడానికి ఉపయోగిస్తాయి.

* K. Marx, *A Contribution to the Critique of Political Economy*, (''అర్థశాస్త్ర విమర్శకు చేర్పు''), Lawrence I Wishart, London, 1971, పుట 21.

పాలక వర్గపు ప్రతిఘటన దానిని వ్యతిరేకించే యితర వర్గాల వ్యవస్థీకృత పోరాటంచేత అధిగమింపబడుతుంది గనుక, విప్లవాన్ని ముందుకు తీసుకపోయేది యీ వర్గాల ఆచరణే; అనగా, యీ వర్గాలు విప్లవంయొక్క చోదక శక్తులు. విప్లవాన్ని చోదక శక్తులనుబట్టి వర్ణించడం దాని సారాన్నీ, విశిష్ట లక్షణాలనూ అంచనా వేయడంలో అత్యంత ముఖ్యమైనది.

విప్లవపు ఉధృతి పాత సమాజ గర్భం లోపల జరిగే మొత్తం వర్గ పోరాటపు గతి చేత సిద్ధం చేయబడుతుంది. విప్లవ మనేదే ప్రగతిశీల శక్తులకూ, ప్రగతి వ్యతిరేక శక్తులకూ మధ్య జరిగే యీ పోరాటపు శిఖర దశ. యే వర్గం గెలిచేదీ, అనగా యే వర్గం రాజ్యాధికారాన్ని తన చేతుల్లోకి తీసుకొని సమాజంలో రాజకీయ ఆధిపత్యం గల శక్తి అయ్యేదీ, యిది తెలుస్తుంది.

యీ అర్థంలో పాత విప్లవా లన్నిటిలోనూ ఒక మౌలిక వైరుధ్యం వుండింది; యేమి టంటే, అవి దోపిడీచేసే మైనారిటీ ప్రయోజనాల కొరకు దోపిడీ చేయబడే మెజారిటీ చేసిన విప్లవాలు, ఒక ఆస్తి రూపానికి అనుకూలంగా మరొక ఆస్తి రూపంమీద జరిగిన విప్లవాలు: దోపిడీదార్లు మారినారు, కానీ దోపిడీ నిలిచింది. యివి మైనారిటీ ప్రయోజనాల కొరకు జరిగిన మెజారిటీ విప్లవాలు.

ముందు యింకా వివరంగా చర్చించబోయే ఒక విషయాన్ని యిక్కడ నొక్కిచెప్పాలి. యేమిటంటే, సోషలిస్టు విప్లవంయొక్క చోదక శక్తులు, కార్మికవర్గంచేత నడిపించబడే శ్రామిక ప్రజలు, వాళ్ల ప్రయోజనాల కొరకు అది జరుగుతుంది; కనుక సోషలిస్టు విప్లవంలో ఆ వైరుధ్యం లేదు. సోషలిస్టు విప్లవం మెజారిటీ ప్రయోజనాల కొరకు జరిగే మెజారిటీ విప్లవం.

విప్లవంయొక్క చోదక శక్తులు యేవి అనే సమస్యకూ, దాని సామాజికార్థిక సారానికీ మధ్య గాఢమైన సంబంధం వుంది. విప్లవం యెవరిమీద జరిగేదీ, అది యే కర్తవ్యాలు పెట్టు కొనేదీ, తత్ఫలితంగా నిర్దిష్ట సమాజంలోని యే వర్గాలు దానివల్ల లాభపడేదీ, దాని చోదక శక్తులుగా పనిచేయవచ్చు ననేదీ, యేవి దానివల్ల లాభ పడవనేదీ, దాని శత్రువులుగా వుంటా యనేదీ—యీ విషయాలను విప్లవంయొక్క స్వభావమూ, సారమూ తెలియజేస్తాయి. ప్రతి సందర్భంలోనూ విప్లవంయొక్క చోదక శక్తులనూ, సారాన్నీ తెలుసుకోడానికి వస్తు గతంగా తోడ్పడేది వర్గ దృష్టే.

సామాజిక విప్లవాలు చరిత్రలో చాలా ప్రగతిశీలమైన పాత్ర నిర్వహిస్తాయి. విప్లవాల గతిలో, పోరాడే సామాజిక వర్గాలు కాలం తీరిన ఆర్థిక వ్యవస్థతో సూటిగా, బహిరంగంగా తలపడి, దానిని ధ్వంసం చేస్తాయి. ప్రగతిశీల విప్లవ శక్తుల విజయం మరింత ఉన్నత దశలో యితోధిక చారిత్రక అభివృద్ధికి విశాలమైన అవకాశాలను కలిగిస్తుంది.

"విప్లవాలు చరిత్రయొక్క వాహనాలు"* అని మార్క్స్ అన్నాడు. బలవంతం లేకుండా, నిస్వార్థమైన పోరాటమూ, కర్తవ్యాంకితమైన వీరత్వమూ లేకుండా విప్లవం వుండజాలదు. విప్లవ బలప్రయోగం అనేది "యే పరికరం సాయంతో సామాజిక ఉద్యమం ముందుకు దారిచేసుకుంటూ, చచ్చి శిల్యమై పోయిన రాజకీయ రూపాలను బద్దలు చేస్తుందో ఆ పరికరం,"** అని ఎంగెల్సు అన్నాడు. "విప్లవాలు దోపిడీ చేయబడే పీడిత ప్రజల ఉత్సవాలు,"*** అని లెనిన్ రాసినాడు.

యే విప్లవానికి ఆర్థిక ఆవశ్యకత పరిపక్వమైందో ఆ విప్లవం వాస్తవంగా జరగడానికి నిర్దిష్ట వస్తుగత, ఆత్మగత పరిస్థితులూ, పూర్వావసరాలూ వుండాలి.

విప్లవ ప్రజ్వలనం యే వస్తుగత సాంఘిక రాజకీయ పరిస్థితులలో జరగగలదో వాటి నన్నిటినీ కలిపి విప్లవ సన్నివేశం అంటారు. అలాంటి సన్నివేశపు లక్షణాలు యేమిటంటే: ఒకటి, పాలక వర్గపు విధానంలో సంక్షోభం; పాత పద్ధతిలో తన పెత్తనం సాగించడానికి ఆ వర్గంయొక్క అశక్తతగానూ, పాత పద్ధతిలో జీవించడానికీ, పాలించడానికీ దాని అశక్తతగానూ ఆ సంక్షోభంలో వ్యక్తమౌతుంది. యిది ప్రభుత్వాన్ని బలహీనపరచడానికి అభిముఖంగా వుంటుంది, ప్రభుత్వం తన విధానాలలో ఊగిసలాడేటట్లు చేస్తుంది, దానిని కూలదోయడం సులభతరం చేస్తుంది. రెండు, పీడిత వర్గాల లేమిడీ బాధలూ యెన్నడూ లేనంతగా తీవ్రమైనందున పాత పద్ధతిలో బతకడానికి వాటి అయిష్టం. మూడు, బాహాటపు, స్వతంత్ర విప్లవ ఆచరణకు సిద్ధమైన జనాలలో కార్యశీలత గణనీయంగా పెరగడం.****

యిలాంటి సన్నివేశమే విజయవంతమైన విప్లవానికి కావలసిన వస్తుగత పూర్వావసరాలను సృష్టించే జాతీయ సంక్షోభాన్ని కలుగజేస్తుంది.

విప్లవ సన్నివేశం వున్నప్పుడు మాత్రమే కార్మికవర్గపు విప్లవ పోరాటానికి సారథ్యం వహించే పార్టీ రాజ్యాధికారాన్ని స్వాధీనం చేసుకొనే తక్షణ కర్తవ్యం పెట్టుకోగలదు. లేక పోతే, అది జూదమాడుతూ, పరాజయం పాలు కావచ్చు.

---

* K. Marx and F. Engels, *Selected Works*, Vol. I, పుట 277.

** F. Engels, *Anti-Dühring*, Moscow, 1969, పుట 220.

*** V. I. Lenin, *Collected Works*, Vol. 9, పుట 113.

**** చూ: V. I. Lenin, *Collected Works*, Vol. 21, పుట 214 (తెలుగులో వి. ఐ. లెనిన్ "రెండవ ఇంటర్నేషనల్ పతనం," మాస్కో, పుట 10).

కానీ, ప్రతి విప్లవ సన్నివేశమూ విప్లవానికి దారితీయదు. ఉదాహరణకు, రష్యాలో 1859 నుండి 1861 దాకా విప్లవ సన్నివేశం వుండింది, కానీ విప్లవం జరగలేదు. తొలి 1920లలో జర్మనీలో కూడా యిదే జరిగింది.

అవసరమైన వస్తుగత పరిస్థితులకు తోడుగా ఆత్మగత అంశం వున్నప్పుడు మాత్రమే విప్లవాలు జరుగుతాయి, విజయం పొందుతాయి. ఆత్మగత అంశమంటే, విప్లవ అగ్రగామి పార్టీ వుండడమూ, విప్లవ అవసరాన్ని విప్లవ వర్గాలు గుర్తించడమూ, వ్యవస్థీకృత, దీక్షా పూరిత సామూహిక చర్యలకు వాటి సామర్థ్యమూ, అవి విజయం కొరకు మరణానికి సహితం సిద్ధపడడమూ.

విప్లవం ప్రారంభం కావడానికి వస్తుగత, ఆత్మగత పరిస్థితుల సమ్మేళనం అవసరమ వేది ఒక నియమం. సోషలిస్టు విప్లవాలను సిద్ధం చేయడంలోనూ, నిర్వహించడంలోనూ మార్క్సిస్టు లెనినిస్టు పార్టీలు యెల్లప్పుడూ యీ నియమంమీద ఆధారపడుతాయి. విప్లవా నికి కావలసిన వస్తుగత పరిస్థితులు వర్గాల, పార్టీల యిచ్ఛమీదా, చైతన్యంమీదా ఆధార పడకుండా పక్వమౌతాయి; కానీ తగిన వస్తుగత పరిస్థితులు వున్నప్పుడు, విప్లవ విజయం ఆత్మగత అంశంచేత నిర్ణయించబడుతుంది. యీ అంశం వుండడం యెక్కువగా జనాలకు రాజకీయ విజ్ఞానాన్ని యివ్వడంమీదా, వాళ్లను వ్యవస్థీకరించడంమీదా ఆధారపడుతుంది. జనాలలో పలుకుబడి గలిగి, వాళ్ల పోరాటానికి నాయకత్వమూ, సారథ్యమూ వహించే సామర్థ్యం గల సమరశీల విప్లవ పార్టీ వుండడం సోషలిస్టు విప్లవ విజయానికి మహా ప్రాముఖ్యం గలది అవుతుంది.

కార్మికవర్గాన్నీ, రైతాంగాన్నీ అత్యంత కష్టమైన పరిస్థితులలో విప్లవానికి యెలా సిద్ధం చేయవలసినదీ, విప్లవ గతిలోనే పీడకవర్గాల పెత్తనాన్ని కూలదోయడానికి వాళ్ళు చేసే పోరాటానికి యెలా సారథ్యం వహించవలసిందీ అక్టోబర్ సోషలిస్టు మహా విప్లవాన్ని సిద్ధం చేయడంలోనూ, నిర్వహించడంలోనూ లెనినిస్టు బోల్షెవిక్ పార్టీ కన్నులకు కట్టినట్లు, నమ్మకం కలిగేటట్లు ఆదర్శాన్ని నెలకొల్పింది. యీ అనుభవం గొప్ప అంతర్జాతీయ ప్రాము ఖ్యం గలది.

సోషలిస్టు విప్లవం ప్రత్యేక రకం సామాజిక విప్లవం. సామాజిక విప్లవానికి వర్తించే సార్వత్రిక క్రమత్వాలు సోషలిస్టు విప్లవానికి కూడా వర్తిస్తాయి, కానీ యిది పాత విప్లవాల కంటె మౌలికంగా భిన్నమైనది. అందువలన దీనిని విడిగా, మరింత వివరంగా చర్చించవల సిన అవసరం వుంది.

సోషలిస్టు విప్లవ సిద్ధాంతం

సోషలిస్టు విప్లవానికి చారిత్రక ఆవశ్యకత పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క అభివృద్ధి నుండి ఉత్పన్నమౌతుంది. నిశితమయ్యే అంతర్వైరుధ్యాలూ, ఉత్పత్తి క్రమంయొక్క సామాజిక స్వభావానికీ, సొంతపరచుకోవడంయొక్క వ్యక్తిగత పెట్టుబడిదారీ రూపానికీ మధ్య గల వైరుధ్యమూ దానికి ఆర్థిక ప్రాతిపదికను సమకూరుస్తాయి. సోషలిస్టు విప్లవం యీ వైరుధ్యాన్ని పరిష్కరించడానికీ, ఉత్పత్తి సాధనాలలో సొంత ఆస్తిని తొలగించి, సామాజిక ఆస్తిని నెలకొల్పడంద్వారా సామాజిక జీవితంలోని ప్రతి రంగంలోనూ సోషలిస్టు సంబంధాలను నెలకొల్పడానికీ ఉద్దేశించబడింది.

పైన చెప్పినట్లు, కార్మికవర్గమూ, దాని నాయకత్వంకింద వున్న పట్టణాల, గ్రామాల శ్రామిక ప్రజలూ, ముఖ్యంగా రైతాంగమూ సోషలిస్టు విప్లవంయొక్క చోదక శక్తి. శ్రామిక ప్రజల అధికారాన్ని, కార్మికవర్గ నియంతృత్వాన్ని, స్థాపించడానికి చేసే పోరాటం దాని మౌలిక సారం. అనగా, విప్లవ గతిలో కార్మికవర్గం 1) బూర్జువావర్గపు అధికారాన్ని కూలదోసి, దాని రాజకీయ ప్రాబల్యాన్ని తొలగించి, దాని చేతులలోనుండి అధికార సాధనాలను గుంజుకొని, తద్వారా తన సొంత నియంతృత్వానికి బాటవేస్తుంది; 2) బూర్జువా రాజ్య యంత్రాన్నీ, బూర్జువా రాజ్యంయొక్క మిలిటరీ, పోలీసు, ఉద్యోగివర్గ యంత్రావళినీ ధ్వంసంచేసి, కార్మికవర్గ రాజ్యంయొక్క కొత్త యంత్రావళిని నెలకొల్పడానికి భూమికను సిద్ధం చేస్తుంది; 3) అధికారం తన చేతుల్లోకి తీసుకొని, కొత్త రాజ్యాన్ని — విప్లవాత్మకమైన కార్మికవర్గ నియంతృత్వాన్ని — నెలకొల్పి, కార్మికవర్గ విప్లవపు లక్ష్యాలను సాధించడానికీ, కర్తవ్యాలను నిర్ణయించడానికీ, సోషలిజంను నిర్మించడానికీ ఆ నియంతృత్వాన్ని ఉపయోగిస్తుంది.

మార్క్సు, ఎంగెల్సు చెప్పిన కార్మికవర్గం యిప్పుడు లేదంటూ, అవకాశవాదులూ, రివిజనిస్టులూ సోషలిస్టు విప్లవంయొక్క చారిత్రక ఆవశ్యకతను మసకపరచడానికి, లేదా పూర్తిగా నిరాకరించడానికి తీవ్రంగా ప్రయత్నించినారు. ఒకప్పుడు లేమిడితో, పీడింపబడి, రాజకీయ హక్కులు లేకుండా వుండిన కార్మికవర్గం యిప్పుడు పెద్ద జీతాలు సంపాయిస్తూ, బూర్జువా ప్రజాస్వామ్యపు చట్రంలోపల బూర్జువావర్గంతో రాజకీయ సమానత్వం గల వర్గం అయిందని వాళ్లు అంటారు. "శ్రేయోరాజ్యం"తో పోరాడవలసిన అవసరం లేదనీ, ఆ రాజ్యం బూర్జువావర్గపు ప్రయోజనాలకు భంగం కలిగించకుండా, నిదానంగా క్రమక్రమ సంస్కరణలద్వారా సోషలిజంవైపు పురోగమిస్తూ, సోషలిజంను నిర్మిస్తుందని నమ్ముకొని వుండాలనీ వాళ్లు అంటారు.

నిజమే, కొన్ని పురోగామి పెట్టుబడిదారీ దేశాలలో కార్మికవర్గం మొండి పోరాటంద్వారా యెక్కువ వేతనాలూ, సామాజిక శాసనాలూ, వగైరాల రూపంలో కొన్ని రాయితీలను బూర్జువా వర్గంనుండి సంపాయించుకో గలిగింది. కానీ, దాని పరిస్థితి యెంత మెరుగుపడినప్పటికీ, కార్మికవర్గం యింకా దోపిడీ చేయబడే వర్గంగా, దాని జీవితమే తన శ్రమ శక్తిని పెట్టుబడిదారునికి అమ్ముకోవడంమీద ఆధారపడిన వర్గంగా వుంటున్నది. దాని శ్రమ ఫలితాలన్నీ అన్యథాకరింపబడి, దాని పాదార్థిక, ఆత్మిక బానిసీకరణకు పరికరం అవుతున్నాయి. అనగా, దాని లాభాలన్నీ దుర్బలమైనవి, నిజానికి బూర్జువావర్గం చేతనైనప్పుడల్లా వాటిమీద దురాక్రమణ చేస్తున్నది. అంతే కాక, కార్మికులను ప్రచండమైన శ్రమ తీవ్రతా, నిరుద్యోగ భయమూ యెదుర్కొంటాయి; నిరుద్యోగం పెట్టుబడిదారీ వ్యవస్థలో నిత్యం వుండే ముప్పు.

అది కాక, కార్మికుల, పెట్టుబడిదార్ల రాజకీయ సమానత్వం కేవలం నామకమైనది; యెందుకంటే, కార్మికవర్గం వాస్తవంలో ఆర్థికంగా గానీ, రాజకీయంగా గానీ బూర్జువా వర్గానికి సమానంగా లేదు.

19వ శతాబ్దితో పోలిస్తే, కార్మికవర్గపు స్థితిలో కొన్ని గణనీయమైన మార్పులు జరిగినాయి. కానీ యివి "పెట్టుబడి"లో మార్క్స్ నిరూపించిన పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క మౌలిక నియమాలను వమ్ముచేయడం గానీ, కార్మికవర్గ విప్లవ ఆవశ్యకతను తొలగించడం గానీ చేయలేదు. యీ మార్పులు పోరాట పరిస్థితులలో మార్పు తెచ్చిన మాట నిజమే, కానీ పోరాటాన్నే అనవసరం చేయవు.

కమ్యూనిస్టులు విప్లవంయొక్కా, విప్లవాత్మక నియంతృత్వంయొక్కా అవసరాన్ని గుర్తించినంత మాత్రాన, వాళ్లు హింసనూ, బలాత్కార పద్ధతులనూ కోరేవాళ్లని బూర్జువా సిద్ధాంతకారులూ, అవకాశవాదులూ నిందిస్తారు. యీ కపటపు నిందలో సారం లేదు.

వర్గాలూ, వర్గ పోరాటమూ, రాజ్యమూ వున్నంత కాలం బలాత్కార వినియోగాన్ని విసర్జించడం అసంబద్ధమైనదని కమ్యూనిస్టుల నమ్మకం. యెంతైనా, రాజ్యమనేదే బలాత్కార పరికరం. కనుక, యెలాంటి బలాత్కారాన్ని ఫలానా పార్టీ కోరుతుంది, యెలాంటి నిర్బంధం ఉపయోగింపబడుతున్నది, ప్రగతి వ్యతిరేకమైనదా, విప్లవాత్మకమైనదా, అనేదే అసలు సమస్య.

చరిత్రలో కొన్ని ఉద్యమాలు — శాంతివాదం, గాంధీయిజం, పౌర హక్కుల ఉద్యమం లాంటివి — అహింసా పద్ధతులను ప్రతిపాదించినాయి, కానీ ప్రగతి వ్యతిరేక వర్గాలు తమ స్వప్రయోజనాల కొరకు బలాత్కారాన్ని వినియోగించకుండా వుండేటట్లు అవి యింతవరకు ఒప్పించలేదు. అంతే కాక, సామ్రాజ్యవాదం ఉత్పన్నంచేసేది కేవల హింస కాదు, పైశాచికమైన హింస. సామ్రాజ్యవాదులు రెండు ప్రపంచ యుద్ధాలు ప్రారంభించివారు; అవి

కోట్ల ప్రాణాలను హరించినాయి. పాశవిక భావజాలంతో, పాశవిక శక్తిని ఆరాధించే ఫాసిజం సామ్రాజ్యవాదానికి పుట్టిన బిడ్డే. ఇండొనీసియాలోనూ, చిలీలోనూ, తదితర దేశాలలోనూ ప్రగతి వ్యతిరేక శక్తులు రాజకీయ విశ్వాసాలకు గాను లక్షలమందిని చంపిన పైశాచిక ఘటుకాలూ, అనేక యితర ఉదాహరణలూ శ్రామికుల కార్యాచరణ తనకు ప్రమాదకరమని బూర్జువా వర్గం నమ్మినప్పుడు అది వాళ్లమీద బల ప్రయోగం చేయకుండా వుండదని తెలియజేస్తాయి. కానీ బూర్జువా సిద్ధాంతకారులకు తాము హింసను పరిహరించి, మానవీయ పద్ధతులను అభిమానిస్తామని చెప్పుకొనే గుండె ధైర్యం వుంది!

మార్క్సిజం లెనినిజంచేత నడిపించబడే కమ్యూనిస్టులు నిశ్చయంగా చరిత్రలో విప్లవాత్మక బల ప్రయోగంయొక్క ప్రగతిశీల పాత్రను గుర్తిస్తారు, కానీ యెట్టి పరిస్థితులలోనైనా బల ప్రయోగం చేయాలని వాళ్లు యెప్పుడూ పట్టుబట్టలేదు. కమ్యూనిస్టులు నూతన సమాజాన్ని నిర్మించ గోరుతారు, తమ పోరాటంలో వీలైతే బల ప్రయోగాన్ని విసర్జించాలని నమ్ముతారు. బల ప్రయోగం ఒక సాధనం, అదే ఒక లక్ష్యం కాదు. అది యే మేరకు ఉపయోగించబడుతుందనేది నిర్గమించే వర్గాల ప్రతిఘటనమీదా, వర్గ పోరాటపు నిర్దిష్ట పరిస్థితులమీదా ఆధారపడుతుంది.. వాటి ప్రతిఘటన యెంత భీషణంగా వుంటే, అంత తీవ్రంగా వుంటాయి ప్రగతిశీల శక్తులు ఉపయోగించవలసిన పోరాట రూపాలు. యిది విప్లవ కార్మిక వర్గ ఉద్యమ చరిత్ర అంతటిచేత ధ్రువపరచబడింది. వెర్సేల్స్ సైనికుల దాడులను తిప్పికొట్టడానికి కమ్యునార్డులు మార్గావరోధాలలో పోరాడవలసి వచ్చింది. ఆ దాడులను తిప్పికొట్టడంలో విఫలమైనారు, అందువలన కమ్యూన్ కార్మికుల రక్తంలో కొట్టుకపోయింది. శైశవ సోవియట్ రష్యా రిపబ్లిక్‌లో విదేశ సామ్రాజ్యవాదుల మద్దతు గల వైట్‌గార్డులు అంతర్యుద్ధం ప్రారంభించినారు. మొదటి సోషలిస్టు దేశపు కార్మికవర్గమూ, రైతాంగమూ తమ విప్లవ లాభాల కొరకు సాయుధులై నిలబడక తప్పలేదు. జనతా ప్రజాతంత్ర దేశాలలో విప్లవ ప్రతీఘాత శక్తులు అదుపులో పెట్టబడి, అంతర్యుద్ధం ప్రారంభించలేకపోయినాయి. అందువలన అక్కడ విప్లవం శాంతియుతంగా జరిగింది, బల ప్రయోగం కనీస స్థాయికి తగ్గించబడింది.

మార్క్స్, ఎంగెల్సు గుత్తపూర్వ పెట్టుబడిదారీ వ్యవస్థ కాలంలో జీవించినారు. అప్పుడు పెట్టుబడిదారీ వ్యవస్థ యింకా ఆరోహణ దశలో వుండింది, మొత్తం పెట్టుబడిదారీ వ్యవస్థ అంతా కార్మికవర్గ విప్లవానికి యింకా పరిపక్వం కాలేదు, అలాంటి విప్లవానికి కావలసిన భౌతిక పరిస్థితులు యూరప్, అమెరికాలలో ఆర్థికంగా అత్యంత అభివృద్ధి చెందిన దేశాలలో మాత్రమే కొంత వరకు పరిపక్వమై వుండినాయి. అందువల్లనే, కార్మికవర్గ విప్లవం పురోగామి పెట్టుబడిదారీ దేశాల కార్మికవర్గంయొక్క సంయుక్త కృషిద్వారా మాత్రమే,

యీ దేశా లన్నిటిలోనూ యేక కాలంలో మాత్రమే గెలవగలదనీ, సోషలిస్టు విప్లవం యే ఒక్క దేశంలోనూ గెలవజాలదనీ మార్క్సు, ఎంగెల్సు నమ్మినారు. "కమ్యూనిజం సూత్రాలు"లో ఎంగెల్స్ యిలా రాసినాడు: "కమ్యూనిస్టు విప్లవం... జాతీయంగా మాత్రమే వుండదు; అది అన్ని నాగరిక దేశాలలోనూ జరుగుతుంది, అనగా, కనీసం ఇంగ్లండు, అమెరికా, ఫ్రాన్సు, జర్మనీలలో యేక కాలంలో జరుగుతుంది."* సోషలిస్టు విప్లవం క్షణకాలపు చర్య కాదనీ, అదొక దశ అనీ, కార్మికవర్గానికీ, దాని వర్గ శత్రువులకూ మధ్య జరిగే అంతర్జాతీయ యుద్ధాల యుగమనీ మార్క్సు, ఎంగెల్సులు నొక్కిచెప్పినారు. కార్మికవర్గ విప్లవం పురోగామి పెట్టుబడిదారీ దేశా లన్నిటిలోనూ యేక కాలంలో మాత్రమే గెలవగలదన్న సూత్రం గుత్త పూర్వ పెట్టుబడిదారీ దశకు సరైనది, ఆ యుగంయొక్క చారిత్రక పరిస్థితులకు అనుగుణమైనది. కానీ, సామ్రాజ్యవాద యుగంలో పరిస్థితులు మారినాయి.

శతాబ్ది మలుపులో పెట్టుబడిదారీ వ్యవస్థ కొత్త, అత్యున్నత అభివృద్ధి దశలోకి, సామ్రాజ్యవాద దశలోకి, పెట్టుబడిదారీ వ్యవస్థ క్షీణించే యుగంలోకి, ప్రవేశించిందని లెనిన్ చూపించినాడు. ముఖ్యంగా, యీ దశలో పెట్టుబడియొక్క సాంద్రీకరణ, కేంద్రీకరణల మూలంగా ఆర్థిక వ్యవస్థ శక్తివంతమైన పెట్టుబడిదారీ సంఘాలైన గుత్త సంస్థల పెత్తనం కిందికి వస్తుందనే విషయంమీద లెనిన్ నిర్ధారణ ఆధారపడింది. నిర్నిబంధ పోటీ స్థానంలో గుత్తాధిపత్యం రావడం ఆర్థిక వ్యవస్థలో స్తబ్దతా ధోరణియొక్క ఆవిర్భావాన్ని తెలియజేస్తుంది.

సామ్రాజ్యవాదానికి జరిగిన పరివర్తనను మొత్తం పెట్టుబడిదారీ వ్యవస్థ సోషలిస్టు విప్లవానికి పక్వమైన యుగంయొక్క ప్రారంభంగా గ్రహించాలి. సోషలిస్టు విప్లవ సిద్ధాంతాన్ని రూపొందించినప్పుడు లెనిన్ చేసిన నిర్ధారణ అది. చారిత్రక అభివృద్ధి గతిలో ప్రభుత్వ గుత్త పెట్టుబడిదారీ వ్యవస్థకూ, సోషలిజంకూ మధ్య మధ్యంతర దశలు లేవనీ, సామ్రాజ్యవాదం సోషలిస్టు విప్లవానికి అత్యంత సంపూర్ణమైన పాదార్థిక సన్నాహమనీ ఆయన అన్నాడు.

అదే సమయంలో, సామ్రాజ్యవాదంలో విప్లవ శక్తుల గణనీయమైన పెరుగుదల కూడా వుంటుంది. కార్మికవర్గంమీద జరిగే తీవ్రమైన దోపిడీకి కార్మికవర్గానికీ, బూర్జువావర్గానికీ మధ్య గల వైరుధ్యాన్ని అంతకంతకూ తీవ్రపరచే ధోరణి వుంటుంది. సామ్రాజ్యవాదం కార్మికవర్గాన్ని విప్లవ ద్వారంవద్దకు తెస్తుంది. కానీ, సామ్రాజ్యవాదం కార్మికవర్గాన్ని మాత్రమే కాక, రైతాంగాన్నీ, పట్టణ పెటీబూర్జువాలనూ, మేధావులనూ కూడా కష్టాలకు గురిచేస్తుంది. యీ సామాజిక బృందాలలోనే కార్మికవర్గం దాదాపు స్థిరమైన పొత్తు

---

* K. Marx and F. Engels, *Selected Works*, Vol. I, పుటలు 91–92.

దార్ల కొరకు వెదుకుతుంది, పెత్తుదార్లను సంపాయిస్తుంది. సామ్రాజ్యవాదంచేత పీడింప బడే వలస, పరాధీన దేశాలలోని ప్రజానీకాల జాతీయ విమోచన పోరాటం కార్మికవర్గానికి పొత్తుదార్లను సమకూర్చే మరొక విస్తారమైన నిధి.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం అభివృద్ధి చెందేకొద్దీ జాతులు ఉద్భవించి, అభివృద్ధి చెంది, తమ మధ్య వివిధ సంబంధాలు నెలకొల్పుకుంటాయి. కానీ, బూర్జువా సమాజంలోని యీ వస్తుగతంగా ప్రగతిశీలమైన క్రమాలమీద శత్రు వైరుధ్యపు ముద్ర వుంటుంది. జాతీయతా, జాతీయ పీడనా సొంత ఆస్తి సమాజపు విలక్షణ ఉత్పాదితాలు.

ఒక జాతిని మరొక జాతి బానిసీకరించి, పీడించడం మూలంగా పీడిత జాతిలో తన జాతీయ విమోచన కొరకు పోరాటం ఉత్పన్నమౌతుంది. అందువలన జాతీయ సమస్య — జాతీయ కలహాన్నీ, జాతీయ పీడననూ తొలగించడం యెలా అనే సమస్య — తక్షణ సమస్య అవుతుంది. సొంత ఆస్తీ, వర్గాలూ వున్నంత కాలం జాతీయ సమస్య పూర్తిగా పరిష్కరింప బడజాలదు — జాతుల మధ్య ప్రజాతంత్ర సంబంధాల అభివృద్ధితో అది తగ్గవచ్చు ననే మాట నిజమే అయినప్పటికీ. జాతీయ సమస్యపట్ల మార్క్సిస్టు వైఖరియొక్క సారాన్ని నిర్ణయించేది అదే. మార్క్సిజం యీ సమస్యను స్వతంత్రమైన, స్వయం సంపూర్ణమైన సమస్యగా పరిగణించదు, మరింత సాధారణమైన విప్లవ సమస్యల్లో, సమాజంయొక్క ప్రజా తంత్ర, లేదా సోషలిస్టు రూపాంతరీకరణ సమస్యల్లో, భాగంగా పరిగణిస్తుంది, శ్రామిక ప్రజల విమోచన సమస్యల్లో భాగంగా పరిగణిస్తుంది. అందువల్లనే, జాతీయ ఉద్యమం గురించీ, దానిపట్ల కార్మికవర్గపు వైఖరిని గురించీ వేసే అంచనా దాని వస్తుగత ప్రాముఖ్యమూ, దాని డిమాండ్ల స్వభావమూ, మొదలైనవి సమాజపు ప్రగతిశీల అభివృద్ధియొక్క ప్రయోజ నాలకు యెంతవరకు అనుగుణంగా వున్నాయనేదానిమీద ఆధారపడుతుంది. వివిధ జాతీయ ఉద్యమాల క్లిష్ట పరస్పర తర్కాన్ని నిర్దిష్ట చరిత్ర దృష్ట్యా, ఆ యుగంలో వర్గ పోరా టపు సాధారణ పురోగతి సందర్భంలో మాత్రమే సరిగా విడమరచవచ్చు. దీని ఆధారంమీద జాతీయ సమస్యమీద నిర్దిష్ట డిమాండ్లూ, కార్యక్రమాలూ రూపొందించబడుతాయి.

కానీ, జాతీయ సమస్యకు కొన్ని సాధారణ సూత్రాలు వున్నాయి; అవి లేకుండా అది పరిష్కరింపబడజాలదు. అవి యేమంటే: జాతుల మధ్య సంబంధాలలో ప్రతి బలవంతపు రూపాన్నీ దృఢంగా నిరాకరించడమూ; తమ తమ భవిష్యత్తులను యేర్పరచుకోవడంలో జాతుల సమానత్వాన్నీ, సర్వసత్తాకతనూ గుర్తించడమూ; జాతుల చిరస్థాయి అయిన సమైక్యానికి సహకారమూ, నిర్నిబంధమైన యిచ్ఛా మాత్రమే ప్రాతిపదిక అని గుర్తించడమూ.

19వ శతాబ్దిలోని గుత్తపూర్వ పెట్టుబడిదారీ వ్యవస్థ కాలంలో జాతీయ సమస్య ప్రధానంగా కొద్ది యూరపియన్ జాతులకు పరిమితమై వుండింది — బాల్కన్ ద్వీపక

ప్పంలోని ప్రజానీకాలూ, ఇటాలియన్లూ, ఐరిష్ ప్రజలూ, జెక్కులూ, పోలులూ, ఫిన్నులూ పీడిత స్థితిలో వుండినారు. యీ పీడిత ప్రజానీకాలు తమ జాతీయ విమోచన కొరకు దీర్ఘ, కఠిన పోరాటం చేసినారు. ఆసియా యింకా మేల్కొనలేదు. చైనాలోని తైపింగ్ తిరుగుబాటూ, భారతదేశంలోని సిపాయిల తిరుగుబాటూ మాత్రమే యీ దేశాలలో నిద్రాణమై వుండిన మహా బలీయమైన శక్తులను గురించి దృఢమైన హెచ్చరిక యిచ్చినాయి.

సామ్రాజ్యవాద యుగంలో జాతీయ సమస్యయొక్క చట్రం విస్తరింపబడుతుంది; యెందుకంటే, అది జాతీయ వలస సమస్యగా పెరుగుతుంది. సామ్రాజ్యవాద పీడననుండి వలసల పీడిత ప్రజానీకాల విమోచనకు సంబంధించిన సమస్య అది.

కనుక, సామ్రాజ్యవాదంలో పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క సర్వసమర్థమైన పెత్తనంమీద జరిగే పోరాటపు సామాజిక ప్రాతిపదిక గణనీయంగా విస్తృతమైంది. యీనాటి ప్రధాన విప్లవ శక్తి అయిన కార్మికవర్గం భిన్న సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులకు, అంతిమంగా వాటిని పెట్టుబడిదారీ వ్యవస్థమీదికి నడిపించేటందుకు, అగ్రేసరత్వం వహించగలదు, వహించాలి. విప్లవాత్మక సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తుల పెరుగుదల కార్మికవర్గం బూర్జువా వర్గాన్ని ఓడించడానికి నిస్సందేహంగా తోడ్పడుతుంది.

యిది పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధిలోని కొత్త దశను పరిశీలించి, దానినుండి లెనినిజం చేసిన రెండవ నిర్ధారణ.

దీని ఆధారంమీదా, 1905 నాటి ప్రథమ రష్యన్ విప్లవ అనుభవం ఆధారంమీదా లెనిన్ బూర్జువా ప్రజాతంత్ర విప్లవం సోషలిస్టు విప్లవంగా అభివృద్ధి చెందుతుందనే సిద్ధాంతాన్ని రూపొందించినాడు. సామ్రాజ్యవాద యుగంలో బూర్జువా ప్రజాతంత్ర విప్లవాన్నీ, సోషలిస్టు విప్లవాన్నీ కాలం విషయంలో దగ్గరికి తేవచ్చునని యీ సిద్ధాంతం రుజువు చేసింది. బూర్జువా విప్లవానికీ, సోషలిస్టు విప్లవానికీ మధ్య దీర్ఘ కాలం గడవాలని రెండవ ఇంటర్నేషనల్ నాయకులు పట్టుబట్టిన అవకాశవాద సూత్రం లెనిన్ సిద్ధాంతం దృష్ట్యా పనికి మాలిన చెత్త అయింది.

బూర్జువా ప్రజాతంత్ర విప్లవం సోషలిస్టు విప్లవంగా అభివృద్ధి చెందుతుందనే లెనిన్ సిద్ధాంతంయొక్క సారాంశం యిది: బూర్జువా ప్రజాతంత్ర విప్లవంలో కార్మిక వర్గానికి నాయకత్వం వుంటే, శ్రామిక ప్రజలలోని కార్మికవర్గేతర విభాగాలతోనూ, సామ్రాజ్యవాద వ్యతిరేక అంతర్జాతీయ శక్తులతోనూ పొత్తు వుంటే, విప్లవ ప్రజాతంత్ర నియంతృత్వం నెలకొల్పబడితే, స్వతంత్ర, సూత్రబద్ధ విధానాన్ని అనుసరించే విప్లవ మార్క్సిస్టు, లెనినిస్టు పార్టీ వుంటే, బూర్జువా ప్రజాతంత్ర రూపాంతరీకరణల తక్షణ

సమస్య యెదురైన దేశాలకు విప్లవాన్ని యెడతెగకుండా అభివృద్ధి చేయడానికీ, ప్రగాఢపరచ డానికీ, ప్రజాతంత్ర దశనుండి సోషలిస్టు దశకు పోవడానికీ అవకాశాలు వున్నాయి.

లెనిన్‌యొక్క యీ భావం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, సోషలిజం కొరకు కార్మిక వర్గం చేసే పోరాటవు మార్గాన్ని యింకా దీప్తివంతం చేస్తున్నది.

యీనాడు ప్రజాతంత్ర ఉద్యమాన్ని సోషలిజం కొరకు జరిగే పోరాటానికి దగ్గరికి తేవడానికి యింకా యెక్కువ అవకాశాలు కూడా వున్నాయి. యెందుకంటే, ఒకటి, ప్రపంచ అభివృద్ధిలో నిర్ణయాత్మక అంశంగా పనిచేసే శక్తివంతమైన సోషలిస్టు వ్యవస్థ వుంది; రెండు, ప్రజాతంత్ర ఉద్యమంయొక్క సామాజిక సారంలోనే మార్పు వచ్చింది.

గతంలో, శతాబ్ది మలుపులో, ప్రజాతంత్ర ఉద్యమం ఫ్యూడలిజంకూ, దాని అవశేషా లకూ వ్యతిరేకంగా ఉద్దేశింపబడింది. కానీ, యీనాడు గుత్త పెట్టుబడి దాని ప్రధాన శత్రువు. అంటే, ఫ్యూడల్ వ్యతిరేక కర్తవ్యాలు పూర్తిగా తొలగిపోయివాయని కాదు. అవి యింకా కొన్ని దేశాలలో నిలిచి వున్నాయి. కానీ అవి ప్రజల స్వేచ్ఛకు ప్రధాన శత్రువైన సామ్రాజ్యవాదంతో చేసే పోరాటంలో భాగ మౌతాయి.

ప్రస్తుత యుగంలో సోషలిజంకు కావలసిన బాహ్య, ఆంతరంగిక పూర్వావసరాలు మరింత అనుకూలమైనాయి గనుక, వలస పీడననుండి విముక్తి చెంది, ఆర్థికంగా అభివృద్ధి కాని దేశాలకు పెట్టుబడిదారీయేతర మార్గంలో పయనించే అవకాశం యేర్పడింది.

సామ్రాజ్యవాదం సోషలిస్టు విప్లవానికి కావలసిన భౌతిక పూర్వావసరాలను మొత్తం సామాజిక వ్యవస్థ ప్రమాణంలో సిద్ధంచేసి, పెట్టుబడిదారీ వ్యవస్థలోని అంతర్వైరుధ్యాల నన్నిటినీ తీవ్రపరచి, తద్వారా సోషలిస్టు విప్లవాభివృద్ధికి నూతన చారిత్రక పరిస్థితులను సృష్టిస్తుంది.

సోషలిజంకు పరివర్తన మన యుగానికి అంతకంతకూ జరూరైన అవసరం అవుతుంది. యీనాడు ప్రజాతంత్ర ఉద్యమాలన్నీ తమ స్వతంత్ర చారిత్రక ప్రాముఖ్యం కోల్పోకుండా, సోషలిజం కొరకు జరిగే పోరాటాన్ని పెంపొందించగలవు. కనుక, సామ్రాజ్యవాద యుగంలో, అర్ధఫ్యూడల్, జాతీయ, సామ్రాజ్యవాద పీడనకు వ్యతిరేకంగా జరిగే విశాల ప్రజా ఉద్యమాల కన్నిటికీ అగ్రేసరత్వం వహించడానికీ, సోషలిస్టు విప్లవం కొరకూ, కార్మికవర్గ నియంతృ త్వం కొరకూ జరిగే పోరాటవు ప్రధాన ప్రవాహంలోకి వాటిని తేవడానికీ కార్మికవర్గపు విప్లవ పార్టీలకు అవకాశమూ, ఆవశ్యకతా మొదటిసారి యెదురౌతాయి.

సామ్రాజ్యవాద యుగంలో పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క అసమ ఆర్థిక రాజకీయ అభివృద్ధి అనే నియమం, లెనిన్ ఆవిష్కరించినట్టిది, సోషలిస్టు విప్లవ అభివృద్ధిమీద నిర్ణ యాత్మకమైన ప్రభావం నెరపుతుంది.

అసమ ఆర్థిక అభివృద్ధికి పెట్టుబడిదారీ వ్యవస్థలోని అంతర్వైరుధ్యాలను తీవ్రపరచి, సామ్రాజ్యవాద శ్రేణిని బలహీనపరచే ధోరణి వుంది. అందువలన సామ్రాజ్యవాదపు గొలుసును దాని **అత్యంత** బలహీనమైన లంకెవద్ద తెంచడం సాధ్యమౌతుంది.

యీ లంకె విధిగా పెట్టుబడిదారీ వ్యవస్థ అత్యంత అభివృద్ధి చెందిన దేశం కానక్కర లేదు. యిది బలమైన, చైతన్య పూరితమైన, వ్యవస్థీకృతమైన విప్లవ కార్మికవర్గం వుండి, దానికి ముఖ్యమైన పొత్తుదారులు వుండి, పాలక వర్గాలలోని పరిపాలక అగ్రగణ్యులు అత్యంత బలహీనంగా, యేకాకులుగా వున్న దేశం కావచ్చు.

అసమ ఆర్థిక అభివృద్ధి భిన్న దేశాలలోని విప్లవాల పరిపక్వతలో అసమత్వానికి, అనగా రాజకీయ అభివృద్ధిలో అసమత్వానికి దారితీస్తుంది, అలాగే విప్లవాన్ని నిర్వహించిన దేశం సామ్రాజ్యవాద దేశాల వలయంలో కొనసాగే అవకాశానికి కూడా దారితీస్తుంది. దీనినుండి లెనిన్ ఒక నిర్ధారణ చేసినాడు. సోషలిస్టు విప్లవం అన్ని దేశాలలోనూ ఒకేసారి జయించజాలదు, అది మొదట కొద్ది దేశాలలో, లేదా ఒకేఒక దేశంలో కూడా జయించగలదు, అనే నిర్ధారణ 1915లో లెనిన్ చేసినాడు.

తమ "సొంత" బూర్జువావర్గంతో చేసే పోరాటంలో కార్మికవర్గంయొక్క ఆయా జాతీయ దళాల చొరవను రగిలించడానికి లెనిన్ సిద్ధాంతం తోడ్పడింది.

యీ శతాబ్దపు ప్రారంభంలో జారిస్టు రష్యా సామ్రాజ్యవాదపు గొలుసులోని అత్యంత బలహీనమైన లంకెగా వుండింది. మొట్టమొదటిగా ఒకేఒక దేశంలో విజయవంతమైన సోషలిస్టు విప్లవాన్ని నిర్వహించినది రైతాంగపు పొత్తు గల రష్యన్ కార్మికవర్గమే. తద్వారా అది లెనిన్‌యొక్క సోషలిస్టు విప్లవ సిద్ధాంతానికి ఉజ్వలమైన ధ్రువీకరణను సమకూర్చింది.

సోషలిస్టు విప్లవాల తదనంతర అభివృద్ధి కూడా అసమంగా వుండింది. ఆయా దేశాలలో విప్లవాలు పరిపక్వం కాగా, యీ దేశాలు సామ్రాజ్యవాదపు గొలుసునుండి విడిపోయి, ఒకే సోషలిస్టు శిబిరంగా యేకమైనాయి. కానీ, యిక ముందు జరిగే విప్లవాలు సోషలిస్టు దేశాల సహాయాన్నీ, అండదండలనూ నమ్ముకోవచ్చు. యే విప్లవమైనా ఆంతరంగిక అంశాల మూలంగా పక్వమౌతుంది, ఉత్తరువు మేరకు జరగదు; అందువల్ల, "విప్లవపు యెగుమతి" సహించ రానిదనే మౌలిక సూత్రాన్ని మార్క్సిజం లెనినిజం రూపొందించింది. మరొక వైపున, విప్లవ ప్రతిఘాతపు యెగుమతిని అరికట్టడమూ, ప్రపంచ సామ్రాజ్యవాదం చేసే యే పోలీసు చర్యతోనైనా పోరాడడమూ కార్మికవర్గంయొక్కా, సోషలిస్టు శక్తులయొక్కా అంతర్జాతీయతా విధి.

ప్రపంచ సోషలిస్టు వ్యవస్థ ఆవిర్భవించి, బలపడడంతో అంతర్జాతీయ సన్నివేశంలో మౌలికమైన మార్పులు జరిగినాయి. యీ శతాబ్ది మొదటి పాదంలో, సామ్రాజ్యవాదపు మొత్తం

శ్రేణి బలహీనపడడం సామ్రాజ్యవాద అంతర్వైరుధ్యాలు తీవ్రం కావడం వలన జరిగింది. కానీ, యీనాడు, ప్రపంచం రెండు పరస్పర వ్యతిరేక వ్యవస్థలుగా చీలడం వలనా, ప్రపంచ సోషలిస్టు వ్యవస్థ అభివృద్ధి చెంది, బలపడడం వలనా యీ శ్రేణి బలహీనపడింది. దీని ఫలితం యేమిటంటే, ముఖ్యంగా, శాంతియుత పరిస్థితులలో సామ్రాజ్యవాదపు గొలుసును దాని బలహీనమైన లంకెలవద్ద విచ్ఛిన్నం చేయడానికి అవకాశాలు పెరగడం.

దరహంమీద యుద్ధం యెప్పుడూ విప్లవానికి కారణంగా లేదు. కానీ, అది యెల్లప్పుడూ వైరుధ్యాల నన్నిటినీ యెక్కువగా తీవ్రపరచి, తద్వారా విప్లవ సన్నివేశాన్ని కలిగించి, విప్లవ ప్రేలుడులకు వూపు యిచ్చింది. రష్యాలో అక్టోబర్ విప్లవమూ, తూర్పు యూరప్‌లోనూ, ఆసియాలోనూ విప్లవాలూ ప్రథమ, ద్వితీయ ప్రపంచ యుద్ధాలు కలిగించిన తీవ్రత్వపు పర్యవసానాలని జ్ఞాపకం వుంటుంది. అయినప్పటికీ, యుద్ధం లేకుండా విప్లవం అసంభవమని నిర్ధారణ చేయడం తప్పు. తద్వ్యతిరేకంగా, విప్లవ సన్నివేశాల ఆవిర్భావానికి యిప్పుడు యుద్ధాలు లేకుండా అంతకంతకూ యెక్కువ అనుకూలమైన పరిస్థితులు సృష్టింపబడుతున్నాయి.

ఒక వైపున, పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క క్షీణతా, విచ్ఛిత్తీ, సార్వత్రిక సంక్షోభమూ, మరొక వైపున, సోషలిజం యేర్పడడమూ, దాని అభివృద్ధీ, విజయమూ ప్రస్తుత యుగంలోని రెండు ప్రధాన ధోరణులు, ప్రపంచ విప్లవ క్రమ అభివృద్ధియొక్క ఫలితాలు.

ప్రస్తుత పరిస్థితులలో పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క సార్వత్రిక సంక్షోభపు ప్రధాన వ్యక్తీకరణ యేమిటంటే, ప్రపంచ సోషలిస్టు వ్యవస్థ యేర్పడడమూ, ప్రపంచం రెండు పరస్పర విరుద్ధ సామాజిక వ్యవస్థలుగా విభజింపబడడమూ.

యీ సంక్షోభపు మరొక ముఖ్యమైన వ్యక్తీకరణ యేమిటంటే, జాతీయ విమోచనోద్యమంయొక్క నూటి ఫలితంగా వలసవాద వ్యవస్థయొక్క విచ్ఛిత్తి.

రష్యాలోని అక్టోబర్ మహా విప్లవం వలన, పరాధీన దేశాలలోని జాతీయ విమోచనోద్యమానికి శక్తివంతమైన వూపు యిచ్చింది. అదే సమయంలో, సామ్రాజ్యవాదపు వలసవాద వ్యవస్థను బలహీనపరచిన పలు ఆంతరంగిక అంశాలు (పలు వలస, పరాధీన దేశాలలో పరిశ్రమలూ, పెట్టుబడిదారీ సంబంధాలూ అభివృద్ధి కావడమూ, అక్కడ కార్మికవర్గమూ, మేధావివర్గమూ, జాతీయ బూర్జువావర్గమూ ఉద్భవించడమూ) యీ క్రమాన్ని సిద్ధంచేసి, తీవ్రపరచినాయి.

రెండవ ప్రపంచ యుద్ధంలోనూ, దాని తర్వాతా, ప్రపంచ సోషలిస్టు వ్యవస్థయొక్క ఆవిర్భావంతోనూ, పెట్టుబడిదారీ ప్రపంచంలోని సామాజిక క్రమా లన్నిటిమీదా దాని విప్లవకర ప్రభావం పెరగడంతోనూ జాతీయ విమోచనోద్యమం మరీ శక్తివంతమైన ఉప్పెనగా పొంగింది.

స్వల్ప చారిత్రక కాలంలో, కొద్ది మినహాయింపులతో, దాదాపు అన్ని దేశాలు వలస పరాధీనతనుండి విముక్తమై, డజన్ల కొలది స్వతంత్ర జాతీయ రాజ్యాలు నెలకొల్పబడివాయి. దీని అర్థం యేమిటంటే, సామ్రాజ్యవాదపు వలసవాద వ్యవస్థయొక్క సంపూర్ణ పతనం; యిది ప్రపంచ సోషలిస్టు వ్యవస్థ యేర్పడిన తర్వాత చరిత్రలోని అత్యంత ముఖ్య ఘటన.

జాతీయ విమోచనోద్యమ పోరాటంలో ప్రజానీకాలు రాజకీయ స్వాతంత్ర్యం సాధించి నారంటే, యీ దేశాలలో సామ్రాజ్యవాదుల పెత్తనం పూర్తిగా తొలగిపోయిందని కాదు; యెందుకంటే, వాళ్ల కింకా బలమైన ఆర్థిక స్థావరాలు వున్నాయి. యీ దేశాల ఆర్థిక వెనుకబాటుతనం గొప్ప సమస్యగా వుంది. అందువలన, యివి తమ జీవన ప్రమాణాలను మెరుగుపరచుకొని, సామ్రాజ్యవాదంనుండి నిజమైన స్వాతంత్ర్యం పొందాలంటే, తమ జాతీయ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేసుకోవడం అత్యవసరం. సామ్రాజ్యవాదం ఒకనాటి వలసలను తన ప్రభావానికి లోబరచడానికి యిప్పుడు మరింత పట్టు విడుపులు గల కొత్త పద్ధతులను ఉపయోగిస్తున్నది, నయా వలసవాదం అనే పద్ధతులను.

ప్రపంచంలో పెట్టుబడిదారీ వ్యవస్థా, సోషలిస్టు వ్యవస్థా వున్నాయి గనుక, వర్ధమాన దేశాల యెదుట రెండు అవకాశా లున్నాయి: పెట్టుబడిదారీ అభివృద్ధి మార్గమూ, సోషలిజంకు దారితీసే పెట్టుబడిదారీయేతర అభివృద్ధి మార్గమూ. సోషలిస్టు దేశాలయొక్కా, పెట్టుబడిదారీ దేశాలలోని కార్మికోద్యమంయొక్కా సహకారమూ, స్వదేశంలోని ప్రజాతంత్ర శక్తులను కూడగట్టడమూ అనే ప్రాతిపదికమీద యీ దేశాలు తమకు యెదురైన ఆర్థిక, సామాజిక సమస్యలను పరిష్కరించడానికి పూనుకుంటే, తమ తరతరాల వెనుకబాటుతనాన్ని అత్యంత వేగంగా అధిగమించగల మార్గం లభిస్తుంది.

"విప్లవాత్మక ప్రపంచ గ్రామం" బూర్జువాకరింపబడిన "ప్రపంచ పట్టణా"న్ని జయించాలని ఉద్బోధించే బూటకపు నినాదంతో, యిటు ప్రజానీకాల జాతీయ విమోచనోద్యమాన్నీ, అటు సోషలిస్టు వ్యవస్థనూ, పెట్టుబడిదారీ దేశాలలోని విప్లవాత్మక కార్మికోద్యమాన్నీ విడదీయడానికీ, వాటిని ఒకదాని కొకటి ప్రతిగా పెట్టడానికీ ప్రయత్నించడం వ్యర్థం.

జాతీయ విమోచనోద్యమంలో చాలా భిన్నభిన్నమైన సామాజిక శక్తులు వున్నాయి, పారిశ్రామిక అభివృద్ధికి సంబంధించినవీ (కార్మికవర్గమూ, జాతీయ బూర్జువావర్గమూ), ఫ్యూడలిజం అవశేషాలకూ, గణ సంబంధాల అవశేషాలకూ సంబంధించినవీ (గణ సంబంధాలు యింకా బలంగా వున్నచోట రైతు సమాజం, వగైరాలు). పరిగణించ వలసిన మరొక విషయం యేమిటంటే, పెటీబూర్జువాలూ, మేధావులూ, స్థానిక బ్యూరాక్రటిక్ అగ్రగణ్యులూ, మిలిటరీ లాంటి సామాజిక బృందాలు యీ దేశాల జీవితంమీదా, అభివృద్ధిమీదా నెరపే ప్రభావం.

యీ విలక్షణమైన నేలలోకి శాస్త్రీయ సోషలిజంయొక్క భావాలను తీసుకపోయి, పెట్టుబడిదారీయేతర అభివృద్ధియొక్క అవసరాలను తీర్చే విధంగా విమోచనోద్యమానికి వ్యూహాన్నీ, యెత్తుగడలనూ రూపొందించడం చాలా కష్టమైన పనే అయినా అవసరం. ఒక వైపున, సోషలిస్టు భావాల ఆకర్షణా, మరొక వైపున, అభివృద్ధి చెందని సామాజిక పరిస్థితులూ "ఆఫ్రికన్," "ఆసియన్," "జాతీయ," తదితర రకాల సోషలిజం అనే భిన్నభిన్న భావాలను ఉత్పత్తి చేస్తాయి. యీ భావాలనూ, యివి ఉత్పన్నం చేసే సామాజిక కార్యక్రమాలను అంచనా వేయడంలో అన్నిటికంటె ముఖ్యంగా వీటి అభిముఖతను పరిగణించడం అవసరం: అది సోషలిజంయొక్కా, ప్రపంచ విప్లవోద్యమంయొక్కా శక్తులతో పొత్తుకు అభిముఖమా, లేక వాటికి వ్యతిరేకమా, అది సామ్రాజ్యవాదానికి వ్యతిరేకమా, అనుకూలమా?

ప్రపంచం రెండు శిబిరాలుగా విభజింపబడినందువలన, ముఖ్యంగా ప్రపంచ సోషలిస్టు వ్యవస్థ యేర్పడిన తర్వాత, పెట్టుబడిదారీ వ్యవస్థను నిలబెట్టుకోడానికి చేసే పోరాటం సామ్రాజ్యవాద దేశాల అంతర్జాతీయ విధానంయొక్క ప్రధాన కర్తవ్యం అవుతుంది. సోషలిస్టు వ్యవస్థలోని దేశాలతో పోరాడేటందుకూ, కార్మికవర్గ, జాతీయ విమోచన ఉద్యమాలను అణచేటందుకూ సామ్రాజ్యవాదులు మిలిటరీ రాజకీయ పొత్తులలో యేకమై, కూటములు నెలకొల్పుతారు.

పెట్టుబడిదారీ అభివృద్ధిలోని సామ్రాజ్యవాద దశయొక్క ఆర్థిక అంతర్వైరుధ్యాలూ, ఆర్థిక నియమాల చర్యలూ యుద్ధాలకు కారణమవుతాయి. యుద్ధాలను ప్రారంభించే విధానాన్ని భగ్నం చేయగల నిజమైన శక్తులు ప్రపంచంలో యేవీ లేనంత కాలం యుద్ధాలు అనివార్యంగా వుండినాయి. సామ్రాజ్యవాద యుగంలో అవి ప్రపంచ యుద్ధాలైనాయి. కానీ, యీనాడు, ప్రధానంగా ప్రపంచ సోషలిస్టు వ్యవస్థ ఉద్భవించి, అభివృద్ధి చెందినందువల్ల, సామ్రాజ్యవాదుల దురాక్రమణశీల పన్నాగాలను ప్రతిఘటించగల శక్తి ఒకటి అంతర్జాతీయ రంగంలో ఆవిర్భవించింది. అందువల్లనే, ప్రపంచ అణు యుద్ధాన్ని నివారించడం సాధ్యం అని కమ్యూనిస్టులు నొక్కిచెప్పుతారు.

యుద్ధమూ, శాంతియూ అనే సమస్య యీనాటి అత్యంత తీవ్రమైన సమస్య, కోటానుకోట్ల మానవులకు జీవన్మరణ సమస్య. "ప్రధానమైనది యేమిటంటే అణు యుద్ధాన్ని నివారించడం, అది ప్రారంభం కాకుండా అరికట్టడం. ప్రస్తుత తరం యీ పని చేయగలదు."*

---

* "సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమం," "కమ్యూనిజంకు బాట," పుట 504.

ఒకవైపున పెట్టుబడిదారీ వ్యవస్థలోని వర్గ వైరుధ్యాలు తీవ్రం కావడం వలనా, మరొక వైపున, కమ్యూనిస్టు భావాలు విజయవంతంగా వ్యాప్తి చెందడం వలనా, సోషలిస్టు దేశాల విజయాల వలనా, సామ్రాజ్యవాదులు కమ్యూనిజంతో పోరాడడానికి కొత్త మార్గాలూ, సాధనాలూ వెతుక్కోవలసి వచ్చింది. యీ పరిస్థితులలో వాళ్లు కమ్యూనిస్టు ఉద్యమంలో చీలిక కొరకూ, వ్యష్టి పార్టీలలో జాతీయవాదపు ముఠాల కొరకూ యెదురుచూస్తూ, వాటిమీద ఆశలు పెట్టుకొన్నారు.

యీ విషయంలో, మావోయొక్క గొప్ప రాజ్యపు, సోవియట్ వ్యతిరేక జాతీయవాదపు పంథా సామ్రాజ్యవాదులకు కలిగిన గొప్ప అదృష్టం. మొట్టమొదటినుండి ప్రపంచ కమ్యూనిస్టులు మావోయిస్టుల "ప్రత్యేక పంథా"తో ఆందోళన చెందినారు. అది అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమాన్ని చీల్చడానికీ, జాతీయ కమ్యూనిస్టు పార్టీలలో మావోయిస్టు ముఠాలను యేర్పరచడానికీ, ఆత్మగత, వామపక్ష దుందుడుకువాదపు విధానాలను అనుసరించడానికీ ఉద్దేశింపబడిన పంథాగా వుండిందనీ, యిప్పటికీ వుంటున్నదనీ తదనంతర ఘటనల గతి నిరూపించింది. అందువల్లనే కమ్యూనిస్టు, కార్మిక పార్టీలు మావో బృందపు విచ్ఛేదక విధానానికి వ్యతిరేకంగా స్థిర సంకల్పపు స్థావరం తీసుకొన్నారు.

విప్లవకారుల శ్రేణులలోని చీలిక యెల్లప్పుడూ దుష్ట పాత్ర వహించిందని తెలపడానికి వివిధ యుగాలలోని విప్లవోద్యమ చరిత్రా, అనుభవమూ చాలా వుంది. అందువల్లనే, మార్క్సిస్టు లెనినిస్టు సూత్రాలమీద ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ ఐక్యత కొరకు పోరాడడం ప్రపంచ విప్లవ క్రమంయొక్క విజయవంతమైన అభివృద్ధికి అత్యంత ముఖ్యమైన కర్తవ్యమూ, షరతూ. ప్రపంచ విప్లవోద్యమ ఐక్యతను పటిష్ఠపరచడంలో 1969 జూన్‌లో జరిగిన కమ్యూనిస్టు, కార్మిక పార్టీల మాస్కో సమావేశం చాలా ముఖ్యమైనది. దాని ప్రధాన పత్రం ప్రస్తుత దశలో సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటపు కర్తవ్యాలనూ, కమ్యూనిస్టు, కార్మిక పార్టీలయొక్కా, తదితర సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులన్నిటియొక్కా ఐక్య కార్యాచరణను కట్టుదిట్టం చేయడానికి అవసరమైన పరిస్థితులనూ స్పష్టంగా రూపొందిస్తుంది. సమావేశపు యీ సమరశీల విజ్ఞప్తి ప్రపంచ మంతటా వ్యాపించింది: "సోషలిస్టు దేశాల ప్రజానీకాలూ, కార్మికులూ, పెట్టుబడిదారీ దేశాల ప్రజాతంత్ర శక్తులూ, కొత్తగా విముక్తి చెందిన ప్రజానీకాలూ, పీడితులూ, అందరూ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, శాంతి, జాతీయ విముక్తి, సామాజిక ప్రగతి, ప్రజాస్వామ్యం, సోషలిజంల కొరకు జరిగే పోరాటంలో యేకంకండి!"*

---

* "కమ్యూనిస్టు, కార్మిక పార్టీల అంతర్జాతీయ సమావేశం," మాస్కో 1969, పుట 39.

బూర్జువావర్గ పెత్తనాన్ని కూలదోసి, కార్మికవర్గంయొక్క రాజకీయ ఆధిపత్యాన్ని నెలకొల్పడం సోషలిస్టు విప్లవంలో ప్రధాన విషయం. గనుక, విప్లవ సమస్య మనల్ని నేరుగా కార్మికవర్గ నియంతృత్వ సమస్య వద్దకు తీసుకపోతుంది.

కార్మికవర్గ నియంతృత్వం. సోషలిస్టు రాజ్య అభివృద్ధి

మార్క్సిజం స్థాపకులు కార్మికవర్గ నియంతృత్వ భావాన్ని తమ శాస్త్రీయ కమ్యూనిస్టు సిద్ధాంతంలోని కీలక మాత్రంగా ప్రతిపాదించినారు. పెట్టుబడిదారీ సమాజంలోని అంత ర్వైరుధ్యాలు అనివార్యంగా కార్మికవర్గ విప్లవానికి దారితీస్తాయని వాళ్లు రుజువు చేసినారు. తమ "కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక"లో మార్క్సు, ఎంగెల్సు యిలా రాసినారు: "కార్మిక వర్గ విప్లవంలో మొదటి మెట్టు కార్మికవర్గం పాలకవర్గం కావడమూ, ప్రజాస్వామ్యాన్ని గెలుచుకోవడమూ."*

కార్మికవర్గ నియంతృత్వమంటే, పాలకవర్గంగా సంఘటితపడిన కార్మికవర్గం.

కానీ, "కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక" కార్మికవర్గ నియంతృత్వ భావాన్ని అత్యంత సాధారణ పదాలలో మాత్రమే వ్యక్తం చేస్తుంది. 19వ శతాబ్దపు గొప్ప వర్గ యుద్ధాలైన 1848 నాటి విప్లవంయొక్క, 1871 నాటి పారిస్ కమ్యూన్‌యొక్క అనుభవపు ఆధా రంమీద ఆ భావం మరింత నిర్దిష్టపరచబడి, అభివృద్ధి చేయబడింది.

1848 విప్లవం ఒక సిద్ధాంత నిర్ధారణ లాగడానికి మార్క్సుకు తోడ్పడింది. యేమి టంటే, కార్మికవర్గం బూర్జువా రాజ్యంలో పూరక అధికారం స్వాధీనం చేసుకోజాలదనీ, అది తన సొంత నియంతృత్వాన్ని నెలకొల్పాలంటే, మొదట బూర్జువా రాజ్య యంత్రాన్ని బ్రద్దలు చేయాలనీ అనే నిర్ధారణ. కార్మికవర్గ విప్లవం గెలవాలంటే, యీ యంత్రం బ్రద్దలు కావాలి. పాత రాజ్య యంత్రాంగం కార్మికవర్గ రాజ్యపు కొత్త కర్తవ్యాలను పరిష్క రించడానికి ఉపయోగింపబడజాలదు. యెందుకంటే, అది దోపిడీ, పీడనల వ్యవస్థతో ముడి పడింది, శ్రామిక ప్రజలను అణచడానికి ఉద్దేశింపబడింది.

---

* K. Marx and F. Engels, *Selected Works*, Vol. I, పుట 126.

యీ సూత్రంయొక్క సత్యాన్ని రష్యాలోని అక్టోబర్ సోషలిస్టు మహా విప్లవమూ, జనతా ప్రజాతంత్ర దేశాలలోని విప్లవాలూ పూర్తిగా ధ్రువపరచినాయి. పాత రాజ్య యంత్రాన్ని బద్దలుచేసే పద్ధతులు వేరువేరుగా వుండవచ్చు, కొత్త రాజ్య వ్యవస్థ లోపల ఉపయోగించడానికి పాత రాజ్యపు వివిధ అంగాలను నిలిపి వుంచవచ్చు, కానీ దోపిడీ రాజ్య వ్యవస్థనూ, దాని బలాత్కారపు మిలిటరీ బ్యూరాక్రటిక్ యంత్రావళినీ మొత్తంగా బద్దలు చేయడం అవసరం. కార్మికవర్గ నియంతృత్వం మౌలికంగా కొత్త రకం రాజ్యం. చరిత్రలో దాని స్థానాన్నీ, పేరునూ నిర్వచిస్తూ, మార్క్స్ యిలా రాసినాడు: "పెట్టుబడిదారీ సమాజానికీ కమ్యూనిస్టు సమాజానికీ మధ్య, ఒకటి మరొకటిగా విప్లవకర రూపాంతరం చెందే దశ వుంది. దీనికి అనుగుణంగా ఒక రాజకీయ పరివర్తన దశ కూడా వుంది. యీ దశలో రాజ్యం కార్మికవర్గ విప్లవ నియంతృత్వం తప్ప మరొకటి కాజాలదు."*

కార్మికవర్గ నియంతృత్వం దోపిడీ వర్గాలు తప్పని సరిగా చేసే ప్రతిఘటనను అణచే పరికరంగా ఉపకరించడానికి ఉద్దేశింపబడింది; కానీ బల ప్రయోగమే దాని పాత్ర అనుకోవడం తప్పు. కార్మికవర్గ నియంతృత్వం విధి లేనప్పుడు మాత్రమే దోపిడీదార్ల విషయంలో బలాత్కారానికి పూనుకుంటుంది. శ్రామిక ప్రజల విషయంలో కార్మికవర్గ రాజ్యం బలాత్కారపు అంగంగా బొత్తిగా కనపడదు, శ్రామిక ప్రజలలోని అన్ని విభాగాలకూ కార్మికవర్గం యిచ్చే రాజకీయ మార్గదర్శకత్వపు రూపంగా కనపడుతుంది. శ్రామిక ప్రజలను బూర్జువావర్గంనుండి విడదీయడానికీ, వాళ్లను కార్మికవర్గం చుట్టూ సమీకరించడానికీ, నూతన సమాజ నిర్మాణంలో వాళ్లను దింపడానికీ యీ రాజకీయ మార్గదర్శకత్వం అవసరం. మార్క్సిజంను అభివృద్ధి చేయడంలో లెనిన్ కార్మికవర్గ నియంతృత్వాన్ని కార్మికవర్గానికీ, రైతాంగానికీ మధ్య గల పొత్తుయొక్క ప్రత్యేక రూపంగా సూత్రీకరించినాడు, దానిలో కార్మికవర్గం ప్రముఖ పాత్ర వహిస్తుందని అన్నాడు. యీ పొత్తు కార్మికవర్గ నియంతృత్వంలో అత్యున్నత సూత్రం.

కార్మికవర్గ నియంతృత్వం ఒక విషయంలో మునుపటి రాజ్యా లన్నిటికంటె భిన్నంగా వుంటుంది; యే విషయంలో నంటే, ఆర్థిక క్రియ దాని అత్యంత ముఖ్య క్రియలలో ఒకటి అవుతుంది. గతంలో యే రాజ్యమూ కొత్త ఆర్థిక వ్యవస్థను నిర్మించే కర్తవ్యం ఉద్దేశ పూర్వకంగా పెట్టుకోలేదు. కార్మికవర్గ రాజ్యం మాత్రమే కొత్త, సోషలిస్టు ఆర్థిక వ్యవస్థను నిర్మించే యీ కర్తవ్యం పెట్టుకొంటుంది.

కార్మికవర్గ నియంతృత్వం రాజ్యాధికార యంత్రావళికి పరిమితం కాదు. అది జనాలను

---

* K. Marx and F. Engels, *Selected Works*, Vol. 3, పుట 26.

సోషలిస్టు నిర్మాణంలో దించడానికీ, దేశ పరిపాలనలో పాల్గొనేటట్లు శ్రామిక ప్రజలను ప్రేరేపించడానికీ ఉద్దేశింపబడింది; అందువలన దానిలో కమ్యూనిస్టు పార్టీ దర్శకత్వంకింద వుండే సామూహిక సంస్థల (సోవియట్లూ, ట్రేడ్ యూనియన్లూ, సహకార సంఘాలూ, యువజన సంఘమూ, వగైరాల) మొత్తం వ్యవస్థ వుంటుంది. ప్రముఖ శక్తిగా పార్టీ లేకుండా కార్మికవర్గ నియంతృత్వాన్ని నిర్వహించడం అసాధ్యం.

కార్మికవర్గం పాత రాజ్య యంత్రాన్ని బద్దలు చేయవలసి వుందనే విషయాన్ని పరిగణించినప్పుడు, దాని స్థానంలో దేనిని పెట్టాలనే సమస్య సహజంగా ఉత్పన్నమౌతుంది, అనగా కార్మికవర్గ రాజ్యం యే రూపం తీసుకుంటుందనే సమస్య.

రాజ్య రూపవు సమస్య నిర్దిష్ట పరిస్థితుల సందర్భంలో నిర్ణయింపబడుతుందని లెనిన్ నొక్కిచెప్పినాడు. భావి రాజకీయ రూపాలను "ఆవిష్కరించే" కర్తవ్యాన్ని మార్క్సిజం యెప్పుడూ పెట్టుకోలేదు; అలాంటి రూపాలను కచ్చితంగా నిర్వచించడంద్వారా యితరుల ఆచరణ స్వేచ్ఛను అరికట్టడం అసంబద్ధమైన పని.* సిద్ధాంతం ఒక క్రమంయొక్క సారాన్ని మాత్రమే భవిష్యద్దర్శనం చేయగలదు, కాని దాని రూపాలు జోస్యం చెప్పబడజాలవు; యెందు కంటే, అవి వాస్తవ జీవితంలో మాత్రమే ఆవిష్కరింపబడగలవు. కానీ, రాజ్య రూపం నిర్దిష్ట పరిస్థితులమీద ఆధారపడుతుంది గనుకా, సోషలిజం కొరకు కార్మికవర్గం చేసే పోరాటం అత్యంత భిన్నభిన్నమైన చారిత్రక పరిస్థితులలో జరుగుతుంది గనుకా, యీ రూపాలు భిన్నభిన్నంగా వుంటాయని సిద్ధాంతం జోస్యం చెప్పుతుంది. లెనిన్ యిలా రాసినాడు: "బూర్జువా రాజ్యాలు రూపంలో అత్యంత వివిధంగా వుంటాయి, కానీ వాటి సారం ఒకటే: యీ రాజ్యాలన్నీ, వాటి రూపం యేదైనా సరే, అంతిమ పరిశీలనలో అనివార్యంగా బూర్జువా నియంతృత్వమే. పెట్టుబడిదారీ వ్యవస్థనుండి కమ్యూనిజంకు జరిగే పరివర్తన ప్రచండంగా పుష్కలమైన, వివిధమైన రాజకీయ రూపాలను నిశ్చయంగా యివ్వక తప్పదు, కానీ అనివార్యంగా సారం ఒకటిగానే వుంటుంది: కార్మికవర్గ నియంతృత్వం."** యీ సిద్ధాంత సూత్రాలను చరిత్ర ప్రత్యక్షంగా ధ్రువపరచింది. 1871 నాటి పారిస్ కమ్యూన్ కార్మికవర్గ నియంతృత్వపు మొదటి చారిత్రక రూపం. రష్యాలో సోవియట్లు కార్మికవర్గ నియంతృత్వపు రూప మైనాయి. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత సోషలిజంకు జనతా ప్రజాతంత్ర రూపం గల పరివర్తన ఉత్పన్నమైంది.

---

* చూ: V. I. Lenin, *Collected Works*, Vol. 27, పుట 343.

** V. I. Lenin, *Collected Works*, Vol. 25, పుట 413 (తెలుగులో వి.ఐ. లెనిన్ "రాజ్యమూ, విప్లవమూ," మాస్కో, పుట 36).

సోషలిజంకు జరిగే పరివర్తనయొక్క రూపం సోషలిస్టు విప్లవం అభివృద్ధి చెందే నిర్దిష్ట పరిస్థితులతోనూ, వర్గ పోరాటపు తీవ్రతతోనూ, ఆ పరిస్థితులలో సాయుధ బల ప్రయోగంతో గానీ, అది లేకుండా గానీ యే మేరకు సోషలిజంకు పురోగమించవచ్చు ననే దానితోనూ ముడిపడిన సమస్య.

పైన చెప్పినట్లు, సోషలిజంకు శాంతియుత పరివర్తన జరగడానికి అనుకూల పరిస్థితులు ఉత్పన్నమయ్యే అవకాశాన్ని మార్క్సిజం సూత్రరీత్యా యెప్పుడూ కొట్టివేయలేదు. 1847లో, ఎంగెల్సు తన "కమ్యూనిజం సూత్రాలు"లో, సొంత ఆస్తిని శాంతియుత పద్ధతులద్వారా రద్దుచేయడం సాధ్యమా అనే ప్రశ్నకు సమాధానమిస్తూ, యిలా అన్నాడు: "యిది జరగ గలదని అపేక్షించాలి, నిశ్చయంగా కమ్యూనిస్టులు దీనిని ప్రతిఘటించరు."*

రష్యాలోని 1917 ఫిబ్రవరి విప్లవం తర్వాత లెనిన్ కూడా సోవియట్లు శాంతియుతంగా అధికారం స్వాధీనం చేసుకొనే అవకాశంవైపు బోల్షెవిక్ పార్టీ దృష్టిని మళ్లించినాడు. విప్లవ ప్రతిఘాత శక్తులు మాత్రమే తదనంతరం ఆ చర్యను అసంభవం చేసినాయి.

యీనాడు, యిప్పుడున్న ప్రజాతంత్ర పార్లమెంటరీ రూపాల వినియోగంద్వారా సోష లిజంకు శాంతియుత పరివర్తన జరిగే అవకాశాన్ని పెట్టుబడిదారీ దేశాలలోని కొన్ని కమ్యూ నిస్టు పార్టీల కార్యక్రమాలు ప్రకటించినాయి. సోషలిస్టు విప్లవంయొక్క ఒక శాంతియుత అభివృద్ధి రూపంగా సోషలిజంకు పార్లమెంటరీ మార్గం అనే సమస్యను యిది లేవనెత్తుతుంది. అది లెనినిజంనుండి వైదొలగడమా?

పార్లమెంటుద్వారా మాత్రమే కార్మికవర్గం అధికారాన్ని సంపాయించుకోగలదనే సాకుతో, పార్లమెంటరీ పద్ధతులనూ, పెట్టుబడిదారీ వ్యవస్థమీద విప్లవ పోరాటాన్నీ పరస్పర వ్యతిరేక మైనవిగా చెప్పినందుకు కౌట్స్కీ, యితర అవకాశవాదులనూ లెనిన్ నిశితంగా విమర్శించిన విషయం జ్ఞాపకం చేసుకుందాం. అవకాశవాదులకు పార్లమెంటరీ మార్గమంటే అర్థం, ఒకటి, విప్లవ అవసరాన్ని నిరాకరించడమూ, రెండు, పార్లమెంటు వెలుపల క్రియాత్మక, సామూహిక పోరాటపు అవసరాన్ని నిరాకరించడమూ, మూడు, కార్మికవర్గ నియంతృత్వ అవసరాన్ని నిరాకరించడమూ. కానీ, సోషలిజంకు కౌట్స్కీయొక్క పార్లమెంటరీ మార్గాన్ని లెనిన్ విమర్శించినాడంటే, పార్లమెంటరీ రూపాలను విప్లవకరంగా వినియోగించుకోవడాన్ని నిరాకరించినాడని కాదు. సోషలిజంకు పార్లమెంటరీ మార్గం అనేదాన్ని గురించిన అవకాశ వాద దృక్పథానికీ, విప్లవాత్మక దృక్పథానికీ మధ్య మౌలికమైన భేదం వుందని గుర్తించాలి. యీ నాడు కమ్యూనిస్టులు సోషలిజంకు పార్లమెంటరీ పరివర్తన అనేదానిని విప్లవ విసర్జనగా

---

* K. Marx and F. Engels, *Selected Works*, Vol. 1, పుట 89.

చూడరు, పార్లమెంటులో గెలుచుకొన్న మెజారిటీ పార్లమెంటు వెలుపల జనాల శక్తివంతమైన ఉద్యమంమీద ఆధారపడే సన్నివేశంలో, విప్లవ ప్రతిఘాత శక్తులు అంతర్యుద్ధాన్ని ప్రారంభించే సాహసం చేయలేనంతగా నిర్వీర్యపరచబడగల సన్నివేశంలో విప్లవంయొక్క శాంతియుత అభివృద్ధిగా చూస్తారు. యీ పరిస్థితులలో, సోషలిజంకు పార్లమెంటరీ మార్గం అనే వివాదం పెట్టుబడిదారీ వ్యవస్థతో స్థిర సంకల్పపు పోరాటం చేయడానికి జనాలను కూడగట్టే రూపంగా వుండగలదు. అంతే కాక, ప్రస్తుత పరిస్థితులలో యీ మార్గం విప్లవంయొక్క శాంతియుతేతర అభివృద్ధిని కొట్టివేయదు. ప్రజలకు ప్రజాతంత్ర స్వేచ్ఛలు లేకుండా చేయబడినప్పుడు, వాళ్లు తమ హక్కుల కొరకు సాయుధ పోరాటం చేయవలసి వచ్చినప్పుడు విప్లవం శాంతియుతేతరంగా అభివృద్ధి చెందవచ్చు.

కార్మికవర్గ ఉద్యమంయొక్క మొత్తం చారిత్రక అనుభవం తెలిపే దేమిటంటే: కార్మికవర్గమూ, దాని విప్లవ పార్టీ యే మేరకు ప్రతి పోరాట రూపంలోనూ — శాంతియుత, శాంతియుతేతర, పార్లమెంటరీ, పార్లమెంటరీయేతర రూపాలలో — ఆరితేరినా యనేదానిమీదా, యే మేరకు హఠాత్తుగా ఒక పోరాట రూపంనుండి మరొక రూపానికి అత్యంత వేగంగా మారడానికి సిద్ధంగా వున్నాయనేదానిమీదా కార్మికవర్గ పోరాటపు విజయం ఆధారపడుతుంది. ప్రతి సందర్భంలోనూ, పోరాట రూపాన్ని నిర్ణయించడం సృజనాత్మకమైన కర్తవ్యం; నిర్దిష్ట చారిత్రక పరిస్థితుల మార్క్సిస్టు లెనినిస్టు పరిశీలన ఆధారంమీద యిది జరుగుతుంది.

ప్రతి సోషలిస్టు దేశంలోనూ రాజ్యంయొక్క అభివృద్ధికి నిర్దిష్ట లక్షణాలు వున్నాయి. కానీ అన్ని దేశాలకూ సామాన్య లక్షణాలు కూడా వున్నాయి. యిది సహజమే; యెందుకంటే, ప్రతి రాజ్యమూ దాని సమాజంతో కలిసి అభివృద్ధి చెందుతుంది, దాని అభివృద్ధి దశలు ఆ సమాజపు అభివృద్ధి దశలచేత నిర్ణయింపబడుతాయి.

పరివర్తన దశా, సోషలిజంయొక్క నిర్మాణమూ పూర్తి అయినప్పుడు, రాజ్యం కొత్త అభివృద్ధి దశలో ప్రవేశిస్తుంది. సోషలిస్టు సమాజంలో శత్రు వర్గాలు తొలగింపబడి నప్పటికీ, సోషలిజంయొక్క విజయమంటే అర్థం సమాజం రాజ్యం లేని స్థితిలో ప్రవేశించిందని కాదు. రాజ్య సంస్థ సోషలిజంలో కూడా అవసరమైన సంస్థ. యీ అవసరం ఆంతరంగిక, బాహ్య కారణాలవల్ల ఉత్పన్న మౌతుంది.

పాత సామాజిక శ్రమ విభజనయొక్క — పట్టణానికీ, గ్రామానికీ మధ్యా, బౌద్ధిక శ్రమకూ, శరీర శ్రమకూ మధ్యా, శ్రామిక వర్గాల మధ్యా వుండిన శ్రమ విభజనయొక్క — అవశేషాలు యింకా వుంటాయి గనుక, రాజ్యం వాటి ఉమ్మడి ప్రయోజనాల నిధానం అవుతుంది. అందువల్ల, యావత్ప్రజా ఆస్తి కూడా రాజ్యంయొక్క ఆస్తిగా వుంటుంది.

రాజ్యం ప్రధాన ఉత్పత్తి సాధనాల సొంతదారుడుగా వుండి, ఆర్థిక రంగంలో సమా

జంయొక్క ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది గనుక, దేశ వ్యాప్తమైన ప్రమాణంలో ఆర్థిక వ్యవస్థను రూపొందించి, పథకీకరించి, వ్యవస్థీకరించే కర్తవ్యం దానికి వుంటుంది.

జనాలను విజ్ఞాన ప్రబుద్ధం చేయడంలోనూ, వాళ్ల సార్వత్రిక సాంస్కృతిక, సాంకేతిక స్థాయిలను పెంచడానికి తోడ్పడడంలోనూ, వాళ్లలో కమ్యూనిస్టు చైతన్యాన్ని పెంపొందించడంలోనూ రాజ్యం చేసే కృషి యీ ఆర్థిక వ్యవస్థీకరణ క్రియతో నూటిగా ముడిపడివుంటుంది. అవసరాన్నిబట్టి పంపకం అనే సూత్రాన్ని అమలుపరచడం సోషలిజంలో ఆర్థిక అభివృద్ధి స్థాయికి యింకా అసంభవం గనుకా, పనియొక్క పరిమాణాన్నీ, గుణాన్నీబట్టి వేతనాలు చెల్లింపబడుతాయి గనుకా — అనగా, పంపకంలో యింకా అసమానత్వం వుంటుంది గనుక — శ్రమ ప్రమాణానికీ, అనుభోగ ప్రమాణానికీ మధ్య అవసరమైన అనురూపతను నెలకొల్పడానికి శాసనబద్ధమైన నిబంధనల సామాజిక అవసరం కూడా కొనసాగుతుంది. యీ నిబంధనలను కాపాడుతూ, శ్రమ ప్రమాణాన్నీ, అనుభోగ ప్రమాణాన్నీ నియంత్రించే కర్తవ్యం కూడా సోషలిస్టు రాజ్యానికి వుంటుంది.

సోషలిజంలో రాజ్యానికీ, ప్రవర్తన నియమాలూ, నిబంధనలూ విధాయకమై, అమలు పరచబడడానికీ అవసరం కూడా సాంస్కృతిక అభివృద్ధి స్థాయినుండి ఉత్పన్నమౌతుంది. నిజమే, సోవియట్ యూనియన్‌లోనూ, సోషలిస్టు వ్యవస్థకు చెందిన యితర దేశాలలోనూ మారుతున్న జీవిత పరిస్థితులనుబట్టీ, పార్టీల, రాజ్యాల సాంస్కృతిక, విద్యా కృషి ఫలితంగానూ కొత్త సాంస్కృతిక అంశాలు గల మనుషులు తయారౌతున్నారు. సోషలిస్టు దేశాలలో యీ వాడు అంతకంతకూ తక్కువమంది యేవైనా వస్తువులను కేవలం అవి "తమవి" కానందు వల్లో, ప్రభుత్వానికి చెందినవి కావడంవల్లో బద్దలుచేసి, పాడుచేయడానికి సమర్థులుగా వున్నారు. అంటే, యీ దేశాలలో సమాజ సభ్యు లందరూ చైతన్యంతో సమష్టి శ్రేయస్సు కొరకు కృషిచేయడం యిప్పటికే నేర్చుకొన్నారని కాదు. అక్టోబర్ విప్లవ ప్రాంగణంలో లెనిన్ యిలా నొక్కిచెప్పినాడు: "మనం ఊహాస్వర్గంలో నిమగ్నులం కాకుండా వుండాలంటే, పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోసి, జనం ఏ న్యాయశాస్త్ర ప్రమాణమూ అసరం లేకుండానే సమాజం కొరకు పనిచేయడం వెంటనే నేర్చుకుంటారని మనం అనుకోకూడదు. అంతే కాక, అలాంటి మార్పుకు కావలసిన ఆర్థిక పూర్వావసరాలు పెట్టుబడిదారీ వ్యవస్థ రద్దు అయిన వెనువెంటనే సృష్టి కావు."*

చివరి విషయంగా, సోషలిజంలో రాజ్యానికి యింకా సామాజిక ఆస్తినీ, వ్యక్తిగత ఆస్తినీ దొంగల బారినుండి కాపాడవలసిన అవసరమూ, ప్రతి పౌరుని హక్కులనూ, స్వేచ్ఛలనూ, మొత్తంగా సోషలిస్టు శాంతి, భద్రతలనూ నిస్సందేహం చేయవలసిన అవసరమూ వుంటాయి.

---

*V. I. Lenin, *Collected Works*, Vol. 25, పుట 467.

సోషలిజంలో రాజ్యం కొనసాగవలసిన అవసరానికి రెండు బాహ్యా కారణాలు వున్నాయి. మొదటిదీ, ముఖ్యమైనదీ యేమిటంటే, సోషలిస్టు శిబిరానికి వ్యతిరేకంగా, దానితో పోరాటం సాగిస్తూ సామ్రాజ్యవాద శిబిరం వుంది. సామ్రాజ్యవాదపు ఉనికిలో యుద్ధ, దురాక్రమణల నిత్య ప్రమాదం యిమిడివుంది గనుక, సోషలిస్టు సమాజానికి తన భద్రతను కాపాడుకొనేందుకూ, దేశ రక్షణ పాటవాన్ని నిస్సందేహం చేసేందుకూ, ప్రపంచ శాంతిని రక్షించేందుకూ రాజ్యం అవసరం.

రెండవది యేమిటంటే, ప్రపంచ సోషలిస్టు వ్యవస్థ ఆవిర్భవించి, మూడవ ప్రపంచం అనబడే విస్తారమైన మండలం యేర్పడడంవలన ప్రతి సోషలిస్టు రాజ్యంయొక్క బాహ్యా క్రియా విస్తరించింది. అది యిక యెంత మాత్రమూ తన సొంత దేశాన్ని రక్షించుకొనే కర్తవ్యానికి పరిమితం కాదు; సోషలిస్టు శిబిరంలోని అన్ని దేశాలతోనూ పరస్పర సహాయ, సహకారాల సోదర సంబంధాలు సాగించడమూ, జాతీయ విమోచనోద్యమానికి సహాయపడడమూ దానిలో చేరుతాయి.

సోషలిస్టు రాజ్యంయొక్క స్వభావం, మొత్తం సోషలిస్టు ఉపరినిర్మాణం లాగే, సోషలిస్టు సమాజపు ప్రాతిపదికచేతా, దాని సామాజిక నిర్మాణపు నిర్దిష్ట స్వభావంచేతా, మార్పుచేతా నిర్ణయింపబడుతుంది. ఆవిధంగా, సోషలిజంకు జరిగిన పరివర్తనతో, ఒకప్పుడు పెటీ బూర్జువావర్గంగా వుండిన రైతాంగం ఉత్పత్తి సాధనాలలోని సామాజిక ఆస్తితో ముడివడిన సోషలిస్టు సమాజపు వర్గం అవుతుంది. సోషలిస్టు మేధావివర్గం ఉద్భవిస్తుంది, జాతీయ సంబంధాలు మారుతాయి.

సోవియట్ యూనియన్‌లో, సోషలిస్టు నిర్మాణం జరిగే సంవత్సరాలలో, చారిత్రకంగా కొత్తదైన ఒక ప్రజా కుటుంబం — సోవియట్ ప్రజ ఆవిర్భవించిన సమాజం రూపుదాల్చి, దాని మౌలిక ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల యేకత్వంచేతా, సమాజంలో ప్రాబల్యం వహించే మార్క్సిస్టు లెనినిస్టు భావజాలంచేతా దృఢపర్చబడింది. యీ సామాజిక ప్రాతిపదికమీద దేశం లోపల వున్న శత్రు వర్గాలను అణచే క్రియ — కార్మికవర్గ నియంతృత్వపు ప్రధాన క్రియలలో ఒకటి — కృశించిపోతుంది. సోషలిస్టు రాజ్యం అభివృద్ధి చెందేకొద్దీ, అది యావత్ప్రజల యిచ్ఛను వ్యక్తంచేస్తూ యావత్ప్రజల రాజ్యం అవుతుంది.

కార్మికవర్గం స్వభావతః కమ్యూనిస్టు ఆదర్శానికి అత్యంత స్థిరమైన వాహనం గనుక, అది సోషలిస్టు సమాజంలో, యావత్ప్రజల రాజ్య వ్యవస్థ లోపల, నాయక పాత్ర వహించడం కొనసాగిస్తుంది. పరివర్తన దశలో, రైతాంగం విషయంలో కార్మికవర్గం వహించే నాయక పాత్ర రైతాంగాన్ని బూర్జువావర్గంనుండి తనవైపుకు తెచ్చుకోడానికి చేసే పోరాటంతో, రైతాంగంలోనే వున్న సొంత ఆస్తి ధోరణులను అధిగమించవలసిన అవసరంతో, ముడివడివుంది.

యీ పరిస్థితులలో, కార్మికవర్గం వహించే నాయక పాత్రతో కార్మికవర్గానికీ, రైతాంగానికీ మధ్య వుండే పొత్తు కార్మికవర్గ నియంతృత్వం లేకుండా బలపడజాలదు. తద్భిన్నంగా, సోషలిస్టు దశలో కార్మికవర్గం రైతాంగాన్ని గెలుచుకోడానికి పోరాడవలసిన అవసరం యిక యెంత మాత్రమూ లేదు; యెందుకంటే, వ్యవసాయం సోషలిస్టు పద్ధతులలో రూపాంతరం చెందడం వలన రైతాంగంయొక్క సామాజిక స్వభావం మారింది, మరొక వైపున బూర్జువా వర్గం తొలగించబడింది. అందువల్లనే, కార్మికవర్గం రైతాంగం విషయంలో నాయక పాత్ర వహించడానికి కార్మికవర్గ నియంతృత్వం యిక యెంత మాత్రమూ అవసరం లేదు. వర్గాలు సంపూర్ణంగా తొలగిపోయి, కమ్యూనిజం నిర్మాణం జరిగిందాకా అది యీ ప్రక్రియను యావత్ప్రజల రాజ్యంయొక్క చట్రం లోపలవే నిర్వహించగలదు, నిర్వహిస్తుంది.

సోషలిస్టు సమాజంలో కార్మికవర్గంయొక్క నాయక పాత్ర కమ్యూనిస్టు పార్టీ, లేదా కార్మిక పార్టీయొక్క నాయకత్వంద్వారా వ్యక్తమౌతుంది; నూతన సమాజపు సృష్టికర్తగా కార్మికవర్గంయొక్క చారిత్రక కర్తవ్యాన్ని అది చైతన్య పూరితంగా వ్యక్తంచేస్తుంది.

బాహ్య రంగంలో, రెండు సామాజిక వ్యవస్థల మధ్య గల సంబంధాలలో, సోషలిస్టు రాజ్యం వర్గ రాజ్యంగా, కార్మికవర్గ అంతర్జాతీయతయొక్క వాహనంగా వ్యవహరిస్తుంది. విప్లవాత్మక కార్మికవర్గ, జాతీయ విమోచన ఉద్యమాలకు అండదండలు యివ్వడమూ, సోషలిస్టు సమాజ అభివృద్ధికీ, కమ్యూనిజం నిర్మాణానికీ అనుకూలమైన అంతర్జాతీయ పరిస్థితులను నిస్సందేహం చేయడమూ, స్థిరమైన శాంతిని కట్టుదిట్టం చేయడమూ లక్ష్యంగా గల వర్గ విధానాన్ని అది అనుసరిస్తుంది.

సోషలిస్టు రాజ్యం అభివృద్ధి చెందడమంటే, అంతకంతకూ విస్తారమైన జనాలు పరిపాలనలో పాల్గొనడమూ, సోషలిస్టు ప్రజాస్వామ్యం అన్ని విధాలా మరింత అభివృద్ధి చెందడమూ అన్నమాట.

మునుపటి దోపిడీ రాజ్యాల కన్నిటికీ భిన్నంగా, సోషలిస్టు రాజ్యం తన అభివృద్ధి గతిలో తానే కృశించిపోవడానికి కావలసిన పూర్వావసరాలను సృష్టిస్తుంది. కానీ, అది పూర్తిగా కృశించిపోవాలంటే, తనుచితమైన ఆంతరంగిక, అంతర్జాతీయ పరిస్థితులు అవసరం. రాజ్యం పూర్తిగా కృశించిపోవడానికి కావలసిన ఆంతరంగిక ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పూర్వావసరాలు కమ్యూనిజం అనే ఉన్నత దశలో మాత్రమే సృష్టించబడుతాయి. బైటి దాడి ప్రమాదం తొలగిపోయినప్పుడు, అనగా ప్రపంచ మంతటా సోషలిజం జయించిన ప్పుడు అంతర్జాతీయ పూర్వావసరాలు సృష్టింపబడుతాయి. అంతవరకు రాజ్యం అవసరంగా వుండడం కొనసాగుతుంది.

రాజ్యం కృశించిపోవడమంటే, బలాత్కారపు ప్రత్యేక యంత్రాంగమూ, దాని రాజకీయ ప్రక్రియలకు సంబంధించిన అన్ని అంగాలూ తొలగింపబడడం. ఆర్థిక వ్యవస్థీకరణ, సాంస్కృతిక

విద్యా క్రియలకు సంబంధించిన రాజ్య అంగాలు అదృశ్యం కావు. కమ్యూనిజంలో రాజ్యం వుండదు. అంటే, కమ్యూనిస్టు సమాజానికి ఉత్పత్తినీ, అనుభోగాన్నీ పథకీకరించడమూ, అవసరాలను లెక్కగట్టడమూ, జీవితంయొక్కా, కార్యకలాపాలయొక్కా సమష్టి రూపాలను వ్యవస్థీకరించడమూ, అనేక యితర పనులూ చేయవలసిన అవసరం వుండదని కాదు. యీ అన్నిటికీ కచ్చితమైన వ్యవస్థీకరణ అవసరం; యీ పని సమాజ సభ్యులు తమంతకు తామే చేస్తారు. కనుక, కమ్యూనిస్టు సమాజంలో స్వయం నియమన అంగాలు వుంటాయి; అనగా రాజ్యం కృశించిపోవడ మనేది యావత్ప్రజల రాజ్యం కమ్యూనిస్టు సామాజిక స్వయం పరిపాలనగా రూపాంతరం చెందడం అవుతుంది.

సోషలిస్టు విప్లవం ఫలితంగా దోపిడీ శాసనావళి రద్దై, దాని స్థానంలో కొత్త సోషలిస్టు చట్టబద్ధత — విప్లవాత్మక శాసనావళీ, సువ్యవస్థా — వస్తుంది.

మొట్టమొదటినుండి సోవియట్ అధికారం పాత ఆర్థిక, సామాజిక, భావజాల సంబంధాలను ధ్వంసం చేయడానికీ, కొత్తవాటిని నెలకొల్పడానికీ శాసనావళిని వినియోగించుకొంది. దాని మొదటి శాసనం — భూమిమీద సొంత ఆస్తిని రద్దుచేయడం — విప్లవ విజయానికీ, సోషలిస్టు నిర్మాణంలోని తదనంతర కృషికీ ప్రచండమైన ప్రాముఖ్యం కలిగివుండింది. అంతే కాక, బాంకులనూ, రైల్వేలనూ, విదేశ వర్తకాన్నీ, వాణిజ్య నౌకాదళాన్నీ, తరువాత భారీ స్థాయి పరిశ్రమల నన్నిటినీ జాతీయం చేసిన సోవియట్ అధికారంయొక్క శాసనాలనూ, 8 గంటల పనిదినంమీదా, సామాజిక భీమామీదా, సామాజిక అంతస్తులనూ సివిల్ హోదాలనూ రద్దు చేయడంమీదా, రాజ్యంనుండి చర్చినీ, చర్చినుండి పాఠశాలనూ విడదీయడంమీదా చేయబడిన శాసనాలనూ గుర్తుచేసుకుందాం.

సోషలిస్టు శాసనావళి రాజ్య కార్యకలాపాలయొక్క సకల రూపాలనూ, దాని క్రియలనూ, కర్తవ్యాలనూ నిర్ణయిస్తుంది. దీనితో మొత్తం సామాజిక అభివృద్ధి గతిమీద శాసనావళి యొక్క ప్రతిక్రియాత్మక ప్రభావపు శక్తి నిర్ణయింపబడుతుంది.

సోషలిజం విజయంతో, శాసనావళి రాజ్యాంగంలో పవిత్రపరచబడిన సోషలిస్టు సమాజపు యావత్ప్రజల యేకీకృత రాజ్య యిచ్ఛ అవుతుంది. విజయం పొంది స్థిరపడిన సోషలిస్టు ఉత్పత్తి సంబంధాలలో శాసనావళి ప్రజల ప్రయోజనంలో ప్రజల యిచ్ఛను వాస్తవీకరించడానికి కావలసిన పాదార్థిక ప్రాతిపదికను సమకూరుస్తుంది. సోషలిస్టు సమాజంలో, శాసనావళి అనేది వస్తుగత నియమాలను చైతన్యవంతంగా అన్వయించడానికీ, ఉపయోగించడానికీ పరికరంగా పనిచేస్తుంది. మొత్తం రాజ్య ప్రమాణంలో జాతీయ ఆర్థిక వ్యవస్థనూ, సంస్కృతినీ అభివృద్ధి చేయడానికి వేసే పథకం వస్తుగత నియమాల ప్రతిబింబంగా మాత్రమే కాక, శాసనంగా కూడా కనపడుతుంది. మొత్తం సమాజానికి వర్తించే కేంద్రీకృత ఆర్థిక వ్యవస్థను

రాజ్య సహాయంతో నెలకొల్పడంలోనూ, పటిష్ఠపరచడంలోనూ సోషలిస్టు శాసనావళి ప్రత్యేకంగా గొప్ప పాత్ర నిర్వహిస్తుంది.

కమ్యూనిస్టు నిర్మాణపు దశలో సోషలిస్టు శాసనావళీ, సువ్యవస్థా మరింత దృఢ పరచబడుతాయి, కమ్యూనిస్టు నిర్మాణపు కర్తవ్యా లన్నిటినీ సాధించే లక్ష్యంతో సమాజ కార్యకలాపాలను నియంత్రించే శాసనగత నియమాలు మెరుగుపరచబడుతాయి. సోషలిస్టు న్యాయశాస్త్రానికీ, న్యాయానికీ చెందిన వ్యవస్థ నేరాన్నీ, దాని కారణాలనూ సంపూర్ణంగా నిర్మూలించడానికి కూడా తోడ్పడాలి. దీనిద్వారా తదనంతరం నేరాన్ని శిక్షించే చర్యలను తొలగించి, సామాజిక ప్రభావపు చర్యలను ప్రవేశపెట్టడం సాధ్యమౌతుంది.

రాజ్యం కృశించిపోయినప్పుడు, రాజకీయాలు అనేది ఉత్పత్తినీ, యితర సామాజిక క్రమాలనూ నిర్వహించే శాస్త్రం అవుతుంది, శాసనగత నియంత్రణకు లోబడని మానవ సంబంధాల రంగం విస్తృతమౌతుంది, మానవ సంబంధాలను సర్దుబాటు చేయడంలో నీతి యింకా యెక్కువ పాత్ర నిర్వహిస్తుంది, నీతికీ, చట్టానికీ మధ్య భేదం క్రమక్రమంగా మాసిపోతుంది, పౌరుల హక్కులూ, విధులూ సజీవంగా మేళవించబడి, కమ్యూనిస్టు సమాజ జీవనాన్ని పాలించే సుసంబద్ధమైన నియమాల సముచ్చయం అవుతాయి.

ప్రకరణం యెనిమిది

చారిత్రక క్రమంయొక్క ఆత్మిక పార్శ్వం

గత ప్రకరణాలలో, సమాజాన్ని క్రియాత్మకమైనదీ, అభివృద్ధి చెందేదీ అయిన వ్యవస్థగా గానీ, మానవ్యకార్యాచరణ ఫలితంగా గానీ పరిశీలించేటప్పుడు మనం యెప్పుడూ సామాజిక చైతన్యాన్ని పరిగణించవలసి వుండింది. అది సహజమే. యెందుకంటే, సామాజిక చైతన్యం యే సామాజిక వ్యవస్థయొక్క నిర్మాణంలోనైనా అవశ్యమైన అంశం, మానవుల చారిత్రక కార్యాచరణలో అవశ్యమైన భాగం. కానీ, సామాజిక చైతన్యం సామాజిక జీవితపు యితర విషయాలతోనూ, మానవుల నిర్దిష్ట చారిత్రక కార్యాచరణతోనూ ముడివడి మాత్రమే లేదు; అది సామాజిక జీవితంలోని ఒక విశిష్ట రంగం కూడా, సమాజంయొక్క, ప్రతి వ్యక్తియొక్క జీవితంలోనూ, అభివృద్ధిలోనూ దాని పాత్రను స్పష్టపరచడానికి అధ్యయనం చేయవలసిన నిర్దిష్ట సామాజిక విషయం.

మార్క్సిజం సమాజ అభివృద్ధిని ఆర్థికాభివృద్ధికి కుదించడానికి అభిముఖంగా వుంటుందనీ, మానవుణ్ణే కేవలం ఒక ఉత్పాదక వస్తువుగా పరిగణిస్తుందనీ, మానవుని ఆశయాలను పాదార్థిక విలువలను సంపాయించే ఆసక్తికి పరిమితపరుస్తుందనీ, సమాజంయొక్క, మానవునియొక్క ఆత్మిక జీవితాన్ని తక్కువ అంచనా వేస్తుందనీ బూర్జువా రచయితలు దానిని తరుచుగా నిందించినారు. అలాంటి నిందలు — అవి మార్క్సిజంపట్ల బాహాట శత్రుత్వంనుండి ఉద్భవించనప్పుడే అనుకోండి — సామాజిక అభివృద్ధికి చెందిన మార్క్సిస్టు సిద్ధాంతం గురించిన పైపై జ్ఞానాన్ని మాత్రమే నిరూపిస్తాయి.

యీ సిద్ధాంతం ప్రకారం, సామాజిక అభివృద్ధి మానవుల యిచ్ఛమీదా, చైతన్యంమీదా ఆధారపడని నియమాల చర్య మూలంగా జరుగుతుందని మనం గమనించినాం. యీ అర్థంలో, సమాజ అభివృద్ధి ప్రకృతి అభివృద్ధికంటె భిన్నం కాదు. కానీ, ప్రకృతి నియమాలు గుడ్డి ప్రకృతి శక్తుల పరస్పర చర్యలో వ్యక్తం కాగా, సమాజ అభివృద్ధి నియమాలు మానవుల కార్యకలాపాలద్వారా మాత్రమే వ్యక్తమౌతాయి. కనుక — చారిత్రక నియమాలు చైతన్యం, యిచ్ఛా గల ప్రాణులచేత వాస్తవీకరింపబడితే — భావాల, ఆశయాల, అనుభూతుల, ఆలోచనల, నియమాల, విలువల పాత్రను, టూకీగా చెప్పాలంటే, మనుషులను నడిపించే సకల ఆత్మిక అంశాల పాత్రను, ఉపేక్షిస్తే చరిత్ర గతిని సరిగా అర్థం చేసుకోలేం.

ప్రతి వ్యక్తికీ వస్తు సంపద సమృద్ధిగా వుండడం గురించి యేమిటంటే, ఆధునిక ప్రపంచంలో యీ సమస్యయొక్క గొప్ప ప్రాముఖ్యాన్ని నిరాకరించడం పరమ అసంబద్ధమని అందరికీ స్పష్టమై వుండాలి. ఐరాస అధికారిక సమాచారం ప్రకారం కూడా ప్రపంచంలో, ముఖ్యంగా మూడవ ప్రపంచంలో, కోటానుకోట్లమంది దారిద్ర్యంలో పస్తులతో బతుకుతున్నారు. మార్క్సిజం సమాజంలోని ప్రతి సభ్యునికీ అవసరాలనుబట్టి వస్తు సంపదను యిచ్చే సమాజాన్ని నిర్మించే మార్గాలను అన్వేషిస్తుంది. కానీ, పాదార్థిక సమృద్ధిని సాధించడమే పరమ లక్ష్యమని మార్క్సిస్టులు నమ్ముతున్నారని అనుకోవడం పరిహాసాస్పదం. అలా కాదు. సమాజంయొక్క తగిన ఆత్మిక — నైతిక, కళాత్మక, వగైరా — అభివృద్ధి లేకుంటే, మనుషులలో ఆత్మిక అవసరాలు రూపు దిద్దబడకుంటే, మనుషులు సర్వతోముఖంగా అభివృద్ధి చెందకుంటే, పాదార్థిక సమృద్ధి మానవునియొక్క కుక్షింభరత్వానికీ, సమాజంయొక్క నైతిక పతనానికీ మాత్రమే దారితీస్తుందని చారిత్రక అనుభవం తెలుపుతుంది. పాదార్థిక సమృద్ధి ప్రతి వ్యక్తియొక్క సర్వతోముఖ అభివృద్ధికీ, వికాసానికీ, ప్రతి వ్యక్తియొక్క ఆత్మిక అవసరాలూ, సృజనాత్మక శక్తులూ వ్యక్తీకరింపబడడానికీ అవసరమైన పరిస్థితీ, ప్రాతిపదికా మాత్రమే అని మార్క్సిస్టు సిద్ధాంతం పరిగణిస్తుంది.

యీవిధంగా, మానవజాతియొక్క గతాన్ని గురించీ, వర్తమానాన్ని గురించీ సరైన దృష్టిని సంపాయించుకోడానికి తోడ్పడి, దాని భవిష్యత్తును కూడా ధైర్యంగా, సరిగా చిత్రించే చారిత్రక భౌతికవాదపు సారాంశంనుండే ఉద్భవిస్తుంది సామాజిక చైతన్యానికి, సమాజంయొక్కా, వ్యక్తియొక్కా ఆత్మిక ప్రపంచానికి గరిష్ఠ శ్రద్ధను అర్పించవలసిన అవసరం.

సామాజిక చైతన్యం అన్నిటినీ మించి ప్రకృతికీ, సమాజానికీ చెందిన వాస్తవికతయొక్క ప్రతిబింబం. అది అవశ్యంగా ఉద్భవించింది. యెందుకంటే, అది లేకుండా, ఉద్దేశపూర్వ

కంగా ప్రకృతిలోని పదార్థాలను మానవుని అవసరాలకు అనుగుణంగా మార్చేదీ, మలచేదీ అయిన శ్రమా, దరహంమీద ఉద్దేశపూర్వకమైన కార్యాచరణా అసాధ్యమయ్యేవి.

మానవుని క్రియాశీలత కార్యాచరణలో ప్రపంచాన్ని రూపు మార్చడమే కాక, ఆత్మికంగా దానిని లీనం కూడా చేసుకుంటుంది, ఫలితాలు సామాజిక చైతన్యంలో స్థిరపడిపోతాయి. సామాజిక చైతన్య రంగంలో కార్యాచరణ — ఆత్మిక ఉత్పత్తి — యేమిటంటే, భావాలూ, సిద్ధాంతాలూ, ఆలోచనలూ, కళాత్మక కల్పనలూ, వగైరాల "ఉత్పత్తి." కానీ, ఒక వైపున కార్యాచరణగా కనిపించేది మరొక వైపున అస్తిత్వ రూపంగా, వస్తు రూపంగా వ్యక్తమౌతుంది. సమస్త కార్యాచరణా దాని ఫలితంగా యేర్పడే ఉత్పాదితంలో రూపుదాలుస్తుంది, వాస్తవ మౌతుంది, "అదృశ్యమౌతుంది." అలాగే, ఆత్మిక కార్యాచరణయొక్క ఫలితాలు భాషలోనూ, పుస్తకాలలోనూ, సాంకేతిక విజ్ఞానంలోనూ, వాస్తుశిల్ప నిర్మాణాలలోనూ, కళాత్మక కృతుల లోనూ, యితర భౌతిక వస్తువులలోనూ వాస్తవవౌతాయి.

సమాజంయొక్క ఆత్మిక జీవితం భావాల ఉత్పత్తి మాత్రమే కాదు, అది సామాజిక చైతన్యపు క్రియా నిర్వహణ కూడా, అనగా వ్యక్తుల చైతన్యాలతో దాని చర్యా ప్రతిచర్యలు. దీనిలో వివిధ సామాజిక బృందాల, వర్గాల మధ్య జరిగే భావజాలాత్మక పోరాటమూ, అభి ప్రాయాల, భావాల, సిద్ధాంతాల మార్పిడీ, వాటి పుట్టుకా, అభివృద్ధీ వుంటాయి. సమాజ ఆత్మిక జీవితం సామాజిక జీవితంతో గాఢంగా ముడివడి, సామాజిక క్రమాలనూ, ఘర్ష ణలనూ ప్రతిబింబిస్తుంది, మనుషుల సామాజిక కార్యాచరణయొక్క అనేక రూపాలతో సంబంధం కలిగి వుంటుంది.

సమాజ ఆత్మిక జీవితాన్ని అర్థం చేసుకోడానికి సామాజిక జీవితంలోని సాపేక్షంగా స్వతంత్రమైన విషయంగా సామాజిక చైతన్యపు నిర్మాణాన్ని మొట్టమొదట చర్చించవలసిన అవసరం వుంది.

సామాజిక చైతన్యపు నిర్మాణాన్ని పరిశీలించడానికి సూత్రాలు

సామాజిక చైతన్య మనేది బహు ముఖాలు గలది, చారిత్రకంగా మార్పుచెందేది. దానిలో వివిధ పార్శ్వాలు వున్నాయి, దానిని వివిధ పార్శ్వాలనుండి పరిశీలించవలసిన అవసరం వుంది. దానిని మొత్తంగా తీసుకుంటే, పరిశీలించవలసిన అంశాలు మూడు

వున్నాయి: చారిత్రక-జనన పార్శ్వం, జ్ఞానసిద్ధాంత పార్శ్వం, సామాజిక శాస్త్ర పార్శ్వం.

మొదటి పార్శ్వం సామాజిక అభివృద్ధిలోని చారిత్రక దశల సందర్భంలో సామాజిక చైతన్యపు చరిత్రయొక్క అధ్యయనం. మార్క్స్ అన్నట్లు, ఆత్మిక ఉత్పత్తికీ, పాదార్థిక ఉత్పత్తికీ మధ్య గల సంబంధాన్ని పరిశీలించడానికి అన్నిటికంటె ముఖ్యంగా నిర్దిష్ట చారిత్రక రూపంలో పాదార్థిక ఉత్పత్తినే పరిశీలించడం అవసరం. ఆవిధంగా, పెట్టుబడిదారీ పాదార్థిక ఉత్పత్తి విధానానికి అనురూపంగా ఒక ఆత్మిక ఉత్పత్తి విధానం వుంటుంది; యిది మధ్యయుగ విధానంకంటె భిన్నంగా వుంటుంది. సోషలిస్టు పాదార్థిక ఉత్పత్తి విధానానికి అనురూపంగా ఒక ఆత్మిక ఉత్పత్తి విధానం వుంటుంది. యిది పెట్టుబడిదారీ విధానానికి అనురూపంగా వున్నదానికంటె భిన్నం; యిలా వుంటాయి అన్నీ. "పాదార్థిక ఉత్పత్తినే దాని నిర్దిష్ట చారిత్రక రూపంలో భావించకపోతే, దానికి అనురూపమైన ఆత్మిక ఉత్పత్తిలో నిర్దిష్టమైనదానినీ, వాటి మధ్య గల పరస్పర ప్రభావాన్నీ గ్రహించడం అసాధ్యం."*

ప్రతి సామాజికార్థిక నిర్మాణంలోనూ చైతన్యపు సారానికి మాత్రమే కాక, చైతన్యపు నిర్మాణానికి కూడా నిర్దిష్ట లక్షణాలు వున్నాయి. కానీ, దీనిని మౌలిక అభివృద్ధి దశల దృక్పథంనుండి పరిశీలిస్తే, చరిత్రలో మూడు నిర్దిష్ట అంశాలు స్పష్టంగా కనపడుతాయి: వర్గపూర్వ సమాజపు చైతన్యమూ, శత్రు వర్గ నిర్మాణాల చైతన్యమూ, యీ నాడు ప్రారంభమౌతున్న కమ్యూనిస్టు నిర్మాణపు చైతన్యమూ.

ఆదిమ సమష్టి సమాజ నిర్మాణంలో భావాలూ, ఊహలూ, చైతన్యమూ అనేవాటి ఉత్పత్తి మొదట భౌతిక కార్యాచరణతో నూటిగా పెనవేసుకొని వుంటుంది. అక్కడ ఊహల పుట్టుకా, ఆలోచనలూ, మొత్తం ఆత్మిక సంపర్కమూ మనుషుల మధ్య గల భౌతిక సంబంధాల తక్షణ ఉత్పాదితంగా కనపడుతాయి. ఆదిమ సమష్టి సమాజపు సంబంధాలు ఆదిమ ఉత్పత్తిమీద ఆధారపడినాయి గనుక, సామాజిక చైతన్యం కూడా సారంలోనే కాక, నిర్మాణంలో కూడా అప్పుడు పిండ రూపంలోనూ, ఆదిమంగానూ వుండింది. అది యింకా సమ్మిళితంగా వుండి అనేక ఆత్మిక అంశాల సంకీర్ణకంగా వుండింది; దానిలో నైతిక ప్రమాణాలూ, ప్రత్యక్ష జ్ఞానమూ, మత భావాలూ, కళాత్మక అనుభూతులూ యింకా వేరుపడలేదు.

ఆదిమ సమాజంలో వ్యక్తికి సామాజిక చైతన్యం బృందంయొక్క, అంటే గణంయొక్క, తెగయొక్క చైతన్యంతో అభిన్నంగా వుండింది. ఎంగెల్స్ యిలా రాసినాడు: "తెగ అనేది మనిషికి సరిహద్దుగా వుండింది, తనకూ, బయటివాళ్ళతో తన సంబంధాలకూ కూడా: తెగ, గణమూ, వాటి సంస్థలూ పవిత్రమైనవి, అనుల్లంఘ్యమైనవి, అవి అతీత శక్తి, ప్రకృతి

* K. Marx, *Theories of Surplus-Value*, Part I, Moscow, 1969, పుట. 285.

నిర్మితమైనవి, వాటికి వ్యక్తి అనుభూతిలోనూ, ఆలోచనలోనూ, ఆచరణలోనూ పరమ విధేయంగా వుండివాడు.''*

శత్రు వర్గ సమాజ వ్యవస్థల్లో చైతన్యంయొక్క సారమూ, నిర్మాణమూ రెండూ గుణాత్మకమైన మార్పుకు లోనౌతాయి. ఒకటి, కొత్త సామాజిక సంస్థలూ (రాజ్యం), సామాజిక జీవితపు కొత్త రంగాలూ (రాజకీయ, న్యాయశాస్త్ర సంబంధాలు) అవతరించడంతో వాటి కనుగుణమైన రాజకీయ చైతన్యమూ, న్యాయశాస్త్ర చైతన్యమూ, మొదలైనవి ఉద్భవిస్తాయి. రెండు, సమాజం వర్గాలుగా విభజింపబడడంతో సామాజిక చైతన్యం వివిధ వర్గాల చైతన్యంగా కనపడుతూ, ఆర్థిక, రాజకీయ ప్రాబల్యం గల వర్గంయొక్క చైతన్యం ప్రాబల్యపు చైతన్యంగా వెలకొల్పబడుతుంది. మూడు, శ్రమ విభజనా, శరీర శ్రమనుండి మానసిక శ్రమ వేరుకావడమూ అనేవాటి ప్రాతిపదికమీద సైద్ధాంతిక చైతన్యం (తత్వశాస్త్రమూ, విజ్ఞానశాస్త్రాల పుట్టుకా) ఉద్భవిస్తుంది. సామాజిక చైతన్యపు అభివృద్ధి ఫలితంగా దానిలో ఆంతరంగిక విభేదకరణ జరిగి, దాని లోపల సాపేక్షంగా స్వతంత్రమైన రూపాలు విడిపోతాయి: రాజకీయ, న్యాయశాస్త్ర, నైతిక, మత, శాస్త్రీయ, కళాత్మక, తాత్విక రూపాలు; శత్రుత్వ పూరిత నిర్మాణా లన్నిటిలోనూ సామాజిక చైతన్యం యీ రూపాలలో అభివృద్ధి చెందుతుంది. ఆత్మిక కార్యాచరణ పాలక వర్గపు హక్కు అయి, శ్రామిక జనాలకు నష్టకరంగా సాగుతుంది, శ్రామిక జనాలు యే ఆత్మిక సారమూ లేని శరీర శ్రమలోకి తోయబడుతారు.

కమ్యూనిజం ప్రపంచ మంతటా స్థాపించబడినప్పుడు దానికి విలక్షణంగా చైతన్యపు నిర్మాణంలో వచ్చే మార్పులను పూర్తిగా వ్యక్తంచేయడానికి పెట్టుబడిదారీ వ్యవస్థనుండి కమ్యూనిజంకు మారుతున్న ప్రస్తుత పరివర్తన యుగంలో యింకా సాధ్యం కాదు. కానీ, సోవియట్ యూనియన్, తదితర సోషలిస్టు దేశాల అనుభవంనుండి యీ ధోరణులు యిప్పటికే స్పష్టంగా కనపడుతున్నాయి. ఉదాహరణకు, సోవియట్ యూనియన్‌లో సోవియట్ సమాజం ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల యేకత్వపు ప్రాతిపదికమీద భావజాలాత్మకంగా యేకమైంది. వ్యక్తివాదపు సొంత ఆస్తి చైతన్యంయొక్క అవశేషాలు క్రమక్రమంగా అధిగమింపబడుతున్నాయి. సోషలిస్టు సమాజపు వివిధ అవసరాలను తీర్చే రూపాల అంగనిర్మాణంలో మార్పులు వస్తాయి. యిది అన్నిటికంటె ముఖ్యంగా చైతన్యంయొక్క మత రూపాల ప్రభావం క్రమక్రమంగా తగ్గిపోవడంలో వ్యక్తమౌతున్నది. సోవియట్ పౌరులలో 87 శాతానికి పైగా నాస్తికులు. అంతే కాక, రాజకీయాలకూ, న్యాయశాస్త్రానికీ చెందిన రంగంలో గణనీయమైన మార్పులు వచ్చినందువలన సోషలిస్టు సమాజపు రాజకీయ, న్యాయశాస్త్ర

* K. Marx and F. Engels, *Selected Works*, Vol. 3, పుట 267.

చైతన్యంలో మార్పులు వస్తాయి. ప్రస్తుతం వాటి పాత్ర చాలా యెక్కువగా వున్నప్పటికీ, భవిష్యత్తులో రాజకీయాలకూ, న్యాయశాస్త్రానికీ చెందిన రంగం కృశించిపోయే పరిస్థితులు యేర్పడినప్పుడు, వీటి అవసరాలు తీర్చే చైతన్యపు రూపాలు కూడా కృశించిపోతాయి.

మానవజాతియొక్క చారిత్రక అభివృద్ధి గతిలో చైతన్యంయొక్క మారుతున్న నిర్మాణాన్ని యింతవరకు పరిశీలించినాం.

యిక జ్ఞానసిద్ధాంతపు పార్శ్వాన్ని చూద్దాం. జ్ఞానసిద్ధాంత వైఖరి అంటే, సామాజిక చైతన్యాన్ని అది దేనిని ప్రతిబింబిస్తుంది, యెలా ప్రతిబింబిస్తుంది, యే మేరకు — పైపైగానా, ప్రగాఢంగానా, సరిగానా, తప్పుగానా — ప్రతిబింబిస్తుంది అనే దృష్ట్యా పరిశీలించడం. చైతన్యం దాని అన్ని వ్యక్తీకరణలలోనూ వాస్తవికతయొక్క ప్రతిబింబంగా — అనగా, వాస్తవంయొక్క ప్రజ్ఞానంగా కనపడుతుందని అప్పుడు మనకు అర్థమౌతుంది. దాని అంచనా సత్యం, అసత్యం అనే ధాతువులలో యివ్వబడుతుంది. ఆవిధంగా, మత చైతన్యం గానీ, తాత్విక భావవాద చైతన్యం గానీ వాస్తవికతయొక్క తప్పు ప్రతిబింబాన్ని యిస్తుంది, వాస్తవికతయొక్క శాస్త్రీయ, లేదా తాత్విక భౌతికవాద ప్రజ్ఞానం సరైన ప్రతిబింబాన్ని యిస్తుంది. జ్ఞానసిద్ధాంతపు పరిశీలనలో చైతన్యానికీ, సామాజిక చారిత్రక ఆచరణకూ మధ్య గల లంకెను నిర్ణయించడం విధిగా చేరుతుంది; యెందుకంటే, యిది ప్రజ్ఞానానికి ప్రాతిపదిక, దాని సత్యాసత్యాలకు గీటురాయి.

సామాజిక చైతన్యపు జ్ఞానసిద్ధాంత పరిశీలనద్వారా దాని లోపల రెండు నిర్మాణపు స్థాయిలను వేరుచేయడం వీలౌతుంది: ఒకటి, సామాజిక మానవుని చైతన్యంలో వాస్తవికతయొక్క తక్షణ ప్రతిబింబపు స్థాయి, సాధారణ చైతన్యం అనబడేది; రెండు, అంతకంటె గాఢమైన ప్రతిబింబపు స్థాయి, మునుపు అభివృద్ధి చెందిన చైతన్యపు మధ్యవర్తిత్వంద్వారా, క్రమపద్ధతిగల సైద్ధాంతిక (లేక కళాత్మక) చైతన్యపు రూపం ధరించేది. సాధారణ చైతన్యాన్నీ, క్రమపద్ధతి గల చైతన్యాన్నీ* ఒకటిగా చూడడం సరి కాదు — అవి రెండూ సాధారణీకరణలే. కానీ, సాధారణ చైతన్యం దినదిన ఆచరణలో కనిపించే కింది స్థాయి సాధారణీకరణ. భావాల, సిద్ధాంతాల సుసమన్విత తర్కబద్ధ వ్యవస్థగా అది నిశ్చిత రూపం ధరించలేదు. తద్భిన్నంగా, క్రమపద్ధతి గల చైతన్యం లభ్యమైన భావాల సంపదనుండి సూటిగా ఉత్పన్నమై,

---

* "క్రమపద్ధతిగల చైతన్యం" అనే పదం సాధారణ చైతన్యంకంటె పైన వున్న చైతన్యంయొక్క (వాస్తవికత ప్రతిబింబంయొక్క) స్థాయిని తెలుపడానికి ఉపయోగించే పదం. దీనిని ఉపయోగించేవాళ్లకు దీని అరకొరతనం తెలిసినప్పటికీ, యింతకంటె మేలైన పదం లేనందున యిది ఉపయోగించబడుతున్నది.

వాటిని అభివృద్ధి చేస్తుంది, అందువలన ఉన్నత స్థాయికి చెందిన సాధారణీకరణగా కనిపిస్తుంది. వస్తువుకూ, దానికీ గల సంబంధంలో మధ్యవర్తిగా మునుపు ప్రోగుపడిన భావాల సంపద వుంది. చైతన్యపు నిర్మాణాన్ని జ్ఞానసిద్ధాంత రీత్యా మరింత పరిశీలన చేస్తే, దాని లోపల వస్తువుచేతా, ప్రతిబింబ రూపంచేతా నిర్ణయింపబడే భిన్నభిన్న అంగాలు వెల్లడౌతాయి. ఆవిధంగా, సాధారణ చైతన్యం లోపలా, క్రమపద్ధతి గల చైతన్యం లోపలా వివిధ వస్తువులనూ, ప్రకృతినీ, సమాజాన్నీ, పనిముట్లను చేసే పద్ధతులనూ, వివిధ నిర్మాణాలను నిర్మించడాన్నీ, మానవుల వ్యాధులనూ, వాటి చికిత్సనూ, మనుషుల మధ్యా, జాతుల మధ్యా గల సంబంధాలనూ, వాస్తవికతయొక్క కళాత్మక గుణాలనూ, మానవ అనుభూతులనూ, మానవుల ప్రయోజనాలనూ, సమాజ అవసరాలనూ గురించిన జ్ఞానం వెల్లడి కావడానికి వీలుంటుంది. కానీ, సాధారణ చైతన్యంలో యీ ప్రతిబింబ రూపాలన్నీ యింకా స్పష్టంగా వేరుపడి వుండవు. క్రమపద్ధతి గల చైతన్యంలో అవి నిపుణుల కార్యకలాపాల ఫలితం, శాస్త్రజ్ఞుల, వైద్యుల, కళాకారుల, సిద్ధాంతకారుల, సైనికుల, రాజకీయ నాయకుల, వగైరాల కార్యకలాపాల ఫలితం.

మూడవ — సామాజిక శాస్త్ర — పార్శ్వం సామాజిక చైతన్యాన్ని నిర్దిష్ట సామాజిక వ్యవస్థలో భాగంగా పరిగణించడానికీ, ఆ వ్యవస్థయొక్క కార్యాచరణలోనూ, అభివృద్ధిలోనూ దాని పాత్రను పరిశీలించడానికీ తోడ్పడుతుంది. చైతన్యంయొక్క సామాజిక శాస్త్ర పరిశీలన జ్ఞానసిద్ధాంత పరిశీలనతో సజీవంగా ముడివడి వున్నప్పుడు మాత్రమే శాస్త్రీయంగా వుండవచ్చు. నిజంగా, చైతన్యానికి మొత్తంగా గానీ, దాని వ్యష్టి భాగాలకు గానీ చెందిన సామాజిక క్రియను — అవి యేమి ప్రతిబింబించేదీ, యెలా ప్రతిబింబించేదీ పరిగణిస్తే తప్ప — అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. అదే సమయంలో, సామాజిక శాస్త్ర దృష్టి లేకుండా జ్ఞానసిద్ధాంత పరిశీలన స్పష్టంగా అరకొరగా వుంటుంది; యెందుకంటే, జ్ఞానసిద్ధాంత దృక్పథంనుండి శాస్త్రవిజ్ఞానమూ, నీతీ, మతమూ, కళా, తత్వశాస్త్రమూ, న్యాయశాస్త్ర చైతన్యమూ కేవలం నిర్దిష్ట ప్రతిబింబ రూపాలుగా, అనగా నిర్దిష్ట వస్తువుల ప్రజ్ఞానపు రూపాలుగా పరిగణింపబడుతాయి. నిర్దిష్ట ఆత్మిక అంశాలనూ, వాటి క్రియలనూ ఉత్పత్తి చేసే సామాజిక అవసరాలను లెక్కలోకి తీసుకొనే సామాజిక శాస్త్ర పరిశీలన సామాజిక జీవితంలో పైన చెప్పిన చైతన్య రూపాల పాత్రనుబట్టి వాటి మధ్య గల భేదాన్ని తెలుసుకోడానికి తోడ్పడుతుంది. సామాజిక చైతన్యపు నిర్మాణంలో కొత్త అంశాలను, జ్ఞాన సిద్ధాంత దృష్టితో పరిశీలించేవానికి కనిపించనివాటిని, ఆవిష్కరించడానికి అవకాశాన్ని కూడా అది కలిగిస్తుంది.

చైతన్యంయొక్క నిర్మాణాన్ని తెలుసుకోడానికి దాని సామాజిక శాస్త్ర పరిశీలన యేమియిస్తుంది? అది నిర్దిష్ట సామాజిక వ్యవస్థ చట్రం లోపల జరిగే కార్యాచరణయొక్క క్రియగా చైతన్యాన్ని పరిశీలించడానికి తోడ్పడుతుంది.

నిజంగా, ఆచరణ చైతన్యాన్నీ, దాని వ్యష్టి భాగాలనూ ఉత్పత్తి చేస్తుంది; అవి దానికి ఉపయోగపడుతూ, దానిని లక్ష్యవంతం చేస్తాయి. మానవ ఆచరణ బహుముఖమైనది, కానీ సామాజిక మానవుని మొత్తం ఆచరణలో కర్తకూ, వస్తువుకూ మధ్య మూడు ప్రధాన రకాల సంబంధాలు వున్నాయి. వీటినిబట్టి ప్రపంచాన్ని ఆత్మిక సంలీనం చేసుకొనే పద్ధతులు మూడు రూపుదాలుస్తాయి:

ఒకటి, మనిషికీ, రూపాంతరీకరణ చేయబడే వస్తువుగా ప్రాకృతిక, లేదా సామాజిక వస్తువుకూ మధ్య సంబంధాలు; దీనికి వస్తుగత జ్ఞానం అవసరం.

రెండు, మనిషికీ, మనిషికీ మధ్య సంబంధాలు, లేదా మానవుల మధ్య సామాజిక సంబంధాలు. అవి నిర్దిష్ట ఉత్పత్తి విధానపు ప్రాతిపదికమీద రూపుదాలుస్తాయి. అవి యేర్పడ డానికి ఒక భావజాలం అవసరం.

మూడు, కర్తకూ వాస్తవికతకూ మధ్య కళాత్మక సంబంధాలు; వీటినిబట్టి కళ ఉద్భ విస్తుంది.

ఆదిమ సమాజపు చైతన్యంలో కూడా సామాజిక శాస్త్ర పరిశీలన దాని లోపల విడిపోని రూపంలో వున్న మూడు ముఖ్య భాగాలను తెలుసుకోవడానికి తోడ్పడుతుంది: 1) జనాల ప్రత్యక్ష జ్ఞానం; యీ జ్ఞానం తప్పులు చేసి దిద్దుకొనే పద్ధతిద్వారా, ఆచరణాత్మక కార్యకలాపాల ప్రాతిపదికమీద, ఆ కార్యకలాపాల గతిలో సంగ్రహించబడింది, ఆ కార్యకలాపాల అవసరాలను తీరుస్తుంది; 2) మనుషుల జీవితపు సామాజిక పరిస్థితుల అవగాహన; యీ అవగాహన యీ సంబంధాలకు ఒక రూపమిచ్చి, వీటిని స్థిరపరచే సాధనంగా, వ్యక్తిని సామాజికీకరించడానికీ, సామాజిక జీవితపు అవశ్య పరిస్థితులకు లోబరచడానికీ సాధనంగా ఉపకరిస్తుంది; ఆ దశలో యీ అవగాహన యింకా క్రమపద్ధతిగా వుండదు, సామాజిక మనస్తత్వంగా కనపడుతుంది; 3) ప్రజా సృజనాత్మకత, యీ సృజనాత్మకత మానవుడు వాస్తవికతతో తనకు గల సంబంధాన్ని కళాత్మకంగా గ్రహించేకొద్దీ రూపుదాలుస్తుంది, దాని కళాత్మక లక్షణాల దృష్ట్యా వాస్తవికతను ప్రజ్ఞానానికీ, విలువ గట్టడానికీ సాధనంగా, మానవుని భావుకత్వాన్ని అభివృద్ధి చేసే సాధనంగా, జనాలను తర్ఫీదు చేయడానికీ, సామాజిక కర్తవ్యాల నిర్వహణకు వాళ్లను కూడగట్టడానికీ పరికరంగా ఉపయోగపడుతుంది.

సమాజం మరింత అభివృద్ధి చెందేకొద్దీ, సాధారణ చైతన్యపు విలక్షణ గుణాలైన యీ మూడు భాగాలూ నిలిచి వుంటాయి; యెందుకంటే, వాస్తవికతను తక్షణం ప్రతి బింబించడం నిలిచి వుంటుంది, దానితో పాటు సామూహిక చైతన్యంలో నిత్య సాధారణ ఆచరణ యొక్క తక్షణ అవగాహన కూడా నిలిచి వుంటుంది. కానీ, శత్రు వర్గ సామాజిక వ్యవస్థలలో సామాజిక చైతన్యపు అభివృద్ధిలో గణనీయమైన విభేదకరణ జరిగి, కొత్త నిర్మాణపు స్థాయిని,

మునుపటి ఆత్మిక అభివృద్ధిద్వారా కలిగే సైద్ధాంతిక, కళాత్మక చైతన్యపు రంగం అనేదానిని, ఉత్పన్నం చేస్తుంది. యీ రంగంలో వున్నవి 1) శాస్త్రవిజ్ఞానం — యిది సైద్ధాంతిక ఆలోచన మధ్యవర్తిత్వంద్వారా కలిగే జ్ఞానంగా ఉత్పన్నమౌతుంది; 2) భావజాలం — యిది ప్రోగువడిన భావ సంపదనుండి ఉత్పన్నమౌతూ, తర్కబద్ధంగా దానిని అభివృద్ధి చేసే భావాల వ్యవస్థగా ఉత్పన్నమౌతుంది; 3) వృత్తి కళ — యిది మునుపటి కళాత్మక ఆచరణనుండి ఉద్భవిస్తూ, దానిని అభివృద్ధి చేసే కళాత్మక కల్పనలోని వాస్తవికత ప్రతిబింబంగా ఉత్పన్న మౌతుంది.

మళ్లీ, యీ అంశాలలో ప్రతిదానికీ సంకీర్ణ నిర్మాణం వుంది. చరిత్ర గతిలో శాస్త్ర విజ్ఞానం విభేదకరణా, యేకీకరణా అనే ప్రక్రియకు లోనౌతుంది; దీని ఫలితంగా అది యీనాడు శాఖోపశాఖలుగా వున్న మహా వృక్షం లాగ సుసమన్వితమూ, అంతరంగికంగా విభజితమూ అయిన జ్ఞాన వ్యవస్థగా కనపడుతుంది. యీ నాటి పరిస్థితులలో భావజాలంలో ఆరు భిన్న రూపాలు వున్నాయి: రాజకీయ భావజాలమూ, న్యాయశాస్త్ర చైతన్యమూ, నీతీ, మతమూ, కళాత్మక అభిప్రాయాలూ, తత్వశాస్త్రమూ. వృత్తి కళ కూడా సంకీర్ణ నిర్మాణం గల విషయంగా కనపడుతుంది. చరిత్రలో వేర్పాటైన కళా రూపాలకు — చిత్ర లేఖనం, సాహిత్యం, నాటకం, సంగీతం, మొదలైనవాటికి — కొత్తవి తోడౌతాయి (కొత్త సాంకేతిక సాధనాల ఆవిర్భావంతో ఉత్పన్నమయ్యేవి): కళాత్మక ఫొటోగ్రఫీ, సినిమా, టెలివిజన్, వగైరా.

మునుపటి ఆత్మిక అభివృద్ధి మధ్యవర్తిత్వంద్వారా కలిగే వాస్తవికతను ప్రతిబింబంలోని యీ భాగాలన్నీ వీటికి అనురూపంగా సాధారణ చైతన్యంలో గల భాగాలు నిర్వహించే క్రియలనే మౌలికంగా నిర్వహిస్తాయి, కానీ అవి నూతన సామాజిక చారిత్రక ఆచరణ ప్రాతిపదికమీద ఉద్భవిస్తాయి. సిద్ధాంత జ్ఞానం లేకుండా ఆచరణాత్మక కార్యకలాపాలు అసాధ్య మైనప్పుడు శాస్త్రవిజ్ఞానం ఉద్భవిస్తుంది. సామాజిక సమస్యలను విస్తారమైన జన సముదాయాలు — వర్గాలు — పరిష్కరించ పూనుకొన్నప్పుడు, అవి యేకమై, విజయవంతంగా పనిచేయడానికి వాటి సమష్టి ప్రయోజనాలను వ్యక్తం చేస్తూ, ఆ ప్రయోజనాల ప్రిజంగుండా వాస్త వికతను ప్రతిబింబించే భావాల వ్యవస్థ అవసర మైనప్పుడు, భావజాలం ఉద్భవిస్తుంది. కళను వృత్తిగా స్వీకరించినవాళ్లను సమాజం పోషించగలిగినప్పుడు, మహా ప్రౌఢమైన కళా పరికరాలచేత మానవుల అనుభూతులనూ, యిచ్ఛనూ, మనస్సునూ ప్రభావితం చేయవలసిన అవసరం యేర్పడినప్పుడు వృత్తి కళ ఉద్భవిస్తుంది.

జనాల సాధారణ చైతన్యమూ, వృత్తి శాస్త్రజ్ఞులూ, సిద్ధాంతకారులూ, కళాకారులూ అభివృద్ధి చేసిన క్రమపద్ధతి గల చైతన్యమూ గాఢంగా ముడిపడి, పరస్పరం ప్రభావితం

చేసుకొంటాయి. యీ పరస్పర చర్యయొక్క స్వభావం, ఒకటి, ప్రతి సమాజంయొక్క నిర్దిష్ట లక్షణాలచేతా, రెండు, ఆ చైతన్యాంశంయొక్క నిర్దిష్ట లక్షణాలచేతా నిర్ణయింప బడుతుంది.

సామాజిక చైతన్యపు నిర్మాణంయొక్క సాధారణ గుణం యిలా వుంది. యీ నిర్మాణాన్ని తెలుసుకోవడం వలన సామాజిక చైతన్యంలోని గొప్ప వైవిధ్యాన్ని పరిగణిస్తూ, సమాజపు ఆత్మిక జీవితానికీ, భౌతిక జీవితానికీ మధ్య గల పరస్పర చర్యను నిర్దిష్టంగా అధ్యయనం చేయడానికి ఉపయోగకరంగా వుంటుంది.

సామాజిక చైతన్యపు నిర్మాణాన్నీ, దాని వివిధ భాగాల క్రియలనూ సవివరంగా చూద్దాం.

ప్రజ్ఞానమూ, భావజాలమూ

మానవులు ప్రకృతిమీద గానీ, సామాజిక జీవితంమీద గానీ లక్ష్యవంతమైన ప్రభావం నెరపుతారు గనుక, వాస్తవికతయొక్క గుణాల గురించీ, నియమాల గురించీ వస్తుగత జ్ఞానం వాళ్లకు అవసరం. పెట్టుబడిదారీ దేశంలోనైనా, సోషలిస్టు దేశంలోనైనా ఒక విద్యుత్ స్థావరం నిర్మించే మానవులు ఒకే వస్తుగత నియమాలచేత నడిపించబడుతారు, వాటిని వాళ్లు తెలుసుకొని తీరాలి. అక్కడ సామాజిక ప్రయోజనం యేమిటంటే, వస్తువును గురించి, దాని నిసర్గ స్వభావం గురించి, మానవునితో నిమిత్తం లేకుండా మానవునితో దాని సంబంధంతో నిమిత్తం లేకుండా స్వయంగా దానిలో వున్నదానిని గురించి జ్ఞానాన్ని పొందడం. వస్తువులో నిర్దిష్ట పార్శ్వాలనూ, సంబంధాలనూ ఆవిష్కరించడానికి ఆచరణాత్మక అవసరాలు మానవుని ప్రేరేపిస్తాయి. కానీ తన కార్యాచరణలో విజయం పొందాలంటే అతనికి వాటిని గురించి వస్తుగత జ్ఞానం, అనగా కర్తమీద ఆధారపడని వస్తుగత సత్యం, అవసరం. చలిలో వణకే మనిషి మనస్సు ఒళ్లు వెచ్చజేసుకోవడంమీద లగ్నమై వుంటుంది. కానీ మంటను పుట్టించా లంటే అతను వస్తువుల వస్తుగత గుణాలను లెక్కలోకి తీసుకోవాలి: యెంతైనా, గుంపెడు రాళ్లు మంటను పుట్టించలేవు గదా.

కానీ, కార్యాచరణకే మరొక పార్శ్వం వుంది. మానవుడు తన ముందు ఒక నిర్దిష్ట మైన లక్ష్యం పెట్టుకొని వస్తువును క్రియాత్మకంగా ప్రభావితం చేస్తాడు. లక్ష్యాలు నిర్ణయించడం, కార్యక్రమం రూపొందించడం, ఆచరణ మార్గాలు పథకీకరించడం, వగైరా లతో యిది ముడివడివుంది. అందువల్లనే, మానవుని ఆచరణ వస్తుగత జ్ఞానంయొక్క అవసరాన్ని మాత్రమే కాక, వాస్తవికతపట్ల ఆత్మగత వైఖరిని కూడా ఉత్పన్నం చేస్తుంది.

యిది వాస్తవికతలో ఘటనల గురించి, పాదార్థిక, ఆత్మిక ఉత్పత్తి ఫలితాలను గురించి కర్త వేసే అంచనాలో వ్యక్తమౌతుంది, అనగా వాటి పరస్పర సంబంధంలోనూ, వాటికి సామాజిక కర్తయొక్క ప్రయోజనాలతోనూ, అవసరాలతోనూ గల సంబంధంలోనూ వ్యక్తమౌతుంది. చిట్టచివరన మాత్రమే వ్యక్తి కర్తగా ప్రత్యక్షమౌతాడు; సాధారణంగా గణమో, తెగయో, వర్గమో, సామాజిక బృందమో, నిర్దిష్ట సమాజమో కర్తగా వుంటుంది. అందువల్లనే, నిర్దిష్ట ఆత్మగత వైఖరి సామాజిక ప్రాముఖ్యం పొంది, సామాజిక చైతన్యంలో స్థిరపడు తుంది.

వస్తుగత జ్ఞానానికీ, వాస్తవికతపట్ల ఆత్మగత వైఖరిని వ్యక్తంచేసే రూపాలకూ మధ్య వివిధ, సంకీర్ణ సంబంధాలు ఉద్భవిస్తాయి, కానీ వాటి సమగ్ర పరిశీలన యీ పుస్తకపు పరిధిలో చేరదు. ప్రజ్ఞానానికీ, భావజాలానికీ మధ్య ఉద్భవించే సంబంధాన్ని మాత్రమే మేము చర్చి స్తాము. భావజాలం సామాజిక కర్తకు స్వయంవ్యక్తీకరణయొక్క, స్వయంసమర్థనయొక్క రూపం, ఆధునిక సమాజానికి విశిష్ట లక్షణమై, దాని జీవితంలో గొప్ప పాత్ర నిర్వహించే టట్టిది. ప్రజ్ఞానం లాగే భావజాలం కూడా సామాజిక ప్రయోజనాలనుండి ఉద్భవిస్తుంది, కానీ భిన్న స్వభావం కలది. యే ఉత్పాదక కార్యాచరణ అయినా నిర్దిష్ట సామాజిక రూపంలో, నిర్దిష్ట సామాజిక సంబంధాల చట్రం లోపల జరుగుతుంది, తత్ఫలితంగా సామాజిక సంబంధాల నిర్దిష్ట రూపాన్ని పటిష్ఠపరచి, కొనసాగించడానికి గానీ, మార్చడానికి గానీ ఆ సంబంధా లను అర్థం చేసుకోవలసిన అవసరం సామాజిక కర్తకు (సమాజానికి, వర్గానికి) యేర్పడు తుంది. అత్యంత సాధారణ రూపంలో, భావజాల చైతన్యం యీ సరళ విషయంనుండి ఉత్పన్నమౌతుంది.

అందువల్లనే సామాజిక చైతన్యపు అభివృద్ధిలో రెండు పరస్పర సంబంధం గల ధోరణులు ఉత్పన్నమౌతాయి: ఒకటి, ప్రజ్ఞానపు ధోరణి, సామాజిక మానవుని వాస్తవ జీవిత ఆచరణయొక్క ప్రయోజనాలచేత నిర్ణయింపబడేది—ప్రకృతినీ, సమాజాన్నీ గురించిన వస్తుగత జ్ఞానాన్ని ప్రోగుచేయడం; రెండు, భావజాల ధోరణి, నిర్దిష్ట సామాజిక సంబంధా లను కొనసాగించే లక్ష్యం గానీ, మార్చే లక్ష్యం గానీ గల సామాజిక ప్రయోజనాలచేత నిర్ణ యింపబడేది. వాస్తవ జీవితంలో యీ రెండు ధోరణులూ గాఢంగా పెనవేసుకొని, తరుచుగా ఒకదానితో ఒకటి సమసిస్తాయి; తత్ఫలితంగా, సిద్ధాంత పరిశీలన ద్వారా, అభౌతికీకరణ ద్వారా మాత్రమే వాటిని విడదీయగలం. భావజాల క్రమంలో ప్రజ్ఞాన పార్శ్వం వుంది, అలాగే జ్ఞానాభివృద్ధిలో భావజాల పార్శ్వం వుంది. కానీ యీ రెండు ధోరణులనూ ఒకటిగా చూడకూడదు, యెందుకంటే, జ్ఞానాభివృద్ధీ, భావజాలాభివృద్ధీ భిన్నభిన్న నియమాలకు లోబడుతాయి, సామాజిక చైతన్యంలోని యీ నిర్మాణ అంశాలు భిన్నభిన్న పాత్రలు నిర్వ

హిస్తాయి. ప్రకృతితో మానవుని పాదార్థిక సంబంధాలు యెప్పుడూ నిర్దిష్ట ఉత్పత్తి సంబంధాలద్వారా వాస్తవీకరింపబడినట్లే, వాస్తవికతతో మానవుని ప్రజ్ఞాన సంబంధాలు యెల్లప్పుడూ ఆ సామాజిక పరిస్థితులు ఉత్పత్తిచేసిన నిర్దిష్ట భావజాల రూపాలలో వాస్తవీకరింపబడుతాయి.

భావజాల మనేది సామాజిక చైతన్యంలోని యే భాగం సమాజం యెదుట ఉత్పన్నమయ్యే సామాజిక సమస్యలను పరిష్కరించడంతో సూటిగా సంబంధించిందో, యేది సామాజిక సంబంధాలను మార్చడానికి గానీ, స్థిరపరచడానికి గానీ తోడ్పడుతుందో ఆ భాగం. వర్గ సమాజంలో భావజాలానికి వర్గ స్వభావం వుంటుంది, అనగా అది నిర్దిష్ట వర్గాల ఆత్మిక వ్యక్తీకరణగానూ, భౌతిక ప్రయోజనాల ధ్రువీకరణగానూ వుంటుంది. యెందుకలా వుంటుంది?

సమాజం వర్గాలుగా విభజింపబడినప్పటినుండి నిర్దిష్ట ఉత్పత్తి సంబంధాల వ్యవస్థ లోపల వివిధ వర్గాల వస్తుగత స్థాయిలనుబట్టి ఉత్పన్నమయ్యే వాటి భౌతిక ప్రయోజనాలు మానవులకు తమ సొంత సామాజిక అస్తిత్వం గురించీ, తమ మొత్తం పరిసర వాస్తవికత గురించీ కలిగే అవగాహనమీద నిర్ణాయకమైన ప్రభావం నెరప నారంభిస్తాయి. ప్రగతిశీల వర్గాల ప్రయోజనాలు సామాజిక అభివృద్ధియొక్క వస్తుగత నియమాల అమలుచేత ఉత్పన్నమయ్యే సామాజిక అవసరాల వ్యక్తీకరణ రూపంగా వుంటాయి. ప్రగతి వ్యతిరేక వర్గాల ప్రయోజనాలు వాటితో ఘర్షిస్తాయి. సామాజిక అభివృద్ధికి చెందిన ప్రముఖ కర్తవ్యాల నిర్వహణలో వర్గ ప్రయోజనాలు కూడా నిర్ణాయక ప్రాముఖ్యం వహిస్తాయి; యెందుకంటే, సమాజానికి యెదురయ్యే సామాజిక సమస్యలు వర్గాల పోరాటంద్వారా మాత్రమే పరిష్కరింపబడుతాయి. వర్గ పోరాటపు ఆచరణ వర్గ ప్రయోజనాన్నీ, దానిని సాధించే పద్ధతులనూ భావజాల రీత్యా నిరూపించి, సమర్థించే అవసరాన్నీ ఉత్పన్నం చేస్తుంది. యీ సామాజిక పాత్రను వర్గాల భావజాలం నిర్వహిస్తుంది. వర్గ సమాజంలో భావజాలం సామాజిక అభివృద్ధియొక్క వస్తుగత నియమాల వాస్తవీకరణకు అవసరమైన ఆత్మగత పరిస్థితిగా పని చేస్తుంది.

భావజాల క్రమంలో వాస్తవికతయొక్క సరైన ప్రతిబింబమూ వుంటుంది, వికృత ప్రతిబింబమూ వుంటుంది. వాస్తవికతయొక్క వికృత ప్రతిబింబం వివిధ రాజకీయ, న్యాయశాస్త్ర, మత, నైతిక, తాత్విక, తదితర భ్రమలద్వారా వ్యక్తమౌతుంది. కానీ, భావజాలంలో వాస్తవికతయొక్క వికృత ప్రతిబింబాన్ని యాదృచ్ఛికమైనదిగా పరిగణించకూడదు. యెందుకంటే, దానికి కూడా భౌతిక కారణాలు వున్నాయి – కెమెరా లెన్సులోని తలకిందులు ప్రతిబింబాన్ని భౌతికశాస్త్ర నియమాలు నిర్ణయించినట్లు. యీ కారణాలు యేమిటి?

ఆధిపత్య, పరాధీనతా సంబంధాల ఆవిర్భావంతో, ఆర్థికంగా ప్రాబల్యం గల వర్గంయొక్క ప్రయోజనాలు సామాజిక ఉత్పత్తికి చోదక శక్తిని సమకూర్చేటప్పుడు, సామాజిక సంబంధాల నిజమైన సారాంశం సామాజిక జీవితపు ఉపరితలంమీద వికృత రూపంలో కనిపిస్తుంది. ఉత్పత్తిని అభివృద్ధి చేసేటందుకు మనుషుల మధ్య ఆర్థిక సంబంధాలు రూపుదాలుస్తాయి, వివిధ వర్గాలు అనుసరించే లక్ష్యాలే అంతిమంగా ఉత్పత్తిచేత నిర్ణయింపబడుతాయి. కానీ, ఘటనల ఉపరితలంమీద, శ్రామిక ప్రజల పదార్థ ఉత్పాదక కార్యాచరణ ప్రాబల్యపు వర్గం యొక్క లక్ష్యాలను సాధించే సాధనంగా మాత్రమే కనిపిస్తుంది.

కనుక, చైతన్యం పాదార్థిక, ఆచరణాత్మక కార్యకలాపాలచేత ఉత్పత్తి చేయబడి, నిర్ణ యించబడినట్లు కాక, మనుషుల పాదార్థిక కార్యకలాపాలను నిర్ణయించేది చైతన్యమైనట్లు కనిపిస్తుంది. యీ బాహ్యాకారాన్ని ప్రతిబింబించడంలో చైతన్యం వాస్తవికతనుండి వేరు పడి, దానికి వ్యతిరేకంగా నిలబడుతుంది. "యీ క్షణంనుండి చైతన్యం తాను అమలులో వున్న ఆచరణకు చెందిన అవగాహనకంటె భిన్నమైనదానిననీ, వాస్తవమైన యేదానికీ ప్రాతి నిధ్యం వహించకుండా వాస్తవంగా యేదానికో ప్రాతినిధ్యం వహిస్తున్నాననీ నిజంగా ఆత్మ స్తుతి చేసుకోగలదు.... యీ క్షణంనుండి చైతన్యం ప్రపంచంనుండి తన్ను తాను విమోచన చేసుకొని, 'శుద్ధ' సిద్ధాంతం, మతశాస్త్రం, తత్వశాస్త్రం, నీతిశాస్త్రం, వగైరాల నిర్మా ణానికి పురోగమించే స్థితిలో వుంటుంది."*

శరీర శ్రమనుండి మానసిక శ్రమ వేరుపడి నందువలన, శ్రమ విభజన మూలంగా మానసిక శ్రమకు సంబంధించినవాళ్లు ఆలోచన మనస్సుయొక్క స్వతంత్ర చర్యల ఫలిత మైనట్లూ, అది భావాల సంపదతో వ్యవహరిస్తున్నట్లూ, మనిషియొక్క సొంత ఆలోచన నుండి గానీ, అతని పూర్వుల ఆలోచననుండి గానీ మాత్రమే ఉద్భవిస్తున్నట్లూ అను కుంటారు. ఆత్మిక క్రమంయొక్క సాపేక్ష స్వాతంత్ర్యం పరమమైనదిగా కనపడుతుంది. చైతన్యానికీ, భౌతిక వాస్తవికతకూ మధ్య గల సంబంధాన్ని అర్థం చేసుకోవడ మనేది అదృశ్య మౌతుంది. సామాజిక చైతన్యపు అభివృద్ధి యిక యే మాత్రమూ భౌతికంగా నిర్ణీతమైన అవశ్య అంశంగా, మొత్తం సామాజిక చారిత్రక క్రమంలో ఒక పార్శ్వంగా కనిపించదు, చరిత్ర గతిని నిర్ణయించే పరమ స్వతంత్ర క్రమంగా కనిపిస్తుంది.

దోపిడీ వర్గాలు యెప్పుడూ తమ విశిష్ట ప్రయోజనాన్ని సార్వజనీనమైనదిగా ప్రదర్శించ జూసినాయి, అనగా తమ సొంత భావజాలానికి వర్గాతీతమైన సార్వజానిక ప్రాముఖ్యం ఆపాదింప జూసినాయి.

---

* K. Marx and F. Engels, *The German Ideology*, పుట 43.

దోపిడీ వర్గం తన అధిపత్యాన్ని యింకా స్థాపించకుండా, దాని కోసం పోరాడుతూ మాత్రమే వుండే చారిత్రక దశలలో, దాని ప్రయోజనం కొంతవరకు మెజారిటీ ప్రజల ప్రయోజనంతో సమవసించేటప్పుడు, దాని ప్రగతిశీల సిద్ధాంతకారులు భావి సమాజాన్ని ఆదర్శీకరించడంలో నిజాయితీ వుంటుంది, స్వార్థ లక్ష్యాలు యేమీ లేకుండా వాళ్ళు ఆ వర్గపు అధిపత్య స్థాపన కోసం జరిగే పోరాటాన్ని సార్వజనీన సత్య, వివేక, న్యాయాల కోసం జరిగే పోరాటంగా చిత్రిస్తారు.

వస్తుగతంగా డేకార్ట్, స్పినోజా, హెల్వేటియుస్, డీడ్రో పైకి వస్తున్న బూర్జువావర్గం యొక్క సిద్ధాంతకారులు, కానీ వాళ్ళు సత్యానికీ, న్యాయానికీ నిజంగా అంకితమైన వ్యక్తులుగా సామాజిక ఆలోచన చరిత్రలో సముచితంగా పేరుకెక్కినారు.

తన పెత్తనాన్ని స్థాపించిన దోపిడీ వర్గం సంగతి పూర్తిగా వేరు. దానికి ముఖ్యమైన విషయం యేమిటంటే, యే ఆర్థిక వ్యవస్థలో అది తన అధిపత్యపు స్థానాలు కలిగివుంటుందో దానిని శాశ్వతమైనదిగా, మార్పు లేనిదిగా రుజువు చేయడం. కానీ, యే ఆర్థిక వ్యవస్థా శాశ్వతమైనదీ, మార్పు లేనిదీ కాదు గనుక, పాలక వర్గ ప్రయోజనాలకూ, వాస్తవికతకూ మధ్య వైరుధ్యం ఉద్భవిస్తుంది. యీ పరిస్థితులలో పాలక వర్గపు సిద్ధాంతకారులు వాస్తవికతను వికృతపరచడం ప్రారంభిస్తారు, శాస్త్రజ్ఞానం కొరకు స్వతంత్ర అన్వేషణ పోయి, విధేయపు సమర్థనలు వస్తాయి.

కనుక, దోపిడీ సమాజంలోని భావజాల అభివృద్ధిని జ్ఞానాభివృద్ధితో ఒకటిగా చూడకూడదు, భావజాల వికృతీకరణలను కేవలం సత్యాన్వేషణలోని పొరపాటుగా చూడకూడదు, యెందుకంటే, వీటి వెనుక ఒక అతి నిశ్చితమైన సామాజిక ప్రక్రియ వుంది.

కానీ, ప్రజ్ఞాన క్రమానికీ, భావజాల క్రమానికీ మధ్య గల భేదాన్ని శాస్త్రీయ చైతన్యానికీ, వికృత చైతన్యానికీ మధ్య వ్యత్యాసం చూపడానికి పరిమితం చేయకూడదు. ప్రగతిశీల వర్గాల సిద్ధాంతకారులు యెల్లప్పుడూ శాస్త్రవిజ్ఞానంమీద కొంతవరకు ఆధారపడినారు, దాని సమాచారాన్ని తమ వర్గ ప్రయోజనాలకు ఉపయోగించుకోడానికి చూస్తున్నారు. అందువల్లనే, దరహంమీద ప్రతి భావజాలాన్నీ బూటకపు చైతన్యంగా పరిగణించకూడదు. ముఖ్యమైన విషయం యేమిటంటే, ఒక భావజాలం యే వర్గపు ప్రయోజనాలను వ్యక్తం చేసేదీ, దాని అసలు సారం యేమైందీ తెలుసుకోవడం.

యే భావజాలమైనా వర్గ వికృతమైన బూటకపు చైతన్యమే అనీ, దానికి "అయోమయ కారక శక్తి" వుంటుందనీ, అది యేకపక్షమైనదీ, పక్షపాతంగలదీ, ఆత్మగతమైనదీ, శాస్త్ర విరుద్ధమైనదీ, శాస్త్రంతో పొసగనిదీ అనీ బూర్జువా రచయితలు అంటారు. వాళ్ళు శాస్త్ర విజ్ఞానం పేరిట భావజాలాన్ని త్రోసిపుచ్చి, శాస్త్రవిజ్ఞానంమీద దాని ప్రభావం లేకుండా

చేయాలని డిమాండు చేస్తారు. యిది యిప్పుడు ఫాషన్‌లో వున్న "అభావజాలీకరణ" సిద్ధాంతం; దీని అనుచరులు ఒక నిర్వివాదమైన విషయాన్ని ఉపేక్షిస్తారు; అదేమిటంటే: సామాజిక శాస్త్రాలలోనూ, తత్వశాస్త్రంలోనూ పరమ నిష్పాక్షికత సాధ్యం కాకపోవడమే కాక, వాస్తవంలో అనవసరం కూడా; యెందుకంటే, ప్రగతిశీల సామాజిక ప్రయోజనాలనూ, విలువలనూ గమనించడంద్వారానే శాస్త్రజ్ఞుడు సామాజిక వాస్తవికత గురించి వస్తుగత జ్ఞానాన్ని పొందేటందుకూ, సామాజిక జీవితంలోని క్రమత్వాలనూ, నిజమైన వైరుధ్యాలనూ ఆవిష్కరించేటందుకూ, యీ వైరుధ్యాలను పరిష్కరించడంలో తోడ్పడగల సామాజిక శక్తులను కచ్చితంగా గుర్తుపట్టేటందుకూ కావలసిన సరైన స్థావరాన్ని తీసుకోగలడు. అందువల్లనే, సమాజానికి యెదురయ్యే సామాజిక సమస్యలను పరిష్కరించడానికి శాస్త్ర జ్ఞానాన్ని ఉపయోగించే భావజాలం ఒకటి వుంది. మన కాలంలో అది మార్క్సిజం లెనినిజం, వాస్తవికత గురించిన అసలైన, వస్తుగతమైన జ్ఞానంమీద యేర్పడిన శాస్త్రీయ భావజాలం. దీనికి కారణం యేమిటంటే, మార్క్సిజం లెనినిజం కార్మికవర్గంయొక్క భావజాలం, యే వర్గంయొక్క ఆత్మగత ప్రయోజనాలు సమాజపు ప్రగతిశీల అభివృద్ధియొక్క ప్రయోజనాలకు అనుగుణంగా వుంటాయో ఆ వర్గంయొక్క భావజాలం. అందువలన శాస్త్రీయ పార్శ్వాన్నీ, వర్గ పార్శ్వాన్నీ మేళవించడానికి, పార్టీ దృష్టినీ, విప్లవతత్వాన్నీ మేళవించ డానికి వీలు కలుగుతుంది. కానీ, గుర్తుపెట్టుకోవలసింది యేమిటంటే, వర్గపు వస్తుగత ప్రయోజనాలయొక్కా, భావజాలంలో వాటి సైద్ధాంతిక ప్రతిబింబంయొక్కా అభిన్నత్వం రూఢ్యక్షర సూత్రం కాదు. కొత్త చారిత్రక పరిస్థితులలో అది తనంతకు తానే స్థిరపడ దని మార్క్సిజం చెపుతుంది. వస్తుగత క్రమంయొక్క అపరిపక్వతా, కార్మికవర్గ ఉద్య మంలోని యేదో ఒక దళంయొక్క పాక్షిక, తాత్కాలిక ప్రయోజనాల ప్రభావమూ, వివిధ సిద్ధాంత కార్యకర్తల అనుభవంయొక్కా, జ్ఞానంయొక్కా పరిమిత స్వభావమూ వివిధ దేశాలలో యెప్పుడైనా ఒకసారి మార్క్సిస్టు లెనినిస్టు సిద్ధాంతాన్ని విరూపం చేయవచ్చు, దాని ప్రత్యక్ష సారాన్ని వికృతపరచవచ్చు కూడా. అందువల్లనే, మార్క్సిజం లెనినిజం సామా జిక అభివృద్ధియొక్క నియమాలనూ, చోదక శక్తులనూ ప్రతిబింబిస్తుంది గానీ, దాని తరవున మాట్లాడుతున్నామని చెప్పుకొనే వ్యష్టి సిద్ధాంతకారులు దానికి యిచ్చే వ్యాఖ్యానంతో యెల్లప్పుడూ యేకీభవించదు. భిన్న దృక్పథాలు విప్లవాత్మక ఆచరణ గతిలో పోల్చబడుతాయి, పరీక్షకు గురి అవుతాయి. నిజానికి యీ ఆచరణే సత్యానికి అత్యున్నతమైన గీటురాయి. యధార్థంలో జరుగుతున్న క్రమాలనూ వాని నియమాలనూ వస్తుగతంగా ప్రతిబింబించే భావజాలం మాత్రమే కార్మికవర్గం యెదుట ఉత్పన్నమయ్యే సామాజిక కర్తవ్యాల నిర్వ హణకు తోడ్పడగలదు. వాస్తవికతకు చెందిన శాస్త్రీయ పరిశీలనమండీ, వస్తుగత అంచనా

నుండి వైదొలగడమూ, శాస్త్రీయంగా నిరాధారమైన నిర్ణయాలను చేయడమూ, కార్మిక వర్గపు వర్గ ప్రయోజనాలకు హానికరం.

భావజాల అభివృద్ధియొక్క ఒక నిర్దిష్ట అంశం యేమిటంటే, ప్రతి కొత్త వర్గమూ తన సొంత భావజాలాన్ని సృష్టిస్తుంది, ఆ వర్గంయొక్క మారుతున్న ప్రతిపత్తితో, ప్రయోజనాలతో పాటు అది మారడానికి అభిముఖంగా వుంటుంది. ఒక వర్గం చారిత్రక రంగాన్ని వదలిపెట్టినప్పుడు, అది యే అభిప్రాయాల, సామాజిక భావాల, సిద్ధాంతాలద్వారా తన ప్రయోజనాలనూ, వాస్తవికత గురించిన తన దృక్పథాన్నీ వ్యక్తం చేసిందో అవి క్రమ క్రమంగా తమ ప్రభావాన్ని కోల్పోతాయి.

ప్రతి వర్గమూ తన సొంత భావజాలాన్ని సృష్టించవలసి రావడం యెందుకు? దీనికి కారణం వర్గాలకు భిన్నభిన్న వస్తుగత ప్రతిపత్తులు వుండడమూ, ప్రతిదీ తన సొంత చారిత్రక కర్తవ్యాలను నిర్వహించవలసి వుండడమూ. యీ పనికి అది యితర కర్తవ్యాల నిర్వహణ కొరకు పుట్టిన పాత భావజాలాన్ని వూరక వాడుకోలేదు.

ప్రతి కొత్త వర్గమూ తన సొంత భావజాలాన్ని యెందుకు సృష్టిస్తుందనే ప్రశ్నా, యెలా సృష్టిస్తుందనే ప్రశ్నా ఒకటి కాదు. యే కొత్త భావజాలమూ శూన్యంలో పుట్టదు. మునుపటి అభివృద్ధి గతిలో ప్రోగువడిన భావాల, అభిప్రాయాల, అవగాహనల సంపదను అది ఉపయోగించుకొంటుంది. అనగా, భావజాల అభివృద్ధిలో అనుస్యూతి వుంటుంది. భావజాల అనుస్యూతియొక్క స్వభావం యేమిటి?

ప్రతి కొత్త వర్గంయొక్క భావజాలమూ మారుతున్న చారిత్రక పరిస్థితులనూ, నిర్దిష్ట అంతర్వైరుధ్యాలనూ ప్రతిబింబించి, జరూరు కర్తవ్యాలను ప్రతిపాదిస్తుంది. కానీ అది భావజాలాల చారిత్రక అభివృద్ధి గతిలో సృష్టి చేయబడిన భావాలలోనూ, ధాతువులలోనూ వీటిని ప్రతిబింబించి, తన డిమాండ్లను రూపొందిస్తుంది. కనుక, ఆలోచన సంపద ఒక యుగంనుండి మరొక యుగానికి అందుతుంది. ఉదాహరణకు, సమానత్వం కావాలనే డిమాండు వివిధ యుగాలలో చేయబడింది, కానీ బానిసల, తదితర పీడితుల భావజాలమైన తొలి క్రైస్తవ మతం సమానత్వాన్ని భగవంతుని యెదుట మానవు లందరి సమానత్వంగా చూసింది. బూర్జువా విప్లవాలలో సమానత్వం కొరకు డిమాండు ప్రభువర్గపు అధిక సౌకర్యాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాన్ని వ్యక్తం చేసింది. కార్మికవర్గానికి సమానత్వమంటే వర్గాల రద్దు. అలాగే స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, న్యాయం, మొదలైన భావాలు చారిత్రకంగా నిర్ణయింపబడినవి. భావాల సారం విషయం యేమిటంటే, మరణోన్ముఖ వర్గాల సిద్ధాంతకారులు సాధారణంగా మునుపటి భావజాలంనుండి ప్రగతి వ్యతిరేక భావాలను యేరుకొని, వాటిని తమ సొంత ప్రయోజనాలకు అనుగుణంగా మార్చుకుంటారు. అప్పుడప్పుడు వాళ్ళ

ఒకప్పుడు ప్రగతిశీలంగా వుండిన సిద్ధాంతాలను కూడా ఉపయోగించుకొంటారు, కానీ వాటికి తమ సొంత వ్యాఖ్యానం యిచ్చి, వాటి చారిత్రక అర్థాన్ని వికృతపరుస్తారు. అరిస్టోటిల్ సిద్ధాంతపు మధ్యయుగ వ్యాఖ్యానం ఒక మంచి ఉదాహరణ. దానిలోని సకల అన్వేషణలూ, పరస్పర వాదాత్మక భావాలూ, ఊహలూ ప్రక్షాళనం చేయబడి, దాని దుర్బల అంశాలు పిడిసూత్రాలుగా చేయబడినాయి.

దీనికి భిన్నంగా, ప్రగతిశీల వర్గాలు తమ భావజాలంలో గత కాలపు పురోగామి భావాల మీద ఆధారపడుతాయి. వికసిస్తున్న బూర్జువావర్గపు సిద్ధాంతకారులు ప్రాచీన ప్రపంచపు మానవతావాద, భౌతికవాద భావాలను పునరుద్ధరించి, విస్తృతపరచి, వాటికి మధ్యయుగాల భావజాలంతో గల భేదం చూపినారు.

కనుక, సామాజిక భావాల అభివృద్ధినీ, నూతన భావజాల సృష్టినీ చర్చించేటప్పుడు, ఒక విషయాన్ని లెక్కలోకి తీసుకోవాలి, యేమిటంటే: అలాంటి సందర్భాలలో ఆర్థిక వ్యవస్థ కొత్త దేమీ సృష్టించదు, కేవలం అమలులో వున్న భావాల సంపదను యే పద్ధతిలో మార్చి, అభివృద్ధి చేయవలసిందీ నిర్ణయిస్తుంది.

భావజాలంలో అనుస్యూతి అవసరం, చారిత్రక అభివృద్ధిలో దానికి గొప్ప ప్రాముఖ్యం వుంది. అనుస్యూతి లేకుంటే, మానవులు వాస్తవికతను ప్రతిబింబించడంలోనూ, తమ భావాలనూ, ధాతువులనూ రూపొందించుకోవడంలోనూ ప్రతి సారి శూన్యంనుండి ప్రారంభించవలసి వుండేది. అప్పుడు కొత్త వర్గాల సిద్ధాంతకారులు మునుపటి తరాల ఆలోచనలోని అభౌతికీకరణయొక్క దీర్ఘ కృషి ఫలితాలను ఉపయోగించుకోజాలక పోయేవాళ్ళు, ఆ ఫలితాలు ఆనవాలు లేకుండా అదృశ్యమై వుండేవి. భావజాలం తన సామాజిక క్రియలను నిర్వహించజాలక పోయేది, సమాజ పురోగతి యెంతో కుంటుపడేది.

· వివిధ భావజాలాల ఆవిర్భావమూ, అనుక్రమమూ కాక, చరిత్రలో శాస్త్ర జ్ఞానపు సత్వర పురోగమనం వుంది. యీ జ్ఞాన పురోగమనం నిర్దిష్ట శాస్త్రాల అభివృద్ధి గతిలో కాక, కొంతవరకు భావజాల రంగంలో కూడా జరుగుతుంది.

జ్ఞాన పురోగమనం మానవుల ఉత్పాదక, సామాజిక చారిత్రక కార్యాచరణయొక్క అవసరాలమీద ఆధారపడుతుంది. నిర్దిష్ట చారిత్రక దశలలో ఆ ప్రాతిపదికమీద లభ్యమైన వస్తుగత జ్ఞానం దానిని త్రోసిపుచ్చని సమాజానికి లాభం. న్యూటన్ ఆవిష్కరించిన నియమాలను గానీ, మెండెలేయెవ్ ఆవిష్కరించిన ఆవర్తన సిద్ధాంతాన్ని గానీ, స్మిత్, రికార్డోలు సూత్రీకరించిన విలువయొక్క శ్రమ సిద్ధాంతాన్ని గానీ పునరావిష్కరించవలసిన అవసరం లేదు. అభివృద్ధి చెందుతున్న ఆచరణయొక్క అవసరాలను తీర్చడంలో శాస్త్రవిజ్ఞానం లభ్యమైన జ్ఞానాన్ని త్రోసిపుచ్చడంద్వారా కాక, దానిమీద ఆధారపడడంద్వారా, దానిని

అభివృద్ధి చేయడంద్వారా, ప్రగాఢపరచడంద్వారా పురోగమిస్తుంది. అందువల్లనే, శాస్త్ర జ్ఞానంలో కచ్చితమైన అనుస్యూతి సాపేక్ష సత్యంనుండి పరమ సత్యానికి చేరుకోవడంలో మానవ జ్ఞానంయొక్క పురోగతికి అవశ్యమైన షరతు.

కనుక, భావజాలంలోని అనుస్యూతిని శాస్త్ర జ్ఞానంలోని అనుస్యూతికంటె భిన్నంగా చూడాలి. రెండు రంగాలలోనూ అనుస్యూతి వుంది. కానీ శాస్త్ర జ్ఞానంలో అనుస్యూతి అంటే, మునుపు లభ్యమైన వస్తుగత జ్ఞాన మంతటినీ నిలుపుకోవడమూ, ఉపయోగించు కోవడమూ. భావజాలంలో అనుస్యూతి అంటే, భావాల సంపదను నిలుపుకోవడమూ, అందులో యేది ఆ వర్గంయొక్క ప్రయోజనాలకు అనుగుణంగా వుంటుందో, దేని సారం ఆ యుగ పరిస్థితులచేత నిర్ణయింపబడుతుందో దానిని మాత్రమే ఉపయోగించుకోవడమూ.

సామాజిక మనస్తత్వమూ, భావజాలమూ

సిద్ధాంతకారులచేత సృష్టింపబడి, అభివృద్ధి చేయబడే భావజాలానికి భిన్నంగా సామాజిక మనస్తత్వ మనేది సామూహిక చైతన్యం. అది జనాల నిత్య జీవితంలోనూ, కార్యాచరణలోనూ రూపుదాల్చే అభిప్రాయాలచేతా, భావాలచేతా యేర్పడి, వాళ్ల జీవిత పరిస్థితులనూ, కార్యాచరణనూ, ప్రయోజనాలనూ, అవసరాలనూ ప్రతిబింబిస్తుంది. సామాజిక మనస్తత్వం జనాల చైతన్యంలో అస్తిత్వంయొక్క తక్షణ ప్రతిబింబం, వాళ్ల సంకుచిత ఆచరణాత్మక దైనందిన కార్యకలాపాల అవగాహన.

మనుషులు భిన్నభిన్న వర్గాలకు చెందుతారు గనుక, వాళ్ల చైతన్యం వాళ్లు జీవించే భిన్నభిన్న పరిస్థితులనూ, తత్ఫలితంగా, వాటినుండి ఉత్పన్నమయ్యే భిన్నభిన్న ఆచరణాత్మక అవసరాలనూ, ప్రయోజనాలనూ ప్రతిబింబిస్తుంది. వర్గ సమాజంలో సామాజిక మనస్తత్వం భిన్న వర్గాల మనస్తత్వంగా కనపడుతుంది. ఉదాహరణకు పెటీబూర్జువా మనస్తత్వం — అంటే, సామాజిక సమస్యలపట్ల చిన్న ఆస్తిపరునికి విలక్షణమైన నిర్లక్ష్యమూ, తన సొంత సుఖాలపట్ల అన్నిటినీ మించిన శ్రద్ధా, తన ఆస్తికీ, తన సొంత పరిమిత ప్రపంచానికీ అంటి పెట్టుకోవడమూ, వగైరా; యివన్నీ పెటీబూర్జువాల జీవిత పరిస్థితులనుండి ఉద్భవిస్తాయి. కార్మికులలో, వాళ్లు పెట్టుబడిదారునిమీద ఆధారపడడమూ, వాళ్లు సమష్టిగా రోజూ కలిసి పనిచేయడమూ, సహజంగానే, మేలైన పరిస్థితులూ, మొదలైనవాటి కొరకు చేసే పోరాటంలో యితర కార్మికులతో ఐక్యం కావడం అవసరమనే చైతన్యాన్ని కలిగిస్తాయి.

కానీ, కార్మికుల సాధారణ చైతన్యం, యేదైనా యితర వర్గపు మనస్తత్వం లాగే, తమ అస్తిత్వాన్ని గురించిన సిద్ధాంత అవగాహన స్థాయికి లేవలేదు. దీనికి శాస్త్రీయ అధ్యయనం అవసరం. యీ అధ్యయనంలో, మునుపటి చరిత్ర గతిలో ప్రోగువడిన భావాల సంపదను విమర్శనాత్మకంగా పునర్నిర్మించడం ఆవశ్యకం. సద్యోజనిత కార్మికవర్గ ఉద్యమం ట్రేడ్‌యూనియన్ చైతన్యాన్ని మాత్రమే కలిగించగలదని లెనిన్ చెప్పినాడు. కార్మికవర్గపు ముఖ్య ప్రయోజనాల శాస్త్రీయ వ్యక్తీకరణ దాని సామాజిక మనస్తత్వంనుండి గానీ, కార్మికవర్గ ఉద్యమపు సద్యోజనితమైన పెరుగుదలనుండి గానీ ఉద్భవించదు, అది శాస్త్రవిజ్ఞానపు అభివృద్ధినుండి ఉద్భవిస్తుంది, కార్మికవర్గపు విప్లవ పార్టీచేత కార్మికవర్గ ఉద్యమంలోకి ప్రవేశ పెట్టబడుతుంది.

దీనినిబట్టి తెలిసేదేమంటే, సామాజిక మనస్తత్వం ఒక వర్గంయొక్క ముఖ్య ప్రయోజనాలను అవగాహన చేసుకొనే స్థాయికి గానీ, వాస్తవికతయొక్క ముఖ్య పార్శ్వాలనూ, నియమాలనూ ఆవిష్కరించే స్థాయికి గానీ లేవజాలదనీ, కానీ అది భావజాలంతో చర్యాప్రతిచర్యలకు లోనై, దానికి ఒక నిశ్చితమైన అనుభూతి గుణాన్నీ, శక్తినీ యిస్తుందనీ.

భావజాలమంటే భావాల వ్యవస్థ, ఆ అర్థంలో అది సుసంబద్ధమైనది. తద్భిన్నంగా, సామాజిక మనస్తత్వం ఆత్మిక అంశాల నిర్దిష్ట సమాహారంచేత యేర్పడుతుంది: భావాలూ, అనుభూతులూ, అవసరాలూ, మనస్థితులూ, భ్రమలూ, ఆచారాలూ, అవగాహనలూ, వగైరా. దాని వివిధ భాగాల ప్రత్యేక అధ్యయనం మౌలిక ప్రాముఖ్యం గలది; యెందుకంటే, సామూహిక ఉద్యమాల మనస్తత్వాన్ని లెక్కలోకి తీసుకుంటే తప్ప చరిత్రను జనాల చరిత్రగా అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. 1907లో లెనిన్ విప్లవ మనస్థితుల ప్రాముఖ్యాన్ని నొక్కిచెప్పుతూ యిలా రాసినాడు: "రష్యాయొక్క పెట్టుబడిదారీ అభివృద్ధి తేటతెల్లంగా వెనుకబడి వుండగా, సమాజపు వర్గ నిర్మాణాన్నిబట్టి పార్టీల బృందాలుగా యిలా స్పష్టమైన విభజన జరగడానికి కారణం యీ యుగంయొక్క కల్లోలపు విప్లవాత్మక మనస్థితి మాత్రమే. యిలాంటి యుగంలో నిస్తబ్ధ యుగంలోకంటె, లేదా శాంతియుత పురోగతి యుగం అనబడేదానిలోకంటె వేగంగా పార్టీలు యేర్పడుతాయి, యెంతో వేగంగా వర్గ చైతన్యం పెరిగి, రూపుదాలుస్తుంది."*

సామాజిక మనస్తత్వం మనుషుల చైతన్యంలో వాస్తవికతయొక్క తక్షణ ప్రతిబింబంగా (అనగా, సైద్ధాంతిక ఆలోచన మధ్యవర్తిత్వంద్వారా యేర్పడిందిగా కాక), సామూహిక చైతన్యంగా, ఒక ప్రత్యేక శాస్త్రంయొక్క వస్తువు. సామాజిక మనశ్శాస్త్రం అనే శాస్త్రం వర్గాల, సామా

---

*V. I. Lenin, *Collected Works*, Vol. 12, పుట 207.

జిక విభాగాల, బృందాల, విడివిడి జట్టుల చైతన్యపు సారాన్నీ, ఆ చైతన్యాన్ని వ్యక్తంచేసే వివిధ రూపాలనూ అధ్యయనం చేస్తుంది; అది వాళ్ల జీవిత పరిస్థితుల తక్షణ ప్రతిబింబాన్నీ, మనుషుల పరస్పర సంపర్కంతో ముడిపడి, సామూహిక చైతన్యంలో జరిగే సామాజిక మనస్తత్వపు క్రమాలనూ — అనుకరణ, సూచన, సానుభూతులు, వైముఖ్యాలు, సామూహిక ఉన్మాదం, అనురూపత, వగైరాలను — ఆవిష్కరిస్తుంది.

సామాజిక మనస్తత్వం జనాల, వర్గాల, బృందాల ఆత్మిక ప్రవృత్తిని వర్ణించినప్పటికీ, వాస్తవంలో అది ఈ సామాజిక బృందాలుగా యేర్పడే నిర్దిష్ట సజీవ వ్యక్తుల చైతన్యంగా వుంది. జనాలు తప్ప దానికి వేరే వాహనం లేదు. కానీ, భావజాలానికి సిద్ధాంతకారులు గానీ, పార్టీలు గానీ వాహనాలుగా వుండవచ్చు.

అంతే కాక, పుస్తకాలలో గానీ, వ్యాసాలలో గానీ, ఉపన్యాసాలలో గానీ, కార్యక్రమాలలో గానీ యెల్లప్పుడూ ''బాహ్య వస్తువుగా చేయబడే'' భావజాలానికి భిన్నంగా, సామాజిక మనస్తత్వం కేవలం ''అంతర్నిహిత''మైనదిగా, వ్యక్తుల ఆత్మిక స్థితిగా కనిపిస్తుంది. బూర్జువా సామాజిక మనశ్శాస్త్రజ్ఞులు తమ సామాజిక మనస్తత్వ పరిశీలనకు యీ పైపై అభిప్రాయాన్ని ప్రారంభ విషయంగా, కీలక విషయంగా తీసుకుంటారు. కానీ, వాస్తవం యేమిటంటే, వ్యక్తుల చైతన్యంయొక్క ప్రధాన సారం సమాజంనుండి వస్తుందనీ, వ్యక్తి సమాజపు అనుభవాన్నీ, జ్ఞానాన్నీ, దాని నియమాలనూ, అవసరాలనూ జీర్ణం చేసుకొనేకొద్దీ అది అభివృద్ధి చెందుతుందనీ గాఢ పరిశీలన స్పష్టపరుస్తుంది. జీవితంలో ప్రవేశించే ప్రతి వ్యక్తీ భౌతిక ఆచరణను మాత్రమే కాక, మానవజాతి పరిసర ప్రపంచాన్ని గురించిన తన ప్రతిబింబాన్ని వేటిలో నమోదుచేస్తుందో ఆ సామాజిక రూపాలను (భాష, కళాత్మక కల్పనలూ, నైతిక సూత్రాలూ, వగైరాలను) కూడా జీర్ణం చేసుకుంటాడు. నిజానికి యీ సామాజిక రూపాలకు వెలుపల వుండే మానవ చైతన్యం యేదీ లేదు. కానీ, యిది చైతన్యంయొక్క సాంఘిక రూపాలను వ్యక్తి జీర్ణం చేసుకోవడం మాత్రమే కాదు. అతని చైతన్యంయొక్క అసలు సారమూ, దాని దృష్టి, అతని చర్యల వెనుక వుండే ప్రేరణలూ, ఉద్దేశాలూ, ప్రయోజనాలూ, అతని జీవితమంతా నిర్దిష్టమైన విలువల ప్రమాణాన్నిబట్టి రూపు దాల్చడమూ — యివన్నీ సమాజంనుండి చేసిపెట్టినవిగా వస్తాయి. కనుక, సామాజిక మనస్తత్వాన్ని కేవలం వ్యక్తుల వేరువేరు చైతన్యాల వెరసి మొత్తం (సాకల్యం)గా పరిగణించకూడదు. రూపంలోనూ, సారంలోనూ సామాజిక మనస్తత్వ మనేది సామాజిక ఉత్పాదితం, జనాల చైతన్యంలో వాళ్ల ఉమ్మడి వస్తుగత అస్తిత్వంయొక్క, వాళ్ల ఉమ్మడి జీవిత పరిస్థితులయొక్క ప్రతిబింబం.

శత్రుత్వపూరిత వ్యవస్థల సామాజిక మనస్తత్వానికి భిన్నంగా, సోషలిస్టు సమాజంలో

జనాల, వర్గాల, బృందాల మనస్తత్వం పూర్తిగా భిన్నమైన ప్రాతిపదికమీద రూపుదాలుస్తుంది: ఒకటి, దేశ పౌరు లందరికి సమానంగా వున్న సామాజిక జీవిత పరిస్థితులు వున్నాయి; రెండు, సోషలిస్టు విద్యా వ్యవస్థయొక్కా, పెంపకం పద్ధతియొక్కా ప్రభావం వుంది; మూడు, శాస్త్రీయ, మార్క్సిస్టు లెనినిస్టు భావజాలంయొక్క ప్రభావం వుంది. అందువల్లనే, తన ఉత్పత్తిద్వారా, దినదిన, కళా, క్రీడా, తదితర అభిరుచులద్వారా, అభిముఖ్యాలద్వారా భిన్నభిన్నంగా వుండే మానవ వ్యక్తిత్వంయొక్క సంపదా, వైవిధ్యమూ సోషలిజంలో సకల సోవియట్ ప్రజల సామాజిక మనస్తత్వపు ప్రధాన సారంలోని యేకత్వంతో మేళవింపబడుతుంది. సోషలిజం కొత్త సామాజిక స్వభావమూ, కొత్త లక్షణాలూ గల మానవుని తయారు చేసింది, సోషలిస్టు సమాజపు మానవుని—సమిష్టి వానిని, శ్రమను గౌరవించేవానిని, మానవతావాదిని, అంతర్జాతీయవాదిని, తన సోషలిస్టు దేశంపట్ల ప్రగాఢమైన ప్రేమ గలవానిని.

సామాజిక చైతన్యపు రూపాలు

గణ వ్యవస్థ విచ్ఛిన్నమైనప్పటినండి చరిత్ర గతిలో ఒకదాని తరువాత ఒకటిగా వచ్చిన సమాజా లన్నిటిలోనూ సామాజిక చైతన్యం యీ ప్రధాన రూపాలలో కనిపించింది: రాజకీయ భావజాలం, న్యాయశాస్త్ర చైతన్యం, నీతి, మతం, శాస్త్రవిజ్ఞానం, కళాభిప్రాయాలూ, కళా, తత్వశాస్త్రం.

యింద్రధనుస్సులోని యేడు రంగులలాగ అవి ప్రతి సమాజంలోనూ ఆత్మిక జీవితపు మనోహర వర్ణపట్టికగా యేర్పడుతాయి. చైతన్యపు రూపాలన్నీ యేకైక సమస్తంగా యేర్పడేటట్లు పరస్పరం పెనవేసుకొని, సమాజపు వివిధ అవసరాలను తీరుస్తాయి. కానీ ప్రతి దానికీ దాని సొంత విశిష్ట గుణాలూ, దాని సొంత రంగూ వున్నాయి, మానవుల నిర్దిష్ట సంబంధాలకూ, కార్యకలాపాలకూ సేవచేసేవి. చైతన్యపు రూపాలు సామాజిక చైతన్యంయొక్క సాపేక్షంగా స్వతంత్రమైన నిర్మాణ అంశాలుగా వుంటాయి. వాటి సారాంశమూ, వాటి చారిత్రక అభివృద్ధి లక్షణాలూ ప్రత్యేక శాస్త్రాలచేత అధ్యయనం చేయబడుతాయి: ఉదాహరణకు, న్యాయశాస్త్ర చైతన్యమూ, న్యాయశాస్త్రమూ న్యాయశాస్త్ర చరిత్రచేతా, న్యాయశాస్త్ర సిద్ధాంతంచేతా అధ్యయనం చేయబడుతాయి; కళా, దాని వేరువేరు రకాలూ (చిత్రలేఖనం, సంగీతం, వగైరాలు) కళా శాస్త్రాలచేతా, శాస్త్రవిజ్ఞానం శాస్త్రవిజ్ఞానపు శాస్త్రంచేతా, తత్వశాస్త్రం తత్వశాస్త్ర చరిత్రచేతా, యిలా అధ్యయనం చేయబడుతాయి. చారిత్రక భౌతిక

వాదం యీ శాస్త్రాలకు ప్రత్యామ్నాయం కాదు; యెందుకంటే, అది చైతన్యపు వేరువేరు రూపాలను తన కోణంనుండి అధ్యయనం చేస్తుంది. తాత్విక సామాజిక శాస్త్రపు శాస్త్రంగా చారిత్రక భౌతికవాదం చైతన్యపు రూపాలను సామాజిక విషయాల వ్యవస్థలో వాటి స్థానమూ, వాటి విశిష్ట లక్షణాలూ, సామాజిక క్రియలూ, సమాజపు జీవితంలోనూ, అభివృద్ధిలోనూ వాటి పాత్రా అనే దృక్పథంనుండి పరీక్షిస్తుంది.

సామాజిక చైతన్యపు నిర్దిష్ట రూపాల పరిశీలనను రాజకీయ భావజాలంతో ప్రారంభిద్దాం; యెందుకంటే, అది ఆర్థిక వ్యవస్థతో అత్యంత గాఢంగా, సూటిగా ముడివడి వుంది గనుకా, అది యితర చైతన్య రూపాలమీద, తరుచుగా వర్గాల రాజకీయ ప్రయోజనాలద్వారా ఆర్థిక వ్యవస్థతో సంబంధం గలవాటిమీద, అత్యంత గొప్ప ప్రభావం నెరపుతుంది గనుకా.

రాజకీయ భావజాలం సామాజిక చైతన్యపు ఒక రూపం, వర్గాల మధ్య గల సంబంధాలనూ, రాజ్యంతోనూ, నిర్దిష్ట సమాజపు యే అభివృద్ధి దశలోనైనా ఆ సమాజపు సామాజిక రాజకీయ వ్యవస్థతోనూ, అంతిమంగా యితర సమాజాలతోనూ, రాజ్యాలతోనూ వర్గాలకు గల సంబంధాన్ని ప్రతిబింబించేది. వర్గాలు తమ పోరాటంలోనూ, రాజకీయ వ్యవస్థల, సంస్థల కార్యాచరణలోనూ వర్గాలు సాధించదలచే సకల వర్గ ప్రయోజనాలూ, కర్తవ్యాలూ, రాజకీయ కార్యక్రమాలూ రాజకీయ భావజాలపు చట్రం లోపల రూపొందించబడుతాయి. వర్గాలయొక్కా, రాజ్యాలయొక్కా నిజమైన విధానాన్ని రూపుదిద్దడంలో రాజకీయ భావజాలానికి గొప్ప పాత్ర వుంది. రాజకీయాలు సారభూతంగా నిర్దిష్ట వర్గంయొక్క మౌలిక ఆర్థిక ప్రయోజనాలనుబట్టి యేర్పడుతాయి; కానీ అవి వాటిని యథాతథంగా వ్యక్తం చేయవు, ఆ ఆర్థిక ప్రయోజనాలు గ్రహింపబడిన మేరకు మాత్రమే, అనగా ఆ వర్గంయొక్కా, దాని సిద్ధాంతకారులయొక్కా, రాజకీయవాదులయొక్కా రాజకీయ చైతన్యంగుండా అవి గడచిన మేరకు మాత్రమే వ్యక్తం చేస్తాయి. అందువల్లనే, ఒకే ఆర్థిక ప్రాతిపదిక సాపేక్షంగా భిన్నమైన రాజకీయ సిద్ధాంతాలనూ, భావాలనూ, చర్యలనూ కలిగించవచ్చు. యీ సందర్భంలో, కేవల ఆర్థిక కారణాలకు మాత్రమే కాక, వ్యష్టి జాతుల అభివృద్ధిలోని జాతీయ విశిష్టతలకూ, వాటి సంస్కృతిలోని విలక్షణ గుణాలకూ, రాజకీయ పార్టీల, రాజ్యాల నాయకుల స్వభావ, జ్ఞాన, సామర్థ్యాలకూ కూడా ప్రాముఖ్యం వుంది. రష్యాలోని ప్రగతిశీల శక్తులు రాజకీయ ప్రతిభాశాలి అయిన లెనిన్‌చేత నడిపించబడినాయనే విషయమూ, రష్యన్ బూర్జువావర్గానికి కార్మికవర్గాన్ని రాజకీయంగా మోసగించడంలోనూ, రాజకీయ రాజీలలోనూ, మాటవరుసకు, బ్రిటిష్ బూర్జువావర్గాని కుండినంత అనుభవం లేకపోయిందనే విషయమూ అక్టోబర్ సోషలిస్టు మహా విప్లవ విజయంలో ముఖ్యమైన పాత్ర నిర్వహించినాయని చారిత్రక అనుభవం బాగా తెలుపుతుంది.

వర్గ పోరాటపు ప్రధాన రూపమైన రాజకీయ పోరాటంలో — అనగా, రాజ్య వ్యవహారాలలో భాగస్వామ్యం కొరకు గానీ, సాంఘిక సంస్కరణల కొరకు గానీ, రాజ్యాధికారపు స్వభావాన్ని మార్చడానికి గానీ జరిగే పోరాటంలో — వర్గాలూ, వాటి పార్టీలూ రాజకీయ భావజాలంచేత నడిపించబడుతాయి. అందువల్లనే భావజాల రంగంలో వర్గాల పోరాటం కూడా అన్నిటికంటె ముఖ్యంగా వాటి రాజకీయ దృక్పథాల ఘర్షణలో ప్రతిబింబిత మౌతుంది.

పాత సామాజిక నిర్మాణరూపం గర్భం లోపల పెరిగిన ఉత్పాదక శక్తులకూ, పాత ఉత్పత్తి సంబంధాలకూ మధ్య ఘర్షణ ఉత్పన్న మైనప్పుడు, రాజకీయ పోరాటపు లక్ష్యాలను రూపొందిస్తూ, ఆ లక్ష్యాలను సాధించే మార్గాలనూ, సాధనాలనూ సూచించే కొత్త రాజకీయ భావాలు సామాజిక అభివృద్ధియొక్క జరూరు అవసరాలుగా ప్రత్యక్ష మౌతాయి. యీ భావాలు పాత వ్యవస్థను రద్దుచేయగల రాజకీయ సైన్యంగా జనాలను యేకం చేస్తాయి. అవిధంగా, పురోగామి రాజకీయ భావాలు ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలోనూ, దాన్నిబట్టి సామాజిక జీవితపు యితర పార్శ్వాల అభివృద్ధిలోనూ వ్యవస్థీకరించే, సమీకరించే, రూపాంతరీకరించే పాత్రను నిర్వహిస్తాయి.

ఆధునిక ప్రపంచంలో బూర్జువా, సోషలిస్టు రాజకీయ భావజాలాల మధ్య నిశిత పోరాటం సాగుతున్నది. సామ్రాజ్యవాద బూర్జువావర్గపు రాజకీయ భావజాలం ప్రజా వ్యతిరేకమైనది, ప్రగతి వ్యతిరేకమైనది, సామ్రాజ్యవాదపు పెత్తనాన్ని కొనసాగించడమూ, గుత్త పెట్టుబడి యొక్క దురాక్రమణశీల ఆశయాలను సమర్థించడమూ, వాటికి ముసుగు వేయడమూ లక్ష్యంగా గలది. సోషలిస్టు రాజ్యాలమీదా, కార్మికవర్గ విప్లవ, జాతీయ విమోచన ఉద్యమాల మీదా పోరాటానికి అది మలచబడింది. కమ్యూనిస్టు వ్యతిరేకత సామ్రాజ్యవాదుల ప్రధాన భావజాల రాజకీయ ఆయుధం; దాని పతాకకింద వాళ్లు సామాజిక ప్రగతిని అడ్డగించేటందుకు ప్రగతి వ్యతిరేకపు దుష్ట శక్తు లన్నిటినీ కూడగట్ట జూస్తారు. యీ పరిస్థితులలో, 1969 జూన్‌లో జరిగిన కమ్యూనిస్టు, కార్మిక పార్టీల అంతర్జాతీయ సమావేశంయొక్క నిర్ణయాలు నొక్కిచెప్పినట్లు, ప్రగతిశీల శక్తుల స్థిరమైన రాజకీయ ఐక్యత సామ్రాజ్యవాదంమీదా, శాంతి, ప్రజాస్వామ్య, సోషలిజంల కొరకూ జరిగే పోరాటానికి అవశ్యమైన షరతు.

రాజకీయ భావజాలం రాజ్యంయొక్కా, రాజకీయ పార్టీలయొక్కా, వర్గాలయొక్కా, జన సముదాయాలయొక్కా కార్యాచరణలో మూర్తీభవిస్తుంది గనుక, అది ఆర్థిక వ్యవస్థ మీదా, సామాజిక జీవితపు ప్రతి పార్శ్వంమీదా గొప్ప ప్రభావం నెరపుతుంది. యీ నాడు, మానవాళి శ్రేయస్సుకోసం ఆధునిక ఉత్పత్తియొక్క అవకాశాల నన్నిటినీ ఉపయోగించుకో కుండా మనుషులను పెట్టుబడిదారీ గుత్త సంస్థలు అరికట్టుతున్న సమయంలో, ప్రధానంగా రాజకీయ ఉపరినిర్మాణమే పెట్టుబడిదారీ సంబంధాల కొనసాగింపును కట్టుదిట్టం

చేస్తున్నదని అంతకంతకూ తేటతెల్లంగా వుంది. బూర్జువావర్గం మిలిటరీ, ప్రభుత్వ, ప్రచార యంత్రాంగాలమీద అజమాయిషీ కలిగి, తన పెత్తనాన్ని కొనసాగించే ప్రయత్నాలలో బలమూ, మోసమూ ఉపయోగిస్తూ, తద్వారా, జరూరు ఆర్థిక అవసరాన్ని సాధించకుండా అడ్డుపడుతున్నది.

చివరి విషయం యేమిటంటే, రాజకీయ భావజాలం సమాజపు ఆర్థికాభివృద్ధిమీద ప్రత్యక్ష ప్రభావం మాత్రమే కాక, న్యాయశాస్త్ర చైతన్యమూ, నీతి, మతమూ, శాస్త్ర విజ్ఞానమూ, మొదలైన యితర సామాజిక చైతన్య రూపాలద్వారా పరోక్ష ప్రభావం కూడా నెరపుతుంది. రాజకీయాలూ, రాజకీయ భావజాలమూ చైతన్య రూపాల నన్నిటినీ ఒక నిర్దిష్ట వర్గపు సేవలోకి మళ్లిస్తాయి. శాస్త్రవిజ్ఞానమూ, కళా లాంటి యితర చైతన్య రూపాలు రాజకీయాలమీద గానీ, రాజకీయ భావజాలంమీద గానీ బొత్తిగా ఆధారపడవని భావించడం తప్పు. అవి వాస్తవంగా డబ్బుసంచియొక్క ప్రయోజనాలమీదా, పాలక వర్గపు విధానంమీదా ఆధారపడడాన్ని మూసిపెట్టడానికి ఆచరణలో ఉపయోగింపబడే భావం యిది. కానీ, రాజకీయ భావజాలమూ, రాజకీయాలూ యితర చైతన్య రూపాలను ప్రభావితం చేయడం మాత్రమే కాదు, అవే వాటిచేత ప్రభావిత మౌతాయి. ఆవిధంగా, ఉదాహరణకు, తత్వశాస్త్రమూ, నీతీ, శాస్త్రవిజ్ఞానమూ మొదలైనవి వివిధ రాజకీయాభిప్రాయాలయొక్క నిర్దిష్ట వ్యవస్థను రూపొందించడంలో యెల్లప్పుడూ గణనీయమైన ప్రభావం నెరపినాయి. కానీ, సహజంగానే, రాజకీయ భావజాలం న్యాయశాస్త్ర చైతన్యంతో అత్యంత గాఢంగా ముడిపడి వుంది.

న్యాయశాస్త్ర చైతన్యమంటే చరిత్రలో వేళ్లూనిన అభిప్రాయాల సముదాయం; అది వర్గాలు పుట్టినప్పుడు పుట్టి, మారుతున్న సామాజికార్థిక వ్యవస్థతో పాటు మారుతుంది. మనుషుల మధ్యా, రాజ్యాల మధ్యా, జాతుల మధ్యా గల సంబంధాలలో యేది న్యాయశాస్త్రబద్ధం, యేది న్యాయశాస్త్ర విరుద్ధం, యేది న్యాయం, యేది విధాయకం, యేది నిర్బంధం అనే వాటిని గురించి సమాజంలో సాధారణంగా అంగీకరింపబడిన భావాలూ, సిద్ధాంతాలూ, సూత్రాలూ దానిలో చేరుతాయి. నిర్దిష్ట సమాజంలో అమలులో వున్న న్యాయశాస్త్ర వ్యవస్థను గురించిన అంచనా కూడా దానిలో చేరుతుంది.

రాజ్యం విధించి, కాపాడే న్యాయశాస్త్ర నియమాల (శాసనాల) వ్యవస్థే చట్టం. తద్భిన్నంగా, న్యాయశాస్త్ర చైతన్యం యేది న్యాయశాస్త్రబద్ధం, యేది న్యాయశాస్త్ర విరుద్ధం అనేవాటిని గురించి మనుషులకు గల అభిప్రాయాల, భావాల సముదాయం. శత్రుత్వ పూరిత సమాజంలో రెండు న్యాయశాస్త్ర వ్యవస్థలు గానీ, ఏకైక న్యాయశాస్త్ర చైతన్యం గానీ వుండజాలవు. పాలక, దోపిడీ వర్గపు న్యాయశాస్త్ర చైతన్యం ప్రతి చారిత్రక యుగానికీ నిర్దిష్టమైన న్యాయశాస్త్రంలో రూపుధరిస్తుంది; కానీ, అమలులో వున్న న్యాయశాస్త్ర

వ్యవస్థను తమ దృక్పథంనుండి విలువకట్టే పీడిత వర్గాల న్యాయశాస్త్ర చైతన్యం ఆ న్యాయ శాస్త్రానికీ, దోపిడీ వర్గాల న్యాయశాస్త్ర చైతన్యానికీ వ్యతిరేకంగా వుంటుంది. పాలక వర్గాల న్యాయశాస్త్ర చైతన్యం అమలులో వున్న న్యాయశాస్త్ర వ్యవస్థలో రూపుధరించడమే కాక, దానిని సమర్థించడానికీ, దానికి సిద్ధాంత నిరూపణ యివ్వడానికీ, ఒకేఒక న్యాయబద్ధమైన వ్యవస్థగా దానిని మొత్తం సమాజంమీద రుద్దడానికీ కూడా వినియోగపడుతుంది. పాలక వర్గం తన యిచ్ఛను వ్యక్తం చేసే శాసనాలను పాటించాలని కోరుతుంది; దీనిని అది రాజ్య శక్తితో బలపరచడమే కాక, సమాజపు న్యాయశాస్త్ర చైతన్యానికి విజ్ఞప్తి కూడా చేస్తుంది. దాని న్యాయశాస్త్ర భావజాలం సమాజంలో పనిచేసే శాసనాల ప్రాముఖ్యాన్ని ప్రశంసించి, అత్యంత వివిధమైన తాత్విక, నైతిక, చారిత్రక, మత వాదాలను ఆసరాగా తెచ్చుకొని, వాటిని పాటించడం అవసరమని సైద్ధాంతికంగా నిరూపిస్తుంది.

పెట్టుబడిదారీ సమాజంలో బూర్జువా న్యాయశాస్త్ర చైతన్యానికి భిన్నంగా కార్మికవర్గ న్యాయశాస్త్ర చైతన్యం ఉద్భవించింది. బూర్జువా న్యాయశాస్త్ర చైతన్యం చట్టం యెదుట పౌరులందరి లాంఛనపూర్వక సమానత్వాన్ని ప్రకటించగా (యీ నామకపు సమానత్వానికి రక రకాల మినహాయింపులను సమర్థిస్తూ), కార్మికవర్గ న్యాయశాస్త్ర చైతన్యం కార్మికుల, పెట్టుబడిదార్ల ప్రత్యక్ష అసమానత్వాన్ని, తమ ఆర్థిక పరిస్థితి మూలంగా యేర్పడినదాన్ని, బట్టబయలుచేసి, బూర్జువా ప్రజాస్వామ్యం పరిమితమనీ, బూటకమనీ చూపించి, పెట్టు బడిదారీ వ్యవస్థను రద్దుచేయడానికి చేసే పోరాటం న్యాయ సమ్మతమైనదని రుజువుచేస్తుంది.

కార్మికవర్గపు న్యాయశాస్త్ర చైతన్యం సోషలిజంలో మరింత అభివృద్ధి చేయబడి, మొత్తం సమాజంయొక్క న్యాయశాస్త్ర చైతన్య మౌతుంది. సోషలిస్టు న్యాయశాస్త్ర చైతన్యం సోషలిస్టు చట్టంలో రూపుధరించి, పౌరులను సోషలిస్టు చట్టబద్ధతా తత్వంలో తర్ఫీదు చేయడానికి ఉపయోగపడుతుంది.

సోషలిజంలో న్యాయశాస్త్ర చైతన్యం పాత్ర పెరుగుతుంది; యెందుకంటే, శాసనాల పరిపూర్తి రాజ్యంయొక్క నిర్బంధకర శక్తిమీద కంటె మొత్తం ప్రజలయొక్క సోషలిస్టు న్యాయశాస్త్ర చైతన్యంమీద యెక్కువగా ఆధారపడుతుంది. ప్రజలు సోషలిస్టు రాజ్యపు శాసనాలను తమ సొంత యిచ్ఛయొక్క వ్యక్తీకరణగా పరిగణిస్తారు.

నిర్దిష్ట సామాజిక నిర్మాణరూపంయొక్క సామాజిక విషయాల వ్యవస్థ లోపల న్యాయశాస్త్ర చైతన్యపు స్థానమూ, పాత్రా ఆ సమాజంలోని న్యాయశాస్త్ర వ్యవస్థచేతా, శాంతి భద్రతలచేతా నూటిగా నిర్ణయింపబడుతాయి. పాలకవర్గాల న్యాయశాస్త్ర చైతన్యం అమలులో వున్న ఆస్తి సంబంధాలనూ, మొత్తం సామాజిక వ్యవస్థనూ సమర్థించగా, పీడిత వర్గాల న్యాయశాస్త్ర చైతన్యం ఆ సామాజిక, రాజకీయ వ్యవస్థను బలహీనపరచడానికి తోడ్ప

డుతుంది. ఉత్పత్తి సంబంధాలద్వారా న్యాయశాస్త్ర చైతన్యం కూడా ఉత్పత్తి అభివృద్ధిని ప్రభావితం చేస్తుంది. న్యాయశాస్త్ర చైతన్యం కాలం తీరిన ఉత్పత్తి సంబంధాలను కాపాడే చోట అది ఉత్పాదక శక్తుల అభివృద్ధికి గుదిబండగా పనిచేస్తుంది; అది కాలం తీరిన ఉత్పత్తి సంబంధాలకు వ్యతిరేకంగా ముందుకు వచ్చి, ఉత్పాదక శక్తులకు అనుగుణమైన సంబంధాలను దృఢపరచడానికి తోడ్పడిన చోట అది ఉత్పత్తి అభివృద్ధిని పెంచుతుంది.

న్యాయశాస్త్ర చైతన్యం రాజకీయ భావజాలం కంటె భిన్నమైన చైతన్య రూప మైన ప్పటికీ, దానికి రాజకీయ సారం వుంది; యెందుకంటే, అది వర్గాల మధ్య గల నిర్దిష్ట సంబంధంయొక్క ప్రాతిపదికమీద, అనగా రాజకీయ ప్రాతిపదికమీద, ఉత్పన్న మౌతుంది. అదే సమయంలో, న్యాయశాస్త్ర చైతన్యం రాజ్య శాసనాలలో రూపుధరించి, రాజ్య విధానంగా పనిచేస్తుంది. యీ సందర్భంలో జ్ఞాపకం పెట్టుకోవలసింది యేమిటంటే, విధానం అనేది న్యాయశాస్త్ర నియమాలను చేయడంలో మాత్రమే కాక, వాటిని అమలు పరచడంలో కూడా వ్యక్తమౌతుంది; యిది కూడా రాజకీయ చైతన్యానికీ, న్యాయశాస్త్ర చైతన్యానికీ మధ్య సంబంధాన్ని నిర్ణయిస్తుంది.

సకల సామాజిక అభిప్రాయాలనూ, సిద్ధాంతాలనూ చూసినట్లే, న్యాయశాస్త్ర చైతన్యాన్ని చరిత్రాత్మకంగా దాని ప్రత్యక్ష గమనంలో చూడాలి. యేదైనా ఒక వర్గం పతన మైనప్పుడు దాని న్యాయశాస్త్ర చైతన్యం తన శక్తిని కోల్పోతుంది, నూతన వర్గపు విజ యంతో నూతన న్యాయశాస్త్ర చైతన్యం నెలకొల్పబడుతుంది. కానీ, అంతే కాదు. వాటి అభివృద్ధిలో న్యాయశాస్త్ర అభిప్రాయాల, సిద్ధాంతాల, సూత్రాల పరిశీలన తెలిపే దేమిటంటే, అవి ప్రతి సందర్భంలోనూ నిర్దిష్ట వర్గాల దృక్పథంనుండి తమ కాలాన్నీ, ఆర్థిక వ్యవస్థనూ ప్రతిబింబిస్తూ, అదే సమయంలో నిజమైన సామాజిక సంబంధాలను గురించీ, వాటి చారిత్రక అభివృద్ధిని గురించీ వస్తుగత జ్ఞానపు అంశాలను వివిధ ప్రమాణాలలో కూడా కలిగి వుంటాయి. అందువల్లనే, ప్రజ్ఞానంయొక్క నిశ్చితమైన అనుస్యూతిని నిస్సందేహం చేస్తాయి. వివిధ రకాల న్యాయశాస్త్ర సంబంధాలను గుర్తుపట్టడమూ, న్యాయశాస్త్ర ధాతువులనూ, న్యాయ శాస్త్రపు కార్యనిర్వహణ విధానానికి చెందిన సూత్రాలనూ రూపొందించడమూ అనేవాటికే ప్రజ్ఞానపు ప్రాముఖ్యం వుంది.

న్యాయశాస్త్ర చైతన్య పురోగతి, అంతకంతకూ యెక్కువగా అభివృద్ధి చెందిన న్యాయ శాస్త్ర రూపాలలోనూ, న్యాయశాస్త్రపు కార్యనిర్వహణ విధానంలోనూ వ్యక్తం చేయబడి, రూపు ధరించినట్టిది, మనుషుల మధ్య శాసన నియంత్రణకు లోబడే నిజమైన సంబంధాల జ్ఞానాన్ని వినియోగించుకోవడంతో నిస్సందేహంగా కొంతవరకు ముడిపడి వుంది. ఆ జ్ఞానం న్యాయశాస్త్ర అభిప్రాయాల, న్యాయశాస్త్ర ఆచరణల అభివృద్ధిలో ప్రోగువడింది. చరిత్రకు

తెలిసిన సకల వర్గాల న్యాయశాస్త్ర చైతన్యం కంటె భిన్నమై, శాస్త్రీయ దృక్పథంమీద ఆధారపడిన సోషలిస్టు న్యాయశాస్త్ర చైతన్యం కూడా మునుపటి న్యాయశాస్త్ర చైతన్యాన్ని పూర్తిగా త్రోసిపుచ్చదు. అది మునుపటి చరిత్రయొక్క అత్యుత్తమ లాభాలను, ప్రజాతంత్ర న్యాయశాస్త్ర చైతన్యంయొక్క అంశాలను వినియోగించుకొని, వాటిని కార్మికవర్గ పోరాటపు అనుభవంతో సంపన్నం చేస్తుంది.

ఉదాహరణకు, లెనిన్ తన "రాజ్యమూ, విప్లవమూ" అనే గ్రంథంలో యిలా చెప్పినాడు: సోషలిస్టు రాజ్యంలో బూర్జువావర్గం లేకుండా బూర్జువా న్యాయశాస్త్రపు అంశాలు — అసమాన వ్యక్తులకు సమాన ప్రమాణం వర్తింపజేయబడుతుందనే అర్థంలో — నిలిచి వుంటాయి. ఆయన ఉద్దేశించింది యేమిటంటే, సోషలిజంలో అనుభోగ వస్తువుల సమృద్ధి యింకా సృష్టింపబడలేదనీ, అందువలన వాటి పంపకంలో అనుభోగ ప్రమాణం శ్రమ రేటును బట్టి నియంత్రించబడవలసి వుందనీ. సోషలిజంలో మనుషులు సమానమైన పనికి సమానమైన వేతనం పొందుతారు. కానీ, వాళ్ల పేరుకు సమానంగా వున్నప్పటికీ, వాస్తవంలో అసమానంగా వుండవచ్చు — ఒక అవివాహితుడూ, ఒక బహు కుటుంబీకుడూ వున్నట్లు. ఆవిధంగా, సోషలిజంలో సామాజిక ఆస్తి ఉత్పత్తి సాధనాల విషయంలో మనుషు లందరికీ సమాన ప్రతిపత్తికి ప్రాతిపదికను సమకూరుస్తుంది, యెవడూ యితరుల శ్రమను దోపిడీ చేయడంద్వారా బతకజాలడు. కానీ, సోషలిజం పంపకంలో సమానత్వాన్ని సమకూర్చదు, సమకూర్చజాలదు, అందువల్ల యీ రంగంలో నామకపు సమానత్వపు అంశాలు నిలిచివుంటాయి.

కార్మికవర్గ విప్లవం దోపిడీ న్యాయశాస్త్ర వ్యవస్థయొక్క విచ్ఛిత్తికి దారితీస్తుంది, దాని స్థానంలో కొత్త సోషలిస్టు చట్టబద్ధతా, విప్లవాత్మక శాసనావళీ, సువ్యవస్థా వస్తాయి. అందువల్లనే, పరివర్తన దశలోనూ, సోషలిస్టు యుగంలోనూ న్యాయశాస్త్ర చైతన్యంయొక్క పాత్ర తగ్గదు, కానీ గుణాత్మకంగా భిన్న మౌతుంది అని నొక్కిచెప్పవలసిన అవసరముంది.

సమాజంమీద రాజ్య దర్శకత్వాన్ని నిర్వహించే కార్మికవర్గానికి శాసనావళి అవసరమనీ, యెందుకంటే "యిచ్ఛ అనేది రాజ్యంయొక్క యిచ్ఛగా వుండాలంటే, అది రాజ్యంచేత నెలకొల్పబడిన శాసనంగా వుండాలనీ, లేకపోతే 'యిచ్ఛ' అనే మాట వుత్త ధ్వని,"* అనీ లెనిన్ నొక్కిచెప్పినాడు.

సోషలిస్టు శాసనావళి మూర్తీభవించిన కార్మికవర్గ న్యాయశాస్త్ర చైతన్యం, అది విప్లవ గతిలోనూ, తదనంతరం సోషలిజం కొరకు కార్మికవర్గ పార్టీ నాయకత్వంకింద జనాలయొక్క ఆచరణాత్మక రాజకీయ కార్యకలాపాల ప్రాతిపదికమీద — చేసే పోరాటపు గతిలోనూ విస్తృ

---

*V. I. Lenin, *Collected Works*, Vol. 25, పుట 90.

తంగా అభివృద్ధి చెందుతుంది. పార్టీయొక్క నాయక పాత్ర సోవియట్ యూనియన్ రాజ్యాంగంలోని 6వ నిబంధనలో శాసనబద్ధమైంది.

సోషలిస్టు న్యాయశాస్త్ర చైతన్యం మనుషుల చర్యలను సోషలిస్టు చట్టబద్ధత దృష్ట్యా అంచనా వేస్తుంది. సోవియట్ శాసనాల శక్తి జనాలు వాటికి యిచ్చే అండదండలలో వుంది. అందువల్లనే, పౌరు లందరినీ సోషలిస్టు న్యాయశాస్త్ర చైతన్య తత్వంలో పెంచడం సోషలిస్టు సమాజాన్ని పటిష్ఠపరచడానికీ, అభివృద్ధి చేయడానికీ ఒక ముఖ్యమైన సాధనం.

కానీ, చరిత్రయొక్క అనుభవం, ముఖ్యంగా సోవియట్ యూనియన్‌లోని చరిత్రాత్మక ప్రాముఖ్యం గల నూతన సమాజ నిర్మాణ అనుభవం, తెలిపే దేమంటే, న్యాయశాస్త్ర చైతన్యంచేతా, శాసనావళిచేతా మానవ సంబంధాలను నియంత్రించడం యెంత ముఖ్యమైనప్పటికీ, యిది యింకా అరకొరగా వున్న నియంత్రణ యంత్రాంగమే. యిది యింకా మానవునికి బాహ్యమైనదిగా, సమాజంచేతా, రాజ్యంచేతా మానవునిమీద రుద్దబడినదిగా పని చేస్తుంది. అందువల్లనే నీతి అనేది, సామాజిక చైతన్యంయొక్క ఒక విశిష్ట రూపం, చరిత్ర అంతటా మానవ సంబంధాలమీద విలక్షణమైన నియంత్రణకర్తగా పనిచేసింది; కమ్యూనిజంవైపు జరిగే పురోగతితో దానికి యెప్పుడూ లేనంత ప్రాముఖ్యం యేర్పడింది.

నీతి అనేది నిర్దిష్టమైన సామాజిక చైతన్య రూపం, మానవుల మధ్య గల సంబంధాలను మంచి, చెడ్డ, న్యాయం, అన్యాయం, నిజాయితీ, బేనిజాయితీ, మొదలైన ధాతువులలో ప్రతిబింబించేది, సమాజంయొక్క, లేదా వర్గంయొక్క అవసరాలను మానవునిమీద అతని నిత్య జీవితంలో నైతిక ఆదర్శాల, సూత్రాల, ప్రవర్తన నియమ, నిబంధనల రూపంలో నిర్ణయించేది. యీ వస్తుగత అవసరాలు నైతిక చైతన్యంలో యితర మానవులపట్లా, కుటుంబంపట్లా, సొంత వర్గంపట్లా, యితర వర్గాలపట్లా, తన దేశంపట్లా, రాజ్యంపట్లా, వగైరాలపట్ల నైతిక విధులుగా ప్రతిబింబిత మౌతాయి. యీ విధుల నైతిక రూపంలోని ఒక విశిష్ట లక్షణం యేమిటంటే, అవి వెంటనే బయటనుండి రుద్దబడినవిగా కనిపించక, మనిషియొక్క అంతర్గత విశ్వాసాలనుండి ఉద్భవించినట్లు కనపడుతాయి. కానీ, నైతిక చైతన్యం, లేదా భావం నిసర్గమైనదని కాదు. విద్య మూలంగా, సామాజిక సంప్రదాయాలనూ, ఆచారాలనూ, అలవాట్లనూ జీర్ణం చేసుకోవడం మూలంగా నైతిక నియమాలు మానవుని "అంతర్గత విశ్వాసాలు" అవుతాయి. నైతిక చైతన్యం ప్రకారమూ, వ్యక్తియొక్క విశ్వాసాల ప్రకారమూ వ్యవహరించడానికి అంతర్గత ప్రేరణగా అంతరాత్మ ఉద్భవిస్తుంది.

కనుక, సమాజంయొక్క నైతిక చైతన్యం వ్యక్తి చర్యలయొక్క సామాజిక అంచనాగా, అనగా వాటి సామాజిక ప్రాముఖ్యంయొక్క అంచనాగా ప్రత్యక్ష మౌతుంది. అది వ్యక్తిచేత అంగీకరింపబడి, అతని చర్యలయొక్క ఆంతరంగిక అంచనాగా, అతను తనమీద తాను చేసు

కొనే డిమాండుగా వెల్లడౌతుంది. అందువల్లనే, అంతరాత్మ అనేది మానవుని సామాజిక స్వభావపు వ్యక్తీకరణ తప్ప మరేమీ కాదు.

నైతిక అంశం మానవ కార్యాచరణలో ముఖ్యమైన పాత్ర నిర్వహిస్తుంది. కార్యాచరణ నిస్సంశయంగా ఆ నాటి సామాజిక పరిస్థితులచేత నిర్ణయింపబడుతుంది. కానీ, మానవుడు చైతన్యం గలవాడు గనుక, నిర్దిష్ట పరిస్థితులలో యేవిధంగానైనా వ్యవహరించే స్వేచ్ఛ వుంది అతనికి; తన ప్రవర్తన రీతిని యెన్నుకోవడంలో ఆత్మగత అంశం, మానవుని వ్యక్తిత్వం, గొప్ప పాత్ర నిర్వహిస్తుంది. మానవునికి సాపేక్షంగా యిచ్ఛా స్వాతంత్ర్యమూ, వరణ స్వాతంత్ర్యమూ వున్నాయి, తన పరిస్థితులచేత నిర్ణీతమైన చట్రం లోపల అతను యేవిధంగానైనా వ్యవహరించవచ్చు, మంచికైనా, చెడ్డకైనా. యీ విషయంమీద లెనిన్ యిలా రాసినాడు: "మానవ చర్యలు అవశ్యంగా జరిగేవని సూత్రీకరిస్తూ, యిచ్ఛా స్వాతంత్ర్యం గురించిన వుక్కిటి పురాణాన్ని నిరాకరించే నిర్ణాయకవాద భావం మానవుని వివేకాన్ని గానీ, అంతరాత్మను గానీ, అతని చర్యల అంచనాను గానీ యేవిధంగానూ ధ్వంసం చేయదు. తద్వ్యతిరేకంగా, నిర్ణాయకవాద దృక్పథమే యిష్టం వచ్చిన ప్రతిదాన్నీ యిచ్ఛా స్వాతంత్ర్యానికి అంటగట్టే బదులు, కచ్చితమైన, సరైన అంచనాను సాధ్యం చేస్తుంది."*

వ్యక్తిమీద నిర్దిష్ట నైతిక ప్రమాణాలను మోపే సమాజం, లేదా వర్గం ప్రజాభిప్రాయ శక్తితో వీటిని బలపరుస్తుంది. న్యాయశాస్త్రానికి భిన్నంగా, నీతియొక్క ఒక విశిష్ట లక్షణం యేమిటంటే, దాని సూత్రాలూ, నియమాలూ సాధారణంగా అలిఖితమైనవి, సామాజిక నీతులకు కావలి కాసే ప్రత్యేక సంస్థలు యేవీ వుండవు. నీతి నియమాలను భంగపరచేవాళ్లు ప్రజాభిప్రాయంచేత అభిశంసింపబడుతారు. ఆ అభిశంసనయొక్క బలం నైతిక అంచనాయొక్క ప్రాముఖ్యంమీద మాత్రమే కాక, సాధారణంగా దానివెంట నిర్దిష్ట చర్య వుంటుందన్న విషయంమీద కూడా ఆధారపడుతుంది. గణ వ్యవస్థలో గురుతరమైన నీతి భంగం చేసిన వానిని గణంనుండి బహిష్కరించేవాళ్లు. మర్యాద భంగం చేసిన ప్రభువును తోటి ప్రభువులు అభిశంసించడం మాత్రమే కాక, వాస్తవంగా సంఘ బహిష్కరణ చేసేవాళ్లు, యిలాగే.

యీవిధంగా, సమాజం నీతిని ఉత్పత్తి చేస్తుంది, దానిని సమర్థిస్తుంది. నీతిని గురించిన చారిత్రక భౌతికవాదపు స్థావరాన్ని నీతిని గురించిన మత, భావవాద సిద్ధాంతాలనుండి వేరు చేయడానికి యీ శాస్త్రీయ సూత్రం తోడ్పడుతుంది. నీతి దైవ సృష్టి అనీ, భగవంతుని యిచ్ఛను వ్యక్తం చేస్తుందనీ మతం అంటుంది; దాని ప్రకారం నీతికి కట్టుబడడం మాన

---

*V. I. Lenin, *Collected Works*, Vol. 1, పుట 159.

వుని విధ్యుక్త ధర్మం; కట్టుబడకపోతే భగవంతుడు శిక్షిస్తాడు. మతమూ, దైవ భీతీ లేకుండా నీతి వుండజాలదనీ, మతాన్ని వ్యతిరేకించేవాళ్లు నీతియొక్క ప్రాతిపదికనూ, మూలాన్నీ ధ్వంసం చేస్తారనీ నమ్మండని మనుషులను మతం ప్రోద్బలం చేస్తుంది.

భావవాద నీతిశాస్త్రం నీతిని మానవ, లేదా మానవాతీత చైతన్యంనుండి లాగుతుంది. సారభూతంగా నీతియొక్క మత నిరూపణను తాత్విక రూపంలో పునశ్చరణ చేస్తుంది. ఉదాహరణకు కాంట్, నైతిక భావాలను మానవుల భౌతిక జీవితంనుండి ఉద్భవిస్తున్నట్లు చూడకూడదని చెప్పినాడు. అజ్ఞేయమైన అతీత ప్రపంచం మానవ వివేకంమీద నీతిని విధించిందనీ, ఆ ప్రపంచాన్ని విశ్వాసంతో ఊహించుకోవాలనీ అతను అన్నాడు. మానవుని యిచ్ఛ అతీత ప్రపంచపు అవసరాలను వ్యక్తం చేసే నిత్య, నిశ్చల, విశ్వ నైతిక నియమంచేత నిర్ణయింపబడినప్పుడు మాత్రమే అతను నైతికంగా వ్యవహరిస్తాడని కాంట్ అభిప్రాయం.

నీతియొక్క మత నిరూపణతో పోరాటం మార్క్సుకంటె చాలా ముందు ప్రారంభమైంది. నీతికి మూలం దైవ భీతి గానీ, అతీత ప్రపంచం గానీ కాదనీ, అది మానవుడే, మానవుని సొంత భౌతిక స్వభావమే అనీ ఎపిక్యూరస్, లుక్రేషియస్, స్పినోజా, హోల్బాచ్, ఫొయెర్‌బాఖ్, చెర్నిషేవ్‌స్కీ, తదితర అనేక భౌతికవాదులూ వాదించినారు. ఆస్తికుల సమాజంకంటె నాస్తికుల సమాజం నీతివంతంగా వుంటుందని వాళ్లు అన్నారు. కానీ, యీ తాత్వికులు యీ రంగంలో చాలా కృషి చేసినప్పటికీ, నీతియొక్క సామాజిక మూలాలను ఆవిష్కరించడం గానీ, నీతిశాస్త్రంలో భావవాదాన్ని అధిగమించడం గానీ వీళ్లకు చేతకాలేదు.

నీతి అనేది సమాజంమీద బయటనుండి విధించబడినది గానీ, "మానవుని చరిత్రాతీత స్వభావం"నుండి ఉత్పన్నమైనది గానీ కాదని రుజువుచేసింది మార్క్సిజం. సమాజమూ, సామాజిక ప్రయోజనాలూ నీతికి మూలమని మార్క్సిజం స్థిరపరచింది. సమాజ నిర్మాణమూ, దాని ప్రయోజనాలూ ఆర్థిక వ్యవస్థచేత, ప్రాతిపదికచేత, నిర్ణయింపబడుతాయి గనుక, నీతి అంతిమంగా ఆర్థిక వ్యవస్థచేత నిర్ణయింపబడుతుంది. నీతి మూలం గురించిన స్థిరమైన భౌతికవాద దృక్పథం విధిగా యీ మరొక ముఖ్యమైన నిర్ధారణకు దారితీస్తుంది: సమాజాభివృద్ధితో, దాని ఆర్థిక నిర్మాణంలో వచ్చే మార్పులతో, నీతిలో కూడా అనివార్యమైన మార్పులు జరుగుతాయి. నీతి చారిత్రకమైనది, నిర్దిష్టమైనది. అభౌతికమైన, నిశ్చలమైన, శాశ్వతమైన, చరిత్రాతీతమైన నీతి యేదీ లేదు. వర్గ సమాజంలో నీతికి వర్గ స్వభావం వుంటుంది, పాలకవర్గపు నీతి యెల్లప్పుడూ ప్రాబల్యపు నీతిగా వుంటుంది. కానీ, సమాజం పురోగమించేకొద్దీ, కొన్ని ప్రాథమిక ప్రవర్తన నియమాలు రూపొందించబడి, వివిధ జాతుల, వర్గాల నైతిక నియమావళులలో చేర్చబడుతాయి. యీ నియమాలు నిర్దిష్ట వర్గంయొక్క విశిష్ట ప్రయోజనాన్ని గానీ, స్థితిని గానీ వ్యక్తం చేయవు, వివిధ మానవ సంఘాల సాధారణ

నైతిక అంశాలను వ్యక్తం చేస్తాయి. అలాంటి అంశాలకు కారణం యేమిటంటే, యే మానవ సంఘానికైనా జంతువుల మంద కంటె భిన్నమైన సాధారణ లక్షణాలు వుండడం. యివి మానవ సంబంధాలలోని సాంస్కృతిక లక్షణాలు. వీటిని లెనిన్ సామాజిక జీవితపు ప్రాథమిక పరిస్థితు లన్నాడు. కానీ, సార్వత్రిక మానవ నీతిలోని యీ అంశాలను చరిత్రాతీతమైనవిగా చూడకూడదు; యెందుకంటే, యివి కూడా చారిత్రక అభివృద్ధియొక్క ఉత్పాదితాలే.

నైతిక చైతన్యం సామాజిక ఉత్పాదితం. నీతి యధార్థంలో నిర్దిష్ట చారిత్రక పరిస్థితులలో నిర్దిష్ట నీతిగా వున్నప్పటికీ, దానిని మొత్తంగా, ఒక విశిష్ట సామాజిక విషయంగా పరీక్షించడం సాధ్యమయ్యేది ఆ ప్రాతిపదికమీదనే.

నైతిక నియమాలూ, సూత్రాలూ శాశ్వతమైనవీ, మార్పు చెందనివీ అనే భావాన్ని మార్క్సిస్టు లెనినిస్టులు త్రోసిపుచ్చుతారు; కానీ వాళ్లు ఆవలి కొస అయిన నైతిక సాపేక్ష వాదాన్ని – మానవ ప్రవర్తనను అంచనా వేయడంలో ఆత్మగతతత్వాన్నీ, యిష్టారాజ్యపు వైఖరులనూ బోధిస్తూ, నీతికీ, అవినీతికీ మధ్య యే భేదమూ లేదనే వాదాన్ని – కూడా త్రోసిపుచ్చుతారు. నైతిక సాపేక్షవాదం నైతిక అంచనాల సాపేక్ష స్వభావంతో జూదమాడుతుంది, నైతిక నియమాలు వాస్తవంలో మారుతూ వున్న విషయాన్ని పరమమైనదిగా పరిగణించి, మానవ చర్యలకు వస్తుగతమైన గీటురాళ్లు లేవనేదాకా పోతుంది.

మార్క్సిస్టు నీతిశాస్త్రం నైతిక నియమాలు మారుతూవుండడాన్ని అవి మారుతున్న చారిత్రక పరిస్థితులమీద ఆధారపడుతాయనడానికి సాక్ష్యంగా పరిగణిస్తుంది. అందువల్లనే, నీతిపట్లా, భిన్న యుగాలలో, భిన్న వర్గాల మానవుల ప్రవర్తనను గురించిన నైతిక అంచనాపట్లా నిర్దిష్ట చారిత్రక దృష్టి ఉండాలని మార్క్సిజం కోరుతుంది.

ఆర్థిక సంబంధాలను ప్రతిబింబించే సామాజిక చైతన్య రూపంగా నీతి భావజాలంగా వుంది, అనగా ప్రాతిపదికచేత ఉత్పత్తి చేయబడి, దాని అవసరాలను తీర్చే ఉపరినిర్మాణంలో ఒక అంశంగా వుంది. అదే సమయంలో నైతిక చైతన్యం సామాజిక సంబంధాల ఒక ప్రజ్ఞాన రూపం. నీతి మానవ సంబంధాల అనుభవాన్ని క్రోడీకరించి, సాధారణీకరిస్తుంది, దానిని నిర్దిష్ట ప్రవర్తన నియమాల, ప్రమాణాల రూపంలో వ్యక్తం చేస్తుంది. నీతిలో వస్తుగతంగా సత్యమైన ప్రజ్ఞానపు అంశం వుంది. చరిత్ర నిర్మాతలైన జనాలు దేనికి వాహనాలుగా వున్నారో ఆ నీతియొక్క యీ వస్తుగతంగా సత్యమైన సారమే నీతియొక్క చారిత్రక అభివృద్ధి గతిలో గ్రహించబడి, నిలిపి వుంచబడేది. అంతే కాక, నీతియొక్క ప్రజ్ఞాన పార్శ్వం నిర్దిష్ట చారిత్రక పరిస్థితులలో, నిర్దిష్ట మానవ సంఘపు జీవితానుభవాన్ని ప్రోగుచేయడానికీ, నమోదు చేయడానికీ తోడ్పడుతుంది.

వాస్తవికతకు ప్రతిబింబ రూపాలుగా రాజకీయ, న్యాయశాస్త్ర, నైతిక చైతన్యాలు

వాస్తవికతను గురించి నిశ్చితమైన జ్ఞానాన్ని మనకు యిస్తాయి. కానీ, అవి సమాజానికి జ్ఞానాన్ని సమకూర్చేటందుకు ఉద్భవించవని మనకు తెలుస్తుంది. వాటికి భిన్న సామాజిక క్రియ వుంది, మానవ సంబంధాలను నియంత్రించే క్రియ. సామాజిక అభివృద్ధి గతిలో జ్ఞాన సంచయనంలో ప్రధాన పాత్ర నిర్వహించేది శాస్త్రవిజ్ఞానం అనే ప్రత్యేక సామాజిక చైతన్య రూపం.

శాస్త్రవిజ్ఞానం వాస్తవికతయొక్క క్రమపద్ధతిగల ప్రజ్ఞాన రూపం, సామాజిక చారిత్రక ఆచరణ ప్రాతిపదికమీద ఉత్పన్నమై, అభివృద్ధి చెందేది, భావాలూ, ధాతువులూ, నియమాలూ అనే అభౌతిక తార్కిక రూపాలలో వస్తుగత ప్రపంచపు నియమాలనూ, ముఖ్య పార్శ్వాలనూ ప్రతిబింబించేది. కానీ, శాస్త్రవిజ్ఞానం అనుభవంద్వారా గ్రహించబడి, రుజువు చేయబడిన జ్ఞానం మాత్రమే కాదు. అది కొత్త జ్ఞానాన్ని సంపాయించే లక్ష్యం గల కార్యాచరణ కూడా. అందువల్లనే దానిలో ప్రయోగాల రంగమూ, కచ్చితమైన పరికరాలూ, యంత్రాలూ, మొదలైన వివిధ జ్ఞానార్జన సాధనాలూ, ప్రయోగాలకు సంబంధించిన కార్యాచరణా, శాస్త్రీయ ఆచరణా చేరుతాయి. శాస్త్రవిజ్ఞానంలో మన కెప్పుడూ ఊహాలూ, అధ్యయనం చేయబడే విషయాల సారాంశం గురించిన సిద్ధాంతాలూ వుంటాయి; నిత్యం కొత్త విజయాలనూ, ఆవిష్కరణలనూ ఉత్పత్తిచేసే ఉడుకుతున్న పొర లాంటిది అది. అందువల్లనే శాస్త్రవిజ్ఞానం బహుముఖమైన, సంకీర్ణమైన సామాజిక విషయం. యీ నాడు అది సామాజిక జీవితంలో ఒక మొత్తం రంగం, యెంతోమంది మనుషులు పనిచేసే విశిష్ట కార్యాచరణ రూపం. శాస్త్రవిజ్ఞానాన్ని ఒక సామాజిక చైతన్య రూపంగా చర్చించే టప్పుడు, మనం దాని పార్శ్వాలలో ఒకదానిని మాత్రమే పరిగణిస్తాం, అది అత్యంత ముఖ్యమైన దైనప్పటికీ; యేదంటే, శాస్త్రవిజ్ఞానం సామాజిక మానవుని చైతన్యంలో వాస్తవికత ప్రతిబింబంయొక్క ఒక రూపం, దాని క్రమపద్ధతి గల ప్రజ్ఞానంయొక్క ఒక రూపం అనే పార్శ్వం.

ప్రపంచమూ, మానవుడూ శాస్త్రీయ ప్రజ్ఞానపు సార్వత్రిక విషయం అవుతాయి. ప్రపంచ వైవిధ్యం నిర్దిష్ట శాస్త్రాల వైవిధ్యానికి, శాస్త్రవిజ్ఞానంలోని శాఖలకు, కారణం. కానీ, అవి ఉద్భవించి, అభివృద్ధి చెందడానికి తక్షణ ప్రాతిపదిక ప్రపంచం కాదు, మానవుని చేత అది మారే క్రమం (ఆచరణ). విజ్ఞాన శాస్త్రాలు ఆచరణయొక్క ప్రాతిపదికమీద ఉద్భవించి, దాని అవసరాలు తీర్చడానికీ, దానిని మెరుగుపరచడానికీ, అభివృద్ధిని పెంపొందించ డానికీ ఉద్దేశింపబడుతాయి. అచ్చమైన శాస్త్రవిజ్ఞానం యెల్లప్పుడూ ఆచరణతో ముడి పడి వుంటుంది. కానీ ఆ లంకెను మితిమీరి సరళీకరింపకూడదు. అసలు విషయం యేమి టంటే, శాస్త్రవిజ్ఞానం ఉత్పత్తికి సంబంధించి సాపేక్షంగా స్వతంత్రమైనది, దాని అభి

వృద్ధిలో దానికి దాని సొంత అంతర్గత తర్కం వుంది. అందువల్లనే, అనేక గొప్ప శాస్త్రీయ ఆవిష్కరణలు (అణు భౌతికశాస్త్ర ఆవిష్కరణల లాంటివి) ఉత్పత్తియొక్క అభివృద్ధిచేత సాధ్యం చేయబడినప్పటికీ, వాస్తవంలో దాని తక్షణ అవసరాలతో సంబంధం లేకుండానే అవి చేయబడినాయి. తరువాత మాత్రమే మనుషులు వాటిని ఆచరణలో ఉపయోగించుకొనే మార్గాలు కనుక్కున్నారు. జ్ఞానంలో ప్రతి కొత్త పురోగమనమూ కొత్త సమస్యలను లేవ నెత్తుతుంది; శాస్త్రవిజ్ఞానం వాటిని పరిష్కరించడానికి పూనుకోవాలి. దీని అర్థం కూడా శాస్త్రవిజ్ఞానంలో కచ్చితమైన అనుస్యూతి వుందని; తత్ఫలితంగా, మానవుడు సంపాయించిన వస్తుగత జ్ఞానం సమాజానికి చెందుతుంది, సమాజం దానిని త్రోసిపుచ్చకుండా, శాస్త్ర జ్ఞానపు యితోధిక పురోగతి కొరకు ఆచరణలో ఉపయోగించుకుంటుంది.

ఉత్పత్తి సంవిధానాలను అభివృద్ధి చేయడంలోనూ, సోషలిస్టు మార్గం చేపట్టిన దేశాలలో సామాజిక మార్పుకు చెందిన రంగంలోనూ మానవజాతి సాధించిన అపారమైన పురోగతి శాస్త్రవిజ్ఞానపు పురోగతినుండి విడదీయరానిది. శాస్త్రవిజ్ఞానం మన కాలంలో, మహత్తర శాస్త్ర, సాంకేతిక విప్లవానికి చెందిన యీ యుగంలో, సామాజిక అభివృద్ధికి బ్రహ్మాండమైన శక్తి అయింది. ఆధునిక శాస్త్రవిజ్ఞానానికి సామాజిక అభివృద్ధిలో ప్రచండ మైన, స్థిరంగా పెరుగుతున్న పాత్ర వుంది. యీ నాడు ప్రజలలో విస్తారమైన విభాగాలు ప్రత్యేకమైన శాస్త్ర సమస్యలలో ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రకృతి శాస్త్రాలను అభివృద్ధి చేయడానికి చేతితో తయారైన పరికరాలు గల ప్రయోగశాలలు యిక యెంత మాత్రమూ చాలవు. ఆ పనికి విశాలమైన పారిశ్రామిక ప్రాతిపదికా, బహుళ సంఖ్యలో సిబ్బందీ, కోట్ల ప్రమాణంలో డబ్బూ అవసరం. శాస్త్రవిజ్ఞానం ప్రతి జీవిత రంగంలోకీ శక్తివంతంగా చొరబడుతూ, అభివృద్ధి వేగాన్ని పెంచుతున్నది, మానవాళియొక్క పాదార్థిక, ఆత్మిక పురోగతికి అపూర్వమైన కొత్త అవకాశాలను సృష్టిస్తున్నది.

సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీయొక్క 24వ మహాసభలో మాట్లా డుతూ, బ్రెజ్నెవ్ యిలా అన్నాడు: "...ఉత్పాదక శక్తుల అభివృద్ధిలో జరిగే విప్లవం, శాస్త్ర విజ్ఞానంచేతా, దాని ఆవిష్కరణలచేతా ప్రారంభించబడినట్టిది, భవిష్యత్తులో అంతకంతకూ ముఖ్యమూ, ప్రగాఢమూ అవుతుంది. మనకు యెదురైన కర్తవ్యం చారిత్రక ప్రాముఖ్యం కలది: శాస్త్ర, సాంకేతిక విప్లవ విజయాలను సోషలిస్టు ఆర్థిక వ్యవస్థయొక్క సౌకర్యాలతో సజీవంగా మేళవించడం, శాస్త్రవిజ్ఞానాన్ని ఉత్పత్తితో మేళవించే మన సొంత, నిసర్గ సోష లిస్టు రూపాలను మరింత విస్తృతంగా వికసింపజేయడం."*

---

* *24th Congress of the CPSU*, పుట 69.

కానీ, ఆధునిక శాస్త్రవిజ్ఞానవు మహత్తర విజయాలను ప్రజానీకాలకు హానికరంగానూ, మానవుడు సృష్టించిన పాదార్థిక విలువల విధ్వంసానికీ, మానవులనే సామూహికంగా విర్మూలించడానికీ ఉపయోగించజూసే ప్రగతి వ్యతిరేకతకు చెందిన దుష్ట శక్తులు కూడా ప్రపంచంలో వున్నాయి. శాస్త్రవిజ్ఞానవు విజయాల వినియోగం సమాజానికీ, మానవాళి భవిష్యత్తుకూ ప్రాణప్రదమైన ప్రాముఖ్యం వహించే సమస్య. సోషలిజం కొరకు చేసే పోరాటం శాస్త్రవిజ్ఞానం కొరకు చేసే పోరాటం కూడా, మానవ ప్రజ్ఞ సృష్టించిన మహత్తర విజయాలు దౌష్ట్య కారణాలు కాకుండా నివారించడానికీ, అవి మానవ ఉపకారం కొరకూ, ప్రగతి కొరకూ, మానవాళి సౌభాగ్యం కొరకూ ఉపయోగించబడేటట్లు చేయడానికీ చేసే పోరాటం కూడా.

మనసులో పెట్టుకోవలసింది యేమిటంటే, ఉత్పత్తిని అదుపులో పెట్టుకొన్న బూర్జువా వర్గానికి శాస్త్రవిజ్ఞానం అవసరం గనుక, అది ప్రకృతి, సాంకేతిక శాస్త్రాల పురోగతికి కావలసిన పరిస్థితులను సృష్టిస్తుంది. కానీ అది శాస్త్రవిజ్ఞానాన్ని గుత్తగొనడానికీ, దానిని లాభార్జన పరికరంగా, దోపిడీ సాధనంగా చేయడానికీ ప్రయత్నిస్తుంది. పెట్టుబడిదారీ దేశాలలో శాస్త్రవిజ్ఞానవు సైనికీకరణ, మనుషులనూ, పాదార్థిక విలువలనూ ధ్వంసం చేసే శక్తివంతమైన సాధనాలను ఉత్పత్తి చేయడానికి దానిని ఉపయోగించడమూ స్వభావతః సృజనాత్మక శక్తి అయిన శాస్త్రవిజ్ఞానాన్ని పూర్తిగా వికృతంగా ఉపయోగించడమే. యీ నేరం పెట్టుబడిదారీ వ్యవస్థమీద పడుతుంది.

సోషలిస్టు దేశాలలో శాస్త్రవిజ్ఞానవు అభివృద్ధికి గల సామాజిక పరిస్థితులు మౌలికంగా భిన్నమైనవి. ఆర్థిక వ్యవస్థయొక్క ప్రణాళికాబద్ధమైన సత్వర అభివృద్ధీ, మొత్తం దేశ ప్రమాణంలో శాస్త్రవిజ్ఞానవు అభివృద్ధిని సమన్వయపరచడమూ, పథకీకరించడమూ, శాస్త్రీయ భౌతికవాద దృక్పథంయొక్క ప్రాబల్యమూ — యివన్నీ సోషలిజంలో శాస్త్రవిజ్ఞానవు సత్వర అభివృద్ధికి అత్యంత అనుకూలమైన పరిస్థితులను సృష్టిస్తాయి. సోషలిజంలో ప్రకృతి శాస్త్రాలూ, సామాజిక శాస్త్రాలూ రెండూ ప్రజలకు సేవచేస్తాయి, ప్రకృతిని మార్చేటందుకూ, జీవితానికీ, సమాజ అభివృద్ధికీ దర్శకత్వం వహించేటందుకూ, స్వయంగా మానవునియొక్క, అతని శారీరిక, ఆత్మిక సామర్థ్యాలయొక్క, సర్వతోముఖ అభివృద్ధిని పెంపొందించేటందుకూ గతంలో యెన్నడూ లేనంత విస్తృత ప్రమాణాలలో ఉపయోగించబడుతాయి.

లెనిన్ యిలా రాసినాడు: "మునుపు మానవుని మేధస్సు, మానవ ప్రజ్ఞ, సాంకేతిక విజ్ఞానంయొక్క, సంస్కృతియొక్క ఉపకారాలను కొంతమందికే యివ్వడానికీ, అత్యంత ముఖ్యమైనదాన్ని — విద్యనూ, అభివృద్ధినీ — తక్కినవాళ్లకు లేకుండా చేయడానికీ మాత్రమే

సృష్టి చేసింది. యిప్పటినుండి శాస్త్రవిజ్ఞానపు అద్భుతాలన్నీ, సంస్కృతీ లాభాలన్నీ మొత్తం యావత్ప్రజలకు చెందుతాయి; మానవ మేధస్సూ, మానవ ప్రజ్ఞా మళ్లీ యెప్పుడూ పీడన కొరకూ, దోపిడీ కొరకూ ఉపయోగించబడవు."*

వస్తుగత, శాస్త్రీయ జ్ఞానానికి భిన్నంగా, మతం చారిత్రకాభివృద్ధి గతిలో వాస్తవికతయొక్క ఊహాకల్పితమైన, వికృతమైన ప్రతిబింబంగా, వివరణగా ఉద్భవించింది. శాస్త్రవిజ్ఞానంలో గొప్ప పురోగతి జరిగినప్పటికీ ప్రస్తుతానికి మతం కొనసాగుతున్నది.

మత సారాంశం గ్రహించడానికి మతం యెందుకు పుట్టిందీ, సమాజపు జీవితంలోనూ, అభివృద్ధిలోనూ అది యే పాత్ర నిర్వహించేదీ స్పష్టపరచాలి.

మతం "దివ్య ఆవిష్కృత సత్యా"నికి కావలాదారు కాదు; అది యేదో విశిష్ట, అతీత ప్రపంచపు ప్రతిబింబం కాదు కూడా. యితర చైతన్య రూపాల లాగే మతం సామాజిక మానవుని చైతన్యంలో వాస్తవికత ప్రతిబింబం, యిహ లోకంలో పుట్టిందే, పర లోకంలో పుట్టింది కాదు. మతం యేవిధంగానూ మానవునికి నిసర్గమైనది కాదు కూడా. మానవునికి సహజమైన మత చైతన్యం గానీ, మత అనుభూతి గానీ యెప్పుడూ లేదు. పాత రాతి యుగపు తొలి దశలలో మత సంబంధమైన అంశాలు బొత్తిగా లేవని గత శతాబ్దంలో ఆదిమ చరిత్రలో ప్రముఖ ఫ్రెంచి పండితుడైన గాబ్రియెల్ డి మార్టిల్యే రుజావుచేసినాడు.** అప్పటి నుండీ, ప్రపంచ మంతటా గల శాస్త్రజ్ఞులు, ముఖ్యంగా సోవియట్ శాస్త్రజ్ఞులు, యీ సత్యాన్ని ధ్రువపరచే కొత్త సమాచారాన్ని ప్రోగుచేసినారు.

కొంతమంది ఉద్ఘాటించినట్లు మతం యాదృచ్ఛికంగా అజ్ఞానపు అమాయకులను మోసగించడంద్వారా పుట్టిందని అనుకోవడం తప్పు. నిజమే, అజ్ఞానమూ, మోసమూ మతానికి యెప్పుడూ తోడుగా వుంటాయి, కానీ మతంయొక్క అసలైన మూలాలు వేరుగా వున్నాయి.

మానవుడు తన శ్రమద్వారా అప్పటికే ప్రకృతినుండి విడివడినప్పటికీ, యింకా మొత్తం మీద ప్రకృతి శక్తులమీద దాదాపు పూర్తిగా ఆధారపడిన కాలంలో మతం పుట్టింది.

మతం ఉత్పాదక శక్తుల అభివృద్ధిలోని హీన దశలో ఉద్భవిస్తుంది, మరే దశలోనూ, వాటి అభివృద్ధిలోని అత్యంత హీన దశలో కూడా, ఉద్భవించజాలదు. అసలు విషయం యేమిటంటే, ప్రతి నిర్దిష్ట దశలోనూ ఉత్పత్తియొక్క అభివృద్ధి స్థాయి మానవుడు యే

---

* V. I. Lenin, *Collected Works*, Vol. 26, పుటలు 481–482.

** చూ: Gabriel de Mortillet, *Le prehistorique* ("చరిత్ర పూర్వపు జీవితం"), Paris, 1883.

మేరకు ప్రకృతిమీద పెత్తనం చేసేదీ మాత్రమే కాక, యే మేరకు అతను దానిమీద ఆధారపడేదీ కూడా తెలుపుతుంది.

ప్రారంభంలో మానవుడు "అభౌమిక" శక్తులను ప్రకృతినుండి విడదీయకుండా, ప్రకృతి శక్తులకు, ప్రత్యేకంగా తన జీవితంలో ముఖ్యమైనవాటికి, వ్యక్తి రూపం యిచ్చి, తన జీవితంమీద ఉద్దేశపూర్వకంగా ప్రభావం నెరపే గుణాన్ని వాటికి ఆపాదించినాడు. మానవునికి అర్థం కాక, తాను అశక్తుణ్ణని అతను అనుకునేటట్లు చేసే అయోమయమైన, కానీ శక్తివంతమైన ప్రకృతి శక్తులు అతని ఊహలో మంచివీ, చెడ్డవీ అయిన దైవిక శక్తులుగా, దేవతలూ, దయ్యాలూ, భూతాలూ, వగైరాలుగా రూపాంతరం చెందినాయి.

కనుక, ఆదిమ మత చైతన్యం ప్రకృతితో చేసే పోరాటంలో ఆటవిక మానవుని అశక్తతయొక్క ప్రతిబింబం.

శత్రు వర్గ సమాజంలో ఉద్దండమైన ప్రకృతి శక్తులమీద మానవుడు ఆధారపడడం, ముఖ్యంగా వ్యవసాయంలో, కొంతవరకు నిలిచి వుంటుంది, కానీ మానవునిమీద ఉద్దండమైన సామాజిక అభివృద్ధి శక్తుల ఆధిపత్యం మతంయొక్క ప్రధాన మూలం అవుతుంది. మతం మానవునికి వ్యతిరేకంగా వున్న సామాజిక శక్తులపట్ల, నిర్దిష్టంగా దోపిడీ సంబంధాలపట్ల, అతని ప్రత్యక్ష పరాధీనతను ఊహాకల్పిత, భ్రమాత్మక రూపంలో ప్రతిబింబిస్తుంది; అది శ్రామిక ప్రజల అశక్తతయొక్కా, హీన పరిస్థితులయొక్కా నిదర్శన. కనుక, వర్గ సమాజంలో మత మూలాలు ప్రధానంగా సామాజికమైనవి.

బాహ్య శక్తులపట్ల మానవుల పరాధీనతను ప్రతిబింబించే మత భావాలు తదనురూపమైన చర్యలను ఉత్పన్నం చేస్తాయి: మానవులు తాము యే బాహ్య శక్తులపట్ల పరాధీనులమని నమ్ముతారో వాటిని సంతృప్తిపరచడానికి ప్రయత్నిస్తారు, వివిధ విపత్తులను నివారించేటందుకూ, వాటిని తమ శత్రువులమీదికి మళ్లించేటందుకూ ఆ శక్తులను ఆరాధిస్తారు. ఆ అతీత శక్తులకు "విజ్ఞప్తి" రూపాలనూ, వాటితో "సంపర్కాలు" నెలకొల్పుకొనే రూపాలనూ మతం ఉత్పత్తి చేస్తుంది. యీ రూపాలద్వారా మానవుడు సహాయమూ, సలహా, ఊరటా, సానుభూతీ, వగైరాల కొరకు దేవతలకు విజ్ఞప్తులు చేస్తాడు. సంప్రదాయాలూ, ఆచారాలూ, సాంగ్యాలూ అనేవాటి వ్యవస్థనుబట్టి మతపూజలు యేర్పడుతాయి. యీ నిర్దిష్ట కార్యాచరణ రూపం మత గురువులనే మనుషుల వర్గాన్ని ఉత్పన్నం చేసింది; మాంత్రికులూ, పురోహితులూ, మొదలైన వాళ్లు — వీళ్లు మనుషులకూ, దేవతలకూ మధ్య దళారులుగా వుంటారు.

మతం సమాజం, సంఘం, కుటుంబం, మొదలైనవాటిలో మనిషి ప్రవర్తననూ, కార్యాచరణనూ వివిధ విధుల (నిషేధాలూ, ధర్మాలూ, నీతులూ, వగైరాల)ద్వారా నియంత్రి

స్తుంది; యివి దేవునినుండి సంక్రమించినవిగానూ, కనుక పవిత్రమైనవిగానూ యెంచబడు తాయి.

మానవ కార్యకలాపాలమీద గల మత నియంత్రణ వ్యవస్థను దోపిడీ వర్గాలు తమ ఆధిపత్యాన్ని దృఢపరచుకోడానికి వినియోగిస్తాయి.

కనుక, మతం అనేది మానవుల చైతన్యంలో ఊహాకల్పితమైన అభౌమిక, అతీత శక్తుల రూపం ధరించి, వాళ్లచేత విశ్వసించబడి, ఆరాధించబడే పరాయి ప్రకృతి శక్తుల, లేదా సామాజిక శక్తుల ఆధిపత్యానికి మానవులు యే సామాజిక పరిస్థితులలో లోబడుతారో ఆ పరిస్థితుల ఉత్పాదితం. యీ శక్తులతో "పవిత్ర" సంపర్కం నెలకొల్పుకోడానికి మతం తోడ్పడుతుంది. మానవ కార్యకలాపాలను నియంత్రించడానికి సామాజిక వ్యవస్థకు గల "పవిత్ర రూపాల" అవసరంనుండి మతం ఉద్భవిస్తుంది.

యెక్కడైతే ఉద్దండమైన సామాజిక అభివృద్ధి శక్తుల ఆధిపత్యంనుండి మానవులు విముక్తులౌతారో ఆ కమ్యూనిస్టు సమాజంలో మాత్రమే మత చైతన్యాన్ని ఉత్పత్తిచేసే పరిస్థితులు తొలగించబడుతాయి. మత భావజాలంపట్ల కమ్యూనిస్టు పార్టీ తటస్థ వైఖరి అవలంబించదు, నిర్లక్ష్యంగా వుండజాలదు; యెందుకంటే, దాని దృక్పథమే నాస్తిక దృక్పథం.

గత కాలపు గొప్ప భౌతికవాదులు మతంతో తాము చేసిన పోరాటంలో అనేక సమరశీల, ప్రజ్ఞాయుత నాస్తిక రచనలు చేసినారు. కానీ వాళ్లు చరిత్రను గురించి భావవాద దృక్పథం అవలంబించి నందున, మతంయొక్క సామాజిక మూలాలను గమనించడమూ, దానిని అధి గమించే మార్గాలను సూచించడమూ వాళ్లకు చేతకాలేదు.

పరస్పరవాద భౌతికవాదం మునుపటి భౌతికవాదపు పరిమితులను అధిగమించి, మత వ్యతిరేక పోరాటానికి శాస్త్రీయ ప్రాతిపదికను యిస్తుంది. మతానికి సామాజిక మూలాలు వున్నాయి గనుక, అది జనాలు యే భౌతిక పరిస్థితులలో జీవిస్తారో ఆ పరిస్థితులచేత, వాళ్ల సామాజిక హీనత్వంచేత, ఉత్పత్తి చేయబడి, పోషింపబడుతుంది గనుక, మత నిర్మూలనానికి అన్నిటికంటె ముఖ్యంగా దానిని ఉత్పత్తిచేసే కారణాల తొలగింపు, అనగా పెట్టుబడిదారీ వ్యవస్థ తొలగింపు, అవసరం. అందువల్లనే మార్క్సిస్టులు మతంపట్ల అవలంబించవలసిన వైఖరి యేమిటనే ప్రశ్నను పెట్టుబడిదారీ వ్యవస్థతో చేసే వర్గ పోరాటపు ఆచరణ దృష్ట్యా పరిగణిస్తారు. మార్క్సిస్టు లెనినిస్టు పార్టీలు సోషలిజం కొరకూ, కమ్యూనిజం కొరకూ జరిగే పోరాటానికి శ్రామిక ప్రజల నందరినీ, వాళ్ల దృక్పథంతో నిమిత్తం లేకుండా, వాళ్ల మత విశ్వాసాలతో నిమిత్తం లేకుండా, కూడగట్టడానికి ప్రయత్నిస్తాయి. అవి చర్చిని రాజ్యం నుండి విడదీయాలని డిమాండు చేస్తాయి, మత కారణాలవల్ల మనుషులను హింసించడాన్నీ,

మతాన్నిబట్టి మనుషులను విభజించడాన్ని వ్యతిరేకిస్తాయి. యీ భూమిమీద సుఖం కొరకు చేసే పోరాటంలో శ్రామిక ప్రజల ఐక్యత స్వర్గంలో దేవుడున్నాడా లేడా అనేదానిమీద విభేదాల కంటె యెంతో ముఖ్యమైనది. శాంతి పరిరక్షణ కొరకు జరిగే సాధారణ ప్రజాతంత్ర ఉద్యమంలో విశాలమైన స్త్రీ పురుష సముదాయాలు, వాళ్ల రాజకీయ, మత విశ్వాసాలతో నిమిత్తం లేకుండా, ఆస్తికులతో సహా, ప్రగతిశీల భావాలు గల కొందరు మతగురువులతో సహా, పాల్గొంటారు.

సోషలిజంలో మతంపట్ల వైఖరి యేమిటి? సోవియట్ యూనియన్‌లో మౌలిక సామాజికార్థిక మార్పులు మతంయొక్క సామాజిక మూలాలను బలహీనపరచినాయి. శ్రామిక ప్రజల పెరుగుతున్న సాంస్కృతిక ప్రమాణాలతో కలిసి యిది శ్రామిక ప్రజలలో పెద్ద మెజారిటీ మత విశ్వాసాలను వదిలించుకోడానికి తోడ్పడింది. సోవియట్ యూనియన్‌లోని విస్తారమైన శ్రామిక ప్రజలలో మార్క్సిస్టు లెనినిస్టు దృక్పథం వ్యాపించి వుంటుంది.

అయినప్పటికీ, సోవియట్ యూనియన్‌లో కొందరు శ్రామికులు యింకా మతవిశ్వాసాలు కలిగి ఉన్నారు. యెందుకు? శతాబ్దాలుగా మత విశ్వాసాలు మానవుల మనస్సులలో నాటబడినాయి; యీవ్రత్పజలూ వాటిని స్వల్ప కాలంలో వదిలించుకోజాలక పోవడం సహజమే. అంతే కాక, జర్మన్ ఫాసిజంతో జరిగిన కఠిన యుద్ధం, సోవియట్ ప్రజలకు యెంతో దుఃఖాన్నీ, బాధనూ కలిగించినట్టిది, కొంతమంది ప్రజలలో మత విశ్వాసాలను కొంతవరకు పునరుజ్జీవింపజేసింది. లెక్కలోకి తీసుకోవలసిన మరొక విషయం యేమిటంటే, వివిధ మత సంస్థల చురుకైన కార్యకలాపాలు.

నిర్దిష్ట సామాజిక శాస్త్ర పరిశీలనలు తెలిపే దేమంటే, ప్రజలలోని మత విశ్వాసాలను మత సంప్రదాయాలూ, తన్ను తాను పునరుత్పత్తి చేసుకొనే మత వాతావరణమూ (మత శాఖలూ, మత విశ్వాసాలు గల సమాజాలూ, కుటుంబాలూ, వగైరా), యే వ్యక్తిగత పరిస్థితులలో మనుషులు సంప్రదాయంచేత గానీ, హృదయ దౌర్బల్యంచేత గానీ ఊరట కొరకు మతంవైపు మళ్లుతారో ఆ పరిస్థితులూ పోషిస్తాయి.

శ్రామిక ప్రజలు అంతిమంగా మత విశ్వాసాలనూ, నిరాధార మత భావాలనూ వదలించుకోడానికి ఉద్దేశింపబడిన క్రమపద్ధతి గల కృషిని సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ సాగిస్తున్నది.

సోషలిస్టు సమాజంలో యీ ముఖ్యమైన సమస్యను పరిష్కరించే మార్గాలూ, సాధనాలూ యేమిటి?

నిరాధారమైన మత భావాలు ఉత్తరువులచేతా, నిషేధాలచేతా, బలాత్కారంచేతా అధిగమించబడజాలవు. యీ పద్ధతులు కేవలం వ్యతిరేకతను రేకెత్తించి, మతంలో మొండి

విశ్వాసాన్ని పటిష్ఠపరచవచ్చు. మత విశ్వాసాలు చెల్లవని వాదించాలి గానీ, మత గురువులనూ, ఆస్తికుల భావాలనూ అవమానించే మాటలు మాట్లాడకూడదు.

సోవియట్ యూనియన్ రాజ్యాంగం అంతఃకరణ స్వేచ్ఛను శాసనబద్ధం చేసి, రాజ్యం దృష్టిలో మతం వ్యక్తిగత విషయమని ప్రకటించింది. సోవియట్ యూనియన్‌లో రాజ్యంనుండి చర్చీ, చర్చీనుండి పాఠశాలా వేరుచేయబడినాయి, మతపూజలు పాటించడానికీ, మత వ్యతిరేక ప్రచారం సాగించడానికీ మనుషులకు స్వేచ్ఛ వుంది.

రాజ్యంనుండి చర్చియొక్క వేరుపాటూ, చర్చినుండి పాఠశాలయొక్క వేరుపాటూ సోవియట్ యూనియన్‌లో స్థిరంగా అమలు పరచబడినట్టివి, యే పెట్టుబడిదారీ దేశంలోనూ లేని అంతఃకరణ స్వేచ్ఛను కట్టుదిట్టం చేస్తాయి. సోవియట్ యూనియన్‌లో మతాన్ని అధిగమించే క్రమంలో యిటు సమస్త శ్రామిక ప్రజలూ కమ్యూనిజం నిర్మాణంలో క్రియాత్మకంగా, చైతన్యవంతంగా పాల్గొనడమూ, పాదార్థిక, సాంస్కృతిక ప్రమాణాలు పెంచడమూ, పాత సామాజిక శ్రమ విభజనయొక్క అవశేషాలను తొలగించడమూ, అటు ఎడతెగని శాస్త్రీయ, నాస్తిక ప్రచారంద్వారా మత దృక్పథంతో భావజాలాత్మక పోరాటమూ యిమిడి వున్నాయి.

పైన చెప్పినట్లు, కళ అనేది సామాజిక జీవితపు ప్రత్యేక రంగానికి చెందుతుంది, వాస్తవికతను రసాభిజ్ఞతతో, ఆచరణాత్మకంగా జీర్ణం చేసుకొనే రంగానికి. కానీ, అది యితర రంగాల పక్కన వుండే రంగం కాదు. వాస్తవికతపట్ల మానవుని రసాభిజ్ఞత వైఖరి ప్రతి రకం మానవ కార్యాచరణలోనూ, వివిధ మానవ సంబంధాల సమస్తంలోనూ వ్యాపించి వుంటుంది. మానవుడు శాస్త్ర నియమాలనుబట్టి మాత్రమే కాక, "సౌందర్య నియమాలను"బట్టి కూడా సృష్టిచేస్తాడు. అందువల్లనే మానవుని శ్రమ పరికరాలలోనూ, గృహ వస్తువులలోనూ, మానవ సంబంధాలలోనూ సౌందర్యాంశ కనపడుతుంది. కానీ, అసలు విషయం యేమిటంటే, అక్కడ రసాభిజ్ఞత ప్రధానమైనది కాదు, అనుబంధ విషయం. ఉదాహరణకు దుస్తులు అందంగా వుండాలి, కానీ అంతకంటె ముఖ్యంగా అవి ఋతువుకు తగినట్లుగానూ, ధరించడానికి అనుకూలంగానూ, వగైరాగా వుండాలి. అక్కడ సౌందర్య అవసరాలు వినియోగ అవసరాలకు లోబడి వుండాలి.

కనుక, యీ రసాభిజ్ఞతా రంగం మహా విశాలమైన దైనప్పటికీ, నికరమైన కళలో — సాహిత్యం, సంగీతం, చిత్రలేఖనం, వగైరాలలో — మాత్రమే సౌందర్యాంశ స్వతంత్రంగా వుంటుంది, దాని ప్రాముఖ్యం అప్రధానంగా వుంటుంది.

ఒక సామాజిక చైతన్య రూపంగా, ఒక విశిష్టమైన రకానికి చెందిన మానవ కార్యాచరణగా కళ వాస్తవికతపట్ల మానవుని రసాభిజ్ఞతా దృష్టిని స్థిరపరచడానికీ, సమాజంయొక్క

సుందర ఆచరణలను అభివృద్ధి చేయడానికీ, సమోదు చేయడానికీ ఉద్దేశింపబడింది. యీ చైతన్య రూపంయొక్క విశిష్ట స్వభావం యేమిటంటే, యిది కళాత్మక ఊహా చిత్రాలలో వాస్తవికతయొక్క ప్రతిబింబమూ, చిత్రణా వాస్తవికత. అంటే, మానవుని చుట్టూ వున్న ప్రతిదీ, అతని జీవితంలోనూ, కార్యకలాపాలలోనూ అతనితో సంపర్కం కలిగించుకొనే ప్రతిదీ: ప్రకృతీ, సమాజమూ, ఆలోచనలకూ, అనుభూతులకూ చెందిన మానవుని అంతరిక ప్రపంచమూ.

కళ మహా సంకీర్ణమైన, బహుముఖమైన విషయం. దాన్ని పరిశీలించడానికి ఒక సరళమైన వాదంతో ప్రారంభిద్దాం. ఒక పుస్తకం చదివిన ప్రతివాడూ, లేదా ఒక సినిమానో, నాటకమో, చిత్రమో చూసిన ప్రతివాడూ దానిని మూడు కోణాలనుండి అంచనా వేస్తాడు; ఒకటి, దానిని చదవడంలో, లేదా వినడంలో, లేదా చూడడంలో అతనికి ఆసక్తి వుండిందా, లేదా అనేది; రెండు, ఆ పుస్తకం, నాటకం, చిత్రం, వగైరాలు వర్ణించింది సత్యమా, కాదా అనేది; మూడు, ఆ కృతి యెలాంటి ఆలోచనలనూ, అనుభూతులనూ, భావాలనూ కలిగించింది అనేది. యీ తక్షణ వైఖరిని అవగతం చేసుకొన్నప్పుడు, మనం ప్రతి కళాఖండాన్నీ దాని సౌందర్య విలువా, సత్యబద్ధతా, భావజాల సారమూ అనే దృష్టినుండి అంచనా వేస్తామని చెప్పవచ్చు. యిది సహజమే, యెందుకంటే, కళ అనేది సారభూతంగా, అనగా వస్తుగతంగా, యీ మూడు అంశాల యేకత్వం: సౌందర్య, ప్రజ్ఞాన, భావజాల అంశాలు.

నిజమే, యీ మూడు అంశాలలో దేనినైనా సందర్భంనుండి విడదీసి, పరమమైనదిగా మార్చి, యిలా వాదించవచ్చు: కళ అనేది ప్రజ్ఞానం మాత్రమే, దాని విశిష్టమైన కళాత్మక ఊహాత్మక రూపం వలన శాస్త్రవిజ్ఞానం కంటె భిన్నమైనది, అని వాదించవచ్చు; లేదా అది భావజాలం మాత్రమే, మాట వరుసకు అది రాజకీయ భావాల కంటె, నైతిక భావాల కంటె యెలా భిన్నమంటే, ఆ భావాలకు అది కళాత్మక చిత్రణ యిస్తుంది, అని వాదించవచ్చు; లేదా అది సౌందర్య రంగం, "కళ కోసం కళ"గా మాత్రమే వుండేది, అని వాదించవచ్చు. యీ దృక్పథాలలో యేదీ సరైనది కాదు, యెందుకంటే ప్రతిదీ యేకపక్షమైనదే. కానీ, ప్రతిదీ కళయొక్క ఒక నిర్దిష్ట పార్శ్వాన్ని ప్రదర్శిస్తుంది, దానిలో నిజంగా వున్నట్టిదానిని. యీ మూడు పార్శ్వాలనూ యేకత్వంగా చూసినప్పుడు మాత్రమే కళయొక్క సారాంశమూ, విశిష్ట లక్షణాలూ స్పష్టంగా వెల్లడౌతాయి.

కళయొక్క ప్రధాన పార్శ్వాలను సంగ్రహంగా చూద్దాం.

వాస్తవికతయొక్క ప్రతిబింబంగా కళ వాస్తవికతయొక్క ఒక ప్రజ్ఞాన రూపం, కానీ యీకింది కారణాల వల్ల శాస్త్రవిజ్ఞానం కంటె భిన్నమైన విశిష్ట ప్రజ్ఞాన రూపం.

ఒకటి, శాస్త్రవిజ్ఞానం సాధారణమైనదాన్ని, వాస్తవికతలో సారభూతమైనదాన్ని ప్రతిబింబిస్తుంది, సాధారణమైనది ప్రత్యక్షంగా దేనితో ముడివడి వుంటుందో ఆ వ్యష్టిమండి, నిర్దిష్టంమండి, దానిని అభౌతికపరుస్తుంది. కళ సాధారణమైనదానిని జీవితంలో వున్నదున్నట్లుగా, అనగా వ్యష్టితోనూ, నిర్దిష్టంతోనూ దానికి గల వాస్తవ సంబంధంలో, ప్రతిబింబిస్తుంది. మరొక విధంగా చెప్పాలంటే, శాస్త్రవిజ్ఞానం నియమాలను ప్రతిబింబిస్తుంది, కళ నమూనాను ప్రతిబింబిస్తుంది. అందువల్లనే, శాస్త్రవిజ్ఞానంచేత ఒకసారి ఆవిష్కరింపబడిన నియమం మళ్లీ ఆవిష్కరింపబడవలసిన పని లేదు. తద్భిన్నంగా, నమూనాకు, ఉదాహరణకు యేదైనా ఒక సామాజిక నమూనాకు, జీవితంలో అనేక నిర్దిష్ట వ్యక్తీకరణలుంటాయి; అది కళలో పదేపదే ప్రతిబింబింపబడగలదు.

రెండు, శాస్త్రవిజ్ఞానంలో ప్రజ్ఞానం అనేది మానవునిమీదా, అతని చైతన్యంమీదా, యిచ్ఛమీదా ఆధారపడకుండా స్వయంగా వున్న వస్తువుయొక్క ప్రతిబింబం. కానీ, కళ స్వయంగా వున్న వాస్తవికతను కాక, దానిపట్ల మానవుని వైఖరిని ప్రతిబింబిస్తుంది, ఆ వైఖరి వాస్తవికతలోనే అంతర్నిహితంగా వున్న వస్తుగత గుణాలచేత నిర్ణయింపబడడం నిజమే అయినప్పటికీ. కళ ప్రకృతి ప్రతిబింబానికి పరిమితమైనప్పుడు కూడా కళాకారుని దృష్టికి యెల్లప్పుడూ మానవుడే కేంద్రంగా వుంటాడు. ప్రకృతిని చిత్రించే గొప్ప కళాఖండాలకు ఆ ప్రకృతి విషయాలు మానవునిలో కలిగించే అనుభూతులూ, మానసిక ముద్రలూ విశిష్ట గుణాలుగా వుంటాయి. ప్రకృతియొక్క నిర్జీవమైన ప్రతికృతి కళాఖండంగా హర్షింపబడదు. సకల వివరాలతోనూ చిత్రింపబడిన కుక్క తనకు మరొక కుక్క లాగే కనిపిస్తుందనీ, కళాఖండం లాగ కనిపించదనీ గ్యోతే సరిగనే గమనించాడు. ప్రకృతితోనూ, యితర మానవులతోనూ గల సంబంధాలలోని మానవుడు — మానవ అనుభూతుల, ఆలోచనల ప్రపంచం — యెల్లప్పుడూ కళకు ముఖ్యం.

మూడు, శాస్త్రవిజ్ఞానానికి భిన్నంగా, కళ మాత్రమే వాస్తవికతయొక్క సౌందర్య గుణాలను గురించిన జ్ఞానాన్ని యిస్తుంది. సముద్రశాస్త్రజ్ఞులూ, భౌతికశాస్త్రజ్ఞులూ, రసాయనశాస్త్రజ్ఞులూ, జీవశాస్త్రజ్ఞులూ, యితర రంగాల శాస్త్రజ్ఞులూ సముద్రాన్ని గురించి దాని భౌతిక భాగాలూ, రసాయన గుణాలూ, జీవ అంగనిర్మాణాలూ, వగైరాల దృష్ట్యా సమగ్రమైన వర్ణనను యిస్తారు, కానీ కళ మాత్రమే దాని సౌందర్యాన్ని ప్రతిబింబిస్తుంది.

కనుక, కళకు విశిష్టమైన ప్రతిబింబ లక్ష్యం వుంది, తదనుగుణంగా కళకు విశిష్టమైన ప్రతిబింబ రూపం వుంది. కళ వాస్తవికతను కళాత్మక కల్పనలలో ప్రతిబింబిస్తుంది.

కళాత్మక కల్పన అనేది వ్యష్టి స్వభావాలద్వారా సారభూతమైనదానియొక్క, నమూనాయొక్క, వ్యక్తీకరణ; మరొక విధంగా చెప్పాలంటే, అది నమూనాను, వాస్తవికతలోని ముఖ్య

అంశాలను సాధారణీకరించడం, అనగా నిర్దిష్ట యింద్రియానుభూతుల రూపంలో సాధార ణీకరించడం. కానీ, కళలో సృష్టి ప్రక్రియ అంటే సిద్ధంగా చేసిపెట్టిన నమూనాలను కను క్కోవడమూ, యాంత్రికంగా వాటిని కళాఖండంలోకి తీసుకురావడమూ అని అనుకోకూడదు. తద్వ్యతిరేకంగా, వాస్తవికతలోనుండి దానిలో యేది అత్యంత సాధారణమైనదిగా, సారభూత మైనదిగా వుంటుందో, యేది మనుషులలో నమూనా ఆలోచనలనూ, అనుభూతులనూ కలిగించగలదో దానిని వెల్లడించిన ఫలితంగా జరిగే ప్రక్రియ యిది. కానీ, ఊహా చిత్రాలలో జరిగే ప్రతి ప్రతిబింబమూ కళాఖండం కాదు. చాలామంది గేయాలు రాస్తారు, చిత్రాలు చిత్రిస్తారు. కానీ వాళ్ళందరూ కళాఖండాలు సృష్టిస్తున్నారని అర్థం కాదు. కళ యధార్థాన్ని వట్టి ఊహాచిత్రాలలో కాక, కళాత్మకమైన ఊహాచిత్రాలలో ప్రతిబింబిస్తుంది; అనగా అది యధార్థంయొక్క సుందర ప్రతిబింబం. కళలో ప్రతిబింబింపబడింది యేమిటనే దానితో నిమిత్తం లేకుండా — అది మంచి అయినా, చెడ్డ అయినా, ప్రతిబింబం సుందరంగా వుండాలి. కనుక, కళలోని ఊహాచిత్రమే సౌందర్యంగా వుంటుంది, అది యధార్థంయొక్క సౌందర్య దర్శనాన్ని వ్యక్తం చేసి, సౌందర్య అనుభూతులను కలిగిస్తుంది. సౌందర్య విషయంలో తటస్థంగా వున్నదేదీ కళాత్మక ఊహాచిత్రంలో రూపొందించబడజాలదు. ఆవిధంగా, పరమా ణువులోని యెలెక్ట్రాన్ చలనాన్ని గానీ, జీవిలోని మెటబాలిజంను (చయాపచయ క్రియను) గానీ ప్రతిబింబించడం అసాధ్యం. దరహంమీద, మానవ అనుభూతులను ప్రభావితం చేయక, తత్కారణంగా సౌందర్య అనుభూతిని కలిగించజాలని యే విషయాన్నైనా ప్రతిబింబించడం అసాధ్యం.

కళనూ, భావజాలాన్నీ ఒకటిగా చూడకూడదు, దానిని భావజాలంనుండి వేరు చేయ కూడదు కూడా. కళ భావజాలంతో రెండు విధాలుగా ముడిపడి వుంది: ఒకటి, నిర్దిష్ట సామాజిక వ్యవస్థలోని అంశంగా అది ఆ నిర్దిష్ట సమాజానికి ఉచితమైన నిర్దిష్ట పర్గాల రాజకీయ, న్యాయశాస్త్ర, నైతిక, సౌందర్య, తాత్విక, తదితర భావాలకు అనివార్యంగా వాహ నంగా పనిచేస్తుంది; అది స్వభావరీత్యానే భావజాలాత్మకమైనది. యెంతైనా, కళ యధార్థాన్ని ప్రతిబింబించడం మాత్రమే కాదు, అది దానిని అంచనా వేసి, దానిపట్ల నిర్దిష్ట వైఖరిని వ్యక్తం చేస్తుంది కూడా. కళాకారుని కళాత్మక ఊహాచిత్రాల తర్కం యెల్లప్పుడూ యేదో ఒకదానిని ఔననో, కాదనో అంటుంది, అనగా యేదో ఒక రూపంలో, తరుచుగా తనకు తెలియ కుండావే, ఒక నిర్దిష్ట సామాజిక ఆదార్శానికి అనుకూలమైన స్థావరం తీసుకుంటుంది. సమస్త కళా భావజాలాత్మకమే, కళాకారులకు ఆ విషయం తెలిసినా, తెలియకున్నా, వాళ్ళు దానిని ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా. అందువల్లనే, ''భావజాల రహితుల''మని చెప్పుకొనే కళాకారులూ, రచయితలూ కూడా వాస్తవంలో నిర్దిష్ట భావాల వాహ

వాలుగా వుంటారు. ప్రస్తుత పరిస్థితులలో "భావజాలం రాహిత్యం" బూర్జువా భావాల వ్యాప్తికి ఒక రూపం అని చారిత్రక అనుభవం బాగా తెలుపుతుంది.

వాస్తవంలో కళయొక్క భావజాలాత్మక స్వభావమే దానికి నిర్దిష్ట చారిత్రక నిర్మాణ రూపాలతోనూ, అందులోని వర్గాలతోనూ సంబంధాన్ని సృష్టించేదీ, బానిస యజమాన సమాజపు కళను ఫ్యూడల్ సమాజపు కళనుండి గానీ, కమ్యూనిస్టు కళను పెట్టుబడిదారీ కళ నుండి గానీ వేరుచేయడానికి తోడ్పడేదీ, కళయొక్క వర్గ స్వభావాన్నీ, దాని పరిచారక పాత్రనూ వెల్లడిజేసేదీ. కమ్యూనిస్టు సమాజంలో మాత్రమే కళాభివృద్ధి వర్గ వైరుధ్యాలనుండి విముక్తమౌతుంది, అక్కడ మాత్రమే అది సమాజ వ్యక్తు లందరి ఆత్మికాభివృద్ధి కొరకు పనిచేస్తుంది.

కానీ, కళయొక్క ప్రధాన విశిష్ట లక్షణం యేమిటంటే, దాని ప్రజ్ఞాన, భావజాల అంశాలు సౌందర్య ప్రాతిపదికమీద ఆధారపడడం. కళ యధార్థపు విషయాలను వాటి సౌందర్య గుణాలనుబట్టి, సౌందర్యశాస్త్ర నియమాలనుబట్టి, సౌందర్య ధాతువులద్వారా, సౌందర్య ఆదర్శాలను దృష్టిలో పెట్టుకొని పునరుత్పత్తి చేస్తుంది, అంచనా వేస్తుంది. అనగా, కళాకారులు జీవితంలోని విషయాలను అందంగానో, వికారంగానో, విషాదాంతంగానో, సుఖాంతంగానో, ఉదాత్తంగానో, నీచంగానో వున్నట్లు చిత్రిస్తారు, అంచనా వేస్తారు. అందువల్లనే కళాఖండం సౌందర్య అనుభూతులను కలిగించగలదు; అవి నిర్దిష్ట అనుభూతుల రూపంలో యధార్థాన్ని గురించిన అంచనా. సౌందర్య అనుభూతి అనేది నిర్దిష్ట వస్తువులనూ, విషయాలనూ మానవ కార్యకలాపాలనూ, కళాఖండాలనూ – మానవుడు మెప్పు, సంతోషం, దుఃఖం, ఆగ్రహం, ప్రేమ, ద్వేషం, ఉల్లాసం, వాత్సల్యం, విషాదం వ్యక్తం చేసేటట్లు చేసేవాటిని – చూసే పద్ధతి. సౌందర్య అనుభూతి ప్రకృతిపట్లా, పనిపట్లా, స్వీయ కార్యాచరణయొక్క ఫలితంపట్లా, మానవునిపట్లా ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. కానీ, సౌందర్య దృష్టిని రూపుదిద్దడంలో అన్నిటికంటె గొప్ప పాత్ర నిర్వహించేది కళ. నిర్ణీత వస్తువును గానీ, విషయాన్ని గానీ, నిత్య జీవితపు సన్నివేశాన్ని గానీ, మానవ చర్యను గానీ గమనించినప్పుడు ప్రతి వొకరికీ కలిగే ఆ స్వల్ప, అస్పష్ట అనుభూతిని విశదపరచి, పూర్తిగా వ్యక్తీకరించేది కళే. అందువల్లనే, మనం స్వయంగా చూసిన సన్నివేశమే ఒక పుస్తకంలో వర్ణింపబడినప్పుడు, అది మనల్ని యెంతో యెక్కువగా కదలిస్తుంది; కళ మన అనుభూతులను రూపుదిద్ది, ప్రభావితం చేసే దానికి గొప్ప శక్తి వుంది.

యీవిధంగా, చరిత్ర గతిలోనూ, సామాజిక చారిత్రక ఆచరణా, శాస్త్రవిజ్ఞానంయొక్కా, కళయొక్కా అభివృద్ధి అనే ప్రాతిపదికమీదా మానవుడు తన పరిసరాలను గురించిన జ్ఞానాన్ని పోగుచేసుకోవడమూ, తన మనస్సును అభివృద్ధి చేసుకోవడమూ మాత్రమే కాక, తన

యింద్రియాలనూ, తన అనుభూతి ప్రవృత్తినీ అభివృద్ధి చేసుకొని, సంపన్నం చేసుకుంటాడు. యీ మానవుని అనుభూతి ప్రవృత్తి మూలంగా ఆతను యధార్థంయొక్క సౌందర్య గుణాలను గురించి అంతకంతకూ లోతుగా తెలుసుకోగలుగుతాడు. మానవుని అనుభూతి ప్రవృత్తియొక్క అభివృద్ధి అతని సాంస్కృతిక అభివృద్ధిలో అఖండమైన భాగం.

దోపిడీ వ్యవస్థలో, కళాత్మక విలువలలో అత్యధిక భాగం శ్రామిక ప్రజలకు అందుబాటులో వుండవు. అదే సమయంలో, ఆధునిక సామ్రాజ్యవాద రాజ్యాలలో గుత్తాధిపతులు శక్తివంతమైన బహుళ ప్రచారసాధనాలద్వారా విశాలమైన జనాల అభిరుచిని కలుషితం చేస్తారు. సోషలిజంలో మాత్రమే ప్రజా సమూహాలు కళలతో సంపర్కంలోకి వస్తారు; అవి, ప్రజల సౌందర్య అనుభూతులను పెంపొందించడానికి అంతకంతకూ యెక్కువగా తోడ్పడుతాయి. క్లారా జెట్కిన్‌తో జరిపిన సంభాషణలో లెనిన్ సోషలిస్టు కళయొక్క కర్తవ్యాలకు ప్రగాఢమైన నిర్వచనం యిచ్చినాడు. ఆయన యిలా అన్నాడు: "కళ ప్రజలకు చెందినది. అది విశాలమైన శ్రామిక జనాల మధ్యలోనే లోతుగా వేర్లూనాలి. అది యీ జనాలకు అర్థమయ్యేదిగా వుండాలి, వీళ్లచేత ప్రేమించబడాలి. అది వాళ్ల అనుభూతులనూ, ఆలోచనలనూ, యిచ్ఛనూ యేకం చేయాలి, పైకి యెత్తాలి. అది వాళ్లలోని కళాకారుని మేల్కొల్పాలి, వాళ్లను తీర్చిదిద్దాలి."*

యీ అవసరం—ప్రజలలోని కళాకారులను మేల్కొల్పి, వాళ్లను తీర్చిదిద్దే అవసరం—జనాల సౌందర్యాభిరుచిని పెంపొందించడంలో కళయొక్క పాత్రను వ్యక్తం చేస్తుంది.

సౌందర్య, ప్రజ్ఞాన, భావజాల అంశాల యేకత్వంగా కళ మానవులకు తర్ఫీదు యిచ్చే విశిష్టమైన, శక్తివంతమైన సాధనం. అది అందుబాటులో వుండేది, నిర్దిష్టమైనది, కనులకు కనిపించేది గనుక, మానవునిమీద ప్రచండమైన ప్రభావం నెరపుతుంది. కళ భావజాల, నైతిక, సౌందర్య సాధనం. దానిలో యెప్పుడూ నిర్దిష్ట భావజాల సారం వుంటుంది గనుక, అది వర్గ పోరాటంలో ఒక ముఖ్యమైన ఆయుధం. దాని భావజాల సారాన్నిబట్టి అది ద్విముఖ పాత్రను నిర్వహించగలదు, నిర్వహిస్తున్నది కూడా: ప్రగతిశీల పాత్రా, ప్రగతి వ్యతిరేక పాత్రా. ఉద్దేశపూర్వకంగా ప్రజలయొక్కా, ప్రగతియొక్కా అవసరాలు తీర్చే కళ సామాజిక రూపాంతరీకరణంలో చాలా ముఖ్యమైన దౌతుంది. తన సమకాలికుల హృదయాలమీదా, మనస్సులమీదా ప్రభావం నెరపడంద్వారా అది కాలం తీరిన పెట్టుబడిదారీ వ్యవస్థను తొలగించడానికీ, కమ్యూనిస్టు సమాజాన్ని నెలకొల్పడానికీ జరిగే పోరాటంలో క్రియాత్మక పాత్ర వహిస్తుంది.

*V. I. Lenin, *On Art and Literature* ("కళా, సాహిత్యాల గురించి"), Moscow, 1956, పుట 520.

చైతన్య రూపాలు అన్నిటిలో తత్వశాస్త్రానికి ప్రత్యేక స్థానం వుంది. ఒకవైపున అది విస్తృత జనాలకు అత్యంతస్వల్పంగా తెలిసేది, తక్కువ అందుబాటులో వుండేది, కనుక చరిత్ర గతిని అత్యంత స్వల్పంగా ప్రభావితం చేస్తున్నట్లు అభిప్రాయం కలిగిస్తుంది. మరొక వైపున, మనుషులు తమ కార్యకలాపాలలో సామాజిక చైతన్యంయొక్క వివిధ వ్యక్తీకరణలచేత నడి పించబడుతారు గనుక, దాని రూపాలన్నీ ప్రపంచాన్ని గురించి తత్వవేత్తలు సమకూర్చే సాధారణ సిద్ధాంత దృక్పథంతో యేదో ఒక విధంగా ముడివడి వుంటాయి గనుక, తత్వ శాస్త్రం చరిత్ర గతిమీద మహా ముఖ్యమైన ప్రభావం నెరపుతున్నట్లు తేలుతుంది. అందు వలన, తత్వశాస్త్రం కొద్దిమంది నిపుణులకు మాత్రమే సంబంధించిన చైతన్య వ్యక్తీకరణగా కనిపించడం నిజమే అయినా, అది వాస్తవంలో విశాలమైన సామాజిక ప్రాముఖ్యమూ, ఆసక్తి గల అభిప్రాయాల వ్యవస్థ.

తత్వశాస్త్రం ఒక ప్రజ్ఞాన రూపంగా, విజ్ఞానశాస్త్రాల సాధారణ వ్యవస్థలో నిర్దిష్ట స్థానం కలిగి వుంది. అదే సమయంలో, వివిధ వర్గాల ప్రయోజనాలకూ, భావజాలానికీ సిద్ధాంత వ్యక్తీకరణగా, అది ప్రతి సమాజానికీ చెందిన భావజాల రూపాల వ్యవస్థలో కూడా స్థానం కలిగి వుంది. యిలా రెండు స్థానాలు కలిగి వుండడంమీద ఆధారపడుతాయి తత్వ శాస్త్రంయొక్క విశిష్ట లక్షణాలు.

ప్రజ్ఞాన రూపంగా, తత్వశాస్త్రం ప్రపంచాన్ని సుసమన్వితమైన, యేకీకృతమైన సమస్తంగా వర్ణించే సైద్ధాంతికంగా రూపొందించబడిన భావాలకూ, మానవుడు దానిని తెలుసుకొనే మార్గాలకూ, సాధనాలకూ చెందిన వ్యవస్థ. నిర్దిష్ట విజ్ఞానశాస్త్రాలకు భిన్నంగా, తత్వశాస్త్రం ప్రపంచాన్ని దాని వివిధ నిర్దిష్ట స్థితుల మధ్య అనుబంధాన్ని సృష్టించే అత్యంత సాధారణ అంశాల, నియమాల దృష్ట్యా పరిశీలిస్తుంది. నిజమే, సామాజిక అభివృద్ధియొక్క తొలి దశలలో, శాస్త్రవిజ్ఞానం పూర్తిగా శాఖలుగా చీలక ముందు, తత్వశాస్త్రంలో నిర్దిష్ట శాస్త్రీయ జ్ఞానం చేరి వుండింది, తరువాత నిర్దిష్ట విజ్ఞానశాస్త్రాలుగా యేర్పడిన విష యాలను అది చర్చించింది. అందువల్లనే గతంలో తత్వశాస్త్రపు విషయం యీనాటికంటె యెంతో విశాలంగా వుండింది. నిర్దిష్ట శాస్త్రాలుగా విడిపోని తత్వశాస్త్రం బీజ దశలోని ప్రజ్ఞానంయొక్క విశిష్ట లక్షణం, దాని చారిత్రక పరిమితత్వంయొక్క వ్యక్తీకరణ. యివన్నీ వున్నప్పటికీ, విశిష్టమైన ప్రజ్ఞాన రూపంగా తత్వశాస్త్రంయొక్క పుట్టుక ప్రపంచాన్ని గురించిన కొన్ని సాధారణ భావాలను సైద్ధాంతికంగా రూపొందించడంతోనూ, మానవుడు దానిని గుర్తించడంతోనూ ముడివడి వుంది.

విజానికి, ప్రపంచాన్నీ, దాని ప్రజ్ఞాన ప్రక్రియనూ సుసమన్వితంగా వర్ణించే సాధారణ భావాల, అభిప్రాయాల అవసరమే తత్వశాస్త్రపు పుట్టుకకు కారణమైంది. మనసులో వుంచు

కోవలసింది యేమిటంటే, చారిత్రక ఆచరణ గతిలో మానవులకు వ్యష్టి వస్తువుల, విషయాల గురించీ, వాటి విశిష్ట గుణాల గురించీ, వాటిని వేరుపరచే గుణాల గురించీ, వస్తువుల మధ్య గల లంకెల గురించీ, వాటి పరస్పర సంబంధాల గురించీ, ఒక స్థితినుండి మరొక స్థితికి వాటి పరివర్తన గురించి తెలుసుకోవలసిన అవసరం యెదురౌతుంది. మానవుని చుట్టూ వున్న వస్తువుల వైవిధ్యమూ, ప్రపంచపు యేకత్వమూ, యేకంనుండి అనేకానికి పరివర్తన జరిగే పద్ధతీ, వగైరాలను గురించి సిద్ధాంత అవగాహనయొక్క అవసరాన్ని కలిగించే ప్రాతి పదిక అదే. సైద్ధాంతిక ఆలోచనయొక్క ఒక విశిష్ట లక్షణం యేమిటంటే, అది వస్తువుల బాహ్య ఆకారాన్ని దాటి, వస్తువుల సారంలోకి దూరడానికీ, దానిని తన భావాలలో ప్రతిబింబించ డానికీ ప్రయత్నిస్తుంది. అన్ని వస్తువులకూ ఒకటే అయిన యీ సువ్యవస్థను యే దేవుడూ, యే మానవుడూ సృష్టించలేదు, యిది యెల్లప్పుడూ వుండింది, వుంది, వుంటుంది, యిది నిత్య సజీవమైన అగ్ని, నియమిత ప్రమాణం ప్రకారం వుండేది, నియమిత ప్రమాణం ప్రకారం ఆరిపోయేదని ప్రాచీన గ్రీకు తత్వవేత్త హెరాక్లిటస్ ఉద్ఘాటించినాడు. అది ప్రపంచానికి మూలం ప్రపంచంలోనే వుందని వివరించడానికీ, పరిసర వస్తువుల దృశ్యమాన వైవిధ్యాన్ని దాటి, వాటి నిసర్గమైన, సారభూతమైన యేకత్వాన్ని ఆవిష్కరించడానికీ చేసిన అమా యకమైన, కానీ సారభూతంగా సరైన ప్రయత్నం.

కానీ, పైన చెప్పినట్లు, తత్వశాస్త్రం వాస్తవికత గురించిన ప్రజ్ఞాన రూపం మాత్రమే కాదు. యితర విజ్ఞానశాస్త్రా లన్నిటికీ భిన్నంగా, తత్వశాస్త్రం మాత్రమే యే జ్ఞాన సిద్ధాంతాని కైనా మౌలికమైన ప్రశ్నను — ప్రపంచపు యేకత్వాన్ని కలిగించేది యేమిటి, ప్రపంచంలో యేది ప్రాథమికం, ప్రధానం, మౌలికం, ఆసగా ప్రపంచపు వైవిధ్యానికి "ప్రాథమిక మూలం" యేమిటి, అనే ప్రశ్నను — వేసి, పరిష్కరిస్తుంది. అందువల్లనే, అన్ని విజ్ఞానశాస్త్రాలలోనూ తత్వశాస్త్రం ఒక్కటే ప్రపంచాన్ని గురించి ఒక సాధారణ సిద్ధాంత దృష్టిని, ఒక నిశ్చిత మైన ప్రపంచ దృక్పథాన్ని, యివ్వడానికి ప్రయత్నించే శాస్త్రంగా కనపడుతుంది. కానీ, మనుషుల ప్రపంచ దృక్పథం ప్రపంచాన్ని మాత్రమే వర్ణించదు, అది ప్రపంచంపట్ల మనిషి వైఖరిని కూడా వర్ణిస్తుంది. యిది యెల్లప్పుడూ సమాజంలో మనిషి స్థాయిమీదా, దానినుండి యేర్పడే ప్రయోజనాలమీదా ఆధారపడుతుంది. పుట్టుకలోనూ, అభివృద్ధిలోనూ తత్వశాస్త్రం యెల్లప్పుడూ మనుషుల పాదార్థిక ప్రయోజనాలచేత నిర్ణయింపబడింది. అవి నిర్దిష్ట సామాజిక సంబంధాల వ్యవస్థ లోపల వాళ్ల ప్రతిపత్తినిబట్టి యేర్పడుతాయి.

సమాజం వర్గాలుగా విభజింపబడి, వర్గ పోరాటం అభివృద్ధి చెందడంతో, పోరాడే వర్గాలయొక్క, వివిధ సామాజిక బృందాలయొక్క ప్రయోజనాల సిద్ధాంత నిరూపణకు అవసరం ఉత్పన్నమైంది. కానీ దీనికి, ఒకటి, ఒక వర్గంయొక్క నిర్దిష్ట ప్రయోజనం సార్వ

జనీన ప్రయోజనంగా ప్రదర్శింపబడడమూ, రెండు, వర్గ ప్రయోజనాన్ని సహజంగా యేర్ప డిన ఆవశ్యకతగా ప్రదర్శించే సాధారణ ప్రపంచ దృక్పథంనుండీ, దాని సారాంశంనుండీ ఆ వర్గంయొక్క ఆశయాలూ, ఆదర్శాలూ ఉత్పన్నమైనట్లు చూపించడమూ అవసరం. తత్వ శాస్త్రం మాత్రమే యీ కర్తవ్యాన్ని నిర్వహించ గలిగిందని సులభంగా అర్థమౌతుంది; యెందు కంటే, నిర్దిష్ట వర్గంయొక్క ప్రతిపత్తికీ, ప్రయోజనాలకూ అనుగుణంగా ప్రపంచాన్ని గురించిన సాధారణ అవగాహనను అది మాత్రమే తన అభౌతిక సిద్ధాంత రూపంలో రూపొంది స్తుంది, ఆ వర్గంయొక్క సాధారణ భావజాలాత్మక ఆశయాలనూ, సామాజిక రాజకీయ స్థావరాన్నీ అది మాత్రమే నిరూపిస్తుంది. దీనివల్ల తత్వశాస్త్రం పోరాడే వర్గాల భావజాలం అవుతుంది. కనుక, ఒక సామాజిక చైతన్య రూపంగా తత్వశాస్త్రంయొక్క విశిష్ట లక్షణం దాని ప్రజ్ఞాన, భావజాలాత్మక కర్తవ్యాల యేకత్వంనుండి ఉత్పన్నమౌతుంది.

తమ భావజాల సిద్ధాంతాలు పోరాడే వర్గాల వాస్తవ ప్రయోజనాలతో ముడివడి వుండడం గురించి తాత్వికులకే యెల్లప్పుడూ స్పష్టంగా తెలియదని జ్ఞాపకం పెట్టుకోవాలి. అంతే కాక, చైతన్యానికీ, పదార్థానికీ మధ్య గల సంబంధాలూ, ప్రపంచంయొక్క జ్ఞేయత (cognisability), చలనంయొక్క సారమూ, మానవుని స్వభావమూ, మొదలైన నిత్య తాత్విక సమస్యలకు తమ సిద్ధాంతాలు జవాబులని, ఒక్క మాటలో చెప్పాలంటే, తమ సిద్ధాంతాలు సత్యాన్వేషణ ఫలితాలని, తాత్వికులలో చాలామంది మనస్ఫూర్తిగా నమ్మినారు. అందువల్లనే, ఒక తాత్వికుడు ఒక నిర్దిష్ట వర్గంయొక్క సిద్ధాంతకారుడని మన మన్నప్పుడు, అతను తెలిసి తెలిసి ఆ వర్గంయొక్క ప్రతినిధిగా వ్యవహరించినాడని గానీ, పుట్టుకచేత గానీ, సామా జిక ప్రతిపత్తిచేత గానీ అతను ఆ వర్గానికి చెందినవాడని గానీ మన ఉద్దేశం కానే కాదు. అతన్ని ఆ వర్గంయొక్క సిద్ధాంతకారునిగా చేసే దేమిటంటే, ఆ వర్గం ఆచరణలో యే నిర్ధా రణలు చేస్తుందో వాటివద్దకే అతని సిద్ధాంత కృషి అతన్ని తీసుకపోతుందనే విషయమే.

ప్రగతిశీల వర్గాలకూ, ప్రగతి వ్యతిరేక వర్గాలకూ మధ్య జరిగే పోరాటం శత్రుత్వ పూరిత సామాజిక వ్యవస్థల అభివృద్ధి వెనుక వున్న చోదక శక్తి. వర్గాల ప్రతిపత్తులలోనూ, ప్రయోజనాలలోనూ గల భేదం ప్రపంచ దృక్పథంలో ప్రతిబింబింపబడుతుంది, రెండు ప్రధాన శిబిరాలైన భౌతికవాదానికీ, భావవాదానికీ మధ్య జరిగే పోరాటంలో ప్రతిబింబింపబడు తుంది; అవి తత్వశాస్త్రంలోని ప్రధాన పక్షాలు, ఆలోచనకూ, అస్తిత్వానికీ మధ్య, ఆత్మకూ ప్రకృతికీ మధ్య గల సంబంధం యేమిటనే ప్రధాన తాత్విక ప్రశ్నపట్ల భిన్న వైఖరులు గలవి. యీ ప్రశ్న తత్వశాస్త్రానికి మౌలికమైనది; యెందుకంటే, ప్రపంచాన్ని గురించిన దృక్పథాన్ని, ప్రపంచం భౌతికమని గానీ, భావాత్మకమని గానీ మనం చేసే ఉద్ఘాటనను, దీని జవాబు నిర్ణయిస్తుంది. యీ ప్రశ్నకు యిచ్చే జవాబు యితర సకల తాత్విక ప్రశ్నల పరిశీలనకు

సిద్ధాంత ప్రాతిపదికను సమకూరుస్తుంది. ప్రపంచం భౌతికమైతే, భౌతిక ప్రపంచపు గుణాలనూ, సంబంధాలనూ, నియమాలనూ అవి వస్తుగతంగా వున్నవి వున్నట్లుగా, అధ్యయనం చేయడం ప్రజ్ఞానపు కర్తవ్య మౌతుంది. తద్భిన్నంగా ప్రపంచం భావాత్మకమైతే, ప్రజ్ఞాన కర్తవ్యం ప్రపంచ ఆత్మిక సారాన్ని, దివ్య సారాన్ని అధ్యయనం చేయడానికి పరిమిత మౌతుంది.

భౌతికవాద ప్రపంచ దృక్పథం ప్రపంచాన్ని వున్నదున్నట్లుగా, వెలుపలి చేర్పు లేమీ లేకుండా చూసే దృక్పథం; కాగా, భావవాదం ప్రపంచాన్ని గురించి సారభూతంగా తప్పు దృక్పథాన్ని, వికృతమైన ప్రపంచ దృక్పథాన్ని, యిస్తుంది.

భౌతికవాదానికీ, భావవాదానికీ మధ్య జరిగే పోరాటం, వివిధ తాత్విక ధోరణులకూ, సిద్ధాంతాలకూ, దృక్పథాలకూ మధ్య జరిగే ఘర్షణ, సామాజిక వర్గాల పోరాటానికి ప్రతిబింబం.

కానీ, చరిత్రలో ఒకదాని వెంట ఒకటి వచ్చిన తాత్విక వ్యవస్థల మహా వైవిధ్యాన్ని పరిశీలించేటప్పుడు లెక్కలోకి తీసుకోవలసింది నిర్దిష్ట దేశంలోని, లేదా నిర్దిష్ట కాలంలోని వర్గ సంబంధాల స్వభావాన్ని మాత్రమే కాదు. విజ్ఞానశాస్త్రాల, ముఖ్యంగా ప్రకృతిశాస్త్రం యొక్క స్థాయినీ, లభ్యంగా వున్న తాత్విక భావాల నిధినీ, లేదా ఆలోచనా విషయం అనేదాన్నీ, ఆ సమాజంయొక్క ఆత్మిక వాతావరణాన్నీ కూడా లెక్కలోకి తీసుకోవడం చాలా ముఖ్యం. ఆత్మిక వాతావరణమంటే ఆ సమాజంయొక్క సాంస్కృతిక స్థితీ, దాని మానసిక స్థితీ, యే చైతన్య రూపమైనా నెరపే ప్రభావంయొక్క స్వభావమూ, వగైరా.

మార్క్సిజం పుట్టుక తత్వశాస్త్రంయొక్క చారిత్రక అభివృద్ధిలో ఒక ముఖ్యమైన ఘటన. మార్క్సు, ఎంగెల్సు ప్రకృతిని గురించి మాత్రమే కాక, సమాజాన్ని గురించి కూడా స్థిరంగా భౌతికవాద దృక్పథం వహించే తత్వశాస్త్రాన్ని సృష్టించినారు. మార్క్సు పూర్వపు తత్వశాస్త్రం, కచ్చితంగా చెప్పాలంటే, శాస్త్రీయ ప్రపంచ దృక్పథంయొక్క పూర్వ చరిత్ర. అంటే, దానిని అధ్యయనం చేయడం శుష్క పాండిత్యమని కాదు. తద్వ్యతిరేకంగా, యీ నాడు భావజాల పోరాటం విజయవంతంగా సాగించడానికి మాత్రమే కాక, శాస్త్రీయ మార్క్సిస్టు లెనినిస్టు తత్వశాస్త్రపు అభివృద్ధికి కూడా అది చాలా ముఖ్యం. మానవాళి సృష్టించిన భావాల సంపదను జీర్ణం చేసుకోకుండా యెవడూ కమ్యూనిస్టు కాజాలడని లెనిన్ నొక్కిచెప్పినాడు. తాత్విక ఆలోచన చరిత్ర కూడా అందులో భాగమే.

మార్క్సిస్టు తత్వశాస్త్రం కార్మికవర్గపు ప్రపంచ దృక్పథం. అది యీ సామాజిక ప్రాతిపదికమీద అభివృద్ధి చెంది, కార్మికవర్గంయొక్క వర్గ పోరాటపు అవసరాలు తీరుస్తూ, దోపిడీ వర్గాల ప్రపంచ దృక్పథంయొక్క సూత్రాలతో తెగదెంపులు చేసుకొంటుంది. అది యధార్థాన్ని యోచించవలసిన విషయంగా కాక, విప్లవాత్మక రూపాంతరీకరణకు గురి చేయవలసిన విషయంగా పరిగణిస్తుంది. "తత్వవేత్తలు ప్రపంచాన్ని వివిధ విధాలుగా కేవలం

వ్యాఖ్యానించినారు; అసలు విషయం యేమిటంటే, దానిని మార్చడం"* అని మార్క్స్ నొక్కిచెప్పినాడు.

మార్క్సిజం పుట్టుకతో వాస్తవికతపట్ల తత్వశాస్త్రపు వైఖరి మారుతుంది: తత్వశాస్త్రం విప్లవాత్మకమూ, క్రియాత్మకమూ, ప్రపంచపు ఆచరణాత్మక రూపాంతరీకరణకు పరికరమూ అవుతుంది. జనాలను యెప్పుడూ చేరక, స్వల్ప బృందాల చట్రాలకు పరిమితమై వుండిన మునుపటి తత్వశాస్త్రానికి భిన్నంగా, మార్క్సిస్టు తత్వశాస్త్రం ఉద్దేశపూర్వకంగా విశాలమైన జనాల పోరాటంతో ముడిపడింది.

ప్రకృతియొక్కా, సమాజంయొక్కా వస్తుగత నియమాలను సరిగా ప్రతిబింబించే శాస్త్రీయ తత్వశాస్త్రం మాత్రమే ప్రజలకూ, సమాజాన్ని మార్చడానికి వాళ్ళ చేసే పోరాటానికీ ఫలవంతమైన సేవ చేయగలదు. మార్క్సిస్టు తత్వశాస్త్రం తనలో శాస్త్రీయ దృష్టినీ, విప్లవాత్మక దృష్టినీ నైసర్గికంగా, విడదీయరాకుండా సమ్మేళనం చేస్తుంది. కార్మికవర్గపు తత్వశాస్త్రం శాస్త్రీయ భావజాలం, అనగా, ఒకేసారి భావజాలమూ, విజ్ఞానశాస్త్రమూ. మునుపటి తత్వశాస్త్ర మంతటికీ రకరకాలుగా విలక్షణంగా వుండిన భావజాల, ప్రజ్ఞాన అంశాల మధ్య గల వైరుధ్యాన్ని అది మొట్టమొదటి సారిగా తొలగించింది.

మార్క్సిజం పుట్టుకతో విజ్ఞానశాస్త్రాలపట్ల తత్వశాస్త్రపు వైఖరి మారుతుంది. మునుపటి తత్వశాస్త్రానికి భిన్నంగా, మార్క్సిస్టు తత్వశాస్త్రం శాస్త్రాల శాస్త్రం కాదు, నిర్దిష్ట శాస్త్రాలమీద తన నిర్ధారణలు రుద్దే శాస్త్రం కాదు. అది యితర శాస్త్రాలతో సమానమైన శాస్త్రం, విషయంలో వాటికంటె భిన్నమైనది. కర్మకూ కర్తకూ మధ్య గల సంబంధానికి చెందిన సమస్యనూ, భౌతిక ప్రపంచంయొక్కా, స్వయంగా ఆలోచనయొక్కా అత్యంత సాధారణ అభివృద్ధి నియమాలనూ అధ్యయనం చేయడంద్వారా మార్క్సిస్టు లెనినిస్టు తత్వశాస్త్రం యితర శాస్త్రాలకు సరైన ప్రపంచ దృక్పథాన్నీ, శాస్త్రీయ ప్రజ్ఞానపు సిద్ధాంతాన్నీ, పద్ధతినీ యిస్తుంది.

మునుపటి తత్వశాస్త్రం భౌతికవాదానికీ, భావవాదానికీ మధ్య జరిగిన పోరాటంలో, పలు తాత్విక వ్యవస్థల అనుక్రమంద్వారా అభివృద్ధి చెందింది. చారిత్రక సన్నివేశం మారే కొద్దీ పాత తాత్విక వ్యవస్థలు పోయి, కొత్తవి వచ్చినాయి. మార్క్సిజం పుట్టుకతో తత్వశాస్త్రపు అభివృద్ధి స్వభావమే మార్పుకు లోనౌతుంది. మార్క్సిస్టు తత్వశాస్త్రం ఒక శాస్త్రం గనుక, అది కూడా ఒక శాస్త్రం లాగ అభివృద్ధి చెందుతుంది, అనగా దాని మౌలిక సూత్రాలు — భౌతికవాదమూ, పరస్పరవాదమూ — మారకుండా వుంటాయి. కానీ, చారిత్రక పరిస్థితులు

---

* K. Marx and F. Engels, *The German Ideology,* పుట 662.

మారేకొద్దీ, కొత్త శాస్త్రీయ ఆవిష్కరణల దృష్ట్యేనూ, మార్క్సిస్టు తత్వశాస్త్రం అభివృద్ధి చెందుతుంది, కొత్త సూత్రాలతోనూ, నిర్ధారణలతోనూ సంపన్నమౌతుంది. యిప్పుడు మార్క్సిస్టు తత్వశాస్త్రం స్థానంలో కొత్త తాత్విక వ్యవస్థలను సృష్టించ వలసిన అవసరం యిక యెంత మాత్రమూ లేదు; వున్న అవసరమల్లా మార్క్సిస్టు తత్వ శాస్త్రాన్నే అభివృద్ధి చేయడం. ఆవిధంగా, గుత్తపూర్వ పెట్టుబడిదారీ వ్యవస్థనుండి సామ్రా జ్యవాదానికీ, కార్మికవర్గ విప్లవాలకూ చెందిన యుగానికి పరివర్తన జరగడంతో, కొత్త శాస్త్రీయ ఆవిష్కరణల దృష్ట్యే కూడానూ, వర్గ పోరాటంలోని కొత్త అనుభవాన్నీ, జ్ఞానంలో జరిగిన పురోగతినీ క్రోడీకరించవలసిన అవసరం యేర్పడింది. మహనీయుడైన లెనిన్ యీ కర్తవ్యాన్ని నిర్వహించి, తద్వారా మార్క్సిజంను కొత్త దశకు అభివృద్ధిచేసి మొత్తంగా మార్క్సిస్టు సిద్ధాంతంయొక్క, ప్రత్యేకంగా మార్క్సిస్టు తత్వశాస్త్రంయొక్క సృజనా త్మక అభివృద్ధికి ఒక నమూనాను సమకూర్చినాడు. మార్క్సిస్టు తత్వశాస్త్రపు అభివృద్ధి లోని కొత్త దశను లెనినిస్టు దశ అంటారు.

మార్క్సిస్టు లెనినిస్టు తత్వశాస్త్రం రకరకాల భావవాద సిద్ధాంతాలతోనూ, జడవాదా త్మక అపభ్రంశ భౌతికవాద సిద్ధాంతాలతోనూ చేసే పోరాటంలోనూ, మార్క్సిజం లెనినిజంనుండి వైదొలగే పెడమార్గాలతో చేసే పోరాటంలోనూ, పిడివాదంతోనూ, రివిజనిజంతోనూ చేసే పోరాటంలోనూ అభివృద్ధి చెందుతుంది.

ప్రపంచం రెండు పరస్పర వ్యతిరేక సామాజిక వ్యవస్థలుగా చీలివున్నందున, మార్క్సి జం లెనినిజం తనకు వ్యతిరేక శిబిరమైన పెట్టుబడిదారీ శిబిరానికి చెందిన భావజాలంతో, సామ్రాజ్యవాద బూర్జువావర్గపు ప్రగతి వ్యతిరేక తత్వశాస్త్రంతో సహా, పోరాటం సాగించవలసి వుంది. బూర్జువా ప్రపంచ దృక్పథంయొక్క సకల రూపాల, వ్యక్తీకరణల ప్రభావంనుండి జనాలను విముక్తి చేయడానికి మార్క్సిస్టు లెనినిస్టు తత్వశాస్త్రం కృషిచేస్తుంది.

సామాజిక చైతన్యమూ,
వ్యక్తి చైతన్యమూ

సామాజిక చైతన్యం వ్యక్తి చైతన్యంతో ముడిపడి తప్ప వేరుగా లేదు. యెందుకంటే, సమాజంలో మానవుడు తప్ప మరొక చైతన్య జీవి లేదు.

వ్యక్తి చైతన్యం అనేది వ్యక్తియొక్క ఆత్మిక ప్రపంచం. సామాజిక చైతన్యం వ్యక్తి చైతన్యంనుండి విడదీయరానిది; కానీ వ్యక్తి చైతన్యం సామాజిక చైతన్యంలో కేవలం ఒక రేణువు కాదు. వ్యక్తి చైతన్యం ప్రతి సందర్భంలోనూ ఆ యుగ చైతన్యానికి ఉమ్మడిగా

వున్న లక్షణాలమూ, వ్యక్తియొక్క సామాజిక మూలాలకు సంబంధించిన విశిష్ట లక్షణాలనూ, విద్యచేతా, శక్తిసామర్థ్యాలచేతా, అతని వ్యక్తిగత జీవిత పరిస్థితులచేతా నిర్ణయించబడిన వైయక్తిక లక్షణాలమూ విలక్షణంగా సమ్మేళనం చేసే యేకైక చైతన్యం.

అందువల్లనే, నిర్దిష్ట యుగంయొక్క, లేదా వర్గంయొక్క, లేదా జాతియొక్క, లేదా సామాజిక బృందంయొక్క చైతన్యంలోని స్వతస్సిద్ధ లక్షణాలు ఒకలాగే వుంటాయంటే, ఆ సమాజంచేత నిర్ణయించబడిన చట్రం లోపల వ్యక్తి చైతన్యంలో వైవిధ్యం గానీ, వ్యక్తి చైతన్యానికీ, సామాజిక చైతన్యానికీ వైరుధ్యం కూడా గానీ వుండకూడదని కాదు. సామాజిక మూలంద్వారామూ, ప్రతిపత్తిద్వారానూ బూర్జువావర్గానికి చెందిన వ్యక్తులు కార్మిక వర్గం వైపుకు పోయి, దాని భావజాల స్థావరాన్ని అంగీకరించి, తమ సొంత వర్గాన్ని వ్యతిరేకించిన ఘటనలు ప్రతివొకరూ వినివుంటారు. మరొక వైపున, సోషల్ డెమోక్రటిక్ ఉద్యమానికి చెందిన అనేక అవకాశవాద నాయకులూ, ఊగిసలాడే కొందరు కమ్యూనిస్టులు కూడామా తాము దేని శ్రేణులనుండి వచ్చినారో ఆ కార్మికవర్గపు ప్రయోజనాలకు ద్రోహం చేసిన ఘటనలు కూడా ప్రతివొకరూ వినివుంటారు. ఆ వ్యక్తి కాక యీ వ్యక్తి మరొక వర్గంయొక్క స్థావరాలకు మారిపోవడానికి కారణం అతని వైయక్తిక విలక్షణ గుణాలే — ఆ ఘటనకు సామాజిక కారణాలు వున్నప్పటికీ.

వ్యక్తి చైతన్యమూ, సామాజిక చైతన్యమూ పరస్పరవాదాత్మక యేకత్వంలో వుంటాయి. వ్యక్తి చైతన్యం వ్యక్తియొక్క జీవన పరిస్థితుల ప్రభావంలో, యితర మనుషులతోనూ, పరిసర సామాజిక వాతావరణంతోనూ అతని చర్యా ప్రతిచర్యలద్వారా యేర్పడుతుంది. సామాజిక వాతావరణంలో సామాజిక చైతన్యం చేరి వుంటుంది. వ్యక్తి చైతన్యాన్ని రూపు దిద్దడంలో సామాజిక చైతన్యానికి ప్రాముఖ్యం కలిగించే రెండు ప్రధాన అంశాలను పేర్కొనవచ్చు.

ఒకటి, వాస్తవికతను భావ రూపంలో ప్రతిబింబించడానికి మనిషికి తోడ్పడేది సామాజిక చైతన్యంతో గల సంబంధం. ఒక విధంగా చెప్పాలంటే, భావాన్ని సృష్టించే సామర్థ్యాన్ని మనిషిలో కలిగిస్తుంది అది. మార్క్స్ యిలా రాసినాడు: "...భావ మనేది మానవ మనస్సులో ప్రతిబింబించబడి, ఆలోచన రూపాలుగా మారిన భౌతిక ప్రపంచం తప్ప మరేమీ కాదు."* దీనిని సరిగా అర్థం చేసుకోడానికి, మానవ మనస్సు సమాజంలో మాత్రమే వుంటుందనీ, సమాజంనుండీ, సామాజిక చైతన్యంనుండీ విడిపోతే దానికి భౌతిక విషయాలను "మానవ పద్ధతి"లో భావాలుగా రూపాంతరీకరించే సామర్థ్యం వుండదనీ మనం గ్రహించాలి. మూడు

* K. Marx, *Capital*, Vol. I, పుట 19.

అంశాలు దానికి అండగా వున్నప్పుడే భావం (చైతన్యం) వుంటుంది: వస్తువు, మానవ మనస్సు, మానవాళియొక్క మునుపటి అభివృద్ధి గతిలో సామాజికంగా ఉత్పత్తి చేయబడిన ప్రతిబింబ రూపాలను తనలో ప్రోగుచేసుకొనే సామాజిక చైతన్యం.

కార్యాచరణ క్రమంలో సామాజిక చైతన్యంతో గల చర్యా ప్రతిచర్యలు మానవునిలో వాస్తవికతను అవగాహన చేసుకొనే సామర్థ్యాన్ని కలిగిస్తాయి. సామాజిక చారిత్రక ఆచరణ యొక్క అభివృద్ధి ఫలితంగా యేర్పడిన భాషనూ, భావాలనూ, తర్కాన్నీ కరతలామలకం చేసుకోవడంద్వారానే ప్రతి వ్యక్తీ ఆలోచనకు కర్త అవుతాడు.

రెండు, అవసరమైన జ్ఞానమూ, సంస్కృతీ, భాషజాలమూ, వగైరాలను మానవుడు సామాజిక చైతన్యంనుండి పొందుతాడు. దేనిలో మానవులు నిత్య జీవితాన్నీ, ఆచరణాత్మక కార్యకలాపాలనూ నిర్వహిస్తారో, పెద్ద, చిన్న సమస్యలు విడివిడి సంఘాల వర్గాల, జాతుల జీవితంలోనూ, మొత్తంగా సమాజ జీవితంలోనూ ఉత్పన్నమయ్యేకొద్దీ దేనిలో ప్రతిబింబించబడుతాయో ఆ ఆత్మిక వాతావరణంగా యేర్పడుతుంది సామాజిక చైతన్యం. సమాజంలో, లేదా అంతకంటె సంకుచితమైన సామాజిక బృందంలో వుండే సంప్రదాయాలనూ, నైతిక నియమాలనూ, వివిధ అభిప్రాయాలనూ, వైఖరులనూ, దృక్పథాలనూ, అలవాట్లనూ, అభిరుచులనూ అతను తనలో లీనంచేసుకుంటాడు. అవి అతని ప్రవర్తననూ, వాస్తవికతపట్ల అతని వైఖరినీ ప్రభావితం చేస్తాయి.

దీనినిబట్టి యేర్పడే దేమంటే: వ్యక్తియొక్క విశిష్ట లక్షణాలు అటుంచి, అతని చైతన్యం సారభూతంగా సామాజిక చైతన్యం; యెందుకంటే, ప్రతి వ్యక్తీ అతని జీవిత కాలంలోని సామాజిక జీవిత పరిస్థితుల ఉత్పాదితం.

కానీ, వ్యక్తి చైతన్యానికీ, సామాజిక చైతన్యానికీ మధ్య సంబంధాలలో అనేక విషయాలుంటాయి – వయస్సూ, జీవిత విధానమూ, వ్యక్తి కార్యకలాపాల స్వభావమూ, అతని అవసరాలూ, ప్రయోజనాలూ, విద్యా స్థాయీ, సమాజ స్థితీ, మొదలైనవి. అందువల్లనే, సామాజిక చైతన్యపు ప్రభావాన్ని మానవుడు ప్రవరణాత్మకంగా లీనం చేసుకుంటాడు. యిది మానవుని వ్యక్తిత్వంయొక్క వ్యక్తీకరణ.

అదే సమయంలో, సామాజిక చైతన్యమే మానవులచేత, వాళ్ల వ్యక్తి చైతన్యాలచేత అభివృద్ధి చెందుతుంది, సంపన్నమౌతుంది. సామాజిక చైతన్యపు అభివృద్ధికి వ్యక్తి చైతన్యం ఒక సాధనం. అందువల్లనే, సామాజిక చైతన్యపు నిర్దిష్ట వ్యక్తీకరణలో, సామాజిక చైతన్యాన్ని రూపుదిద్దడంలో పాల్గొనే వ్యక్తుల విలక్షణ గుణాల ముద్ర కొంత వుంటుంది. సామాజిక చైతన్యాన్ని అభివృద్ధి చేయడంలో మనుషులు యే రూపాలలో, పద్ధతులలో పాల్గొనేదీ, యీ అభివృద్ధికి వాళ్ళ యే సంవిధానంద్వారా మలచబడేదీ, సామాజిక చైతన్యపు అభివృద్ధిలో

క్రియాత్మకంగా పాల్గొనే జనాల పరిమాణమూ, యివన్నీ చారిత్రక పరిస్థితులమీదా, ఆ అభివృద్ధిలో పాల్గొనే చైతన్యపు నిర్మాణ అంశాలమీదా (శాస్త్రవిజ్ఞానమూ, కళా, భావజాలమూ, సాధారణ చైతన్యమూ, వగైరాలమీద) ఆధారపడుతాయి. కానీ, అన్ని సందర్భాలలోనూ, సంచిత ఆలోచనా విషయాన్నీ మునుపటి అభివృద్ధి గతిలో రూపొందించబడిన భావాల వ్యవస్థనూ, ఆలోచన రూపాలనూ సవిమర్శకంగా తీసుకోవడం సామాజిక చైతన్యపు అభివృద్ధిలో పాల్గొనే వ్యక్తి చైతన్యానికి తప్పనిసరి అవసరం.

యీవిధంగా, వ్యక్తి చైతన్యంలో వాస్తవికతయొక్క ప్రతిబింబం సామాజిక చైతన్యంద్వారా కలుగుతుంది; యెందుకంటే, వ్యక్తి చైతన్యం సామాజిక చైతన్యపు ప్రాతిపదిక మీద రూపుదిద్దబడుతుంది గనుక. మరొక వైపున, సామాజిక చైతన్యంలో వాస్తవికతయొక్క ప్రతిబింబం (వాస్తవికతమీద దాని ప్రభావమూ) వ్యక్తి చైతన్యంద్వారా కలుగుతుంది. అది వాటి చర్యా ప్రతిచర్యల పరస్పరవాదాత్మకత.

సామాజిక చైతన్యంయొక్క సామాజిక క్రియలు

యే చారిత్రక యుగానికైనా చెందిన సామాజిక చైతన్యం భౌతికంగా నిర్ణయింపబడుతుందని చెప్పడమంటే, సామాజిక చైతన్యం మానవుల పదార్థిక ఉత్పాదక కార్యకలాపాలలోనూ, మొత్తం సామాజిక కార్యకలాపాలలోనూ ఆవశ్యమైన అంశమని గుర్తించడం, దీనివలన దాని క్రియలనూ, సామాజిక పాత్రనూ శాస్త్రీయంగా వర్ణించడానికి వీలు కలుగుతుంది.

సామాజిక అభివృద్ధిలో భావాలు నిర్ణాయక పాత్ర వహిస్తాయని చెప్పే భావవాదానికీ, వాటి క్రియాత్మక పాత్రను నిరాకరించే అపభ్రంశ భౌతికవాదానికీ చారిత్రక భౌతికవాదం వ్యతిరేకం. యీ క్రింది సరళమైన సూత్రం యీ సమస్యమీద సరైన స్థావరాన్ని వ్యక్తం చేస్తుంది: భావాలు చరిత్ర గతిని నిర్ణయించజాలవు, కానీ అవి చారిత్రక క్రమాన్ని ప్రభావితం చేయగల, దానికి నిర్దిష్టమైన వ్యక్తీకరణ యివ్వగల, సామాజిక అభివృద్ధిని త్వరపరచగల, లేదా మందగింప జేయగల క్రియాత్మక శక్తి. కానీ మనుషులు తమ కార్యకలాపాలలో వివిధమైన కర్తవ్యాలు నిర్వహిస్తారు. అందువలన వివిధమైన భావాలను ఉపయోగిస్తారు.

పైన చెప్పినట్లు, భావజాలంయొక్క పాత్ర సమాజం యెదుట ఉత్పన్నమయ్యే సామాజిక సమస్యల పరిష్కారంలో వ్యక్తమౌతుంది. అది యే వర్గంయొక్క ప్రయోజనాలను వ్యక్తం చేస్తుందనేదానిమీదా, సామాజిక అభివృద్ధియొక్క జరూరు అవసరాలనూ, విశాల ప్రజా

సముదాయాల ప్రయోజనాలనూ అది యెంత కచ్చితంగా, యెంత లోతుగా ప్రతిబింబిస్తుం దనేదానిమీదా ఆ పాత్ర ఆధారపడుతుంది.

భావజాలం సమాజంమీద ప్రభావం నెరపాలంటే, అది భౌతిక శక్తి కావాలి.

పాలక, దోపిడీ వర్గంయొక్క భావజాలం ఆ వర్గంచేత నెలకొల్పబడి, దాని ప్రయోజనాలకు కావలి కాసే సంస్థలలో భౌతిక రూపు ధరిస్తుంది. రాజ్యమూ, పాఠశాలా, చర్చీ, పీటి సాయంతో పాలకవర్గపు భావజాలం మొత్తం సమాజంమీద రుద్దబడి, ప్రాబల్యపు భావజాల మౌతుంది. ఉపరినిర్మాణపు సంస్థల కార్యకలాపాలద్వారా యీ భావజాలం భౌతిక శక్తిగా వివిధ సామాజిక క్రమాల గతిని ప్రభావితం చేస్తుంది, సమాజంలో వివిధ యితర క్రియలను నిర్వహిస్తుంది.

ప్రగతిశీల భావజాలపు కార్యాచరణ నూతన సామాజిక సంబంధాల స్థాపన కొరకూ, అభివృద్ధి కొరకూ జరిగే పోరాటంలో వ్యక్తమౌతుంది. యీ పోరాటంలో కొత్త భావజాలం పాత భావజాలాన్ని మాత్రమే కాక, పాత సమాజపు సంస్థల భౌతిక శక్తిని కూడా యెదుర్కొంటుంది. కొత్త ప్రగతిశీల భావాలు వాటంతటవే పాత వ్యవస్థ రద్దుకు దారితీయవు, తమ సామాజిక క్రియను నిర్వహించడానికీ, నూతన వ్యవస్థ పుట్టుకకు తోడ్పడడానికీ ప్రగతిశీల భావాలు భౌతిక శక్తిగా రూపాంతరం చెందాలి. అవి జనాలను ఆవహించి, సామాజిక అభివృద్ధి యొక్క చారిత్రకంగా జరూరైన కర్తవ్యాల నిర్వహణ కొరకు పోరాడడానికి వాళ్లను కూడ గట్టి, వ్యవస్థీకరించినప్పుడు, తప్పక భౌతిక శక్తి అవుతాయి.

యీ పోరాటపు గతిలో ప్రగతిశీల సామాజిక వర్గాలు కూడా నూతన వ్యవస్థ విజయాన్ని స్థిరపరచుకోడానికీ, పదిలపరచుకోడానికీ కొత్త సంస్థలను సృష్టిస్తాయి.

నిర్దిష్ట శాస్త్రాలు, ముఖ్యంగా ప్రకృతిశాస్త్రాలు, విశిష్టమైన క్రియను నిర్వహిస్తాయి. భావజాలానికి భిన్నంగా, ప్రకృతి శాస్త్రం నేరుగా ఉత్పత్తి అభివృద్ధి అవసరాలను తీరుస్తుంది. నిర్దిష్ట ప్రకృతి శాస్త్రాలు ప్రకృతి నియమాలను ప్రతిబింబిస్తూ, సామాజిక శ్రమయొక్క ఉత్పాదక శక్తిని పెంచేటందుకు ప్రకృతి నియమాలను అంతకంతకూ విస్తృతంగా, సమగ్రంగా వినియోగించుకోడానికి మానవునికి వీలు కలిగిస్తాయి. ప్రకృతిశాస్త్రాల విజయాలు జనాల వ్యవస్థీకరణలో కాక, అన్నిటికంటె ముఖ్యంగా ఉత్పత్తి పరికరాలలోనూ, ఉత్పత్తి సాధనాలలోనూ, నిర్దిష్ట సాంకేతిక క్రమాలలోనూ వాస్తవమౌతాయి. కానీ, శ్రమ పరికరాల మెరుగుదలకు ప్రత్యక్ష ఉత్పాదకులలో జ్ఞానమూ, సంస్కృతీ పెరగడం అవసరం గనుక, ప్రకృతిశాస్త్రాల జ్ఞానం విధిగా జనాలకు అందాలి. లేకపోతే శ్రామిక ప్రజల సాంస్కృతిక, సాంకేతిక స్థాయిని పెంచడం అసాధ్యం.

ప్రకృతిశాస్త్రం పరిసర ప్రపంచాన్ని గురించిన సిద్ధాంత జ్ఞానాన్ని యిస్తుంది గనుక,

అది శాస్త్రీయ ప్రపంచ దృక్పథం యేర్పడడానికి ప్రాతిపదికగా వుంటుంది. అది అతీంద్రియవాదానికీ, మూఢ విశ్వాసాలకూ, భ్రమాత్మక చైతన్యానికీ వ్యతిరేకంగా ప్రయోగించబడే గొప్ప శక్తి; అందువలన అది భావజాల పోరాటంలో భాగస్వామి అవుతుంది. అంతే కాక, వస్తుగత శాస్త్రాలు చెప్పే విషయాలే నిర్దిష్ట భావజాల రూపాలలో గ్రహించబడుతాయి; అందువలన శాస్త్రవిజ్ఞానం భావజాల పోరాటానికి రంగమౌతుంది.

ప్రకృతిశాస్త్రం సామాజిక జీవితపు అన్ని రంగాలమీదా, భావజాలంమీద కూడా, ప్రభావం నెరవుతుంది — ఒక సందర్భంలో ఉత్పాదక శక్తులద్వారానూ, మరొక సందర్భంలో తత్వశాస్త్రంద్వారానూ అది ఆ పని చేస్తుంది.

యీవిధంగా, సామాజిక చైతన్యం సామాజిక జీవితపు ప్రతి రంగంలోనూ మానవుల కార్యకలాపాలతో ముడిపడివుంది. ఉత్పాదక శక్తుల సృష్టిలోనూ, వినియోగంలోనూ, సామాజిక సంబంధాలను విప్లవాత్మకంగా మార్చడంలోనూ, దరహంమీద సామాజిక జీవితపు అంతర్వైరుధ్యాలను పరిష్కరించడంలోనూ అది క్రియాత్మక పాత్ర నిర్వహిస్తుంది.

భావజాలపు పాత్రను గురించిన సాధారణ సూత్రాలు సోషలిస్టు భావజాలపు సామాజిక కర్తవ్యాల సమస్యకు కూడా వర్తిస్తాయి. కానీ అందులో ఒక మౌలిక భేదం వుంది. సోషలిస్టు భావజాలం సారం రీత్యానే కాక, సమాజపు జీవితంలోనూ, అభివృద్ధిలోనూ అది నిర్వహించే పాత్ర రీత్యా కూడా మునుపటి సకల యుగాల భావజాలం కంటె భిన్నంగా వుంటుంది. అది యే సామాజిక కర్తవ్యాల పరిపూర్తికి తోడ్పడుతుందో వాటి స్వభావంచేత దాని పాత్ర చారిత్రకంగా నిర్ణయింపబడుతుంది.

సామాజిక అభివృద్ధిలోని నియమాల, చోదక శక్తుల, ధోరణుల శాస్త్రీయ జ్ఞానం లేకుండా, నూతన సమాజ నిర్మాణంలో విశాలమైన ప్రజా సముదాయాల చైతన్యపూరిత భాగస్వామ్యం లేకుండా, కమ్యూనిస్టు సామాజిక వ్యవస్థయొక్క పుట్టుకా, అభివృద్ధీ అసంభవమని మనం మనసులో పెట్టుకోవాలి.

సజీవమైన, సృజనాత్మకమైన సోషలిజం జనాలచేత స్వయంగా నిర్వహించబడాలి. జనాలను యేకం చేయడానికీ, ఉమ్మడి లక్ష్య సాధన వైపు వాళ్ల యిచ్చను మళ్లించడానికీ శాస్త్రీయ భావజాలం మాత్రమే తోడ్పడగలదు. దోపిడీ వర్గాల తొలగింపు ఉమ్మడి భావజాలం పతాకంకింద సమాజంయొక్క ప్రవర్ధమాన రాజకీయ సంపక్తికి కావలసిన పరిస్థితులను సృష్టిస్తుంది.

సోషలిస్టు భావజాలం నూతన సమాజపు శ్రామిక ప్రజలకు తమ సొంత ప్రయోజనాలను గురించిన శాస్త్రీయ చైతన్యాన్ని యివ్వడమే కాక, సమాజంలో ఉత్పన్నమయ్యే అంతర్వైరుధ్యాలను పరిష్కరించడానికీ, ప్రజల పాదార్థిక, సాంస్కృతిక ప్రమాణాలను పెంచ

డానికి మార్గాలను — కమ్యూనిజంను నిర్మించే మార్గాలను — కూడా తెలుపుతుంది. తమ మహత్తర లక్ష్యమైన కమ్యూనిజంను సాధిస్తామనే ధీమాను అది వాళ్లలో కలిగిస్తుంది, మానవుల మధ్య నూతన సంబంధాలకు ఉచితమైన ఆత్మిక, నైతిక గుణాలను వాళ్లలో పోషిస్తుంది. సోషలిస్టు భావజాలం సోవియట్ ప్రజలలో వున్న చారిత్రక ఆశావాదానికి ప్రాతిపదిక. యీ ఆశావాదం బూర్జువా నాయకులకు అచ్చెరువు కలిగిస్తుంది, దీనికి కారణమేమిటో వాళ్లకు తెలియదు.

సోషలిజం భావజాలానికి కొత్త సామాజిక ప్రక్రియను యిస్తుంది — నూతన సమాజాన్ని నిర్మించేటందుకు విశాలమైన శ్రామిక జనాలను తర్ఫీదు చేసి, వ్యవస్థీకరించి, సమీకరించే ప్రక్రియను.

కమ్యూనిజంను సాధించడానికి భావికాలపు మానవుని తీర్చిదిద్దడం అవసరం. సోషలిస్టు భావజాలాన్ని లీనం చేసుకుంటే, అది జనాలలో శాస్త్రీయ ప్రపంచ దృక్పథాన్ని రూపుదిద్దుతుంది, మనుషుల మానసిక దిఙ్మండలాన్ని విస్తృతపరుస్తుంది, తమ వ్యక్తిగత ప్రయోజనాలూ, సామాజిక ప్రయోజనాలూ ఒకటేనన్న అవగాహనను వాళ్లకు కలిగిస్తుంది, ప్రతి వ్యక్తీ కమ్యూనిజం కొరకు జరిగే సమష్టి కృషిలో క్రియాశీలంగా, ఉద్దేశపూర్వకంగా పాల్గొనడానికి తోడ్పడుతుంది.

సోషలిస్టు భావజాలాన్ని జనాల విప్లవాత్మక ఉద్యమంతో మేళవించే కర్తవ్యం కార్మిక వర్గపు పురోగామి, వ్యవస్థీకృత, చైతన్యపూరిత విభాగమైన మార్క్సిస్టు లెనినిస్టు కమ్యూనిస్టు, కార్మిక పార్టీలచేత నిర్వహించబడుతుంది. అన్నిటికంటె ముఖ్యంగా, యీ పార్టీలు అనుసరించే విధానంద్వారా మార్క్సిస్టు లెనినిస్టు భావజాలం సోషలిస్టు సమాజపు అభివృద్ధిని ప్రభావితం చేస్తుంది. పార్టీ విధానం సైద్ధాంతిక సూత్రాలను ఆయా చారిత్రక పరిస్థితులలో నిర్దిష్ట ఆచరణ కార్యక్రమాలుగా రూపాంతరీకరిస్తుంది. రాజకీయాలతో, సామూహిక ఆచరణతో ముడివడకపోతే భావజాలం వట్టి ఆశగానే నిలిచి పోయేది.

విప్లవ కమ్యూనిస్టు, కార్మిక పార్టీల విధానానికి మార్క్సిజం లెనినిజం సిద్ధాంత ప్రాతిపదిక. సోషలిజంలో యీ విధానం మొత్తం సమాజ అభివృద్ధిమీద నెరపే ఉద్దేశపూర్వకమైన ప్రభావానికి వాహనంగా పనిచేస్తుంది గనుక, ఆ విధానానికి ఆధారమైన మార్క్సిస్టు లెనినిస్టు భావజాలం సమాజ జీవితపు ఆర్థిక, రాజకీయ, ఆత్మిక రంగాలలో గొప్ప పాత్ర నిర్వహిస్తుంది.

మార్క్సిజం లెనినిజం కార్మికవర్గపు భావజాలం, దాని ప్రయోజనాల సిద్ధాంత వ్యక్తీకరణ, దాని చారిత్రక కర్తవ్యాల సూత్రీకరణ. అందువల్లనే మార్క్సిస్టు సూత్రాలకు జరిగే యెలాంటి వక్రీకరణనైనా, వాటికి చేసే యెలాంటి యిష్టారాజ్యపు వ్యాఖ్యానాన్నైనా,

యెలాంటి భావజాలపు గంద్రగోళాన్నైనా — కార్మికవర్గ పోరాటపు విజయానికి మహా ప్రమాదకరమైనట్టి వీటిని — కార్మికవర్గమూ, దాని పార్టీ నివారించ గోరుతాయి. మార్క్సిజంలో "బహుళత్వం" అనే భావంపట్లా, మార్క్సిజంలో వివిధ రకాలు వుండవచ్చు ననే సిద్ధాంతంపట్లా వ్యతిరేక వైఖరి దీనినిబట్టి యేర్పడుతుంది. శాస్త్రం ఒక్కటే వుంది, నిర్దిష్ట పరిస్థితులకు దానిని అన్వయించే రూపాలు మాత్రం మారుతాయి. మార్క్సిస్టు లెనినిస్టు సిద్ధాంత స్వచ్ఛత కొరకు అత్యంత కృతనిశ్చయంతో నిలబడకుండా వుంటే, పిడివాదులతోనూ, రివిజనిస్టులతోనూ రాజీ లేని పోరాటం సాగించకుండా వుంటే, విప్లవ కార్మిక వర్గ పార్టీ తన వర్గంపట్ల తన విధి నిర్వహణలో విఫలమై వుండేది. అదే సమయంలో, సామాజిక ఆచరణయొక్క అవసరాలూ, శాస్త్రవిజ్ఞానం సమకూర్చిన కొత్త విషయాలూ అనే ప్రాతిపదికమీద యీ సిద్ధాంతమే స్థిరంగా, సృజనాత్మకంగా అభివృద్ధి చెందకపోతే, విప్లవ సిద్ధాంత స్వచ్ఛత కొరకు పోరాటం సాగించడం అసంభవమని పార్టీ చెప్తుంది. శాస్త్రీయ సిద్ధాంత స్వచ్ఛత అంటే పిడివాదపు స్వచ్ఛత కాదు. పిడివాదం మార్పు చెందదు ధ్వంసం అవుతుంది — శాస్త్రం అభివృద్ధి చెందుతూ కొనసాగుతుంది.

సామాజిక జీవితపు అన్ని రంగాలలోనూ పార్టీ విధానానికి శాస్త్రీయ నిర్వచన యివ్వడమే కాక, పార్టీ విధానాన్ని అర్థం చేసుకొనే స్థితికి జనాలను లేవనెత్తడమూ, యీ విధానాన్ని అమలుపరచడంలో చురుకైన, సృజనాత్మకమైన చొరవను వాళ్లలో కలిగించడమూ కూడా సోషలిస్టు సమాజంలో మార్క్సిస్టు లెనినిస్టు భావజాలపు పాత్ర అవుతాయి.

సోషలిజంలోని జీవిత పరిస్థితులనుండి జనాలలో పనిపట్ల నూతన, సోషలిస్టు వైఖరీ, నూతన, కమ్యూనిస్టు నీతి జనిస్తాయి. కానీ, సోషలిజంలో కూడా సాధారణ చైతన్యానికీ, శాస్త్రీయ సైద్ధాంతిక చైతన్యానికీ మధ్య భేదం నిలిచి వుంటుంది. తమ అస్తిత్వం గురించి గానీ, దాని అభివృద్ధి నియమాలను గురించి గానీ శాస్త్రీయమైన అవగాహన యేదీ జనాల జీవిత పరిస్థితులనుండి సూటిగా ఉత్పన్నం కాదు. కమ్యూనిస్టు చైతన్య మనేది ప్రపంచ ప్రజ్ఞానపు మొత్తం చరిత్రయొక్క వెరసి, సర్వాగాసి అయిన నిర్ధారణ; అది శాస్త్రవిజ్ఞానంనుండి ఉద్భవించి, ఒక విజ్ఞానశాస్త్రంగా అభివృద్ధి చెందుతుంది. మానవజాతి సృష్టించిన పోగు చేసిన సమస్త జ్ఞానం సంపాదించిన వాడే కమ్యూనిస్టు కాగలడు. అందువలన, విశాలమైన ప్రజా సముదాయాల మధ్యలోకి శాస్త్రీయ, సోషలిస్టు చైతన్యాన్ని ప్రవేశపెట్టే కర్తవ్యం సోషలిస్టు యుగంలో కూడా అంతే ఎక్కువగానూ పార్టీని యెదుర్కొంటుంది. సోషలిజం విజయం పొంది, దోపిడీ వర్గాలు తొలగిపోవడంతో, సోషలిస్టు భావజాలం సమస్త ప్రజల భావజాల మౌతుంది. యిది జనాలలో దాని విస్తృత వ్యాప్తికి అత్యంత అనుకూల పరిస్థితులను సృష్టిస్తుంది. యీ దశలో, మొత్తం శ్రామిక జనబాహుళ్యంయొక్క చైతన్యాన్ని

దాని అగ్రగదళపు చైతన్య స్థాయికి లేవనెత్తడం, అనగా ప్రతి వ్యక్తికీ శాస్త్రీయ చైతన్యాన్ని యివ్వడం, అనే ఆచరణాత్మక కర్తవ్యాన్ని పెట్టుకోవడం మొట్టమొదటి సారిగా సాధ్య మౌతుంది. శాస్త్రీయ సిద్ధాంతాన్ని జనాల ఆచరణాత్మక అనుభవంతో లంకించడంద్వారా జనాల ఆచరణాత్మక, రూపాంతరీకరణ కార్యకలాపాలతో సన్నిహిత సంబంధంతో, సరిగా వ్యవస్థీకరించబడిన ప్రచారానికీ, సిబ్బందియొక్క తర్ఫీదుకూ, విద్యకూ చాలా ప్రాముఖ్యం వుంది.

జనాలలో భావజాల కృషిలో విజయమూ, దాని సఫలత్వమూ పలు విషయాలమీద ఆధార పడుతాయని సోవియట్ రాజ్య అభివృద్ధియొక్క అనుభవం తెలుపుతుంది. అందులో కొన్ని యివి:

1) జనాల మౌలిక ప్రయోజనాలనూ, ముఖ్య అవసరాలనూ వ్యక్తం చేసే సరైన రాజ కీయ పంథాను పార్టీ అనుసరించడం;

2) బూర్జువా భావజాలంమీదా, రివిజనిజంమీదా, పిడివాదంమీదా, ప్రజల మనస్సులలోని గతకాలపు అవశేషాలమీదా రాజీ లేని పోరాటం;

3) పార్టీయొక్క సిద్ధాంతమూ, విధానమూ సరైనవని జనాలు తమ ఆచరణాత్మక అనుభవంద్వారా తెలుసుకొనేటట్లుగా సిద్ధాంత, ఆచరణల యేకత్వమూ, మాటల, చేతల యేకత్వమూ; ఆచరణాత్మక చర్యలలో మనుషులకు తర్ఫీదూ;

4) జీవితంతోనూ, పార్టీచేత ప్రతిపాదించబడి, నిర్దిష్టమైన సంఘం నిర్వహించ బూనుకొనే కర్తవ్యాలతోనూ విడదీయరాకుండా ముడిపడి, నిర్దిష్టంగా వుండే ప్రచారం; పిడివాదాన్ని అధిగమించడం;

5) ఫలవంతమైన, సూత్రబద్ధమైన విమర్శ, ఆత్మవిమర్శల అభివృద్ధితోపాటు, కనుక్కోబడిన లోపాలను తొలగించడం;

6) ప్రజల సాంస్కృతిక ప్రమాణాలను పెంపొందించడం;

7) ప్రచారకుల భావజాల, సిద్ధాంత ప్రమాణాల పెరుగుదలద్వారా ప్రచారపు భావ జాల స్థాయిని నిరంతరంగా పెంపొందించడం;

8) ప్రత్యక్షమైన, అర్థమయ్యేటట్టి ప్రచార, ఆందోళనలూ, పడికట్టు పదాల విస ర్జనా, భావజాల ప్రభావపు లభ్యమైన సాధనాల నన్నిటినీ వినియోగించడమూ.

సోవియట్ యూనియన్ అభివృద్ధియొక్క అనుభవం తెలియజేసే దేమంటే: జనాలలో సోషలిస్టు చైతన్యాన్ని పెంపొందించడం సోషలిజంయొక్క అభివృద్ధిలో ఉత్పన్నమయ్యే ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, తదితర కర్తవ్యాల పరిష్కారంతోనూ, లోపాలను తొల

గించడానికి చేసే కృషితోనూ సజీవంగా ముడిపడివుంది. అందువల్ల అది భావజాల ప్రచారానికీ, విద్యకూ మాత్రమే చెందిన విషయం కాదు.

యీవిధంగా, సోషలిస్టు సమాజం వస్తుగత నియమాల ప్రజ్ఞానమూ, వాటిని చైతన్య పూరితంగా వర్తింపజేయడమూ అనే ప్రాతిపదికమీద ఉత్పన్నమౌతుంది, మనుతుంది, అభివృద్ధి చెందుతుంది, శాస్త్రీయ ప్రాతిపదికమీద ఆధారపడుతుంది. అందులో విప్లవాత్మకంగా కార్యాచరణద్వారా కాలం తీరిన సామాజిక పరిస్థితులు విచ్ఛిన్నమయ్యే కాలాలలోనే కాక, అన్ని రంగాలలోనూ నూతన జీవిత రూపాలను సృష్టించే రోజువారీ పనిలో కూడా భావజాలం సమాజ అవసరాలను తీరుస్తుంది.

ప్రకరణం తొమ్మిది

సమాజమూ, వ్యక్తీ

మన కాలంలో వ్యక్తి సమస్య మహా తీవ్రమైన సమస్య అయింది. అది ప్రతివొకరికీ ఆసక్తి గల, ప్రతివొకరికీ సంబంధించిన సమస్య.

ప్రపంచ చరిత్రయొక్క పురోగమనం యెలాంటి సన్నివేశానికి దారితీసిందంటే, యీ సన్నివేశంలో, ఆలోచించే ప్రతి మనిషికీ తన వ్యక్తిగత భవితవ్యానికీ, మానవజాతి భవిష్యత్తు దేనిమీద ఆధారపడుతుందో అట్టి యీ నాటి మౌలిక సామాజిక సమస్యల పరిష్కారానికీ మధ్య గల లంకె గాఢంగా అనుభూతమౌతున్నది. సమాజంయొక్కా, తన జాతి జనులయొక్కా, మొత్తం మానవాళియొక్కా భవిష్యత్తుపట్ల వ్యక్తియొక్క బాధ్యత అంతకంతకూ యెక్కువ అయింది. పెట్టుబడిదారీ వ్యవస్థకూ, సోషలిజంకూ మధ్య, కార్మికవర్గానికీ, బూర్జువా వర్గానికీ మధ్య, ప్రగతిశీల శక్తులకూ ప్రగతి వ్యతిరేక శక్తులకూ మధ్య జరిగే పోరాటంలో మానవ సమస్యల ప్రాముఖ్యం పెరుగుతూ వుంది.

వ్యక్తి సమస్యమీద మార్క్సిజంకూ, వివిధ బూర్జువా తాత్విక, సామాజిక శాస్త్ర ధోరణులకూ మధ్య తీవ్రమైన భావజాల పోరాటం జరుగుతున్నది. బూర్జువా సిద్ధాంతకారులు వ్యక్తి సమస్యపట్ల మార్క్సిస్టు వైఖరియొక్క సారాన్ని వికృతపరచి, మార్క్సిజం దానిని అప్రధానంగా చూస్తుందని నొక్కిచెప్తారు, మార్క్సిజం లెనినిజం వ్యక్తిని ఉపేక్షిస్తుందనీ, సోషలిజం వ్యక్తిని అణచివేస్తుందనీ, వ్యక్తిని సమష్టిలో ముంచివేస్తుందనీ ఆరోపిస్తారు.

సోషలిజం తీవ్రమైన వర్గ పోరాటంలో ఉద్భవిస్తూ, తన అభివృద్ధియొక్క తొలి సంవత్స రాలలో ప్రచండమైన కష్టాలను — పెట్టుబడిదారీ ప్రపంచపు శత్రుత్వంచేతా, వెనుకబాటు తనంచేతా, ఫాసిజంతో యుద్ధంచేతా, వగైరాలచేత కలిగిన కష్టాలను — అధిగమిస్తూ స్థిర పడుతూ వున్న కాలంలో, సహజంగానే వ్యక్తి సమస్యను ముందుకు తేవడానికి వస్తుగత పరిస్థితులు అడ్డుపడినాయి. వెనుకబాటుతనంనుండి బయటపడేటందుకూ, సోషలిజంను నిర్మించేటందుకూ, సమాజంయొక్కా, వ్యక్తియొక్కా యితోధిక సర్వతోముఖ పురోగతికి పునాది వేసేటందుకూ సోవియట్ ప్రజలు అనేక త్యాగాలు చేసినారు. యిప్పుడు సోషలిస్టు వ్యవస్థ పరిపక్వతా స్థితిని అందుకొంది గనుక, కమ్యూనిస్టు నిర్మాణం సోవియట్ ప్రజల యెదుట వున్న ఆచరణాత్మక కర్తవ్యం అయింది గనుక, సహజంగానే వ్యక్తి సమస్య సామాజిక అభివృద్ధి విషయంలోనూ, శాస్త్రీయ, తాత్విక అధ్యయనం విషయంలోనూ అంతకంతకూ ముఖ్య మౌతున్నది.

సిద్ధాంతానికీ, పరిశీలన పద్ధతికీ చెందిన పలు సమస్యలను రూపొందించి, పరిష్కరిస్తే తప్ప, సమాజానికీ, వ్యక్తికీ మధ్య గల సంబంధాన్ని అధ్యయనం చేయడం అసాధ్యమని స్పష్టం. తాత్విక సామాజిక శాస్త్రమైన చారిత్రక భౌతికవాదం ఆ సమస్యలను రూపొందించి, వాటిని ప్రత్యేక పరిశీలన విషయంగా చేస్తుంది. వాటిలో అత్యంత ముఖ్యమైనవి యివి: వ్యక్తియొక్క అభివృద్ధికీ, అతని కార్యకలాపాలకూ, అతని సామర్థ్యాల వ్యక్తీకరణకూ, వినియోగానికీ సమాజం యే సామాజిక పరిస్థితులనూ, భౌతిక, ఆత్మిక అవకాశాలనూ కలిగిస్తుంది? మనిషికి సామాజిక పరిస్థితులతో యెలా సంపర్కం కలిగించబడుతుంది, అతని వ్యక్తిత్వం యెలా రూపుదిద్ద బడుతుంది? నిర్దిష్ట సామాజిక వ్యవస్థ చట్రం లోపల సమాజ ప్రయోజనాలూ, వ్యక్తి ప్రయోజనాలూ యెలా పరస్పరం సంధింపబడుతాయి? అవి రెండూ వివిధ సామాజిక వ్యవస్థల నిర్మాణంనుండే ఉద్భవిస్తాయి గనుక, వాటి సంబంధాలను పాలించే సూత్రాలు యేమిటి? యే చారిత్రక క్రమంలో వ్యక్తి యేర్పడి, అభివృద్ధి చెందుతాడు, చరిత్రలో వ్యక్తి పాత్ర యేమిటి?

వ్యక్తిత్వ అభివృద్ధి

నిత్య జీవితంలోనూ, శాస్త్రవిజ్ఞానంలోనూ, తత్వశాస్త్రంలోనూ మనిషిని వర్ణించ డానికి పలు పదాలు ఉపయోగించబడుతున్నాయి — వ్యక్తి, వ్యక్తిత్వం, వ్యక్తి ప్రత్యేకత, మొదలైనవి. వీటి మధ్య గల భేదం యేమిటి?

మనిషి అనేది మానవ జాతిని వర్ణించే అత్యంత సాధారణ భావం; యీ ప్రాణుల జాతికి సామాజిక స్వభావం వుందనీ, యీ జాతికి చెందిన ప్రతివొకరికీ మనిషి అనబడే హక్కు వుందనే అర్థం దీనిలో యిమిడి వుంది.

వ్యక్తి అంటే ఒకేఒక మనిషి. స్త్రీపురుష భేదంతోనూ, వయస్సుతోనూ, నిర్దిష్ట చారిత్రక యుగంతోనూ నిమిత్తం లేకుండా ప్రతి మనిషీ ఒక వ్యక్తి. వ్యక్తి మానవ జాతి యొక్క యేకకం. యీ మాట యే గుణాత్మక విలక్షణాలూ లేకుండా కేవలం పరిమాణాత్మకంగా మనిషిని నిర్వచించడానికి ఉపయోగించబడుతుంది. మనిషి ప్రత్యేకతగా యెంత తక్కువగా అభివృద్ధి చెందితే అంత యెక్కువగా అతను వ్యక్తిత్వంగా కాక, వ్యక్తిగా కనపడతాడు అనే అర్థం కూడా దీనిలో యిమిడి వుంది.

వ్యక్తిత్వం కూడా ఒకేఒక మనిషి. కానీ ప్రతి మనిషీ వ్యక్తిత్వం కాదు. ఆవిధంగా, అప్పుడు పుట్టిన శిశువు మనిషే, కానీ యింకా వ్యక్తిత్వం కాదు. వ్యక్తి సంస్కృతీ విజయాలను లీనం చేసుకొన్నప్పుడు, కార్యాచరణకు చైతన్యపూరితుడైన కర్త అయి, తన చర్యలకు బాధ్యుడై, తన సొంత ప్రత్యేకతను అభివృద్ధి చేసుకొన్నప్పుడు, వ్యక్తిత్వ మౌతాడు. మనిషియొక్క వ్యక్తిగత, అభివృద్ధి క్రమంలో వ్యక్తిత్వం యేర్పడుతుంది.

కానీ, యీ వ్యక్తిగత అభివృద్ధి, అనగా ఒక విశిష్టమైన ప్రత్యేకత యేర్పడడం, అదే సమయంలో మనిషికి అతని మానవత్వాన్ని యిచ్చే క్రమం కూడా. కానీ, మనిషియొక్క మానవత్వాన్ని కేవలం మానవ జాతిలో సభ్యత్వంగా చూడకూడదు. మనిషి సారభూతంగా సకల సామాజిక సంబంధాల వెరసి మొత్తం అని మార్క్సు అన్నాడు. మనిషిపట్ల వైఖరిలో యిది చాలా ముఖ్యమైన సూత్రం; దీని మూలంగా మార్క్సిజం యితర తాత్విక సిద్ధాంతాలన్నిటికీ భిన్నంగా వుంది. మార్క్సిజం మనిషి సారాంశాన్ని గురించిన తన దృక్పథాన్ని, తత్పర్యవసానంగా వ్యక్తి సారాంశాన్ని గురించిన తన దృక్పథాన్ని కూడా, మనిషిని రూపుదిద్దే నిర్దిష్ట సమాజపు సందర్భంలో పెట్టుతుంది.

యేదైనా ఒక సమాజాన్ని అధ్యయనం చేసేటప్పుడు, మనం ఆ సమాజంలో మనిషి యొక్క ముఖ్య లక్షణాలనూ, నిర్దిష్టమైన సారాంశాన్నీ ఆవిష్కరిస్తాం. కానీ, మనిషి సారాంశం యింకా మొత్తం మనిషి కాదు. సమాజాన్ని అధ్యయనం చేసేటప్పుడు, మనం యింకా మనిషిని అతని మహా వివిధమైన వ్యక్తిగత వ్యక్తీకరణల దృష్ట్యానూ, సమాజంతో అతని సంబంధాల దృష్ట్యానూ తెలుసుకోము. ప్రతి నిర్దిష్ట మనిషినీ సమాజంతో అభిన్నంగా చూడకూడదు. మనిషి సమాజంలో కరిగిపోడు; తద్వ్యతిరేకంగా, అతను సమాజం కంటె భిన్నమైన వస్తువు; యెందుకంటే, ప్రతివాడూ ఒక అద్వితీయమైన ప్రత్యేకత, ఒక నిర్దిష్టమైన వ్యక్తిత్వం.

కనుక, వ్యక్తిత్వం ఒకేసారి సాధారణ మానవ తత్వానికీ (ప్రతి వ్యక్తిత్వమూ ఒక మనిషి గనుక), ప్రత్యేకతకూ వాహనం, ప్రతి మనిషీ నిర్దిష్ట యుగానికీ, నిర్దిష్ట సమాజానికీ, జాతికీ, వర్గానికీ చెందుతాడు గనుక; ఆ వ్యక్తిత్వానికి మాత్రమే ఉచితమైన అద్వితీయ గుణాలకు, ప్రతి మనిషినీ అద్వితీయమైన ప్రత్యేకతగా చేసే గుణాలకు, కూడా వాహనం. కనుక, వ్యక్తిత్వపు నిర్మాణం యీ మూడు పార్శ్వాల క్రమం. వ్యక్తిత్వపు సాధారణ మానవ లక్షణాలూ (అనుభూతి చెందడానికీ, ఆలోచించడానికీ, ఆచరించడానికీ సామర్థ్యం), అతని వ్యక్తిగత లక్షణాలూ, దాని సొంత విశిష్ట లక్షణాలు గల నిర్దిష్ట సమాజంలో తయారౌతాయి.

వ్యక్తిత్వపు వ్యక్తిగత అభివృద్ధిని చర్చించేటప్పుడు, మొట్టమొదట లెక్కలోకి తీసుకో వలసిన విషయం మానవుని స్వతస్సిద్ధమైన జీవగత జననం. ప్రతి మానవుని జీవితమూ నిశ్చితమైన జీవగత క్రమంలో నడుస్తుంది: అతను పుట్టుతాడు, పెరిగి పెద్దవా డౌతాడు, ముసలివా డౌతాడు, మరణిస్తాడు. పిల్లలు చాలా కాలం తలిదండ్రులమీద ఆధారపడడానికి కారణం మానవుని జీవగత అభివృద్ధియొక్క విశిష్టత్వమే. మానవులకు ఆహార, పానీయ, నిద్రా, విశ్రాంతుల జీవగత అవసరాలూ, నిత్య కామ ప్రేరణలూ, మొదలైనవి వున్నాయి. ప్రతి మానవుని విశిష్టత్వమూ అతని సహజ సామర్థ్యాలతోనూ, అతని విశిష్ట మనః ప్రవృత్తి, వగైరాలతోనూ ముడివడి వుంది. సమాజంలో మనుషుల మధ్య స్త్రీ పురుష భేదాలూ, వయోభేదాలూ, జాతి భేదాలూ వున్నాయి; యివి జీవగతమైనవి.

యీవిధంగా, మానవుడు ప్రకృతి సంతానం. అతని సామాజిక అభివృద్ధి స్థాయి యేదై నప్పటికీ, ప్రకృతితో అతని బంధాలు యెప్పుడూ తెగిపోవు; ప్రతి వ్యక్తిత్వపు వ్యక్తిగత అభి వృద్ధిమీదా దీని ప్రభావం వుంటుంది. మానవుని సామాజిక అభివృద్ధికి యెల్లప్పుడూ జీవగత ప్రాతిపదికలూ, పూర్వావసరాలూ వుంటాయి; కానీ, యివి సామాజిక పరిస్థితుల తాకిడి కింద రూపాంతరం చెందుతాయి, నిశ్చితమైన సామాజిక పర్యవసానాలు కలిగిస్తాయి. ఆవిధంగా, సొంత ఆస్తి పెత్తన వ్యవస్థలో స్త్రీ పురుష భేదాల ఫలితంగా పురుషుని స్త్రీయొక్క సామాజికార్థిక పరాధీనత యేర్పడుతుంది. కేవలం బాహ్యమైన రంగు, వెంట్రుకలు, మొద లైన జాతి భేదాలు, భౌగోళిక పరిసరాల ప్రభావంతో ఉత్పన్నమయ్యే భేదాలు, శత్రుత్వపూరిత సమాజంలో అపారమైన సామాజిక పర్యవసానాలను కలిగిస్తాయి: జాతి వివక్షా, అసమానత్వమూ, పోరాటమూ. జాతితత్వ సిద్ధాంతాలూ, మానవ ద్వేషపు జాతితత్వ భావజాలాలు ఉద్భవించి, జాతి భేదాలను పరమమైనవిగానూ, జాతుల పోరాటం ప్రపంచ చరిత్రకు కీలకమైనదిగానూ పరిగణించడానికి అభిముఖంగా వుంటాయి. కానీ, అందులో విషాదకరమైనది యేమిటంటే, మానవుని స్వభావాన్నీ, అతని ఆలోచన, ఆచరణల సామర్థ్యాన్నీ విలువ గట్టేటప్పుడు, జాతి భేదాలు పాటించడం. అవి పూర్తిగా అసందర్భమైనవి.

వయోభేదాలకు కూడా సామాజిక ప్రాముఖ్యం వుంది. పెట్టుబడిదారీ దేశాలలో యువ జన సమస్యలు — తరాల అంతరం — మహా తీవ్రమైనాయి. యువజనులలో ఒక విభాగం, పెట్టుబడిదారీ వ్యవస్థ లోపాలను నిశితంగా గుర్తిస్తున్నది. అది వాళ్లలో వివిధ రూపాల నిరసనలను జనింపజేస్తుంది.

ఒక వ్యక్తి ఫలానా స్థలంలో, ఫలానా కాలంలో పుట్టుతాడనే విషయం అతనికీ, నిర్దిష్ట సామాజిక, జాతీయ, మొదలైన పరిసరావళికీ మధ్య ఒక బంధాన్ని సృష్టిస్తుంది. యిది అతని వ్యక్తిగత అభివృద్ధియొక్క స్వభావాన్నీ, అతని భవిష్యత్తునూ కొంతవరకు ముందుగానే నిర్ణయిస్తుంది. మనిషిని వ్యక్తిత్వంగా రూపుదిద్దేది నిజంగా సామాజిక పరిసరావళే. కేవలం జీవగతంగా కూడా, సమాజానికి వెలుపల, నిర్దిష్ట భౌతిక, సాంస్కృతిక పరిసరావళి వెలుపల, మానవుడు జీవించడు, జీవించజాలడు.

జ్ఞాపకం పెట్టుకోవలసిన మొదటి విషయం యేమిటంటే, మానవుడు తన జీవితంలో మూడో వంతు భాగం యితర మానవులమీద సూటిగా ఆధారపడుతాడు. యెందుకంటే, వాళ్ల శ్రద్ధా, పోషణా, జీవితావసర వస్తువులన్నీ వాళ్లు సమకూర్చడమూ, వగైరా లేకుండా అతను బతకజాలడు. తక్కిన జీవితమంతా అతను యితర మానవులతో కార్యకలాపాల మార్పిడి ద్వారా తనకు కావలసినవన్నీ పొందుతూనే వుంటాడు. అంతే కాక, అతని ''కేవలం జీవగత'' అవసరాలను (అతని తదనంతర సామాజిక అభివృద్ధి గతిలో ఉత్పన్నమయ్యే అవసరాల మాట అటుంచి) తీర్చుకోడానికి కావలసిన వస్తువులన్నీ, వాటిని తీర్చుకొనే పద్ధతులతో, సాధనాలతో సహా, సమాజంచేత ఉత్పత్తిచేయబడుతాయి. చివరి విషయంగా, అతను ఆత్మికంగా యితర మానవులమీద ఆధారపడుతాడు; యెందుకంటే, అతను తన భాషా, తన జ్ఞానమూ, హక్కులనూ, విధులనూ గురించిన తన భావాలూ, ప్రవర్తన నియమాలూ, ప్రమాణాలూ వాళ్ల నుండి పొందుతాడు. నిజానికి, మానవుడు బతకడమే కాక, ఆచరించడం కూడా నేర్చుకొనేది సమాజంనుండే.

వ్యక్తిత్వపు విద్యాభ్యాసమూ, అభివృద్ధీ మానవుని జీవితంలో యేదో ఒక దశలో జరిగే, కచ్చితమైన కాల పరిమితి గల క్రమం కాదు. కచ్చితంగా చెప్పాలంటే, మానవునికి తన జీవితమంతా మారే, మెరుగుపడే సామర్థ్యం వుంది. కానీ, యీ క్రమంలో గుణాత్మకంగా విశిష్టమైన దశలను వేరుపరచవచ్చు. మానవుని మనఃప్రవృత్తి మృదుత్వానికి వయో విశిష్టతలు వుంటాయని మనశ్శాస్త్రజ్ఞులు యేకగ్రీవంగా చెప్తారు. మానవుడు బాల్యంలోనూ, యవ్వనంలోనూ రూపుదిద్దబడి, బాహ్య ప్రభావాలకూ, తాకిళ్లకూ ప్రతిస్పందించే తన మనఃప్రవృత్తి ఒక సారి స్థిరపడిన తర్వాత దానిని నిలుపుకోడానికీ, దాని మార్పును ప్రతిఘటించడానికీ ప్రయత్నిస్తాడు. ఒకసారి అలవడిన అలవాట్లు మానవుని మనఃప్రవృత్తిమీద బలమైన

ముద్ర వేస్తాయి. దీనినిబట్టి యేర్పడే దేమిటంటే, వ్యక్తిగత, సామాజిక అభివృద్ధి గతిలో మానవుడు మారడమూ, జీవిత పరిస్థితులకు అనుగుణంగా తన్ను తాను మలచుకోవడమూ అనే దాదాపు అతని జీవితమంతా జరిగే క్రమాన్ని మొత్తంమీద రెండు ప్రధాన దశలుగా విభజించవచ్చు: మలచుకొనే దశ, బాల్య, యవ్వనాలకు వర్తించేది, వయస్కు వ్యక్తియొక్క క్రియాశీల కార్యాచరణ దశ, సమాజంలో మానవుని "స్వతంత్ర" ఆచరణకు చెందిన దశగా వర్ణించడానికి వీలున్న దశ. మానవుడు సమాజంలో ఒక నిర్దిష్టమైన సామాజిక పాత్ర నిర్వహించడం ప్రారంభించినప్పుడు అతను వయస్కుడౌతాడు; అతను తనను గురించి, యితరులను గురించి వేసే అంచనాలో వచ్చే మార్పుకు అదే ప్రాతిపదిక.

అయితే, వ్యక్తియొక్క విశిష్ట లక్షణాలను, ప్రతి మనిషియొక్క అద్వితీయమైన ప్రత్యేకతను, నిర్ణయించేది యేమిటి? పెద్ద సామాజిక బృందాలూ, జాతులూ, మొదలైనవి యేకైక సమస్తంగా వుంటూనే, వ్యక్తియొక్క ప్రత్యేకతల వైవిధ్యాన్ని కలిగి వుంటాయని నిత్య అనుభవంద్వారా మనకు తెలుసు. యీ భేదాలు ప్రతి మానవుడూ యే విశిష్ట వ్యక్తి గత పరిస్థితులలో జీవిస్తాడో వాటిచేత నిర్ణయింపబడుతాయి. యిటు నిర్దిష్ట సమాజపు సాధారణ పరిస్థితులకూ, సంబంధాలకూ, నియమాలకూ, అటు వ్యష్టి వ్యక్తిత్వానికీ, అతని చర్యలకూ మధ్య సూక్ష్మ పరిసరావళీ, చిన్న బృందాలూ, వ్యష్టి మానవుడూ అనే రూపాలలో మధ్యంతర లంకెలు వున్నాయి. వ్యక్తి యెప్పుడూ నిర్దిష్ట పరిసరావళిలో — కుటుంబమూ, పాఠశాలా, ఉత్పత్తి జట్టూ, వగైరాల లాంటి సమష్టి సంఘంలో — రూపుదిద్దబడుతాడు, జీవిస్తాడు, ఆచరిస్తాడు. అతని వ్యష్టి ఉనికి యితర మానవులతో అతని ప్రత్యక్ష సంపర్కాల రంగమైన అతని తక్షణ పరిసరాలయొక్కా, "చిన్న బృందాల"యొక్కా విశిష్ట లక్షణాల మీద మాటిగా ఆధారపడుతుంది. వ్యక్తిత్వం తన వ్యష్టి ఉనికియొక్క తక్షణ భౌతిక పరిస్థితులచేతా, చిన్న బృందాలలో వున్న విలువల వ్యవస్థలచేతా, సంప్రదాయాలచేతా, నియమాల చేతా రూపుదిద్దబడుతుంది. నిజమే, ఒకే సూక్ష్మ పరిసరావళి చట్రం లోపల భిన్న ప్రత్యేకతలు రూపుదాలుస్తాయి. పరిసర పరిస్థితుల ప్రభావంలో మానవుడు క్రియారహితంగా వుండడు, వాటిపట్ల క్రియాత్మక వైఖరి వహిస్తాడు. బృహత్ పరిసరావళీ, సూక్ష్మ పరిసరావళీ రెండూ నెరపే ప్రభావాల ప్రవరణాత్మక స్వభావానికి కారణాలు అనేకం; వాటిలో మానవుని సహజ సామర్థ్యాలూ, అతని కార్యకలాపాలూ గణనీయమైన పాత్ర నిర్వహిస్తాయి.

అదే సమయంలో, మానవుడూ, అతని తక్షణ పరిసరావళీ మరింత విశాలమైన సామాజిక సంబంధాల వ్యవస్థతో మేళవించబడుతాయి: వర్గ, అంతర్వర్గ, తెగ, అంతర్జాతీయ, వగైరా సంబంధాలు. అందువల్ల, వ్యక్తియొక్క ప్రత్యేకత రూపుదిద్దబడడాన్ని కేవలం సూక్ష్మ పరిసరావళి ఫలితంగా చూడకూడదు. వ్యక్తిత్వాన్ని రూపుదిద్దే వివిధ ప్రభావాల సంకీర్ణ

వ్యవస్థలో వ్యక్తిని నూటిగానూ, సూక్ష్మ పరిసరావళిద్వారానూ ప్రభావితం చేసే నిర్దిష్ట సమాజంలోని సాధారణ జీవిత పరిస్థితులకు నిర్ణయాత్మక ప్రాముఖ్యం వుంది. సామాజిక పరిణతిలో నిర్దిష్టమైన దశకు చేరినప్పుడు వ్యక్తి వర్గ, జాతీయ, అంతర్జాతీయ ప్రయోజనాలనుండి ఉత్పన్నమయ్యే సమస్యలపట్ల, అనగా చిన్న బృందంయొక్క తక్షణ ప్రయోజనాల పరిధిని యెంతో దాటిపోయే సమస్యలపట్ల, క్రియాత్మక వైఖరి వహించడం ప్రారంభిస్తాడు.

మానవుని సొంత క్రియాశీలత యెల్లప్పుడూ అతను యే ప్రాతిపదికమీద పరిసర పరిస్థితులచేత, అతని పరిసరావళిచేత, ప్రభావితం చేయబడుతాడో ఆ ప్రాతిపదికగా వుంటుంది. అతని వ్యక్తిత్వం యేర్పడే తొలి దశలలో యీ క్రియాశీలత క్రీడా రూపం ధరిస్తుంది. శిశువు మొదట ప్రపంచాన్ని గురించీ, వస్తువుల గుణాలను గురించి నేర్చుకొనేదీ, తన వ్యక్తిత్వాన్ని రూపుదిద్దుకొనేదీ, వ్యక్తీకరించేదీ క్రీడలోనే. తదనంతరం, మానవుడు ప్రపంచంతో చర్యా ప్రతి చర్యలు జరిపే క్రమంలో విద్యా, పనీ, వివిధ రకాల భౌతిక, ఆత్మిక కార్యకలాపాలూ చేరుతాయి. మానవుని సారాంశం క్రియాత్మకమైనది, అతను తన పరిసరావళియొక్క క్రియారహిత ఉత్పాదితం కాదు, సాపేక్షంగా దానినుండి స్వతంత్రుడు. వ్యక్తిత్వపు ప్రవర్తన నిర్మాణాన్ని రూపుదిద్దడానికి యీ సాపేక్ష స్వాతంత్ర్యం తప్పనిసరి పూర్వావసరం; అలా రూపుదిద్ద బడినప్పుడు వ్యక్తి తన ప్రవర్తన ముందుగా నిర్ణయించబడి, తవ పరిసరావళిచేత కచ్చితంగా నియంత్రించబడే జీవిగా కాక, సృజనాత్మక కర్తగా స్వయంగా తానే చేసిన నిర్ణయాలనుబట్టి ఆచరిస్తాడు. అందువల్లనే, మానవుడు తన ప్రవర్తనలో యే మేరకు స్వతంత్రుడుగా వుండేదీ వ్యక్తిత్వంగా అతని అభివృద్ధిని సూచిస్తుంది.

• వ్యక్తిత్వపు చారిత్రక అభివృద్ధి

పైన చెప్పినట్లు, మానవుడు శ్రమ క్రమంలో, శ్రమ ప్రాతిపదికమీద ప్రకృతినుండి బయటపడినాడు. కానీ, ఆదిమ సమాజంలో, తాను యే సమష్టి సంఘంలో (ఆదిమ మందలో, గణంలో, తెగలో) సభ్యుడో దానితో యెంత బలంగా యేకం చేయబడినాడంటే, అతని కింకా తాను స్వతంత్ర వ్యక్తిననే స్పృహ లేదు, నిజాని కతడింకా స్వతంత్ర వ్యక్తి కాదు. మార్క్స్ అన్నట్లు, మానవు డింకా ప్రకృతి బంధాల బొడ్డుతాడును తెంచుకోలేదు; నిర్దిష్ట సమష్టి సంఘంలో సభ్యునిగా మాత్రమే తన వ్యక్తిగత ఉనికిని గురించి అతనికి స్పృహ వుండింది. మానవునికీ, సమష్టి సంఘానికీ వుండిన ఆదిమ యేకత్వం ఉత్పాదక శక్తులు అభివృద్ధి చెందకపోవడం వల్లా, మానవులు ప్రకృతిమీద ఆధారపడడం వల్లా యేర్పడిన ఫలితం.

ప్రకృతిని మానవులు వ్యష్టి ఉత్పాదకులుగా కాక, నిర్దిష్ట సమష్టి సంఘంగా యెదు ర్కొనేవాళ్లు.

సమష్టి గణంలో వ్యక్తి సామాజికీకరింపబడి, అతని గణానికి, లేక తెగకు చెందిన కార్యకలాపాల రూపాలతోనూ, జీవిత నియమాలతోనూ సంపర్కంలో పెట్టబడేవాడు. కానీ, అది యింకా అతని వ్యక్తిత్వాన్ని రూపుదిద్దే క్రమం కాదు.

చారిత్రకంగా, ఆదిమ సమష్టి సమాజం విచ్ఛిన్నమై, వర్గ సమాజం ఉద్భవించడంతో, మానవుల కార్యాచరణ ఫలితాలు అంతకంతకూ యెక్కువగా తమ ప్రత్యేకతమీదా, తమ సొంత నిర్ణయాలమీదా ఆధారపడ సాగినప్పుడు, మానవుడు వ్యక్తిత్వంగా రూపుదాల్చ సాగినాడు. యీ పరిస్థితులలో, వ్యక్తి వ్యక్తిత్వంగా అభివృద్ధి చెందడం ఆవశ్యకత అవుతుంది; యీ ఆవశ్యకత బయటనుండి రుద్దబడేది, సామాజిక అభివృద్ధియొక్క వస్తుగత అవసరాలనుండి ఉత్పన్నమయ్యేది.

సమాజానికీ, వ్యక్తిత్వానికీ మధ్య గల యీ సంబంధానికి చెందిన సమస్యపట్ల ప్రతి సామాజిక వ్యవస్థకూ తన సొంత వైఖరీ, సొంత పరిష్కారమూ వున్నాయి. వివిధ దేశాల విశిష్ట లక్షణాల, సంప్రదాయాల ప్రభావం వాటిమీద వుంటుంది.

వ్యక్తియొక్క అభివృద్ధినీ, సమాజంతో అతని సంబంధాన్నీ వర్ణించడంలో మూడు అంశాలను పరిగణించాలి:

1) వ్యక్తియొక్క అభివృద్ధి కొరకు సమాజం సమకూర్చే వస్తుగత పరిస్థితులు;
2) వ్యక్తియొక్క స్వీయ స్పృహా, క్రియాశీలతా యే మేరకు అభివృద్ధి చెందినాయనేదీ;
3) మానవుణ్ణి యే మేరకు వ్యక్తిగా సమాజం గుర్తిస్తుందనేదీ.

సొంత ఆస్తీ, సమాజం వర్గాలుగా విభజింపబడడమూ అనే ప్రాతిపదికమీద, వ్యక్తి వర్గంయొక్క, లేదా సామాజిక అంతస్తుయొక్క, లేదా కులంయొక్క ప్రతినిధిగా సమా జంతో పరోక్ష సంబంధం గల వర్గ వ్యక్తిగా యేర్పడుతాడు. తదనుగుణంగా, పాలక, పీడిత వర్గాలలో వ్యక్తిత్వం యేర్పడడానికి మొట్టమొదటినుండి భిన్న భిన్న పరిస్థితులు ఉత్పన్న మౌతాయి. ప్రత్యక్ష ఉత్పాదకులైన బానిసలు పశువుల, వస్తువుల స్థాయికి కుదించబడిన ప్రాతిపదికమీద, బానిస యజమాన గ్రీసులో పుట్టిన "మహా పురుషులు" వర్ధిల్ల గలిగినారు. ఫ్యూడల్ ప్రభువుల ధీరోదాత్తతకు ప్రాతిపదిక యేమిటంటే, రైతులను నిర్విలక్షణ మైన మందగా మార్చడం. జనాల పీడనా, దోపిడీ, బానిసీకరణా, వాళ్లను మానసిక, సృజనాత్మక కార్యాచరణనుండి వేరుచేయడమూ వ్యక్తులుగా వాళ్ల అభివృద్ధిని మందగింప జేస్తుంది.

అంతే కాక, వ్యక్తి రూపుదాల్చడంలో అతని స్వీయ స్పృహయొక్క అభివృద్ధి చేరుతుంది.

నిజమే, భావవాదులు చేయడానికి అభిముఖంగా వున్నట్లు, వ్యక్తిత్వాన్ని స్వీయ స్పృహగా కుదించడం సరి కాదు; మరి, వ్యక్తియొక్క స్వీయ స్పృహ, సమాజంపట్ల తన బాధ్యతను గురించిన స్పృహ వ్యక్తిత్వంగా అతని అభివృద్ధిని సూచిస్తాయి. అంటే కేవలం చైతన్యం కాదు, యధార్థ పరిస్థితులు: వ్యక్తియొక్క స్వీయ స్పృహ యే మేరకు అభివృద్ధి చెందేదీ అదే చారిత్రక పరిస్థితులమీద ఆధారపడుతుంది. ఆవిధంగా, తరతమ అంతస్తులు గల సమాజంలో మనిషి వ్యక్తిత్వంగా కాక, ఫలానా సామాజిక అంతస్తుయొక్క ప్రతినిధిగా తన్ను తాను నిలుపుకుంటాడు. ప్రభువర్గీయుడు అన్నిటికంటె యెక్కువగా విలువ యిచ్చింది ఒక అంతస్తుగా ప్రభువర్గానికి తాను చెంది వుండడానికి. పెట్టుబడిదారునికి వ్యక్తిత్వం అతని ఆస్తినుండి విడదీయరానిది: పెట్టుబడిదారీ వ్యవస్థలో మనిషి స్వతంత్ర వ్యక్తిగా కనపడేది ఆస్తిపరుడుగా, అతనికి గల హోదాలోనే, అతని గౌరవం అతని ఆదాయంతో సమానంగా చూడబడుతుంది. అందువల్లనే, తలనిండా అలాంటి భావజాలం కలవాళ్ళ సోషలిజం సొంత ఆస్తిని తొలగించినప్పుడు అది మనుషు లందరినీ ఒకే హీన స్థాయికి దించి, వ్యక్తిత్వాన్ని ధ్వంసం చేస్తుందని మనస్ఫూర్తిగా నమ్మవచ్చు.

చివరి విషయంగా, సమాజానికీ, వ్యక్తికీ మధ్య గల సంబంధాన్ని పరిశీలించడంలో, వ్యక్తికీ, అతని హక్కులకూ సమాజం నామకంగానూ, యధార్థంగానూ యిచ్చే గుర్తింపుకు చెందిన సమస్య ఉత్పన్నమౌతుంది. యీ సమస్య భిన్న చారిత్రక దశలలో నిర్దిష్ట రూపాలు ధరిస్తుంది, కానీ యెల్లప్పుడూ నిర్దిష్ట సమాజంయొక్క ఆర్థిక వ్యవస్థతోనూ, సామాజిక వ్యవస్థతోనూ, భావజాలంతోనూ ముడిపడి వుంటుంది. బానిసలకూ, ఫ్యూడల్ దాసులకూ వ్యక్తులుగా వుండే హక్కు తొలగించబడి వుండిందని జ్ఞాపకం వుంచుకోవాలి. చట్టం యెదుట సమానత్వం అనే సూత్రం గల బూర్జువా సమాజం వ్యక్తి హక్కులను గుర్తించడంలో గణ నీయంగా పురోగమించింది; కానీ, పెట్టుబడిదారీ వ్యవస్థలో మానవుని విలువను నిర్ణయించేది అతని సామాజిక స్థాయీ, ఆస్తి స్థాయీ.

శతాబ్దాల పొడుగునా దోపిడీ వర్గాల సభ్యులు శ్రామిక జన బాహుళ్యాన్ని యే ప్రత్యేకతలూ లేని నిర్వర్ణమైన, నిర్విలక్షణమైన మందగా పరిగణించినారు. యీ అహంభావపు దృష్టి దోపిడీదార్ల దృక్పథంనుండి జనాల పీడిత, పరాధీన పరిస్థితులను ప్రతిబింబించి, ఐశ్వర్యంలోనూ, ప్రభువర్గంలోనూ ఉన్నతులుగా వుండినవాళ్ళ స్థాయిని సమర్థించడానికి మహా అనుకూలమైన మార్గంగా వుండింది. కనుక, వ్యక్తికి అత్యున్నతమైన విలువ యిచ్చే మానవతావాద, ప్రజా తంత్ర అభిప్రాయాలు, శత్రుత్వపూరిత సమాజంలో ఆ భావం సాధింపబడజాలక పోయి నప్పటికీ, సామాజిక ఆలోచనకు గొప్ప లాభం.

అభివృద్ధి చెందిన పారిశ్రామిక ఉత్పత్తి, రవాణా, సాముహిక సమాచార సాధనాలూ,

మనుషుల మధ్య సంబంధాలకు విశాలమైన అవకాశాలూ, నామకపు సమానత్వమూ, వగైరా గలిగిన పెట్టుబడిదారీ వ్యవస్థ, ఒక వైపున, వ్యక్తిత్వపు అభివృద్ధికి మరింత అనుకూలమైన పరిస్థితులను సృష్టిస్తున్నట్లూ, ఆ సమాజంలో నిత్యం సాగుతున్న మనుగడ పోరాటంలో మనిషి బతికి బయటపడాలంటే అతను తన ఆత్మిక శక్తులను మరింత తీవ్రంగా వినియోగించాలని డిమాండు చేస్తున్నట్లూ కనపడుతుంది. మరొక వైపున, పెట్టుబడిదారీ వ్యవస్థ మానవుని అవిటివాణ్ని చేసి, అతని వ్యక్తిత్వాన్ని వికృతపరుస్తుంది, మానవుల ఆత్మలను ధ్వంసంచేస్తుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థలో శ్రమ విభజనయొక్క అన్ని రూపాలూ బాగా అభివృద్ధి చెందుతాయి, కానీ అవి వికృతపరచబడుతాయి: ఉత్పత్తి సంస్థల లోపలా, ఉత్పత్తి శాఖల మధ్యా ప్రత్యేక సాంకేతిక విభజన వుంటుంది, పట్టణానికీ గ్రామానికీ మధ్యా, మానసిక శ్రమకూ, శరీర శ్రమకూ మధ్యా సామాజిక శ్రమ విభజన కూడా వుంటుంది. యిలాంటి శ్రమ విభజన మనిషిని నిర్దిష్ట కార్యకలాపాల రంగానికీ, నిర్దిష్ట వృత్తికీ బంధిస్తుంది, ఫలితంగా అతని విలక్షణత్వం యేకముఖంగా అభివృద్ధి చెందుతుంది. కార్మికుడు "పాక్షిక కార్మికుడు"గా, యంత్రానికి తోకగా, మార్చబడుతాడు; యిది అతని వ్యక్తిత్వాన్ని యేకముఖం చేసి, అతని శక్తిసామర్థ్యాల అభివృద్ధిని అరికట్టుతుంది. మరొక వైపున, పెట్టుబడిదారుని వ్యక్తిత్వం పెట్టుబడియొక్క సాకార రూపంగా కనపడుతుంది. యీ వ్యక్తిత్వానికి పెట్టుబడిని సంపాయించుకోవడమూ, నిలుపుకోవడమూ, పెంచుకోవడమూ అత్యున్నత లక్ష్యాలు; యిది అతని మానసిక దిజ్మండలంలోనూ, ఆశయాలలోనూ ఒక విశిష్టమైన సంకుచితత్వాన్ని కలిగిస్తుంది.

సహజంగానే మానవుని జీవితం ఉత్పత్తి రంగానికి పరిమితం కాదు; యెందుకంటే, అతను సమాజంలో వివిధ సామాజిక క్రియలు నిర్వహించాలి: అతను పౌరుడు, కుటుంబ సభ్యుడు, వివిధ సంస్థలలో సభ్యుడు, వగైరా. వివిధ సంబంధాల వ్యవస్థలతో సంబంధం కలిగి, ప్రతిదానిలోనూ నిర్దిష్ట క్రియను నిర్వహిస్తూ, మానవుడు వీటిని ప్రతి నిర్దిష్ట సందర్భంలోనూ తాను నిర్వహించవలసిన వివిధ పాత్రలుగా గుర్తిస్తాడు. అతని వ్యక్తిత్వం సుసమన్విత ప్రత్యేకతగా కాక, భిన్న సామాజిక పాత్రల సమ్మేళనంగా కనపడుతుంది. యిది అతని వ్యక్తిత్వపు బహుముఖ వ్యక్తీకరణ కాదు. బయటినుండి అతనిమీద రుద్దబడిన వివిధ సామాజిక సంస్థల డిమాండ్లకు అనుగుణంగా అతను తన్ను తాను మలచుకోవడం యిది. అందువల్లనే మానవుని కార్యాచరణ అతని సొంత సద్యోజనిత ఆచరణయొక్క, అతని ప్రయోజనాలయొక్క, వ్యక్తీకరణగా కాక, ఒక క్రియను నిర్వహిస్తున్నట్లుగా, అతను నిర్వహించవలసిన పాత్రగా కనిపిస్తుంది.

ఫలితంగా మానవుడు అనుభోగ రంగంలో మాత్రమే తాను తానుగా వున్నట్లు అనుభూతి చెందుతాడు, అక్కడ మాత్రమే అతను తన అహాన్ని వ్యక్తం చేయగలిగినట్లూ, స్వతంత్ర వరణం చేయగలిగినట్లూ, తనకు ఆసక్తి గల కార్యాచరణలో నిమగ్నం కాగలిగినట్లూ అనుభూతి చెందుతాడు. అందువలన మనుషులు తమ వ్యక్తిగత జీవితాల యిరుకు గూట్లో కూర్చున్నట్లు కనపడుతారు. కానీ, అక్కడ కూడా వాళ్లకు స్వీయ వ్యక్తీకరణకు నిజమైన స్వేచ్ఛ వుండదు.

మార్క్స్ యింకా యువకుడుగా వుండినప్పుడు, పెట్టుబడిదారీ వ్యవస్థ మనిషిని వస్తువులకు బానిసనుగా చేస్తుంది అని రాసినాడు. ఆధునిక బూర్జువా సమాజంలో, వస్తువులచేత మానవుని యీ బానిసీకరణ వివిధ రూపాలు ధరిస్తుంది. బూర్జువా సమాజం మనుషులలో అల్పబుద్ధి అనుభోక్త మనస్తత్వాన్ని అభివృద్ధి చేయజూస్తుంది. వస్తువుల సంపాదన అదే ఒక లక్ష్యమౌతుంది. తత్ఫలితంగా, వస్తువులు అనుభోగ వస్తువులుగా, అవసరాలను తీర్చే సాధనాలుగా మాత్రమే కాక, మనిషి స్థాయికి సూచికగా కూడా కనిపిస్తాయి; అనగా వాటికి ప్రతిష్ఠను చేకూర్చే క్రియ వుంది. మనుషులకు గల వస్తువులనుబట్టి వాళ్లను విలువ కట్టుతారు. అందువలన వాళ్లు నిర్దిష్ట అనుభోగ ప్రమాణాలకు అంటిపెట్టుకుంటారు. తత్ఫలితంగా, తన వ్యక్తిగత, దైనందిన జీవితంలో మాత్రమే తాను తానుగా వుంటానని మనిషి నమ్ముతాడు. వాస్తవంలో అతని అభిరుచులూ, అతని అనుభోగ స్వభావమూ, అతని దృక్పథాలూ, అభిప్రాయాలూ శక్తివంతమైన పెట్టుబడిదారీ వ్యాపార ప్రకటనల యంత్రాంగంచేతా, సామూహిక ప్రచార సాధనాలచేతా – వార్తాపత్రికలూ, పత్రికలూ, రేడియో, టెలివిజన్, వగైరాలచేత – నిర్ణయింపబడుతాయి. పెట్టుబడిదారీ గుత్త సంస్థలు కొనుగోలుదారుని "సృష్టించడానికి" వీటిని వినియోగిస్తూ, అల్పబుద్ధికి తీరిక సమయంలో చేయడానికి యేదో ఒక పనిని కల్పిస్తాయి, హీన స్థాయి "జనతా సంస్కృతి"తో అతని తలను నింపుతాయి, మనిషిని ఆలోచించే అలవాటునుండి తప్పిస్తాయి, అతని మనస్సును మొద్దుబరచి, ఆత్మను ధ్వంసం చేస్తాయి, సి. ఆర్. మిల్స్ అన్నట్లు "ఉల్లాసపు రోబట్"గా అతన్ని మారుస్తాయి. యీవిధంగా, వ్యక్తిత్వపు అభివృద్ధికి కావలసిన నిజమైన అవసరాలకూ, పెట్టుబడిదారీ సమాజంలోని మొత్తం జీవిత విధానానికీ మధ్య ఒక వైరుధ్యం, "అన్యధాకరణ" అనేది, ఉద్భవిస్తుంది.

మార్క్స్ తన తొలి రచనలలో అన్యధాకరణను పరిశీలించి, ప్రధాన ఉత్పత్తి సాధనాల సొంతదారుడైన పెట్టుబడిదారుడు ప్రత్యక్ష ఉత్పాదకులైన కార్మికుల శ్రమ సృష్టించిన ఉత్పాదితాన్ని సొంతపరచుకొని, దానిని కార్మికులను దోచుకొనే సాధనంగా వినియోగిస్తాడని

చూపించివాడు.* మరొక విధంగా చెప్పాలంటే, ఉత్పాదకుని శ్రమయొక్క ఉత్పాదితం అతని నుండి అన్యధాకరింపబడి, అతనిమీద పెత్తనంచేసే శక్తిగా మార్చబడుతుంది. యీ అన్యధాకరణకు మూలం శ్రమ విభజనా, ఉత్పత్తి సాధనాలలో సొంత ఆస్తీ. కనుక, సొంత ఆస్తినీ, సామాజిక శ్రమ విభజననూ తొలగించడంద్వారా మాత్రమే అన్యధాకరణ అధిగమింపబడగలదు.

అన్యధాకరణ క్రమం పెట్టుబడిదారీ వ్యవస్థలో వ్యక్తిత్వం జీవించే "వికృత ప్రపంచా"న్ని సృష్టిస్తుంది. నిజంగావే, శ్రమ అనేది మానవుని సామర్థ్యాలనూ, జ్ఞానాన్నీ, అనుభవాన్నీ, అతని ఆత్మిక, శారీరిక శక్తులనూ, అతని గుప్త శక్తులనూ మూర్తీభవించే శ్రమ ఫలితాలతో కలిసి, మానవుని చర్యయొక్క మౌలిక రూపం. కానీ, ఉత్పాదకుని శ్రమయొక్క ఉత్పాదితం అతనినుండి అన్యధాకరింపబడినప్పుడు శ్రమ యీ అర్థాన్ని కోల్పోయి, మానవుని సృజనాత్మక సామర్థ్యాలూ, అతని విలక్షణమూ వ్యక్తీకరింపబడే రంగంగా వుండడం ఆగిపోయి, బతుకు దెరువు సాధనంగా కుదించబడుతుంది. మానవునినుండి వేరుచేయబడి, అతని శ్రమయొక్క ఉత్పాదితాలూ, సామాజిక సంబంధాలూ స్వతంత్ర క్రియాత్మక శక్తులు అవుతాయి. మరొక వైపున, చర్యలకు నిజమైన కర్త అయిన మానవుడు వాటి ప్రభావంకింద కర్మ అయి, సామాజిక శక్తుల సద్యోజనిత చర్యమీద ఆధారపడుతాడు.

పెట్టుబడిదారీ వ్యవస్థలో అన్యధాకరణ ఆర్థిక రంగంలోనే కాక, జీవితపు రాజకీయ, ఆత్మిక రంగాలలో కూడా పనిచేస్తుంది. రాజకీయ అధికారం సమాజంనుండి వేరుచేయబడి, శ్రామిక జనాలమీద పెత్తనంచేసే, సాపేక్షంగా స్వతంత్రమైన శక్తి అవుతుంది. దోపిడీ రాజ్యంయొక్క మిలిటరీ బ్యూరాక్రటిక్ యంత్రం అభివృద్ధి చెందడంతో యీ రాజకీయ అన్యధాకరణ అత్యంత తీవ్రమౌతుంది.

అంతే కాక, శరీర శ్రమనుండి మానసిక శ్రమ వేరుపడడంతో, ప్రజలనుండి ఆత్మిక సంస్కృతీ, సాంస్కృతిక రంగంలో సృజనాత్మక కార్యాచరణా అన్యధాకరింపబడుతాయి.

యీవిధంగా, పెట్టుబడిదారీ వ్యవస్థలో వ్యక్తీ, సమాజమూ పరస్పరం అన్యధాకరింపబడుతారు: వ్యక్తి అన్య సామాజిక సంస్థలకూ, శక్తులకూ, సంబంధాలకూ చెందిన ప్రపంచంలో, అన్యధాకరణకు చెందిన ప్రపంచంలో జీవిస్తాడు.

శ్రమ రంగంలో అన్యధాకరణ, ఉత్పాదకునినుండి అతని ఉత్పాదితంయొక్క అన్యధాకరణ మానవునినుండి మానవుని అన్యధాకరణను కలిగిస్తుంది. సొంత ఆస్తి మానవులను

---

* చూ: K. Marx, *Economic and Philosophic Manuscripts of 1844* ("1844 నాటి ఆర్థిక, తాత్త్విక లిఖిత పత్రాలు"), Moscow, 1959.

విభజిస్తుంది. తత్ఫలితంగా ప్రతివొకడూ తనలో మాత్రమే మగ్నుడౌతాడు. యిది వ్యక్తివాద మనస్తత్వపు అభివృద్ధికి దారితీస్తుంది. సమాజంనుండీ, యితర మానవులనుండీ అన్యధా కరింపబడిన వ్యక్తి అస్తిత్వవాదులు (existentialists) అన్నట్లు, యేకాకి అయినట్లూ, దిక్కులేనివాడైనట్లూ, పరిత్యక్తుడైనట్లూ అనుభూతి చెందుతాడు. దీని ఆధారంమీద మేధావులకూ, రచయితలకూ, కళాకారులకూ, శాస్త్రజ్ఞులకూ చెందిన కొన్ని విభాగాలలో పెట్టుబడిదారీ వ్యవస్థమీద మానవతావాదపు విమర్శ అభివృద్ధి చెందుతుంది. వీళ్లు అన్యధాకరణ స్థితిని బాగా గుర్తిస్తారు, కానీ దానినుండి బయటపడే నిజమైన మార్గం వాళ్లకు కనపడదు. అప్పుడప్పుడు వాళ్ల ఆక్షేపణ నూతన కళకు చెందిన వివిధ వికృత రూపాలలో వ్యక్తమౌతుంది. కానీ, అన్ని రకాల అన్యధాకరణనూ అధిగమించడానికి నిజమైన మార్గాలు వున్నాయి. అవి మార్క్సిజంచేత శాస్త్రీయంగా నిర్వచింపబడినాయి. అవి ఉత్పత్తి సాధనాలలో సొంత ఆస్తిని తొలగించడమూ, సోషలిజంనూ, కమ్యూనిజంనూ నిర్మించడమూ.

నిజమే, మనుషు లందరూ అన్యధాకరణ స్థితిని గుర్తించరు. చాలామంది మానసికంగా ఆ స్థితికి తమ్ము తాము మలచుకొని, స్థిరపడిన చట్రం లోపల పనిచేసే అల్పబుద్ధులుగానూ, నిరాక్షేపణబుద్ధులు (conformists)గానూ మారుతారు.

బూర్జువా సిద్ధాంతకారులు పెట్టుబడిదారీ వ్యవస్థను ఆదర్శీకరిస్తూ, అది వ్యక్తికీ, సమాజానికీ మధ్య సామరస్యం నెలకొల్పిందనీ, వ్యక్తి స్వాతంత్ర్యానికీ, సమాజ ప్రయోజ నాలకూ మధ్య సరైన సమతూకాన్ని నెలకొల్పిందనీ అంటారు.

నిజంగానే, పైన చెప్పినట్లు, బూర్జువా ప్రజాస్వామ్యపు లాభాలను ఉపేక్షించడం తప్పు; కానీ, సమాజ సభ్యు లందరి అభివృద్ధికీ కావలసిన భౌతిక పరిస్థితుల హామీ లేకుండా నామకపు స్వేచ్ఛ సామాజిక అసమానతను గానీ, వ్యక్తికీ, సమాజానికీ మధ్య గల వైరుధ్యాన్ని గానీ తొలగించదని స్పష్టం. బూర్జువా సమాజంలో వ్యక్తి స్వేచ్ఛ బూర్జువా వ్యక్తిత్వానికి స్వేచ్ఛ; కానీ, కార్మికవర్గానికీ, పీడిత జనాలకూ యీ స్వేచ్ఛ నిరుపయోగం. సమ్మె ఉద్య మానికి గల గొప్ప విస్తృతీ, అమెరికాలో పౌర హక్కుల కొరకు నీగ్రోల పోరాటమూ, విద్యా ర్థుల ఉద్యమమూ, మొదలైనవి దీనిని బాగా నిరూపిస్తాయి.

బూర్జువా సిద్ధాంతకారులు వ్యక్తివాదపు సూత్ర ప్రాతిపదికమీద వ్యక్తిగత విషయా లకూ, సామాజిక విషయాలకూ సమ్మేళనాన్ని నెలకొల్ప జూస్తారు. సొంత వ్యాపారపు రహ స్యం యేమిటంటే, పెట్టుబడిదారీ విధానం మనిషియొక్క సహజ అంతఃప్రవృత్తిని వినియో గించుకొని, అతను సొంతానికి లాభాలు సంపాయించుకోడానికీ, సొంత లాభంతో పాటు సమా జానికి సేవ చేయడానికీ అనుమతిస్తుంది, అని వాళ్లు అంటారు. నేను నాకే సేవచేసుకుంటూ సమాజానికి సేవచేస్తాను — బూర్జువా ఆచరణ విధానం, భావజాలపు సారమూ ప్రాతిపదికా అది.

వ్యక్తివాదపు వ్యక్తియొక్క మనస్తత్వమూ, నీతి బూర్జువా సమాజపు పరిస్థితులచేత రూపుదిద్దబడుతాయి. యీ సమాజంలో స్వీయ అస్తిత్వ నిరూపణయొక్క ప్రధాన రూపం వ్యక్తిగత విజయమూ, సంపన్నతా. డబ్బు అనేది విజయానికి కొలమానం. ఆస్తి – అనగా వస్తువులు – ఐశ్వర్య సంకేతాలు. యిది నిర్దయాత్మకమైన లెక్కాచారంమీదా, డబ్బుమీదా ఆధారపడిన సంబంధాలను ఉత్పత్తి చేస్తుంది. సంయుక్త రాష్ట్రాల సామాజిక శాస్త్రజ్ఞుడు ఆర్. మెర్టన్ యిలా అంటాడు: "డబ్బు సంపాయించడం అనే లక్ష్యం అమెరికన్ (బూర్జువా – సం.) సంస్కృతిలో పాతుకొని వుంది."* బూర్జువా ప్రచారం దీనిని తన ప్రవర్తన సూత్రంగా స్వీకరించి, "నీవు కూడా కోటీశ్వరునివి కావచ్చు" అనే యితివృత్తాన్ని లెక్కలేనన్ని రూపాంతరాలలో విరజిమ్ముతుంది.

సామ్రాజ్యవాదానికి జరిగిన పరివర్తన, ముఖ్యంగా ప్రభుత్వ గుత్త పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి, బూర్జువా వ్యక్తివాదాన్ని సంక్షోభంలో పడదోస్తుంది. ఒక వైపున, "వ్యక్తిగత విజయం" అనే భావాన్ని ఒప్పుకునేటట్లు జనాలు యింకా ప్రోత్సహింపబడుతున్నారు; మరొక వైపున, మనిషి పెట్టుబడిదారీ శ్రమ క్రమశిక్షణయొక్క కఠినమైన చట్రంలో వుంటున్నాడు, అతను నిర్విలక్షణమైన మర అవుతున్నాడు, పెట్టుబడిదారీ గుత్త సంస్థల యొక్క, బూర్జువా రాజ్యయంత్రంయొక్క బ్యూరాక్రటిక్ నిశ్రేణిచేత ఆడించబడే వస్తువు అవుతున్నాడు. శక్తివంతమైన గుత్త సంస్థలోని చిన్న గుమాస్తాకు వ్యక్తిగత విజయానికి యేమి అవకాశాలున్నాయి? బూర్జువా జీవిత విధానపు వ్యాపార ప్రకటనలచేత అతని బుర్రలోకి యెక్కించబడిన "విలువల వ్యవస్థ" సమస్తం యధార్థపు ప్రథమ స్పర్శతో కూలిపోతుంది. యిది ఆశాభంగమూ, శూన్య భావమూ, నిరర్థకంగా జీవిస్తున్నాననే భావమూ, నిరాశావాదమూ, మొదలైనవాటిని ఉత్పన్నం చేస్తుంది; యీ మనస్తత్వం ఫలితంగా నరాల వ్యాధీ, మితిమీరిన తాగుడూ, మత్తు పదార్థాల అలవాటూ, నేరమూ, ఆత్మహత్యా, తదితర వ్యక్తిగత సామాజిక వ్యాధులూ కలుగుతాయి. సంయుక్త రాష్ట్రాలలో నేరస్తుల (ప్రత్యేకంగా బాల నేరస్తుల) సామాజిక శాస్త్ర పరిశీలనల ప్రకారం, "వ్యక్తిగత విజయం"యొక్క సంకేతాలను సాధించాలనే కోర్కె అనేక నేరాలకు ప్రేరణగా వుంది. వ్యక్తివాద మనస్తత్వం నేరాలకు మూలం అవుతుంది.

వ్యక్తివాదపు భావజాలమూ, మనస్తత్వమూ ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క

---

*R. Merton, *Social Theory and Social Structure* ("సామాజిక సిద్ధాంతమూ, సామాజిక నిర్మాణమూ"), Glencoe, Illinois, 1957, పుటలు 136–37.

ప్రభుత్వ గుత్త వ్యవస్థీకరణ ఉత్పత్తిచేసే అవసరాలకు కూడా వ్యతిరేకమౌతుంది. యీ వ్యవస్థీకరణయొక్క కర్తవ్యం యేమిటంటే, వ్యాపార సంస్థయొక్క వ్యవహారాలలో ఆసక్తి కలిగించుకొనేటట్లు వ్యక్తిని పురికొల్పడం. యిది వ్యక్తివాదపు సాంప్రదాయిక "విలువల"ను గురించిన వివిధ కూటవాదాలను పైకి కనపడుతున్న బూర్జువా "సమష్టితత్వం"తో యేదో ఒక విధంగా సమన్వయపరచే ప్రయత్నాలను ఉత్పత్తిచేస్తుంది. కార్మికునికీ, అతని యజమానికీ ఒకే లక్ష్యాలూ, ఉమ్మడి ప్రయోజనాలూ వున్నాయని గుత్త సంస్థల సిద్ధాంతకారులు రుజువుచేయ జూస్తారు.

ఆవిధంగా, పెట్టుబడిదారీ వ్యవస్థ వ్యక్తివాద సూత్రాన్ని వ్యక్తి స్వేచ్ఛయొక్క వ్యక్తీకరణగానూ, వ్యక్తికీ, సమాజానికీ మధ్య గల సంబంధపు సమస్యను పరిష్కరించడానికి ప్రాతిపదికగానూ ప్రకటించింది. పెట్టుబడిదారీ వ్యవస్థ బూర్జువా వ్యక్తివాద రకం వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేసింది. వ్యక్తికీ, సమాజానికీ మధ్య గల వైరుధ్యాన్ని అధిగమించడానికి బూర్జువా సమాజం అసమర్థమైనదనీ, వ్యక్తివాదపు ప్రాతిపదికమీద వ్యక్తిగత విషయాలకూ, సామాజిక విషయాలకూ సామరస్యం అసాధ్యమనీ ప్రస్తుత బూర్జువా వ్యక్తివాదపు సంక్షోభం తెలియజేస్తుంది. అంతే కాక, ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థ వ్యక్తిత్వంయొక్క విచ్ఛిత్తికీ, మానవుని స్వీయ అన్యధాకరణకూ దారితీస్తుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థమీద విప్లవ కార్మికవర్గపు పోరాటంలో పాల్గొనడం మాత్రమే వ్యక్తిని పరిమిత బూర్జువా చట్రం అవతలికి తీసుకపోయి, ఆత్మికంగా సుసంపన్నమైన అయిన వ్యక్తిత్వాన్ని, ప్రగాఢంగా అర్థవంతమైన జీవితం గలవాన్ని, రూపుదిద్దడానికి తోడ్పడుతుంది. యెందుకంటే, ఆ జీవితం అచ్చమైన మానవతావాద ఆదర్శాలనూ, విలువలనూ అనుసరించడంతో ముడిపడి వుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థకు భిన్నంగా, సోషలిజం అసలైన సమష్టితత్వాన్ని అభివృద్ధి చేసి, సమాజానికీ, వ్యక్తికీ మధ్య గల సంబంధపు సమస్యను పరిష్కరించడానికి దానిని ప్రాతిపదికగా తీసుకుంటుంది.

సోషలిస్టు సమష్టితత్వం సమాజంమీద రుద్దబడింది కాదు. యెందుకంటే, అది సమాజంయొక్క ప్రస్తుత అభివృద్ధి దశలో దాని సొంత అవసరాలనుండి ఉద్భవిస్తుంది. స్వభావతః సామాజికమైనట్టి ఉత్పాదక శక్తులు సంయుక్త ఉత్పత్తి కార్యకలాపాల కొరకు మనుషులను సమీకరిస్తాయి. సామాజిక జీవితపు యితర రంగాలకు కూడా, శాస్త్రవిజ్ఞానానికి కూడా, మనుషులను సంఘంగా కూర్చడం యిప్పుడు అవసరం. సమష్టితత్వపు సోషలిస్టు సూత్రం యీ సామాజిక అవసరపు వ్యక్తీకరణ. యిది సోషలిస్టు ఉత్పత్తి సంబంధాలలోనూ,

సోషలిస్టు సమాజపు మొత్తం జీవిత విధానంలోనూ, నీతిలోనూ, భావజాలంలోనూ, మనుషుల మనస్తత్వంలోనూ నెలకొల్పబడింది.

సోషలిస్టు సమష్టితత్వానికి సామాజికార్థిక ప్రాతిపదిక యేమిటంటే, సోషలిజంలోని వ్యక్తిగత, సామాజిక ప్రయోజనాల వస్తుగత యేకత్వం. యిది ఉత్పత్తి సాధనాలలో సామాజిక ఆస్తినుండీ, ఉత్పత్తి సంబంధాలనుండీ, కామ్రేడ్‌తత్వపు సహకారంనుండీ, శ్రమయొక్క పరిమాణాన్నీ, గుణాన్నీబట్టి పంపకం అనే సోషలిస్టు సూత్రంనుండీ ఉత్పన్నమౌతుంది.

యీ పంపకం పద్ధతిలో, ప్రతివొకడూ సమాజం కొరకు యెక్కువ పని చేసేకొద్దీ తన సొంత వినియోగానికి యెక్కువ సరుకులు పొందుతాడనే విషయంచేత వ్యక్తిగత ప్రయోజనాలూ, సామాజిక ప్రయోజనాలూ సమన్వయపరచబడుతాయి. యిది మనుషులలో తమ పని ఫలితాలను పెంచడానికి పాదార్థిక ప్రేరణలను సృష్టిస్తుంది, తమ నైపుణ్యాలను పెంచుకోడానికి వాళ్లను పురికొల్పుతుంది, వీటికి తోడుగా, ప్రతివొక్కని క్షేమమూ మొత్తంగా సమాజపు క్షేమంమీద సూటిగా ఆధారపడేటట్లు చేస్తుంది. ఉత్పత్తి పెరుగుదలతో పంపకం చేయవలసిన సరుకుల పరిమాణంలో కూడా పెరుగుదల వుంటుంది. అందువల్లనే, సోషలిస్టు పంపకం సూత్రం మనుషులలో తమ సొంత శ్రమయొక్క ఫలితాలను మాత్రమే కాక, మొత్తంగా సామాజిక ఉత్పత్తిని పెంచడానికి కూడా పాదార్థిక ప్రేరణలను సృష్టిస్తుంది. వ్యక్తిగత పాదార్థిక ప్రేరణలు సోషలిజంలో ఉపయోగించవలసిన అవసరమున్న సూత్రం. యెందుకంటే, అక్కడ శ్రమ యింకా జీవనాధారాలను సంపాయించుకొనే సాధనంగా నిలిచి వుంటుంది, కాగా సమాజం తత్కాలానికి యింకా మనుషుల అవసరాలన్నిటినీ తీర్చలేకుండా వుంటుంది. శ్రమనుబట్టి పంపకం అనే నియమాన్ని ఉల్లంఘిస్తే, మనుషులకు పాదార్థిక ప్రేరణలు వుండవనీ, వ్యక్తిగత విషయాలకూ, సామాజిక విషయాలకూ మధ్య వైరుధ్యాలు పుట్టుతాయనీ, దీనివల్ల సోషలిస్టు ఉత్పత్తి అభివృద్ధిమీద హానికర ప్రభావం వుంటుందనీ చారిత్రక అనుభవం తెలుపుతుంది. సోవియట్ యూనియన్‌లోనూ, యితర సోషలిస్టు దేశాలలోనూ ఆర్థిక సంస్కరణలలోని అత్యంత ముఖ్యమైన కర్తవ్యాలలో ఒకటి యేమిటంటే, శ్రామిక ప్రజల వ్యక్తిగత పాదార్థిక ప్రేరణలను పెంచడమూ, ఉత్పత్తిలోనూ, పంపకంలోనూ వ్యక్తియొక్కా, సమష్టి బృందంయొక్కా, సమాజంయొక్కా ప్రయోజనాలను సమన్వయపరచడానికి తోడ్పడే ఆర్థిక చర్యలను రూపొందించడమూ.

కానీ, సోషలిజంలో వ్యక్తికీ, సమాజానికీ మధ్య సామరస్యం వున్నంత మాత్రాన వాటి మధ్య కొన్ని వైరుధ్యాలు ఉద్భవించే అవకాశం లేకుండా పోదు. సమాజం యే వస్తుగత పరిస్థితులలో అభివృద్ధి చెందుతుందో వాటి ఫలితంగానూ, సమాజంపట్ల కొందరు వ్యక్తులు ప్రదర్శించే అరకొర బాధ్యతా పరిజ్ఞానం ఫలితంగానూ అవి ఉత్పన్నమౌతాయి. కొన్ని పంద

ర్భాలలో వ్యక్తి తన వ్యక్తిగత ప్రయోజనాలను త్యాగం చేయాలనీ, సామాజిక అవసరాల కొరకు మాత్రమే పనిచేయాలనీ సమాజం డిమాండు చేయడంలో యిది వ్యక్తం కావచ్చు. ఉదాహరణకు, మొదటి పంచవర్ష ప్రణాళికలలో సోవియట్ ప్రజలు అనేక త్యాగాలు చేయడానికి సిద్ధమై, భారీ పరిశ్రమల కొరకు వనరులను కూడగట్టేటందుకు అనేక విషయాలలో ఉద్దేశపూర్వకంగా తమ కోర్కెలు అణచుకొన్నారు. యిది ప్రజల ముఖ్య అవసరాలను తీరుస్తుందని వాళ్లు గుర్తించినారు; అందువలన వాళ్లు తమ సొంత ప్రయోజనాలను సమాజ ప్రయోజనాలకు లోబరచినారు. అంతర్వైరుధ్యాన్ని పరిష్కరించడంలో తోడ్పడడానికీ, ఆధునిక సోషలిస్టు పరిశ్రమలను నిర్మించడంలోని కష్టాలను అధిగమించడానికీ యిది అవసరమైంది.

సమాజానికి హానికరమైన పద్ధతిలో వ్యక్తి ఆచరించినప్పుడు గానీ, వ్యక్తి సమాజ అవసరాలను ఉపేక్షించినప్పుడు గానీ, వ్యక్తికీ, సమాజానికీ మధ్య వైరుధ్యం ఉద్భవించవచ్చు. అలాంటి సందర్భాలలో మనిషిని హెచ్చరించడానికీ, అతన్ని సాధారణ ప్రమాణాలకూ, నియమాలకూ లోబడేటట్లు చేయడానికీ సమాజానికి హక్కు వుంది.

యీవిధంగా, సామాజిక ప్రయోజనాలకు యెల్లప్పుడూ వ్యక్తిగత ప్రయోజనాలమీద ప్రాధమ్యం వున్నప్పటికీ, యివి వాటికి లోబడడ మనేది సమాజానికీ, వ్యక్తికీ మధ్య గల వైరుధ్యాలు పరిష్కరింపబడే క్రమంలో ఒక పార్శ్వం మాత్రమే. కానీ, ఒక మనిషి స్వబుద్ధితో సమాజ అవసరాల, ప్రయోజనాల దృష్ట్యా ఆచరిస్తే, అప్పుడు లోబడడమనే సమస్యే లేదు. సామాజిక, వ్యక్తిగత ప్రయోజనాల సమన్వయం సోషలిజంయొక్క ఒక సూత్రం.

కమ్యూనిస్టు వ్యవస్థలో సమాజానికీ, వ్యక్తికీ మధ్య గల సంబంధపు సిద్ధాంత సమస్యను మార్క్స్, ఎంగెల్సు యీకింది మౌలిక సూత్రాలలో రూపొందించినారు:

1. "[యితరులతో] కలయికలో మాత్రమే వ్యక్తికి తన శక్తి సామర్థ్యాలను సర్వతో ముఖంగా అభివృద్ధి చేసుకొనే మార్గం వుంది; కనుక, కలయికలో మాత్రమే వ్యక్తిగత స్వేచ్ఛ సాధ్యం."*

2. "వర్గాలూ, వర్గ వైరుధ్యాలూ గల పాత బూర్జువా సమాజం పోయి, దాని స్థానంలో ప్రతివొక్కని స్వేచ్ఛాభివృద్ధి అందరి స్వేచ్ఛాభివృద్ధికి షరతుగా వున్న ఒక సమాఖ్య యేర్పడుతుంది."**

---

* K. Marx and F. Engels, *The German Ideology* ("జర్మన్ భావజాలం"), పుట 93.

** K. Marx and F. Engels, *Selected Works*, Vol. 1, పుట 127.

యీ సూత్రాలు సమాజానికీ, వ్యక్తికీ మధ్య గల సంబంధపు సమస్యపట్ల మార్క్సిజం స్థాపకుల ప్రగాఢ పరస్పరవాద వైఖరిని వ్యక్తం చేస్తాయి.

సమాజ ఉద్ధరణ వ్యక్తి ఉద్ధరణకు షరతు అనీ, సమాజానికి వెలుపల, సమాజంనుండి విడిపోయి, వ్యక్తి స్వేచ్ఛ ఊహించరానిది అనీ, వ్యక్తిని అభివృద్ధి చేయడానికి స్వేచ్ఛాయుత సమాజం తన శక్తి కొలది కృషిచేయాలి అనీ మొదటి సూత్రం తెలుపుతుంది.

సమాజం దోపిడీనుండీ, భవిష్యత్తును గురించిన భయంనుండీ, సామాజిక అభివృద్ధికి చెందిన సద్యోజనిత శక్తులనుండీ, మెజారిటీ ప్రజల ఆకలినుండీ, బీదరికంనుండీ విముక్తమైనప్పుడు మాత్రమే వ్యక్తి స్వేచ్ఛగా వుండగలదు. సమాజం స్వేచ్ఛను పొందినప్పుడు, అది ప్రకృతితో తనకు గల సంబంధాలనూ, మనుషుల మధ్య సంబంధాలనూ తన చైతన్య పూరితమైన అదుపులో పెట్టుకొన్నప్పుడు, సమాజ సభ్యు లందరి అభివృద్ధీ, ప్రజల పాదార్థిక, సాంస్కృతిక ప్రమాణాల పెరుగుదలా దాని పురోగతికి షరతూ, సూచికా అవుతాయి. సోషలిస్టు సమాజం వ్యక్తి స్వేచ్ఛకు శాసనగతమైన హామీలు (వాక్, పత్రికా, అంతఃకరణ, వగైరా స్వాతంత్ర్యాలు) కూడా నెలకొల్పుతుంది. కానీ, కీలకమైన విషయ మేమిటంటే, లాంఛనగతంగా వ్యక్తి స్వేచ్ఛకు కేవలం శాసనగతమైన హామీ యివ్వడం కాదు, వ్యక్తియొక్క సర్వతోముఖ అభివృద్ధి కొరకు పాదార్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులనూ, అతని సామర్థ్యాల వ్యక్తీకరణకు అవకాశాలనూ యధార్థంగా సృష్టించడం.

మార్క్సు, ఎంగెల్సులు రూపొందించిన రెండవ సూత్రం వ్యక్తంచేసే భావం యేమిటంటే, కమ్యూనిస్టు వ్యవస్థలో కొందరి ఖర్చుమీద మరికొందరి అభివృద్ధి వుండజాలదు అనీ, మొత్తంగా సమాజంయొక్క ఉనికికీ, పురోగతికీ సమాజంలోని ప్రతి సభ్యునియొక్క స్వేచ్ఛాభివృద్ధీ షరతు అనీ.

సహజంగావే, యీ సూత్రాల వాస్తవీకరణే ఒక చారిత్రక క్రమం; యెందుకంటే, అవి యే మేరకు వాస్తవీకరింపబడేదీ సోషలిజంయొక్క పాదార్థిక, ఆత్మిక పరిణతిమీద ఆధారపడుతుంది.

సోషలిజమూ, కమ్యూనిజమూ మానవ వ్యక్తిత్వపు సర్వతోముఖ అభివృద్ధీ, వికాసమూ లక్ష్యంగా గల సామాజిక వ్యవస్థలు. "వ్యక్తి స్వేచ్ఛ" అని విశాలార్థంలో ఉపయోగించే నుడికారం గురించి యేమిటంటే, ప్రతి రకం పీడననుండీ జనాలను విముక్తి చేయడానికి జరిగే పోరాటంతో, కమ్యూనిజం కొరకు జరిగే పోరాటంతో, యిది ముడివడితే తప్ప బూర్జువా అరాజకవాద నుడికారంగా మాత్రమే నిలిచిపోతుంది. నిజంగావే, యీనాడు వ్యక్తి అభివృద్ధికీ, అతని సకల సామర్థ్యాల వ్యక్తీకరణకూ ప్రాతిపదికను సమకూర్చేది యీ మహత్తర లక్ష్యం కొరకు చేసే పోరాటమే.

"ప్రతివానినుండి వాని సామర్థ్యాన్నిబట్టి" అనే కమ్యూనిస్టు వ్యవస్థయొక్క సూత్రం మహత్తర ప్రగతిశీల ప్రాముఖ్యం గలది. సమాజం మొట్టమొదటి సారిగా సమాజ సభ్యు లందరి అభివృద్ధిలోనూ, వాళ్ల సామర్థ్యాల పూర్తి వినియోగంలోనూ తన ప్రాణప్రద మైన ప్రయోజనాన్ని తన పతాకమీద లిఖిస్తుంది. యెందుకంటే, సామాజిక శ్రమయొక్క ఉత్పాదక శక్తి ప్రతిఒక్కని సామర్థ్యాల అభివృద్ధిమీదా, పూర్తి వినియోగంమీదా ఆధార పడుతుంది. మానవుల అభివృద్ధికి యిది మహా శక్తివంతమైన సామాజిక ప్రేరణను ప్రవేశ పెడుతుంది. యీ సూత్రాన్ని వాస్తవీకరించడం సమాజంమీదా, వ్యక్తిమీదా, ఉభయులమీదా ఆధారపడుతుంది; యెందుకంటే, అభివృద్ధికి కావలసిన వస్తుగత పరిస్థితులు వున్నప్పుడు, వాటి వినియోగం మానవునిమీదా, అతని క్రియాశీలతమీదా, అతని చైతన్యంమీదా ఆధార పడుతుంది. సోషలిస్టు సమాజపు ఆర్థిక, సామాజిక రాజకీయ పురోగతితోనూ, జనాల పెరుగుతున్న పాదార్థిక, సాంస్కృతిక ప్రమాణాలతోనూ, వాళ్ల పెరుగుతున్న స్వీయ స్పృహతోనూ వ్యక్తిగత అభివృద్ధికీ, సామాజిక అభివృద్ధికీ మధ్య అంతకంతకూ సం పూర్ణమైన సమన్వయం నెలకొల్పబడుతుంది.

యీవిధంగా, సోషలిజం యిచ్చేది వ్యక్తిని అణచివేయడం కాదు, వ్యక్తిని ఉపేక్షించడం కాదు, వ్యక్తిని లొంగజేయడం కాదు, మరి వ్యక్తిగత విషయాలకూ, సామాజిక విషయాలకూ మధ్య సమన్వయం.

సోషలిజంకు విలక్షణమైనది యేమిటంటే, మనిషిపట్ల సమాజంయొక్క శ్రద్ధ. అది పెట్టుబడిదారీ వ్యవస్థకు లేనిది, అక్కడ ప్రతిఒకడూ తనపట్ల మాత్రమే శ్రద్ధ కలిగి వుంటాడు. సోషలిజంలో వ్యక్తిపట్ల సమాజానికి గల శ్రద్ధ సమాజ శ్రేయస్సుకొరకు పనిచేయడానికి మనుషులను ఉత్తేజపరుస్తుంది. శ్రామిక ప్రజల పెరుగుతున్న పాదార్థిక సంక్షే మమూ, సాంస్కృతిక ప్రమాణాలూ, తక్కువ పని గంటలూ, మేలైన గృహవసతీ, శిశు సంస్థల పెరుగుతున్న వ్యవస్థా, ప్రజా ఆరోగ్య, సాంఘిక భద్రతా వ్యవస్థా, మొదలైన వాటిని సోషలిజం వ్యక్తికి యిచ్చి, తద్వారా అతని అభివృద్ధికి గతంలో యెప్పుడూ లేనంత అనుకూలమైన పరిస్థితులను సృష్టిస్తుంది.

సోషలిజం వ్యక్తిని సమష్టి సంఘంతో పోటీ పెట్టడ మటుంచి, సమష్టి సంఘంనుండి వేరుచేయదు కూడా. సోషలిస్టు సమష్టి సంఘంయొక్క పరిపూర్ణ జీవితంలో మనుషులలోని పుష్కలమైన ప్రత్యేకతలూ, వ్యక్తిగత సామర్థ్యాలూ యిమిడి వున్నాయి. ఫాక్టరీ, కార్ఖాగా రం, వ్యవసాయ సమష్టి క్షేత్రం, ప్రభుత్వ వ్యవసాయ క్షేత్రం, ఆఫీసు, సంస్థ, వీటిలో దేనికి చెందిన సమష్టి సంఘం అయినా అది వ్యక్తిని యెప్పుడూ బంధించదు సరి కదా, తన సభ్యులు తమ నైపుణ్యాలను పెంచుకొని, తమ సామర్థ్యాలను వినియోగించుకోడానికి

తోడ్పడడంలో దానికి ఆసక్తి వుంటుంది. సోషలిజంను బూర్జువా దృక్పథంనుండి చూసేవాళ్ళు వ్యక్తియొక్క స్వేచ్ఛాయుత అభివృద్ధితో సోషలిస్టు సమాజపు రాజకీయ, నైతిక, భావజాల ఐక్యతకు పొత్తు కుదరుతుందనే విషయం యెప్పుడూ గ్రహించరు. అందు వలన సోషలిజంను గురించి ఆదిమ చౌకబారు భావాలను వ్యాప్తి చేస్తారు — సోషలిజంలో మనుషు లందరూ ఒకేవిధంగా ఆలోచిస్తారు, ఒకేవిధంగా మాట్లాడుతారు, ఒకేవిధమైన దుస్తులు వేసుకుంటారు, వగైరా భావాలను.

యీ అంశాన్ని మనము తెక్కించడానికి ఒక విషయం చూద్దాం: ఉదాహరణకు, భౌతిక శాస్త్రజ్ఞు లందరూ న్యూటన్‌యొక్క యాంత్రిక శాస్త్ర నియమాలను గానీ, ఐన్‌స్టైన్ యొక్క సాపేక్ష సిద్ధాంతాన్ని గానీ సరైనవని గుర్తిస్తారు; యీ యేకాభిప్రాయం భౌతికశాస్త్ర జ్ఞులకు తమతమ ప్రత్యేకత లేకుండా చేసిందని యెవరూ అనరు. కానీ, సోషలిస్టు సమాజం శాంతిని కాపాడి, కమ్యూనిజంను నిర్మించాలనే తన కోరికలో యేకగ్రీవంగా వుంటుంది గనుక, యిది వ్యక్తులను చదును చేయడంతో సమానమని కొంద రంటారు. నిజంగానే, బూర్జువా వ్యక్తివాదపు కొలబద్ద యితర మాత్రాలమీద ఆధారపడిన సోషలిస్టు సమాజానికి వర్తింపజేయడానికి మరీ చిన్నది. మార్క్సిస్టు సోషలిజం సమానతా భావాన్ని వైయక్తిక విభేదాలను చదును చేయడంగా యెప్పుడూ పరిగణించలేదు. "ప్రతివానినుండి వాని సామర్థ్యాన్ని బట్టి" అనేది అప్పటికే సామర్థ్యాల అసమానతనూ, వ్యక్తుల మధ్య విభేదాన్నీ ధ్వనించే మాత్రం. సంపూర్ణ సామాజిక సమానత్వం యీ విభేదాలను తుడిచివేయదు సరి కదా, వాస్తవంలో వ్యక్తి ప్రత్యేకతయొక్క సర్వతోముఖ అభివృద్ధికీ, వ్యక్తిత్వపు వికాసానికీ కావలసిన పరిస్థితులను సమకూరుస్తుంది. అందువల్లనే, ఆదనపు విలువనూ, ఆదనపు ఉత్పాదితాన్నీ ఒకటిగా చూడడం తప్పు అయినట్టే, వ్యక్తివాదాన్నీ, వ్యక్తి స్వేచ్ఛనూ ఒకటిగా చూడడం తప్పు. వ్యక్తికీ, సమాజానికీ మధ్య గల వైరుధ్యంలో అభివృద్ధి చెందిన వ్యక్తివాదం ఆ వైరుధ్యంయొక్క ప్రతిబింబం. సమష్టితత్వం, దాని వంతుకు, వైరుధ్యాన్ని తొలగించి, వ్యక్తికీ, సమాజానికీ మధ్య సామరస్యపు ఐక్యతను నెలకొల్పుతుంది.

చరిత్రలో మొదటిసారిగా కమ్యూనిజం సమాజ సభ్యులందరి సంపూర్ణ, సుసమన్విత అభివృద్ధికి అవకాశాన్ని యివ్వడం మాత్రమే కాక, వాస్తవంలో దాని అవసరాన్ని ముందుకు తెస్తుంది. కమ్యూనిజంయొక్క పాదార్థిక, సాంకేతిక ప్రాతిపదిక అవసరమైన పని కాలాన్ని తగ్గించి, ప్రతి వొక్కరి తీరిక కాలాన్ని పెంచడంద్వారానూ, పనిని సులభతరం చేయడం ద్వారానూ, అనిపుణ శ్రమ అవసరాన్ని తొలగించడంద్వారానూ, సమాజంలో అనుభోగ వస్తువుల సమృద్ధిని సృష్టించడంద్వారానూ దీనికి అవసరమైన పరిస్థితు లన్నిటినీ సృష్టిస్తుంది. యీ పరిస్థితులలో, ప్రతి వ్యక్తియొక్క అభివృద్ధీ, అతని సృజనాత్మక సామర్థ్యంయొక్క

సంపూర్ణ వ్యక్తీకరణా సామాజిక సంపదకు కొలమానం అవుతాయి. కమ్యూనిజం సామాజిక జీవితపు వ్యవస్థీకరణను ధ్వంసం చేయదు, సామాజిక వ్యవస్థీకరణయొక్క అన్యధాకరణను మాత్రమే ధ్వంసం చేస్తుంది. స్వేచ్ఛాయుత శ్రామిక ప్రజల తనంతకు తానే పనిచేసే సంస్థ అయిన కమ్యూనిజంకు సుసమన్వితంగా అభివృద్ధి చెందిన వ్యక్తులు అవసరం, అది వాళ్లను తయారు చేస్తుంది కూడా. ఆ షరతుమీద మాత్రమే సమాజంయొక్క కార్యాచరణ దాని సభ్యుల స్వేచ్ఛాయుత, స్వతంత్ర ఆచరణయొక్క ఫలితంగా కనపడుతుంది. అందువల్లనే సమాజం ప్రతి వ్యక్తియొక్క సామర్థ్యాల అభివృద్ధికీ, వ్యక్తీకరణకూ సంపూర్ణ స్వేచ్ఛను యిస్తుంది. అదే సమయంలో, వ్యక్తిగత అభివృద్ధి స్వేచ్ఛను పొందిన ప్రతి వ్యక్తీ యీ స్వేచ్ఛ సమాజ స్థితిమీద ఆధారపడుతుందని వెంటనే గుర్తిస్తాడు. యెందుకంటే, ఉద్దండమైన ప్రకృతి శక్తుల చర్యనుండి విముక్తిని సమాజంయొక్క శక్తివంతమైన ఉత్పాదక శక్తులూ, సామాజిక శక్తుల పెత్తనంనుండి విముక్తిని కమ్యూనిస్టు ఉత్పత్తి సంబంధాలూ, వ్యక్తి స్వేచ్ఛను సమాజ లాభం కొరకు ప్రతివొకడూ చేసే పనీ కట్టుదిట్టం చేస్తాయి. శత్రుత్వ పూరిత సామాజిక వ్యవస్థలు వర్గ పూర్వ సమాజంలోని వ్యష్టి, సమష్టుల ఆదిమ యేకీకరణను రద్దుచేయగా, కమ్యూనిజం మొత్తం మునుపటి అభివృద్ధి ప్రాతిపదికమీద సంపూర్ణ మానవునియొక్కా, సమష్టి సంఘంయొక్కా ఉన్నత యేకత్వాన్ని నెలకొల్పుతుంది. యిది నాస్తికరణయొక్క నాస్తికరణ.

సమాజానికీ, వ్యక్తికీ మధ్య గల సంబంధపు సమస్యకు యిది అచ్చమైన మానవతావాద పరిష్కారం.

జనాలూ, వ్యక్తీ. చరిత్రలో వాళ్ల పాత్ర

యింతవరకు మనం వ్యక్తిని—సమాజంమీద అతను ఆధారపడడాన్నీ, సమాజంలో వ్యక్తి అభివృద్ధిని—చర్చించినాం. వ్యక్తి సమాజంయొక్క ఉత్పాదితమని కనుక్కున్నాం. కానీ, వ్యక్తికీ, సమాజానికీ మధ్య గల సంబంధంలో మరొక పార్శ్వం వుంది: వ్యక్తి సమాజ అభివృద్ధిని యెలా ప్రభావితం చేస్తాడు, అతని చారిత్రక పాత్ర యేమిటి?

వ్యక్తికీ, జనాలకూ మధ్య గల సంబంధాన్ని పరిశీలించకుండా యీ సమస్యకు శాస్త్రీయమైన జవాబు లభించజాలదు. సమాజాన్ని మనుషుల పరస్పర చర్యయొక్క, వర్గాల పోరాటంయొక్క, ఉత్పాదితంగా పరిశీలిస్తూ, యిప్పటికే మేము ఒక విషయాన్ని దృష్టికి

తెచ్చినాం. యేమిటంటే, చారిత్రక క్రమంయొక్క ముఖ్య లక్షణాల, నియమాల ప్రజ్ఞానంలో వ్యక్తుల చర్యలను జనాల చర్యలకు, వ్యక్తి కార్యాలను సామూహిక ఆచరణకు, కుదించడం యిమిడి వుందనే విషయాన్ని. వ్యక్తి అన్నిటినీ మించి మానవ సమూహంలో ఒక కణంగా చారిత్రక క్రమంలో పాల్గొంటాడు. ప్రతి వ్యక్తియొక్క కార్యకలాపాలు యేదో ఒక వర్గంయొక్క, లేదా సమాజంయొక్క, లేదా జాతియొక్క ఉద్యమంలోనూ, కార్యాచరణ లోనూ కలిసి వుంటాయి. అందువల్లనే మార్క్సిస్టు లెనినిస్టు సిద్ధాంతం చరిత్రలో జనాల పాత్రకు చెందిన సమస్యను పరిష్కరింప బూనుకోవడంతో ప్రారంభిస్తుంది.

చరిత్రయొక్క సృజనాత్మక శక్తులను వర్ణించడానికి ఉపయోగించబడే "జనాలు" అనే భావం కచ్చితంగా నిర్దిష్టమైన, చారిత్రకమైన ధాతువు. సమాజం మారేకొద్దీ, ప్రజానీకంగా యేర్పడే వర్గాలూ, బృందాలూ కూడా మారుతాయి. ఉదాహరణకు, ఫ్యూడల్ సమాజంలో జనాలంటే రైతులూ, చేతిపనివాళ్ళూ, ఉద్భవిస్తున్న కార్మికవర్గమూ, బూర్జువా వర్గమూ. పెట్టుబడిదారీ సమాజంలో జనాలంటే కార్మికవర్గమూ, రైతాంగమూ, పట్టణ పెటీబూర్జువావర్గమూ, ఉద్యోగులూ, మేధావులూ. శత్రుత్వపూరిత వర్గ సమాజంలో జనాలలో జాతి అంతా చేరదు; యెందుకంటే, ప్రజానీకానికి పైన వుంటూ, వాళ్లను దోపిడీ చేసే ప్రగతి వ్యతిరేక సామాజిక బృందాలూ, వర్గాలూ కూడా వుంటాయి. ప్రజలు అపారమైన మెజారిటీగా యీ బృందాలను యెదుర్కొంటారు. ఆవిధంగా, ఫ్రాన్సులో 1789లో జరిగిన విప్లవానికి ముందు ప్రజలు ప్రభువర్గమూ, మతగురువులూ అనే రెండు అధిక సౌకర్యయుత, ప్రగతి వ్యతిరేక అంతస్తులను యెదుర్కొనే మూడవ అంతస్తుగా ఆచరించినారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రజలు బూర్జువావర్గాన్ని, ముఖ్యంగా దాని అగ్రగణ్యులైన గుత్త బూర్జువాలను యెదుర్కొంటారు. వలన, వర్ధమాన దేశాలలోని జాతీయ బూర్జువావర్గాన్ని కొన్ని సందర్భాలలో ప్రజానీకంలోని భాగంగా పరిగణించవచ్చు.

సోషలిస్టు సమాజంలో, ప్రజానీకమంటే సమాజంలోని అన్ని వర్గాలూ, సామాజిక బృందాలూ; యెందుకంటే, ప్రజానీకానికి పైన వుండే దోపిడీదార్లెవరూ లేరు గనుక, సమాజం నైతిక రాజకీయ ఐక్యతలో దృఢపర్చబడింది గనుక.

ఆవిధంగా, ప్రజలంటే, జనాలంటే, ముఖ్యంగా నిర్దిష్ట సమాజపు శ్రామిక జనాలు, పాదార్థిక విలువలను ఉత్పత్తి చేసేవాళ్లు; వాళ్లతో పాటు, తమ వస్తుగత ప్రతిపత్తి మూలంగా నిర్దిష్ట దేశంలో, నిర్దిష్ట యుగంలో ప్రగతిశీల చారిత్రక కర్తవ్యాలను నిర్వహించగల వర్గాలూ, సామాజిక బృందాలూ కూడా ప్రజలలో చేరుతారు.

చరిత్రలో జనాల అసలైన పాత్రను వెల్లడించడంద్వారా దోపిడీ వర్గాల సిద్ధాంతకారులకు లాభమేమీ లేదు. చరిత్రను గురించిన తమ భావవాద దృక్పథంతో వాళ్ళ సమాజ చలనాన్ని

నిర్ణయించే కార్యాచరణ భావజాల రంగంలోనూ, రాజకీయాల రంగంలోనూ తప్ప మరెక్కడా లేదని యెల్లప్పుడూ అనేవాళ్లు. యీ దృక్పథంనుండి చరిత్రయొక్క అసలైన నిర్మాతలు, తమ సొంత అభీష్టాన్నిబట్టీ, లేదా దైవిక శక్తుల నిర్ణయాన్నిబట్టీ చరిత్ర గతికి సారథ్యం వహించేవాళ్లు, యెవరంటే, కొత్త భావాలను రూపొందించేవాళ్లు, లేదా రాజకీయ నిర్ణయాలు చేసేవాళ్లు — సిద్ధాంతకారులూ, విద్యావంతులూ, శాసన నిర్మాతలూ, రాజులూ, సేనాధిపతులూ, వివిధ ఉద్యమాల నాయకులూ మొదలైనవాళ్లు. యిలాంటి దృక్పథం జనాల పాత్రను తక్కువ అంచనా వేయడానికి అభిముఖంగా వుంటుంది, తరుచుగా వాళ్ల పట్ల నిరసన వైఖరిని, పచ్చి శత్రు వైఖరిని కూడా అవలంబిస్తుంది.

మార్క్సిజం దీనికి భిన్నం. అది వ్యక్తిని జనాలకు పోటీగా పెట్టదు. లెనిన్ యిలా రాసేవాడు: "చరిత్ర అంతా నిస్సంశయంగా క్రియాశీలురైన వ్యక్తుల చర్యలచేత యేర్పడుతుంది."* కానీ, ఒకటిగా కలిసినప్పుడు, వాళ్ల కార్యాచరణకు కొత్త గుణం లభిస్తుంది: అది చారిత్రక క్రమంయొక్క నిర్ణాయక శక్తి అవుతుంది. యీ భావం చరిత్రను గురించిన భౌతికవాద దృక్పథంయొక్క మౌలిక సూత్రాలనుండి సహజంగా యేర్పడుతుంది.

నిజంగానే, ఉత్పత్తి విధానం సామాజిక అభివృద్ధిని నడిపించే నిర్ణాయక శక్తి అయితే, శ్రామిక జనాలు, పాదార్థిక విలువలను ఉత్పత్తి చేసేవాళ్లు, ఉత్పత్తిలో నిర్ణాయక శక్తి గనుక, చరిత్రలో కూడా నిర్ణాయక పాత్ర వహిస్తారు. చరిత్ర వ్యక్తులచేత నిర్మించబడదు, జన సమూహాల కృషిచేత నిర్మించబడుతుంది. మార్క్సు పూర్వపు సామాజిక శాస్త్రం పాదార్థిక ఉత్పత్తిని మానవ కార్యకలాపాలయొక్క నిర్ణాయక రంగంగా పరిశీలించే కృషి చాలా తక్కువగా చేసింది, అసలు యేమైనా చేసివుంటే; అది సామాజిక అభివృద్ధికి దాని ప్రాముఖ్యాన్ని చూపలేదు. అందువల్లనే అది శ్రామిక జనాల అసలైన పాత్రను అర్థం చేసుకోలేదు. పాదార్థిక విలువలను సృష్టించి, ఉత్పత్తిని ముందుకు తీసుకపోయేవాళ్లు చరిత్రయొక్క అసలైన నిర్మాతలనీ, చరిత్ర రాజుల అంతఃపురాలలో గానీ, రాష్ట్రపతుల ఆఫీసులలో గానీ, మంత్రుల సౌధాలలో గానీ, పార్లమెంటు భవనాలలో గానీ నిర్మించబడక, ముఖ్యంగా గనులలోనూ, కార్మాగారాలలోనూ, నిర్మాణ స్థలాలలోనూ, పొలాలలోనూ — పాదార్థిక ఉత్పత్తి రంగంలో — నిర్మించబడుతుందనీ అది అర్థం చేసుకోలేదు. కానీ, చరిత్ర గతిమీద జనాల ప్రభావం వాళ్లు పాదార్థిక విలువలను సృష్టించే విషయానికి పరిమితం కాదు. సామాజిక మార్పులన్నిటిలోనూ జనాలు నిర్ణాయక శక్తి. ప్రజలు లేకుండా రాజుకు గానీ, సైన్యం లేకుండా సైన్యాధిపతికి గానీ వున్న విలువ యేమిటి? తగిన బలం వున్నప్పుడే రాజూ, సైన్యాధిపతీ యేమైనా

*V. I. Lenin, *Collected Works*, Vol. 1, పుట 159.

చేయగలరు. రాజకీయాలలో ఆ బలాన్ని ప్రజలు సమకూరుస్తారు. గతంలో దోపిడీ వర్గాలు జనాలను రాజకీయాలకు వెలిగా వుంచడానికి తీవ్రంగా ప్రయత్నం చేసినప్పటికీ — అప్పుడప్పుడు ఆ ప్రయత్నంలో నెగ్గినప్పటికీ — చరిత్రయొక్క కీలక సమయాలలో జనాలదే యెల్లప్పుడూ చివరి మాటగా వుండింది. గొప్ప విప్లవాలన్నీ జనాలు చేసినవే. జనాలు యేమి కోరేదీ, వాళ్లు యెవరిని, యెక్కడికి అనుసరించేదీ — యిది, అంతిమ పరిశీలనలో, రాజకీయాలలో విజయానికి కీలకమైనది. కానీ జనాల చలనం యాదృచ్ఛికమైన, లేదా తాత్కాలికమైన పరిస్థితుల చేత కాక, ప్రగాఢమైన, దీర్ఘ కాలికమైన భౌతిక కారణాలచేత నిర్ణయింపబడుతుంది.

ఆవిధంగా, మానవ కార్యకలాపాలయొక్క రెండవ ముఖ్య రంగమైన సామాజిక రాజకీయ రంగంలో కూడా జనాలు నిర్ణాయక శక్తి. యీ రంగానికి అన్వయించినప్పుడు "జనాలు" అనే భావం కాస్త భిన్నమైన అర్థంలో ఉపయోగించబడుతుందని గుర్తుపెట్టుకోవాలి. యిక్కడ, జనాలలో జరూరు రాజకీయ కర్తవ్యాలను పరిష్కరించ బూనుకొనే సకల శక్తులూ, సామాజిక బృందాలూ చేరుతాయి.

జనాల పాత్రను పరిగణించకుండా ఆత్మిక సంస్కృతి అభివృద్ధిని పరిశీలించడం కూడా సరి కాదు. భాష లేకుండా ఆత్మిక సృజనాత్మకత యేమీ వుండజాలదు; మరి అది ప్రజలు సృష్టించింది. అంతే కాక, శాస్త్రీయ ఆవిష్కరణలకూ, సృజనలకూ అవసరమైన భౌతిక పరిస్థితులూ, సమాజానికి వాటి అవసరాలూ ఉత్పత్తి అభివృద్ధిచేత అనగా కోట్లమంది మానవుల పనిచేత సృష్టింపబడుతాయి. నిజంగానే, సృజనలూ, ఆవిష్కరణలూ చారిత్రక అభివృద్ధియొక్క సాధారణ గొలుసులో భాగమయ్యేది యెప్పుడంటే, అవి వ్యక్తులకు చెందిన విషయంగా వుండడం ఆగిపోయి, జన సముదాయాల చేత ఉత్పత్తిలో ప్రయోగించబడినప్పుడు మాత్రమే.

ప్రజా బాహుళ్యం, ప్రజల జీవితం, కళా రంగపు అభివృద్ధిమీద మరీ వైవిధ్య పూరితమైన ప్రభావం నెరపుతాయి. జానపద కళ, స్వతాహాగా జాతీయ కళలో భాగమైనట్టిది, అదే సమయంలో వృత్తి కళాకారుల కృతులకు అలంకారాల, యితివృత్తాల మూలంగా వుంది. అసలైన కళ యెల్లప్పుడూ ప్రజల జీవితంతోనూ, ఆలోచనలతోనూ, ఆశయాలతోనూ ముడిపడి వుంటుంది. ప్రజల జీవితంనుండి వేరుపడితే అది నిస్సారమూ, నిరుపయోగమూ అవుతుంది. సాహిత్యం — ప్రజా జీవితంయొక్క అద్దం.

యీవిధంగా, సామాజిక జీవితపు యే రంగాన్ని చూసినా, ప్రతిచోటా ప్రజలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో, నిర్ణాయక పాత్ర నిర్వహించడం కనపడుతుంది. కానీ, జనాల క్రియాశీలత ఒక చారిత్రక దశలో వున్నట్లు మరొకదానిలో వుండదు. మార్క్స్ యీ సూత్రాన్ని నిరూపిస్తూ, యిలా రాసినాడు: "చారిత్రక చర్యలకు సహజమైన సమగ్రత్వంతో, అది

యే జనాల ఆచరణతో ఆ జనాల పరిమాణం పెరుగుతుంది."* యీ భావం చరిత్రలో జనాల పెరుగుతున్న పాత్రను వ్యక్తం చేస్తుంది.

నిజంగానే, శత్రుత్వపూరిత వ్యవస్థ లన్నిటిలోనూ శ్రామిక జనాలు పీడనచేతా, దోపిడీ చేతా బంధింపబడి వుండినారు. సోషలిజం యీ బంధనాలను తొలగించి, జనాల సృజనాత్మక కార్యకలాపాలయొక్క స్థిరమైన పెరుగుదలకు కావలసిన పరిస్థితులను సృష్టించి, అవకాశాలను కలిగిస్తుంది. అక్కడ వున్న ఆచరణాత్మక కర్తవ్యం యేమిటంటే, యీ అవకాశాలను సంపూర్ణంగా వినియోగించుకోవడమూ, తద్వారా చారిత్రక అభివృద్ధి వేగాన్ని పెంచడమూ.

సమాజపు సోషలిస్టు పునర్నిర్మాణం చరిత్రలో కెల్ల అత్యంత గాఢమైన సామాజిక రూపాంతరీకరణ. అందువల్లనే, శ్రామిక ప్రజలలోని అత్యంత విస్తృతమైన విభాగాలు పాల్గొనకుండా అది ఊహించరానిది. యీ విప్లవాన్ని నిర్వహించేదీ, యీ విప్లవంలో ప్రయోజనం గలదీ అయిన "జనంయొక్క పరిమాణం" ప్రజలలోని పరమమైన మెజారిటీచేత యేర్పడినట్టిది. లెనిన్ చెప్పిన యీ మాటలు నిజమని రుజువైంది: "సోషలిజమంటే నిర్జీవమైనదనీ, గడ్డకట్టినదనీ, శాశ్వతంగా నిర్ణయమైపోయినదనీ..." అనే బూర్జువా వాదన యెంత అబద్ధమో జీవితం రుజువుచేసింది; "వాస్తవంలో పౌర జీవిత, వ్యక్తిగత జీవిత రంగాలన్నిటిలోనూ, మొదట <u>మెజారిటీకీ</u>, తరువాత మొత్తం ప్రజానీకానికీ వర్తించే సత్వరమైన, అసలైన నిజంగా సామూహికమైన పురోగమనానికి సోషలిజం <u>మాత్రమే</u> ప్రారంభంగా వుంటుంది."**

అనేక బూర్జువా సిద్ధాంతకారులు ఆడంబరంగా "ప్రజలు" అనే మాట ఉపయోగిస్తూ, "ప్రజా క్షేమం" గురించి మాట్లాడుతారు. కానీ, "పెట్టుబడిదారీ వ్యవస్థ"కు "ప్రజల"ను కలపడం వల్ల, పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క స్వభావంలో మార్పేమీ రాలేదు, దాని దోపిడీ సారాంశాన్ని మరుగుపరచడానికి ఉద్దేశింపబడిన నుడికారం మాత్రం పుట్టింది.

చరిత్రలో జనాల నిర్ణాయక పాత్రకు తాను యిచ్చే గుర్తింపును మార్క్సిజం లెనినిజం కేవలం ప్రకటనగా పరిగణించదు, మార్క్సిస్టు లెనినిస్టు దృక్పథంలోని ఒక సూత్రంగా, ఆచరణాత్మక చర్యకు మార్గదర్శిగా పరిగణిస్తుంది.

కనుక, చరిత్రలో జనాల పాత్రను విశదపరచడానికి చరిత్ర క్రమ సారాంశపు పరిశీలనతో సంబంధం వుంది. కానీ, యీ క్రమంయొక్క నిర్దిష్ట రూపాన్ని చర్చించేటప్పుడు మనకు

---

* K. Marx and F. Engels, *The Holy Family* ("పవిత్ర కుటుంబం"), పుట 110.

** V. I. Lenin, *Collected Works*, Vol. 25, పుట 472 (తెలుగులో వి. ఐ. లెనిన్ "యేరిన రచనలు," రెండవ భాగం, రెండవ ముద్రణ, పుట 236).

మరొక సమస్య యెదురౌతుంది: చరిత్ర గతికి కారణాలను వివరించడం, దాని సవివరమైన రంగవల్లిని — నిర్దిష్ట దేశంలో, నిర్దిష్ట కాలంలో సజీవ మానవ వ్యక్తిత్వాల విలక్షణమైన కార్యాలను — పరిశీలించడం. యిది సామాజిక విషయంనుండి వ్యక్తిగత విషయానికి జరిగే పరివర్తనకు చెందిన సమస్య వద్దకు మనల్ని తీసుకపోతుంది.

ప్రజ్ఞానంలో, సామాజిక శాస్త్రంలో సామాజిక విషయంనుండి వ్యక్తిగత విషయానికి జరిగే పరివర్తన అంటే, ఒకటి, వ్యక్తిగత కార్యకలాపాలయొక్క సామాజిక అర్థాన్ని విశద పరచడమూ, రెండు, సామాజిక క్రమానికి నిర్దిష్ట వ్యక్తియొక్క "తోడ్పాటు"ను నిర్ణయించడమూ, విలువకట్టడమూ. యీ తోడ్పాటు భిన్న భిన్నంగా వుండవచ్చు; కానీ, యేమైన ప్పటికీ, వ్యక్తి చరిత్రయొక్క సాధారణ నియమాలను మార్చకపోయినా, విలక్షణంగా నిర్దిష్టమైన చరిత్ర గతిమీద ప్రభావం నెరపుతాడు.

చరిత్రలో వ్యక్తియొక్క పాత్ర అతని సొంత గుణాలమీదా, నిర్దిష్ట సమాజంలోని సంబంధాల వ్యవస్థ లోపలా, అతని ప్రభావాన్ని నిస్సందేహం చేసే సామాజిక యంత్రాంగం లోపలా అతనికి గల స్థానంమీదా, నిర్దిష్ట సమాజం యెదుర్కొనే సమస్యలమీదా ఆధారపడుతుంది. మానవాళియొక్క చారిత్రక అభివృద్ధిలో ప్రతి వ్యక్తీ యేదో ఒక విధంగా పాల్గొంటాడు; కానీ, ఘటనల గతిమీద గణనీయమైన ప్రభావాన్ని నెరపిన, యీ నాడు నెరపుతున్న వ్యక్తుల పాత్రను, అగ్రగణ్య వ్యక్తుల పాత్రను, విశద పరచడం ప్రత్యేక ప్రాముఖ్యమూ, ఆసక్తీ గలది.

నిర్దిష్ట యుగంలోని వర్గాల పోరాటంలో, జనాల ఉద్యమాలలో, రాజ్యాల ఘర్షణలో, అలాంటి యితర చారిత్రక క్రమాలలో వర్గాల కర్తవ్యాలను రూపొందించడమూ, వాళ్ళ పోరాటానికి సారథ్యం వహించడమూ, వివిధ ఉద్యమాలకు నాయకులుగా వ్యవహరించడమూ, సైన్యాలను యుద్ధానికి నడిపించడమూ, వగైరా పనులు చేసే మనుషుల అవసరం యెల్లప్పుడూ ఉత్పన్నమౌతుంది. అలాంటి మనుషులు యెల్లప్పుడూ ప్రత్యక్షమై తీరుతారు. వాళ్ల అగ్రగణ్య గుణాలు వాళ్లను సాధారణ జన బాహుళ్యంనుండి బయటికి తెచ్చి, వాళ్లను యెలాంటి స్థానాలలోకి తీసుకపోతాయంటే, వాళ్ళు జనాల కర్తవ్యాలను నిర్ణయించడానికీ, జనాల కార్యాచరణను ప్రభావితం చేసే నిర్ణయాలు చేయడానికీ ఆ స్థానాలు వీలు కలిగిస్తాయి. ప్రతి యుగమూ, ప్రతి వర్గమూ తమ లాగే వుండేటట్లు మనుషులను రూపుదిద్దుతాయి. అగ్రగణ్య వ్యక్తులంటే తమ యుగంయొక్కా, తమ వర్గంయొక్కా విశిష్ట లక్షణాలకు అత్యంత విస్పష్టమైన, నిశితమైన ప్రతిబింబంగా వుంటూ, తమ కాలపు అవసరాలను యితరులకంటె ప్రగాఢంగా వ్యక్తం చేసేవాళ్లు మాత్రమే. నిజమే, అప్పుడప్పుడు వర్గాలూ, పార్టీలూ, రాజ్యాలూ, సైన్యాలూ నిజంగా అగ్రగణ్యులైనవాళ్లచేత నడిపించబడవు. చరిత్ర పొడవునా అనేక అనామకులు సింహాసనాలమీద వుండినారు, అయోగ్యులు సేనాధిపతులుగానూ,

యాదృచ్ఛికమైన రాజకీయ నాయకులుగానూ వుండినారు. వాళ్లు పరిస్థితుల బలంచేత రాజకీయ ప్రాముఖ్యం గల స్థానాలలోకి తోయబడినారు. సాధారణంగా వాళ్లు ఘటనల వెల్లువలో అణగారి పోతారు. కానీ, నిజంగా అగ్రగణ్యులైన నాయకులు ఘటనల గతిమీద తమ వ్యక్తిత్వంయొక్కా, తమ స్వభావంయొక్కా ముద్రను వదలిపోతారు.

అగ్రగణ్య వ్యక్తియొక్క పాత్ర విశాలమైన జనాల క్రియాశీలతమీద సూటిగా ఆధారపడుతుంది. జనాలు యెక్కువ క్రియాశీలంగా వుండేకొద్దీ, ఉద్యమ అగ్రభాగాన వుండే వ్యక్తియొక్క గుణాలమీద యెక్కువ గురుతరమైన డిమాండ్లు చేయబడుతాయి. సమస్త దోపిడీని తొలగించి, క్రియాత్మక చారిత్రక సృజనాత్మకతలో విశాల శ్రామిక జనాలను మగ్నం చేసే మహనీయ కర్తవ్యాన్ని నిర్వహించడంలో కార్మికవర్గంయొక్క పోరాటం చరిత్రలో విప్లవోద్యమాలలో అత్యంత గొప్పది; అది దాని నాయకుల బాధ్యతనూ, వాళ్ల వ్యక్తిగత గుణాల ప్రాముఖ్యాన్నీ నిశితంగా పెంచుతుంది.

వివిధ దేశాలలో కార్మికవర్గపు సమస్త పోరాటమూ, దాని నిజమైన విజయాలూ మార్క్సిస్టు లెనినిస్టు కమ్యూనిస్టు, కార్మిక పార్టీల కార్యాచరణతో ముడిపడి వున్నాయి. కార్మికవర్గపు విప్లవ పార్టీ ఆ వర్గంయొక్క అగ్రదళం, నాయకత్వం వహించే దళం; అది ఆ వర్గంయొక్క ముఖ్య ప్రయోజనాలను చైతన్యవంతంగా వ్యక్తం చేస్తుంది, అత్యంత చురుకైన, విప్లవ మనస్కులైన కార్మికవర్గ సభ్యులనూ, తన వైపుకు వచ్చే యితర వర్గాల సభ్యులనూ తనలో లీనం చేసుకుంటుంది. సోషలిస్టు సమాజంలో కమ్యూనిస్టు పార్టీ యావత్ప్రజల అగ్రదళం; సోషలిస్టు సమాజాన్ని అభివృద్ధి చేయడంలో కార్మికవర్గపు నాయక పాత్రకు గల గుర్తింపును యిది వ్యక్తం చేస్తుంది. ఆధునిక సమాజంలో కమ్యూనిస్టు పార్టీయొక్క సామాజిక క్రియ లెనిన్ నిర్వచించిందే; అది యేమిటంటే, శాస్త్రీయ సోషలిజంను కార్మికవర్గ ఉద్యమంతో మేళవించడమూ, కార్మికవర్గపు వర్గ పోరాటాన్ని వ్యవస్థీకరించి, నడిపించడమూ, సోషలిజంనూ, కమ్యూనిజంనూ నిర్మించడమూ. యీ క్రియలో విజయం జనాలలో పార్టీకి గల లంకెలమీదా, జనాలలో దాని ప్రతిష్ఠమీదా, మార్క్సిస్టు లెనినిస్టు దృక్పథానికి అనుకూలంగా అది యెంత స్థిరంగా నిలబడుతుందనేదానిమీదా, ఆ శాస్త్రాన్ని నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించడంలో దాని నైపుణ్యమూ, అంతర్జాతీయవాద పంథాను అనుసరించడంలో దాని స్థిరత్వమూ, మొదలైనవాటిమీదా ఆధారపడుతుంది. అంతిమ పరిగణనలో పార్టీ కార్యాచరణయొక్క విజయం దాని మార్క్సిస్టు లెనినిస్టు నాయకత్వపు స్థాయిమీద ఆధారపడుతుంది. దీనినిబట్టి యేర్పడుతుంది పార్టీ నాయకులను రూపుదిద్దడానికీ, తర్ఫీదు చేయడానికీ, ప్రతిపాదించడానికీ గల గొప్ప ప్రాముఖ్యం.

మార్క్సిజం లెనినిజం వ్యక్తుల విపరీత స్తోత్రాన్ని, వ్యక్తి పూజను, సామూహిక

కార్యాచరణ ప్రాముఖ్యాన్ని నిరాకరించేదాన్ని, లేదా తగ్గించేదాన్ని, తోసిపుచ్చుతుంది, నాయకత్వ ప్రాముఖ్యాన్ని నిరాకరించే అరాజకవాద పద్ధతిని కూడా తోసిపుచ్చుతుంది. మార్క్సిజం లెనినిజం జనాలకూ, పార్టీకీ, నాయకులకూ మధ్య సరైన సంబంధాలను నెలకొల్పడానికి వీలు కలిగించే సూత్రాలను రూపొందించింది.

యెవరి భావాలూ, నిర్ణయాలూ చరిత్రను సృష్టిస్తాయని అంటారో ఆ "గొప్పవాళ్ల"ను గురించిన వివిధ ఊహలపట్ల మార్క్సిస్టు వైఖరినీ, వ్యక్తియొక్క విపరీత స్తోత్రంపట్ల దాని వైఖరినీ మార్క్సూ, ఎంగెల్సూ యువ హెగెలియన్లతో — సృజనాత్మక "విమర్శనాత్మక ఆలోచనాపర" మైనారిటీనీ, "జడ సమూహా"న్నీ వేరువేరుగా చూసినవాళ్లతో — చేసిన వాదోపవాదాలలోనూ, అరాజకవాదానికి పూర్వీకుడై, వ్యక్తి పాత్రను అతిగా పెంచిన మాక్స్ స్టీర్నెర్‌మీద చేసిన విమర్శలోనూ రూపొందించినారు. రష్యన్ నరోద్నిక్కుల తోనూ, "వీరులూ," "సమూహమూ" అనే వాళ్ల సిద్ధాంతంతోనూ — అంకెలు లేని సున్న లాగే "వీరులు" లేని జన సమూహానికి యేమీ విలువ లేదనే సిద్ధాంతంతో — చేసిన పోరాటంలో లెనిన్ కూడా ఆ వైఖరులను రూపొందించినాడు. చరిత్రలో వ్యక్తియొక్క, జనాలయొక్క పాత్రను గురించిన యువ హెగెలియన్ల, అరాజకవాదుల, నరోద్నిక్కుల దృక్పథాలకు చరిత్రను గురించిన శాస్త్రీయ భౌతికవాద దృక్పథంతో యేమీ సామ్యం లేదు. అవి వ్యక్తికీ జన సమూహానికీ మధ్య గల యధార్థ సంబంధం గురించి తలకిందులు దృక్పథం అవలంబిస్తాయి; యెందుకంటే, అవి వ్యక్తులకూ, బృందాలకూ అవి చరిత్రలో నిర్వహించని నిర్ణయాత్మక పాత్రను ఆపాదిస్తాయి.

అందువల్లనే, సైద్ధాంతికంగా మార్క్సిజం లెనినిజం వ్యక్తి పూజను ఆత్మగత భావవాద భావంగా పరిగణిస్తుంది. అది జనాలకూ, పార్టీకీ, నాయకులకూ మధ్య గల సరైన సంబంధాన్ని ఉల్లంఘించేదనీ, సోషలిజంయొక్క ప్రయోజనాలకు హాని కలిగించేదనీ దానిని మార్క్సిజం లెనినిజం నైతికంగా ఖండించి, రాజకీయంగా అత్యంత స్థిర సంకల్పంతో నిరాకరిస్తుంది.

ప్రకరణం పది

సామాజిక ప్రగతి

మనం మార్క్సిస్టు సామాజిక సిద్ధాంతపు మౌలిక సూత్రాలను చర్చించినాము. యివి నిర్దిష్ట చారిత్రక క్రమంయొక్క శాస్త్రీయ అధ్యయనానికి ప్రాథమిక సూత్రాలు. యిక మనం మరొక భావాన్ని పరిశీలించవలసి వుంది. మొత్తంగా సామాజిక జీవితాన్ని దాని పురోగమనంలో, ఆంతరంగికంగా విభజితమైనప్పటికీ సుసమన్వితమైన క్రమంగా వర్ణించే భావం అది — సామాజిక ప్రగతి అనే భావం.

ప్రగతి అనేది పరస్పరవాదంలో ఒక ధాతువు, అభివృద్ధి అనేది కేవలం మార్పు అనే క్రమం గానీ, ఒక వలయంలో జరిగే ఆవృత్తి గానీ కాదనీ, అదొక పురోగమనం, నిమ్న దశనుండి ఉన్నత దశకు తీసుకపోయే ఆరోహణ, అనీ తెలిపే ధాతువు అది.

మానవ జాతి చరిత్రలో యీ భావాన్ని ఉపయోగించడానికి ఆధారా లేమిటి? సామాజిక జీవితంలో ప్రగతి అంటే యేమిటి, తిరోగతి అంటే యేమిటి? సామాజిక వ్యవస్థయొక్క రూపాలలో జరిగే మార్పు యెప్పుడు నిమ్న దశనుండి ఉన్నత దశకు పురోగమించేదీ నిర్ణయించడానికి వస్తుగత సూచిక వుందా? చరిత్రయొక్క భౌతికవాద దృక్పథం ద్వారా యీ ప్రశ్నలకు జవాబులు లభిస్తాయి; వీటిని గురించి పాఠకుని కీపాటికి సూచనప్రాయంగా తెలిసి వుండాలి. వీటిని పరిశీలిద్దాం.

సామాజిక ప్రగతి భావం 18వ శతాబ్దపు వైతాళికులచేత, వాళ్లలోని జాన్ కొండొర్సే చేతా, జొహాన్ హెర్డెర్‌చేతా, మొదట ప్రకటింపబడింది. మానవ వివేకంయొక్క, శాస్త్ర

విజ్ఞానంయొక్క వృద్ధీ, జ్ఞాన వ్యాప్తీ, మొదలైనవి ప్రగతికి ప్రాతిపదికగా వాళ్ళు భావించినారు. మానవాళికి మేలైన భవిష్యత్తు వుందని వాళ్ళు నమ్మినారు, కానీ సామాజిక ప్రగతియొక్క సారాంశాన్నీ, మూలాలనూ వాళ్ళు శాస్త్రీయంగా నిర్వచించలేకపోయినారు.

మానవజాతి చరిత్ర "స్వేచ్ఛా స్పృహ"యొక్క అభివృద్ధి అనే తన పరస్పరవాద భావాన్ని 19వ శతాబ్దిలో హెగెల్ సృష్టించినాడు. కానీ, ప్రష్యన్ రాజరికం మానవ చరిత్రయొక్క శిఖరం అనే చిల్లర భావంతో అతను తన తాత్విక చారిత్రక వ్యవస్థను పూర్తి చేసినాడు. అంతే కాక, ప్రతి యుగంలోనూ యేదో ఒక జాతి చారిత్రక ప్రగతికి వాహనంగా వుంటుందనీ, యితర జాతులు, ఒక విధంగా చెప్పాలంటే, చరిత్రకు వెలుపల వుంటాయనీ హెగెల్ నమ్మినాడు. హెగెల్ అవగాహనమీద జర్మన్ జాతీయవాద ముద్ర వుండింది. యెందుకంటే, ఆధునిక కాలంలో జర్మానిక్ జాతులు ప్రగతి వాహనాలని అతను ప్రకటించినాడు.

బూర్జువా సామాజిక శాస్త్ర స్థాపకులైన హెర్బర్ట్ స్పెన్సర్, ఒగూస్ట్ కోంట్ కూడా సామాజిక ప్రగతి వుందని నమ్మినారు. కానీ, హెగెల్‌కు భిన్నంగా, వాళ్ళ దృక్పథం పరస్పర వాదాత్మకం కాక, అపభ్రంశ పరిణామవాదాత్మకంగా వుండింది. వాళ్ళ సామాజిక అభిప్రాయాలను బూర్జువా ఉదారవాద ప్రగతివాదంగా వర్గీకరించవచ్చు. 19వ శతాబ్దిలో కొందరు ఆలోచనశీలురు చారిత్రక ప్రగతియొక్క అవకాశాలను గురించి నిరాశావాదపు అభిప్రాయాలు వ్యక్తం చేసినప్పటికీ, చరిత్రను గురించిన పరిణామవాదాత్మక దృక్పథం బూర్జువా సామాజిక చింతనలో ప్రాబల్యం వహించిన యుగం అది. తద్భిన్నంగా, పెట్టుబడిదారీ వ్యవస్థకు క్షీణ యుగమైన 20వ శతాబ్దపు బూర్జువా తాత్వికులూ, సామాజిక శాస్త్రజ్ఞులూ అత్యధికంగా ప్రగతి భావంపట్ల వ్యతిరేక వైఖరి అవలంబిస్తారు.

వాళ్ళ వాదాలు యేమిటి? ప్రగతి భావంమీద వాళ్ళు చేసే విమర్శయొక్క అత్యంత ముఖ్యమైన వాదాలలో ఒకటి ప్రపంచ చారిత్రక క్రమాన్ని యేకీకృత సమస్తంగా చూడవచ్చు ననేదాన్ని నిరాకరించడంమీద ఆధారపడింది. దానికి బదులుగా వాళ్ళూ, అనేక మంది వాళ్ళ అనుచరులూ ముకుళిత (closed) స్థానిక సంస్కృతులు, లేక నాగరికతలు వున్నాయనీ, వాటిలో ప్రతి వొకటీ తన సొంత అభివృద్ధి క్రమం గుండా నడుస్తుందనీ సూచిస్తారు. యీ దృక్పథాన్ని అవలంబించేవాళ్ళలో ఓస్వాల్డ్ స్పెంగ్లర్, ఆర్నాల్డ్ టోయ్న్‌బీ, వాళ్ళ అనుచరులూ వున్నారు. చరిత్రలో అనేక సంస్కృతులూ, నాగరికతలూ పుట్టి, చచ్చినాయనే వాస్తవంమీద వీళ్ళ అవగాహనలు ఆధారపడినాయి. కొంతమంది బూర్జువా తాత్వికులు అభిమానించే "యేక రేఖాత్మక ప్రగతి"కి చెందిన యూరప్ కేంద్రిత అవగాహనలలోని దుర్బల అంశాలను వీళ్ళు గమనించినారు, కానీ చరిత్రలోని అపారమైన వైవిధ్యాన్ని వీళ్ళు పరమమైనదిగా యెంచి, సంస్కృతుల మధ్య సంబంధం గానీ, అనుస్యూతి గానీ లేదనే నిర్ధా

రణ చేసినారు, అవి బయటి సంబంధాలు లేని ముకుళిత వస్తువు వ్యవస్థ అన్నారు. చరిత్ర ఒకేఒక అల కానప్పుడు, మానవాళియొక్క యధార్థ చరిత్రలో ఒకేఒక ప్రగతి రేఖను చూడ ప్రయత్నించడంలో అర్థ మేమిటి?* చరిత్రను గురించిన అలాంటి దృక్పథాన్ని శాస్త్రీయమని గానీ, యధార్థాన్ని ప్రతిబింబించేదని గానీ పరిగణించజాలం. నిజమే, ప్రతి జాతికీ సొంత చరిత్ర వుంది. ఒక జాతి చరిత్ర, అత్యంత ముఖ్య లక్షణాలలో నైనా, మరొక జాతి చరిత్రను పునశ్చరణ చేయవలసిన కారణం లేదు.

కానీ, నయా కాంటియన్ దృక్పథాన్ని విమర్శించేటప్పుడు మేము పైన చెప్పినట్లు, మళ్లీ మళ్లీ కనపడే సాధారణ లక్షణాలను పరిగణించకుండా చరిత్రయొక్క వ్యష్టి లక్షణాలను మాత్రమే పరిగణించడం తప్పు. ఉత్పాదక శక్తులనూ, ఉత్పత్తి సంబంధాలనూ పరిశీలించడంద్వారా యీ సాధారణ లక్షణాలను నిర్వచించవచ్చు. యీ "సాధారణ అంశం"యొక్క, దీని మార్పులయొక్క పరిశీలన మానవ చరిత్రయొక్క అభివృద్ధిలోని సాధారణ రేఖను వెల్లడించడానికి తోడ్పడుతుంది. చరిత్రలోని యేకత్వాన్ని రెండు స్థాయిలలో చర్చించవచ్చు. ఒకటి, నిర్దిష్ట సామాజిక వ్యవస్థపు చట్రం లోపల సకల సామాజిక విషయాల యేకత్వం, నిర్దిష్ట ఉత్పత్తి విధానపు ప్రాతిపదికమీద ఆ విషయాల మధ్య సజీవ సంబంధం వుండడం వలన యేర్పడే యేకత్వం. రెండు, దేశాల, జాతుల, సంస్కృతుల, రాజ్యాల, వగైరాల వైవిధ్యపు యేకత్వం. ప్రపంచ చరిత్రలో యేకత్వం, ప్రగతిశీల అభివృద్ధీ వున్నాయనే దృక్పథం వివిధ జాతులకు చారిత్రక అభివృద్ధి మార్గాల వైవిధ్యాన్ని తోసివుచ్చదు సరి కదా, యీ వైవిధ్యాన్ని ఒక కోణంనుండి విడదీయడానికీ, ప్రతి జాతియొక్క చరిత్రనూ చారిత్రక ప్రగతియొక్క సాధారణ రేఖతో అనుబంధించడానికీ తోడ్పడుతుంది. కానీ, చారిత్రక అభివృద్ధి రేఖను వెల్లడించడమూ, మొత్తంగా చారిత్రక గతిని అర్థం చేసుకోవడమూ యెలా సాధ్యమౌతుందంటే, వివిధ సంస్కృతుల, నాగరికతల విలక్షణత్వాలను మాత్రమే కాక, మొత్తం ప్రపంచ చరిత్రనూ, దాని ఆంతరిక సంబంధాలనూ, అనుస్యూతినీ పరిగణించడంద్వారా మాత్రమే. అలా పరిగణించేటప్పుడు, యూరప్, ఆసియా, ఆఫ్రికా అనేవి, భౌగోళిక భావాలే, చారిత్రక భావాలు కాదు అనే విషయాన్ని మనసులో వుంచుకోవాలి.

సామాజిక ప్రగతి భావంమీద యితర కోణాలనుండి కూడా దాడి జరుగుతున్నది. పశ్చిమ దేశాలలో జరిగిన ప్రత్యక్ష ప్రమాణవాదపు సామాజిక శాస్త్ర అభివృద్ధి, కొన్ని దశలలో

---

*న్యాయంగా చెప్పాలంటే, టోయ్న్‌బీ దీనికి కాస్త మినహాయింపుగా వున్నాడు; యెందుకంటే, అతను వివిధ సంస్కృతుల వలయాత్మక అభివృద్ధి భావాన్ని ప్రగతి భావంతో మేళవిస్తాడు, ప్రగతిని మత, మాయావాద దృష్టితో చూస్తాడు.

ఒక ధోరణిని ఉత్పత్తి చేసింది. అదేమిటంటే విశాల సామాజిక సాధారణీకరణలను ప్రత్యక్ష ప్రమాణవాద రీత్యా తైపారు చేయడానికి వీలు లేదనే సాకుతో వాటిని విసర్జించే ధోరణి. దీని అర్థం యేమిటంటే, విశాల సైద్ధాంతిక సాధారణీకరణలను వ్యక్తం చేసే భావాలను ఉపయోగించకుండా వుండడం.

తొలి 1920లలో అమెరికన్ సామాజిక శాస్త్రజ్ఞుడు విలియం ఒగ్‌బర్న్ అభివృద్ధి భావం సమాజానికి వర్తించదని అన్నాడు. అతని తర్వాత కొందరు బూర్జువా సామాజిక శాస్త్రజ్ఞులు ఉమ్మడి అభివృద్ధి రేఖ కొరకు, ప్రగతిశీల పరిణామాత్మక ధోరణి కొరకు, చరిత్రలో చూడవలసిన అవసరం లేదు గనుక, సమాజం విషయంలో "అభివృద్ధి," "పరిణామం," "ప్రగతి" అనే భావాన్ని విసర్జించాలని పట్టుబట్టినారు.

కొందరు బూర్జువా సామాజిక శాస్త్రజ్ఞులు ప్రగతి భావంపట్ల వ్యతిరేక వైఖరి అవలంబించేది యే సిద్ధాంత ఆధారంమీద నంటే: యీ భావంలో భిన్న సామాజిక స్థితులను ఒకదానితో ఒకదానిని పోల్చడమూ, వాటిని నిమ్న, ఉన్నత దశలుగా విభజించడమూ యిమిడి వుందనే ఆధారంమీద. యిది మన విలువల వ్యవస్థమీద ఆధారపడుతుంది, కనుక ఆత్మగతమైనది, అని వాళ్లంటారు. అందువలన, ప్రగతి భావం విలువ గీటురాళ్ల సముచ్చయాన్ని ప్రవేశపెడుతుంది, వాటికి శాస్త్రవిజ్ఞానంతో యేమీ సంబంధం లేదు, కనుక ప్రగతి భావం దీనినుండి బహిష్కరింపబడాలి, అని వాళ్లు వాదిస్తారు.

యిది భిన్న విషయాల గందరగోళాన్ని తెలుపుతుంది. నిజమే, భిన్న అభివృద్ధి దశలను వివిధ ఆత్మగత (యిష్టారాజ్యపు) గీటురాళ్ల ఆధారంమీద అంచనా వేయడం సామాజిక శాస్త్రానికి సరైనది కాదు. కానీ, ఒకటి, సామాజిక ప్రగతికి వస్తుగత గీటురాయి యేదీ లేదని బూర్జువా సామాజిక శాస్త్రం యింకా రుజావు చేయలేదు; రెండు, వస్తుగత గీటురాయి అయిన ప్రగతి ప్రాతిపదికమీద వివిధ సామాజిక వ్యవస్థలతో లేక స్థితులతో ప్రయోజనాలకూ, అవసరాలకూ గల సంబంధాన్ని వ్యక్తం చేసే విలువ గీటురాయి వైఖరి ఉహ్యామే. విలువల గీటురాళ్లు శాస్త్రవిజ్ఞానంమీద ఆధారపడితే తప్ప, అవి ఆత్మగతంగా వుండడానికి అభిముఖంగా వుంటాయి; యీ విషయాన్ని సామాజిక శాస్త్ర చరిత్ర బాగా నిరూపిస్తుంది. కానీ, శాస్త్రీయ ఆధారం గల నైతిక, తదితర విలువ నిర్వచనాలు ఆమోదయోగ్యమైనవని కూడా అది నిరూపిస్తుంది. ఉదాహరణకు, ఫాసిజం సామ్రాజ్యవాద ప్రగతి వ్యతిరేకతయొక్క, సామాజిక తిరోగతియొక్క ఉత్పాదితమని శాస్త్రీయ అంచనాగా మనం అంటాం. యీ శాస్త్రీయ, వర్గ అంచనామీద మనం దానిని గురించి తదనుగుణమైన నైతిక, తదితర అంచనాలు వేయవచ్చు.

యేమైనా, సామాజిక ప్రగతికి వస్తుగత గీటురాయి అనేది వుందా?

ఉత్పత్తి అనేది సామాజిక అభివృద్ధికి ప్రాతిపదిక గనుక, దీనినిబట్టి యేర్పడే దేమి

టంటే: మనం సామాజిక ప్రగతికి వస్తుగత గీటురాయి కొరకు వెదకవలసింది అక్కడే; చారిత్రక క్రమంలో ఉత్పన్నమయ్యే భేదాలను గురించి వస్తుగత అంచనాలు వేయడానికీ, సమాజం యే అభివృద్ధి దశకు చేరుకొన్నదీ నిర్ణయించడానికీ ఉపయోగపడగల సూచిక కొరకు వెదకవలసింది అక్కడే.

ఉత్పాదక శక్తులు యే మేరకు అభివృద్ధి చెందినా యనేదానిచేత ఉత్పత్తి అభివృద్ధి స్థాయి నిర్ణయింపబడుతుంది గనుక, భౌతికవాద చారిత్రక దృక్పథంయొక్క మొత్తం అవగాహననుండి యీ విషయం విధిగా యేర్పడుతుంది: సామాజిక ప్రగతియొక్క అత్యున్నతమైన వస్తుగత గీటురాయి ఉత్పాదక శక్తుల అభివృద్ధిలో కనపడుతుంది.

ఉత్పాదక శక్తుల అభివృద్ధి సామాజిక ప్రగతి దశల దారిలో జరిగే మానవజాతి పురోగమనానికి కీలకమైనది; యెందుకంటే, అది మానవుడు ప్రకృతి శక్తులమీద యే మేరకు ఆధిపత్యం సంపాయించిందీ — వాటిని తన సేవలో పెట్టుకోవడంలో యే మేరకు కృతార్థుడైందీ — మానవజాతియొక్క సామాజిక అభివృద్ధికి యేర్పడే అవకాశాలనూ ప్రోగుచేసి చూపుతుంది.

యీ గీటురాయి వస్తుగతమైనది; యెందుకంటే, అన్నిటినీ మించి సామాజిక అభివృద్ధి మెట్లలో ఒక సామాజికార్థిక నిర్మాణంయొక్క స్థానాన్ని నిర్ణయించడానికీ, అంచనా వేయడానికీ యిది ఉపయోగపడగలదు.

కొత్త సామాజిక రూపాలు ఉత్పాదక శక్తుల మునుపటి అభివృద్ధిమీద ఆధారపడి, వున్నందువల్లనే వాటికి ఉన్నతమైన విలువ వుండగలదు; ఆ ఉత్పాదక శక్తులు అవి పురోగమించడానికీ, తమ వెంట ఉన్నత దశకు సాగిపోడానికీ తోడ్పడుతాయి. యే ఆర్థిక సంబంధాల వ్యవస్థ యెక్కువగా అభివృద్ధి చెందిన ఉత్పాదక శక్తులకు అనుగుణంగా వుంటుందో, యేది వాటి అభివృద్ధికి యెక్కువ అవకాశాన్ని యిచ్చి, యెక్కువ ప్రేరణలను సృష్టిస్తుందో, ఆ వ్యవస్థ యెక్కువ ప్రగతిశీలమైనది.

కానీ, ప్రతి ఉత్పత్తి సంబంధాల రూపమూ ఉత్పాదక శక్తుల అభివృద్ధియొక్క ప్రయోజనాలకూ, అవసరాలకూ పరిమితమైన కొంత కాలం వరకు మాత్రమే ఉపయోగపడుతుంది; అందువల్లనే అది చారిత్రకంగా తాత్కాలికమైనది. యీ అర్థంలో సముచితంగా యిలా చెప్పవచ్చు: సామాజిక ప్రగతియొక్క సారం యేమిటంటే, తక్కువగా అభివృద్ధి చెంది, ఉత్పాదక శక్తులకు అనుగుణంగా వుండడం ఆగిపోయిన ఆర్థిక నిర్మాణం గల సమాజాన్ని తొలగించి, దాని స్థానంలో యెక్కువగా అభివృద్ధి చెందిన ఉత్పాదక శక్తుల ప్రాతిపదికమీద రూపుదాల్చిన మరింత ఉన్నతమైన, మరింత పరిణతమైన నిర్మాణం గల సమాజాన్ని వుంచడం.

యీ సందర్భంలో మార్క్స్ ఆసియన్, ప్రాచీన, ఫ్యూడల్, బూర్జువా ఉత్పత్తి విధానాలను ఆర్థిక సామాజిక నిర్మాణరూపపు ప్రగతిశీల యుగాల అనుక్రమంగా చెప్పవచ్చునని రాసినాడు. వీటిలో ప్రతి వొకటీ మునుపటి దానితో పోలిస్తే ఉన్నతమైనది; యెందుకంటే, అది యెక్కువ అభివృద్ధి చెందిన ఉత్పాదక శక్తులకు అనుగుణంగా వుండి, వాటి అభివృద్ధికి యెక్కువ అవకాశాన్ని యిస్తుంది గనుక (ఆసియన్ ఉత్పత్తి విధానం గురించిన ఆధునిక శాస్త్రీయ దృక్పథం ప్రకరణం నాలుగులో చర్చింపబడింది).

సమాజంయొక్క యితోధిక ప్రగతి పెట్టుబడిదారీ నిర్మాణరూపంనుండి కమ్యూనిస్టు నిర్మాణరూపానికి జరిగే పరివర్తనలో వుంది. ఆ నిర్మాణరూపంయొక్క మొదటి దశ సోషలిజం.

సోషలిస్టు వ్యవస్థ యింకా దాని తొలి అభివృద్ధి దశలోనే వుంది. సామాజిక సోషలిస్టు ఆస్తి ఆధునిక ఉత్పాదక శక్తుల యితోధిక అభివృద్ధికి అత్యంత విస్తృతమైన అవకాశాలను కలిగిస్తుంది. యెందుకంటే, అది ఉత్పత్తి అభివృద్ధిని సొంత ఆస్తిపరుల స్వార్థ ప్రయోజనాలకు — పెట్టుబడిదారీ గుత్త సంస్థల లాభాల వేటకు — లోబరచక, మొత్తం సమాజపు ప్రయోజనాలకూ, శ్రామిక ప్రజల పెరుగుతున్న అవసరాలు తీరడానికీ లోబరుస్తుంది. వివిధ కారణాలవల్ల సోషలిజం యింకా కొన్ని ఆర్థిక సూచికలలో అత్యంత పురోగామి పెట్టుబడిదారీ దేశాల కంటె వెనుకబడి వున్నప్పటికీ, దాని యితోధిక అభివృద్ధి క్రమంలో పెట్టుబడిదారీ వ్యవస్థ సాధించినంత కంటె ఉన్నతమైన ఉత్పాదక శక్తుల స్థాయిని తప్పక సాధిస్తుంది.

ఉత్పాదక శక్తుల స్థాయి శ్రమ ఉత్పాదకతచేత కొలవబడుతుంది. ఆవిధంగానే, కొత్త సామాజిక వ్యవస్థ పాతదానిమీద గెలుపు సాధించడానికి సామాజిక శ్రమ ఉత్పాదకతలో మరింత ఉన్నతమైన స్థాయిని సాధించడం ముఖ్య విషయమని అక్టోబర్ విప్లవం తర్వాత లెనిన్ అన్నాడు. అందువల్లనే సోషలిస్టు దేశాలు ఆర్థికాభివృద్ధి రేటును పెంచడానికి అంత శ్రద్ధను అర్పిస్తున్నాయి. తమ ఆర్థిక, మిలిటరీ శక్తిని పెంచుకోడానికి మాత్రమే కాక, పెట్టుబడిదారీ వ్యవస్థమీద సోషలిజంయొక్క సౌకర్యాలను రుజువు చేసే మౌలిక సమస్యను పరిష్కరించడానికి కూడా యిది అవసరం.

కొంతమంది పెట్టుబడిదారీ వ్యవస్థ కూడా ఉత్పత్తి అభివృద్ధికి అలాంటి అవకాశాలను కలిగిస్తుందని అంటూ, కొన్ని పెట్టుబడిదారీ దేశాల ఆర్థిక విజయాలనూ, పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో శాస్త్ర, సాంకేతిక విప్లవ విజయాల వినియోగాన్నీ చూపుతారు. కానీ, యీ వ్యష్టి, ప్రత్యేక విజయాలు పెట్టుబడిదారీ వ్యవస్థను గురించిన సాధారణ అంచనాను, దాని ఆర్థిక, సామాజిక నియమాలనుబట్టి యేర్పడేదానిని మార్చజాలవు. యెందుకంటే, యీ నియమాలు ప్రపంచ వ్యాప్త పరిమాణంలో దీర్ఘ చారిత్రక కాలాల పొడవునా పనిచేస్తాయి.

పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉత్పాదక శక్తులకూ, ఉత్పత్తి సంబంధాలకూ మధ్య గల మౌలిక వైరుధ్యం దాని అభివృద్ధికి చారిత్రక హద్దులను విధిస్తుంది. బూర్జువావర్గమే ఆర్థిక వ్యవస్థయొక్క ప్రభుత్వ గుత్త రూపాలను అభివృద్ధి చేయడంద్వారా యీ వైరుధ్యాన్ని పరిష్కరింప జూస్తుంది. కానీ, అది పెట్టుబడిదారీ సమాజపు స్వభావాన్ని మార్చడం లేదు, బూర్జువా సిద్ధాంతవేత్తల ఉద్ఘాటనలకు భిన్నంగా, ఆ సమాజాన్ని యేవిధంగానూ నూతన సమాజంగా "రూపాంతరీకరించడం" లేదు.

సమాజంయొక్క సామాజిక నిర్మాణమూ, దాని వివిధ సామాజిక సంస్థలూ, మొత్తం ఉపరినిర్మాణ రంగమూ ఆర్థిక రంగంమీద ఆధారపడుతాయి. అందువల్లనే సామాజిక నిర్మాణాలను కూడా వస్తుగతంగా అంచనా వేయవచ్చు. ఉత్పత్తి సంబంధాలు ఉత్పాదక శక్తులమీద ఆధారపడుతాయి గనుక, అవి వివిధ దేశాల, జాతుల అభివృద్ధిలోని సాధారణ అంశాలను వెల్లడించడానికి వీలు కలిగించి, మొత్తం సామాజిక నిర్మాణంయొక్క ముఖ్యాంశాలను వస్తుగతంగా అంచనా వేయడానికి ప్రాతిపదికను సమకూరుస్తాయి.

ప్రగతి గీటురాయికి యిచ్చే యీ నిర్వచనానికి ఆక్షేపణ యేమిటంటే, యిది మానవునీ, అతని ప్రయోజనాలనూ, అభివృద్ధినీ వదిలి వేస్తుందనేది. కానీ, యీ ఆక్షేపణ చెల్లదు; యెందుకంటే, మానవుడు సామాజిక జీవి, అతని స్వభావమూ, "సారమూ" మారనివీ, శాశ్వతంగా నిర్ణయింపబడినవీ కావు. అందువల్లనే, ఒక సామాజిక వ్యవస్థ యే మేరకు మానవుని "మారని స్వభావాని"కి అనుగుణంగా వుంది, లేదా అనుగుణంగా లేదు, అనేదాన్ని బట్టి దాని ప్రగతిశీలతను నిర్ణయించే పాత, ఆదిమ, మానుషశాస్త్ర వైఖరికి భిన్నంగా, సామాజిక శాస్త్రం మానవుని ప్రయోజనాలనూ, అవసరాలనూ ఉత్పత్తి అభివృద్ధితో కూడిన చరిత్రయొక్క ఉత్పాదితంగా పరిగణిస్తుంది. సామాజిక ప్రగతిని సామాజిక మానవుని అభివృద్ధిగా చూడడానికి తోడ్పడేది అదే. మానవుడు, అనగా అతని సొంత అభివృద్ధియొక్క ప్రమాణం, సామాజిక ప్రగతి గీటురాయికి యిచ్చే చారిత్రక భౌతికవాద నిర్వచనానికి అనుబంధ విషయంగా కనపడడు, ఆ గీటురాయిలోనే గల అవశ్య భాగంగా కనపడుతాడు. యిక్కడ మరొక విషయాన్ని చర్చించవలసిన అవసర ముంది.

ఉత్పాదక శక్తుల అభివృద్ధి మొత్తంగా సామాజిక ప్రగతికి అత్యున్నతమైన గీటురాయిగా వుంటుంది గానీ, వ్యష్టి సామాజిక విషయాల అభివృద్ధికి వస్తుగత సూచికగా యెల్లప్పుడూ ఉపకరించదు. ఆ విషయాలు తమ సొంత విశిష్ట లక్షణాలను కలిగి, సాపేక్షంగా స్వతంత్రంగా వుంటూ, తమ అభివృద్ధి స్థాయికి కొన్ని విలక్షణమైన సూచికలను కలిగి వుంటాయి. యిది ముఖ్యంగా సామాజిక చైతన్యపు వివిధ రూపాల అభివృద్ధికి వర్తిస్తుంది. నీతి, కళా, తత్వశాస్త్రమూ సంకీర్ణమైన మధ్యంతర లంకెల పరంపరద్వారా మాత్రమే ఉత్ప

త్తితో ముడిపడి, తమ సొంత విశిష్ట అభివృద్ధి లక్షణాలు కలిగి వుంటాయి. అందువల్లనే, యీ రూపాలలో ప్రతిదానికీ విలక్షణమైన తన సొంత అభివృద్ధి సూచికలు వుంటాయి.

చారిత్రక భౌతికవాదం రూపొందించిన సామాజిక ప్రగతి అనే భావానికీ, దాని గీటురాయికీ సిద్ధాంత రీత్యానూ, పరిశీలన పద్ధతిగానూ ప్రాముఖ్యం వుంది; అనగా అవి నిర్దిష్ట చారిత్రక సామగ్రినీ, సామాజిక అభివృద్ధి గతిలో ఉత్పన్నమయ్యే నిజమైన విభేదాలనూ అధ్యయనం చేయడంలో మార్గదర్శిగా ఉపకరిస్తాయి. కానీ, చారిత్రక క్రమం నిర్దిష్టంగా యెలా నడవవలసిందీ, వివిధ పరిస్థితులలోని చారిత్రక అభివృద్ధి గతిలో యే నిజమైన విభేదాలు రూపుదాల్చవలసిందీ అవి మనకు బొత్తిగా తెలుపవు. అందువల్లనే, యీ సూత్రాలను హెర్బర్ట్ స్పెన్సర్, యన్. మిహైలోవ్స్కి లాంటి బూర్జువా సామాజిక శాస్త్రజ్ఞులు సూచించిన ప్రగతియొక్క సాధారణ "సూత్రాల"తో అభిన్నంగా చూడకూడదు. వాళ్లు యధార్థ చరిత్ర మీద నిశ్చితమైన అభివృద్ధి "నియమాల"నూ, అది యే పథకాల ప్రకారం నడవవలసిందీ విధించడానికి ప్రయత్నించినారు. ప్రగతి సమస్యపట్ల యీ వైఖరి అభౌతికమనీ, చారిత్రకే తరమనీ మార్క్సిస్టులు యెల్లప్పుడూ విమర్శించినారు. యధార్థ చరిత్రమీద చారిత్రకే తర పథకాలను విధించకూడదనీ, గుణాత్మకంగా భిన్నమైన సమాజాల – సామాజికార్థిక నిర్మాణరూపాల అభివృద్ధికి చెందిన నిజమైన క్రమాలనూ, నియమాలనూ, వాటి పుట్టుకకూ, అభివృద్ధికీ, ఒక నిర్మాణరూపంనుండి మరొక నిర్మాణరూపానికి జరిగే పరివర్తనకూ చెందిన నియమాలనూ అధ్యయనం చేయాలని ప్రగతిని గురించిన శాస్త్రీయ దృక్పథం అపేక్షిస్తుంది.

చారిత్రక ప్రగతిని సామాజిక నిర్మాణరూపాల అభివృద్ధిగానూ, అనుక్రమంగానూ చూసే దృక్పథం ప్రపంచ చరిత్రను సుసమన్వితమైనదిగా చూపడం మాత్రమే కాక, చారిత్రక ప్రగతియొక్క వైవిధ్యాన్ని పరిశీలించడానికి ప్రాతిపదికను కూడా సమకూరుస్తుంది.

తన నిర్దిష్ట నియమాలు గల ప్రతి సామాజిక నిర్మాణరూపంయొక్క అభివృద్ధికీ విశిష్ట చారిత్రకాభివృద్ధి సంవిధానమూ, దాని చోదక శక్తులకూ, అభివృద్ధి వేగానికీ, యే చారిత్రక చట్రంలో దానిని ప్రగతిగా – కేవలం సామాజిక మనుగడగానో, వెనక్కి పోవడం గానో కాక, పురోగమనంగా – చూడవచ్చునో ఆ చట్రానికీ చెందిన విలక్షణత్వాలూ వుంటాయి. ప్రతి సామాజిక నిర్మాణరూపమూ అభివృద్ధికి నిర్దిష్టమైన అవకాశాలను కలిగిస్తుంది, అవి పూర్తిగా వినియోగింపబడినప్పుడు విధిగా గుణాత్మకంగా కొత్తదైన అభివృద్ధి స్థాయికి సాగిపోతుంది, లేదా యేదో ఒక రూపంలో సామాజిక పతనానికి సాగిపోతుంది.

ప్రతి సామాజిక నిర్మాణరూపంయొక్క నియమాలూ విశిష్టంగా వుంటాయి గనుక, చరిత్రయొక్క సాధారణ నియమాలు భిన్నభిన్న పరిస్థితులలో విలక్షణంగా వ్యక్తమౌతాయి

గనుక, అవి చారిత్రక క్రమంయొక్క దిశను ''దరహంమీద'' నిర్ణయించవు, మరి సరిగ్గా ఫలానా నిర్దిష్ట సమాజంలో, ఫలానా నిర్మాణరూపంలో ఫలానా సామాజిక గుణంలో జరిగే మార్పుగా నిర్ణయిస్తాయి. కానీ, తద్వారా తదనంతర చారిత్రక అభివృద్ధి గతి అంతా ముందే నిర్ణయింపబడిందని దీని అర్థం కాదు. అందువల్లనే సామాజిక జోస్యానికి కూడా చారిత్రక పరిమితులున్నాయి. సామాజిక నిర్మాణాల, క్రమాల పూర్వావసరాలూ, బీజాలూ వాస్తవంగా యిప్పటికే వుంటే, ఆ నిర్మాణాలనూ, క్రమాలనూ చరిత్రలో జరగబోయేవిగా జోస్యం చెప్పడం శాస్త్రీయంగా సాధ్యమే.

సామాజిక నియమాల ఆచరణలో బ్రహ్మ లిఖితం లాంటి అనివార్యత యేమీ లేదు. అందువలన చారిత్రక క్రమంయొక్క దిశలోనే అనివార్యత యేమీ లేదు. దీనికి కారణం యేమిటంటే, చారిత్రక పరస్పర చర్యలలో పాల్గొనే సామాజిక శక్తుల వైవిధ్యమూ, సంకీర్ణతా, ఆత్మగత అంశంయొక్క ప్రభావమూ, చారిత్రక యాదృచ్ఛికతా, మొదలైనవి.

చారిత్రక ప్రగతి సమాజంయొక్క స్వీయాభివృద్ధి, సామాజిక నియమాలచేత నిర్ణయింపబడేటట్టిది, మానవ కార్యకలాపాలద్వారా జరిగేటట్టిది. చారిత్రక ప్రగతిని గురించిన యీ దృక్పథం సూచించే దేమిటంటే: ప్రగతి దిశ మానవుల సంకల్పంమీదా, కోరికలమీదా, ఆశయాలమీదా ఆధారపడదు, మరి వస్తుగత నియమాల ఆచరణమీద ఆధారపడుతుంది. మానవులు పెట్టుకొనే చైతన్యపూరిత సామాజిక లక్ష్యాలు (అన్నిటినీ మించి, విస్తారమైన జనాలకూ, వర్గాలకూ సామాజికంగా ముఖ్యమైన లక్ష్యాలు) చారిత్రక అభివృద్ధియొక్క వస్తుగత ధోరణులకు అనుగుణంగా వున్నప్పుడు మాత్రమే విజయవంతంగా సాధింపబడగలవు.

భగవంతుడు చరిత్రకు యేదో లక్ష్యం నిర్దేశించి, దానిని సాధించడానికి స్థిరంగా కృషి చేసినాడనే దృక్పథమూ, చారిత్రక ప్రగతి భావం గురించిన పిరికి సందేహవాదమూ, యివి రెండూ భౌతికవాద దృష్ట్యా చెల్లనివే. సామాజిక నియమాలు ప్రగాఢమైన చారిత్రక ధోరణులుగా పనిచేస్తాయి. అవి నిర్దిష్ట సామాజిక పరిస్థితుల సముచ్చయంలో జరిగే మార్పుల సాధారణ దిశను నిర్ణయిస్తాయి. కానీ, వాస్తవ చరిత్రలో, నిర్దిష్ట నిర్మాణరూపంలోని భౌతిక పరిస్థితులచేత నిర్ణయింపబడిన చట్రం లోపల మహా వివిధమైన అవకాశాలు యెప్పుడూ ఉత్పన్న మౌతాయి. వాటి వాస్తవీకరణ జనాల క్రియాశీలతమీద, మానవుల చారిత్రక కార్యాచరణమీద ఆధారపడుతుంది. సృజనాత్మక చారిత్రక కార్యాచరణ చేయడానికి మానవులకు అత్యంత విస్తృతమైన అవకాశాలు యెదురౌతాయని దీని అర్థం. ఉదాహరణకు, మన యుగంలో సామాజిక పరిస్థితులు మారడానికి గల సాధారణ ప్రగతిశీల ధోరణి సోషలిజంవైపుకూ,

కమ్యూనిజంవైపుకూ జరిగే పురోగతిగా నిర్ణయింపబడింది. కానీ, యీ క్రమంయొక్క నిర్దిష్ట పథకమూ, ప్రగతికి అత్యంత విస్తృతమైన అవకాశాలు ఉత్పన్నమయ్యే స్థలాలూ, లేదా, తద్విరుద్ధంగా, నిస్తబ్ధతా, తిరోగమనమూ ఉత్పన్నమయ్యే స్థలాలూ, యివన్నీ నియమాల ఆచరణమీద మాత్రమే కాక, ఒకదానితో ఒకటి పెనవేసుకొని, నిర్దిష్ట కాలంలో నిర్దిష్ట దేశంలోని నిర్దిష్ట పరిస్థితులుగా యేర్పడే అనేక అంశాల పరస్పర చర్యమీదా, జనాల క్రియాశీలతమీదా, సామాజిక బృందాల ఘర్షణమీదా, పార్టీల, వ్యక్తుల కార్యకలాపాల మీదా, వగైరాలమీద ఆధారపడుతాయి.

అదే సమయంలో, ప్రస్తుత యుగంలో యే నిర్దిష్ట సామాజిక క్రమం అయినా ప్రగతిశీలమా కాదా అని నిర్ణయించడానికి, దానిని ప్రధాన చారిత్రక అభివృద్ధి పంథాయొక్క, పెట్టుబడిదారీ వ్యవస్థనుండి సోషలిజంకు జరిగే పరివర్తనయొక్క, సందర్భంలో పరిగణించాలి.

ప్రగతియొక్క రకం సామాజిక ప్రగతిని గురించిన మార్క్సిస్టు సిద్ధాంతానికి మౌలిక ప్రాముఖ్యం గలది.

ప్రతి నిర్మాణరూపమూ తన పద్ధతిలో (ఫ్యూడలిజం లాగ, లేదా పెట్టుబడిదారీ వ్యవస్థ లాగ) ప్రగతిశీలంగా వున్నప్పటికీ, ఒకే విధమైన లక్షణాలు గల పలు సామాజిక నిర్మాణ రూపాలు చారిత్రక ప్రగతికి చెందిన విశిష్టతలు కలిగి వుండవచ్చు. ఆవిధంగా, సమాజం పాలక, పీడిత వర్గాలుగా విభజితమైన అన్ని నిర్మాణరూపాలకూ ప్రగతియొక్క శత్రుత్వపూరిత స్వభావం సామాన్య లక్షణంగా వుంటుంది.

మార్క్స్, ఎంగెల్స్ తమ రచనలలో శత్రుత్వపూరిత ప్రగతిని ప్రగాఢంగా పరిశీలించినారు. ఉత్పత్తి అభివృద్ధిలోని నిర్దిష్ట దశలకు శత్రుత్వపూరిత ప్రగతి రూపాలు చారిత్రకంగా అనివార్యమని వాళ్లు నిరూపించినారు. మార్క్స్ యిలా రాసినాడు: "వైరుధ్యం లేకపోతే, ప్రగతి లేదు. మన కాలంవరకు నాగరికత అనుసరించిన నియమం యిది."*

సమాజమూ, శాస్త్రవిజ్ఞానమూ, సంస్కృతీ, సామాజిక సంపదా శ్రామిక ప్రజల ఖర్చుతో, వాళ్ల పీడనద్వారా, దోపిడీద్వారా, నైతిక పతనంద్వారా పెరుగుతాయి గనుక, మార్క్స్ ప్రగతిని తనచేత చచ్చినవాని పుర్రెతో మాత్రమే తేనె తాగే ఆదిమ దేవుని లాంటిదని అన్నాడు. ఆదిమ సమష్టి సమాజం విచ్ఛిన్నమయ్యే కాలంలో సమాజంయొక్క తదనంతర అభివృద్ధిమీద ప్రచండమైన ప్రభావం నెరపిన సంస్కృతియొక్క పురోగతిని సాధ్యం చేసింది బానిసత్వమే అని చరిత్ర తెలుపుతుంది. బానిసత్వపు పతనం బానిస సమాజపు పతనానికీ,

---

* K. Marx, *The Poverty of Philosophy* ("తాత్వశాస్త్ర దారిద్ర్యం"), పుట 61.

దాని స్థానంలో ఫ్యూడలిజం రాకకూ సంకేతమైంది; అది కూడా ప్రగతే. యెందుకంటే, ఉత్పత్తి అభివృద్ధికి అది విస్తారమైన అవకాశాలను సృష్టించింది.

ఫ్యూడల్ సమాజం కూడా ప్రత్యక్ష ఉత్పాదకునిమీద — ఫ్యూడల్ దాసునిమీద — జరిగిన అత్యంత కిరాతకమైన దోపిడీద్వారా బతికింది. ఆ దోపిడీ అప్పుడప్పుడు అత్యంత భీషణమైన వ్యక్తిగత దాస్య రూపాలు ధరించింది. ఆర్థిక పీడనతో పాటు రాజకీయ, ఆత్మిక పీడన కూడా సాగింది. రాజకీయ, ఆత్మిక రంగంలో చలనశీలతా, మలచుకోవడమూ కాక, జడత్వమూ, సమస్తమైన మార్పుకూ ప్రతిఘటనా ఫ్యూడలిజంయొక్క గుణాలు. ప్రతిదీ కచ్చితమైన యేకరూపతచేత పాలింపబడింది: ఉత్పత్తికి ఒకే నిబంధనలు, ఒకే రాజు, ఒకే మతం, ఒకే దేవతా విగ్రహాల సముచ్చం. ఆ వ్యవస్థలో మనిషి స్థానం కూడా, అతను ఫలానా అంతస్తుకు, కులానికి, కుటుంబానికి చెందినవాడనే విషయంచేత నిశ్చితమైపోయింది. కానీ, ఫ్యూడలిజం ప్రగతికీ, తిరోగతికీ, రెంటికీ వ్యతిరేకంగా అడ్డంకులు నెలకొల్పింది. బానిస యజమాన దశలో మొత్తం జాతులూ, అద్వితీయమైన సంస్కృతులూ ధ్వంసం కాగా, ఫ్యూడలిజంలో వర్గ సమాజం స్థిరపరచబడి, దృఢంగా ప్రతిష్ఠింపబడింది. కొన్ని దేశాలలో యీ స్థితికి కరుడుగట్టే ధోరణి వుంటుంది.

యూరపియన్ దేశాలలోని సరుకు-డబ్బు సంబంధాల అభివృద్ధి ఫ్యూడలిజంయొక్క కరుడుగట్టిన ఆర్థిక రూపాలలోకి చలనశీల అంశాన్ని ప్రవేశపెట్టింది. యీ ఆర్థిక ప్రక్రియలు కొత్త సామాజిక శక్తులనూ, ఉద్యమాలనూ ఉత్పత్తిచేసి శాస్త్రవిజ్ఞానం, తత్వశాస్త్రం, కళలు, వీటి అభివృద్ధికి వూపు యిచ్చినాయి. యీ శక్తులు ఫ్యూడల్ వ్యవస్థయొక్క సామాజిక, ఆత్మిక చట్రంగుండా పగల చీల్చుకొని దారి చేసుకున్నాయి.

ఫ్యూడలిజం యీ శక్తులను ప్రతిష్ఠింపబడిన చట్రం లోపల నిలిపివుంచే ఉద్దేశంతో కొంత కాలం పాటు చర్చియొక్క, రాజ్యంయొక్క సాయంతో వీటిని నలిపివేయడానికీ, అణచివేయడానికీ ప్రయత్నించింది; కానీ అంతిమంగా వాటిని ప్రతిఘటించడానికి దానికి శక్తి లేకపోయింది.

పెట్టుబడిదారీ వ్యవస్థ అనే కొత్త సామాజిక నిర్మాణరూపం ఫ్యూడలిజం తరువాత వచ్చింది. పెట్టుబడిదారీ వ్యవస్థ దోపిడీ సంబంధాలను మరింత అభివృద్ధి చేసి, తీవ్రపరచింది, కానీ అది ఫ్యూడలిజంకు అనేక విధాల విరుద్ధంగా వుండింది. ప్రధానమైన విషయం యేమిటంటే, పెట్టుబడిదారీ వ్యవస్థ యంత్రోత్పత్తి అనే విప్లవాత్మక సాంకేతిక ప్రాతిపదిక మీద ఆధారపడి, శాస్త్ర, సాంకేతిక ప్రగతికీ, ఆధునిక పారిశ్రామిక ఉత్పత్తి అభివృద్ధికీ, నూతన సాంకేతిక ప్రాతిపదికమీద మొత్తం జాతీయ ఆర్థిక వ్యవస్థయొక్క పునర్నిర్మాణానికీ విస్తృతమైన అవకాశాలను సృష్టించింది.

డబ్బు కొరకు తన శ్రమశక్తిని అమ్ముకొనే కార్మికుడు పెట్టుబడిదారునికి అవసరం. తదనుగుణంగా అతను కార్మికునినుండి శ్రమ సాధనాలనూ, శ్రమయొక్క ఉత్పాదితాన్నీ వేరుచేసి, కార్మికుడు తన శ్రమశక్తిని అమ్ముకొనేటట్లు నిర్బంధిస్తాడు. కార్మికునికి శ్రమ ప్రక్రియ తన జీవనాధారాన్ని సంపాయించుకొనే సాధనంగా మాత్రమే కనపడింది, పెట్టుబడిదారునికి అది లాభం సంపాయించుకొనే సాధనంగా మాత్రమే వుంది. యీ పరిస్థితులలో, ఉత్పత్తి అనేది మానవుని అభివృద్ధికి సాధనంగా పనిచేయదు. తద్వ్యతిరేకంగా, మానవుడే ఉత్పత్తి అభివృద్ధికి సాధనంగా పనిచేస్తాడు.

కనుక, వర్గ, శత్రుత్వపూరిత వ్యవస్థ లన్నిటిలోనూ శ్రామికుడు యెల్లప్పుడూ దాస్యంలో వుండినాడు: సూటిగా మరొకరి బానిసగా గానీ, అర్ధ బానిసగా—ఫ్యూడల్ దాసుడుగా, దేవునికీ, మతానికీ, దురభిప్రాయాలకూ, అపోహలకూ బానిసగా—గానీ, లేక, పెట్టుబడిదారీ వ్యవస్థలో, పెట్టుబడికి బానిసగా, యంత్రానికి తోకగా, వస్తువుల బానిసగా గానీ, వుండినాడు. చరిత్ర అంతటా దేశాల మధ్యా, జాతుల మధ్యా సంబంధాలు క్రమక్రమంగా విస్తరించినాయి. కానీ, ప్రతిష్ఠింపబడిన సంబంధాలు కొన్ని దశలలో ధ్వంసం కావడమూ, మొదలైన కారణాలవల్ల, ఆ క్రమం సమంగా లేదు. యీ విషయంలో పెట్టుబడిదారీ వ్యవస్థ నిర్ణయాత్మకమైన ముందడుగు వేసింది. పెట్టుబడిదారీ అభివృద్ధి అనే ప్రధాన ప్రవాహంలో అన్ని జాతులనూ లీనం చేయడంద్వారా అది వాటి పాత యేకాకితనాన్ని అంతిమంగా తుదముట్టించింది. వలసకరణా, కొత్త భూభాగాలను వశపరచుకోవడమూ, శ్రమ విభజనా, వర్తకమూ, ఏకీకృత ప్రపంచ మార్కెట్టునూ, వివిధ ఆర్థిక సంబంధాలనూ స్థాపించడమూ, రైల్వే, జల, వాయు రవాణాల ఆధునిక సాధనాల అభివృద్ధీ, పత్రికల, రేడియో, టెలివిజన్ల అభివృద్ధీ—యీ రాజకీయ, ఆర్థిక, సాంకేతిక సాధనాలన్నీ వివిధ జాతుల మధ్యా, ప్రపంచంలోని వివిధ ప్రాంతాల మధ్యా వివిధ సంబంధాలను నెలకొల్పడానికి తోడ్పడినాయి. యిదంతా, దాని వంతుకు, సాంస్కృతిక, శాస్త్ర, ఆత్మిక ఉత్పత్తి రంగంలో పరస్పర ప్రభావాలను పెంచడానికి తోడ్పడింది. కానీ, యీ క్రమం కూడా స్వభావతః అంతర్వైరుధ్య పూరితంగా వుండింది; యెందుకంటే, యిది ఒక జాతి మరొక జాతిమీద సాగించే దోపిడీ, పీడనలతోనూ, రాజ్యాల మధ్య వైరుధ్యాల, ఘర్షణల పెరుగుదలతోనూ కలిసి జరిగింది. పీడిత జాతుల దోపిడీ పురోగామి దేశాల బూర్జువావర్గంయొక్క ఐశ్వర్య సంపాదనకు ఒక ప్రధాన మూలంగా వుండింది.

కొన్ని దేశాలను వెనుకబాటుతనంలో వుంచడం పెట్టుబడిదార్లకు లాభదాయకం, అవి చౌక శ్రమశక్తిని సమకూరుస్తాయి. అందువల్లనే, యీ నాడు కూడా, వివిధ జాతులలో ఆదిమ దశ మొదలుకొని, ఫ్యూడల్ దశదాకా గల సకల పెట్టుబడిదారీ పూర్వ సామాజిక

నిర్మాణరూపాలయొక్క ఆధునికపరచబడి, వికృతపరచబడిన వ్యక్తీకరణలు కనపడుతాయి.

సామాజిక ప్రగతియొక్క శత్రుత్వపూరిత స్వభావం సామాజిక అభివృద్ధి మహా అసమంగానూ, వంకరటింకరగానూ జరగడంలో కూడా వ్యక్తమౌతుంది. ప్రగతి యెప్పుడూ నూటి ఆరోహణ పథంలో జరగలేదని చరిత్ర తెలుపుతుంది. అది యెల్లప్పుడూ వంకర దారులలో, తిరోగమనమూ, వెనుకటి స్థితికి పోవడమూ, నిస్తబ్దతా గల దశలతో జరుగుతుంది. మానవజాతికి ఒక చోట లాభాలు కలిగితే, మరొక చోట నష్టాలు కలిగినాయి. సామాజిక అధిరోహణా, విప్లవాలూ జరిగిన తర్వాత ప్రతికూల దశలు వచ్చినాయి. మానవజాతియొక్క కొత్త విజయాలు కొత్త సమస్యలనూ, కొత్త ప్రమాదాలనూ ఉత్పన్నం చేసినాయి. యేదైనా ఒక రంగంలో జరిగిన ప్రగతే ప్రగతి వ్యతిరేక ధోరణులనూ, ఆశయాలనూ సృష్టించింది. అప్పుడప్పుడు, సామాజిక అభివృద్ధిలోని యీ కష్టాలూ, అంతర్వైరుధ్యాలూ మనుషులలో నిరాశా భావాలనూ, మేలైన భవిష్యత్తును సాధించే అవకాశంలో విశ్వాస రాహిత్యాన్నీ ఉత్పన్నం చేసినాయి. తద్వ్యతిరేకంగా, పైకి వస్తున్న కొత్త వర్గపు ప్రపంచ దృక్పథమైన మార్క్సిజం లెనినిజం చారిత్రక ఆశావాదాన్నీ, భవిష్యత్తు శ్రామిక ప్రజలదనే విశ్వాసాన్నీ వ్యక్తం చేస్తుంది. కానీ, యీ ఆశావాదం సామాజిక ప్రగతిలోని సకల కష్టాలనూ, అంతర్వైరుధ్యాలనూ యే మాత్రమూ ఉపేక్షించదు; దీనికీ, ఆదిమ, అనాలోచిత ఆశావాదానికీ యేమీ సామ్యం లేదు.

పెట్టుబడిదారీ వ్యవస్థ చరిత్రయొక్క చివరి శత్రుత్వపూరిత సామాజిక నిర్మాణ రూపమని కార్ల్ మార్క్స్ రుజువు చేసినాడు. తదనంతర అభివృద్ధి దీనిని ధ్రువపరచింది.

యీ నాడు పెట్టుబడిదారీ వ్యవస్థ తీవ్ర ఆర్థిక, సామాజిక, నైతిక సంక్షోభంలో చిక్కుకుంది. మానవ సమాజపు చరిత్రలో ఒక మలుపు అయిన యీ నాడు పెట్టుబడిదారీ వ్యవస్థను నిలిపివుంచడం సామాజిక ప్రగతికి అన్నిటికంటె గొప్ప ఆటంకం.

కమ్యూనిస్టు ప్రగతి మార్గంలో మాత్రమే మానవజాతి తన పురోగమనాన్ని కొన సాగించగలదు.

పెట్టుబడిదారీ వ్యవస్థనుండి కమ్యూనిజంకు జరిగే పరివర్తన అదే సమయంలో ఒక కొత్త రకం సామాజిక ప్రగతియొక్క ఆవిర్భావం, శత్రుత్వపూరిత ప్రగతి రూపాలనుండి శత్రుత్వరహిత ప్రగతి రూపాలకు జరిగే పరివర్తన.

కమ్యూనిస్టు వ్యవస్థలో ప్రగతియొక్క ప్రధాన లక్షణాలు యేవంటే, ఉత్పత్తి సాధనాలలో సామాజిక ఆస్తిని నెలకొల్పడంద్వారా దోపిడీని తొలగించడంద్వారా సామాజిక అంతర్వైరుధ్యాలను తొలగించడమూ, సామాజిక అభివృద్ధి నియమాలను కరతలామలకం చేసుకోవ

డమూ, సామాజిక సంబంధాలను సర్దుబాటు చేయడానికి వాటిని చైతన్యవంతంగా, సమతూకంగా వినియోగించడమూ; ఆర్థిక మేనేజిమెంటుకు చెందిన కేంద్రీకృత ప్రజాతంత్ర వ్యవస్థద్వారానూ, సోషలిస్టు ప్రజాస్వామ్యపు సర్వతోముఖ అభివృద్ధిద్వారానూ అంతకంతకూ యెక్కువమంది శ్రామిక ప్రజలను చరిత్రయొక్క చైతన్యపూరిత కార్యకలాపాలలో భాగస్వాములను చేయడమూ; ఉత్పత్తిని మానవుని ప్రయోజనాలకూ, అవసరాలకూ లోబరచడమూ; పాదార్థిక, ఆత్మిక ఉత్పత్తినీ, మొత్తం సామాజిక సంబంధాల వ్యవస్థనూ మానవుని సర్వతోముఖ, సామరస్యపూర్వక అభివృద్ధి కొరకు వినియోగించడమూ; భ్రమాత్మక చైతన్య రూపాలనుండి విమోచనా.

యెక్కువగా స్వయంచలితమైన ఉత్పత్తి అనే పాదార్థిక, సాంకేతిక ప్రాతిపదికమీద కమ్యూనిస్టు వ్యవస్థ అభివృద్ధీ, కమ్యూనిస్టు సామాజిక సంబంధాల వికాసమూ జరిగినప్పుడు మాత్రమే ప్రతివొక్కరి స్వేచ్ఛాభివృద్ధి అందరి స్వేచ్ఛాభివృద్ధికి షరతుగా వున్న* వ్యవస్థ సాధ్యమౌతుంది. అప్పుడు సమాజంలోని ఒక భాగంయొక్క అభివృద్ధి మరొక భాగంయొక్క నష్టంతో జరగదు. మానవుడు తానే ఒక పరమ లక్ష్యం అవుతాడు; మానవుని సొంత అభివృద్ధి స్థాయి సాధింపబడిన సామాజిక ప్రగతి స్థాయికి సూటి కొలమానం అవుతుంది.

కమ్యూనిస్టు నిర్మాణరూపానికి పరివర్తన అంటే, గుడ్డి ఆవశ్యకతా ప్రపంచంనుండి స్వేచ్ఛా ప్రపంచంలోకి లంఘనం; యిది మానవాళి పూర్వచరిత్రయొక్క అంతాన్నీ, వాళ్ల నిజమైన చరిత్రయొక్క ప్రారంభాన్నీ సంకేతిస్తుంది.

సహజంగానే, కొత్త రకం సామాజిక ప్రగతి ఒక్క సారిగా జరగదు, క్రమక్రమంగా జరుగుతుంది. కానీ, ముఖ్యమైన విషయం యేమిటంటే, శత్రుత్వపూరిత సమాజం యే సామాజిక సమస్యను పరిష్కరించడానికి అశక్తమైనందున దాని దగ్గర ఆగిపోవలసివస్తుందో ఆ సామాజిక సమస్యను పరిష్కరించడానికి మానవులు సోషలిస్టు విప్లవం జరిగిన వెంటనే పూనుకుంటారు. ఆ సమస్య యేమిటంటే, మానవుడు తన సామాజిక సంబంధాలను తానే పాలించడం అనే అర్థంలో సమాజపు స్వేచ్ఛను నెలకొల్పడం. అనుభవం తెలిపే దేమంటే: యిది మహా క్లిష్టమైన కర్తవ్యం, దీని సంపూర్ణ పరిష్కారానికి, ఒకటి, ఉత్పాదక శక్తులూ, శాస్త్రవిజ్ఞానమూ, సంస్కృతీ, సోషలిస్టు చైతన్యమూ అనేవాటి అభివృద్ధిలో ఉన్నత స్థాయీ, రెండు, తగిన ఆర్థిక, సామాజిక యంత్రాంగాల స్థాపనా అవసరం.

సోషలిస్టు సమాజంలో చారిత్రక క్రమంయొక్క సద్యోజనిత స్వభావం అధిగమింపబడుతోంది; అంతే కాక, సామాజిక అభివృద్ధి నియమాల ప్రజ్ఞానమూ, చైతన్యపూరిత వినియోగమూ ఆవశ్యకత అవుతాయి. గతంలో యెప్పుడూ మానవుల సామాజిక చారిత్రక కార్య

---

* K. Marx and F. Engels, *Selected Works*, Vol. I, p. 127.

కలాపాలు వస్తుగత సామాజిక నియమాల జ్ఞానంమీద ప్రత్యక్షంగా ఆధారపడలేదు. వాస్తవం యేమిటంటే, సోషలిజంయొక్క నిర్మాణమూ, కమ్యూనిజంకు సమాజంయొక్క యితోధిక పురోగతీ, శాస్త్రీయ మార్క్సిస్టు లెనినిస్టు సిద్ధాంతమూ, వేటిలో సిద్ధాంత సూత్రాలు సామూహిక ఆచరణ కొరకు నిర్దిష్ట పథకంగా ప్రకటింపబడినాయో ఆ కమ్యూనిస్టు, కార్మిక పార్టీల శాస్త్రీయంగా రూపొందించబడిన కార్యక్రమాలూ అనే ప్రాతిపదికమీద జరుగుతాయి. కమ్యూనిస్టు నిర్మాణరూపంలో సామాజిక అభివృద్ధియొక్క వస్తుగత నియమాలు పరాయి శక్తిగా మానవులమీద పెత్తనం చేయడం ఆగిపోయి, అవి మానవుని చైతన్య పూరితమైన అజమాయిషీ కిందికి వస్తాయి.

సోషలిజంలో, మానవులు యిష్టారాజ్యంగా చరిత్ర గతిని నడిపించగలరనే అర్థంలో కాక, మానవులు చరిత్ర నియమాలను గ్రహించి వాటికి అనుగుణంగా ఆచరించగలరనే అర్థంలో, సమాజ అభివృద్ధి చైతన్యపూరిత స్వభావాన్ని సంతరించుకుంటుంది. అందువల్లనే, సోషలిజంలో కర్తవ్యం యేమిటంటే, సమాజంలోని ప్రతి సభ్యుని చైతన్యాన్నీ పెంచడమూ, సమస్త సమాజపు ప్రయోజనాలనూ అర్థం చేసుకొనే స్థితికీ, సమాజ అభివృద్ధి నియమాలను అర్థం చేసుకొనే స్థితికీ దానిని వృద్ధిచేయడమూ. సోషలిజం అభివృద్ధి చెందేకొద్దీ, అంతకంతకూ విస్తారమైన జనాలు చరిత్రను చైతన్యవంతంగా నిర్మించడంలో పాల్గొంటారు. సామాజిక అభివృద్ధి వేగాన్ని పెంచడానికి యిది ప్రచండంగా తోడ్పడుతుంది.

యింతవరకు చెప్పినదానిలో దేన్నిబట్టీ సోషలిజంలో సద్యోజనిత అంశాలు బొత్తిగా వుండవనీ, మనుషులు తమ చర్యల ఫలితాలను ముందే పూర్తిగా తెలుసుకోగలరనీ అనుకోకూడదు. వాస్తవం యేమిటంటే, ప్రజ్ఞానపు ప్రక్రియ అంతం లేనిది, నిర్దిష్ట పరిస్థితులలో వస్తుగత నియమాల అవసరాల నన్నిటినీ లెక్కలోకి తీసుకోవడం చాలా క్లిష్టమైన పని, ఆచరణలో అసాధ్యం; కనుక, వివిధ నియమాలు సద్యోజనితంగా వ్యక్తమయ్యే అవకాశం యెల్లప్పుడూ వుంటుంది. అంతే కాక, సద్యోజనిత అంశాలను నియంత్రించడానికి సమాజానికి జ్ఞాన మొక్కటే చాలదు, భౌతిక సాధనాల అవసరం కూడా వుంది. మొత్తంమీద, సోషలిజం అభివృద్ధి చెందే కొద్దీ, సమాజం మానవుల చర్యల ఫలితాలను ముందే తెలుసుకోడానికీ, మానవుల పరస్పర సంబంధాలనూ, ప్రకృతితో సంబంధాలనూ చైతన్యవంతంగా అజమాయిషీ చేయడానికీ అంతకంతకూ యెక్కువ సమర్థవంతమౌతుంది. కమ్యూనిజం నిర్మాణం చైతన్యవంతమైన క్రమం, కోట్లమంది మానవుల చైతన్యవంతమైన ప్రయత్నాల ఫలితం. ఉత్పత్తియొక్కా, మొత్తం సామాజిక జీవితంయొక్కా అత్యున్నతమైన, అత్యంత హేతుబద్ధమైన వ్యవస్థీకరణ రూపంగా కమ్యూనిస్టు సామాజిక వ్యవస్థయొక్క ఆవిర్భావంలోనూ, అభివృద్ధిలోనూ గల గుణాత్మకంగా నూతనమైన లక్షణాలలో యిది ఒకటి.

కనుక, పెట్టుబడిదారీ వ్యవస్థనుండి సోషలిజంకు జరిగే పరివర్తనతో, ఉత్పత్తియొక్క పథకీకృత వ్యవస్థీకరణకు సంబంధించిన చైతన్యపూరిత కార్యకలాపాల పరిధిలోనూ, మొత్తం సమాజ ప్రమాణంలో మానవుల చర్యల సామాజిక ఫలితాలను ముందే ఊహించడానికి గల అవకాశాలలోనూ అపారమైన విస్తరణ జరుగుతుంది. మానవుల ఆచరణాత్మక కార్యకలాపాలు కొత్త దశకు అధిరోహిస్తాయి. గతంలో, అవి ప్రకృతి వస్తువులను ప్రయోజనాపేక్షతో మార్చడమూ, సద్యోజనితంగా మారే సామాజిక జీవితపు భౌతిక పరిస్థితులకు అనుగుణంగా చైతన్యవంతంగా మలచుకోవడమూ, విప్లవ కాలాలలో పాత వ్యవస్థనూ, కాలం చెల్లిన సంబంధాలనూ ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేయడమూ మాత్రమే అయి వుండేవి. కానీ, సోషలిస్టు విప్లవం గెలిచినప్పుడు, మనుషులు నూతన సామాజిక సంబంధాల చైతన్యపూర్వక నిర్మాణానికి పురోగమిస్తారు.

కమ్యూనిస్టు నిర్మాణరూప అభివృద్ధిలోని సోషలిస్టు దశలో, మొత్తం సమాజ ప్రమాణంలో జోస్యం చెప్పడమూ, పథకీకరించడమూ, ఒకరితో ఒకరు పోటీపడడమూ, శాస్త్రీయమైన మార్గదర్శకత్వమూ, శాస్త్రీయమైన మేనేజిమెంటూ, వగైరా విలక్షణమైన రూపాలూ — ఆర్థిక, సామాజిక క్రమాల వ్యవస్థీకరణకూ, మేనేజిమెంటుకూ చెందిన రూపాలు — ఉద్భవిస్తాయి, విస్తృతంగా ఉపయోగింపబడుతాయి. కానీ, సోషలిస్టు సమాజం పెట్టుబడిదారీ వ్యవస్థనుండి ఉద్భవిస్తుంది గనుక, దానికి పాత ఆర్థిక, సామాజిక యంత్రాంగాలు సంక్రమిస్తాయి. అది వాటిని కొత్త సారంతో నింపి, తన సొంత అభివృద్ధి ప్రయోజనాల కొరకు వినియోగించుకొంటుంది. సోషలిస్టు సమాజం సరుకుల ఉత్పత్తినీ, విలువ నియమాన్నీ, డబ్బునూ, వ్యక్తిగత పాదార్థిక ప్రోత్సాహాలనూ సోషలిస్టు ఆర్థిక వ్యవస్థయొక్క అవసరమైన అంశాలుగా వినియోగించుకొంటుంది. సోషలిజంలో మనిషి వ్యక్తిగత పాదార్థిక ప్రోత్సాహాల ద్వారా సామాజిక ఉత్పత్తిలో పాల్గొనడం పాత రకం చారిత్రక అభివృద్ధియొక్క అవశేషం; కానీ, సోషలిజంలో అది నూతన సామాజిక సారంతో నింపబడుతుంది. భవిష్యత్తులో విలువ నియమమూ, దానివెంట వుండే విషయాలూ రాలిపోతాయి; కాగా, ఆర్థికాభివృద్ధి కమ్యూనిస్టు వ్యవస్థయొక్క విశిష్ట నియమాలకు మాత్రమే లోబడుతుంది.

సోషలిజంలో సామాజిక నియమాలను కరతలామలకం చేసుకోవడమూ, సమాజంయొక్క మేనేజిమెంటూ యెలా జరుగుతాయంటే వర్గ సమాజంలో ఉత్పన్నమైన సామాజిక వ్యవస్థీకరణ రూపాలైన రాజ్యంయొక్క, న్యాయశాస్త్ర వ్యవస్థయొక్క సాయంతో జరుగుతాయి. మరి, సోషలిస్టు రాజ్యం సోషలిస్టు విప్లవంలో పాత రాజ్య యంత్రంయొక్క శిథిలాలమీద ఉద్భవించిన కొత్త రకం రాజ్యం, శ్రామిక ప్రజల రాజ్యం.

తన అభివృద్ధి గతిలో సోషలిస్టు సమాజం చారిత్రక ప్రగతికి చెందిన పాత యంత్రాంగం

యొక్క యీ అంశాలను కొత్త పద్ధతిలో వినియోగించుకుంటూ, భవిష్యత్తులో అవి కృశించిపోవడానికి కావలసిన పూర్వావసరాలను సిద్ధం చేస్తుంది. సోషలిస్టు సమాజానికి గతంనుండి సంక్రమించిన యంత్రాంగాల చట్రం లోపల, వాటి సాయంతో అది కమ్యూనిస్టు వ్యవస్థకు విశిష్టమైన కొత్త యంత్రాంగాలను నిర్మిస్తుంది. ఆవిధంగా, సోషలిస్టు రాజ్యపు చట్రం లోపల, దాని సాయంతో, కమ్యూనిస్టు సామాజిక స్వపరిపాలనకు చెందిన అంశాలు పరిపక్వ మౌతాయి.

చారిత్రక ప్రగతియొక్క శత్రుత్వపూరిత దశలో ఉత్పన్నమైన చారిత్రకాభివృద్ధి యంత్రాంగాల వినియోగమూ, వాటి చట్రం లోపల కమ్యూనిస్టు వ్యవస్థకు విలక్షణమైన, మౌలికంగా కొత్తదైన చారిత్రక ప్రగతి యంత్రాంగాన్ని క్రమక్రమంగా సృష్టించడమూ, గతంనుండి సంక్రమించిన అంశాలు కృశించిపోవడమూ కమ్యూనిస్టు ప్రగతిలోని సోషలిస్టు దశయొక్క విశిష్ట లక్షణాలు. యీ క్రమం అంతర్వైరుధ్య పూరితమైనది, కానీ ఆ అంత ర్వైరుధ్యాలు శత్రుత్వపూరితమైనవి కావు. కమ్యూనిజంయొక్క పాదార్థిక, సాంకేతిక ప్రాతిపదిక సృష్టింపబడడంద్వారామూ, కమ్యూనిస్టు సామాజిక సంబంధాలూ, సోషలిస్టు ప్రజాస్వామ్యమూ అభివృద్ధి చెందడంద్వారానూ, కమ్యూనిజంయొక్క ఉన్నత దశకు జరిగే పరివర్తనలో మేనేజిమెంటుకూ, వ్యవస్థీకరణకూ చెందిన రూపాలు మెరుగుపడడంద్వారానూ ఆ అంతర్వైరుధ్యాలు పరిష్కరింపబడుతాయి.

యీ సామాజిక కర్తవ్యంయొక్క పరిపూర్తి కమ్యూనిస్టు ప్రగతిలోని మరొక కీలక మైన సమస్యతో గట్టిగా ముడిపడివుంది. అదేమిటంటే, ఆర్థిక, శాస్త్ర, సాంస్కృతిక విజయాల నన్నిటినీ మానవుని సుసమన్వితమైన అభివృద్ధి కొరకూ, వ్యక్తి స్వేచ్ఛయొక్క అభివృద్ధి కొరకూ వినియోగించడం. యీ పరిస్థితులలో, మానవుడు — ప్రతి శ్రామికుడూ, సమాజంలోని ప్రతి సభ్యుడూ — సాధించిన అభివృద్ధి స్థాయి నూతన సమాజంలోని సామాజిక ప్రగతి స్థాయికి వ్యక్తీకరణా, సూచికా అవుతుంది. యిది ఉదాత్తమైన మానవతావాదపు కర్తవ్యం; దీని పరిపూర్తి కమ్యూనిస్టు ప్రగతియొక్క అత్యున్నత లక్ష్యం. కమ్యూనిజం మహా అభివృద్ధి చెందిన సాంకేతిక ప్రాతిపదికమీద ఆధారపడే హేతుబద్ధ సామాజిక వ్యవస్థ, ప్రకృతి శక్తులమీద యితోధిక విజయం కొరకూ, మానవుని సామాజిక సంబంధాలమీద అతని సొంత అజమాయిషీని నెలకొల్పడం కొరకూ, మొత్తం సామాజిక వ్యవస్థనూ, సమస్త పాదార్థిక, ఆత్మిక సంస్కృతినీ మానవుని అభివృద్ధి వైపుకు, వ్యక్తిత్వపు సుసమన్విత అభివృద్ధి వైపుకు మళ్లించడం కొరకూ మానవులను సంఘీభావపు బంధాలతో సమైక్యం చేసే వ్యవస్థ. కమ్యూనిజమంటే చరిత్రయొక్క రహస్యాల ఆవిష్కరణ, సామాజిక ప్రగతి

యొక్క పరాకాష్ఠ; అది ప్రపంచ వ్యాప్తమైన చారిత్రక ఘటన. మానవాళిని ఆవరించిన విషాదకర సంధిగ్ధాలనుండి బయటపడే మార్గాన్ని కమ్యూనిజం మాత్రమే చూపుతుంది. అందువల్లనే, యిప్పుడో అప్పుడో అన్ని జాతులూ కమ్యూనిజంకు పురోగమించక తప్పదు.

నిస్సందేహంగా కమ్యూనిస్టు వ్యవస్థ ప్రపంచ వ్యాప్తంగా వుంటుంది, అన్ని జాతులూ చివరకు ఒకే స్థాయికి యెదుగుతాయి, అప్పుడు మానవాళికంతటికీ ఒకే చరిత్ర ఏర్పడుతుంది.

యిది సామాజిక అభివృద్ధి అవకాశాలకు చెందిన సమస్యపట్ల మార్క్సిస్టు వైఖరి, ఆ సమస్యకు మార్క్సిజం యిచ్చే సమాధానం.

ప్రపంచం రెండు పరస్పర వ్యతిరేకమైన సామాజిక వ్యవస్థలుగా చీలిన యీ నాడు, భవిష్యత్తుకు చెందిన సమస్యను గురించి, ప్రతి వ్యవస్థా మానవాళికి యిచ్చే అవకాశాలను గురించి తీవ్రమైన భావజాల పోరాటం జరుగుతున్నది. బూర్జువా సిద్ధాంతకారులు, సామాజిక ప్రగతి భావంపట్ల వాళ్ల వైఖరి యేమైనప్పటికీ, యీ సమస్యను దాటవేయలేరు. వాళ్లు సమర్థించే సామాజిక వ్యవస్థ కలిగించే అవకాశాలను గురించి యేదో ఒక విధంగా నచ్చ చెప్ప చూస్తారు, ఆ వ్యవస్థ ప్రయోజనాలకోసం అలా చేయాలి. అందువల్లనే మనకు బూర్జువా రచనలలో ప్రగతి భావానికి వ్యతిరేకమైన వాదాలు మాత్రమే కాక, అణు యుద్ధంయొక్క, దాని దుర్వారమైన పర్యవసానాలయొక్క ప్రమాదం యెదుట నిస్పృహ భావాలు మాత్రమే కాక, వచ్చే కొద్ది దశాబ్దాలను గురించి మాత్రమే అయినా భవిష్యత్తుమ జోస్యం చెప్పడానికీ, సామాజిక అభివృద్ధి ధోరణుల "సిద్ధాంత" పరిశీలన సమకూర్చడానికీ ప్రయత్నాలు కూడా కనపడుతాయి. యీ సామాజిక అవసరాలు "పారిశ్రామిక సమాజం" అనే భావాన్నీ, దాని వివిధ రూపాంతరాలనూ ఉత్పన్నం చేసినాయి.

యీ భావంయొక్క కర్తలు ఉత్పాదక శక్తుల అభివృద్ధి సామాజిక అభివృద్ధికి ప్రాతిపదిక అనే మార్క్సిస్టు సూత్రాన్ని అరువు తెచ్చుకొని, తమ ప్రారంభ సూత్రంగా చేసుకొన్నారు. కానీ, దానికి వాళ్లు తమ సొంత వికృతార్థం కల్పించినారు. వాళ్లు ఉత్పత్తి అభివృద్ధి స్థాయి భిన్న సమాజాలను పోల్చడానికి ప్రాతిపదికగా ఉపకరిస్తుందంటారు, కానీ ఉత్పాదక శక్తులకూ, ఉత్పత్తి సంబంధాలకూ మధ్య గల నియమబద్ధమైన సంబంధాన్ని నిరాకరించి, సామాజిక నిర్మాణం నూటిగా సాంకేతిక అభివృద్ధినిబట్టే యేర్పడుతుందంటారు. అన్ని దేశాలనూ వాటివాటి ఉత్పత్తి అభివృద్ధి స్థాయినిబట్టి బృందాలుగా వర్గీకరించవచ్చునని యిది సూచిస్తుంది. ఆధునిక పరిశ్రమలు లేని దేశాలకు "సాంప్రదాయిక సమాజం" అనీ, అభివృద్ధి చెందిన పరిశ్రమలు గల దేశాలకు "పారిశ్రామిక సమాజం" అనీ పేరు పెట్టబడింది. వీటి మధ్య నిశ్చితమైన పరివర్తన రూపాలు నెలకొల్పబడినాయి. తదనుగుణంగా, "పారిశ్రామిక సమాజ" భావం పెట్టుబడిదారీ సమాజాన్నీ, సోషలిస్టు సమాజాన్నీ జతచేయడానికి ఉపయో

గించబడింది; ఆ సమాజాలు కేవలం ''పారిశ్రామిక సమాజం''యొక్క భిన్న రూపాలుగా పరిగణింపబడుతాయి.

''మన యుగంయొక్క మౌలిక భావం'' అని రేమండ్ ఆర్గన్ చెప్పే ''పారిశ్రామిక సమాజ'' భావం నిజానికి మన యుగంయొక్క మౌలిక వాస్తవాన్ని – పెట్టుబడిదారీ వ్యవస్థ నుండి సోషలిజంకు జరిగే పరివర్తన మన యుగంయొక్క సారం అనే వాస్తవాన్ని – మరుగు పరచడానికి ఉద్దేశింపబడింది. మార్క్సిజంకు భిన్నంగా, బూర్జువా సిద్ధాంతకారులు పెట్టుబడిదారీ వ్యవస్థ తరువాత సోషలిజం రాదనీ, పెట్టుబడిదారీ వ్యవస్థకు యితోధిక అభివృద్ధి చెందడానికి గుప్త అవకాశాలు వున్నాయనీ రుజావుచేయడానికి ప్రయత్నిస్తారు. యేమిటి యీ అవకాశాలు?

ప్రపంచం ''ఒకే పారిశ్రామిక సమాజం'' వైపు అభివృద్ధి చెందుతున్నదనీ, దానిలో పెట్టుబడిదారీ వ్యవస్థకూ, సోషలిజంకూ మధ్య గల భేదాలు పూర్తిగా మాసిపోయి, అప్రధాన మౌతాయనీ కొందరంటారు. యితరులతో పాటు, దక్షిణపక్ష సోషల్ డెమోక్రసీకి చెందిన అనేక సిద్ధాంతవేత్తలు సిఫారస్ చేసే భావం యిది. పలు బూర్జువా సామాజిక శాస్త్రజ్ఞులు (వాళ్లలో పి. సొరోకిన్ ఒకడు) ''సంగమ'' సిద్ధాంతం ప్రతిపాదించినారు. పెట్టుబడిదారీ వ్యవస్థా, సోషలిజమూ పరస్పరం సమీపిస్తూ (యీ సమీపించడం యీ నాడే జరుగుతుంది కూడా), మునుపటి అభివృద్ధియొక్క ఫలితా లన్నిటియొక్క భావి ''సామాజిక సాంస్కృతిక సంయోగం'' వైపు సాగుతున్నాయని చెప్పే సిద్ధాంతం యిది. మరొక బృందం బూర్జువా సామాజిక శాస్త్రజ్ఞులు ''పారిశ్రామిక సమాజ''పు అభివృద్ధితో కమ్యూనిజంకు యే అవకాశమూ లేదని రుజావు చేయడానికి ప్రయత్నిస్తారు. యీ సిద్ధాంతాన్ని సిఫారస్ చేసినవాళ్లలో పచ్చి కమ్యూనిస్టు వ్యతిరేకీ, ''ఆర్థిక పెరుగుదల దశల'' సిద్ధాంత కర్తా అయిన వాల్ట్ రోస్తో వున్నాడు. అతని ''దశలు'' సామాజిక అభివృద్ధిలోని వేరువేరు మెట్లు; వాటిలో మొదటిది ''సాంప్రదాయిక సమాజం,'' చివరిది ''ఉన్నత సామూహిక అనుభోగపు'' సమాజం, అమెరికా సంయుక్త రాష్ట్రాలు యిప్పటికే అందుకున్న దశ. యీమధ్యలో, కమ్యూనిజం మూలంగా సోవియట్ యూనియన్ ఆ దశను అందుకోలేక పోయిందట, సామూహిక అనుభోగపు సమాజానికి జరిగే పరివర్తనతో కమ్యూనిజం ''మాసిపోక'' తప్పదట అలా అని బాహాటంగా ప్రకటించినాడు. కమ్యూనిజం ఉత్పత్తి అభివృద్ధిలోని తక్కువ స్థాయితోనూ, దారిద్ర్యంతోనూ, లేమిడితోనూ ముడివడిందనే భావం యే మాత్రమూ కొత్తది కాదు – మార్క్సిజంచేత యే నాడో పరాస్తం చేయబడిందే.

వాస్తవం యేమిటంటే, కమ్యూనిజం విస్తారమైన శ్రామిక జనాలకు ఉన్నత పాదార్థిక ప్రమాణాల అవకాశాన్ని కలిగించడమే కాక, అది యీ పెరుగుదలనే ఒక లక్ష్యంగా యెంచక,

వ్యక్తి మనస్సును పాదార్థిక విలువలమీద మగ్నం కాకుండా ఉద్ధరించడానికీ, అతని ఆసక్తిని సృజనాత్మక కార్యకలాపాల రంగంలోకి మళ్లించడానికీ దానిని షరతుగా, సాధనంగా యెంచు తుంది.

చివరి విషయంగా, శాస్త్ర, సాంకేతిక విప్లవంయొక్క సత్వరాభివృద్ధినీ, ఉత్పత్తిలోని వ్యవస్థీకరణా, మేనేజిమెంటూ, (ఉత్పత్తి స్వయంచలనం సందర్భంలో) యెలెక్ట్రానిక్ కంప్యూ టర్లూ లాంటి అంశాల ప్రాముఖ్యంయొక్క తీవ్రమైన పెరుగుదలనూ ఆధారం చేసుకొని కొంతమంది ''పారిశ్రామిక సమాజపు'' దశ చారిత్రకంగా పరిమితమైన దనీ, దీని తర్వాత ''పారిశ్రామికానంతర సమాజం'' వస్తుందనీ ఉద్ఘాటిస్తున్నారు. 2000వ సంవత్సరం నాటికి అమెరికా సంయుక్త రాష్ట్రాలూ, అత్యంత ధనిక దేశాల చిన్న బృందమూ చేరుకోబోయే స్థితికి డేనియల్ బెల్ ''పారిశ్రామికానంతర సమాజం'' అని పేరు పెట్టినాడు. యితర దేశాలు ''పారిశ్రామిక,'' లేదా ''పారిశ్రామిక పూర్వ'' సమాజపు దశలలో వుంటాయని అతను అంటాడు.

నిజమే, ''పారిశ్రామిక సమాజ'' భావం కేవలం నిరాధారమైనది కాదు. ఆధునిక పరిశ్రమల అభివృద్ధి పెట్టుబడిదారీ వ్యవస్థలోనూ, సోషలిజంలోనూ పట్టణీకరణా, నిత్య జీవితంలో మార్పులూ, మొదలైన పలు సామాన్య ధోరణులనూ, ప్రక్రియలనూ ఉత్ప న్నం చేయడానికి అభిముఖంగా వుంటుంది. నిజంగానే, శాస్త్ర, సాంకేతిక ప్రగతి దారిద్ర్యాన్నీ, లేమిడినీ అధిగమించడానికీ, సామాజిక సమస్యలను పరిష్కరించడానికీ విస్తారమైన అవకాశాలను కలిగిస్తుంది. కానీ, యివేవీ పెట్టుబడిదారీ వ్యవస్థా, సోషలిజమూ అనే రెండు సామాజిక వ్యవస్థలు పరస్పర వ్యతిరేకమైనవనే ప్రధాన విషయాన్ని తొలగించవు. బూర్జువా సిద్ధాంత వేత్తలు తమ భావాల సాయంతో మూసిపెట్టడానికి ప్రయత్నించేది సరిగ్గా దీనినే. పెట్టు బడిదారీ వ్యవస్థను తొలగించడానికి సోషలిజం దుర్నిరోధంగా ముందుకు సాగుతున్నదనీ, ఆధునిక సామాజిక ప్రగతియొక్క మౌలిక సమస్యలన్నిటినీ సోషలిజం మాత్రమే పరిష్కరించ గలదనీ అనే విషయాన్ని పూర్వపక్షం చేయడం వాటి ఉద్దేశం.

ప్రతి జాతీ తన భిన్న చారిత్రకాభివృద్ధి స్థాయితోనూ, తన సాంస్కృతిక, చారిత్రక సంప్రదాయాలతోనూ, తన సొంత, సాటిలేని మార్గంలో సోషలిజంకూ, కమ్యూనిజంకూ పురోగమిస్తుంది. యిది విజయాలూ, అపజయాలూ గల సంకీర్ణమైన, అంతర్వైరుధ్య పూరితమైన మార్గం, కఠినమైన పోరాటం గల మార్గం. యీ బహుముఖమైన క్రమాలను సరిగా అంచనా వేయడమూ, ప్రతి సందర్భంలోనూ ప్రవర్తనయొక్క సరైన పంథాను రూపొందించడమూ సృజనాత్మక మార్క్సిజం లెనినిజంయొక్క కర్తవ్యం.

పాఠకులకు మనవి

ఈ పుస్తకం గురించీ, దాని అనువాదం గురించీ మీ అభిప్రాయాలను "ప్రగతి" ప్రచురణాలయానికి దయచేసి తెలుపండి.

మీ అభిప్రాయాలను ఈ కింది చిరునామాకు పంపండి:

Progress Publishers
17, Zubovsky Boulevard
Moscow, USSR

మా ప్రచురణలు దొరికే చోట్లు:

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
చంద్రం బిల్డింగ్స్
విజయవాడ – 520004

విశాలాంధ్ర బుక్ హౌస్
ఏలూరు రోడ్డు
విజయవాడ – 520002

విశాలాంధ్ర బుక్ హౌస్
సుల్తాన్ బజారు
హైదరాబాదు – 500001

విశాలాంధ్ర బుక్ హౌస్
రైల్వే ఫీడర్స్ రోడ్డు
అనంతపురం – 515001

విశాలాంధ్ర బుక్ హౌస్
బజారు వీధి
తిరుపతి – 517501

విశాలాంధ్ర బుక్ హౌస్
సూపర్ బజారు ఎదుట
మెయిన్ రోడ్డు
విశాఖపట్నం – 530002

విశాలాంధ్ర బుక్ హౌస్
జె.పి.యన్. రోడ్డు
మండీ బజారు
వరంగల్ – 506002

విశాలాంధ్ర బుక్ హౌస్
మెయిన్ రోడ్డు, అరండల్ పేట
గుంటూరు – 522002

В. Келле, М. Ковальзон

**ОЧЕРК МАРКСИСТСКОЙ ТЕОРИИ ОБЩЕСТВА
ИСТОРИЧЕСКИЙ МАТЕРИАЛИЗМ**

на языке телугу